# 1. ఆరని అగ్ని - చావని ఆత్మ

ప్రియ పాఠకులారా!

"ఆరని అగ్ని – చావని ఆత్మ" అనేది ఒక చక్కని పాఠము. ఈ రెండూ నిత్యత్వానికి సంబంధించిన పదాలు. నిత్యత్వ సంగతులు. నిత్యత్వం అంటే ముగింపు లేనిది, ఫుల్‌స్టాప్ ఉండదు, నిరంతరాయంగా కొనసాగేది అని అర్థం. గణితశాస్త్రాన్ని మనము నేర్చుకునేటప్పుడు అందులో కొన్ని కొన్ని సందర్భాలలో ఒక గుర్తును మనము వాడుతుంటాము. దానిని ఇన్‌ఫినిటీ ( $\infty$ ) అంటారు. ఈ గుర్తుకు అర్థమేమిటంటే, అది ఒక అపార సంఖ్య. దానిని మనము లెక్కించలేము. మన అంచనాలకు అందని ఒక సంఖ్య, గణితశాస్త్రములో మనకు ఎదురుపడింది. మనము దీనిని నమ్మాము. గణితశాస్త్రము, గణిత శాస్త్రజ్ఞులు, లెక్చరర్స్, ప్రొఫెసర్స్ అందరూ దీనిని నమ్మారు గనుకనే ఇన్‌ఫినిటీని వ్రాసారు. పాఠశాలలో, కళాశాలలో, విశ్వవిద్యాలయములలో ఇన్‌ఫినిటీని మనకు నేర్పించారు. మనము పరీక్షలలో కూడా దానిని వ్రాసాము, ఉత్తీర్ణులమయ్యాము, ఉద్యోగాలు సంపాదించుకున్నాము. గణితశాస్త్రములో మనకు ఎదురుపడిన ఈ ఇన్‌ఫినిటీ ఎలాంటిదో, ఈరోజు మనము నేర్చుకోబోతున్న సంగతి, 'ఆరని అగ్ని – చావని ఆత్మ' కూడా దానికి సంబంధిచినవి. ముగింపు లేనివి, ఒక పరిమాణము లేనివి, మనిషి మేధస్సుకు అందనివి! జాగ్రత్తగా ఈ విషయాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేయండి. ఆరని అగ్ని – చావని ఆత్మ! అగ్ని ఆరనిదిగా, ఆత్మ చావనిదిగా ఇక్కడ మనకు పరిచయమవుతుంది. ఈ భూమిపై ఎన్నో శక్తి స్వరూపాలను మనము చూసాము, అందులో అగ్ని, ఒక శక్తి స్వరూపం, దానిని హీట్ ఎనర్జీ అన్నారు. ఇది ఒక శక్తి స్వరూపం. ఈ ప్రకృతిలో దీనికి ముగింపు ఉంది. ఒక రూపము నుండి మరొక రూపానికి మారుతూ ముగింపు కలిగినదిగా మనకు కనిపిస్తుంది.

<u>**ఉదాహరణకు:**</u> మీరు ఒక ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేస్తారు. ఆ వాహనములో ఇంటర్నల్ కంబషన్ ఇంజన్ (ఐ.సి. ఇంజన్) ఉంటుంది. ప్రతి వాహనానికి ఈ ఐ.సి. ఇంజన్ ఉండాలి, ఉంటేనే ఆ వాహనము నడుస్తుంది. అనగా, అంతర్గతంగా ఒక వేడిమి / మంట పుట్టడం వల్ల, ఆ పిస్టన్ తిరగడం వల్ల, క్రేంకేస్ తిరగడం వల్ల, షాఫ్ట్ తిరగడం వల్ల, వాహనము యొక్క రెండు చక్రాలు తిరుగుతున్నాయి. మీరు ఒక ప్రాంతము నుండి మరొక ప్రాంతానికి ప్రయాణం చేయగలుగుతున్నారు. ఇందుకోసమే మీరు వాహనమును ఇంధనముతో (పెట్రోల్ లేదా డీజిల్) నింపుతున్నారు. ఈ ఇంధనము ఒక సన్నని గొట్టం ద్వారా, ఆ ఐ.సి. ఇంజన్‌కు చేరి మండుతుంది. అది మండి, శక్తిగా మారుతుంది. ఆ శక్తిని మీ ప్రయాణానికి ఉపయోగపడేలా చేస్తుంది. ప్రతీ వాహనములో జరిగే తీరు ఇదే. అందుకే మీరు పెట్రోల్ బంక్‌కి వెళ్లి ఇంధనాన్ని తీసుకుంటారు. ఈ శక్తికి ఒక ముగింపు ఉంది. ఇది ఒక పరిమితి కలిగినది. వాహనములో ఇంధనము యొక్క సూచీ ఎమ్టీ సైడ్‌కి రాగానే, మీరు పెట్రోల్ బంక్ ఎక్కడో వెతుక్కుని వెళ్ళి, మీ వాహనమును ఫిల్ చేయించుకోవాలి. వాహనము లోపల ఉన్న ఇంధనశక్తి, పరిమితి కలిగినది. అది ఆరని అగ్ని కాదు, ఆరిపోయే అగ్ని! ఖాళీ అయిపోయే వాహనమది. ఇంజన్ స్విచ్ ఆఫ్ చేస్తే ఇంజన్‌లోనున్న అగ్ని ఆరిపోతుంది. వాహనమును ఆపుతుంది. ఈ మేధస్సును మనిషికి ఇచ్చింది దేవుడే. ఎందుకంటే, భూమి మీద వాహనాలను, ఇతర వస్తువులను ఆలోచిస్తూ మీరు పరలోకపు సంగతులను తెలుసుకోవాలి. భూమిపై ఉన్న అగ్ని ఆరిపోయే అగ్ని. మరొక ఉదాహరణగా, మీరు ఇంట్లో వంట చేసుకోవడానికి గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకుంటారు. అది కూడా పరిమితి కలిగినది మాత్రమే. ఇన్‌ఫినిటీ కాదు. దాదాపు ఒక నెలరోజులు పాటు మీ కుటుంబానికి కావలసిన వంట చేసుకోవడానికి మంటను ఇస్తుంది. ఆ తరువాత వెంటనే ఖాళీ అయిపోతుంది. మీరు గ్యాస్ కంపెనీకి వెళ్ళి రీఫిల్ చేయించుకోవాలి. దేవుడు ఆరిపోని అగ్ని కోసం ప్రస్తావించాడు. చావని ఆత్మ కోసం ప్రస్తావించాడు. ఈ రెండూ, మనిషి తన బ్రతుకు కాలంలో ముఖ్యంగా తెలుసుకోవలసిన సంగతులు. ఇవి మనకు సంబంధించిన సంగతులే. ప్రస్తుతమున్న కాలములో ఈ రెండూ మన కంటికి కనిపించకపోయినా, ఈ సమాజం ఈ రెండింటిని గూర్చి మాట్లాడకపోయినా, ఈ రెండూ చాలా ముఖ్యమైనవి, చాలా అవసరమైనవి. ఆరిపోయే వాటిని గూర్చి మనిషి మాట్లాడాడు. మరణించే వాటిని గూర్చి మనిషి మాట్లాడాడు. వాటిని గూర్చి శాస్త్రాలు వ్రాసాడు. వాటిని గూర్చి అధ్యయనాలు చేసాడు. కానీ ఆరని అగ్నిని గూర్చి ఎప్పుడైనా అధ్యయనాలు చేసాడా? లేదు! కనుక జనులారా,

సత్యమునెరిగిన దేవుని కుమారుడు మాత్రమే ఈ రెండింటిని గూర్చి అధ్యయనం చేయగలడు. సమాజానికి ప్రకటించగలడు, తెలియజేయగలడు. ఇంకెవ్వరూ వీటిని గూర్చి మాట్లాడలేరు. దీనిని గూర్చి మనకు పూర్తిగా అర్థమవ్వాలంటే, ఆరని అగ్ని అంటే ఏమిటో, చావని ఆత్మ ఎలా ఉంటుందో, ఏ పరిస్థితులల్లో ఉంటుందో పూర్తిగా మనకు తెలియాలంటే మన ప్రారంభికుని దగ్గరకు మనము వెళ్ళాలి. మన ప్రారంభికుడు, మనుష్యులందరికీ మొదటివాడు, ఒక్కడైన మానవుడు, అతడే ఆదాము! చాలామంది మనుష్యులు భ్రమిస్తున్నట్టుగా మాననవజాతికి ప్రారంభం కోతి కాదు. ఛార్లెస్ డార్విన్ చెప్పినట్టుగా చింపాంజి కాదు. ఇప్పటికే చాలాసార్లు ఈ ప్రపంచం తప్పటడుగులు వేసింది. అలా వేసిన తప్పటడుగులలో ఇదీ ఒకటి. మానవజాతి ఒక కోతినుండి ఉద్భవించినదనే తప్పుడు వార్తను ఈ సమాజం నమ్మింది. దానినే పుస్తకాలలో ప్రచురపరచింది. ఇది నిజం కాదు. 'కోతినుండి వచ్చానని చెప్పుకుంటావా? దేవునికి పుట్టానని ఒప్పుకుంటావా?' అనే పాఠములో దీనికి సంబంధించిన పూర్తి వివరణను నేను రచించాను. మనుష్యజాతికి ప్రారంభికుడు మనిషే! ముందు ఈ విషయాన్ని మీ మనస్సులో స్థిరపరుచుకోవాలి.

ఉదాహరణకు- ప్రస్తుతం మీరు నివశిస్తున్న ప్రాంతము ఒకప్పుడు ప్రాచీనకాలంలో, మనుష్యులు లేనిదిగా ఉండేది. ఒక అడవిగానో, నిర్జన ప్రదేశంగానో, పంట పొలంగానో ఉండేది. ఇప్పుడున్న వృద్ధులను అడిగితే ఆ విషయాన్ని మనకు ధృవీకరిస్తారు. అలాంటి ప్రదేశాలన్నీ ఇప్పుడు మనుష్యులతో నిండిపోతున్నాయి. ఎందుకంటే, మనిషి నుండి మనిషి, మనిషి నుండి మనిషి ఉద్భవిస్తున్నప్పుడు, ఆ మనిషి ఖాళీ ప్రదేశాలన్నీ నింపుతున్నాడు, నివాసస్థలంగా మార్చుకుంటున్నాడు. ఈ భూభాగాన్ని ఆక్రమించుకుంటూ, మనుష్యులు విస్తరిస్తున్నారు. అలాగని, ఒకప్పుడు ఈ నిర్జన ప్రదేశాలన్నీ కోతులతో నిండి ఉండేవి, ఇప్పుడు కోతి నుండి మనిషి వచ్చాడు కనుక, మనుష్యులతో నిండిపోతున్నాయి, అనగలరా! లేదు, అలా జరుగలేదు. ప్రారంభకాలములో మనిషి ఒక్కడే. ఆ ఒక్కని నుండి అనేక మంది మనుష్యులు తరతరాలలో పుట్టుకొస్తున్నారు. మొదటికాలములో మనుష్యుల సంఖ్య తక్కువగా ఉండేది, ఇప్పుడు ఎక్కువగా ఉంది. అదే తేడా! ప్రారంభకాలములో ఆదాము అనే మొదటి మనిషి దేవునిచే సృష్టింపబడ్డాడు. అతడు తల్లిదండ్రులకు పుట్టినవాడు కాదు. ఎందుకంటే అతడే భూమిపై మొట్టమొదటి మనిషి. ఈ ఆదాము తరువాత అతనికి సాటియైన సహాయముగా హవ్వ (స్త్రీ) ఇవ్వబడింది. వీరిద్దరి ద్వారా భూమి మీదకు ఒక్కొక్కరు వచ్చారు. దీనిని బట్టి, మొదటికాలములో ఆదాము, హవ్వ, సకల జీవరాశులు ఉన్నాయని అర్థం చేసుకోగలరు. ఇక్కడ ఒక విషయాన్ని మీరు దృష్టించాలి. అదేమిటంటే, ఆదాము పుట్టిన విధానము, మనము పుట్టిన విధానము వేరు! గొప్ప వ్యత్యాసము ఉంది. అదేమిటంటే, ఆదాము భూమి మీదకు వచ్చినప్పుడు, అతడు మనలాంటి మనిషికాదు. అతడు మనలాంటి జీవితాన్ని కలిగిలేడు. అతనిది ఒక వింతైన జీవితం. అది ఒక అద్భుతమైన జీవితం. ఎందుకంటే, ఆదాము పుట్టినప్పుడు మనవలె తల్లిగర్భములోనుంచి, రక్తపు మడుగులోనుంచి బయటకు రాలేదు. బాల్యము లేని వాడుగా ఆదాము పుట్టాడు. ఆదాముకు చిన్నతనం లేదు. దేనినీ తల్లిదండ్రుల దగ్గర నేర్చుకోవలసిన అవసరత లేదు, ఈ భూమిపై అతడొక మొదటి మనిషి! దేవుడు మట్టి బొమ్మగా ఆదామును తయారుచేసి, వాని నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా, నరుడు జీవాత్మ ఆయెను. **(ఆదికాండము 2 : 7)**

ఒక మట్టి బొమ్మకు దేవుడు కదలికలిచ్చాడు. ఈ రోజు మనము తయారు చేసుకున్న ప్లాస్టిక్ బొమ్మకు ఎలా కదలికలను ఇస్తున్నామో, ఒక రోబోను మన ఇష్ట ప్రకారము అడుగులు వేయించగలుగుతున్నామో, అలాగే ఆదాము కూడా దేవునిచే సృష్టించబడ్డాడు. మట్టి బొమ్మలో దేవుడు ఊదిన ఊపిరే, ఆయన పెట్టిన బ్యాటరీ. ఆదాము ఒక యుక్త వయస్సు కలిగినవాడుగా భూమిమీదకు వచ్చాడు. అలావచ్చిన ఆదాము, మొదట ఎలాంటివాడు అనుకుంటున్నారు? ప్రారంభములో ఆదాము అమరత్వం కలిగినవాడు! మరణం లేనివాడు!! దేవుడు ఒక మంచి తోటను ఏర్పరచి, ఆ తోటలో సకలవిధములగు ఫలవృక్షాలను, జీవవృక్ష ఫలాలను ఉంచి, అందులో ఆదామును పెట్టాడు. ఆదాము నిత్యత్వము కలిగిన మనిషిగా ఉన్నాడు. ఆ మొదటి మనిషి తాలూకు విషయాలను మనకు ఎవరు చెబుతారు? చరిత్రకారులా? తాళపత్ర గ్రంథాలా? శిలలా? వీరు మహా అయితే ఒక 1000 యేళ్ళ క్రిందటి సంగతులు చెప్పగలరు! కానీ సృష్టి ప్రారంభములో మొదటి మనిషికి సంబంధించిన పక్కా వివరాలు తెలియాలంటే,

పరిశుద్ధాత్మ ప్రేరణతో వ్రాయబడిన గ్రంథమైన బైబిల్ మాత్రమే చెప్పగలదు. అది కూడా పూర్తి న్యాయబద్ధంగా, హేతుబద్ధంగా దేవుడు వ్రాయించాడు. ఆదాము నిత్యత్వము కలిగినవాడు, ఆదాముకు భూమిమీద చావులేదు. జాగ్రత్తగా ఈ విషయాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. ఇక్కడ మీకొక మంచి రహస్యం చెబుతాను. ఇప్పటివరకు మీరెక్కడా వినని రహస్యమది. ఆదాము ఏ లోపమూ లేనివాడిగా సృష్టింపబడ్డాడు. చాలా తెలివి కలిగినవాడు. చాలా జ్ఞానవంతుడు. ఒక మంచి తోటలో తన భార్యతో కలిసి నిత్యత్వాన్ని దేవుని పెంపకంలో అనుభవిస్తున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో దీనిని పాడుచేయాలని, ఆదామును ఆ నిత్యత్వము నుంచి బయటకు రప్పించాలని, చెడు మార్గములో నడిపించాలని, దుష్టుడైన అపవాది ఒక పథకం వేశాడు. దేవుని ప్రణాళికను పాడుచేయడానికి, ఆ తోటలోనికి సాతానుగా ప్రవేశించాడు. వీడు మనిషి కాదు. వీడొక శక్తి. మార్గము తప్పిన, గర్వపడిన ఒకప్పటి దేవదూత. పరలోకములో నిత్యత్వాన్ని కోల్పోయిన నరహంతకుడైన దేవదూత. వీడు భూమి మీదకు సర్పము ఆకారంలో వచ్చి, ఆ నిత్యత్వాన్ని అనుభవిస్తున్న ఆదాము, హవ్వలిద్దరినీ తన మోసపు మాటలతో, దేవుని ఆజ్ఞను అతిక్రమించి పాపము చేసేలా చేసాడు. ఆదాము, హవ్వలు పాపము చేయకముందు, ఆజ్ఞను మీరకముందు, నిత్యత్వం కలిగినవారని మీరు జ్ఞాపకం ఉంచుకోవాలి. ఆ నిత్యత్వమే పాఠము ప్రారంభములో మనము మాట్లాడుకున్నాము. పాపము చేయకమునుపు ఆ ఇన్ఫినిటిని ఆదాము హవ్వలు కలిగి ఉన్నారు. పాపము చేయకముందు ఆదాము, హవ్వలకు దేవుడు ఆజ్ఞలు జారీ చేసాడు. అదే, మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షఫలాలను మాత్రం తినవద్దని చెప్పే ఆజ్ఞ. జీవవృక్షఫలాలన్నీ నిరభ్యంతరంగా తింటూ వీరిద్దరూ నిత్యత్వాన్ని కలిగి ఉండొచ్చు. కానీ, మంచిచెడ్డల తెలివినిచ్చు వృక్షఫలాన్ని తిను దినమున వారు చనిపోతారని దేవుడు ముందే చెప్పాడు. అంటే, ఇన్ఫినిటి కాస్తా, ఫుల్‌స్టాప్ గా మారిపోతుందన్నమాట. ఆదాము, హవ్వలు దేవుని మాటలు అతిక్రమించిననాడు, వారికున్న నిత్యత్వం నిర్వీర్యమవుతుంది. అందుచేతనే, దుష్టుడైన సాతాను, ఆ మంచిచెడ్డల తెలివినిచ్చు వృక్షఫలాన్ని తినేటట్లు చేసాడు. వాడు వీరిద్దరినీ లొంగదీసుకుని, అసత్యంవైపు, మూర్ఖత్వంవైపు ప్రేరేపించి, వీరిద్దరిచేత దేవునిమాటలను అతిక్రమింపచేసాడు. అప్పటితో వారు నిత్యత్వాన్ని కోల్పోయారు. అందుకే దేవుడు ముందుగానే, మీరు ఈ వృక్షఫలమును తిను దినమున చస్తారు అని చెప్పాడు. కానీ అపవాది, మీరు చావనే చావరు అనే అబద్ధాన్ని చెప్పింది. ఇక్కడ గమనించాల్సిందేమిటంటే, వీరు ఆ మంచిచెడ్డల తెలివినిచ్చు వృక్షఫలాన్ని తిన్నప్పుడు నిజంగానే ప్రత్యక్షంగా చావలేదు. వీరికి కూడా ఆశ్చర్యం వేసింది. దేవుడేమో చనిపోతామని చెప్పాడు, కానీ చావలేదు. అమాయకులకు దేవుడు చెప్పిన సత్యం అర్థమవ్వలేదు. దేవుడు 'చనిపోదురు' అనేమాట దేనిని గూర్చి చెప్పాడు? మీ నిత్యత్వాన్ని మీరు కోల్పోతారు, అదే చావు! చనిపోతారనగానే వెంటనే మరణిస్తారని కాదు. మీ జీవితము ఇప్పటి నుండి ఒక ముగింపు కలిగినదిగా మారిపోతుంది, మీ బ్రతుకు కాలానికి ఫుల్‌స్టాప్ పెడతానన్నాడు దేవుడు. కానీ అపవాది, క్షణిక కాలాన్ని ఆదాము హవ్వలకు చూపించి ఇప్పటికిప్పుడు మీరు చావరని చెప్పింది. వారు భ్రమలో పొరపాటుపడి, ఆ మంచిచెడ్డల తెలివినిచ్చు వృక్షఫలమును తిన్నారు. వెంటనే మేము చావలేదు కదా, అనుకున్నారు. కానీ వీరు చస్తారు. ఎప్పుడు? కొంతకాలమైన తరువాత చనిపోతారు. అనగా ముగింపు కలిగిన వారుగా మారిపోతారు. దీనిని బట్టి, ఆదాము నుండి వచ్చిన ప్రతి మనిషి ఇలాగే మారిపోయాడు. ఆదాము నుండి వచ్చిన ప్రతి వ్యక్తి, మరణాన్ని కొని తెచ్చుకున్నాడు. నిత్యత్వానికి దూరమయ్యాడు. దేవుడు వ్రాయించిన ఈ మాటను పరిశీలించండి.

**రోమీయులకు 5 : 12** "ఇట్లుండగా, ఒక మనుష్యుని ద్వారా పాపమును, పాపము ద్వారా మరణమును, లోకములో ఏలాగు ప్రవేశించెనో ఆలాగుననే మనుష్యులందరూ పాపము చేసినందున, మరణము అందరికీ సంప్రాప్తమాయెను". ఇట్లుండగా, అనగా ఆదాము ఏదెను తోటలో నిత్యత్వములో ఉండగా, ఆ మనుష్యుని ద్వారా పాపమును, పాపము ద్వారా మరణమును లోకము ప్రవేశించి, నిత్యత్వాన్ని నిలిపివేశాయి. మనకు ఈ మరణం ఎలా వచ్చింది? మనమెందుకు వృద్ధాప్యములోనికి వెళ్ళిపోతున్నాము? కొంతకాలానికే రోగాలు మనలను ఎందుకు పట్టి పీడిస్తున్నాయి? కొంతకాలము తరువాత ఈ దేహమును ఆత్మ ఎందుకు విడిచి పెడుతుంది? కొంతకాలము తరువాత మనము ఈ భూమిని విడిచిపెట్టి ఎందుకు వెళ్ళిపోతున్నాము? మనకొక పరిమితి కలిగిన ఆయుష్కాలము

ఎందుకు ఏర్పడింది! మనము కొంతకాలానికి ఇష్టం లేకపోయినా, మన రక్త సంబంధులను, మన ఇంటిని, మన దేశాన్ని, ఈ లోకాన్ని విడిచి వెళ్ళిపోతున్నాము. ఇదంతా ఎందుకు జరుగుతుంతో ప్రపంచంలో ఇప్పటివరకు ఎవ్వరూ చెప్పలేదు, చెప్పలేరు. మనిషి ఎందుకు చనిపోతున్నాడో ఎవరైనా చెప్పారా? రోగాలు కారణమని, యాక్సిడెంట్లు కారణమని, ప్రకృతి ధర్మమే కారణమని, ఆయుష్షు తీరిపోవడమే కారణమని... ఇలాంటి చిల్లర సమాధానాలు చెప్పకూడదు.

**"అసలు మరణం మనిషిని ఎందుకు కబళిస్తుంది?" అనేది నా ప్రశ్న!**

రోగంలేని వాడు- మరణించడం లేదా?
ధనవంతుడు- చావడం లేదా?
యాక్సిడెంట్లు కానివారు- మరణించడం లేదా?
హత్యకు గురికానివారు- చావడంలేదా?
చిన్ననాడే వృద్ధాప్యం రాకముందే-మరణించడం లేదా?

పుట్టిన ప్రతి మనిషి చస్తున్నాడు. ఎందుకంటే, **రోమీయులకు 5 : 12** ప్రకారము, ఒక మనుష్యుని ద్వారా లోకములో చావు ప్రవేశించింది. చావు లోకములో ఎలా ప్రవేశించిందంటే, మనిషి పాపము చేయుట వల్ల! దైవాజ్ఞ అతిక్రమణే పాపము, పాపము యొక్క ఫలితమే ఈ మరణము! ఒక్క మనుష్యుడైన ఆదాము పాపము చేశాడు, ఆయనను మరణము ఆవహించింది. హవ్వ పాపము చేసింది, ఆమెనూ మరణము ఆవహించింది. తద్వారా నిత్యత్వాన్ని కోల్పోయారు. అప్పటివరకు అమరత్వాన్ని కలిగిన వీరిద్దరూ దానిని కోల్పోయారు.

**రోమీయులకు 5 : 12** ప్రకారము ఆదాము, చేసినట్టే అతని గర్భము నుండి వచ్చిన మనుష్యులందరు పాపం చేసినందుననే, అందరికీ ఈ రోజు మరణము వస్తోంది. ఆదాము పాపము చేస్తే అతడు మాత్రమే చనిపోవాలి. ఆదాము ఒక్కడే అమరత్వాన్ని కోల్పోవాలి! మరి మనమంతా ఎందుకు అమరత్వాన్ని కోల్పోయాము? ఎందుకంటే మనము కూడా పాపము చేసాము, ఇంకా చేస్తున్నాము కనుక! ఆదాముకు, ఈ మనుష్యజాతి అంతా జెరాక్స్ కాపీ లాంటివారు. ఆదాము కంటె మనమేమైనా ఎక్కువా? మనము కూడా దేవుని ఆజ్ఞను చిన్ననాటి నుంచే మీరుతున్నాము! ఆ మరుక్షణం అమరత్వాన్ని కోల్పోతున్నాము. కంటిచూపులో పాపము, చేతల్లో పాపము, హృదయాలోచనలలో పాపము, నడతల్లో పాపము, వినికిడిలో పాపము, జీవితమంతా పాపమే! ఇప్పటి వరకు చదువరులందరికీ చక్కగా అర్థమైనదని భావిస్తున్నాను. ఇకపోతే, మరల ఆ మొదటి విషయాన్ని మనము జ్ఞాపకము చేసుకుంటే, ఆదాముకున్న నిత్యత్వము, అమరత్వమును బట్టి, ఆదాము ఒకవేళ పాపరహితుడుగా ఉంటే, దేవుడు ఆదాముకు మరణమనేది లేకుండా చేసి, ఎప్పటికీ ఈ భూమిమీదనే ఉంచేవాడా? ఆదామును తినవద్దన్న వృక్షఫలాన్ని తినకుండా ఉంటే, భూమిపై కలకాలం, నిత్యము జీవించి ఉండేవాడా? అలాంటప్పుడు, దేవుడున్న ఆ పరలోక సాధన ఎలా? దేవుడు అలాంటి నిత్యత్వాన్ని ఆదాముకు ఎందుకు ఇచ్చి ఉంటాడు? ఇక్కడ జాగ్రత్తగా ఆలోచిద్దాం! ఆదాము తప్పు చేశాడు కనుక, అతనికి మరణము వచ్చింది. మనమూ తప్పు చేస్తున్నాము కనుక, మనకూ మరణము వస్తుంది. ఒకవేళ, ఆదాము తప్పు చేయకపోయి ఉంటే, నిత్యత్వమును కలిగినవాడు. నిత్యత్వము కలిగినవానికి మరణము ఉండదు కనుక భూమి మీదే ఉండిపోతాడు. అలాంటప్పుడు ఈ దేహాన్ని విడిచి తండ్రి ఉన్న లోకానికి ఎలా వెళతాడనేది ఆలోచిస్తే, నిత్యత్వము కలిగిన మనిషి భూమిపై దేవుని సత్క్రియలు నెరవేర్చిన తరువాత, దేవుడు తిరిగి రమ్మని పిలిచి, తీసుకుని వెళుతున్నాడు! ఎలాగైతే దేహములోనికి ఆత్మగా వచ్చాడో, అలాగే దేహములో నుండి ఆత్మగా వెళ్ళిపోతాడు. నీకు రోగము రాదు, దేహానికి ఆయాసం రాదు, వార్ధక్యం(ముసలితనం) రాదు. ఏ విధముగానూ నీవు మరణించవు. కేవలం, దేవుని పిలుపునందుకుని నీవు వెళ్ళిపోవాలి! అది చావు కాదు. కేవలం దేవుని పిలుపు!

**కీర్తనలు 90 : 1** "ప్రభువా, తరతరములనుండి మాకు నివాసస్థలము నీవే". ఆదాము, హవ్వ, తరువాత మనమందరము ఈ భూమిమీద అడుగుపెట్టింది, ఇక్కడ నిత్యము ఉండిపోడానికి కానే కాదు. మరల మన తండ్రి యొద్దకు వెళ్ళడానికే! అందుకే తరతరములనుండి మనుష్యులందరికీ నివాసస్థలము దేవుడే అని మాట్లాడుతూ,

**కీర్తనలు 90 : 3** లో నిత్యత్వము కలిగిన ఆదాము ఒకవేళ పాపము చేయకపోయి ఉంటే, మరల పరలోకానికి ఎలా వెళతాడంటే, దేవుడు మనుష్యులను మంటికి మార్చుచున్నాడు. ఒక మట్టి బొమ్మకు కదలికను, ప్రాణమును, జీవితమును దేవుడు ఎలా ఇచ్చాడో, అలాగే మనిషిని మట్టికి మార్చి తిరిగి రమ్మని దేవుడే పిలుస్తున్నాడు. ఎప్పుడు పిలుస్తాడంటే, దేవుడిచ్చిన పని మనిషి పూర్తి చెయ్యగానే పిలుస్తాడు. అంటే అమరత్వమును కలిగిన ఆదాము, ఒకవేళ పాపము చేయకపోయి ఉంటే, భూమిపై దేవుడిచ్చిన పనిని పూర్తిచేసి వెనువెంటనే ఆ దేవుని పిలుపునందుకుని, ఈ దేహాన్ని ఇక్కడే విడిచిపెట్టి వెళ్ళిపోవాలి! అందుకే దేవుడు దానిని 'చావు' అని అనకుండా, అది 'నా పిలుపు', 'నిర్గమము', 'తిరిగి రావడము' అంటున్నాడు. ఒకప్పుడు మీ నివాసస్థలము దేవుడే కనుక, తిరిగి మీరు అక్కడికే రావాలి అంటున్నాడు. కానీ, ఆదాము క్షణికావేశంతో ఆజ్ఞాతిక్రమము చేసాడు. ఆ పాపాన్ని బట్టి మరణమును కొని తెచ్చుకున్నాడు. దేవుని పని పూర్తికాకుండానే, వెళ్ళాలనే మనసు లేకపోయినా, ఈ భూజీవితంపై మక్కువతో ఇక్కడే ఉండిపోవాలనుకున్నా, చావు పేరుతో బలవంతముగా వెళ్ళిపోతున్నాడు. ఒకవేళ మనిషి పాపము చేయకుండా నిత్యత్వములోనే ఉంటే, ఈ భూమి మీద నుంచి వెళ్ళకూడదని అనుకోడు! ఒకవేళ మనమందరము అమరత్వములోనే ఉండి, పుట్టిన దగ్గరనుండీ పాపము చేయకుండా ఉంటే, మరణాన్ని అస్సలు ద్వేషించము.

దేవుని పనిని ఎంత త్వరగా ముగించాలా అని ఎదురుచూస్తాము. ఎప్పుడు పరలోకానికి వెళ్ళాలా అని ఆలోచిస్తాము. ఉదాహరణకు, ప్రతి విషయములో మనిషి ఎదుగుదలను కోరుకుంటాడు. జూనియర్ స్థాయి నుంచి సీనియర్ స్థాయికి, కానిస్టేబుల్ నుంచి ఎస్.ఐ.కి, టీచర్ నుంచి హెడ్‌మాస్టర్‌కి, మంత్రి నుంచి ప్రధానిమంత్రికి... ఇలా ప్రతిదానిలో మనిషి ఎదుగుదలను కోరుకుంటాడు. ఒకవేళ అదే మనిషి నేరం చేస్తే ప్రొమోషన్ ఉండదు. అప్పుడు పాత కుర్చీలోనే ఉండిపోవాలి. ఒక్కోసారి డిమోషన్, సస్పెండ్ కూడా చేస్తారు. ఆదాము పరిస్థితి, మనుష్యులందరి పరిస్థితి కూడా అంతే! అందరిదీ పాపము చేసి అమరత్వాన్ని కోల్పోయిన పరిస్థితే! దేవుడేమో ఒక్కప్రక్క నరులను భూమిమీదకు పంపుతూ ఆయన పనిని పూర్తిచేసి తిరిగి రమ్మంటున్నాడు. ప్రొమోషన్ ఇవ్వాలనుకుంటున్నాడు. నిజంగా మనలో పాపము లేకపోతే, మనము పరలోకాన్నే కోరుకుంటాము, అక్కడికే వెళ్ళాలనుకుంటాము. పాపము చేసినదానిని బట్టి ఈ రోజు మనిషి చావుకు భయపడుతున్నాడు. నేను పరలోకానికి వెళ్ళకూడదు, ఈ భూమిపైనే ఇంకా ఉండిపోవాలని అనుకుంటున్నాడు. మనిషి దేహములో ఉన్న ఆత్మ, చావులేనిది. ఇది చావని ఆత్మ. నిత్యత్వానికి అర్హులైతే దేవుడే వారిని తీసుకువెళతాడు. నిత్యత్వమనే ఆ అర్హతను కోల్పోతే, నరకానికి పంపి తీరుతాడు. చావని ఆత్మ, దేవుని క్రియలను నెరవేర్చినదైతే ఆయన ఉన్న లోకానికి ఆహ్వానింపబడుతుంది! అదే చావని ఆత్మ, దేవుని క్రియలు పట్టించుకొనక, దేవుని ఆజ్ఞను మీరినదైతే నరకమునకు త్రోసివేయబడుతుంది. ఒక మంచి సందర్భాన్ని లేఖనాలలోనుండి పరిశీలన చేద్దాం.

**లూకా 23 : 44 – 47** "అప్పుడు ఇంచుమించు మధ్యాహ్నమాయెను. అది మొదలుకొని మూడు గంటల వరకు ఆ దేశమంతటి మీద చీకటి కమ్మెను. సూర్యుడు అదృశ్యుడాయెను. గర్భాలయపు తెర నడిమికి చినిగెను. అప్పుడు యేసు గొప్ప శబ్దముతో కేకవేసి – తండ్రీ, నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొనుచున్నాననెను. ఆయన ఈలాగు చెప్పి ప్రాణము విడిచెను. అప్పుడు శతాధిపతి జరిగినది చూచి ఈ మనుష్యుడు నిజముగా నీతిమంతుడై యుండెనని చెప్పి దేవుని మహిమ పరిచెను". ఇక్కడి సందర్భములో భూమి మీద జీవితకాలములో ఇసుమంతైనా దైవాజ్ఞ అతిక్రమణ లేని, పాపము చేయని ఒక వ్యక్తి మనకు కనిపిస్తున్నాడు. ఆయనే యేసుక్రీస్తు. ఆదాము తప్పు చేసాడు గనుక అతనికి మరణము వచ్చింది. మనుష్యులందరూ తప్పు చేసారు గనుక మరణము వచ్చింది. యేసుక్రీస్తు ఏ తప్పూ చేయలేదు. కనుక ఈయనకు మరణము లేదు. కానీ ఈయన శిలువపై ఎందుకు చనిపోయాడు? పై సందర్భములో (**లూకా 23 : 44–**) మీకు సమాధానము దొరుకుతుంది. అదే, యేసు గొప్ప శబ్దముతో కేకవేసి – తండ్రీ, నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొనుచున్నాననెను. ఆయన తన ఆత్మను తండ్రికి అప్పగించేటప్పుడు, ఈ ప్రకృతి గజ గజ వణికిపోయింది చూడండి. పగటివేళ చీకటి కమ్ముతున్నది. గర్భాలయపు తెర మధ్యకు చీలిపోయింది. ఆదాము మొదలుకొని ఎందరిదో మరణాన్ని చూసిన ఈ ప్రకృతి, ఇప్పటి వరకు

ఎప్పుడైనా గజ గజలాడిందా? అందరూ పాపము చేసారు, చివరకు చచ్చారు. వీరందరినీ ఈ ప్రకృతి చూసి చూసి, విసిగి వేసారి పోయింది. కానీ, యేసుక్రీస్తు నిర్గమమును చూచిన ఈ ప్రకృతి విస్తుపోయింది. మొట్టమొదటి సారిగా ఇలాంటి భక్తుని మరణము చూసే భాగ్యము ప్రకృతికి కలిగింది. ఒకప్పుడు ఆదాము, తరువాత మనుష్యులందరూ పొందవలసిన అసలైన మరణము ఇదేనన్నమాట! ఒకప్పుడు ఏదెను తోటలో అమరుడైన ఆదాము కూడా, యేసుక్రీస్తులా బ్రతకాలి! కానీ అలా బ్రతకలేదు. అందుకే ఈ ప్రపంచ మానవాళికి దేవుడు యేసుక్రీస్తు మరణాన్ని చూపించాడు. ఒక మనిషి దేవుడిచ్చిన పనిని పూర్తిచేసి, తన జీవితకాలము ముగిసిన తరువాత, తన ఆత్మను ఎలా అప్పగించుకోవాలో, యేసుక్రీస్తు ద్వారా దేవుడు నిరూపించాడు. అందుకే, యేసుక్రీస్తు రోగము వలన చనిపోలేదు. యేసుక్రీస్తు వృద్ధాప్యము వలన చనిపోలేదు. యేసుక్రీస్తు పాపము వలన వచ్చే జీతమైన మరణము వలన చనిపోలేదు. యేసుక్రీస్తు తన ఆత్మను తండ్రికి అప్పగించాడు. ఇలాంటి వ్యక్తిని ఎన్నడూ చూడని ఆనాటి శతాధిపతి, యేసు మరణాన్ని చూచి ఈయన నిజముగా దేవుని కుమారుడని ఒప్పుకున్నాడు. నిజముగా నీతిమంతుడని ఒప్పుకున్నాడు. దేవుని మహిమపరిచాడు. ఎంతోమంది మరణాన్ని తన కళ్ళారా చూచిన శతాధిపతి యేసుక్రీస్తు మరణాన్ని చూచి ఆశ్చర్యపోతున్నాడు. యేసుక్రీస్తు చంపబడలేదు. యేసుక్రీస్తు తనకు తానే స్వయముగా తన ప్రాణమును ఇస్తున్నాడు. ఇది మనిషి యొక్క నిర్గమము. ఇలా గొప్పగా భూమిమీద నుండి వెళ్ళవలసిన మనిషి, ఎలా బ్రతుకుతున్నాడో, తిరిగి ఎలా వెళుతున్నాడో చూడండి. వృద్ధాప్యములో మరణానికి భయపడుతూ, దేవునికి అసహ్యమైన నరకానికి తన ఆత్మను చేజార్చుకుంటున్నాడు. దైవగ్రంథములో అనేక దృష్టాంతములను దేవుడు వ్రాయించినా, జ్ఞానమెరుగని మనిషి అజ్ఞానములోనే బ్రతుకుతున్నాడు.

**యోహాను 19 : 30** “యేసు ఆ చిరక పుచ్చుకుని, సమాప్తమైనదని చెప్పి, తలవంచి ఆత్మను అప్పగించెను”. ఇలాంటి వారు భూమిమీద ఎవరున్నారు చెప్పండి? అందరూ పాపము చేసి దేవునికి, నిత్యత్వానికి దూరమవుతున్నారు. దేవునికి తమ ఆత్మను అప్పగించుకోలేకపోతున్నారు. దేవుని పనిని పూర్తిచేసిన తరువాత మరణాన్ని స్వాగతించలేకపోతున్నారు. మహాలోకానికి వెళ్ళలేకపోతున్నారు. కానీ యేసుక్రీస్తు విషయంలో చూడండి. ఆయన సమాప్తమైనది అని అంటున్నాడంటే, తనకివ్వబడిన దేవుని పని సమాప్తమైనదని అర్థం. అంతేగానీ సమాప్తమైనది తన బ్రతుకుకాదు. చిరకను అడిగింది కూడా అందుకే. తన ప్రాణమును విడిచి, ఆత్మను అప్పగింపబోయేముందు ఆయన చేయవలసిన చిట్టచివరి పని అదే! దానితో ఆయన చేయవలసిన దేవుని పని ముగింపబడింది. అలాగే భూమిమీదకు వచ్చిన ఆదాముకూ దేవుని పని ఉంది, హవ్వకూ దేవుని పని ఉంది. మీకూ, నాకూ మనుష్యులందరికీ తాము ముగించవలసిన దేవుని క్రియలు ఉన్నాయి. అవన్నీ బైబిల్‌లో వ్రాయబడ్డాయి. వ్యాపారము చేసే పని కాదు మనది. ఉద్యోగాలు చేసే పని కాదు మనది. ధన సంపాదన అనే పని కాదు మనది. మరి మన పని ఏమిటి? దేవుడిచ్చిన ప్రకృతిని అనుభవిస్తూ, దేవుడు వ్రాయించిన దానిని నెరవేర్చే పనియే మనుష్యులందరిది! యేసుక్రీస్తు పాపములేనివాడు గనుక మరణానికి యేసుపై అధికారము లేదు. ఆదాము పాపము చేసాడు గనుక మరణానికి ఆదాముపై అధికారము వచ్చింది. నిజానికి, మనము కావాలనుకుంటేనే రావాలి ఈ మరణం! అలాంటిది మనము వద్దనుకుంటే వస్తుందేమిటి ఈ మరణం? మనపై మరణానికి అధికారమును, మన చేసిన పాపము వలన మనమే ఇచ్చాము. యేసుక్రీస్తు మరణమును కావాలనుకున్నాడు. ఆయన దానిని స్వాగతించాడు. యెరూషలేముకు వెళ్ళాలని, శాస్త్రులచేత ప్రధానయాజకులచేత హింసింపబడి చంపడాలని ముందే చెబుతున్నాడు. దానినొక దైవ కార్యక్రమముగా జరిగిస్తున్నాడు. మరణాన్ని దైవచిత్తానుసారముగా స్వాగతించగలిగిన మనిషి ఎక్కడున్నాడు? యేసుక్రీస్తు తప్ప! అందుకే యేసుక్రీస్తు నిత్యత్వము కలిగినవాడయ్యాడు! మనము భయపడాల్సింది మరణానికి కాదు! దేనికి భయపడాలో ఎవరికి భయపడాలో తెలియని దౌర్భాగ్యపు సమాజమిది. **లూకా 12 : 5** “ఎవనికి మీరు భయపడవలెనో నేను మీకు తెలియజేయుదును”. అధికారులు, మంత్రులందరూ – నక్సలైట్లకు భయపడతారు. ఎందుకంటే వారికి ప్రాణభయం! అందుకే వారి చుట్టూ గన్‌మేన్‌లు. వారి కారుకు ముందూ వెనకా కార్ల కాన్వాయ్. ఎందుకంత భయం? ఎక్కడో, ఎప్పుడో తప్పుచేసి ఉంటారు! మనుష్యులకే వీరు భయపడుతున్నారు! తుపాకీ గుండుకు

భయపడుతున్నారు. బాంబుకు భయపడుతున్నారు. భయపడుతున్నారంటే ఖచ్చితముగా నేరము చేసుండాలి. వీరంతా అక్రమకారులై ఉండాలి! ఆనాటి ఆదాము మొదలుకొని ఎందరో మనుష్యులు ప్రాణభయముతోనే తమ దినములు గడిపారు. కయీను తన తమ్ముడైన హేబెలును చంపిన తరువాత ప్రాణభయముతో పరుగులుతీస్తున్నాడు. తనకు ప్రాణభిక్ష పెట్టమని దేవుని వేడుకుంటున్నాడు. ఏమనిషైనా నేరము చేస్తేనే భయపడతాడు. ఇది బైబిల్ చెప్పిన సూత్రం! లోకజ్ఞానమెప్పుడూ – మీ చుట్టూ రక్షణ వలయాన్ని ఏర్పాటు చేసుకోమన్నదే తప్ప, నేరము చేయొద్దని ఏ పుస్తకమూ చెప్పలేదు. ఇదే బైబిల్ యొక్క గొప్పతనం! ఎవనికి మీరు భయపడాలి? ఈ భూమిపై మిమ్మును చంపేవానికి కాదు. చంపిన తరువాత నరకములో పడద్రోయగలగే శక్తిగలవానికి మీరు భయపడాలి! లోకమందున్నవారు మహా అయితే మనిషిని చంపగలరు. అంటే దేహము నుండి ఆత్మను వేరుచేయగలరు. కానీ ఆత్మను నరకములోనికి పంపలేరు. ఆ శక్తి కలిగిన వాడు దేవుడే! ఆయనకే మనము భయపడాలి! ఇది యేసుక్రీస్తు వారి మాట! అవివేక, మూర్ఖజనము చిన్నచిన్న వారికి భయపడుతున్నారా? వీరికి జ్ఞానము తెలియదు. ఇంతకీ ఆత్మను నరకములో పడద్రోయగలిగే శక్తిఉన్న దేవునికి ఎందుకు భయపడాలి? ఎందుకంటే అక్కడ ఆత్మచావదు, అగ్ని (శిక్ష) ఆరదు! నిత్యత్వము కలిగిన ఆత్మ, నరకములో చావకుండా నిరంతరము బాధను అనుభవిస్తుంది. మనము ధరించుకున్న శరీరము పాపము చేస్తే బలవన్మరణం చెందుతుంది. పాపరహితులమైతే ఇష్టపూర్వకంగా మరణిస్తుంది. కానీ ఆత్మ చావదు. నిత్యత్వములో దేవదేవుని సన్నిధిలో సేదతీరవలసిన ఆత్మ, నరకములో శిక్షకు గురికాకూడదు. అందుకే తండ్రియైన దేవునికి చాలా భయపడాలి! ఆయనకు భయపడితే, నరకమునుండి తప్పించుకోగలరు. ఒకవేళ ఆ నరకమునకు వెళ్ళిపోతే, మీ ఆత్మ యుగయుగములు చావదు, ఆ అగ్ని తరతరాలు ఆరదు. అదొక నిత్యశిక్ష. అదొక ఇన్ఫినిటీ. అందుకే యేసుక్రీస్తు తన భూజీవితకాలంలో తండ్రియైన దేవునికి భయభక్తులు కలిగినవాడుగా బ్రతికాడు. తండ్రి ఇచ్చిన పనిని నెరవేర్చాడు. పరలోకానికి ఆహ్వానింపబడి నిత్యత్వములో ఉన్నాడు. ఆదామైతే మనుష్యులందరికీ పాపమును, తద్వారా మరణాన్ని ఎలా పొందాలో చూపించాడు. క్రీస్తైతే ఎలా జీవించాలో నేర్పించాడు.

**1 కొరింథీయులకు 15 : 45** "ఆదామను మొదటి మనుష్యుడు జీవించు ప్రాణి ఆయెనని వ్రాయబడియున్నది. కడపటి ఆదాము జీవింపజేయు ఆత్మ ఆయెను". మొదటి మనుష్యుడైన ఆదామును గూర్చి దేవుడేమన్నాడో చూడండి. అతడు జీవించు ప్రాణి! నేనింకా బ్రతకాలి, ఈ భూమే శాశ్వతం, నాకు మరణమొద్దు, నేను జీవించే ప్రాణిగానే ఉండాలి అనుకున్నాడు. ఎందుకంటే ఆదాము ఒక పాపాత్ముడు. ఆ ఆదామును మార్గదర్శిగా తీసుకున్న నేటి మనుష్యజాతి కూడా అంతే గదా! జీవించాలనే తపన, సంపాదించాలనే ఆశ, జీవించు ప్రాణిగా బ్రతుకుతూ... దేవునికి భయపడక, నిత్యశిక్షకు వెళ్ళిపోతున్నారు. బలవంతముగా దేవుడు వీరిని తీసుకెళ్ళాలి తప్ప, వీరికి మరణము వద్దు. ఇక్కడే ఉండాలనుకుంటారు. మరి కడపటి ఆదాము? ఆయనే యేసుక్రీస్తు. ఆయన జీవించు ప్రాణిగా బ్రతకలేదు. పాపరహితునిగా, దేవుని పనిని తుదముట్టించిన వీరునిగా, జీవింపజేయుఆత్మగా బ్రతికాడు. ఈ భూమి మన స్థిర నివాశము కాదు. మనము ఇక్కడ లోకల్ కాదు. నాన్ లోకల్. మనము ఉండేది 70 లేక 80 యేళ్ళు మాత్రమే! వందలకొద్దీ, వేలకొద్దీ సంవత్సరాల జీవితకాలము ఎవరికైనా ఉందా? జీవించు ప్రాణులారా, ఈ పరమార్థమును తెలుసుకోండి! తన బ్రతుకును మాదిరిగా చూపించిన యేసుక్రీస్తు, తనను పోలి నడచుకుంటే, తనను ధరించుకుంటే, అందరినీ జీవింపజేస్తున్నాడు! నేను ఈ మాటలన్నీ ఆయనను బట్టి వ్రాస్తున్నవే! ఆయన నన్ను జీవింపచేసిన దానినిబట్టి, మిమ్మును కూడా ఈ జీవము కలిగిన మాటల ద్వారా జీవింపచేసే ప్రయత్నము చేస్తున్నాను. ఆయన (యేసుక్రీస్తు) జీవింపజేయు ఆత్మ! ఆ మొదటి ఆదాము మనకు నేర ప్రవృత్తి కలిగిన జీవితాన్ని, లోకాన్ని ఇచ్చాడు! కానీ ఈ కడపటి ఆదామైన యేసు క్రీస్తు అయితే, దేవుని కొరకు బ్రతికి, దేవునికి భయపడి, పరలోక సాధన, నిత్యశిక్ష నుండి తప్పించుకొనుట ఎలాగో మనకు నేర్పించాడు. దేవుని మాటను పెడచెవిని పెట్టి, నిత్యనరకాన్ని కొనితెచ్చుకుంటూ, దానికే పరుగులు పెడుతున్నాడీ మనిషి! మారుమనస్సును, పాపక్షమాపణను పొంది మరణానికి భయపడే జీవితమునుండి నీ ఆత్మను దేవునికి అప్పగించుకొనే గొప్ప స్థితిలో జ్ఞానమును నేర్పిస్తున్నవాడే యేసుక్రీస్తు.

ఆయన మత ప్రబోధకుడు కాదు, మహాజ్ఞానానికి మూలము. ఆ యేసు మాటలు అర్థమైన ఆనాటి శిష్యుడొకాయన ఎలా మారిపోయాడో చూడండి.

**అపొ. కార్య. 7 : 59** స్తెఫను ప్రభువుని గూర్చి మొఱ్ఱపెట్టుచు, యేసుప్రభువా, నా ఆత్మను చేర్చుకొనుమని పలుకుచుండగా వారు అతనిని రాళ్ళతో కొట్టిరి. ఆనాటి యూదులు, జీవింపజేయు ఆత్మయైన యేసుక్రీస్తును ప్రకటిస్తున్నందుకు స్తెఫను అనే భక్తుణ్ణి రాళ్ళతో కొట్టి చంపుతున్నారు. అలాంటి చావు–బ్రతుకుల మధ్య ఉన్న స్తెఫను అంతబాధలో కూడా ఏమని పలుకుతున్నాడో చూడండి. యేసుప్రభువా, నా ఆత్మను చేర్చుకో! అంటున్నాడు. నన్ను చంపొద్దు అని మరణానికో, యూదుల రాళ్ళ దెబ్బలకో, ప్రభుత్వానికో లేక ప్రజలకో ఆయన భయపడటం లేదు. స్తెఫను దేవునికే భయపడుతున్నాడు. తన ఆత్మ ఆరని అగ్నిని అనుభవించకూడదని జాగ్రత్త తీసుకుంటున్నాడు. ఆ విధముగా యేసుక్రీస్తును ధరించుకున్నవాడై, జీవించే ఆత్మగా మారిపోయాడు. మహదానందముతో తన ఆత్మను దేవునికి అప్పగించాడు. యేసుక్రీస్తువలె తన ఆత్మను జాగ్రత్తగా దేవునికి ఇచ్చేశాడు. దేవుని పనిని పూర్తిచేసి వెళ్ళిపోయాడు. ఆ తరువాత యేసును ధరించుకున్న శిష్యులు, అపొస్తలులు, క్రైస్తవులందరూ ఇలాగే మారిపోయారు. అపొస్తలుడైన పౌలు కూడా తన మాటలలో, "బ్రతుకుట క్రీస్తే–చావైతే లాభము" అన్నాడు. దేవుని పనిని ముగించిన తరువాత చావును స్వాగతిస్తున్నాడు. క్రీస్తును ధరించుకున్న జీవించే ఆత్మలను గూర్చి ఏమి వ్రాయబడిందో చూడండి.

**ప్రకటన 12 : 11** "వారు గొఱ్ఱెపిల్ల రక్తమును బట్టియు, తామిచ్చిన సాక్ష్యమును బట్టియు వానిని జయించియున్నారు గాని, మరణము వరకు తమ ప్రాణమును ప్రేమించినవారు కారు". ఎవరు వీరందరూ? యేసుక్రీస్తును ప్రకటించేవారు, జీవింపజేయు ఆత్మను కలిగినవారు. భూమిపై దేవుని జ్ఞానము తెలిసినవారు, వాక్యమును ప్రకటించుటలో హతసాక్షులైనవారు. ఆదాము జయించలేకపోయిన ఆ అపవాదిని – వీరు జయించారు. నిజక్రైస్తవులు ఇలాగే ఉండాలి! వీరే, మరణము వరకు తమ ప్రాణములను ప్రేమించలేదు. ఈ లోకాన్ని ప్రేమించలేదు. వారికి పైనున్న పరలోక నిత్యత్వము కావాలి! దేవుడు తన పిల్లలంతా ఇలాంటి వారిగానే ఉండాలనుకున్నాడు. అందుకే దీనినంతటికీ దేవుడు ముగింపు పలుకబోవుచున్నాడు. ఆరని అగ్నికి చావని ఆత్మలు, నిత్యరాజ్యానికి దేవుని ఆత్మలు, ఈ వేర్పాటును త్వరలోనే జరిగించి ఈ లోకానికి దేవుడు ముగింపు పలికే కాలము అతి సమీపములోనున్నది. ఉపమానరీతిగా బాప్తీస్మమిచ్చు యోహాను ఏమంటున్నాడో చూడండి.

**లూకా 3 : 17** "ఆయన చేట ఆయన చేతిలో ఉన్నది. ఆయన తన కళ్ళమును బాగుగా శుభ్రము చేసి, తన కొట్టులో గోధుమలు పోసి, ఆరని అగ్నితో పొట్టును కాల్చివేయునని అందరితో చెప్పెను". ఆయన చేటలోని గోధుమలనుండి పొట్టును వేరుచేయాలి అనుకుంటున్నాడు. చేట అవసరం ఎప్పుడొస్తుంది? కల్తీ జరిగినప్పుడే కదా! మిశ్రమ పదార్థాన్ని వేరు చేయాల్సివచ్చినప్పుడే కదా! దేవుడు ఈ భూమి మీద నివశించిన మనుష్యులందరినీ వేరు చేయాలనుకుంటున్నాడు. పై రూపమునకు మాత్రం అచ్చం గోధుమల్లా కనిపించే పొట్టుతో దేవునికి పనిలేదు. అసలైన గోధమలుతోనే పని ఉంది. ఆ అసలైన గోధమల్లాంటి దైవకుమారులే తండ్రికి కావాలి!

గోధుమలు – తమ ప్రాణమును ప్రేమించనివారు
పొట్టు – తమ ప్రాణమును ప్రేమించినవారు

ఈ పొట్టును ఎలా నశింపచేస్తున్నాడో చూడండి. పొట్టును ఆరని అగ్నితో కాల్చడానికి సిద్ధపడుతున్నాడు. అది ఆరిపోయే అగ్ని కాదని ఇక్కడ అర్థమవుతోంది. ఎందుకంటే, ఆత్మ చావదు కనుక దానికి ఆరని అగ్నిని కూడా తయారుచేసాడు. సాధారణముగా ఈ భూమిపై అగ్ని కొలిమిని మనము చూస్తే, అది పొట్టును దహించి, కొంతసేపటికి బూడిదై ఆరిపోతుంది. కానీ నరకమున ఉన్న అగ్ని ఆరదు. ఆ పొట్టు చావదు. శిక్షను అనంతకాలము అనుభవిస్తూనే ఉంటుంది! ఒకే గోధుమ మొక్కకు పుట్టిన గోధుమగింజ, గోధుమ పొట్టు వేరు చేయబడి, ఒకటి కొట్టులోనికి మరొకటి అగ్నిలోనికి చేరుతుంది. ఓ మనిషీ ఆలోచించు! నీవు పరలోకానికి వెళ్ళడానికి నీతిమంతునివలె దేవుని లోకాన్ని పొందడానికే పుట్టావు. గింజవై పరలోకానికి వెళతావా? పొట్టువై అగ్నిలోనికి పోతావా? రెండూ నిత్యలోకానికి సంబంధించినవే! దేవుడు వేసిన పంటలో ఆయనకు చాలా నష్టం వచ్చింది! మొక్కనుండి సారము తీసుకొనక, మంచి

గింజగా ఎదగక, ఒక డొల్లు గింజవై నిస్సారముగా బ్రతికిన నీ వలన ఆ దేవునికి నష్టమే కదా! ఈ రోజు పొట్టులాంటి మనుష్యులు ఈ భూమిమీద కోకొల్లలుగా ఉన్నారు. సారవంతమైన గింజలు శేషముగానే మిగిలిపోయారు. పరలోకపు తండ్రియైన దేవునికి ఎంతబాధ చెప్పండి? మీకొరకే ఈ ధర్మ సంగతులను వ్రాసాను. సత్యాన్ని అందించాను. నేను మీకు మతాన్ని చెప్పలేదు! మిమ్మును నిత్యలోకానికి చేర్చే మాటలను మాత్రమే చెప్పాను! ఎంత చెప్పినా, ఈ లోకము మారదని, ఆరని అగ్నినే కోరుకుంటుందని, మనిషి స్వనాశనాన్నే కోరుకుంటాడని దేవుడే వ్రాయించాడు. ఒకవేళ మీరు కూడా అట్టివారే అయితే, నశించుడి! అంటున్నాడు.

**అపొ. కార్య. 13 : 40, 41** "ప్రవక్తల గ్రంథమందు చెప్పబడినది మీ మీదికి రాకుండ చూచుకొనుడి. అదేమనగా, ఇదిగో తిరస్కరించువారలారా, ఆశ్చర్యపడుడి, నశించుడి. మీ దినములలో నేనొక కార్యము చేసెదను. ఆ కార్యమును ఒకడు మీకు వివరించినను మీరెంత మాత్రమును నమ్మరు అనెను". మీరందరూ చావని ఆత్మలు. కానీ వాక్యమును తిరస్కరిస్తున్నారు. వాక్యాన్ని తిరస్కరించినంత సుళువుగా లోకములో దేనినైనా తిరస్కరించారా? నష్టపోయినా అన్నింటిని – లోకమందు స్వీకరించే నీవు, దేవుని వాక్యమును ఎందుకయ్యా వద్దంటున్నావు? ఆశ్చర్యంతో ఇప్పటివరకు ఎక్కడా చదవని, వినని సంగతులు ఇప్పుడు మీరు చూసారు, చదివారు. ఇక మంచి నిర్ణయం తీసుకొనకపోతే నశించిపోతారు. నశించక తప్పదు అన్నాడు దేవుడు! ఈ మహాజ్ఞానమును మీకెంత చెప్పినా, ఒకడు మీకు ఎంత వివరించినా, మీరు ఎంత మాత్రము నమ్మనివారిగా ఉంటే, ఇక మీరు నశించండి. ఆరని అగ్నికొరకు ఎదురు చూడండి! వాక్యాన్ని అంగీకరిస్తే నాతో చేయి కలిపి, దేవుని పనిని ముగించండి! నిత్యలోకానికి క్రీస్తును పోలినవారై నాతోపాటు రండి!!


ప్రభువునందు నమ్మకస్థుడు,

**జె. మణి కుమార్**

సన్ ఆఫ్ గాడ్ – క్రైస్ట్ చర్చ్ – సామర్లకోట – 8978414178.


### ప్రశ్నలు

1. నిత్యత్వమంటే ఏమిటి? వివరించండి.
2. చావని ఆత్మకు ఆరని అగ్నిలో ఎందుకు శిక్ష విధింపబడుతుంది?
3. ఈ భూమిపై మనిషి ఎవరికి భయపడాలి? ఎందుకు భయపడాలి?
4. శరీరధారిగా వచ్చిన యేసుక్రీస్తు పాపము చేయకపోయినా ఎందుకు మరణించాడు?
5. ఈ లోకములోనికి మరణము ఎలా ప్రవేశించింది? అది అందరికీ ఎలా సంక్రమిస్తోంది?
6. జీవించు ఆత్మ ఎవరు? జీవింపజేయు ఆత్మ ఎవరు? వీరిలో ఎవరు నిత్యత్వాన్ని ఇస్తారు?
7. ఆదాము హవ్వలు తమ నిత్యత్వాన్ని ఎలా కోల్పోయారో, మనుష్యులందరూ మరణాన్ని ఎందుకు ద్వేషిస్తున్నారో వివరించండి.

## 2. శాశ్వతమైన పౌరసత్వం

ప్రియమైన దేవుని జనులారా !

మన జీవితకాలములో మనకు వినిపించే మాటలన్నింటిలో మంచి మరియు నిజము కంటే చెడు మరియు అబద్ధములే మనలను ఎక్కువగా ఆకర్షిస్తుంటాయి. ఈ రోజు మనము దేనిని చూచినా, ఏది విన్నా అందులో అసత్యమే ఎక్కువ శాతము ఉంటుంది. ఎందుకంటే మనిషి ఒక వ్యాపారము చేయాలన్నా, అందులో లాభము సంపాదించుకోవాలన్నా అబద్ధాలను వాడక తప్పదు. ఎందుకంటే మనము అలాంటి రోజుల్లోనే ఉన్నాము. మన మేలు కోరి మనకు నిజాలు చెప్పేవారు ఈ సమాజములో కనిపించడం లేదు. మీరు భలే వారండి, మన చుట్టూ ఉన్న ఈ సమాజములో ఎవ్వరూ నిజాలు చెప్పడం లేదంటారేమిటి? ఎక్కువ శాతము అబద్ధాలు ఉన్నాయంటారేమిటి అనుకోవచ్చు. మీరు వింటున్న వాటిలో ఎక్కువ శాతము నిజాలు ఉన్నాయనుకుంటే పొరపాటే. ఒకవేళ మీరు అదే నిజమనుకుని భ్రమిస్తే నేను మీకు కొన్ని ఋజువులు చూపిస్తాను. పాఠములోనికి వెళ్ళేముందు కొన్ని వాస్తావాలను చూపిస్తాను. దానిని బట్టి మీరు అర్థం చేసుకోగలుగుతారు. మీరు ప్రతిరోజు వింటున్నవి ఎంత వరకు నిజాలో, ఎంత వరకు అబద్ధాలో ఇట్టే తెలుసుకోగలుగుతారు. చిన్నప్పుడు పిల్లలు పాఠశాలకు వెళ్ళినప్పుడు ఉపాధ్యాయులు వారికి పాఠాలు నేర్పిస్తారు. ముక్కుపచ్చలారని పిల్లలకు అక్షరమాలతో పాఠాలను ప్రారంభించి, ఒక్కొక్క దశలో వారికి జ్ఞానాన్ని నేర్పిస్తూ లోకసంబంధమైన జ్ఞానములో వారిని ముందుకు తీసుకువెళతారు. ఈ పరిస్థితుల్లో వారు నేర్పించే పాఠాలను గూర్చి ఒక్కసారి ఆలోచిస్తే, పాఠశాల నుండి వారు విశ్వవిద్యాలయాల స్థాయికి వెళ్ళినంత వరకూ వారి జీవితములో వారికి ఉపయోగపడే అసలుసిసలైన సంగతులను, నిజాలను ఎవ్వరూ ఎక్కడా చెప్పరు. ప్రతి ఒక్కరూ ఏమి తినాలో, ఏమి కట్టుకోవాలో, ఎక్కడ ఉండాలో నేర్పిస్తున్నారు తప్ప, అసలు మనిషి అంటే ఎవరో, చావు తరువాత మనిషికి సంభవించే సంగతులేమిటో, ఎక్కడా ఏ పాఠ్యపుస్తకంలోనూ మనకు కనిపించదు.

అందుకే **అ** అంటే **అమ్మ, ఆ** అంటే **ఆవు, ఇ** అంటే **ఇల్లు, ఈ** అంటే **ఈగ** అని ఇలా చెప్పుకుంటూ వెళ్ళిపోతున్నారు. శరీర సంబంధమైన చిన్న చిన్న వాటిని నేర్పిస్తూ, వాటితో ప్రారంభించి వాటినే కొనసాగిస్తూ ఈ రోజున్న మనిషి దానినే జ్ఞానము అనుకుంటున్నాడు. ప్రతి ఒక్కరూ ఇదే మా జీవిత పరమార్థము అనుకుంటున్నారు. విశ్వవిద్యాలయస్థాయి వరకు ఎన్ని పట్టాలు తీసుకున్నా, ఏ రంగములో మీరు చూసినా, ఎక్కడా ఆత్మ సంబంధమైన జ్ఞానమును మనిషికి ఏ ఒక్కరూ నేర్పించడం లేదు. వారు వింటున్న వాటిలో, వారు చదువుకున్న వాటిలో చాలా మట్టుకు అవాస్తవాలే. వాటినే నేర్చుకుంటూ, వాటిలో పట్టభద్రులవుతూ ఈ రోజు మనిషి చాలా ఉప్పొంగిపోతున్నాడు. కాసేపు ఈ చదువును ప్రక్కనపెట్టి మన మధ్యనున్న మీడియా (ప్రసార మాధ్యమము) దగ్గరకు వెళితే, ప్రపంచములో ఏ మూల ఎక్కడ ఏమి జరుగుతున్నా బుల్లి తెర ద్వారా, సెల్‌ఫోన్ ద్వారా, ఇంటర్నెట్ ద్వారా మనకు చూపిస్తూ, వినిపిస్తూ, మీడియా ఈ రోజు అనేక అబద్ధాలకు లేక అసత్యాలకు పుట్టినిల్లుగా మారిపోయింది. మీరు చూస్తున్న ఛానల్స్, మీరు చదువుతున్న దినపత్రికలలో అవాస్తవాలు, అబద్ధాలు లేవనుకుంటున్నారా? మీరు చూసే ప్రతి ప్రకటనలో వారు చూపించేవన్నీ మోసపూరితమైన వార్తలే. అందులో ఎంత మాత్రము నిజము ఉండదు. ముఖ్యముగా వాణిజ్య ప్రకటనలను మీరు చూస్తే, అందులో నూటికి నూరు శాతం మనలను మోసగించేదే ఉంటుందనడంలో ఏ మాత్రం సందేహం లేదు. ఒకసారి మీరు ఆ బుల్లితెర వైపుచూస్తూ వారు చూపించే ప్రకటనలలో ఎలాంటి సంగతులుంటున్నాయో ఆలోచించగలిగితే, ఉదాహరణకు ఒక షాంపును గూర్చి ఒకరు ప్రకటన ఇస్తున్నారు. ఏమనో తెలుసా? మా గార్నియర్ షాంపు కొనుక్కుని దానితో మీ తలను అంటుకోండి. మీ శిరోజాలు ఎంత బలమైనవిగా మారిపోతాయంటే, ఒక గోతిలో పడిపోయిన లారీని మీ జుట్టుకు కట్టి లాగితే, లారీ బయటకు వచ్చేస్తుందని చెబుతున్నారు. ఎంత అవాస్తవాన్ని చూపిస్తున్నారు మనకు? ఈ రోజు మనిషి ఎన్నెన్నో అబద్ధాలను ప్రపంచ ప్రజల మధ్యకు తీసుకువెళుతున్నాడు. ఒక చిన్న పిప్పర్‌మెంటు బిళ్ళకు కూడా ఎంత అబద్ధం చెబుతాడో తెలుసా? మింటోస్ పిప్పర్‌మెంట్ బిళ్ళను మీరు తింటే మీ పళ్ళు ఎలా వెలుగుతాయో తెలుసా? ఒక హేలోజన్ దీపము వలె వెలుగుతాయట! ఇది అబద్ధం కాదంటారా? ఇవన్నీ అవాస్తాలు కాదంటారా? ఇవన్నీ నిష్ప్రయోజనమైన

మాటలేనండి. మరి వీటినేనా మనము నమ్ముతున్నాము? వీటినేనా మనము ఆశ్రయిస్తున్నాము? పరలోకమందున్న దేవుడు చెప్పిన సంగతులను వింటేనే మనకు జ్ఞానము కలుగుతుంది. ఆయన మాటలను నిజంగా ప్రతి మనిషి నమ్మి తీరాలి. ఆయన వ్రాయించిన ఒక సంగతిని చూడండి. మీరు ఆశ్చర్యపోతారు. వేల సంవత్సరాల క్రితమే దేవుడు భవిష్యత్తును చూచి, ఇలాంటి వారు పుడతారని, అబద్ధాలను ప్రకటించేవారు ఉంటారని, ఆ అబద్ధాలనే ప్రతి మనిషి నమ్ముతాడని దేవుడు ముందుగా వ్రాయించిన మాటలను ఒక్కసారి చూడండి. **యిర్మియా 7 : 8** "యిదిగో అబద్ధపు మాటలను మీరు నమ్ముకొనుచున్నారు". ఈ రోజు ప్రపంచమంతా మేము చాలా ఎత్తుకు ఎదిగిపోతున్నాము, మేము విజ్ఞానపరంగా చాలా గొప్పవారమైపోయాము, మేము డిగ్రీలు తీసుకున్నాము, మేము పట్టాలు పొందాము, లోకజ్ఞానములో మమ్మలను తలదన్నేవారెవరూ లేరని మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్న ఈ లోకానికి దేవుడు వ్రాయించిన ఈ అమూల్యమైన మాటను చూడండి. జనులు అబద్ధపు మాటలను నమ్ముకొనుచున్నారు, అవి వారికి నిష్ప్రయోజనములన్నాడు. ఆ నిష్ప్రయోజనమైన మాటలను నమ్మితే, నమ్మి ఒకవేళ వాటిని జరిగిస్తే, ఆ మాటల వల్ల వచ్చే ఫలితము వలన మీరు నష్టపోతారంటున్నాడు దేవుడు. ఈ మాటను దేవుడు ఎప్పుడు వ్రాయించాడు అనుకుంటున్నారు? సుమారు ఇప్పటికి 3000 సంవత్సరాల క్రితమే! దేవుడు భవిష్యత్తును ముందుగా వ్రాయించాడు. ప్రజలు ఇలాంటివారుగా మారిపోతారని, అబద్ధపు మాటలను ప్రకటించేవారుగా, వాటినే నమ్మేవారుగా ఉంటారని దేవుడు వ్రాయించాడు. అవన్నీ నిష్ప్రయోజనములని ఇప్పటికైనా మీరు తెలుసుకోవాలని నా మనవి.

ప్రియులారా, మీరు చదివే ఈ పాఠ్యాంశములోని మాటలు నిష్ప్రయోజనమైనవి కావు. మీరు ఈ మాటలు చదువుతున్నప్పుడు మీకు ఖచ్చితముగా ప్రయోజనం ఉంటుంది. మీరు ఈ నా మాటలు చదివే ముందుగా ఒక నిర్ధారణకు రావాలి. అదేమిటంటే, మీరు చదువుచున్న ఈ పుస్తకములోని మాటలు, భూమి మీద పుట్టినది మెదలుకొని ఇప్పటివరకు మీరు విన్న మాటలవంటివి కావు. ఇవి మన బ్రతుకులను మార్చే మాటలు. ఇవి దేవుడు మనకు అనుగ్రహించిన మాటలు కాబట్టి జాగ్రత్తగా మీరు ఆలోచిస్తూ, పరిశోధనాత్మకంగా చదవాలి. శాశ్వతమైన పౌరసత్వమంటే ఏమిటో తెలుసుకునేముందు, అసలు పౌరసత్వమంటే ఏమిటో మనకు తెలియాలి. భారతదేశములో నివశిస్తున్న మనమందరము ఒక పౌరసత్వాన్ని కలిగియున్నాము. అదే భారతదేశపు పౌరసత్వము. దీనివలననే మనము భారతీయులమని పిలువబడుతున్నాము. మనము ఈ దేశములో పుట్టాము గనుక, ఈ భారతదేశ రాజ్యాంగము మనకు ఒక హక్కును మనకు కల్పించింది. అదేమిటంటే, మనమందరము భారతదేశపు పౌరులము. మనము ఇప్పటికే ఆధార్ కార్డు తీసుకుని ఉండాలి. 18 యేళ్ళు నిండిన వారికి ఓటర్ కార్డు వచ్చి ఉండాలి. కుటుంబములుగా ఏర్పడినవారికి రేషన్ కార్డు వచ్చి ఉండాలి. వ్యాపారస్థులకయితే పాన్ కార్డు ఉండాలి. దేశాంతర ప్రయాణాలు చేయాలంటే పాస్‌పోర్టు ఉండాలి. ఇవన్నీ మనకు ఏమి తెలియజేస్తున్నాయంటే, రిపబ్లిక్ ఆఫ్ ఇండియాలో అనగా భారతదేశపు భూభాగములో నివసిస్తున్నవారందరికి అనగా, ఆయా రాష్ట్రాలలో మరియు కేంద్రపాలిత ప్రాంతాలలో నివశించడానికి ఎటువంటి అభ్యంతరము లేదు. మనలను ఎవ్వరూ ఇక్కడనుండి వెళ్ళమనడానికి వీలులేదు. ఎందుకంటే ఈ ప్రాంతము మనది. మనము ఈ ప్రాంతపు పౌరసత్వాన్ని కలిగియున్నాము. ఉదాహరణకు, ఒకవేళ మనము పరాయి దేశానికి వెళ్ళాలంటే, అనగా ఒక శ్రీలంక దేశానికో, పాకిస్తాన్ దేశానికో, బంగ్లాదేశ్ దేశానికో, చైనా దేశానికో వెళ్ళి అక్కడ కొంత కాలము నివశించాలనుకుంటే, అక్కడకు వెళ్ళీ వెళ్ళగానే ఆయా దేశాలకు చెందిన పోలీసువారు మనలను చూచిన వెంటనే మీ గుర్తింపు కార్డు ఏది? అని అడుగుతారు. మీరు భారతదేశపు ఆధారాలను వారికి చూపిస్తే, మీరు భారతదేశానికి చెందినవారు కదా! మీరు మా దేశములోనికి ఎందుకు వచ్చారు? అని వెంటనే మనలను ప్రశ్నిస్తారు, అవసరమైతే జైలులో పెడతారు. అంటే ఎవరి దేశములో వారే ఉండాలి, ఎవరి పౌరసత్వాన్ని వారే అనుభవించాలి. ఆ పౌరసత్వము ఏ దేశానికి చెందినది అయితే ఆ ప్రాంతములోనే ఆ మనిషి నివశించడానికి అర్హుడని దీనిని బట్టి మనకు అర్థమవుతుంది. ఇక ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలను మనము చూస్తే ప్రపంచ పటం మీద ఏడు ఖండాలలో సుమారుగా 200 దేశాలు విస్తరించి ఉన్నాయి. ఈ 200 దేశాలకూ ఒక గుర్తింపు ఉంది. ఆ దేశాలలో భారతదేశము కూడా ఒకటి. ఈ దేశాలన్నింటిలో ప్రజలు నివసిస్తున్నారు, వారందరికి ఆయా దేశాలు

ఇచ్చిన గుర్తింపు ఉంది. శాశ్వతమైన పౌరసత్వమనే ఈ పాఠము అర్థం కావాలంటే ఇవన్నీ మీకు తెలియాలి. అందుకే కూలంకుషంగా, క్లుప్తంగా వీటిని వ్రాయడం జరిగింది. ప్రపంచ దేశాలలో నివసిస్తున్న ప్రజలు కేవలం ఈ జీవితకాలము మట్టుకే ఈ దేశాల పౌరసత్వాన్ని కలిగియుంటారు. మనకున్న ఈ భారతదేశపు పౌరసత్వం మనకు ఎంతవరకు అంటే, మనము ఇక్కడ నివశించినంత కాలము వరకు మాత్రమే. అంటే ఒకవేళ మనము ఇక్కడ నుండి వెళ్ళిపోతే మన పౌరసత్వము రద్దుచేయబడుతుంది. ఒకవేళ మనము ఈ దేశరాజ్యాంగ విరుద్ధముగా ఏదైనా తప్పు చేస్తే, భారతదేశ శిక్షాస్మృతి భరించలేని నేరమేదైనా చేస్తే, అనగా దేశానికి కీడు తలపెట్టే విధంగా ఏదైనా అపరాధము చేస్తే వారి భారతదేశపు పౌరసత్వాన్ని రద్దు చేసేస్తారు. మీరు ఇండియాలో ఉండటానికి వీలులేదు, మిమ్మల్ని వెంటనే అరెస్టు చేస్తాం, లేకపోతే ఎక్కడికైనా పారిపోవాలి అని చెప్పే సందర్భాలు కూడా మనము అప్పుడప్పుడు వింటుంటాము. అంత పరిస్థితి వరకు మనము వెళ్ళము, ఎందుకంటే మనకు అంత భయంకరమైన నేరం చేసేటివంటి ప్రవృత్తి లేదు. ఈ భారతదేశపు పౌరసత్వము మనకు పోవాలి అంటే మనము ఇక్కడ నుండి వెళ్ళిపోవాలి. అంటే భారతదేశపు పౌరసత్వాన్ని మనము ఎంత వరకు అనుభవించగలమంటే, మనము పుట్టిన దగ్గర నుండి చనిపోయేంత వరకు మాత్రమే అనుభవించగలము. ఇందులో ఏ మాత్రం సందేహము లేదు. మన దేశపు పౌరసత్వాన్ని మనము చక్కగా బ్రతికినంత కాలము దీనిని మన నుండి ఎవ్వరూ వేరుచేయలేరు. అంటే బర్త్ సర్టిఫికేట్ మొదలుకుని డెత్ సర్టిఫికేట్ వరకు మధ్యన ఉన్న కాలములో మాత్రమే మనము భారతదేశపు పౌరసత్వాన్ని కలిగియుంటాము. అలా కాకుండా, నేను వెళ్ళిపోయిన తరువాత కూడా నాకు ఈ పౌరసత్వము ఇలాగే ఉంటుంది అనుకుంటే అది మీ పొరపాటు అవుతుంది. ఎందుకంటే మనకంటే ముందు ఈ పౌరసత్వాన్ని కలిగి ఉండి, ఆ తరువాత ఈ భూమిని విడిచి చాలా మంది వెళ్ళిపోయారు. ఉదాహరణకు, మన జాతిపిత గాంధీ మహాత్ముడు ఉన్నాడు. ఆయన భారతజాతికే ఒక గౌరవమును తెచ్చాడు. జాతి అంతా గౌరవించదగిన ఒక అర్హత కలిగిన గొప్ప వ్యక్తి. ఎందుకంటే స్వాతంత్ర్యములో పోరాడినటువంటి ఆయన పటిమకు, అహింసా మార్గములో ఆయన సాధించినటువంటి ఆ స్వాతంత్ర్యానికి, ఇప్పటికీ భారతీయులముగా మనమందరము ఆయనను గౌరవిస్తున్నాము. కానీ ఇప్పుడు ఆయనకు ఇండియా పౌరసత్వము లేదు. భారతీయ పౌరుల జాబితాలో ఆయన పేరు ఇప్పుడు లేదు. ఎందుకంటే ఆయన మరణించాడు. ఆ తరువాత ఇందిరా గాంధీని మనము చూడగలిగితే, మొదటి మహిళా ప్రధాన మంత్రిగా ఆమె బ్రతికియున్న కాలములో ఆమె కూడా భారతీయ పౌరసత్వాన్ని కలిగియున్నది. కానీ ఇప్పుడు ఆమెకు ఈ పౌరసత్వము లేదు. ఎందుకంటే ఆమె కూడా మరణించింది. ఇలా మనము ఆలోచించుకుంటూ వెళితే, మన ఇంటిలో చనిపోయిన తాతముత్తాతలు కూడా ఉన్నారు. వీరికి కూడా భారతదేశము ఏమి చేసిందంటే, వారు చనిపోయిన తరువాత వారి పౌరసత్వాన్ని రద్దు చేసేసింది. అంటే ఏ దేశములోనైనా, ఈ ఆరిన నేల మీద బ్రతుకుచున్నవారెవరైనా, పుట్టిన దగ్గర నుండి చనిపోయేంత వరకు మాత్రమే ఒక దేశపు పౌరసత్వాన్ని కలిగియుంటారు. ఆ తరువాత వారి పౌరసత్వము రద్దయిపోతుంది. మరణించిన ఆ వ్యక్తితోనే అతని పౌరసత్వము సమాధి చేయబడుతుంది. ఇక ఈ భూమి మీద పౌరసత్వమును కలిగి ఉండడానికి ప్రభుత్వపరంగా వారికి హక్కు లేనే లేదని అర్థమవుతుంది.

ప్రియులారా! ఈ మాటలన్నీ జాగ్రత్తగా మీరు చదువగలిగితే శాశ్వతమైన పౌరసత్వమును గూర్చి మనకు అర్థమవుతుంది. భూమి మీద 60, 70 యేళ్ళ పౌరసత్వమును గూర్చి మనము ఆలోచించినప్పుడు ఇది కేవలం తాత్కాలికమైనదిగా మనకు కనిపిస్తుంది. మనకు ఇవ్వబడిన ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ కార్డు లాంటివన్నీ ఈ జీవితకాలము మట్టుకేనని మనకు తెలియాలి. ఇది అక్షరాలా తాత్కాలికమైన పౌరసత్వం. చరిత్రలో చనిపోయిన ఎంతోమందిని మీరు చూడండి. అందులో గొప్ప గొప్ప వారున్నారు. చాలా మంది మనకు తెలిసినవారే ఉన్నారు. వీరందరు ఆయా కాలాలలో తాత్కాలికమైన దేశపు పౌరసత్వాన్ని కలిగియున్నారు. వారి వారి కాలములలో జీవించి వెళ్ళిపోయిన తరువాత వారి పౌరసత్వము రద్దు చేయబడింది. దీనిని చూస్తే మనకు ఏమి అర్థమవుతుంది? భారతదేశ పౌరసత్వము కేవలం తాత్కాలికమైనది. ఏ దేశాన్ని అడిగినా సరే అదే చెబుతుంది. ఈ భూమిమీద ఎవరైనా కేవలం తాత్కాలికమైన పౌరసత్వమును మాత్రమే ఇవ్వగలరు. అది కూడా కేవలం మీరు బ్రతికినంత కాలమే ఇవ్వగలరు.

అంతకుమించి ఇవ్వలేరు. నిత్యమూ నాకు ఈ దేశపు పౌరసత్వము కావాలంటే ఏ దేశమూ ఇవ్వదు. అలా ఇవ్వాలంటే భూమి మీద మీ ఉనికి ఉండాలి కదా. మీరు చనిపోగానే మీ ఉనికి కనిపించదు. మీరు వెళ్ళిపోతారు. ఈ కంటికి కనిపించే ప్రతి పౌరసత్వమూ తాత్కాలికమైనదే. ఇప్పుడు దేవుడు వ్రాయించిన ఆయన గ్రంధములో ఒక మంచి మాటను మనము చూడగలిగితే, **యోబు 14 : 5** "నరుల ఆయుష్కాలము పరిమితి గలది". దేశపు పౌరసత్వాన్ని దేవుడు ఎక్కడ ముడిపెట్టాడో చూడండి. భారతదేశ పౌరసత్వము ఒక పరిమితి కలిగినది. దీనికి పరిమితిని ఎవరు విధించారు? ప్రభుత్వం కాదు. మీరు బ్రతికినంత కాలం ఈ ప్రభుత్వం మీకు పౌరసత్వము ఇవ్వాలి, ఇచ్చి తీరుతుంది. కాని భారతదేశ పౌరసత్వానికైనా, మరే ఇతర దేశ పౌరసత్వానికైనా పరిమితిని ఎవరు నియమించారంటే... దేవుడే! అని యోబు గ్రంధములో ఉంది. మనుష్యులకు మేము ఇస్తేనే గాని పౌరసత్వము దొరకదని ఈ ప్రభుత్వాలు అనుకుంటున్నాయి. కాని ఈ ప్రభుత్వాలన్నిటిపైనా ఒక అధికారి ఉన్నాడు. ఆయనే మనుష్యులందరికి ప్రాణమును ఇచ్చేవాడు, అలాగే వారి ప్రాణములను తీసేవాడు. తల్లిగర్భము నుండి మనుష్యులను భూమి మీదకి పంపించేవాడు, ఆ మనిషికి భూమి మీద ఆయుష్కాలము తీరిన తరువాత తిరిగి రమ్మనేవాడు. ఆయన అందరికి పైన అధికారిగా, సైన్యములకధిపతిగా ఉన్నాడు. ఆయనే తండ్రియైన దేవుడు. ఈ భూమి మీద నరుల కొరకు ఆ దేవుడు వ్రాయించిన మాటలను చూడండి. "నరుల ఆయుష్కాలము భూమి మీద పరిమితి గలది, వారి నెలల సంఖ్య దేవునికి తెలిసేయున్నది". ఎవరికి ఎంత కాలము ఇచ్చాడనే విషయాన్ని ముందుగా ఎరిగిన తండ్రి ఏమంటున్నాడో తెలుసా? జననానికి ఒక రోజు, మరణానికి ఒక రోజు. ఈ రెండింటి మధ్యన ఉన్న కాలమే మీ జీవితకాలము. అంతకంటే ఎక్కువగా, భూమి మీద ఒక్కక్షణము కూడా మీరుండటానికి వీలులేదు. అంటే ఆ క్షణముతో భూమి మీద మీ పౌరసత్వము రద్దయిపోతుంది. మీరు ఏ దేశములో ఉన్నా సరే, ఆ పౌరసత్వము కేవలం మీరు బ్రతికియున్నంత కాలము వరకు మాత్రమే అంటున్నాడు దేవుడు. ఆయన విధించిన ఆ పరిమితి ప్రకారము అంత వరకే మీరు ఆ పౌరసత్వాన్ని కలిగియుండగలరు. ఆ తరువాత అది రద్దయిపోతుంది. ఆ తరువాత మీరు ఎక్కడ ఉండాలి? మీ శరీరాన్ని విడిచిపెట్టి, ఆత్మలుగా మారనున్న మీరందరూ మరణించిన తరువాత ఎక్కడుండాలి? ఏ పౌరసత్వాన్ని కలిగియుండాలి? పౌరసత్వము ఉంటేనే తప్ప మనము ఎక్కడా జీవించడానికి అవకాశము లేదే. భారతదేశ పౌరసత్వము మీకు ఉన్నది గనుక మీరు భారతదేశములో జీవిస్తున్నారు. ఎవరైనా వచ్చి అడిగితే నాకు గుర్తింపు కార్డు ఉంది గనుక నేను అర్హుడనంటారు. అది ఈ భూమి మీద మాత్రమే సుమా! అలాంటప్పుడు భూమి మీద మీ జీవితమును ముగించి, శరీరమును విడిచిపెట్టిన తరువాత, ఆత్మగా మారిపోయిన తరువాత మీ పౌరసత్వము ఎక్కడిది? ఏ ప్రభుత్వము మీకు క్రొత్త పౌరసత్వాన్నిస్తుంది చెప్పండి? మీ శాశ్వతమైన పౌరసత్వమును గూర్చి మీరు ఎప్పుడైనా ఆలోచించారా? ఎప్పుడు మరణిస్తామో తెలియని మీరు, ఆ శాశ్వతమైన పౌరసత్వమును గూర్చి ఎప్పుడైనా పరిశోధించారా?

భూమి మీద ఉన్నప్పుడు ఆ కార్డు తీసుకోవాలి, ఈ కార్డు తీసుకోవాలి అనుకుంటున్న మనిషి, కార్డును జారీ చేస్తున్నవారు ఎప్పుడు ఎక్కడ ఇస్తున్నారో అడిగి తెలుసుకుంటున్న మనిషి, లైనులో నిలుచుని, ఫొటో తీయించుకుని ఒక పౌరసత్వపు కార్డును సంపాదించుకుంటున్న మనిషి, దానిని జాగ్రత్తగా భద్రపరచుకుంటున్న మనిషి, మరణము తరువాత మరొక లోకము, మరో జీవితము మీద ఏమైనా అవగాహన కలియున్నాడా? మీ ఆత్మకు చావు లేదు, అది నిత్యమూ ఉండేది. ఈ శరీరానికి చావు ఉంది, ఈ శరీరము మట్టిలో కలిసిపోతుంది, ఈ శరీరము పాతి పెట్టబడుతుంది. మీ అందరికి తెలుసు, ఎన్నో శవాలు ఊరేగింపుగా వెళ్ళడాన్ని మీరు చూస్తున్నారు. మీ ఇంటిలోనే ఎన్నో శవాలు తేలిపోవడాన్ని మీరు చూస్తున్నారు. ఎప్పుడో ఒకప్పుడు మనము కూడా వెళ్ళిపోవాల్సిందే! మనము ధరించుకున్న శరీరమే దానికి నిదర్శనం. రోజు రోజుకు ముడతలుపడుతున్న మన శరీరములో ఒక్కొక్క అవయవం పాడైపోతున్న పరిస్థితుల్లో మన శరీరమే మనకు పాఠమును చెబుతోంది. అదేమిటో తెలుసా? ఆత్మలైన మీరు వెళ్ళిపోవాలి. ఇది తాత్కాలికమైనది, ఇది పరిమితి కలిగినది. మరి అలాంటప్పుడు, శాశ్వతమైన పౌరసత్వమును గూర్చి ఈ రోజు మనుష్యులు ఆలోచిస్తున్నారా? లేదండి. మనుష్యులకు ఏది చెప్పాలో దానిని ఎవ్వరూ చెప్పడం లేదండి. ఈ రోజు మీడియా పళ్ళకు రాసుకునే పేస్టును గూర్చి, అలాగే కట్టుకునే బట్టలను గూర్చి, ఇలా... శరీరసంబంధమైన వాటన్నింటిని

గూర్చి చెబుతోంది. అందులోను మరలా దుర్వ్యాపారమే. నాలుగు డబ్బులు సంపాదించుకోవడానికి బంగారమును ఎలా ధరించుకోవాలో చెబుతారు, ఫలానా జ్యూవెలర్స్ షాపుకు వెళ్ళమంటారు కాని ఏ ఒక్క ఛానల్ అయినా ఆత్మను గూర్చి మంచిని చెబుతుందా? ఏ ఒక్క పత్రికవారైనా అత్మ సంబంధమైన మంచి సంగతులను వ్రాస్తున్నారా? మీ శాశ్వతమైన పౌరసత్వమేమిటి, ఆత్మగా మీరు వెళ్ళిపోయిన తరువాత ఏమి జరుగుతుంది అనేవి చెబుతున్నారా? అలాగని ఎవరూ వెళ్ళడం లేదా? కోటి మందిలో సంవత్సరానికి ఒక్కడే చనిపోతున్నాడండి అనడానికి వీలులేదు. ఎందుకంటే రోజు రోజుకి, క్షణ క్షణానికి ఎంతో మంది ఈ భూమిని విడిచి వెళ్ళిపోతున్నారు. ఒక్కసారి ఆలోచించండి ప్రియులారా! మనము కూడా ఏదో ఒక క్షణాన వెళ్ళిపోవాల్సినవారమే. కాని వెళ్ళక ముందు దీనిని గూర్చి మనము ఒక నిర్ధారణకు రావాలి. మన శాశ్వతమైన పౌరసత్వమేది? నిత్యము ఉండే మన పౌరసత్వమేది? మనలను ఆహ్వానించే లోకమేది? మనకు శాశ్వతమైన పౌరసత్వమిచ్చే ఆ గొప్ప ప్రభుత్వమేది? దీనిని గూర్చి మీరు ఒక మంచి నిర్ణయానికి రాగలిగితే, అప్పుడు మీకంటే గొప్పవారు ఈ భూమి మీద బ్రతుకుచున్న వారిలో ఎవ్వరూ ఉండరు. ఎందుకంటే ఇక్కడ మన చుట్టూ ఈ తరములో నివసిస్తున్న వారందరికి, కేవలం తాత్కాలికమైన పౌరసత్వమును గూర్చి మాత్రమే తెలుసు. కానీ, శాశ్వతమైన పౌరసత్వమును గూర్చి ఎవ్వరికీ తెలియదు. ఇదిగో ఈ పుస్తకమును చదువుచున్న మీకు ఆ గొప్ప సంగతులే అర్థమవుతాయి. యేసు పలికిన మాటలను ఒకసారి మనము చూడగలిగితే ఆయన ఏ విధముగా దేవుని జ్ఞానాన్ని చెబుతున్నాడో తెలుస్తుంది. మీ మరణము తరువాత, లేక యేసుక్రీస్తు రెండవ ఆగమనములో జరిగే ఒక మంచి సందర్భాన్ని వ్రాయిస్తున్నాడు. భవిష్యత్తుకు సంబంధించిన మాటగా, శాశ్వతమైన పౌరసత్వమును గూర్చి మీరు తీసుకునే నిర్ణయానికి యేసుక్రీస్తు పలుకుచున్న ఈ మాటలు మీకు మంచి ఆధారమునిస్తాయి. మరణించగానే మీరు ఎటు వెళ్ళాలో, ఏ లోకములో మీరు పౌరసత్వాన్ని సంపాదించుకోవాలో, ఏ లోకము మిమ్మును ఎలా ఆహ్వానిస్తుందో యేసుక్రీస్తువారు ఇక్కడ చెబుతున్నారు.

**మత్తయి 25 : 34** "అప్పుడు రాజు తన కుడివైపున ఉన్నవారిని చూచి నా తండ్రి చేత ఆశీర్వదింపబడిన వారలారా రండి, లోకము పుట్టినది మొదలుకొని మీకొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి" అని అంటున్నాడు. ఎందుకంటే ఆ రాజ్యములో ఉండడానికి వారే అర్హులు. వారికి ఆ పౌరసత్వము ఇవ్వబడింది. దానిని వారికి దేవుడే ఇస్తున్నాడు. ఆయన ఎవరో కాదు, ఆయనే రాజు. ఆయన ఎవరో కాదు ఆయనే మన పరలోకపు తండ్రి. ఆయనను గూర్చి యేసుక్రీస్తు ముందుగా మనకు చెబుతున్నాడు. ఏమి చెయ్యాలో బైబిల్‌లో వ్రాయించాడు. అలా జరిగించినవారికి, అనగా దేవుని క్రియలను భూమి మీద జరిగించుచున్నవారికి, దేవునిచేత ఆమోదింపబడినవారికి, నీతిమంతులని దేవుని చేత పిలువబడిన వారికి, దేవుడిస్తున్న భరోసా ఏమిటో తెలుసా? నా లోకములోనికి రాబోయే వారందరూ మీరే అంటున్నారు. ఇక ఎడమవైపు ఉన్నవారి పరిస్థితి ఏమిటంటే, **మత్తయి 25 : 41** "అప్పుడు ఆయన ఎడమవైపున ఉన్నవారిని చూచి శపింపబడిన వారలారా, నన్ను విడిచి అపవాదికిని, వాని దూతలకును సిద్ధపరచబడిన నిత్యాగ్నిలోనికి పోవుడి" ఇది కూడా నిత్యమూ ఉండేదే! ఇది కూడా శాశ్వతమైనదే కానీ, ఇది మీ కొరకు సిద్ధపరచబడినది మాత్రం కాదు. ఇది మీ కొరకు తయారుచేయబడినది కాదు. మీ ఆత్మలు ఉండవలిసిన లోకము ఇది కాదు. కాని పొరపాటున మీరు అందులోనికి వెళ్ళిపోతున్నారు. ఎందుకంటే మీరు శపింపబడినవారుగా నాశనానికి పోయారు. భూమిమీద దేవుని గూర్చి ఎప్పుడైనా మీరు ఇలా ఆలోచించారా? భూమిమీద ఈ శాశ్వతమైన పౌరసత్వమును గూర్చి ఎప్పుడైనా ఎవరి నోట అయినా ఇలా విన్నారా? భూమి మీద దేవుని కొరకు ఎప్పుడైనా పట్టించుకున్నారా? ఆ తరువాతి మాటలలో దేవుడు అదే చెబుతున్నాడు. కుడివైపున ఉన్నవారు, ఎందుకయ్యా మాకు ఈ లోకాన్ని ఇస్తున్నావని దేవుణ్ణి అడుగుతున్నారు. అప్పుడు దేవుడు వారి సందేహానికి వివరణను చెప్పాడు. నేను ఆకలిగొన్నప్పుడు నాకు ఆహారము పెట్టారు, నేను దప్పిగొన్నప్పుడు నాకు దాహానికి నీళ్ళిచ్చారు. అనగా, భూమి మీద దేవునికొరకు మీరు ఆలోచించారు. దేవుని ఆకలిని మీరు తీర్చారు. అందువలన దేవుడు మీకు ఒక లోకాన్ని సిద్ధపరిచాడు. ఒక దేశాన్ని మీ కొరకు ఆయన సిద్ధపరిచాడు. అందులో ఆయన మీకు శాస్వతమైన పౌరసత్వమును అనుగ్రహిస్తున్నాడు. కాగా, ఎడమవైపున చాలామంది ఉన్నారు. వారు కూడా భూమిమీద మనుష్యులుగా బ్రతికిన

వారే. వారు కూడా దేవుని నుండి భూమి మీదకు వచ్చిన వారే. కాని వారందరిని ఏమన్నాడో తెలుసా? మీరంతా శపింపబడ్డారు. దేవుడంటే మీకు తెలియదు. మరో లోకమంటే మీకు తెలియదు. మరణించిన తరువాత ఏమి జరుగుతుందో మీకు తెలియదు. లోకములో ఉండి, ఈ 60, 70 యేళ్ళ బ్రతుకులో ఏమి తినాలో, ఎలా సంతోషించాలో, ఎలా గంతులు వేయాలో అని ఆలోచించారు తప్ప ఎప్పుడైనా ఆత్మను ఎలా బ్రతికించుకోవాలో ఆలోచించారా? లేదు గనుక, శపింపబడిన వారలారా మీ కొరకు నేను ఒక నిత్యాగ్ని నరకాన్ని సిద్ధపరిచాను అన్నాడు. అసలది అపవాది కొరకు మరియు దాని దూతల కొరకు ఏర్పరచబడినది మరియు సిద్ధపరచబడినది. ఆ పాతాళలోకము వారు మాత్రమే ఉండవలిసిన లోకము. అందులోనికి ఇప్పుడు ఎవరిని పంపిస్తున్నాడు? శపింపబడినవారందరిని పంపిస్తున్నాడు. జాగ్రత్తగా మీరు చదవాలి. మరణించిన తరువాత ఈ రెండు లోకాలే మనకు కనిపిస్తున్నాయి. అందరి ఆత్మలు వెళ్ళవలసిన లోకాలవి. ఒకటి పరలోకపు తండ్రి ఉన్న లోకము, మరొకటి నిత్యమూ వేదనతో కూడియున్న ప్రదేశము. ఆ వేదనకరమైన ప్రదేశమును గూర్చి మరొక మాటలో ఆయన పలికిన సందర్భమును మనము పరిశీలిద్దాం.

**మార్కు 9 : 48** "నరకమున వారి పురుగు చావదు, అగ్ని ఆరదు". ఒకవేళ పాతాళలోకానికి వెళ్ళిపోతే అక్కడి పరిస్థితి ఎలా ఉంటుందో తెలుసా? అక్కడ ఆత్మకు చావు లేదు, అలాగని ఆ ఆత్మకు వేదనా తప్పదు. భూమి మీద చావు అనేది పెద్ద విషయం కాదు. ఆత్మ ఒక శక్తి స్వరూపము. దీనిని నాశనము చేయలేము. దేవుడు ఈ శక్తిని నాశనము చేయడు కాని వేదనకు పంపిస్తాడు. అప్పుడప్పుడు జైలులో శిక్షను అనుభవిస్తున్నవారిని చూస్తే, ఆ వేదనను అనుభవించలేక, నన్ను మీరు ఒకేసారి చంపేయండి అంటారు. ఎందుకంటే ఆ వేదనను వారు భరించలేక, నన్ను బాధ పెట్టకండి, ఒకేసారి చంపేయండి అని మొఱ్ఱ పెడతారు. అప్పుడు పోలీసు అధికారులు నేరస్థులను చంపకుండా, నిజాలను రాబట్టడానికి ఇంటరాగేషన్ చేస్తూ వారిని శిక్షిస్తుంటారు. దేవుడు కూడా ఇదే పద్ధతిని పాతాళలోకములో ప్రవేశపెట్టాడు. కాని అది ఇంటరాగేషన్ కాదు. అది కేవలం శిక్ష మాత్రమే. ఎందుకంటే పాతాళలోకములోనికి వెళ్ళేవారందరూ భూమి మీద దేవుడిచ్చిన బ్రతుకు కాలములో 'దేవుడు' అనే పదానికి అర్థాన్ని కూడా తెలుసుకోలేక చనిపోయిన అభాగ్యులు. వారు దేవుడంటే అర్థం కానివారు, బైబిల్‌లో వ్రాయబడిన దేవుని సంగతులు తెలియని వారు, వాటి ప్రకారము బ్రతకని వారు. వీరికి దేవుడు నిత్య రాజ్యాన్ని ఇవ్వకుండా ఏమంటున్నాడో తెలుసా? అపవాదికిని వాని దూతలకును సిద్ధపరచబడిన ఆ పాతాళలోకము లోనికి మీరు వెళ్ళిపోవాలి. అక్కడ పరిస్థితి ఎలా ఉంటుందో తెలుసా? మీకు శిక్ష ఆగదు, అలాగని మీరు చావరు. అంటే శాశ్వత కాలము మీరు వేదనను అనుభవించడానికి నిర్ణయింపబడతారు. నిత్యాగ్ని దండనలోనికి జారిపోతారు అంటున్నాడు. ఇప్పుడు మీకు ఏ పౌరసత్వము కావాలో చెప్పండి. భూమి మీద ఉన్న ప్రజలు ఆయా దేశాలలో నివసిస్తున్నప్పుడు వారి దేశ పరిస్థితులు బాగోకపోతే ఆ దేశ పౌరసత్వమును వద్దనుకుంటారు. ఇటీవల కాలములో మనము వార్తాపత్రికలల్లో చదువుకున్నాము. గ్రీసు దేశము ఆర్థిక సంక్షోభములోనికి వెళ్ళిపోయింది. అక్కడ మంచి నీళ్ళు కొనుక్కోవాలంటే 100 రూపాయలు ఖర్చు పెట్టాలి. అక్కడ ఒక లీటరు పాలు కొనుక్కోవాలంటే 500 రూపాయలు ఖర్చుపెట్టాలి. గ్రీసు దేశపు బ్యాంకులో డబ్బులు ఇవ్వడం లేదు. ఆ దేశ ప్రజలు ఆకలి చావులతో చనిపోతున్నారు. అందుకే ఎంతో కొంత ధనమును కలిగియున్నవారు విదేశాలకు వలస వెళ్ళిపోతున్నారు, మిగిలిన వారు ఆ గ్రీసు దేశములోనే చనిపోతున్నారు. నరకములో దేవుడు కల్పించే పరిస్థితి కూడా ఇలాగే ఉంటుంది. ఎందుకంటే అది అన్యాయము చేసిన వారికి, అక్రమముగా బ్రతికిన వారికి, భూమి మీద దేవుడంటే పట్టించుకోని వారికి, దేవుడు ఏర్పరచిన శిక్షా స్థలమది. అలాంటి పౌరసత్వాన్ని మీరు కోరుకుంటారా? మనిషి ఈ దేహాన్ని విడిచిపెట్టిన తరువాత శాశ్వతమైన పౌరసత్వమును పొందేందుకు రెండు దారులు కనిపిస్తున్నాయి. కుడి వైపున ఉన్న వారిని, అలాగే ఎడమ వైపు ఉన్న వారిని చూపిస్తున్నాడు. కుడి వైపు ఉన్నవారికి మహా లోకాన్ని ఇస్తున్నాడు. నాతో పాటు మీరు కూడా పరలోకములో నివసించండి అంటున్నాడు. ఈ దేవుని రాజ్యాన్ని స్వతంత్రించుకోండి అంటున్నాడు. కానీ మరో వైపు ఎడమ వైపున భరించలేని స్థలమున్నది, అక్కడకి ఎవ్వరూ వెళ్ళకూడదు. కాని తండోపతండాలుగా అందరూ అక్కడికే వెళ్ళిపోతున్నారు. ఈ భూమి మీద 60, 70 సంవత్సరాల జీవిత కాలములో తాత్కాలిక దేశ పౌరసత్వములో ఉన్న ఈ ప్రజలు శాశ్వతమైన పౌరసత్వముగా

దేనిని ఎన్నుకోవాలో తెలియక, దేనిని సంపాదించుకోవాలో అర్థంకాక నిత్యాగ్ని నరకానికి జారిపోతున్నారు. బైబిల్ పూర్తిగా దీనినిగూర్చి మాత్రమే మాట్లాడింది. యేసు ఈ భూమి మీదకు వచ్చినప్పుడు ఆయన ప్రారంభించిన మాటలను ఒక్కసారి చూడండి. **మత్తయి 4 : 17** "అప్పటి నుండి యేసు పరలోకరాజ్యము సమీపించియున్నది కనుక మారుమనస్సు పొందుడని చెప్పుచు ప్రకటింప మొదలుపెట్టెను". ఆయన దేనినిగూర్చి ప్రకటించడానికి వచ్చాడో చూడండి. పరలోకమనేది ఒక దేశము, అదొక రాజ్యము. మీరు దానిలో పౌరసత్వమును సంపాదించుకోవాలి. ఈ భూమి మీద ఉన్న ఈ అత్యల్ప జీవితకాలములో మీరు దానినే సంపాదించుకోవాలి. అందుకే యేసుక్రీస్తు ఈ లోకానికి వచ్చారు. మిగిలినవన్నీ ఆయన దేవుని కుమారుడని నమ్మించడానికి చేసిన సూచకక్రియలు మరియు అద్భుతాలే తప్ప, కేవలము వాటిని చేయడానికి మాత్రమే యేసు భూమి మీదకు రాలేదని మీరు గ్రహించాలి. ఆయన పరలోక రాజ్యమును గూర్చి ప్రజలకు తెలియజేయడానికే వచ్చాడు. ఎందుకంటే అది చాలా ముఖ్యమైనది. భూమి మీద గ్రుడ్డివానికి కళ్ళు ఇస్తే చూపు ఉన్నా కొంత కాలానికి మరల వాడు చనిపోతాడు. భూమి మీద ఒక కుంటివానికి కాళ్ళు ఇస్తే నడక ఉన్నా కొంత కాలానికి మరల వాడు చనిపోతాడు. భూమి మీద ఆరోగ్యము లేనివానికి ఆరోగ్యమునిస్తే వాడు మరికొంత కాలము అదనముగా బ్రతుకుతాడు. ఆ తరువాత మరల అతడు చనిపోతాడు. కానీ శాశ్వతమైన పౌరసత్వమనేది ఉంది చూశారా! అది చాలా విలువైనది. అందుకే అసలు యేసుక్రీస్తు భూమి మీద అడుగు పెట్టిందే దేనికంటే, ఆ పరలోక రాజ్యమును గూర్చి పరిచయం చేయడానికి! పరలోకరాజ్య సంగతులను గూర్చి ఆయన ప్రకటించాడు. దీనిని గూర్చి అర్థం కాకపోతే అదిగో నిత్యాగ్ని నరకము సిద్ధంగా ఉంది అంటున్నాడు.

**మత్తయి 8 : 11** "అనేకులు తూర్పునుండియు పడమటినుండియు వచ్చి అబ్రహాముతో కూడను, ఇస్సాకుతో కూడను, యాకోబుతో కూడను పరలోక రాజ్యమందు కూర్చుందురు". వీరందరు ఎవరు? నలుదిక్కుల నుండి, ఆయా దేశాలలో నివశిస్తూ దేవుని వాక్యమును నేర్చుకున్న వారు, దేవుని వాక్యమంటే మక్కువ చూపినవారు, దేవుని కొరకు నిర్ణయింపబడినవారు, తమ జీవిత కాలములో దేవునికి మెదటి స్థానమునిచ్చినవారు. ఈ భూమిమీద లోకసంబంధమైన సంగతులను గూర్చి బైబిల్ ఎప్పుడూ మాట్లాడదు. ఈ భూమిమీద శరీరపు బ్రతుకును గూర్చి దేవుడు ఏనాడూ మాట్లాడలేదు. ఈ భూమిమీద మీరు ఇష్టమొచ్చినట్టుగా బ్రతుకుతున్నారు. ఆయా దేశాలలో బ్రతుకుతూ, ఆయా ఉద్యోగాలు చేసుకుంటూ, విద్యార్థులుగా, వ్యాపారులుగా, క్రీడాకారులుగా, శాస్త్రవేత్తలుగా, గృహిణులుగా, ఇలా ఎందరో ఉన్నారు. వీరిని గూర్చి దేవుడు ఎప్పుడూ వ్రాయించలేదు. మరణించిన తరువాత ఏమి జరుగుతుంది? శాశ్వతమైనది ఏమిటి? అనే వాటిని వ్రాయించాడు. దేవుడు మనుష్యులకు నిజమే చెప్పాలి. అబద్ధపు మాటలను కాదు. ఆయన వ్రాయించవలసినది శరీర సంబంధమైన మాటలు కాదు. మనుష్యులందరి ఆత్మలను ఆయన రక్షించాలి. శాశ్వతమైన పౌరసత్వాన్ని వారికి కల్పించాలి. ఇక్కడ అదే మాట్లాడుతున్నాడు చూడండి. "తూర్పునుండియు, పడమటనుండియు వచ్చి అబ్రహాముతో కూడను, ఇస్సాకుతో కూడను, యాకోబుతో కూడను పరలోక రాజ్యమందు కూర్చుందురు". ఇంతకీ ఎవరీ అబ్రహాము? ఆయనే ఆ మహాలోకానికి ఆహ్వానింపబడినవాడు. ఇలాంటి వారే ఆ మంచి పౌరసత్వాన్ని పొందుచున్నారు. అయితే మరి కొంతమందిని చూడండి. రాజ్యసంబంధులు అనగా పాతాళలోకముకో ఒక రాజ్యముంది. దేవుని కొరకు పట్టించుకోని ప్రతి ఒక్కరూ వేదనకరమైన స్థలమునకు వెళ్ళిపోవాలి. రాజ్యసంబంధులున్న ఆ స్థలములో ఏడ్పును, పండ్లు కొరుకుటయును ఉండునని మీతో చెప్పుచున్నానని యేసుక్రీస్తువారు మాట్లాడుతున్నారు. ఆ పాతాళరాజ్యము లోనికి మీరు వెళ్ళకూడదు. పరలోకమునకే మీరు వెళ్ళాలి. అందుకే దేవుని కుమారునిగా యేసుక్రీస్తు వచ్చాడు. పరలోక రాజ్యపు సంగతులు చెప్పడానికి ఆయన వచ్చాడు. శాశ్వతమైన పౌరసత్వమును ఆ పరలోకములో మీరు పొందాలి. అంతేగాని నిత్యాగ్ని నరకములో కాదు. వేదనకరమైన స్థలములో కాదు. పాతాళలోకములో కాదు. పరలోక రాజ్యమును గూర్చి వ్రాయబడిన మాటలను చూడండి. **మత్తయి 3 : 2** "పరలోక రాజ్యము సమీపించియున్నది, కనుక మారుమనస్సు పొందుడని, యూదయ అరణ్యములో బాప్తీస్మమిచ్చు యోహాను ప్రకటిస్తున్నాడు". ఈయన యేసుక్రీస్తుకు ముందుగా వచ్చినవాడు, రాబోవు ఏలియాకు ప్రతిరూపముగా వచ్చిన ఈ బాప్తీస్మమిచ్చు యోహాను ఏమని ప్రకటిస్తున్నాడో తెలుసా? పరలోక రాజ్యము

సమీపించియున్నది కనుక ఆ పౌరసత్వమును మీరు సంపాదించాలన్నాడు. బాప్తీస్మమిచ్చు యోహాను చేసే దేవునివాక్య ప్రకటన ఏమిటంటే, మీరు పరలోకము వెళ్ళకపోతే చాలా నష్టపోతారు అంటున్నాడు. యేసు శిష్యులు కూడా ఏమని ప్రకటించారో చూడండి. **మత్తయి 10 : 7** "యేసు తన శిష్యులతో – మీరు వెళ్ళుచు, పరలోక రాజ్యము సమీపించియున్నదని ప్రకటించుడి". యేసుక్రీస్తు వారిదీ అదే ప్రకటన, బాప్తీస్మమిచ్చు యోహానుదీ అదే ప్రకటన, యేసు శిష్యులదీ అదే ప్రకటన, అపొస్తులులదీ అదే ప్రకటన! ఏమిటా ప్రకటన? లోకానికి అత్యవసరముగా తెలియజేయవలిసిన ఆ మాటలు ఏమిటి? అదే... పరలోక రాజ్యము సమీపించియున్నది. మీకు ఎంతో దూరంలో లేదు. మీరు నిజంగా దేవుని కొరకు బ్రతికితే ఆ రాజ్యాన్ని మీరు స్వతంత్రించుకోవచ్చు. మీరు నీతిమంతులైతే నిజంగా మీ బ్రతుకుకాలమంతా మీరు దాని కొరకే ఆలోచిస్తారు, దానినే కోరుకుంటారంటున్నాడు. ఈ భూమి మీద మనుష్యులు తమ జీవితాలలో ఏమి కోరుకుంటున్నారో, నిరంతరము దేని కొరకు ఆలోచిస్తున్నారో మీ అందరికీ విదితమే. ఆస్తిని సంపాదించాలని, అధికారమును సంపాదించాలని, పేరు–ప్రఖ్యాతలు సంపాదించుకోవాలని, ఈ శరీరాన్ని సుఖపెట్టుకోవాలని అందరూ ఆలోచిస్తున్నారు. ఇదేనా భూమి మీద బ్రతుకు? చనిపోతే వీటన్నింటిని విడిచిపెట్టి, ఆత్మగా మరొక దేశానికి వెళ్ళవలిసిన మీరు, శాశ్వతమైన పౌరసత్వము గూర్చి ఎప్పుడైనా ఆలోచించారా?

**సామెతలు 15 : 24** "క్రిందనున్న పాతాళమును తప్పించుకొనవలెనని బుద్ధిమంతుడు పరమునకు పోవు జీవమార్గమున నడుచుకొనును". బుద్ధిమంతులైతే పరలోక మార్గము ఎక్కడ ఉందా అని ఆలోచిస్తారు. ఆ జీవమార్గమును నిత్యమూ అన్వేషిస్తారు. ఎందుకంటే వారికి శాశ్వతమైన పౌరసత్వము పరలోకములో కావాలి. భూమి మీద కాదు, పాతళలోకములోనూ కాదు. పాతాళము శాశ్వతమైనదైనా అది బహు వేదనకరమైనది. అందుకే దాని నుండి తప్పించుకోవాలి. ఆ లోకములోనికి మనము జారిపోకూడదు. ఇప్పటికే ఎంతోమంది వెళ్ళిపోయారు. దేవుని కార్యక్రమాలను ముగించకుండా, దేవుడంటే ఎవరో తెలియకుండా, ఆయన వ్రాయించిన సంగతులు అర్ధం కాక ఎంతో మంది చనిపోయి నిత్యాగ్ని నరకానికి జారిపోతున్నారు. పాతాళమనే లోకములోనికి వెళ్ళిపోతున్నారు. అందుకే దేవుడు వ్రాయించిన మాటలలో, బుద్ధిమంతులైతే మీరు ఎన్నుకోవలిసిన మార్గమేమిటో తెలుసా? అదే జీవ మార్గము అన్నాడు. పై నున్న లోకానికి మార్గాన్ని కనుగొనాలి అంటున్నాడు. ఇలా కనుగొన్నవారు బైబిల్‌లో వ్రాయబడ్డారు. వారిని గూర్చి మనము ఒకసారి తరచి చూస్తే, వారి వలె బ్రతకడానికి మనము కూడా ప్రేరణ పొందడానికి అవకాశము ఉంటుంది. వారెంత గొప్పవారో తెలుసా? వారు ఈ భూమి మీద పేదవారేమీ కాదు. వారు ఆయా దేశాలకు స్వాస్థ్యకర్తలు. దేశమంతా వారిదే, దేవుడు వారికి దానిని ఇచ్చేసాడు. కాని అలాంటి వారు ఎలా బ్రతికారో, వారిని గూర్చి దేవుడు ఎంత పొంగిపోయి తన మాటలను వారిని గూర్చి వ్రాయించాడో మనము చూస్తే, ఒక నీతిమంతుడు ఎలా బ్రతకాలో, పరలోకము వెళ్ళవలసినవాడు, ఆ శాశ్వత పౌరసత్వాన్ని సంపాదించుకోవలిసినవాడు ఎలా బ్రతకాలో అర్ధమవుతుంది. ఆ తరువాత మీరు ఆశ్చర్యపోక తప్పదు. వారే అబ్రహాము, ఇస్సాకు, యాకోబు మరియు వారి వలె వచ్చిన ప్రవక్తలు, నీతిమంతులు. వారిని గూర్చి దేవుడు తన గ్రంధములో ఎలా వ్రాయించాడో తెలుసా? ఈ భూమి మీద గొప్ప వారిని చూసి అనగా అందచందాలు కలిగినవారిని చూసి, ఆస్తిపాస్తులు కలిగినవారిని చూసి, రాజకీయ నాయకులను చూసి, నటీనటులను చూసి, క్రీడాకారులను చూసి, వ్యాపారవేత్తలను చూసి, వారే గొప్పవారని అనుకుంటాము. వారు మన ఇంటికి వస్తే చాలా ఆనందముతో ఉబ్బితబ్బిబ్బైపోతాము. కాని దేవుడు అలాంటి వారిని పట్టించుకోవడం లేదు. అలాంటి వారికి దేవుడు తన గ్రంధములో చోటు ఇవ్వనూలేదు. మరి ఎవరిని గూర్చి వ్రాయిస్తున్నాడు? నిజముగా మీరు వారిని గూర్చి చదివితే, వారు ఇంత అమాయకులా అనుకుంటారు. కాని వారే దేవుని దృష్టిలో గొప్పవారైపోయారు. వారెవరింతకీ? వారు చేసిన కార్యాక్రమాలు ఏమిటి ? వారిని చూసి దేవుడు ఎందుకు పొంగిపోయాడు ? వారికి దేవుడు ఆ పరలోకరాజ్యాన్ని ఎందుకు వ్రాసి ఇచ్చాడు? వారికి దేవుడు పరలోక పౌరసత్వాన్ని ఎందుకు ఇచ్చాడు? ఇప్పుడు చూడండి. **హెబ్రీయులకు 11 : 9** "విశ్వాసమును బట్టి అతడును అతనితో ఆ వాగ్దానమునకు సమాన వారసులైన ఇస్సాకు, యాకోబు అనువారును గుడారములలో నివసించుచు, అన్యుల దేశములో ఉన్నట్టుగా, వాగ్దత్త దేశములో పరవాసులైరి". వీరందరూ ఎలా జీవించారంటే,

మేము మరణించిన తరువాత మా తండ్రి ఉన్న లోకానికి వెళ్ళిపోవాలి అనుకుని గుడారములలో బ్రతికారు. మీరైతే ఏమనుకుంటారు? గుడారములలో బ్రతుకుచున్న వారు ఏ ఆశ్రయములేని వారనుకుంటారు. కాని ఆ నీతిమంతులు ఆశ్రయం లేక కాదు, పట్టణాలలో పెద్ద పెద్ద భవంతులలో బ్రతకలేక కాదు. నిజానికి చెప్పాలంటే, వారి కొరకు భూమి మీద ఒక దేశమే ఉంది. వారు చెప్పిన మాటలు వినడానికి అనేకమంది దాసదాసీలు కూడా ఉన్నారు. వారికి విస్తారమైన సంపద ఉన్నది. అన్నీ ఉన్నా – వారు, వారితోపాటు వారి కుటుంబము గుడారముల క్రింద బ్రతుకుతున్నారు. అంటే వీరికి కావాలిసింది ఈ లోకము కాదు, ఈ పౌరసత్వమూ కాదు. ఈ దేశము కాదు, ఈ స్వాస్థ్యమూ కాదు. అందుకే దీనిని వారు వదులుకున్నారు. దేవుడు వారికి వాగ్దానము చేసి ఇచ్చిన దేశములోనే, ఇది మాది కాదు అని బ్రతుకుచున్నారు. అబ్రహాము– ఇది నాకు వద్దు, నా పిల్లలకు వద్దు, నా మనవలకు వద్దు, నా తరువాత రాబోయే నీతిమంతులకు కూడా వద్దు అంటున్నాడు. ఈ దేశమే కాదు, ప్రపంచ వ్యాప్తంగా ఏ దేశాన్ని ఇచ్చినా అక్కడ నివశిస్తాడు, అక్కడ దేవుని కార్యక్రమాలను జరిగిస్తాడు తప్ప, ఆ దేశాన్ని మాత్రం ఆయన కోరుకోడు. ఆ దేశ సంపదనో, ఆ దేశ పౌరసత్వమునో నేను కోరుకోను అంటున్నాడు. ఎందుకంటే ఆయన బ్రతికినంత కాలమే ఈ పౌరసత్వమాయనకు లభిస్తుంది. కానీ అబ్రహాము చూపంతా ఎక్కడుందో తెలుసా? పరలోకము మీదే ఉంది. శాశ్వతంగా ఉండే పౌరసత్వము ఆయనకు కావాలి. అలాంటి నీతిమంతులను చూసి దేవుడు ఎంత ఆనందిస్తాడు, ఎంత పొంగిపోతాడు చెప్పండి. అందుకే వారిని గూర్చి వ్రాయించాడు.

**హెబ్రీయులకు 11 : 10** "ఏలయనగా దేవుడు దేనికి శిల్పియు నిర్మాణకుడునై యున్నాడో, పునాదులుగల ఆ పట్టణముకొరకు అబ్రహాము ఎదురుచూచుచుండెను". అబ్రహాము కనాను దేశమును అందుకే వద్దన్నాడు! అందుకే ఇక్కడ ఈ భూమిమీద గుడారమును వేసుకుని నివశిస్తున్నాడు! అవును. దేవుడు నిర్మించినది ఈ భూమిమీద రాతి కట్టడాలను కాదు. దేవుడున్న లోకానికే అనగా పరలోకానికే ఆయన శిల్పి మరియు నిర్మాణకుడు. నీతిగా బ్రతికిన వారందరూ ఆ దేశము కొరకే ఎదురుచూస్తున్నారు. అందుకే అబ్రహాము అనే ఆ నీతిమంతుని యొక్క మంచి ప్రవర్తనను చూడండి. భూమి మీద రాచరిక వ్యవస్థను అనుభవిస్తున్నా, అతనికి ఏనాడు రాజుగా ఉండాలని ఆశ లేదు. పరలోకము వెళ్ళిపోవాలని, దేవుని కార్యక్రమాలు ముగించాలని, ఆయన శరీరముతో దేవుని క్రియలు నెరవేర్చాలని, నీతిమంతుణ్ణి కావాలనే కోరుకుంటున్నాడు. ఎందుకంటే పాతాళమును ఖచ్చితంగా తప్పించుకోవాలి. ఆ పరలోకపు మార్గాన్ని తప్పనిసరిగా అన్వేషించాలి. దేవునిరాజ్యాన్ని అతడు పొందాలి. ఇదేనండి నీతిమంతులకుండవలిసిన ఆలోచన! భూమి మీద ఏ దేశానికీ పునాది లేదు. అందుకే భూకంపాలు వస్తున్నాయి. ఇవన్నీ గాలిలోనే ఉన్నాయి. ఒక్కసారి ఈ భూమండలాన్ని విడిచి ఆకాశమండలములోనికి ఎగిరితే, ఈ భూమి మన కంటికి ఒక చిన్న బంతి, ఒక గుండ్రని గోళము వలె కనిపిస్తుంది. దీని మీద బ్రతుకుతున్న వారంతా ఏదో ఒక క్షణాన వెళ్ళిపోక తప్పదు. ఇది కూలిపోక తప్పదు. ఇది పునాదులు లేని పట్టణము. మరి పునాదులు కలిగినది ఏది? అదే పరలోకములో ఉన్న పట్టణము. ఎప్పటికీ కదలికలు లేనిది, శాశ్వతమైనది, ఎవ్వరూ నాశనము చేయలేనిది. అదే తండ్రి ఉన్న లోకము. నీతిమంతులుగా ఉన్న వారందరూ అనగా దేవుని కార్యక్రమాలలో ఉన్న వారందరూ శాశ్వతమైన పట్టణము కొరకు ఎదురుచూస్తున్నారు. **హెబ్రీయులకు 11 : 13** "వీరందరూ ఆ వాగ్దానముల ఫలము అనుభవింపక పోయినను, దూరమునుండి చూచి వందనము చేసి, తాము భూమి మీద పరదేశములను, యాత్రికులమునై యున్నామని ఒప్పుకొని, విశ్వాసముగలవారై మృతినొందిరి. ఈలాగు చెప్పువారు తమ స్వదేశమును వెదుకుచున్నామని విశదపరచుచున్నారు". దేవుడిచ్చిన ఆస్తులను, సంపదను చూచి అవి మాకు వద్దు అనుకున్నారు. ఇవన్ని తాత్కాలికమైనవని వారికి అర్ధమైపోయింది. ఈ భూమి మీద వారికి పౌరసత్వం లేదా? లేదు. ఎందుకంటే వారి యొక్క స్వదేశం పరలోకము. మనమైతే భారతదేశం నా మాతృభూమి, నా స్వదేశము అంటాము. అది కేవలం ఈ భూమి మీద ఉన్నంత కాలమే! మరి ఆ తరువాత నీ దేశమేది, నీ పౌరసత్వమేది? ప్రియులారా ఆలోచించండి. మీరు దేనిని కావాలనుకుంటున్నారు, మీరు దేనిని సంపాదించుకోవాలనుకుంటున్నారు? మనమంతా నీతిమంతులమైతే పాతాళాన్ని తప్పించుకోవాలి, తండ్రి ఉన్న లోకాన్ని చేరిపోవాలి. పాతాళమునకు ఎవ్వరూ వెళ్ళకూడదనే ఉద్దేశ్యముతోనే

పరలోకపుతండ్రి తన కుమారుని పంపించాడు. ప్రతి ఒక్కరికీ పరలోకమును గూర్చి చెప్పమని పంపించాడు. ఎందుకంటే మీకు రావాలిసిన సభ్యత్వం, పౌరసత్వం ఆ దేశములోనే ఉంది. అందుకేనండి, మనందరికి ప్రవక్తలను చూపించాడు, నీతిమంతులను చూపించాడు. వారెవరూ కోరుకోలేనిది మనకు కావాలంటారా! వారందరికంటే మనము గొప్పవారమా? వారందరికంటే మనము నీతిమంతులమా? వారందరూ విశ్వాసముగలవారై ఆ పరలోకము కొరకు ఎదురుచూసారు. మనమందరము ఇప్పుడు ఒక మంచి నిర్ణయం తీసుకోవాలి. ఏ సభ్యత్వం కోసం భూమి మీద మనము ఎదురు చూడాలో ఆలోచించుకోవాలి. ఎందుకంటే ఈ భూమి మీద ఇటువంటి మాటలు ఎవ్వరూ చెప్పరు. శాశ్వతమైన పౌరసత్వము కొరకు ఎవ్వరూ చర్చించరు. ఎందుకంటే లోకసంబంధమైన పుస్తకాలలో దీనిని గూర్చి ఎవ్వరూ వ్రాయలేదు.

**ఫిలిప్పీయులకు 3 : 20** "మన పౌరస్థితి పరలోకమందున్నది, అక్కడనుండి ప్రభువైన యేసుక్రీస్తు అను రక్షకుని నిమిత్తము కనిపెట్టికొనియున్నాము". క్రైస్తవులుగా మనము మారిన తరువాత, యేసుక్రీస్తును ధరించుకున్న తరువాత, మన పౌరస్థితి పరలోకములో ఉంటుంది. పౌలుకు ఎంత ధైర్యంగా ఉందో చూడండి. ఫిలిప్పీయుల ధైర్యం చూడండి. అంటే భూమి మీద దేవుని కార్యక్రమాలలో ఉన్నవారికి, తండ్రి తన పరలోకములో పౌరస్థితిని కల్పిస్తున్నాడు. అక్కడ మనకు నివాసమును ఏర్పాటు చేస్తున్నాడు. **యోహాను సువార్త 14 : 1-3** లో యేసుక్రీస్తువారు అదే సంగతిని చెప్పారు. నేను వెళ్ళి తండ్రియొద్ద మీకు నివాస స్థలములను ఏర్పాటు చేస్తానన్నాడు. ఎందుకంటే మీ పౌరస్థితి పరలోకములో ఉన్నది. బాగా ఆలోచించండి. దేవుడు మన కీడును కోరి ఏ మాటనూ చెప్పడు. మనము మరణించిన తరువాత ఏ దేశానికి వెళ్ళాలో ముందుగానే చెబుతున్నాడు. ఇందులో నేరముందంటారా! దేవుని కొరకు బ్రతకమన్నాడు, న్యాయముగా ఉండమన్నాడు. సత్యాన్ని అంగీకరించమన్నాడు. ఈ మాటలలో ఆయన చేసిన దోషమేమీ లేదు. ఆయన చేసిన అక్రమమేమీ లేదు. కేవలం దేవుడు మీ మార్పును కోరుకుంటున్నాడు. మనందరికొరకు తన కుమారుని కూడా అర్పణగా ఇచ్చాడు. పరలోకరాజ్యాన్ని గూర్చి తెలుసుకుంటారని, ఆ పౌరసత్వాన్ని కోరుకుంటారని, దేవుడు ఎంతో గొప్ప ప్రణాళికను వేసాడు. ఇవన్నీ చేసినా, మనము మారకపోతే ఎలా? ఆలోచించండి. ఈ యువత ఎంతగా చెడిపోయిందో, మనుష్యులు ఎంతగా చెడిపోయారో, అపవాదికి ఎంత బానిసలుగా బ్రతుకుతున్నారో మీ అందరికి తెలుసు. కొంతమందికి సాయంత్రమయిదంటే మద్యం వారి నోట పడకపోతే వారికి రోజు గడవడం లేదు. మాదకద్రవ్యాలు తీసుకోకపోతే మనిషి బ్రతకలేకపోతున్నాడు. వ్యభిచారం చేయకపోతే మనిషి ఆగలేకపోతున్నాడు. ఇవన్నీ కలిగియున్న ఈ మనుష్యులను ఎలా బ్రతికించగలం చెప్పండి. అందుకే దేవుని వాక్యము ఒక్కటే వీరికి మంచి ఔషధం. దేవుని మాటలద్వారా శాశ్వతమైన పౌరసత్వం వైపు ఈ మనిషి దృష్టిని మలచగలిగితే, మనిషిలో మార్పును తీసుకురాగలిగితే, నిజంగా ప్రతి వ్యక్తి మారిపోతాడు. ప్రతి వ్యక్తి దేవుని మార్గములోనికి వచ్చేస్తాడు. జాగ్రత్త సుమా! మన పౌరస్థితి పరలోకమందున్నది. మీరు దానినే కోరుకోవాలి, మనది ఈ భూమి మీద పౌరస్థితి కాదు.

**హెబ్రీయులకు 13 : 14** "నిలువరమైన పట్టణము మనకిక్కడ లేదు గాని, ఉండబోవుచున్న దాని కోసము ఎదురుచూచుచున్నాము". మనమిక్కడ ఉండవలిసినవారము కాదని ఈ భూమికి తెలుసు. ఒకవేళ మనము నివశిస్తున్న ఈ పట్టణానికే నోరు ఉంటే ఏమని చెబుతుందో తెలుసా? మీరు త్వరగా సర్దునికి వెళ్ళిపోవాలని, దేవుని రాజ్యము కొరకు ఎదురుచూడాలని చెబుతుంది. దానికి నోరు లేదు గనుకనే దేవుని వాక్యములో వ్రాయించాడు. మీరు అమెరికా వెళ్ళినా, అలస్కా వెళ్ళినా, చైనా వెళ్ళినా, ఇంకెక్కడికి వెళ్ళినా నిలువరమైన పట్టణము మీకు దొరకదు. మీరు ఉండబోయేది, శాశ్వతముగా ఉండవలసింది కేవలము పరలోకమే! దాని కొరకే ఆనాటి ప్రారంభ శతాబ్ధపు క్రైస్తవ్యం ఎదురుచూచింది. మరి ఈ రోజున్న నామకార్ధ క్రైస్తవ్యం ఏమైపోయింది? నిద్రపోయిందంటారా? ప్రపంచానికి దేవుని మాటలు చెప్పవలిసిన క్రైస్తవ్యం ఏమిచేస్తుంది? ఎలాంటి పరిస్థితులలో ఉంది? నేటి క్రైస్తవ్యం, దేవుని కార్యక్రమాలలో ఉందా! వీధి వీధినా, పల్లె పల్లెనా, గ్రామ గ్రామాన, పట్టణ పట్టణానా, సర్వలోకానికీ దేవుని మాటలు ప్రకటింపబడుతున్నాయా? లేదనే చెప్పాలి. అసత్యానికి వీరు కూడా చేయూతనిస్తున్నారు. అక్రమాలలో వీరు కూడా పాలుపంపులు కలిగియుంటున్నారు. దేవుని తీర్పు సిద్ధంగా ఉంది జాగ్రత్త! మనము దేవుని మాటలకు

విలువనివ్వాలి. దేవుని మాటలను అంగీకరించాలి. ఏ క్షణమున మీ గుండె ఆగిపోతుందో మీకు తెలియదు. మనము నడుపుతున్న బండి ఆగిపోతే, అది ఎందుకు ఆగిపోయిందో మనకు తెలుసు. అందులో పెట్రోల్ అయిపోవచ్చు లేదా ఇంజన్ చెడిపోవచ్చు. పోనీ, బండి ఆగిపోదని దానికన్నా గ్యారంటీ ఇవ్వగలమేమోగాని, మన బ్రతుకుకు ఇవ్వలేమండి. అంత అల్పమైన బ్రతుకును కలిగిన మనకు ఏమిటండీ ధైర్యం? దేవుని మాటలు పట్టించుకోకుండా ఎందుకండీ ఈ ధిక్కారం? దేవుని మాటలపై ఎందుకండీ ఈ తిరుగుబాటు? ఈ మనుష్యులకు అర్థంకావడం లేదు. ఈ మాటలు చదువుచున్న మీరైనా సరైన నిర్ణయం తీసుకోండి. పరలోకరాజ్యాన్ని గూర్చి ఇదంతా చదివిన మీరైనా అనేకమందికి చెప్పండి. యేసుక్రీస్తును గూర్చి ప్రకటన చేయండి. ఏ ప్రాంతము వారికైనా శాశ్వతమైన లోకమును ఇచ్చేవాడాయనే. ఇది మతం కాదు. మీరు యేసుక్రీస్తును ప్రకటించి ఒక్క ఆత్మనైనా రక్షిస్తే ఆ తండ్రికి సంతోషం. అప్పుడు మిమ్మును పరలోకానికి ఆహ్వానిస్తాడు. **ప్రకటన 21 : 1** "అంతట నేను క్రొత్త ఆకాశమును క్రొత్త భూమిని చూచితిని. మొదటి ఆకాశమును, మొదటి భూమియు గతించిపోయెను. మరియు నేను నూతనమైన యెరూషలేము అను ఆ పరిశుద్ధపట్టణము తన భర్తకొరకు అలంకరింపబడిన పెండ్లికుమార్తెవలె సిద్ధపడి పరలోకమందున్న దేవుని యొద్దనుండి దిగి వచ్చుట చూచితిని. ఇప్పుడు ఇదిగో దేవుని నివాసము మనుష్యులతో కూడ ఉన్నది". అది ఇప్పుడున్న భూమీ కాదు, ఇప్పుడున్న ఆకాశమూ కాదు. దేవుడు మన కొరకు నిర్మించినది, మన కొరకు సిద్ధపరచినది. మొదటివన్నీ గతించిపోతాయి అంటున్నాడు. అయితే శాశ్వతముగా నిలిచేవి పైన ఉన్నవి. నీతిమంతులుగా ఉన్నవారందరు ఆ పౌరసత్వములోనికి వెళ్ళిపోతారు. అప్పుడు దేవుని నివాసము మనుష్యులతో ఉంటుంది. అది ఎంత గొప్ప భాగ్యం! పరలోకములో సభ్యత్వమును పొందిన వారందరూ, ఆత్మలుగా దేవునిని తమతో నివసింపచేసుకుంటున్నారు. మీరు నీతిమంతులైతే, మరణించిన తరువాత అక్కడ వేదన లేదు, ఏడ్పు లేదు, కన్నీళ్ళు లేవు. ఎంత సంతోషకరమైన లోకమది! దానిని పొందడానికి ఈ అత్యల్ప జీవితకాలములో కొంచెము కష్టపడమన్నాడు. దేవుని రాజ్యాన్ని ప్రకటించమన్నాడు, నీతిగా ఉండమన్నాడు, సత్యాన్ని అంగీకరించమన్నాడు. ఇది నేరమా? ఇది ఆచరించదగినదే కదా! మనసు పెట్టి ఆలోచించండి. ఈ భూమి మీద మనకు అన్నీ ఉన్నా ఎల్లప్పుడూ బాధపడుతున్నాము. కానీ, పరలోకములో అలా ఉండదు. కాబట్టి ఆ తండ్రి పిలుపును మీరు వినండి. ఆ తండ్రి రాజ్యాన్ని మీరు చేరండి. శాశ్వతమైన సభ్యత్వాన్ని మీరు పొందండి. నిజంగా మీకంటే ధన్యులు ఈ భూమిపై ఎవ్వరూ ఉండరు.

ప్రభువునందు నమ్మకస్థుడు,

**జె. మణి కుమార్**

సన్ ఆఫ్ గాడ్ - క్రైస్ట్ చర్చ్ - సామర్లకోట - 8978414178.

## ప్రశ్నలు

1. దేవుని జ్ఞానానుసారముగా బుద్ధిమంతుడెవరు?
2. మనిషి శాశ్వతమైన పౌరసత్వమును ఎలా పొందగలడో వివరించండి.
3. తీర్పు దినమున ప్రతి మనిషీ ఎదుర్కొనవలసిన పరిస్థితులను వివరించండి.
4. మనిషి ఈ భూమిపై శాశ్వతమైన పౌరసత్వమును ఎందుకు పొందలేకపోవుచున్నాడు?
5. దేవుడు నిర్మించిన పునాదులుగా పట్టణమేది? అందులో ఎవరికి ప్రవేశము లభిస్తుంది?
6. పౌరసత్వము అంటే ఏమిటి? భూమిపై తాత్కాలిక పౌరసత్వమును గూర్చి వివరించండి.
7. ఈ లోకము మోసమునే గ్రుడ్డిగా నమ్ముతుందనటానికి ఉదాహరణలతో వివరణ ఇవ్వండి.

## 3. లోకనీతి దేవుని నీతికి సమానమా ?

ప్రియమైన సోదర సోదరీమణులారా!

ఈనాడు భూమి మీద ఉన్న మనుష్యులు వారికంటూ ఒక నీతిని స్థాపించుకున్నారు. మనుష్యులకున్న ఆ నీతిలో చాలా అంశాలున్నాయి. ఇది మొట్టమొదటి మానవుడైన ఆదాము దగ్గర నుండి ప్రారంభమయ్యింది. ఆదాము, హవ్వ, కయీను, హేబెలు, షేతు ఇలా ఆయా తరాలలో మనుష్యులు భూమి మీద పుట్టుకొస్తూ, దేవుని మాటలకు తమ బ్రతుకులలో స్థానాన్ని ఇవ్వకుండా, వారికంటూ ఒక నీతిని స్థాపించుకున్నారు. ఎందుకంటే భూమి మీద మనిషి తన మాటను ఎల్లప్పుడూ నెగ్గించుకోవాలని చూస్తుంటాడు. తను పలికినదే న్యాయమని, తను జారీ చేసిన ఆజ్ఞలే అమలవ్వాలని అనుకుంటాడు. తను చెప్పిన మాటలను ప్రతి ఒక్కరు వినాలన్నది మనిషికి ఇప్పుడొచ్చిన రోగము కాదు. ఇది ప్రారంభం నుండి వచ్చిన జబ్బు. నేనే గొప్ప అనుకునే తత్వము, నా మాటే సత్యము, నా మాటే నిజమనుకునే ప్రవర్తన మనిషిలో పుట్టింది. ఇది పుట్టడానికి కారణం, ఒక భయంకరమైన శక్తి! వాడే ఈ మనిషి వెనుక ఉన్నాడు. వాడు ఎవరికీ కనిపించడు, వాడు ఎవరికీ పరిచయం లేదు. ప్రతి మనిషిని తల్లిగర్భము నుంచి బయటకు రాగానే ఆ దుష్టశక్తి ఆవహించి, మనుష్యులను తన పోలికలోనికి మార్చుకుంటున్నాడు. వాడే సాతాను, వాడే అపవాది, వాడే నరహంతకుడు. దేవుని కుమారులైన మనుష్యులను తమ తండ్రియైన దేవుని లోకానికి వెళ్ళనివ్వకుండా, భూమి మీదే వారందరి మార్గాన్ని మళ్ళిస్తున్నవాడే సాతాను. ఈ భూమిమీద మనిషిగా మీ నీతినే మీరు నెరవేర్చుకోవాలని మనకు ఉపదేశిస్తున్నాడు. అలాగని వాడు తన కొరకు ప్రత్యేకముగా వాడి పాఠాలేమీ తయారుచేసుకోవడం లేదు. తనకంటూ ఒక సిలబస్ లేదు. కాని మనిషి తనంతట తానే కొన్ని సిద్ధాంతాలను తయారు చేసుకునేటట్టుగా చేసాడు. మనిషే ఆ దుష్టుని తరపున కొన్ని పద్ధతులను, కొన్ని ఆచారాలను తయారుచేసుకున్నాడు. వాటినే ఈ మానవాళి పాటిస్తుంది. వాటినే నీతిగా లోకానికి చెబుతుంది. అదే లోకనీతి! ఆ లోకనీతిని అనుసరిస్తే మీరు నీతిలో ఉన్నట్టే, మీరు మంచి మార్గములో ఉన్నట్టే అని వాడు చెప్తున్నాడు. ఇలాంటి మాయమాటలను నమ్మి, ఈ మోసములో ఈ రోజు చాలామంది ఉన్నారు. అందుకే వారి బ్రతుకులలో దేవుని మాటలు లేవు. వారి మనోనేత్రాలకు ఈ జీవవాక్యము కనిపించకుండా, దేవునిమాటలు వారి చెవినిబడకుండా దుష్టుడు మనుష్యుల తలలో ఉన్న కన్నులను మూసి, గ్రుడ్డితనాన్ని కలుగజేసాడు. మనుష్యులందరు గ్రుడ్డివారైపోయారు అని దేవుడే అన్నాడు. ఇలా ఎంతమంది మారిపోయారు? వారి స్వనీతినే నీతి అనుకుంటున్నవారు, వారనుకున్నదే దైవత్వము అనుకునేవారు ఎంతమందున్నారు? దేవునివాక్యమును బట్టి దాదాపుగా మనుష్యులందరూ ఇదే కోవలో ఉన్నారని చెప్పాలి. ఈ ప్రపంచ మానవాళిలో దేవుని నీతిని పాటిస్తున్నవారు ఎంతమంది? లోకనీతిని అనుసరిస్తున్నవారు ఎంతమంది? అనే దానికి సమాధానమును దేవుడు చెబుతున్నాడు చూడండి.

**రోమీయులకు 3 : 11** "నీతిమంతుడు లేడు, ఒక్కడును లేడు". అలాగైతే, లోకంలో నీతి ఉంది. లోకంలో చాలామంది గొప్పవారున్నారు. బహుమతులు పొందుతున్నారు. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్, ఇంకా ప్రపంచస్థాయికి వెళితే నోబుల్ బహుమతి, ఆస్కార్ అవార్డ్, బుకర్ ప్రైజ్,... ఇలాంటి బహుమతులన్నీ పొందుతున్నవారు ఎంతోమందున్నారు. ఈ రోజు ప్రపంచం వీరందరినీ గౌరవిస్తుంది, అందలాన్నెక్కిస్తుంది. వారిని గూర్చి ప్రతిరోజు ఈ మీడియా మాట్లాడుతుంది. సోషల్ మీడియా నిండా వీరే! మరి దేవుని మాటల దగ్గరకు మనం వస్తే, నీతిమంతుల లెక్క ఎంతమంది? అని దేవుణ్ణి అడిగితే, ఆ జాబితాలో వీరందరూ ఉండాలి కదండి. ఈ బహుమతులు పొందుతున్నవారైనా నీతిమంతుల లెక్కలలో ఉండాలి. లోకములో మేము నీతిమంతులము అని చెప్పుకుంటున్నవారైనా ఈ లెక్కలలో ఉండాలి. కాని దేవుడేమంటున్నాడు? నీతిమంతుడు లేడంటున్నాడు. ప్రస్తుత జనాభా 700 కోట్లమంది అనుకుంటే అందులో 350 కోట్లమంది కూడా నీతిమంతులు లేరా? లేరు! ఒక్కడు కూడా లేడంటున్నాడు చూడండి. నీతిమంతుడు ఒక్కడు కూడా లేడు, గ్రహించువాడెవడును లేడు అంటే దేవుని నీతిని గ్రహించేవాడెవడును లేడు అని అర్థం. దేవుడు తన నీతినంతటినీ ఆదికాండము నుండి ప్రకటన గ్రంధము వరకు ఆయన మాటలలో భక్తులచేత వ్రాయించాడు. అదే దేవునినీతి. ఈ మాటలను గ్రహించే మనుష్యులు ఎవ్వరూ

లేరంటున్నాడు. ఎందుకంటే దేవునినీతి రావాలంటే దేవుని మాటలు చదవాలి, దేవుని మాటలను గ్రహించాలి. దేవుని మాటలు నిరంతరము చదివేవారు, దేవుని మాటలను వినేవారు, దేవుని మనస్సును తెలుసుకోవాలని ఆశపడేవారు, దేవుని ఉద్దేశ్యాలను భూమిమీద నెరవేర్చాలని అనుకునేవారు, దేవుని నీతినే నీతి అనేవారు ఈ భూమి మీద మచ్చుకు ఒక్కరైనా లేరు అనేది దేవుని హృదయవేదన. అందుకే, గ్రహించువాడెవడును లేడు అన్నాడాయన. ఆ తరువాతి వచనములో ఏమంటున్నాడో చూడండి. దేవుని వెదకువాడెవడును లేడు అన్నాడు. లోకనీతిని అనుసరించే మనిషికి దేవుడు ఇంకెందుకు? లోకములో మనిషికి ఒక నీతి ఉన్నప్పుడు వానికి దేవుని నీతెందుకు ? ఇందుకోసమే నేను ఈ దేవుని మాటలను ప్రచురిస్తున్నాను. ఈ మాటలను చాలామందికి చెప్పినా కొద్దిమందే దేవునివైపు తిరుగుతున్నారు. చాలా తక్కువమంది దేవుని యొద్దకు వస్తున్నారు. ఎందుకంటే మిగిలిన వారందరికి లోకనీతి మాత్రమే అర్థమయింది. లోకములో నీతి ఉన్నప్పుడు మేము ఈ దేవుని నీతి దగ్గరకు ఎందుకు వెళ్ళాలి? అదే వారి సందేహము. మా దగ్గర నీతి ఉన్నప్పుడు, మా పాఠశాలలు మాకు నీతిని నేర్పిస్తున్నప్పుడు, లోకములో ఎవరిని అడిగినా అందరూ మాకు నీతివాక్యాలు చెబుతున్నప్పుడు, మరల ప్రత్యేకముగా దేవుని నీతి మాకెందుకు అంటున్నారు. ఈ రోజు లోకనీతిని చెప్పడానికి విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు ఉన్నారు. దానిని ప్రచురించడానికి మీడియా ఉంది. ప్రతీ ఒక్కరూ ఏదో ఒక సందర్భములో లోకనీతిని గూర్చి మాట్లాడుతున్నారు. వీరందరు లోకానికి లోకనీతిని నేర్పిస్తున్నప్పుడు, ఇక మేము దేవుని దగ్గరకు ఎందుకు వెళ్ళాలి? ఇక మేము దేవుని వాక్యాన్ని ఎందుకు పరిశోధించాలని చాలామంది అనుకున్నారు. వారిక దేవుని నీతిని చూడలేరు. దేవుడు వారికి పూర్తిగా అంధత్వాన్ని అనుగ్రహించాడు. అంధత్వంలో ఉన్న వారిది నీతా? ఈ రోజు లోకంలో ఉన్న లోకపు సంగతులను చూసి, ఇదంతా నీతి అనుకుంటున్నారా? కాదు. దేవునిదే నీతి, ఆయనదే సత్యము. మనిషి దేవుని నీతిలో లేనప్పుడు అతడు అనీతిమంతుడవుతాడు. ఎందుకంటే దేవుని మాటలను గ్రహించడు. దేవుడెక్కడున్నాడని వెదకడు. ఏ ఒక్కరూ దేవుణ్ణి వెదకక పోవడాన్ని బట్టి మనము ఆలోచిస్తే, ప్రపంచంలో ఎవ్వరూ నీతిమంతులు కారు. ప్రతి మనిషి ఈ రోజు నీతమంతుడు అవ్వాలంటే దేవుని జ్ఞానమును తెలుసుకోవాలి, ఆయన మాటల దగ్గరకు రావాలి. అప్పుడే వారికి నీతి దొరుకుతుంది. పోనీ లోకంలో ఉన్నదేమైనా దేవుని నీతికి సరిపోయిందా అని మనం ఒకవేళ ప్రశ్నించుకుంటే లోకంలో ఉన్న నీతి కూడా కంటికి మంచిదిగానే కనిపిస్తుంది. కాని అది మనిషికి ప్రయోజనము కాదు. లోకములో చెప్పే నీతి సంగతులు, నీతి సూక్తులు కూడా అప్పుడప్పుడు దైవసంబంధమైనవిగా అనిపిస్తాయి, మనలను భ్రమపరుస్తాయి. కాని నిజానికి అవి నీతి సంగతులు కావు. వాటికీ దేవునికీ చాలా వ్యత్యాసం ఉంది. అవి దేవునికి చాలా దూరములో ఉన్నాయి.

**యెషయా 55 : 6-9** యెహోవా మీకు దొరకు కాలమునందు ఆయనను వెదకాలి. మీకు దేవుడు కొంతకాలమును ఇచ్చాడు. ఈ భూమి మీద తల్లిగర్భములో నుంచి మీరు బయటకు వచ్చి మీ చెవులు పనిచేయడం ప్రారంభించినప్పుడు, ఆ చెవులలో పడినదానిని మీ హృదయం గ్రహించడం ప్రారంభించినప్పుడు మీ కాలము ప్రారంభమైంది. మీరు తల్లిగర్భములో నుంచి బయటకు వచ్చిన కొంతకాలము వరకు మీకేమీ తెలియదు. మీ కన్ను చూచేది, మీ చెవి వింటున్నది, మీ అంగిలి రుచి పరీక్షిస్తున్నది, ఇలా- ఏదీ మీ మనసుకు తెలియదు. మీ హృదయము దానినేమీ గ్రహించదు. అయితే గ్రహించడం ప్రారంభింపబడిన క్షణము మొదలుకొని, అదే దేవుడు మీకిచ్చిన మీ కాలము యొక్క ప్రారంభం. ఆ కొంతకాలాన్ని దేవుడు మీకు ఇచ్చాడు చూశారా! అదే యెహోవా మీకు దొరికే కాలము. మీకు పుట్టిన మీ కుమారుడు మీ మాటలు వింటున్నాడు అనుకోండి. మీ కుమారుడు అన్నీ గ్రహిస్తున్నాడని మీరు సంబరపడుతున్నారు చూసారా? ఆ క్షణము దేనికి ప్రారంభమనుకుంటున్నారు? తన తండ్రియైన దేవుణ్ణి తెలుసుకోవడానికి అదే ప్రారంభం. కానీ అది మిమ్మల్ని తెలుసుకోవడానికేమోనని మీరు భ్రమపడుతున్నారు. కానే కాదు. రుచిని తెలుసుకోవడానికి కాదు, ఆహార పదార్థాలు తెలుసుకోవడానికి కాదు, ఆటవస్తువులను తెలుసుకోవడానికి కాదు, స్కూల్ ఎక్కడుందో తెలుసుకోవడానికి కాదు, టి.వి.లో బొమ్మలు తెలుసుకోవడానికీ కాదు. కేవలం తనను పుట్టించిన దేవుణ్ణి తెలుసుకోవడం కోసమే అతని చెవికి, అతని హృదయానికి లింక్ ఏర్పడింది. ఈ సంగతి లోకానికి తెలుసంటారా? అందుకే దేవుడు, ఆయన నీతి మనుష్యుల నీతితో సమానమైనది కాదన్నాడు. మనుష్యుల నీతంటారా?

అది ఆయన నీతికి చాలా దూరం. ఒక కుమారునికి గాని, ఒక కుమార్తెకు గాని మాటలు రావడం మొదలవ్వగానే తల్లిదండ్రులు ఏమనుకుంటారో చెప్పండి? లోకనీతి ప్రకారం వీడికి అ, ఆ, ఇ, ఈ లు, ఎ, బి, సి, డి లు నేర్పించాలని, పాఠశాలను గూర్చి పరిచయం చేయాలని, లోకములో ఉన్న ఆయా కేరెక్టర్లను గూర్చి ఆ కుమారునికి పరిచయం చేయాలని, లోకజ్ఞానమంతా వాడికి నేర్పించాలని అనుకుంటున్నారు. కానీ దేవుడు ఆ కుమారునికి అవయవాలన్నీ అనుగ్రహించినది వీటి కొరకు కాదండి. ఎందుకొరకో చెబుతున్నాడు చూడండి.

**యెషయా 55 : 6–** "యెహోవా మీకు దొరకు కాలమందు ఆయనను వెదకుడి". యెహోవా మీకు దొరికే కాలము అప్పుడే ప్రారంభమైంది. ఎన్నిరోజులు మీరు దేవుణ్ణి వెదికారు. అలా ప్రారంభింబడిన రోజు నుండి, ఆ క్షణము నుండి ఎన్నిసార్లు మీరు దేవుణ్ణి వెదికారు ? ఇలా కాలము గడుస్తూ, గడుస్తూ ఒకానొక సమయంలో ఈ చెవికి, హృదయానికి ఉన్న లింక్ మరల తెగిపోతుంది. మీరు విషయాలను గ్రహించే శక్తి కొంతకాలానికి ఆగిపోతుంది. అంటే, యెహోవా మీకు దొరికే కాలము ఆగిపోయింది. అంటే మీరు భూమి మీద ఒక ఆకారముగా కనిపిస్తున్నారు కాని ముసలివారై పోయారు. మీ చెవైనా పనిచేయడం మానెయ్యొచ్చు, మీ కన్నైనా చూడటం మానెయ్యొచ్చు, మీ హృదయమైనా గ్రహించేశక్తిని కోల్పోవచ్చు. రోజులు గడుస్తున్న కొద్దీ మీ కాలము అయిపోతున్నదని మీరు గ్రహించుకోవాలి. యెహోవా మీకు దొరుకుతున్న కాలమిది. ఆ కాలములో దేవుణ్ణి వెదకడానికి మీరు ప్రయత్నము చేయాలి. ఆ కాలములో దేవుని నీతి ఏమిటో తెలుసుకోవడానికి మీరు ఆలోచించాలి, పరితపించాలి. దేవుడు ఈ కాలములోనే మీకు సమీపముగా ఉంటాడు. ఆ తరువాత రోజుల గడుస్తున్న కొద్దీ మీకు దూరమైపోతూ ఉంటాడు. అంటే మీరు ఆయనను వెదకలేరు. ఇక మీరు ఆయనను గ్రహించలేరు. ఎందుకంటే మీకివ్వబడిన సమయము ముగింపబడింది. **యెషయా 55 : 7** భక్తిహీనులు తమ మార్గమును వెదకడం లేదు గనుక వారు నా నీతిని గ్రహించడం లేదు. వారు భక్తిహీనులుగానే మిగిలిపోయారు. ఇప్పటికైనా భక్తిహీనులు తమ మార్గమును విడువవలెను. లోకములోనున్న భక్తిహీనులకు ఒక నీతి ఉంది. లోకానికి ఒక మార్గముంది, దేవునికి మరొక మార్గముంది. కానీ, మనిషి లోకమార్గాన్ని విడిచిపెట్టకపోతే చివరికి వచ్చే ఫలితం చాలా భయంకరంగా ఉంటుంది. దీనినే దేవుని జ్ఞానము ఘోషిస్తోంది. భక్తిహీనులు తమ మార్గములను విడిచిపెట్టవలెను. ఏమనుకున్నారండి క్రైస్తవ్యమంటే? ఏమనుకున్నారండి దేవుని జ్ఞానమంటే? ప్రపంచమంతా లోకనీతిని బట్టి క్రిస్టియానిటి అంటే ఒక రిలీజియన్ అనుకుంటున్నారు. క్రైస్తవ్యమంటే ఒక బలవంతపు మత మార్పిడి అనుకుంటున్నారు. కానే కాదు. క్రైస్తవ్యమంటే దేవుని నీతి. యేసుక్రీస్తు భూమి మీదకు వచ్చి తన శిష్యులకు నేర్పిస్తున్నదేమిటో తెలుసా? కేవలం దేవుని నీతిని. మత వ్యాప్తిని కాదు. యేసుక్రీస్తు బలవంతముగా ఎవ్వరినైనా ఎక్కడైనా నీటిలో ముంచమన్నాడా? బైబిల్‌లో మీరు చూడండి, పరిశోధించండి, వెదకండి. ఒక వేళ అలా చెప్పి ఉంటే క్రైస్తవ్యాన్ని మతము అనుకోవచ్చు. బలవంతముగా మతమార్పిడిలు చేసేది అనుకోవచ్చు. కానీ లేదే! ఎవరైతే హృదయపూర్వకంగా యేసుక్రీస్తును రక్షకునిగా నమ్ముతారో, అంగీకరిస్తారో, వేడుకుంటారో బాప్తీస్మము వారికే ఇవ్వమన్నాడు. బైబిల్‌లో ఒకసారి చూడండి. ఎందుకంటే ఈ ప్రపంచం అనుకున్నట్టుగా మీరు కూడా ఆ అవాస్తవాలనే నమ్మి మోసపోతున్నారేమో! క్రైస్తవ్యాన్ని గూర్చి ఒకవేళ అపోహపడుతున్నారేమో!!

**అపొ. కార్య. 2 : 37** ఒక అపొస్తలుడుగా, ప్రారంభ ప్రసంగీకుడుగా, దేవుని మాటలను ప్రకటిస్తున్న పేతురనే ఒక భక్తుడు దేవునినీతిని ప్రకటించినందుకు, ఆయన చేసిన వాక్యోపదేశానికి, ఆ రోజు విన్నటువంటి మనుష్యులు ఏమంటున్నారో, వారి నోరార వారు పలికిన మాటలను మీరు చూడాలి. వారు (అనగా దేవుని నీతిని వింటున్నవారందరు) ఈ మాటలు విని వారి హృదయములో నొచ్చుకున్నారు. వారి మనసుతో ఆలోచించారు. అందుకే వారు గ్రహించారు. అప్పుడు దేవుణ్ణి వెదికారు. అప్పుడు, మేమేమి చేతుమని పేతురును మిగిలిన అపొస్తలులను అడుగగా అని వ్రాయబడింది. వీరు అపొస్తలులను అడుక్కుంటున్నారండి. సహోదరులారా, మేమేమి చేతుము? మేము ఇప్పటి వరకు లోకనీతిని అనుసరించాము. దేవుని కుమారుని నమ్మకుండా భూమిమీద మేము అతిభయంకరమైన పాపములో ఉన్నాము. సాక్షాత్తూ తండ్రియైన దేవుడే తన కుమారుని భూమి మీదకు పంపించినప్పుడు మేము ఆయనను ఎరుగకుండా మా నీతిని స్థాపించుకున్నాము. మా కొరకు మేము ఆలోచించడం ప్రారంభించాము.

దానినే నీతి అనుకున్నాము. ఆ దేవుని నీతిని పేతురు నోట విన్న తరువాత, మరణిస్తే మరోబ్రతుకు పరలోకంలో మా తండ్రి దగ్గర ఉంటుందని, ఆత్మగా అక్కడ మేము కలకాలము సంతోషిస్తూ ఉండాలనే దేవుని నీతి కలిగిన జ్ఞానము మాకు అర్థమయ్యింది అంటున్నారు. సహోదరులారా, ఇప్పుడు మేము ఏమి చేయాలి? అని అడుగుతున్నారు. అప్పుడు పేతురు, మీరు మారుమనస్సు పొంది, పాప క్షమాపణ నిమిత్తము యేసుక్రీస్తు నామములో బాప్తీస్మమును పొందమన్నాడు. ఇందుకే సుమా! అంతేగానీ, వారందరినీ పేతురు బలవంతముగా తన వెంట తీసుకుని వెళ్ళాలని కాదు. బాప్తీస్మము పొందిన వారంతా పేతురు వెనక వస్తారని కాదు, తన మతస్థులు అవుతారని కాదు, ఆయన జట్టుగా మారతారని కాదు, ఆయనకు అన్ని విషయాలలో సపోర్ట్ చేస్తారనీ కాదు. అందుకే పేతురు చాలా స్పష్టంగా చెబుతున్నాడు. అది పేతురు మాట కాదు. పేతురును ఆవహించిన పరిశుద్ధాత్మ దేవుడు పలికిస్తున్న మాట. పేతురంటున్నాడు – మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తీస్మమును పొందమన్నాడు. ఏదో బట్టలు, రగ్గులు, బియ్యపు పంపిణీ, కందిపప్పు పంపిణీ నిమిత్తము కాదు. రోగాలకు స్వస్థత, ఆస్థులు వీటి కొరకూ కాదు. కష్టాలు, కన్నీళ్ళు పోతాయని వాటి కొరకు కాదు. పాప క్షమాపణ నిమిత్తము వినిన వారందరూ అడిగారు గనుక, పేతురు సమాధానమును చెప్పాలి గనుక చెబుతున్నాడు. వీరందరూ దేవుని నీతిలోనికి రావాలంటే, మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తీస్మము పొందాలి. అప్పుడు వారందరూ పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు. అంతేగాని, ఇక్కడ ఏమైనా పంపిణీలు, రాయితీలను గూర్చి పేతురు చెప్పాడా? బాప్తీస్మము తీసుకున్న ప్రతి ఒక్కరికి పప్పులు, ఉప్పులు ఏమైనా ప్రకటించాడా? ఒకవేళ సుఖసంతోషాలు కలుగుతాయని చెప్పాడా? లేనేలేదండి. కానీ ఈ ప్రపంచము దృష్టికి బైబిల్ వక్రీకరింపబడింది.

Christianity is not a Religion, but it is the Righteousness of God. బైబిల్‌లో ఉన్న మహాజ్ఞానము ఇప్పటివరకు మనుష్యులకు అందలేదు. ఎందుకంటే ఈ లోకనీతి, మనుష్యుల యొక్క స్వనీతి, దేవుని మహాజ్ఞానానికి అడ్డుపడింది. అందువల్ల అనేకులకు చేరవలసిన ఈ మంచి మాటలు ఇప్పటివరకు వారియొద్దకు వెళ్ళలేదు. దేవునిజ్ఞానమనే ముసుగులోనే అక్రమముగా లోకనీతి మనుష్యుల చెంతకు వెళ్ళిపోయింది. చాలామంది ఇప్పటికీ ఏమని ఆలోచిస్తున్నారంటే, క్రైస్తవ్యమనగానే వారి మదిలో పుట్టే ఆలోచన ఏమిటంటే, అదొక బలవంతపు మత మార్పిడి అనుకుంటున్నారు. అలాగని బైబిల్‌లో ఎక్కడా లేదే! బలవంతంగా మీరు నీటిలో ముంచాలని, బలవంతంగా జనులను ఈ క్రైస్తవ్యంలోనికి తీసుకుని రావాలని ఎక్కడా వ్రాయబడలేదు. ఒకవేళ అలా పొరబడి ఉంటే, అసలు దేవుడెలాంటివాడో తెలుసా? పరలోకానికి ఎంతమంది రావాలో ఎంతమంది వస్తారన్నాడో తెలుసా? ఒక రహస్యాన్ని ఆయన తన కుమారుని ద్వారా పలికించాడు. నిత్య జీవానికి అంగీకరింపబడేవారు చాలా తక్కువమంది అన్నాడు. నిజంగా అందరినీ ముంచేయాలనే ఉద్దేశ్యం ఆయనకుంటే పరలోకము మనుష్యుల ఆత్మలతో కిటకిటలాడిపోవాలి. పరలోకము పూర్తిగా నిండిపోవాలి. పాతాళము పూర్తిగా ఖాళీ అయిపోవాలి. కాని జరుతున్నదీ, దేవుడు పలికించినదీ దానికి విరుద్ధం! నిజానికి ఒకవైపు పాతాళము నిండిపోతుంది. నిత్య నరకాగ్ని భర్తీచేయబడుతోంది. దేవుని రాజ్యానికి వచ్చేవారు చాలా తక్కువమంది ఉంటారు. ఇక దేవుడు బలవంతంగా అందరిని మార్చాలని ఎందుకనుకుంటాడు చెప్పండి? తప్పుచేస్తే తన కుమారుని కూడా దేవుడు విడిచిపెట్టడు. అపొస్తలులను కూడా అక్రమము చేస్తే దేవుడు విడిచిపెట్టడు. దేవుని న్యాయవిధిని తప్పితే ఏ మనిషైనా ఆయనకు లెక్కలేదు. మొట్టమొదటి మనిషే(ఆదాము) లెక్కలేదాయనకి. దేవుని దగ్గర రిజర్వేషన్స్ లేవండి. దేవుని దగ్గర పక్షపాతం లేదండి. 700 కోట్ల మందిలో నుంచి నీతిమంతుడుగా ఒక్కడే వస్తాడా? అవును ఒక్కడినే రానివ్వండి అంటాడు. పాపాత్ములతో పరలోకమును నింపుకుందామని ఏమన్నా రాయితీలు ప్రవేశపెడదామని దేవుడనుకుంటున్నాడా? అక్రమకారులతో పరలోకమును భర్తీచేయడానికి ఏదైనా పథకమును దేవుడు వేసాడనుకుంటున్నారా? లేదండి. దేవుని నీతిలో బలవంతము లేదండి. దేవుని వాక్యములో పూర్తిగా స్వాతంత్ర్యముంది. అందుకే పెంతుకొస్తను పండుగనాడు, ఆ రోజు క్రైస్తవ్యానికి ప్రారంభమే అలా జరిగింది. మీలో ఎవరైతే హృదయపూర్వకంగా నమ్మారో, ఎవరైతే పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందాలనుకుంటున్నారో, వారు మాత్రమే నీటిలోనికి రావచ్చని పేతురుతోపాటు మిగిలిన అపొస్తలులు అంటున్నారు. అలా వచ్చినవారి సంఖ్య

ఆ రోజు ఇంచుమించు 3000 మంది. దేవుని వాక్యమనే నీతి లోకానికి నిజముగా ప్రకటింపబడిననాడు వేలకు వేలుగా, తండోప తండాలుగా మనుష్యులు దేవునియొద్దకు రావాలే తప్ప ఎవ్వరినీ బలవంతముగా తోలుకొని వెళ్ళవలసిన అవసరతలేదు. **యెషయా 55 : 6–** లో ఆయన పలుకుచున్న మాటను చూడండి. "భక్తిహీనులు తమ మార్గములను విడువవలెను. దుష్టులు తమ తలంపులను మానవలెను". ఇవన్నీ దేవుడు మన మంచి కొరకు చెబుతున్నటువంటి మాటలు, మనుష్యుల మేలును కోరి వ్రాయిస్తున్న మాటలు. తరువాత వారు యెహోవా వైపు తిరిగినయెడల ఆయన వారియందు జాలిపడును. వారు మన దేవుని వైపు తిరిగినయెడల ఆయన బహుగా క్షమించును. మీరు దేవుణ్ణి క్షమాపణ కోరుకోవాలి. ఎందుకంటే మీ నీతికి దేవుని నీతికి చాలా వ్యత్యాసమున్నది. మీరు స్థాపించుకున్నది, మీరు పాటించాలనుకున్నది దేవునికి నచ్చేది కాదు. అది అసలు దేవుని నీతే కాదు. **యెషయా 55 : 8** "నా తలంపులు మీ తలంపుల వంటివి కావు" అంటే భూమి మీద ఉన్న మనుష్యుల తలంపులు, దేవుని తలంపుల వంటివి కావు. భూమి మీద ఉన్న మనుష్యులు కొన్ని తలంపులతో, కొన్ని ఆలోచనలతో ఉంటారు. వారికంటూ ఒక నీతిని వారు నిర్ధేశించుకుంటారు. అయితే అది వారికి ఒక్క పైసా కూడా ప్రయోజనం చేకూర్చదు. వారి తలంపులు ఎందుకూ పనికిరానివి. తండ్రియైన దేవుని తలంపులంటారా, అవి మనుష్యులందరినీ నిత్యరాజ్యములోనికి తీసుకుని వెళతాయి. లోకనీతి దేవుని నీతికి ఎంత వ్యత్యాసమైనదో, దేవుని నీతి ఎంత ఉన్నతమైనదో ఈ పాఠము ద్వారా మీరు తెలుసుకోవాలి. ఈ కొద్దిమాటలో మీరు ఆలోచించండి. దేవుని తలంపులు జనుల తలంపులవంటివి కావు. దేవుని త్రోవలు జనుల త్రోవలవంటివి కావు. ప్రారంభం నుంచీ అనగా, మనిషి మనుగడ భూమి మీద ప్రారంభమైనప్పటి నుంచీ మనిషి అడుగుజాడలు వేరు, దేవుని అడుగుజాడలు వేరు. కాని మనుష్యులు ఎల్లప్పుడూ తమ తమ మార్గములలో ప్రయాణించడానికే ఆలోచిస్తున్నారు. తమ స్వంత నీతిని పాటించడానికే ప్రయత్నిస్తున్నారు. ఆ దేవుని నీతేమిటో ఒక్కసారి కూడా చూడలేకపోతున్నారు. దేవుని మార్గము ఎలా ఉంటుందో ఒక్కసారి కూడా ఆలోచించలేకపోతున్నారు. దేవుడు తన గ్రంధములో వ్రాయిస్తున్న ఆయన ఆవేదన చూడండి.

**యెషయా 55 : 9** "ఆకాశములు భూమికిపైన ఎంత ఎత్తుగా ఉన్నవో, మీ మార్గముల కంటే నా మార్గములు, మీ తలంపుల కంటే నా తలంపులు, అంత ఎత్తుగా ఉన్నవి" అంటున్నాడు. మనిషి నీతికీ దేవుని నీతికీ వ్యత్యాసం ఎంత? అని దేవునినడిగితే, చాలా ఎక్కువ అంటున్నాడు. అంటే ఈ రెండు నీతులూ దగ్గర దగ్గరగా ఉన్నవి కావు. లోకనీతి, దేవుని నీతి ఒకే రూట్‌లో ఉన్నవి కావు. లోకములో ఉన్నది కూడా నీతిలాగే ఉంది అని ఒకవేళ మనము అనుకోవచ్చు. లోకములో చాలా సిద్ధాంతాలు, చాలా పద్ధతులు ఉన్నాయి. వీటిని మనము పాటిస్తే మనము పరలోకానికి వెళ్ళిపోతామేమో, దేవుని అడుగుజాడల్లో ఉన్నట్టేనేమో, మనము నీతిమంతులమేనేమో అనుకుంటున్నారు చాలామంది. కానే కాదండి. ఈ లోకము దగ్గరకు మనము వెళితే లోకనీతి మనకు ఏమని చెబుతుంది? నీవు ఈ భూమి మీద సుఖసంతోషాలతో బ్రతకాలి. ఆయురారోగ్యాలతో బ్రతకాలి. అదే అసలుసిసలైన నిజమైన బ్రతుకు అని చెబుతుంది. ఒకవేళ ఒకడు దరిద్రుడుగా ఉన్నాడనుకోండి. ఒకవేళ ఒకడు రోగముతో ఉన్నాడనుకోండి. అతడు ఎందుకలా ఉన్నాడో, ఏ పరిస్థితుల వల్ల అలా అయిపోయాడో లోకానికి పట్టింపులేదు. కానీ ఆ వ్యక్తిని చూసి ఏమంటుంది? ఇతనొక దరిద్రుడు, ఇతనొక పేదవాడు, ఇతడు ఎందుకూ పనికిరానివాడు అని అంటుంది. ఒకడు ధనవంతుడై ఆస్తిని సంపాదించుకుంటుంటే వాడిని చూసి లోకమేమంటుంది? వీడు ఐశ్వర్యవంతుడు, వీడు అదృష్టవంతుడు, వీడు చాలా గొప్పవాడు, వీడు చాలా ఉన్నతుడు, వీడు నీతిమంతుడు అని అంటుంది. తన జ్ఞానాన్ని అనుసరిస్తున్నవారికి లోకము చెబుతున్న సంగతులు చూడండి. ధనాన్ని సంపాదించుకోవడం వల్ల, భూమి మీద పేరు ప్రఖ్యాతులతో ఉండడం వల్ల, బందీ బలగంతో ఉండడం వల్ల, అధికారముతో ఉండటం వల్ల ఈ రోజు మనిషి ఈ లోకము దృష్టిలో నీతిమంతుడయ్యాడు. కాని అదే ధనవంతుణ్ణి చూసి దేవుడు ఏమంటున్నాడో తెలుసా? అదే ఆరోగ్యంతో ఉన్నవాడిని, బలముతో, అధికారముతో ఉన్నవాడిని దేవుడు ఏమంటున్నాడో ఒక్కసారి చూడండి.

**మత్తయి 19 : 23** "ధనవంతుడు పరలోక రాజ్యములో ప్రవేశించుట దుర్లభము అన్నాడు". ఈ వాక్యము లోకనీతిలో ఎక్కడైనా మనకు కనిపిస్తుందా? కనిపించదు. ఎందుకంటే అది పనికిరానిదని దేవుడు ముందే అన్నాడుగా!

భూమి నుండి ఆకాశం ఎంత ఎత్తుగా ఉన్నదో, మీ నీతి నా నీతికి అంత దూరముగా ఉందన్నాడు. లోకనీతి, దేవుని నీతి – ఈ రెండూ ఒకే మార్గములో వెళుతున్నవి కావు. రెండింటికి పోలికలు లేవు. ఈ రెండూ చాలా వ్యత్యాసమైనవి, చాలా భిన్నమైనవి. ఇక్కడ ఒక విషయాన్ని మీరు నిర్ధారించుకోవాలి. అదేమిటంటే, లోకములో మనుష్యుడు స్థాపించిన ఏ నీతి అయినా, అది బైబిల్‌లో కానిదైతే, దేవుడు చెప్పనిదైతే, ఏ మనిషి చెప్పినదైనా సరే, అది అవాస్తవమే! అది అసత్యమే. అది దేవునికి దూరమైనదే. అది నిత్య నరకాగ్నికి మనిషిని తీసుకుని వెళ్ళిపోయేదే. లోకములో నీకొక ఇల్లు, లోకములో నీకొక కారు, లోకంలో నీకొక మంచి వసతి, లోకములో నీకు మంచి పేరు, లోకంలో నీకు బోలెడు బ్యాంక్ బ్యాలెన్స్... ఇలా ఇవన్నీ ఉండడంతో ధనవంతుడు అనే పేరు నీకొచ్చింది. భాగ్యవంతుడు అనే పేరు నీకొచ్చింది. ఐశ్వర్యవంతుడనే పేరు నీకొచ్చింది. నీవు నీతిమంతుడవా? నీవు పరలోక రాజ్యానికి వెళ్ళగలవా? యేసుక్రీస్తువారు చెబుతున్న మాటలు చూడండి. తన శిష్యులను చూచి, ధనవంతుడు పరలోక రాజ్యములో ప్రవేశించుట దుర్లభమని వారితో నిశ్చయముగా చెప్పెను. ఇది ఖచ్చితం అన్నాడు. ఇది యేసు కాలములో మాత్రమే కాదు. యేసుకు ముందటి కాలములోనూ, యేసు తరువాతి కాలములోనూ, ఏ కాలమందైననూ ఇది ఖచ్చితమైనది. అదేమిటంటే, ధనవంతుడు పరలోక రాజ్యములో ప్రవేశించుట దుర్లభము, కష్టము. ఇదిగాక, ధనవంతుడు పరలోక రాజ్యములో ప్రవేశించుట కంటే సూది బెజ్జములో ఒంటె దూరుట సులభమని వారితో చెప్పెను. ఇక్కడ పోలికగా ఒక ఉపమానాన్ని చెబుతున్నాడు. ఎందుకంటే, అప్పుడున్న శిష్యులకు, ఇప్పుడున్న మనందరికీ ఇది అర్థమవ్వాలి. భవిష్యత్తులో మనుష్యులు లోకనీతిని అనుసరించి, దేవుని జ్ఞానాన్ని ప్రక్కకునెట్టి ధన సంపాదనలో ఉంటారేమోననే ఆలోచనతో యేసుక్రీస్తు శిష్యులకు నేర్పిస్తున్న ఒక మంచి సంగతేమిటంటే, పరలోకరాజ్యములో ధనవంతుడు ప్రవేశించలేడు. మరి లోకనీతిని అడిగితే, ఒక దరిద్రుని మాటలు వింటారా? ఒక రోగగ్రస్థుని మాటలు వింటారా? ఒక బలహీనుని మాటలు వింటారా? ఇదే లోకము మనలను ప్రశ్నించే తీరు. దేవుని జ్ఞానమెవరి దగ్గర ఉన్నదో, దేవుని మాటలను ఎవరు ప్రకటిస్తున్నారో, ఒక ఆత్మను రక్షించగలిగిన సామర్థ్యం ఎవరి దగ్గర ఉన్నదో వారి మాటలను నీతిమంతుల మాటలుగా ఈ లోకము స్వీకరించదు. లోకములో ఎవరికి పేరున్నదో, ఎవరికి అధికారమున్నదో, ఎవరికి ధనమున్నదో, ఎవరికి పలుకుబడున్నదో వారి మాటలే స్వీకరించాలనుకునే గ్రుడ్డి లోకమిది. అందుకే దేవుడు ఈ లోకనీతిని అనుసరించవద్దన్నాడు. అది మనుష్యుల దృష్టిలో ఘనమైనది కావచ్చు. కానీ దేవుని దృష్టిలో అసహ్యమైనది.

**లూకా 16 : 15** ప్రకారము, యేసుక్రీస్తు – "మీరు మనుష్యుల ఎదుట నీతిమంతులని అనిపించుకొనువారు కాని దేవుడు మీ హృదయములను ఎరుగును" అన్నారు. మనుష్యుల ఎదుట నీతిమంతులని అనిపించుకుంటున్నారు అన్నారంటే, ఈ లోకములో నీతి ఉన్నది కాబట్టే కదా! మనుష్యులు లోకము ఎదుట, లోకము చేత నీతిమంతులు అనిపించుకొనగోరుచున్నారు. లోకనీతిని అనుసరించేవారందరిని ఈ లోకము నీతిమంతులని అంటుంది. అందువలన ఆయన పలుకుతున్న మాటలు చూడండి. ఆయన– మీరు మనుష్యుల ఎదుట నీతిమంతులని అనిపించుకొనగోరువారు కానీ దేవుడు మీ హృదయములను ఎరుగును. లోకనీతిని బట్టి, మనిషి హృదయ అంతరంగాన్ని ఈ లోకము చూడలేదు. పైన వేషధారణను మాత్రమే చూడగలదు. మనిషికి తెలిసిందంతే. మనిషి వినగలిగిందంతే! కాని దేవుడు చూసేది మనిషి హృదయాన్ని, అతని అంతరంగాన్ని! మనుష్యులు చూసేదంతా పైపైన ఉండే రంగును మాత్రమే. పైకి చెప్పే మాటలను మాత్రమే చూస్తారు. కాని లోతులకు వెళ్ళి పరిశోధించరు. ఎందుకంటే వారికంత సామర్థ్యం లేదు. హృదయాన్ని పరిశోధించగలిగినంత పరిజ్ఞానము వారి దగ్గర లేదు. అయితే దేవుడు మనుష్యుల హృదయములను చూస్తాడు. అదే ఆయన నీతిలో ఉన్న గొప్పతనము. దేవుడు ప్రతి ఒక్కరి హృదయములను ఎరుగును. మనుష్యులలో ఘనముగా ఎంచబడునది దేవుని దృష్టికి అసహ్యమైనదన్నాడు. లోక నీతికి, లోకమందున్న మనుష్యుల దృష్టికి ఒక వ్యక్తి ధనవంతుడైతే అతడు నీతిమంతుడు కావచ్చు. కాని అది లోకనీతిలో ఘనముగా ఎంచబడినంత మాత్రాన అది దేవుని దృష్టికి ఘనమైనది అనుకుంటే, నీతి అనుకుంటే, చాలా పొరపాటు. దేవుని దృష్టికి అది అసహ్యమైనది అన్నాడు. అంటే దేవుడు అలాంటివారిని పట్టించుకోడు. అది ఆయనకు సంబంధించినది కాదంటాడు. మరి ఆయనకు కావలిసినదేది? ఆయన దృష్టిలో నీతియేది? దేవుని నీతిని అనుసరించే నీతిమంతుడెవరు అంటే, ఆయన ఇష్టాన్ని

నెరవేర్చి, ఆయన కొరకు బ్రతికేవాడే నీతిమంతుడు. ఇదిగో అలా బ్రతికినవాడే ఆ తరువాత సందర్భంలో మనకు కనిపిస్తున్నాడు. ధనవంతుడొకడుండెను. లాజరను ఒక దరిద్రుడు ఉండెనని చెబుతున్నాడు. ఒక ఉపమానముగా, జరిగిన ఒక యదార్థ సంఘటనను యేసుక్రీస్తు వివరిస్తున్నాడు. ధనవంతుణ్ణి ఈ లోకమంతా తన లోకనీతిలో గొప్పవానిగా ఎంచింది. భాగ్యవంతునిగా ఎంచింది. అనేక సంవత్సరములకు విస్తారమైన ఆస్తిని సంపాదించిన ఒక గొప్ప ఐశ్వర్యవంతునిగా ఈ లోకము చూచింది. అదే కాలములో ఆ ధనవంతునితో పాటు ఒక దరిద్రుడు కూడా ఉన్నాడు. అదే కాలములో కురుపులతో నిండిన లాజరు అనేటువంటి మరొక వ్యక్తి కూడా ఉన్నాడు. వాడిని ఈ లోకము పట్టించుకోలేదు. కానీ దేవుని నీతి వాడినే దృష్టించింది. దేవుని నీతి వాడినే పట్టించుకుంది. దేవుని జ్ఞానము వాడికే తన గ్రంథములో చోటిచ్చింది. ధనవంతుని గూర్చి దేవుడు పట్టించుకోలేదండి. ఎలా చెప్పగలనంటే, ధనవంతుని పేరు ఏమిటో వ్రాయించడానికి కూడా దేవునికి ఇష్టము లేదు. వాడి సందర్భము ఎక్కడ వచ్చినా, ధనవంతుడు, ధనవంతుడు, ధనవంతుడు అని అన్నాడే తప్ప, వాడి పేరు మచ్చుకైనా ప్రస్తావించలేదు. లోకనీతిపరులంటే దేవునికంత అసహ్యము. కాని లాజరును మాత్రం మొదటి నుంచీ పేరు పెట్టి పిలుస్తూ, ఆ లాజరు దేవుని కుమారునిగా భూమి మీద బ్రతికినట్టుగా వ్రాయించాడు. అతడు దేవుని నీతిని మాత్రమే పాటించాడు గాని లోకనీతిని కాదు. అందుకే లాజరు చనిపోతే ఆహ్వానానికి దేవదూతలు వెళ్ళాలి. అతనిని తీసుకొని వెళ్ళి అబ్రహాము రొమ్మున అతనిని కూర్చోబెట్టాలి. అతనికి నిత్య జీవాన్నివ్వాలి. ఇక ధనవంతుడంటారా, వాడికి మరణించిన వెంటనే వేదన ప్రారంభమైంది. భూమి మీద లోకము దృష్టిలో వాడు నీతిమంతుడైనా, పాతాళానికి వెళ్ళేసరికి, దేవుని చట్టపరిధిలోనికి వాడు వెళ్ళేసరికి, వాడు అన్యాయస్థుడుగానే మిగిలిపోయాడు. దేవుని నీతిని పట్టించుకోని ఒక దౌర్భాగ్యుడుగా దిగజారిపోయాడు. అలాంటి నీతి మనకవసరమంటారా? ఈ లోకంలో ఉన్న లోకనీతి 60, 70 సంవత్సరాల మట్టుకే మన దృష్టికి కనిపిస్తుంది. కన్నుమూసిన వెంటనే ఈ లోకనీతి మరుగైపోతుంది. ఆ తరువాత మనలను రక్షించవలసింది, మరో లోకానికి మనలను చేర్చాల్సిందీ దేవుని జ్ఞానమే. అందుకే దేవుడు తన గ్రంథములో దానినిగూర్చి మాత్రమే వ్రాయించాడు.

ఒక కుమారుడు పుట్టగానే వాడిని బాగా చదివించాలనుకుంటారు. ఆ తరువాత ఉద్యోగము చేయించాలనుకుంటారు. పెళ్ళి చేయాలనుకుంటారు. ఆ తరువాత వాడు పిల్లల్ని కంటే చూడాలనుకుంటారు. వాడిని ఒక కుటుంబముగా చూచి ఆనందించాలనుకుంటారు. ఇది భూమి మీద లోకనీతిపరంగా ఒక వ్యక్తికి ఈ లోకము నేర్పిస్తున్న పనికిరాని పాఠం. నువ్విలాగే ఉండాలని, ఇలా ఉంటేనే నువ్వొక మంచి వ్యక్తివని, సమాజానికి ఉపయోగపడే వ్యక్తివని చెబుతుంది. దేవుని జ్ఞానమును నేర్చుకుంటున్నావా, నీవు వెర్రివాడవా? అంటాడొకడు. దేవుని జ్ఞానము నేర్చుకుంటావా, నీవు ఒక మతంలోకి వెళ్ళిపోతున్నావా? అంటాడు మరొకడు. దేవుని జ్ఞానము దగ్గరకు వెళుతున్నావా, నీకు పనీ పాటా ఏమీ లేదా? అంటాడొకడు. దేవుని కార్యక్రమాలు చేస్తున్నావా, దాని ద్వారా పైసలేమైనా సంపాదిస్తున్నావా? అంటాడు మరొకడు. ఈ రోజున్న లోకము దేవుని నీతికి పెట్టిన పేరు ఇదే! ఈ రోజున్న మానవ సమాజము నిజమైన దేవుని నీతిని ఇలాగే నిందిస్తుంది. అంతేగాని, దేవునిజ్ఞానము దగ్గరకు వెళ్ళేవారిని గూర్చి నిత్యజీవానికి వెళ్ళవలసిన నిత్యజీవవారసులండి వీరందరు, నిత్యజీవానికి ఆశపడి ఇలా బ్రతుకుతున్నారని, నిత్యజీవానికి పరుగులు పెడుతున్నారని లోకములో ఉన్న ఏ ఒక్కరైనా అనుకుంటున్నారా? లేదండి. ఎందుకంటే వారు లోకనీతి అనే ఆ ముసుగులోనే ఉన్నారు. ఆ భయంకరమైన మాయలో ఉన్నారు. దేవునిజ్ఞానము వారికి పట్టడం లేదు. నీమట్టుకు నీవు చదువుకోవాలి, నీమట్టుకు నీవు ఉద్యోగం చేయాలి, నీమట్టుకు నీవు ఈ భూమి మీద ఆస్తులు సంపాదించుకోవాలి. నీమట్టుకు నీవు గొప్పవాడివి కావాలి అని ఈ లోకము మనుష్యులను మత్తులో పడేసింది. ఇప్పుడు అందుకే అందరూ ఆ పనిలోనే ఉన్నారు. దేవుని నీతిని వినేటంత తీరిక, ఓపిక ఈ మానవాళికి లేవు. ఈ లోకము ఒకడిని బుద్ధిమంతుడు అనాలంటే ఎవరినంటుంది? బుద్ధిమంతునిగా ఎవరిని అభివర్ణిస్తుంది? బాగా చదువుకుని, మంచి ర్యాంకులు సంపాదించి, మంచి ఉద్యోగం చేసి, లక్షల్లో సంపాదించి, అతికొద్ది కాలములోనే బాగా స్థిరపడిపోవాలి. అలాంటివాడిని ఈ లోకము బుద్ధిమంతుడు అంటుంది. ఎటువంటి చెడు అలవాట్లు లేవు, బాగా సంపాదించుకుంటున్నాడు కనుక అతడే బుద్ధిమంతుడని చెబుతుంది. మీరు కూడా

ఇప్పటివరకు అలాగే ఆలోచించి ఉండాలి. వినడానికి కూడా అదెలా ఉంది చెప్పండి? అవును. ఏ అలవాట్లు లేవట, మంచివాడట, బుద్ధిమంతుడట, బాగా సంపాదిస్తాడట, ఎక్కడా ఖర్చు చేయడట, తన మార్గంలో మంచిగా వెళ్ళిపోతున్నాడట, చాలా మంచవాడట, నీతిమంతుడట, లోకనీతి ఇదే కదండి చెప్పింది. కాని నీతిమంతునికి దేవుడిచ్చే నిర్వచనం (Definition) ఒక్కసారి చూడండి. బుద్ధిమంతుడెవడో దేవుడు చెప్పిన మాటను పరిశీలిచండి.

**సామెతలు 15 : 24** "క్రిందనున్న పాతాళమును తప్పించుకొనవలెనని బుద్ధిమంతుడు పరమునకు పోవు జీవమార్గమున నడుచుకొనును". బుద్ధిమంతుడైతే క్రిందనున్న పాతాళమును తప్పించుకోవాలని, అతడు పరమునకు పోవు జీవమార్గమున నడుచుకొనునని చెబుతున్నాడు. దేవుని నీతి ప్రకారము బుద్ధిమంతుడంటే వీడేనండి. లోకములో ఈ నిర్వచనం ఎక్కడైనా ఉందా? ఎవరైనా ఈ నిర్వచనాన్ని చెప్పారా? ఒక బుద్ధిమంతుడంటే ప్రతిరోజు అతడు పరలోకమును గూర్చి ఆలోచించాలని, పరమునకు పోయే మార్గాన్ని అన్వేషించాలని భూమి మీద ఎవ్వరూ చెప్పలేదే! బాగా చదువుకోవాలని చెప్పారు, ఆ చదువుతో ఉద్యోగాన్ని సంపాదించాలని చెప్పారు, ఆ ఉద్యోగంతో పెళ్ళి చేసుకోవాలి, పిల్లల్ని కనాలి, భూమి మీద ఆస్తులు బాగా సంపాదించాలని చెప్పారు. ఛీ... వాడు బుద్ధిమంతుడా? అని దేవుడన్నాడు. దేవుని దృష్టిలో ఇది బహు అసహ్యమైనది. మరి ఏది ముఖ్యమైనది? దేవుని దృష్టిలో నీతిమంతుడు చేయవలసిన కార్యక్రమం ఏమిటి? భూమి మీద ఇలాంటి వారందరు బుద్ధిమంతులు, నీతిమంతులు అనుకుంటున్నారా? వారందరు బుద్ధిహీనులు, మరియు క్రిందనున్న పాతాళానికి పోయేవారు. వాడెంతో గొప్ప ర్యాంకర్ అవ్వొచ్చు, కానీ అదంతా బట్టీ పట్టి వ్రాసిందే కదా! ఎవడో ఒకడు ప్రకృతిలో కొంత దానిని చూచి పుస్తకాలు వ్రాసాడు. ఆ పుస్తకాలలో కొంత నేర్చుకుని వాడు పరీక్ష పేపర్ వ్రాసాడు. వాడు చదువుకున్న ప్రశ్నలే అందులో వచ్చాయి. ఒకవేళ కఠినమైన ప్రశ్న వస్తే వాడికి వ్రాయడం చేతకాదు. చదివిందే వచ్చింది, వాడి పంట పండింది, వాడికి మొదటి ర్యాంకు వచ్చింది. వాడి ఫోటో పేపర్‌లో! అంతేనంటారా? ఇలాంటివాడు నీతిమంతుడా? బుద్ధిమంతుడా? బంతి కరెక్ట్‌గా బ్యాట్‌కి తగిలింది గనుక సిక్సరు వెళ్ళిపోయింది గనుక వీడు గొప్పవాడు, దేశ కీర్తిని నిలబెడుతున్నాడు. అదే వికెట్‌లకి తగిలేసిందనుకోండి చప్పట్లు కొట్టినవాళ్ళే రాళ్ళతో కొడతారు. మరి వీడూ బుద్ధిమంతుడేనా? మీరు బాగా అర్థం చేసుకోవాలి. ఎవరు నీతిమంతులు, ఎవరు గొప్పవారు? ఈ లోకము ఎవరిని నీతిమంతులుగా అభివర్ణించింది? ఎవరిని గొప్పవారుగా అందలానికెక్కిస్తుంది? పరమునకు పోవు మార్గాన్ని అన్వేషించేవారినా? కానే కాదండి! బాగా చదివేవాడు, బాగా క్రీడలు ఆడేవాడు, బాగా కారు నడిపేవాడు, బాగా నటన చేసేవాడు, బాగా ఉద్యోగం చేసేవాడు, బాగా సంపాదించేవాడు, బాగా రాజకీయం చేసేవాడు... ఇలాంటి వారందరిని చూచి వీరే బుద్ధిమంతులు, నీతిమంతులు అని అనుకుంటున్నారా? కాదండి. క్రిందనున్న పాతాళమును తప్పించుకొనవలెనని బుద్ధిమంతులు పరమునకు పోయే జీవమార్గాన్ని వెదుకుతారు. వారే అసలైన బుద్ధిమంతులు. చూసారా! దేవుని నీతికి, లోకనీతికి ఎంత వ్యత్యాసముందో? అందుకే భూమికి ఆకాశానికి ఒకవేళ మీరు కొలత వేస్తే అది ఎంత ఎత్తుగా ఉంటుందో, ఎంత దూరముగా ఉంటుందో, నా మార్గము, నా ఆలోచన, నా జ్ఞానము – మీ మార్గములకు, మీ జ్ఞానానికి, మీ నీతికి అంత దూరంగా ఉంటుంది అన్నాడాయన. ఈ రోజు మనుష్యుల మీద ఆధారపడాలని మనుష్యుల కనుసన్నలలో బ్రతకాలని మనిషి చెప్పిన దానిని నెరవేర్చాలని అందరూ భ్రమపడుతున్నారండి. అది లోకనీతి సుమా! ఈ లోకనీతి అనే ముసుగులో మీరు ఉండిపోతే దేవుని జ్ఞానము ఎప్పటికీ మీకు అర్థం కాదు, ఎప్పటికీ మీకు తెలియదు. **1 కొరింథీ 1:21** ప్రారంభ శతాబ్దంలో పౌలు కొరింథీయులకు వ్రాస్తూ ఒక చక్కని మాటన్నాడు చూడండి. "దేవుని జ్ఞానానుసారముగా లోకము తన జ్ఞానము చేత దేవునిని ఎరుగకుండినందున సువార్త ప్రకటనయను వెఱ్ఱితనము చేత నమ్మువారిని రక్షించుట దేవుని దయాపూర్వక సంకల్పమాయెను". అదిగో ఈ రోజుకీ అదే జరుగుతున్నది. ఈ సువార్త ప్రకటన దేవుని జ్ఞానానుసారముగా జరుగుతున్నది. మనిషి ఆలోచనలను బట్టి మాత్రము కాదు. భూమి మీద లోకనీతిని బట్టి అస్సలు కాదు. అందుకే లోకము దీనికి పూర్తిగా వ్యతిరేకం, లోకము దీనికి నూటికి నూరు శాతము విరోధి. నేనేదో పిచ్చి వ్రాతలు వ్రాసుకుంటున్నానని అనుకుంటున్నారు. ఎందుకంటే వారు తమ అజ్ఞానముచేత, వెఱ్ఱితనము చేత, దేవుని జ్ఞానమును చూడలేకపోతున్నారు. ఈ విషయమును దేవుడే ధృవీకరించాడు. "దేవుని జ్ఞానానుసారముగా లోకము తన జ్ఞానము

చేత దేవునిని ఎరుగకుండినందున" – లోకాన్ని రక్షించడానికి తన జ్ఞానమును దేవుడు ప్రకటించాలనుకున్నాడు, అదే సువార్త లేక మంచివార్త అన్నాడు. ఈ లోకాన్ని రక్షించాలంటే దేవుని జ్ఞానమునే ప్రకటించాలన్నాడు. ఇంత వ్యత్యాసమైన దూరములో ఉండిపోయిన దేవుని జ్ఞానము మనుష్యులకు చేరువ కావాలంటే ఆయన మాటలు తప్పనిసరిగా ప్రకటింపబడాలి. **1 కొరింథీ 1 : 22** ప్రకారము "యూదులు సూచక క్రియలు చేయమని అడుగుతున్నారు. గ్రీసు దేశస్థులు జ్ఞానమును వెదకుచున్నారు. అయితే మేము సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటించుచున్నాము. ఆయన యూదులకు ఆటంకముగాను, అన్యజనులకు వెర్రితనముగాను ఉన్నాడు కానీ యూదులకేమి, గ్రీసుదేశస్థులకేమి పిలువబడిన వారికి క్రీస్తు దేవుని శక్తియును, దేవుని జ్ఞానమునై యున్నాడు". యేసుక్రీస్తు దేవుని శక్తిగా, దేవుని జ్ఞానముగా మనకు కనిపిస్తున్నాడు. కానీ మీరేమి వెదకుచున్నారు? ఈ లోకము ఏమి వెదకుచున్నది? జ్ఞానమును వెదకుచున్నారా? ఇంకేమైనా వెదకుచున్నారా? ఈ రోజు నిజంగా లోకము వెదికేవి ఏమిటో చూడండి. అవి ఎన్నెన్ని ఉన్నాయో... అంతరిక్షములోనికి ఉపగ్రహాలను పంపిస్తున్నారు, ఏమి వెదకమని? ఈ ఉపగ్రహాలు విశ్వంలోని గ్రహాల చుట్టూ తిరుగుతున్నాయి. ఏమి వెదకాలని? దేవుణ్ణి వెదకలేని ఈ బుద్ధిహీనులు, గ్రహాలలో ఏదో వెదకాలని ప్రయత్నిస్తున్నారంటే వీడి అవినీతి ఎంత తారా స్థాయికి వెళ్ళిపోయిందో మీరు ఆలోచించాలి. వీరి అజ్ఞానం ఎంతగా అధోపాతాళానికి వెళ్ళిపోతున్నదో మీరు గమనించాలి. ఈ రోజు ప్రస్తుతం లోకానికున్న నీతి అదేనండి. భూమి మీదకు తల్లిగర్భములో నుండి బయటకు వచ్చిన నీవు, మొట్టమొదట ఎవరిని వెదకాలో తెలుసా? నీ పరలోకమందున్న తండ్రినే వెదకాలి. తల్లిగర్భములో నీకు అవయవాలను రూపించినవానినే వెదకాలి. నీకు ఈ బ్రతుకును ప్రసాదించిన వానినే వెదకాలి. ఈ దేహాన్ని విడిచిపెట్టిన మరుక్షణం మరో లోకానికి నిన్ను ఆహ్వానించేవానినే నీవు వెదకాలి. ఆ వెదుకులాటనే తన నీతిగా, తన జ్ఞానముగా దేవుడు చెబుతున్నాడు. అందుకే అయన నన్ను వెదికేవారు ఎక్కడున్నారంటున్నాడు. ఆనాడు యూదులు ఏమి అడుగుతున్నారో చూడండి. సూచక క్రియలను చేయుమని అడుగుచున్నారు. గ్రీసు దేశస్థులేమో జ్ఞానమును వెదకుచున్నారు. మరి ఆనాటి నీతిమంతులేమి ప్రకటిస్తున్నారు? వారు సిలువ వేయబడిన యేసుక్రీస్తును ప్రకటిస్తున్నారు. దేవుని జ్ఞానముగా, దేవుని శక్తిగా ఉన్న యేసుక్రీస్తునే ప్రకటిస్తున్నారు. ఎందుకంటే మీరు ప్రకటించేవి, మీరు వెదికేవి, మీరు వింటున్నవి, ఇవన్నీ లోకపు నీతిగా ఇదంతా నాశనానికి వెళ్ళిపోతుంది. లోకమందు ఎక్కడ మనకు నీతి కనిపిస్తుంది? ఎందులోనైనా సరే నీతిని చూపించండి? లేదండి. బాగా సంపాదించుకుని ధనవంతుడైన తరువాత ఆ ధనవంతుడు తన ఆస్తిలో తనకు సరిపడేంత ఉంచుకుని మిగిలినదంతా దానం చేస్తాడని చెప్పగలరా? అది నీతి అని మీరు అనుకుంటున్నారా? ఒక లక్ష రూపాయలు సంపాదించి, 10 రూపాయలు దానం చేసేస్తే అది నీతి అని అనుకుంటున్నారా? ఈ లక్ష ఎక్కడ నుండి సంపాదించావు బిడ్డా? అందరిని దోచుకుని లక్ష రూపాయలు సంపాదించి, ఒకడికి 10 రూపాయలు దానం చేస్తావా? దానినే నీతంటావా? ఓ అనీతిపరుడా, సమానత్వం అంటే ఏమిటో నీకు తెలుసా? భూమి మీద సమానత్వం అనే పదానికి అర్థం ఎవ్వరికీ తెలియదు. ప్రభుత్వానికి కూడా తెలియదు. దేవుని జ్ఞానము ప్రభుత్వానికి తలకెక్కిందా? లేదండి. అందుకే వారు అసెంబ్లీలో కూర్చుంటే వారి నోట నుండి వచ్చే పదాలను ఎవ్వరూ వినలేకపోతున్నారు. ఈ రోజు మీడియా కూడా ఆ బూతులు వినలేక భయపడుతుంది. వారు ఎలా తిట్టుకుంటున్నారో ఆ మాటలు ప్రసారం చేయడానికి మీడియా కూడా సిగ్గుపడుతోంది. అంత భయంకరమైనవారు ఈ రోజు మన ప్రభుత్వ అసెంబ్లీలో కూర్చున్నారు. అది రాష్ట్ర అసెంబ్లీ కావచ్చు, దేశ అసెంబ్లీ కావచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎన్నో దేశాల ప్రభుత్వ అసెంబ్లీలు కావచ్చు. ఒక పాపిని వాని తప్పు మార్గము నుండి మళ్ళించువాడు మరణము నుండి ఒక ఆత్మను రక్షించి అనేక పాపములు కప్పివేయునని తాను తెలుసుకొనవలెను. ఒక పాపిని వాని తప్పు మార్గమునుండి తప్పించువాడే అసలుసిసలైన నీతిని పాటిస్తున్నవాడు, అసలుసిసలైన దానమును చేస్తున్నవాడు. లోకనీతినుండి లోకమును మళ్ళించువాడు అతడే! అలాంటివారు భూమి మీద ఉండాలి. భూమి మీద అలాంటి వారు ఇంకా రావాలి. అలాంటివారున్నప్పుడే దేవుని జ్ఞానమంటే ఏమిటో ఈ లోకానికి తెలుస్తుంది. దేవుని మార్గమంటే ఏమిటో లోకము చూడగలుగుతుంది. అప్పుడు కొందరినైనా రక్షించగలిగిన వారమౌతాము. నీతి మార్గము లోనికి తీసుకుని రావాలంటే

పాపిని వాని తప్పు మార్గము నుండి మళ్ళించాలి. మరణము నుండి ఒక ఆత్మను రక్షించి, వానియొక్క అనేక పాపములను కప్పివేయాలని మనము తెలుసుకొనవలెను అంటున్నాడు చూడండి. ఇప్పటివరకు లోకనీతిని అనుసరిస్తున్నవారిలో ఎంతమందిని దేవుని నీతిలోనికి మీరు మళ్ళించారు చెప్పండి. లోకనీతిలో మగ్గిపోతున్న వారిని, దానినే అసలైన నీతి అనుకుని భ్రమపడుతున్నవారిని, దానితో అడ్జస్ట్ అయిపోయినవారిని, మేము చక్కని మార్గములోనే ఉన్నామని భ్రమపడుతున్నవారిని, ఎంతమందికి దేవుని వాక్యాన్ని చెప్పి, ప్రకటించి, వారిని ఆ తప్పుడు మార్గము నుండి మళ్ళించి, వాని ఆత్మను నిత్య మరణము నుండి తప్పించగలిగారో చెప్పండి. తప్పించగలిగితేనే మీరు నీతిమంతులౌతారు. తప్పించగలిగితేనే దేవుని నీతిలో మీరు గొప్పవారౌతారు. అప్పుడు ఆ దేవుని నీతి మీకు అర్థమైనట్టే! ఆ దేవుని నీతి మీకు తెలిసినట్టే!! లేదంటే, మీరు మరణానికి వెళ్ళిపోతారు. మీరు కూడా లోకనీతిలో సమాధి అయిపోతారు. అలా కావడానికి వీలులేదు. దేవుడు వ్రాయించిన ప్రతిమాటా మనకోసమే. దేవుడు వ్రాయించిన ప్రతి అక్షరం మనకోసమే. మనలను బ్రతికించాలని ఆయన నోరు విప్పాడు. మనలను  రక్షించాలని భూమి మీద ఆయన మాటలు పలికించాడు, వ్రాయించాడు, భద్రపరిచాడు. ఇదిగో బైబిల్‌గా మనచేతికిచ్చాడు. ఇంత భారీ ప్రణాళికలను మనము నీరుకార్చేలా చేయకూడదు. అనేకమందికి  ఈ దేవుని వాక్యమును ప్రకటించాలి. అనేకమందిని వారి తప్పుడు మార్గములోనుండి మనమే మళ్ళించాలి. దేవుని నీతిని వారికి తెలియజేయాలి. లోకనీతి ఎలాంటిదో వారి కళ్ళకు కట్టేలా, కళ్ళు తెరచుకునేలా చెప్పాలి. మూసుకుపోయిన వారి మనోనేత్రాలను తెరచి వారికి దేవుని వాక్యాన్ని చూపించాలి. వారందరిని జీవమార్గంలో నడిపించే ప్రయత్నము చేయాలి. ఇది మీచేతకాకపోతే నన్ను సంప్రదించండి. మిమ్మును దేవునికొరకు ఒక మంచి పనివానిగా, పరలోకానికి అర్హునిగా తయారుచేస్తాను. మంచి నిర్ణయం తీసుకుంటారని కోరుకుంటూ నా మాటలు ముగిస్తున్నాను.


ప్రభువునందు నమ్మకస్థుడు,

**జె. మణి కుమార్**

సన్ ఆఫ్ గాడ్ – క్రైస్ట్ చర్చ్ – సామర్లకోట – 8978414178.


## ప్రశ్నలు

1. మనిషి దేవుణ్ణి ఎప్పుడు తెలుసుకోవాలి?
2. మనిషి వెదకవలసినది ఏమిటి? ఏమి వెదుకుచున్నాడు?
3. ధనవంతులు పరలోకానికి ఎందుకు అనర్హులో వివరించండి.
4. లోకనీతికి దేవునినీతికి మధ్య ఉన్న వ్యత్యాసమును తెలియజేయండి.
5. లోకనీతి దృష్టికి దేవుని నీతి ఎలా వెఱ్ఱితనముగా కనిపిస్తుందో వివరించండి.
6. దేవుని నీతిని కలిగినవారు ఈ భూమిపై ఎంతమంది ఉన్నారని వ్రాయబడింది.
7. లోకము చిన్ననాటనుండి తన నీతిని నేర్పి, బాల్యాన్ని ఎలా చిదిమేస్తుందో తెలియజేయండి.

# 4. దేవుడుండే దేవాలయమేది?

ప్రియ పాఠకులారా!

భూమి మీద మేలుకరమైన ఒక సంగతి, మేలైన ఒక కార్యక్రమాన్ని గూర్చి దేవుడు తన గ్రంథములో తెలియజేయుచున్నాడు. **కీర్తనలు 14 : 2** లో భూమి మీద మనిషి చేయగలిగిన మేలైన ఒక కార్యక్రమాన్ని గూర్చి దేవుడు వ్రాయించాడు. మేలు చేయాలి అంటే వివేకాన్ని కలిగియుండాలి. వివేకము కలిగినవారు దేవుని వెదుకుతారు అంటున్నాడు. "వివేకము కలిగి దేవుని వెదకువారు కలరేమో" అని దేవుడు ఆకాశము నుండి చూస్తున్నాడు. ఆకాశము నుంచి దేవుడు చూసి, పరిశీలించవలసినది ఏమైనా ఒకవేళ ఈ ప్రకృతిలో ఉన్నది అంటే... అతడు మనిషే! దేవుడు కలిగించిన సూర్యుని మాటిమాటికీ దేవుడు చూడవలసిన అవసరం లేదు. ఎందుకుంటే సూర్యునికి అప్పగించిన పనిని ప్రతిరోజు సూర్యుడు నెరవేరుస్తున్నాడు. గాలికి అప్పగించిన పనిని గాలి నెరవేరుస్తుంది. చంద్రునికి అప్పగించిన పనిని చంద్రుడు నెరవేరుస్తున్నాడు. ఏరోజూ ఏదీ తప్పిపోలేదు. ఏరోజూ తమ పనిని మానలేదు. భూమికి అప్పగించిన పనిని, వర్షానికి అప్పగించిన పనిని, నదులకు సముద్రాలకు అప్పగించిన పనిని, పక్షులకు జంతువులకు జీవులన్నిటికి అప్పగించిన పనులను వేటికవి నెరవేరుస్తున్నాయి. ఇక, దేవుడు ఆకాశము నుంచి మనుష్యులను దేవుడు చూడాలి? ఎందుకు దేవుడు వీరిని పరిశీలించాలి? అని మనము ఆలోచిస్తే... మనిషి ప్రారంభములో ఎలా కలుగజేయబడ్డాడో, తన జీవితము యొక్క ముగింపు వరకు అలా ఉండడు. దారి తప్పుతాడు. త్రోవ తొలగిపోతాడు. దేవునికి భిన్నంగా మారిపోతాడు. దీనిని బట్టి మనిషిని భూమిమీద పుట్టిస్తున్న దేవుడు, మాటిమాటికీ తన నివాసస్థలమైన పరలోకములో నుంచి చూస్తున్నాడని మనకు అర్థమవుతుంది. బైబిలు భూమి మీద మన బ్రతుకులకు సంబంధించిన చిన్న చిన్న అవసరాలను తీర్చే పుస్తకం కాదు. మరో లోకానికి సంబంధించి, ఆ లోకములో నివసించే పరమతండ్రిని, మనుష్యులందరికీ తండ్రి అయిన దేవుణ్ణి, ఆయన భావమును, ఆయన మనసును తెలియజేసే గ్రంథమే బైబిల్. అందుకే పరలోకములో ఉండే తండ్రి ఎలాంటి మనసుతో ఉన్నాడో, మనుష్యులయెడల ఆయన ఎలాంటి ఆలోచనతో ఉన్నాడో, ఈ మాటల ద్వారా చెబుతున్నాడు. "వివేకము కలిగి దేవుని వెదకువారు ఎవరైనా భూమి మీద ఉన్నారా?" వివేకము కలిగి భూమి మీద దేవుని దగ్గరకు వచ్చేవారు ఎవరైనా ఉన్నారా? అనేది దేవుని ప్రశ్న! ఇంటిలో సరుకులు నిండుకున్నప్పుడు అందరూ తమ నిత్యావసరాలను మరలా తెచ్చుకోవడానికి ఆయా ప్రదేశాలకు, మార్కెట్లకు వెళతారు, వెదుకుతారు. మనుష్యులుగా వారికి ఎటువంటి అవసరత ఉన్నా ప్రకృతిలో దానిని తీర్చుకోవడానికి మనిషి వెదుకులాటను కలిగి ఉంటాడు. చదువు విషయంలో, ఉద్యోగము విషయంలో, తినే ఆహారపదార్థాల విషయంలో, కట్టుకునే బట్టల విషయంలో, నివసించే ఇంటి విషయంలో, ఇలా ప్రతీ విషయంలో మనిషిది వెదుకులాటే. ఎక్కడ నాకు మంచిది దొరుకుతుంది? ఎక్కడ నాకు సంతోషాన్ని ఇచ్చే కార్యక్రమాలు దొరుకుతాయి? అని మనిషి వెదుకుతాడు."ఇలా తన వెదుకులాటలో ఎప్పుడైనా నన్ను వెదుకుతున్నాడా?" అని దేవుడు అడుగుతున్నాడు. దానినే వివేకాన్ని కలిగి ఉండటమని చెబుతున్నాడు.

ఇలా వివేకము కలిగి ఉన్నవారు భూమి మీద చాలా తక్కువ సంఖ్యలో ఉంటారు. ఎందుకంటే మనిషి ఎవరిని ఎక్కువగా వెదుకుతాడో మనకు తెలుసు. ఏ వెదుకులాటలో మనిషి ఎక్కువగా ఉంటాడో, మనందరికీ తెలుసు! బాల్యదశ నుంచి తిండి కొరకు, ఆట కొరకు, వస్త్రాల కొరకు, పెండ్లి కొరకు, వీటి కొరకే తిరిగే మనిషి, వీటినే వెదికే మనిషి, దేవుని నిమిత్తం వెదికినట్టుగా ఎప్పుడూ కనిపించలేదు. ఏ వ్యక్తిలోనూ ఇది మనకు వినిపించలేదు. అయితే దేవునియొక్క ఆలోచనను చూడండి. "వివేకము కలిగినవారు భూమి మీద ఉండాలి" అని అంటున్నాడు. అలా వివేకము కలిగినవారు ఎవరు అంటే, ఆకాశంలో విమానాన్ని కనిపెట్టేవాడు వివేకము కలిగినవాడు కాదు. సముద్రము మీద ప్రయాణించే పడవను కనిపెట్టినవాడు వివేకము కలిగినవాడు కాదు. వేగంగా ప్రయాణించే మోటరు బైకునో, బస్సునో కనిపెట్టినవాడు వివేకవంతుడు కాదు. ఈ లోకజ్ఞానము మరియు లోకజ్ఞానులు అనుకున్నట్టుగా శాస్త్రంలో, ప్రకృతిలో కొంత పరిజ్ఞానాన్ని కలిగిన మనిషి వివేకవంతుడా? ఈ ప్రపంచ మనుష్యులు అనుకునేది అదే! దేవుడు మాత్రం వివేకము కలిగినవాడు ఎవడు అంటే, దేవుని వెదికేవాడే అంటున్నాడు. ఇలా పరిశీలిస్తే ఆ దేవునికి

ఎంతమంది దొరికారు? ఆంధ్రప్రదేశ్‌లో ఒక లక్ష మంది భారతదేశంలో ఒక కోటి మంది దొరికారా? ఎందుకంటే 125 కోట్ల మంది ప్రజలలో ఒక్క కోటిమంది అయినా దొరకొద్దా! పోనీ, భూమి మొత్తంమీద 20 కోట్ల మంది దొరికారేమో అనుకుంటే చాలా పొరపాటు. ప్రపంచవ్యాప్తంగా ఎవ్వరూ దొరకరు. ఎందుకంటే, అక్కడ దేవుడు వ్రాయించిన మాటను చూడండి. దేవుడు ఎప్పుడైతే వివేకము కలిగినవారు ఉన్నారేమో అని పరిశీలనచేయడం ప్రారంభించాడో, వెదకడం ప్రారంభించాడో, ఆయనకు దొరికిన సంఖ్య ఎంతంటే? దేవుడు చెబుతున్నాడు– "వారందరూ (భూమి మీద దేవుడు ఎంతమందిని పుట్టించాడో వారందరూ) దారి తప్పి బొత్తిగా చెడియున్నారు. ఎవరినైతే దేవుడు పరిశీలిస్తున్నాడో 'వారందరూ' అనగా, బస్సులో ప్రయాణిస్తున్న వారందరూ, ట్రైన్‌లో ప్రయాణిస్తున్న వారందరూ! "ఏమిటి? వీరందరూ, ప్రయాణిస్తున్నది నాకొరకు కదా? దేవుడు ఆశ్చర్యపోతున్నాడు. ఏమిటి వీరందరూ మాట్లాడుకుంటున్నది నాకొరకు కాదా? వీరందరూ మార్కెట్‌కు వెళుతున్నది నాకొరకు కాదా? 'వీరందరూ పనిపాటలు చేస్తున్నది నాకొరకు కాదా? కానే కాదు. వారి ఇష్టాలు వారు నెరవేర్చుకోవడానికి! వీరు మామూలుగా చెడిపోయినవారు కాదు. మత్తులోనికి వెళ్ళిపోయినవారు. అంటే కనీసం, దేవుని జ్ఞానాన్ని చెప్పినా విననివారు. దేవుని జ్ఞానాన్ని ప్రకటించినా పట్టించుకోనివారు. అందుకే ఆయన మాటలలో, ఆవేదనతో ఎలా మాట్లాడుతున్నాడంటే 'బొత్తిగా చెడిపోయారు' అంటున్నాడు. ఒక్కొక్కసారి తల్లిదండ్రులు తమ పిల్లల్ని గూర్చి మాట్లాడుతుంటారు. 'నా కొడుకు బొత్తిగా చెడిపోయాడు' అని అంటే ఆ తండ్రి యొక్క ఉద్దేశ్యం ఏమిటన్నమాట? నేను నా కుమారుని ఇక మంచి దారిలో పెట్టలేను. పెట్టడం నా తరం కాదు. ఎందుకంటే ప్రతిరోజు దారి తప్పిపోతున్నాడు. నేను చెప్పిన మాటలను అతిక్రమిస్తున్నాడు. అంటే 'బొత్తిగా చెడిపోయారు' అనే పదాన్ని ఎవరికి ఉపయోగిస్తారు? మంచి మార్గములోనికి ఇక తీసుకునిరావడం సాధ్యం కానివారిని గూర్చి ఆ పదం ప్రయోగిస్తారు! ఇక్కడైతే, దేవుడు ఆ పదాన్ని మనుష్యులకు ప్రయోగిస్తున్నాడు. "వారందరూ దారి తొలగి బొత్తిగా చెడియున్నారు". అంటే, ఇక వారిని మార్చడం సాధ్యం కాదని దేవుడే చెప్పేస్తున్నాడు."మేలు చేయువారు ఒకరును లేరు" అంటే దేవుని వెదికేవాడు, వివేకము కలిగినవాడు ఒకడును లేడు అని మనకు అర్థం అవుతుంది. భూమిమీద సాధారణంగా మేలు చేసేవారు ఎవరని – ఎవరినైనా అడిగితే, బాగా డబ్బు సంపాదించి అందులో ఒక రూపాయి భిక్షము వేస్తే, వాడే మేలు చేసేవాడు అంటుంది ఈ లోకం. ఆలోచించండి! అన్నీ దోచుకుని, అంతా సంపాదించి, ఉద్యోగాలు చేసి, వ్యాపారాలు చేసి, బాగా ధనాన్ని సంపాదించి ఒక రూపాయి ఎవరైనా పేదవారికి దానము చేస్తే అది మేలా? దేవుడు అందుకే దానిని మేలని ఎక్కడా వ్రాయించలేదు. తన్ను వెదికేవాడు మేలు చేసే కార్యక్రమాల్లో ఉన్నట్టు, తన్ను వెదికేవాడు వివేకవంతుడు! ఇదే దేవుని మనసు. ప్రపంచానికి ఎప్పటికీ అర్థం కాని ఒక రహస్యం ఇది. టాప్ సీక్రెట్ ఇది. కానీ ఎవ్వరూ నమ్మరు. ఈ విషయాన్ని ఎవ్వరూ అంగీకరించరు. దేవున్ని వెదకడం మేలుకరమైన విషయము. దేవుని తెలుసుకోవడం, దేవుని జ్ఞానాన్ని నేర్చుకోవడం, దేవుడు ఎక్కడున్నాడు, నన్ను పుట్టించినవాడు ఎక్కడ ఉన్నాడు అని అడగడమే – మేలైన విషయము. ఈ ప్రపంచం నమ్మదు. కానీ, దేవుని గ్రంథములో అదే వ్రాయబడింది. మీరు ఒకవేళ భూమి మీద వివేకవంతులుగా ఉండాలి అంటే, మీరు మేలు చేసేవారుగా ఉండాలి అంటే మీరు దేవుని వెదకాలి. ఇక్కడి వరకూ మనకు బాగానే అర్థమయ్యింది. ఇకపోతే కనీసం మనమైనా వివేకవంతులుగా దేవుని దృష్టిలో ఉండాలి గనుక మనము ఆ ప్రయత్నం చేద్దాం. మనమైనా మేలుకరమైన సంగతులలో ఉండాలని ఆలోచన చేద్దాం.

అయితే ఇప్పుడు మనము నిజంగా వివేకవంతులుగా, మేలు చేసేవారముగా ఉండాలంటే మనము దేవుని వెదకాలి. దేవుడు ఎక్కడ ఉంటాడు? దేవుడు ఎలా ఉంటాడు? దేవుని కలుసుకోవాలని మనకు అనిపించినప్పుడు వెంటనే మన మనసులోనికి వచ్చేటటువంటి ఆలోచనే దేవాలయం! ఎందుకంటే, దేవాలయమే దేవుడు నివసించే స్థలం, అదే ఆయన నివశించే స్థలమని మన నమ్మకం. అందుకే ఆ 'దేవాలయమనే' పదములోనే దేవుడు+ఆలయం అనే రెండు పదములు దాగి ఉన్నాయి. ఈ భూమి మీద ఎన్నో మతాల వారు ఉన్నారు. ఎన్నో విశ్వాసాలు కలిగినవారున్నారు. ఎన్నో ప్రాంతాలలో ఎన్నో జాతులుగా బ్రతుకుచున్న మనుష్యులు ఉన్నారు. దాదాపుగా చాలామంది మనుష్యులు దైవముపై నమ్మకాన్ని కలిగియున్నారు. దేవుడనేవాడు ఉన్నాడు అని అనేవారున్నారు. ఇక నాస్తికులును

(దేవుడు లేడు అనేవారిని) మనం పక్కనపెడితే, దేవుడున్నాడు అనే వారి దగ్గరకు మనము వెళ్ళినప్పుడు, దేవుడు ఎక్కడుంటాడు అని వారినడిగితే, వెంటనే వారి నోట నుండి వచ్చే సమాధానం, దేవుడు – దేవాలయంలో ఉంటాడు. అందుకే చాలామందికి వారి మనసు బాగులేనప్పుడు దేవాలయానికి వెళ్ళి కాసేపు కూర్చోవాలి అనుకుంటారు. ప్రశాంతమైన వాతావరణంలోనికి వెళ్ళిపోవాలి అనుకుంటారు. లోకసంబంధమైన పనిపాట్లలో నుంచి బయటికి వచ్చి దేవాలయంలో కొంత కాలం గడిపితే నేను దేవుని సన్నిధిలో ఉన్నట్లేనని భావిస్తూ ఉంటారు. అంటే దేవుడుండే స్థలం, దేవుడు నివసించే స్థలం – దేవాలయమని మన చిన్ననాటనుండి మనము విన్నాము. దేవుడు ఎక్కడుంటాడో కనుగొన్నవాడు, దేవుని వెదికేవాడు, వివేకవంతుడు అయినప్పుడు, మేలు చేసేవాడు అయినప్పుడు, దేవాలయంలో దేవుడుంటే ఇప్పుడు మనము దేవుని దగ్గరకు వెళ్ళిపోవాలి. ఆ దేవుని గనుక మనము కనుగొంటే, దేవుని మనము కలుసుకుంటే, నిజంగా వివేకవంతులమవుతాము. మనము మేలు చేసినవారమవుతాము. ఎందుకంటే దేవుని మాట అదే చెప్పింది. నన్ను వెదకేవాడు, నన్ను కలుసుకునేవాడు, నన్ను అర్థం చేసుకునేవాడు – భూమిమీద వివేకవంతుడు, జ్ఞానవంతుడు, మేలు చేసేవాడు అని బైబిల్‌లో దేవుడు వ్రాయించాడు. ఇక దేవుని వెదకడం మంచి కార్యక్రమము అయినప్పుడు, ఆ దేవుడు దేవాలయంలో ఉంటాడని ఈ లోకమంతా మనకు చిన్ననాటనుంచి నేర్పించిన దానిని బట్టి దేవాలయము దగ్గరకు మనము వెళ్ళాలి. అయితే దేవాలయాన్ని గూర్చి దేవుడు పలికిన కొన్ని మాటలు బైబిల్‌లో నిక్షిప్తమైయున్నాయి. వాటిని మనము ఆలోచిస్తూ లోకము చెప్పిన ఆ మాట ఎంతవరకు నిజం? అనేదానిని మనము పరిశీలన చేద్దాం. ఎందుకంటే, ప్రపంచవ్యాప్తంగా దేవుని గ్రంథములో వ్రాయబడిన దానికి భిన్నంగా ఎవరు చెప్పినా అది అవాస్తవం. అది అబద్ధం. దేవునివాక్యములో వ్రాయబడిన దానిని చెప్పినవాడే నిజం చెప్పినట్టు, సత్యము చెప్పినట్టు! అందుకే యేసుక్రీస్తు కూడా తాను భూమి మీదకు వచ్చిన తర్వాత, నేను ప్రకటిస్తున్న మాటలు నా అంతట నేను ప్రకటిస్తున్నవి కావు అన్నాడు. దేవుని దగ్గర నేను ఏది విన్నానో, దేవుని దగ్గర నేను ఏది నేర్చుకున్నానో అదే నేను మీకు తెలియజేస్తున్నాను అన్నాడు. కనుక దేవుని వాక్యములో ఒకవేళ నిజంగా దేవాలయంలో దేవుడుంటే, ఆ దేవాలయం ఎక్కడుంటుందో, అందులో దేవుని ఎలా వెదకాలో, ఎలా తెలుసుకోవాలో, ఎలా కలుసుకోవాలో అనే విషయాన్ని మనము బైబిల్‌లో పరిశీలన చేద్దాం.

**అపో. కార్య. 7 : 44–** లో ఈ దేవాలయాన్ని గూర్చిన మంచి వివరణను దేవుడు వ్రాయించాడు. "అతడు చూచిన మాదిరి చొప్పున దాని చేయవలెనని మోషేతో చెప్పినవాడు ఆజ్ఞాపించిన ప్రకారము, సాక్ష్యపు గుడారము అరణ్యములో మన పితరుల యొద్ద ఉండెను" అనే మాట మనకు కనిపిస్తుంది. ఇశ్రాయేలీయులను తన పిల్లలుగా ఏర్పాటు చేసుకున్న దేవుడు, ఇశ్రాయేలీయుల మధ్య ఒక సాక్ష్యపు గుడారాన్ని ఉంచాడు. ఇశ్రాయేలీయులందరూ ఐగుప్తు దేశములో బానిసలుగా ఉన్నప్పుడు, వారిని మోషే నాయకత్వంలో ఒక ఉన్నతమైన దేశానికి నడిపిస్తున్న క్రమంలో వారి మధ్యన ఉండాలనుకున్న దేవుడు ఒక సాక్ష్యపు గుడారాన్ని వారి మధ్య ఉంచాడు. అంటే దేవాలయానికి ప్రారంభం ఇక్కడున్నదన్నమాట. అసలు మొట్టమొదట భూమి మీద దేవాలయం పుట్టడానికి ఏది ప్రారంభమో, దీనికి ఎవరు నాంది పలికారో ఇక్కడ మనకు తెలియజేయబడుతుంది. ఇశ్రాయేలీయుల మధ్య, వారి యొక్క అరణ్యమార్గములో, వారి యొక్క ప్రయాణములో ఒక స్థిరమైన దేవాలయమంటూ వారికేదీ లేదు. ఇశ్రాయేలీయులు 40 సంవత్సరాలు కనాను దేశాన్ని చేరడానికి ప్రయాణించారన్న సంగతి మీకు తెలుసు. అయితే ఈ ప్రయాణ మార్గములో వారికి స్థిరమైన దేవాలయమంటూ లేదు. లేకపోవడాన్ని బట్టి వారు ఒక సాక్ష్యపు గుడారాన్ని, అంటే వారు ఎక్కడుంటే అక్కడొక గుడారము, అందులో దేవుని యొక్క మందసమును ఉంచేవారు. ఈ సాక్ష్యపు గుడారాన్ని వారితోపాటుగా తీసుకొని ప్రయాణించేవారు. అంటే అది ఒక మొబైల్ దేవాలయం వంటిది. అంటే ఎక్కడికి పడితే అక్కడికి వెళ్లే దేవాలయములాంటిదని మనకు అర్థమవుతుంది. అయితే, ఇశ్రాయేలీయులు ఎప్పుడైతే ఈ సాక్ష్యపు గుడారాన్ని కలిగియున్నారో దానిని బట్టి, దానిని గూర్చి దేవుడు వ్రాయిస్తున్న తరువాతి మాటను మనము చూడగలిగితే, "మన పితరులు తమ పెద్దలచేత దానిని తీసికొనినవారై, దేవుడు తమ యెదుటనుండి వెళ్ళగొట్టిన జనములను వారు స్వాధీనపరచుకొన్నప్పుడు, యెహోషువతో కూడ ఈ దేశములోనికి దానిని తీసుకొని వచ్చిరి". ఏదైతే వాగ్దాన దేశమో,

ఆ కనాను ప్రాంతానికి ఇశ్రాయేలీయులు వారితోపాటుగా సాక్ష్యపు గుడారాన్ని తీసుకొనివచ్చి అక్కడ పెట్టారు. ఆ తరువాతి మాటను చూడగలిగితే, "అది దావీదు దినముల వరకు ఉండెను." ఇశ్రాయేలీయులకు మొట్టమొదటి రాజు సౌలు. అతని దినములలంతా, ఆ సాక్ష్యపు గుడారము ఇశ్రాయేలీయుల మధ్యనే ఉంది. ఇశ్రాయేలీయులకంటూ ఒక దేశమివ్వబడింది. అదే యెరుషలేము ముఖ్య పట్టణంగా ఇవ్వబడినటువంటి కనాను దేశము. అక్కడ ఇశ్రాయేలీయులందరూ స్థిరమైన నివాసమును కలిగియున్నారు. శత్రువుల యొక్క భయాన్ని ఇశ్రాయేలీయులలో దేవుడు పోగొట్టాడు. వీరు యుద్ధాలు చేసి, శత్రువులందరినీ తరిమికొట్టారు. అయితే దేవునియొక్క మందసము, దేవునియొక్క నివాసము, దేవునియొక్క ఆలయము విషయానికొచ్చేసరికి కేవలం ఇశ్రాయేలీయులు ఒక సాక్ష్యపు గుడారాన్ని మాత్రమే కలిగియున్నారు. ఈ సాక్ష్యపు గుడారము దావీదు దినముల వరకు ఉన్నదని దేవుడు వ్రాయిస్తున్నాడు. దావీదు దినముల వరకు ఉన్న ఈ ఆలయాన్ని గూర్చి మనము ఒక్కసారి పరిశీలిద్దాం. పాతనిబంధన కాలములో దావీదు దినముల వరకూ ఈ సాక్ష్యపు గుడారం ఉన్నది కనుక దీనిని గూర్చి దావీదు కాలములో దేవుడు ఏమైనా వ్రాయించాడేమో అనే సంగతిని గూర్చి మనం ఆలోచించగలిగితే, దావీదుతో దేవుడు మాట్లాడుతూ ఏమంటున్నాడో ఒక్కసారి జాగ్రత్తగా చూడండి.

**2 సమూయేలు 7 : 11** దేవుడు చెబుతున్న సంగతులివి! "నీ శత్రువుల మీద నీకు జయమిచ్చి నీకు నెమ్మది కలుగజేసియున్నాను. మరియు యెహోవానగు నేను నీకు తెలియజేయునదేమనగా – నేను నీకు సంతానము కలుగజేయుదును. నీ దినములు సంపూర్ణమగునప్పుడు నీవు నీ పితరులతో కూడ నిద్రించిన తరువాత నీ గర్భములో నుండి వచ్చిన నీ సంతతిని హెచ్చించి, (అనగా సొలోమోనును హెచ్చించి) రాజ్యమును అతనికి స్థిరపరచెదను. అతడు నా నామఘనత కొరకు ఒక మందిరమును కట్టించును." ఇదంతా దేవుడు ఒక మందిరాన్ని గూర్చి, దేవాలయాన్ని గూర్చి మాట్లాడుతున్నాడు అని మనకు అర్థమౌతుంది. అంటే, అప్పటివరకు దేవునికి మందిరమే లేదు! కేవలం ఒక గుడారాన్ని మాత్రమే కలిగియున్నాడు. రాజుకైతే ఒక రాజ మందిరం, రాజకోట ఉన్నాయి. ఇశ్రాయేలీయులకైతే ఇల్లులున్నాయి. స్థిరమైన నివాసాలు ఉన్నాయి. అప్పటివరకూ ప్రయాణంలో ఉన్న ఇశ్రాయేలీయులందరూ స్థిరమైన నివాసాలు కట్టుకున్నారు. కానీ, దేవునికి మాత్రం ఇల్లు లేదు. దీనినిబట్టి దేవుడు దావీదు ద్వారా పలికిస్తున్న మాటలేమిటంటే, ఇప్పటి వరకు నీ శత్రువుల మీద నీకు జయాన్నిచ్చాను. నీ జీవితకాలమంతా నీవు యుద్ధాలతో గడిపావు. కానీ, నీ కడుపున పుట్టబోయే నీ కుమారుడు సొలోమోనుకు నేను సమాధానాన్నిస్తాను. అతని మీదికి శత్రువులు ఎవరూ రారు. నీ భయాన్ని బట్టి నీవు మరణించిన తర్వాత, నీ తరువాత ఉండే తరాలలో పుట్టబోయే శత్రురాజులు ఎవ్వరూ సొలొమోను దగ్గరకు రారు. ఒకవేళ వస్తే, జ్ఞానమును నేర్చుకోవడానికి వస్తారు తప్ప, యుద్ధాలు చేయడానికి మాత్రము రారు. అయితే నీవు నీ జీవిత కాలమంతా యుద్ధాలతో గడిపావు కనుక నాకు మందిరమును కట్టించడానికి నీకు సమయం లేదు. అందుచేత, నీ కుమారుడైన సొలొమోనుకు ఆ బాధ్యతను అప్పజెపుతానంటున్నాడు దేవుడు.

**2 సమూయేలు 7 : 13,14** "అతడు నా నామఘనత కొరకు ఒక మందిరమును కట్టించును. అతని రాజ్య సింహాసనమును నేను నిత్యముగా స్థిరపరచెదను. నేనతనికి తండ్రినై యుందును. అతడు నాకు కుమారుడైయుండును." ఇది దేవుడు పలికించిన మాట! అంటే ఇప్పుడు దేవుని మందిరాన్ని ఎవరు కట్టించాలి? సొలొమోను కట్టించాలి. దావీదుకు కట్టించాలనే ఆశ ఉంది. కానీ, దావీదు కట్టించలేకపోయాడు. ఎందుకంటే, దావీదుకున్న పని వేరు. దేవుడు ఆయా తరాలలో, ఆయా మనుష్యులకు ఇస్తున్న పనులను బట్టి మనుష్యులు వస్తున్నారు. భూమి మీదికి వచ్చిన వారందరూ ఒకే పనిని కలిగిలేరు. ఈ భూమి మీద మనము కూడా దేవుడు నిర్ణయించిన పనిని కలిగి వచ్చాము. ఆ పనిని పూర్తి చేయవలసినవారమై ఉన్నాము. దావీదుకు దేవుడు ఇచ్చిన పని ఏమిటంటే, ఇశ్రాయేలీయులను రక్షించాలి, ఇశ్రాయేలీయుల మీదకి ఎవరైనా శత్రుదేశాల రాజులు వస్తే వారి మీద యుద్ధం చేసి, వారిని జయించాలి! ఇక సొలొమోనుకు దేవుడు ఏమి పనినిచ్చాడు? ఇప్పటివరకూ సాక్ష్యపు గుడారముగా, తాత్కాలికంగా ఉన్న దేవుని మందిరమును అతడు కట్టించాలి. స్థిరమైన ఆలయముగా అతడు కట్టించాలి.

ఇలా కట్టించిన ఆలయములో దేవుడు నివశిస్తాడేమో అనుకొని ఇశ్రాయేలీయులందరూ అనుకుంటున్నారు. అది ఆయన మందిరమనుకుని ప్రతి ఒక్కరూ భావిస్తున్నారు. ఎందుకంటే ఇప్పటివరకూ సాక్ష్యపు గుడారములో దేవుడున్నాడనుకుని, అందులోనే వారందరూ ఆయనకు హోమాలర్పించారు, బలులర్పించారు. దేవుని వెదకడానికి ప్రయత్నించిన ప్రతి ఒక్కరూ సాక్ష్యపు గుడారము దగ్గరకు వచ్చేవారు. అయితే ఇక మీదట సొలొమోను ఒక మందిరమును కట్టించాలని దేవుడు చెబుతున్నాడు. సొలొమోనుతో దేవుడు పలికించిన ఆ మాటలును బట్టి సొలొమోను ఒక గొప్ప మందిరాన్ని కట్టించాడు. దానిని కట్టించిన సొలొమోను ఏమంటున్నాడో తెలుసా?

**1 రాజులు 8 : 26–** "ఇశ్రాయేలీయుల దేవా, దయచేసి నీ దాసుడును నా తండ్రియునైన దావీదుతో నీవు సెలవిచ్చిన మాటను నిశ్చయపరచుము". ఇశ్రాయేలీయుల దేవా నీవు నా తండ్రియైన దావీదుకు మాటిచ్చావు. అదేమిటంటే, నీ మందిరాన్ని కట్టించే అవకాశమును సొలొమోనుకిస్తాను అన్నావు. కనుక నీవు నా తండ్రికిచ్చిన మాటను స్థిరపరుచుము. తరువాత (27వ వచనం) "నిశ్చయముగా దేవుడు ఈ లోకమందు నివాసము చేయడు" అంటున్నాడు. ఇప్పటివరకూ మనము మాట్లాడుకున్న దానిని బట్టి, ప్రారంభకాలము నుంచి ఇశ్రాయేలీయుల కాలము వరకూ అసలు భూమి మీద మందదిరమనేదే లేదు. ఇక ఇశ్రాయేలీయుల దగ్గరనుంచి వారియొక్క ప్రయాణ కాలములో దేవునికి ఒక నివాసము, ఒక సాక్ష్యపు గుడారము, ఆ గుడారములో దేవుడు ఉంటాడనుకోవడం. ఆ తరువాత దావీదు కాలము వరకూ ఆ గుడారముండటం, దావీదు దినముల తర్వాత సొలొమోను పుట్టడం, సొలొమోను దేవుని కొరకు ఒక మందిరమును యెరుషలేములో కట్టించడం... ఇవన్నీ అయిన తరువాత సొలొమోను మాట్లాడుతున్న ఈ మాట ఎలా ఉందో చూడండి! **(1 రాజులు 8 : 27)** పరిశుద్ధాత్మ ప్రేరణచేత, జ్ఞానయుక్తంగా సొలొమోను చెప్పదలుచుకున్న ఆ ఖచ్చితమైన మాట ఏమిటి? దేవుడు ఈ లోకమందు నివాసము చేయడు. ఎందుకంటే ఇది దేవలోకం కాదు. ఇది దేవుడుండే లోకము కాదు. ఇది దేవుడు ఉండాలనుకున్న లోకము కాదు. బాగా ఆలోచించండి. మరి, దేవుడు ఇదంతా ఎందుకు చేయించాడు? ప్రజలు కేవలం దేవునికి అర్పణలు చెల్లించడానికి, విశ్వాసాన్ని కలిగియుండటానికి, భయభక్తులు కలిగియుండటానికి, వారికంటూ దేవుని వెదికే ఒక మార్గాన్ని చూపించడానికి మాత్రమే, ఇప్పటివరకూ వారికొక సాక్ష్యపు గుడారము ఉంది. ఇప్పటివరకూ వారికి ఒక మందిరము ఉంది. ఆ మందిరాన్ని స్వయంగా కట్టించినటువంటి సొలొమోను చెబుతున్న మాటలేమిటంటే "నిశ్చయముగా దేవుడు ఈ లోకమందు నివాసము చేయడు". ఎందుకు నివాసము చేయడో తరువాత చెబుతున్నాడు చూడండి. "ఆకాశమహాకాశములు నిన్ను పట్టజాలవు" అంటే ఇదే దేవుని యొక్క కొలత. ఆకాశమహాకాశములు ఆయనుండటానికి కావలసిన కొలతలు! ఒక్క ఆకాశము కాదు. ఆకాశము, దాని పైనున్న ఆకాశాలు అనగా, ఈ ప్రకృతిలో దేవుడు కలిగించిన ఆకాశాలన్నీ ఒకవేళ దేవునికి నివాసాన్ని ఏర్పాటు చేయాలనుకుని, ఒక ఇల్లు కట్టాలి అనుకుంటే, ఆ ఆకాశాలు సైతం పట్టవు అంటున్నాడు చూడండి! ఇదే మీరు నమ్ముకున్న దేవునియొక్క పరిమాణము! మీరు ఎప్పుడైనా దేవుని ఇలా వెదికారా? ఎప్పుడైనా దేవుని గూర్చి ఇలా ఆలోచించారా? అసలు దేవుని కొలతలేమిటి? దేవుడు ఎక్కడ ఉంటాడు? దేవుని నివాసం ఏమిటి? వివేకమంటే ఇదే! మేలు చేసే కార్యక్రమం ఇదే! అంటే ప్రపంచంలో ఎవరికీ ఈ బుద్ధి లేదు. ఈ జ్ఞానము లేదు. దీనినే కనీనపు జ్ఞానము అంటారు. బైబిల్‌లో దేవుడు, తెలుగు భాషలో అందరికీ అర్థమయ్యేటట్టు వ్రాయించిన పదాలివి. ఇప్పటివరకూ మనోనేత్రాలు తెరవక గ్రుడ్డితనములో ఉండిపోయిన అనేకమంది గ్రహించలేని మాటలివి. సొలొమోను మాటలను జాగ్రత్తగా పరిశీలించండి."నిశ్చయముగా దేవుడు ఈ లోకమందు నివాసము చేయడు. ఆకాశమహాకాశములు నిన్ను పట్టజాలవు". నేను కట్టించిన ఈ మందిరము ఎలా పడుతుంది? అయినను యెహోవా, నాదేవా, నీ దాసుడనైన నా ప్రార్థనను, విన్నపమును అంగీకరించి ఈ దినమున నీ దాసుడనైన నేను చేయు ప్రార్థనను, నేను పెట్టు మొఱ్ఱను ఆలకించును". కేవలం దేవుడు చెప్పాడని, దేవుడు వాగ్ధానము ఇచ్చాడని సొలొమోను మందిరమును కట్టిస్తున్నాడు. కానీ, ఆయన జ్ఞానము ప్రకారము మాట్లాడితే, దేవుని కొలతలు సొలొమోనుకు తెలుసు. ఆయన ఎక్కడ నివసిస్తాడో సొలొమోనుకు తెలుసు. దేవుడుండే లోకము వేరు. అదే పరలోకము లేక దేవలోకము. దేవుడుండవలసిన లోకమది. అయితే నేను కట్టించిన ఈ మందిరం

ఏపాటిది? అసలు అది నీకు సరిపోదు అంటున్నాడు. మరి ఇంతకీ దేవుడు నివసించని ఆ మందిరాన్ని అంత కష్టంతో సొలొమోను ఎందుకు కట్టించాడో, దేవుడిచ్చిన వాగ్దానాన్ని బట్టి సొలొమోను ఆ మందిరాన్ని ఎందుకు నిర్మించాడో అతడే మరల చెబుతున్నాడు. **1 దినవృత్తాంతములు 2 : 5, 6** "నేను కట్టించు మందిరము గొప్పదిగానుండును. మా దేవుడు సకలమైన దేవతలకంటె మహనీయుడు గనుక ఆకాశములను మహాకాశములును ఆయనను పట్టజాలవు. ఆయనకు మందిరమును కట్టించుటకు చాలిన వాడెవడు? ఆయన సన్నిధిని ఆయనకు మందిరమును కట్టించుటకైనను నేనేమాత్రపువాడను? ధూపము వేయుటకే నేను ఆయనకు మందిరమును కట్టదలచియున్నాను". లోకములో మనుష్యుల దృష్టికి నేను మంచి విలువ కలిగినటువంటి చెక్కతో, లోహాలతో, బంగారముతో, వజ్రాలతో ఈ మందిరాన్ని కట్టిస్తాను. అదే యెరుషలేము మందిరం. అదే స్వర్ణ దేవాలయం. అదే గొప్పదైన దేవాలయం. "నేను కట్టించు మందిరము గొప్పదిగా ఉండును. మా దేవుడు సకలమైన దేవతల కంటే మహనీయుడు కనుక నేను కట్టించిన మందిరమెంత గొప్పగా ఉన్నా, నేను పూజించే దేవుడు అంతకన్నా గొప్పవాడు కనుక ఆకాశ మహాకాశములు ఆయనను పట్టజాలవు. సొలొమోను యెరుషలేములో ఆ మందిరమును కట్టడానికి ఎంత సమయం పట్టిందో తెలుసా? సుమారు 46 సంవత్సరాలు. ఇది ఒక వారం రోజుల్లోనో, పక్షం రోజుల్లోనో, నెల రోజుల్లోనో, సంవత్సరంలోనో, కోట్ల రూపాయలతో, అనుకున్న తేదీలోనో(టార్గెట్ డేట్ లోనో) పూర్తయిపోయిన దేవాలయం కాదు. దేవుని యొక్క మందిరాన్ని కట్టించడానికి పట్టిన కాలము 46 సంవత్సరాలంటే, ఒక మనిషి సుమారు జీవిత కాలమది. పుట్టిన తరువాత ఈ దేవాలయమును ప్రారంభిస్తే 46 సంవత్సరాలకు పూర్తవ్వడమంటే, ఎంతమంది ఆ దేవాలయం పూర్తవ్వడం చూడకుండానే, మధ్యలో చనిపోయి ఉంటారో ఆలోచించండి. 46 సంవత్సరాలు కట్టిన మందిరాన్ని గూర్చి 'మా దేవుడు సకలమైన దేవతల కంటే మహనీయుడు, మానవ నిర్మిత దేవాలయాలలో ఆయన ఉండడంటున్నాడు'.

వాస్తవాన్ని పరిశీలిస్తే, ఒక విలువ కలిగిన వ్యక్తి భవనములోనే ఉంటాడు. ఒక అధికారం కలిగిన వ్యక్తి బందీ-బలగం మధ్యలోనే ఉంటాడు. ఒక జిల్లా కలెక్టర్ - కలెక్టర్ ఆఫీసులోనే ఉండాలి. అంతేగానీ రేకుల షెడ్డులో ఉంటే బాగోదు. ఒక జిల్లా ఎస్.పి. - ఎస్.పి. ఆఫీసు, చుట్టూ పహారాతో నిండి ఉండాలి. మీరు లోపలికి ప్రవేశిస్తున్నారంటే చెక్ చేసే సెక్యూరిటీ గార్డులుండాలి. తుపాకీలు పట్టుకుని పహారా కాస్తూ, లోనికి ఎవరిని పడితే వారిని పంపించకూడదు. అంత పెద్ద ఆఫీసులో ఉండాలి. ఎందుకంటే అతడు జిల్లాకి ఎస్.పి.! ఒక ముఖ్యమంత్రి- అసెంబ్లీలో ఉండాలి. అది అసెంబ్లీ సభ్యులుండే స్థలం. ఒక ప్రధానమంత్రి- పార్లమెంట్ భవనములో ఉండాలి. ఎవరు పడితేవారు లోపలికి వెళ్ళలేరు. భూమి మీద కేవలం 5 సంవత్సరాలు, లేక ఒక జీవితకాలము మట్టుకు పదవిలో ఉండేవారికే, వారికున్న హోదాను బట్టి వారుండవలసిన నివాసస్థలాలు మారిపోతున్నాయి చూశారా? వారి చుట్టూ ఉన్నటువంటి బలగం మారిపోతుంది చూడండి. మనుష్యులు మారిపోతున్నారు చూడండి. మరి అలాంటప్పుడు పరలోకమందున్న తండ్రి అనగానే, దేవుడు చిన్నవాడు అనుకుంటున్నారా? సామాన్యుడు అనుకుంటున్నారా? అందుకే సొలొమోను, తండ్రియైన దేవుని గూర్చి ఏమని మాట్లాడుతున్నాడో తెలుసా! 'నా దేవుడు, మన దేవుడు సకలమైన దేవతలకంటే గొప్పవాడు కనుక నేను కట్టించిన మందిరము గొప్పదైనా సరే అందులో ఉండదు. ఆకాశ మహాకాశములు ఆయనకు సరిపోవు. ఆయనకు మందిరమును కట్టించుటకు చాలినవాడెవడు? నేను సరిపోను అంటున్నాడు. ఆయనకు మందిరము కట్టించటానికి సొలొమోనోనంతటివాడే సరిపోలేదు. సొలొమోను ఒక జ్ఞాని, రాజు మరియు ఆయన దగ్గర చాలా సంపద ఉంది. అంత కలిగినవాడే దేవునికి సరైన మందిరమును కట్టించలేకపోయాడు అని దేవుని పరిశుద్ధాత్మ చేత లేఖనాలలో వ్రాయబడింది. ఇంతకీ సొలొమోను ఈ మందిరాన్ని ఎందుకు కట్టించాడు? మునుపటిలాగే సాక్ష్యపు గుడారముగానే ఉంచలేకపోయాడా! 46 సంవత్సరాలు పాటు ఎందుకు ఈ మందిరాన్ని కట్టించాడు? అని అడిగితే, సమాధానమక్కడే ఉంది చూడండి. "ధూపము వేయుటకే నేను ఆయనకు మందిరము కట్టదలచియున్నాను" అంటే 46 సంవత్సరాలు దేవునికొరకు మందిరాన్ని కట్టించిన సొలొమోను, ఇంతకీ ఆ మందిరము దేవుడు ఉండడానికి కాదు. దేవుని కొరకు ధూపము వేయటానికి అంటున్నాడు. ఇశ్రాయేలీయులకు దేవుడు కొన్ని బాధ్యతలు అప్పగించాడు. ధర్మశాస్త్రము ప్రకారం కొన్ని విధులు నిర్వర్తించాలన్నా, బలులు అర్పించాలన్నా, ధూపము వేయాలన్నా, విశ్రాంతి

దినాన్ని పాటించాలన్నా వీటన్నింటికీ వారికొక మందిరము ఉండాలి. కానీ, దేవుడు ఉండటానికి మాత్రం అది సరిపోదు. ఇదే కాదు, ఈ ప్రపంచంలో ఆరిన నేల మీద పుట్టినవాడెవడూ దేవుడు నివసించే మందిరాన్ని కట్టించలేదు. అలాగైతే– ప్రారంభములో వివేకము కలిగియుండాలి, జ్ఞానము కలిగియుండాలి, మేలు చేయాలి అనగా దేవుణ్ణి వెదకాలి అనుకున్న మనము, దేవాలయములో దేవుడు దొరకుతాడేమో అనుకున్న మనము, చివరికి దేవాలయము దగ్గరికి వచ్చేసరికి, ఆయన అందులో ఉండడన్న సంగతి మనకు స్పష్టంగా అర్థమవుతోంది. దేవాలయము అనగానే, భూమి మీద మొట్టమొదటి దేవాలయముగా, గొప్ప దేవాలయముగా కట్టబడిన సొలొమోను కట్టించిన మందిరములోనే దేవుడు ఉండడు అని వ్రాయించబడింది. అందుకే అదే మాటను స్పష్టంగా మరలా అపొస్తలుల కార్యములలో లూకా భక్తుడు వ్రాస్తున్నదానిని మీరు చూడగలిగితే...

**అపొ.కార్య. 7 : 46** "అతడు దేవుని దయపొంది యాకోబు యొక్క దేవుని నివాస స్థలము కట్టగోరెను. అయితే సొలొమోను ఆయన కొరకు మందిరము కట్టించెను" దావీదు దేవునికి మందిరాన్ని కట్టించాలనుకున్నాడు. కానీ, దావీదు శత్రువుల మీద యుద్ధం చేయాలి. దావీదుకు అంత సమయము లేదు. అయితే సొలొమోను ఆయన కుమారుడుగా దేవునికి మందిరాన్ని కట్టించాడు. "అయినను, ఆకాశము నా సింహాసనము, భూమి నా పాదపీఠము. మీరు నా కొరకు ఏలాటి మందిరము కట్టుదురు? నా విశ్రాంతి స్థలమేది? ఇవన్నియూ నా హస్తకృతములు కావా? అని ప్రభువు చెప్పుచున్నాడు అని ప్రవక్త పలికిన ప్రకారము సర్వోన్నతుడు హస్తకృతాలయములలో నివసింపడు". **(అపొ.కార్య. 7 : 50)** అంటే, సర్వోన్నతుడైన దేవుడు మనిషి కట్టిన ఆలయాలలో నివసించడని ఇక్కడ స్పష్టంగా అర్థమయింది. ఇంతకీ ఇప్పుడు దేవుని ఎక్కడ వెదకాలి? పరలోకమందున్న తండ్రేమో, వివేకము కలిగి నన్ను వెదకేవారు ఎవరైనా ఉన్నారా? అని చూస్తున్నాడు. ఎవ్వరూ లేరని ఆయనే చెప్పేస్తున్నాడు. పోనీ ఎవ్వరూ లేరని బాధపడుతున్నాడు కనుక తండ్రిని సంతోషింపచేయుటకు మనమే ఆయనను వెదకుదామని ముందుకు వెళితే, దేవాలయములో ఆయన మనకు కనిపించడం లేదు. ఎందుకంటే, దేవాలయంలో నేనుండను అని ఆయనే తన గ్రంథములో వ్రాయించాడు. మరి ఇంతకీ ఎక్కడుంటాడు ఆయన? అసలు ఈ లోకములోనికి ఆయన వస్తాడా? ఒక్కసారైనా లోకములోనికి వచ్చే ఆలోచన ఆయనకేమైనా ఉందా? మనము జాగ్రత్తగా పరిశీలించగలిగితే, క్రొత్త నిబంధనలో భక్తుడైన పౌలు చేత దేవుడు వ్రాయించిన కొన్ని మాటలను మనము ఆలోచించాలి. ఎందుకంటే మరల దేవుడే దీనికి సమాధానం చెప్పాడు. మీరు వెదకాలనుకుంటున్నారు గనుక, మీకు అటువంటి ఆసక్తి ఉంటే, దేవుని దృష్టిలో నిజమైన దేవాలయమంటే ఏదో, దేవుడు చెబుతున్న కొన్ని మాటలను మనము పరిశీలిద్దాం.

**1 కొరింథీ 3 : 16** "మీరు దేవుని ఆలయమైయున్నారనియు, దేవుని ఆత్మ మీలో నివసించుచున్నాడనియు మీరెరుగరా?" మీరు దేవుని ఆలయమైయున్నారని, మీరు కట్టించినవి దేవునికి ఆలయాలు కావని తెలుసుకోలేరా? భూమిమీద కనిపించే జీవములేని కట్టడాలు మీరుండటానికేగాని దేవుడుండటానికి కాదు! సొలొమోను కేవలం ధూపము వేయడానికి కట్టించిచాడు. ఇదిగో మీరు కట్టించుకుంటున్నవి ప్రార్ధనలు చేసుకోవడానికే కానీ, దేవుడుండటానికి మాత్రము కాదు. మీరు కట్టించే వాటిలో దేవుడుంటాడని ఏ కాలములోనూ, ఎవరితోనూ, ఎక్కడా చెప్పలేదు. ఏ పరిస్థితులలోనూ ఆయనుండలేదు. సాక్ష్యపు గుడారములో కూడా ఆయనుండలేదు. ఎందుకంటే, ఆయన ఈ లోకములో నివసించేవాడు కాదు. మనము ఇల్లు కట్టుకోవాలనుకుంటే, మన కొలతలకు సరిపోయినట్టుగా కట్టించుకుంటాము. అది బెడ్‌రూమ్ అయినా, బాత్‌రూమ్ అయినా లేక కిచెన్ అయినా సరే! అలాంటప్పుడు, దేవుడుండాలి అనుకుంటే, ఆయన యొక్క కొలతలేమిటి? ఆకాశం ఆయన సింహాసనం, భూమి ఆయనకు పాదపీఠము. ఈ భూమి అంతా ఆయన పాదములు పెట్టుకోవడానికి పీఠములాంటిది. భూమి అనగానే అన్ని ఖండాలు కలిపి, భూమిని ఒక పటముగా పరిస్తే 7 ఖండాలు మనకు కనిపిస్తాయి. ఆ 7 ఖండాల మీద పాదం మోపగలడు ఆయన. అంత సామర్థ్యం కలిగినవాడు. దేవుడంటే అంత భయంకరుడు, భీకరుడు. అలాంటి దేవుడు ఏమంటున్నాడో తెలుసా? 'మీరు దేవుని ఆలయమై ఉన్నారని' అంటున్నాడు. బాగా ఆలోచించండి. ఎక్కడా చెప్పబడని ఈ రహస్యం – క్రొత్త నిబంధనలో యేసుక్రీస్తు వారి జ్ఞానము ద్వారా ప్రపంచ మానవాళి కొరకు వ్రాయబడింది. ఇప్పటివరకూ

ఇశ్రాయేలీయులకు గాని, అంతకు ముందు పుట్టినవారికి గాని, ఎవ్వరికీ తెలియని ఒక రహస్యాన్ని కొరింథీయులకు వ్రాసిన పత్రికలో దేవుడు చెబుతున్నాడు. 'మనుష్యులారా, మీరు దేవుని ఆలయమైయున్నారు అంతేకానీ మీరు కట్టించేవి కావు'. అంటే, దేవుడు ప్రారంభము నుంచీ ఈ రహస్యాన్ని చెప్పడం కోసమే ఆయా వ్యక్తుల ద్వారా, ఆయా కాలాలలో సాక్ష్యపు గుడారాన్ని ఉంచాడు. తరువాత సొలొమోను కట్టించిన మందిరము అన్నాడు. వీటిలో దేనిలోనూ ఆయనుండను అన్నాడు. మరెందులో ఉంటావని మనిషి తనను ప్రశ్నించాలి? మనిషి తనను అడగాలి అనుకున్నాడు దేవుడు. అలాంటి కాలము వచ్చిన తరువాత దేవుడు ఏమని చెబుతున్నాడో తెలుసా? మీరే నా ఆలయమంటున్నాడు. "మీరు దేవుని ఆలయమై యున్నారని, దేవుని ఆత్మ మీలో నివసించుచున్నాడని మీరు తెలుసుకోవాలి". అంటే దేవుని ఆత్మ, మనిషి నిర్మించిన కట్టడాలలో నివసించడు. మనము కట్టిన వాటిలో ఆయన ఉండడు. అవి పవిత్రమైనవి కావు. మొట్టమొదట పవిత్రముగా ఉండవలసింది నీవు, నేను! మనిషియొక్క కట్టడాలు ఎలా పవిత్రమవుతాయి చెప్పండి? తెల్లని పెయింట్ వేస్తే ఒక కట్టడము పవిత్రమవుతుందా? సుగంధ ద్రవ్యములు పూస్తే ఒక కట్టడము పవిత్రమవుతుందా? తోరణాలు కడితే కట్టడాలు పవిత్రమైనవి అవుతాయా? కావు. మనిషే పవిత్రమైనవాడు కావాలి. ఆదాము కాలము నుంచీ దేవుని ఆలోచన ఇదే. కానీ, ఏ కాలములోనూ మనిషి దీనిని అర్థం చేసుకోలేదు. ప్రతి మనిషీ అపవిత్రుడుగా బ్రతకడానికి తప్ప, తాను పవిత్రుడుగా మారడానికి ఎప్పుడూ ప్రయత్నించలేదు. ప్రయత్నించకపోతే నాశనానికి దిగజారిపోతాడు. ఇక ముందున్నది నాశనమే తప్ప పరలోకం కాదు. వేదనే తప్ప ఆనందము కాదు. అందుకే దేవుడు మరల మరల చెబుతున్నాడు చూడండి. మీరు దేవుని ఆలయమైయుండాలి, మీలో దేవుని ఆత్మ నివసించాలి. దేవుని ఆత్మ మీలో నివసించాలని మీరెరుగరా? ఇప్పటివరకూ మీకెవరూ చెప్పలేదా? అని దేవుడు అడుగుతున్నాడు. మీరు జాగ్రత్తగా ఆలోచించండి.

మనలో దేవుని నివసింపజేసుకునేంత పవిత్రులమా మనము? మనలో దేవుని ఆత్మను నివసింపజేసుకునేంత గొప్పవారమా మనము? అవును! అలా తయారు కావాలి. అలా కావాలనే భూమి మీద మనలను పుట్టించాడు. మనకు ఒక శరీరాన్ని ఇచ్చాడు. ఇవన్నీ మనము తెలుసుకున్న తరువాత దేవుని వాక్యాన్ని అనుగ్రహించాడు. వాక్యమును మనము గ్రహించిన తరువాత దేవుని ఆత్మను మనలో నివసింపజేసుకోవాలి అన్నాడు. మనిషిలో అనగా, దేవుని కుమారునిలో తానుండాలి అనుకున్నాడు దేవుడు. కట్టడాలలో ఉండాలి అని ఆయన ఎన్నడూ అనుకోలేదు. సొలొమోను కట్టించిన మందిరములోనే ఆయన ఉండనప్పుడు, ఇక ఏ మందిరములో ఆయన ఉంటాడు చెప్పండి. అందుకే ప్రతి మనిషి ఆయనకు ఆలయముగా మారాలి అనుకున్నాడు తండ్రి. ఇదే వాస్తవాన్ని యేసుక్రీస్తు, తాను బ్రతికియున్న కాలములో యూదుల మధ్య చెబుతున్నప్పుడు, యూదులు అంగీకరించారేమో చూడండి. ససేమి అంగీకరించలేదు. మనిషే దేవునికి ఆలయమా? మనిషి దేవునికి ఆలయముగా ఉండటానికి వీలులేదు. సొలొమోను కట్టించిందే అసలైన ఆలయం! అందులోనే దేవుడుండాలి. ఇదీ యూదుల యొక్క వాదన. కానీ యేసుక్రీస్తు వారి వాదనను మీ కళ్ళారా చూడండి. యేసుక్రీస్తు భూమి మీదకు వచ్చి దేవుణ్ణి ప్రకటించాడు. దేవుణ్ణి బయలుపరిచాడు అని మనకు తెలుసు. ఎలా బయలుపరిచాడో, దేవుని రహస్యాలు ఎలా చెబుతున్నాడో, పరలోక సంబంధమైన విషయాలను ఎలా తెలియజేస్తున్నాడో, మనిషి అజ్ఞానాన్ని ఎలా ఖండిస్తున్నాడో, యేసుక్రీస్తును గూర్చిన కొన్ని వాస్తవాలను చూసి, మనము జ్ఞానమును నేర్చుకుందాం. **యోహాను 2 : 16** "పావురములు అమ్మువారితో– వీటిని ఇక్కడ నుండి తీసికొని పొండి. నా తండ్రి ఇల్లును వ్యాపారపుటిల్లుగా చేయకుడని చెప్పెను. ఆయన శిష్యులు – నీ యింటిని గూర్చిన ఆసక్తి నన్ను భక్షించునని వ్రాయబడియున్నట్టు జ్ఞాపకము చేసికొనిరి. కాబట్టి యూదులు – నీవు ఈ కార్యములు చేయుచున్నావే; యే సూచనక్రియను మాకు చూపెదవని ఆయనను అడుగగా, యేసు – ఈ దేవాలయమును పడగొట్టుడి, మూడు దినములలో దాని లేపుదునని వారితో చెప్పెను." యెరూషలేము దేవాలయము దగ్గర నిలుచున్న యేసు, యూదులతో పలుకుతున్న ఆ మాట ఏమిటంటే ఈ దేవాలయాన్ని పడగొట్టండి. మూడు దినాలలో మరలా తిరిగి కడతాను అని చెప్పగానే యూదులు ఏమనుకుంటున్నారో చూడండి. యూదులు – ఈ దేవాలయమును మా పితురుడైన సొలొమోను ఎన్నాళ్ళు కట్టాడో తెలుసా! ఈ దేవాలయమును మా పితరులు

ఎంతమంది, ఎన్ని తరాలలో పుట్టినవారు కట్టారో తెలుసా! అసలు ఒక తరంలో పుట్టినవారు ఈ దేవాలయాన్ని చూడలేదు. కడుతూ, కడుతూ చనిపోయారు. “మా పితరులు ఈ దేవాలయాన్ని 46 సంవత్సరములు కట్టిరే. నీవు మూడు దినములలో దానిని లేపుదువా అనిరి”. మూడు దినాలలో దానిని తిరిగి కట్టడానికి నువ్వేమైనా పిచ్చోడివా? వెఱ్ఱివాడవా? క్రీస్తును గూర్చిన వార్త నశించుచున్న వారికి వెఱ్ఱితనమే కదా! యేసును గూర్చిన వార్త, ఆయనను గూర్చిన సంగతి నశించిపోతున్న వారికి ఎలా ఉంటుంది? వెఱ్ఱితనముగానే వుంటుంది. మాస్టారు వచ్చి స్కూల్లో పిల్లవాడికి ‘ఒరేయ్ బాగా చదువుకోరా’ అన్నాడనుకోండి. ‘వీడు నాకు చెప్పొచ్చాడురా’ అంటాడు విద్యార్థి. అంటే అది వాడికి వెఱ్ఱితనం! మాస్టారు ఇలా ఎందుకు చెబుతున్నాడు? బాగా చదవమని ఎందుకు చెబుతున్నాడు? హోమ్‌వర్క్ చేయమని ఎందుకు చెబుతున్నాడు? పరీక్షల్లో పాస్ అవుతావనే తప్ప, ఆయనకు నువ్వేదో ఇస్తావని కాదు. ఆయనకు నువ్వేదో సంపాదించి పెడతావని కాదు. నీవు బాగుపడతావనే చెబుతాడు. కానీ, ఆ విద్యార్థి ఏమనుకుంటాడు? మాస్టారు మాటలను ఎప్పుడూ సరిగ్గా, మంచివిగా స్వీకరించడు. ఏమనుకుంటాడంటే, మాస్టారు నా మీద కక్షతో చెబుతున్నాడు. నా మీద కోపంతో చెబుతున్నాడు. నన్ను ఆడుకోడానికి వదిలేయొచ్చుగా, నన్ను అల్లరి చేయడానికి వదిలేయొచ్చుగా, ఎందుకు నన్నిలా పదే పదే, కష్టపెడుతున్నాడు? ఆ సమయంలో విద్యార్థికి ఇదేమీ అర్థం కాదు. ఎందుకంటే, ఆ పరిస్థితులలో వాడు నశించిపోతున్నాడు గనుక. ఫెయిల్ అయిపోవడానికి సిద్ధంగా ఉన్నాడు గనుక ఎన్ని చెప్పినా అప్పుడు వాడికి అర్థం కావు. అర్థం చేసుకున్నవాడే ఉత్తీర్ణుడవుతాడు. అందుకే నశించుచున్న వారికి సిలువను గూర్చిన వార్త వెఱ్ఱితనముగా ఉంటుంది. యేసుక్రీస్తువారు కూడా ఆనాడు ఈ మాటలు చెబుతుంటే, యూదులందరూ అపహాస్యం చేస్తున్నారు. ఏమిటీ, నీవు ఈ మందిరమును మూడు దినములలో కడతావా? అని వారు భ్రమిస్తున్నారు. కానీ, యేసు పలుకుతున్నది మీరు కట్టుకున్న సొలొమోను దేవాలయమును గూర్చి కాదు. అందులో ఎవరుంటారు? అందులో మీరుండొచ్చు. కానీ, దేవుడుంటాడా? అందులో నా తండ్రి ఉంటాడనుకుంటున్నారా? దేవుని గూర్చి యేసుక్రీస్తుకు మాత్రమే బాగా తెలుసు. సొలొమోను కట్టించిన ఈ దేవాయలములో దేవుడు ఉండడని సొలొమోనే చెప్పాడు. యూదులు ఆ సంగతిని ఎప్పుడూ చదివి వుండరు. వారి చేతిలో ధర్మశాస్త్రము, పాతనిబంధన గ్రంథాలున్నా, ఎప్పుడూ వారు వాటిలో ఉన్న పరమార్థాన్ని అర్థం చేసుకోలేదు. అందుకే వారు దేవాలయమనగానే, 46 సంవత్సరాలు కట్టిన దేవాలయాన్నే చూపిస్తున్నారు. కానీ, వారి శరీరమే దేవునికి ఆలయమన్న పాఠాన్ని నేర్పించటానికి ప్రారంభం నుంచి దేవుడు తన భక్తుల ద్వారా, ప్రవక్తల ద్వారా ఎన్నో మాటలు వ్రాయిస్తున్నాడన్న సంగతిని వారు అప్పటికీ గ్రహించలేదు. మన నామకార్థ క్రైస్తవులు ఇప్పటికీ తెలుసుకోలేదు.

అందుకే యేసుక్రీస్తు ఏమంటున్నాడో తెలుసా? ఈ దేవాలయాన్ని పడగొట్టండి అని దేనిని చూపిస్తున్నాడు? తన శరీరాన్ని చూపిస్తున్నాడు తప్ప, తమ ఎదుట వున్న 46 సంవత్సరాలు కట్టిన యెరుషలేము దేవాలయాన్ని మాత్రము కాదని మీరు గుర్తుంచుకోవాలి. ఆనాటి యూదులకు అది అర్థం కాలేదు. అందుకే వారు సొలొమోను దేవాలయాన్ని మాత్రం బాగా చూసుకుంటున్నారు. వారు మాత్రం అపవిత్రులుగానే మిగిలారు. ఈ రోజు మీరు కూడా అలాగే ఉన్నారా? పవిత్రములు కావలసింది దేవాలయములో, కట్టడాలో కాదు! మీరే మారాలి. మీలోనికి దైవము రావాలి. మనిషి కట్టిన దేవాలయములోనికి దైవము రాదు. ఎందుకంటే, అందులో ఆయన నివసించడు. ఆయన కట్టుకున్న, ఆయన సృష్టించిన తల్లిగర్భములో మీకిచ్చిన, ఈ దేహములోనే ఆయన ఉండటానికి ప్రయత్నిస్తున్నాడు. మీ మాటల ద్వారా ఆయన ఈ సమాజానికి కనిపించాలి. మీ ప్రవర్తన ద్వారా ఈ సమాజానికి ఆయన తెలియబడాలి. మీలో నివసిస్తూ, మీలో నుండి ఆయన ఈ ప్రపంచానికి పరిచయమవ్వాలి. అంతేగానీ, దేవాలయములో ఉండిపోకూడదు. అందుకే యేసుక్రీస్తు చెప్పిన అద్భుతమైన మాటలను చూడండి. ఇప్పటివరకు ప్రపంచంలో పుట్టిన ఏ వ్యక్తి ఈ మాట చెప్పలేదు. శరీరమే దేవాలయమన్న సంగతిని యేసుక్రీస్తు తప్ప ఎవ్వరూ ప్రకటించలేదు. అందుకే మీరు నమ్మిన, నేను నమ్మిన యేసు ఎంత గొప్పవాడో చూడండి. ప్రపంచానికి కనువిప్పు కలుగజేసిన మార్గదర్శి యేసుక్రీస్తు. అందుకే ఆయన శరీరమనే దేవాలయాన్ని గూర్చి చెబుతున్నాడని వ్రాయబడింది. **యోహాను 2 : 21** లో “అయితే ఆయన తన శరీరమను దేవాలయమును గూర్చి ఈ మాట చెప్పెను”. అంటే,

యేసు యొక్క శరీరము అప్పటికే దేవునికి ఆలయముగా మారిపోయింది. అందుకే యేసు ఎంత గొప్పగా చెప్పగలిగాడో చూడండి. ఈ దేవాలయమును పడగొట్టండి అన్నాడు. మీ శరీరాన్ని చూపిస్తూ ఇది దేవాలయమని మీరు ఎవరితోనైనా ఎప్పుడైనా చెప్పగలిగారా? దేవుడు నాకిచ్చిన ఈ దేహమే దేవాలయమని మీరు చెప్పగలరా? ఒకవేళ మీరు చెబితే, మీ మాటలు పవిత్రంగా ఉండాలి. తప్పుడు మాటలు పలుకకూడదు. ఒకవేళ మీరు చెప్పగలిగితే, మీ ఆలోచనలు దేవుని కొరకే ఉండాలి. మీ క్రియలు దేవుని క్రియలుగా ఉండాలి. మీ అడుగులు దేవుని కొరకైనవిగా ఉండాలి. అప్పుడు మీరు కూడా చెప్పగలరు. ఏమనో తెలుసా! "ఈ నా శరీరం దేవాలయము అని"! యేసు చెబుతున్నాడండీ. ఎందుకంటే యేసు మాట – దేవుని మాట, యేసు క్రియ – దేవుని క్రియ. యేసు ఏమి చేసినా అది దేవుని కొరకు, అది దేవుని ఇష్టాన్ని నెరవేర్చేది. అందుకే యేసు దేహమే దేవునికి ఆలయమయింది. పసిపిల్లల దగ్గర నుంచి, వృద్ధుల వరకూ, ప్రతీ ఒక్కరూ దేవుని ఆలోచనలను పండిచగలిగితే, ప్రతీ ఒక్కరి శరీరము దేవాలయముగా మారిపోతుంది.

మనిషి నిర్మించే కట్టడాలను గూర్చి దేవుడు ఏనాడూ పట్టించుకోలేదు. కానీ ఆయన కట్టిన దేహాన్ని గురించి మాత్రమే ఆయన మాట్లాడుతున్నాడు. దేవుడిచ్చిన ఈ దేహాన్ని పాడుచేసుకుంటున్నారా? ఈ దేహాన్ని దెయ్యానికి ఆలయముగా మలచి, నాశనానికి జారిపోతారా? సమాధిలోనికి వెళ్ళిపోతారా? అలాగైతే మీ ఆత్మ నిత్యమూ నరకాన్ని అనుభవించవలసిన పరిస్థితిని తప్పక ఎదుర్కోవాలి. అలా జరగడానికి వీలు లేదు. మీ దేహాన్ని దేవాలయముగా మలచి, మిగిలిన ఈ కొద్ది దినములైనా దేవునికి సంతోషాన్ని ఇవ్వండి. దేవుణ్ణి వెదకండి, ఆయనను కనుగొనండి. అప్పుడు మీరు వివేకవంతులు. పరలోకానికి ఆహ్వానింపబడతారు. యేసుక్రీస్తు దేవాలయముగా మారిపోయి, సమాధి చేయబడి, తిరిగి లేచి, మూడు దినాలలో తిరిగి మరలా దానిని కట్టి చూపించాడు. ప్రపంచానికి తిరిగి లేచినవాడుగా, శకపురుషునిగా ఆయన నిరూపించాడు. దేవుని కొరకు బ్రతికిన ప్రతీ ఒక్కడు, దేవునికి ఆలయముగా తన శరీరాన్ని మలచిన ప్రతీ ఒక్కడు, తిరిగి అలాగే లేస్తాడని, మహిమ శరీరముతో పరలోకానికి వెళతాడని నేర్పించాడు. భూమి మీద మీరు ఆలోచించవలసింది కట్టడాలు, చర్చ్‌లు, సమాధులు, గోపురముల కొరకు కాదని, ఖచ్చితంగా ఆలోచించాల్సింది మీరు ధరించుకున్న శరీరమనే దేవుని ఆలయాన్ని గూర్చి అని చెప్పిన ఆ యేసుక్రీస్తువారి మాటలకు మీరు గౌరవమిస్తే, ఇప్పటినుంచయినా మీ బ్రతుకులను మార్చుకోండి. మీ దేహాన్ని దేవునికి ఆలయముగా మలచండి. భూమి మీద అదే అసలు సిసలైన దేవుని ఆలయం!!


ప్రభువునందు నమ్మకస్థుడు,

**జె. మణి కుమార్**

సన్ ఆఫ్ గాడ్ – క్రైస్ట్ చర్చ్ – సామర్లకోట – 8978414178.


**ప్రశ్నలు**

1. ఈ భూమిపై ఏ దేవాలయములో దేవుడుంటాడు?
2. యెరూషలేములోని దేవాలయ వైభవాన్ని వివరించండి.
3. దేవుని కలుసుకోవాలంటే ఆయన అసలైన చిరునామా ఏది?
4. సొలోమోను యెరూషలేము దేవాలయమును ఎందుకు నిర్మించాడు?
5. దేవుని దృష్టిలో వివేకము అంటే ఏమిటి? దానిని ఎవరు కలిగియున్నారు?
6. మనుష్యులు నిర్మించిన దేవాలయాలలో సర్వోన్నతుడెందుకు నివశించడు?
7. యేసుక్రీస్తు మూడు దినములలో తిరిగి కడతానన్న అసలైన దేవుని ఆలయమును గూర్చి వివరించండి.

# 5. శిక్షార్హమైన నేరమేది?

ప్రియమైన జనులారా!

ఈరోజు చాలా గ్రామాలలో, పట్టణాలలో దేవుని వాక్యము ప్రకటింపబడుతున్నప్పటికీ, ఒక క్రొత్త ఒరవడితో యేసుక్రీస్తును ప్రకటించవలసిన అవసరత ఈ తరములో ఎంతైనా ఉంది. యేసుక్రీస్తును అడ్డగించే మనుష్యులు ఈరోజు సమాజంలో ఎక్కువగా ఉన్నారు. అది ప్రత్యక్షంగానే కాకపోవచ్చు, పరోక్షంగాను అనేకమంది కేవలం వారికున్న దుర్నీతిచేత ఈ సత్యాన్ని అడ్డగిస్తున్నారు. యేసుక్రీస్తులో ఉన్నదంతా నూటికి నూరుశాతం సత్యం, జీవం మరియు పరలోకానికి మార్గం. దీనిని అడ్డగించాలి అనుకొన్నవారికి దేవుడు చెప్పిన మాటేమిటంటే, మునికోలలకు ఎదురుతన్నుట చాలా కష్టం. ఎవ్వరూ ఈ దేవునిరాజ్యాన్ని గాని, యేసుక్రీస్తు మాటలనుగాని అడ్డగించడానికి ప్రయత్నించకూడదు. మీకు అర్థం కానప్పుడుగాని, ఒకవేళ అసూయ కలిగినప్పుడుగాని నిశ్శబ్దముగా ఉండటమే మంచిది. యేసుక్రీస్తు జ్ఞానానికి అడ్డుపడటం, బైబిల్ అనే ఈ మహాజ్ఞానాన్ని తప్పుగా వక్రీకరించడం, దీనిమీద లేనిపోని మాటలను ప్రకటించటం మంచిదికాదు. యేసుక్రీస్తు ప్రేమాస్వరూపి. యేసుక్రీస్తు క్షమాగుణాన్ని కలిగినవాడు. శత్రువులను, తనను శిలువ వేసినవారిని కూడా క్షమించిన మనస్తత్వం కలిగినవాడు గనుక ఈ రోజు ప్రపంచంలో ఎక్కువ మంది ఎవరిజోలికి వెళ్ళకుండా యేసుక్రీస్తు జోలికే వస్తుంటారు. ఎన్ని అబద్ధపు మాటలు చెప్పినా, ఎలాంటి అసంబద్ధాలను ప్రయోగించినా యేసుక్రీస్తు అందరినీ క్షమిస్తాడు అనే ఒకే ఒక్క కారణంతో, ఈ రోజు అనేకమంది యేసుక్రీస్తు మీద తప్పుడు అభియోగాలు చేస్తున్నారు.

క్రీస్తు శకము మొదటి శతాబ్దంలో ఇశ్రాయేలు సమాజము, యూద సమాజమంతా ఒక్కటై యేసును చంపివేయాలని, యేసుక్రీస్తు సమాజానికి అక్కర్లేదని ఆయన మీద తప్పుడు నినాదాలు చేస్తున్నప్పుడు, ఆయన బ్రతికిన ఆ కొన్నాళ్ళే ఆయనంటే వారికి పొసగక, ఆయన బ్రతుకును భూమి మీద అంతమొందించాలని అనుకొన్నపుడు, ఆనాటి దుష్ట సమాజానికి పసిబాలురే సమాధానం చెప్పారు. దావీదు కుమారునికి స్తోత్రము అన్నారు, ప్రభువు పేరిట వచ్చురాజు స్తుతింపబడును గాక అన్నారు. ఆ పసిపిల్లలనోట ఆ మాటలు వింటున్నప్పుడు చాలామంది శాస్త్రులుగా, పరిసయ్యులుగా, సద్దూకయ్యులుగా, ప్రధానయాజకులుగా ఉన్నవారు అసూయపడ్డారు. ఈ చిన్నపిల్లలు చెబుతున్నది వింటున్నావా అని యేసుక్రీస్తును అడిగారు. అప్పుడాయన, అవును వింటున్నాను. వీరు చెప్పే మాటలలో వాస్తవముంది. ఎందుకంటే దేవుడు వీరిని గూర్చి ఒక మాటను వ్రాయిస్తూ, పసిబాలుర నోట స్తోత్రము సిద్ధింపచేస్తాను అన్నాడు. వారే ఈ సమాజానికి సమాధానము చెబుతారు. ఈతరంలో ఉన్న మనము, చిన్నపిల్లలకు వాక్యమును నేర్పించుట ద్వారా, మరో తరానికి ఈ వాక్యమును అందజేయాలి. అది తల్లిదండ్రుల బాధ్యత. వారికి విద్యను నేర్పిస్తున్న వారి బాధ్యత. చుట్టూ ఉన్న సమాజము యొక్క బాధ్యత. మన బ్రతుకులు కొంతకాలము కొనసాగాలి అంటే దేవుని మాట సమాజంలో బ్రతకాలి. భావితరాలవారు బ్రతకాలంటే, చెట్లు నాటాలి అనుకొంటున్నారు చాలామంది. మరికొంతమంది, పర్యావరణాన్ని కాపాడాలనుకొంటున్నారు. మరికొంతమంది, ఆహారమును భద్రముగా కాపాడాలనుకొంటున్నారు. మరికొంతమంది, ఉద్యోగాలను సంపాదించుకోవాలనుకొంటున్నారు. మరికొంతమంది, వనరులను కాపాడుకోవాలి అనుకొంటున్నారు. మరికొంతమంది, రోగాలకు మందులు కనిపెట్టాలనుకుంటున్నారు. మరికొంతమంది, ఆయుష్కాలాన్ని పెంచుకోవాలనుకొంటున్నారు. ఇవేవీ సరైనవి కావు. భావితరాలకు మీరు మంచి పునాది వేయాలనుకొంటే, దేవుని వాక్యాన్ని కాపాడాలి. సమాజంలో, మనుష్యుల మధ్యలో దేవుని మాట సుస్థిరంగా నిలబడాలి. అది ఈ రోజు సమాధి అయిపోతోంది. ఎక్కడా దేవుని మాట కనిపించడం లేదు! వీధికో చర్చ్ ఉంది, బోలెడుమంది పాస్టర్లున్నారు. దేవునిమాట ఈ సమాజములో కరువైపోవడమేమిటి అనుకుంటున్నారా? నిజమైన దేవుని వాక్యము ఈ సమాజములో లేదు. ఎక్కడ చూచినా స్వార్థమే! ఎవరు చెప్పినా అన్యాయమే! అందుకే ఇలాంటి నిజమైన వాక్యమును మనము బ్రతికించాలి. నిజముగా మనము దేవుని చేత నిర్ణయింపబడిన తరములో పుట్టాము. దేవుడు సంకల్పించిన జనులలో మనము పుట్టాము. ఎందుకంటే సమాధి కాబోతున్న వాక్యానికి మరలా జీవము పోసి బ్రతికించడానికి మనము పుట్టాము. నిజంగా ఈ వాక్యము ప్రజలలోనుంచి నిర్మూలింపబడితే ఎక్కడా ఈ మాటలు

తెలియజేయకపోతే, ఎవరు ఈ ప్రపంచాన్ని బాగుచేస్తారు చెప్పండి? దేవుడు అందించిన మాటలను ఎవరు తెలియజేస్తారు చెప్పండి? ఒకనాడు ప్రారంభంలో అసలు పాపమనేదే ఈ భూమి మీద లేదు. అపరిశుద్ధత, అజ్ఞానము అనేవి ఈ సమాజంలో లేవు. అప్పుడు ఈ భూమి మీద బ్రతుకుతున్నది ఇద్దరే ఇద్దరు వ్యక్తులు. వారే మనందరికీ జన్మనిచ్చిన ఆది దంపతులు. వారి పేర్లు ఆదాము, హవ్వ అని మీ అందరికీ తెలుసు. వీరిద్దరూ ఏదెను అనే ఒక తోటలో బ్రతుకుతున్నప్పుడు వారి మధ్యలో అపవాది ప్రవేశించింది. ఈ సమాజాన్ని దేవునికి కాకుండా చేయడానికి, అజ్ఞానాన్ని పుట్టించడానికి, అక్రమమైన మార్గములో ప్రజలను నడిపించడానికి, ఆరోజు ప్రవేశించిన అపవాది, ఇదిగో ఈనాటికీ ఎంత విస్తృతంగా ప్రబలిందో మీ అందరికీ అర్థమవుతోంది. ఏ పల్లెటూరు చూసినా, ఏ మండలం చూసినా, ఏ పట్టణాన్ని చూసినా ఎలా నాశనానికి వెళ్ళిపోతుందో మీ అందరికి కళ్ళకు కట్టినట్టుగా కనిపిస్తుంది. ప్రపంచ ప్రజల మధ్యలో ఈ రోజు ఉన్నదేమిటో చెప్పండి? ఉదాహరణకు, కాకినాడ మెయిన్‌రోడ్‌కు మీరు వెళ్ళి చూస్తే, అక్కడ జరుగుతున్న కార్యక్రమాలేమిటో చెప్పండి. ప్రజలందరూ అసలు తీరిక లేని వాతావరణంలో అంత బిజీగా తమయొక్క జీవితాలను గడుపుతన్న ఆ తరుణంలో, వారికున్న పనులేమిటి చెప్పండి? వారికున్న ఆలోచనలేమిటి చెప్పండి?

ప్రియులారా! సమాజం పూర్తిగా అస్తవ్యస్తమయిపోయింది. ఎవరిదగ్గరికైనా వెళ్ళి, ఏమిటయ్యా నీ బ్రతుకు పరమార్థం? ఎందుకు నువ్వు బ్రతుకుతున్నావు? అని అడిగితే, ప్రతి ఒక్కరూ దేవునికి భిన్నముగా సమాధానము చెబుతారు తప్ప, నేను దైవము కొరకు బ్రతకాలని ఏ ఒక్కరూ చెప్పరు. ఒక విషయం చెప్పమంటారా? ఆరిన నేల మీద అనగా ప్రస్తుతం ఉన్న భూభాగం మీద బ్రతుకుతున్న సుమారు 750 కోట్లమంది ప్రజలందరూ దేవుని కొరకే బ్రతకాలి. దేవుని యొక్క సంకల్పాన్ని నెరవేర్చాలి. అందుకే ఈ భూమి మీదికొచ్చారు. ఇప్పటివరకు ఈ విషయం ఎవ్వరికీ తెలియలేదు. ఎందుకంటే అపవాది ఈ జ్ఞానాన్ని సమాధి చేసేసింది. దానియొక్క ఆగడాలు ఎప్పటినుండి ప్రారంభించిందో తెలుసా? దానియొక్క ఈ దుష్కార్యక్రమం మొదటికాలమునుండి ప్రారంభించింది. మొదటి దంపతులైన ఆదాము హవ్వలిద్దరినీ తన 'అ'జ్ఞానంలోనికి, తన వక్రమైనమార్గము లోనికి లాగేసుకుంది. దేవుని యొక్క సన్మార్గాన్ని అడ్డగించింది. అందుకే వారిద్దరి విషయంలో దేవుడు పలికిన మాటేమిటో తెలుసా? నేను చేయవద్దన్న పని చేసిన తరువాత నా దృష్టిలో మీరు చనిపోతారు అన్నాడు. దేవుని ఆజ్ఞను, దేవుని మాటను అతిక్రమించి, వారు(ఆదాము, హవ్వలు) పాపాన్ని జరిగించారు. ప్రకృతిలో ఏదైతే ఉండకూడదో, ప్రజల మధ్య ఏదైతే జరుగకూడదో అది ఆ రోజే ఊపిరిపోసుకుంది. దేవుని కుమారులుగా భూమి మీదకు వచ్చిన ఆదాము, హవ్వల సంతానముగానే మనము బ్రతుకుతున్నాము. ఎన్నో శతాబ్దాలుగా వారినుండి పుట్టుకొచ్చిన వారే ఈ మానవజాతులంతా! వీరందరూ 'వారు' ఇచ్చిన ఆ లక్షణాలనే కలిగి ఉన్నారు. అవే, దేవుని ఆజ్ఞను అతిక్రమించడం మరియు పాపముచేయడం!

**1 యోహాను 3 : 4** "పాపము చేయు ప్రతివాడును ఆజ్ఞను అతిక్రమించును; ఆజ్ఞాతిక్రమమే పాపము". మనకు పరలోకమందున్న తండ్రి యొద్ద నుండి దిగివచ్చిన ఆజ్ఞలేమున్నాయి? అసలు మనకు ఆజ్ఞలేమున్నాయో కూడా తెలియదు! మనిషి ఎలా బ్రతుకుతున్నాడో చూశారా? పరలోకమందున్న తండ్రి ఎవరో కూడా ఈ మనిషికి తెలియదు. మనిషిగా పుట్టిన ప్రతీ ఒక్కరూ దేవుని ఆజ్ఞను అతిక్రమిస్తుంటే, ఆ దేవుని ఆజ్ఞాతిక్రమమే పాపము. మరి దైవదృష్టిలో ఈ పాపము మనుష్యులను ఎక్కడికి తీసుకువెళ్ళిపోతుంది? ఈ పాపము చివరికి మనిషికిచ్చిందేమిటి? ప్రారంభంలోనే మనము చూసాము. ఆదాము హవ్వలతో దేవుడు, మీరు నా ఆజ్ఞను అతిక్రమించడం వలన చనిపోతారన్నాడు. దానిని వంశపారంపర్యంగా తీసుకున్న ఈ మనుష్యులు, నేటికీ ఆ పాపాన్ని జరిగిస్తూ మరణిస్తున్నారు. పాపము యొక్క పర్యవసానాన్ని, దానియొక్క చివరి దశను దేవుడు వ్రాయించాడు. **రోమీయులకు 6 : 23** "ఏలయనగా పాపము వలన వచ్చు జీతము మరణము. అయితే దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తుయేసునందు నిత్యజీవము" పాపము వలన వచ్చే జీతము మరణం. ఈ చావు పేరు చెప్పగానే ప్రతీ ఒక్కరికీ భయం, కానీ పాపము పేరు చెప్పగానే ప్రతీఒక్కరికీ ఇష్టం. ఏమిటండీ, ఒక విద్యార్థికి పరీక్ష ఫలితాలు వచ్చినప్పుడు, నువ్వు ఫెయిల్ అయిపోయావు అని చెప్పగానే భయపడతాడు. కానీ, నీవు పరీక్షకు ముందు బాగా చదువు అని చెప్పినప్పుడు, ఎప్పుడూ చదవడానికి ముందుకు రాడు. బాగా ఆలోచిస్తున్నారా? మనిషి కూడా అలాగే మారిపోయాడు. దైవాజ్ఞ

అతిక్రమణ అనగానే మనిషికి చాలా ఇష్టం! దేవుని ఆజ్ఞను అతిక్రమించడం, దేవుని కొరకు బ్రతకకపోవడం, దేవునిని పట్టించుకోకపోవడం, దేవుని మాటలనగానే నిర్లక్ష్యభావం, మనిషికి ఒక వాడుక. ఇలాంటి పరిస్థితులలో ఉన్న మనిషికి చివరికి వచ్చే ఫలితమే మరణం అన్నాడు. మీరందరూ మరణిస్తారా? ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మనుష్యులందరూ మరణాన్ని కోరుకుంటున్నారా? ఇక్కడ ఒకవేళ మీకొక సందేహం రావచ్చు. అదేమిటంటే, నేనేమీ పెద్దగా పాపము చేయడంలేదు కనుక నేనెందుకు మరణిస్తాను అనుకోవచ్చు. పాపము అనగానే ఈ ప్రపంచ మనుష్యుల దృష్టిలో ఏమిటో తెలుసా? వ్యభిచారం ఒక పాపం, దొంగతనం ఒక పాపం, నరహత్య ఒక పాపం. ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా ఆయా దేశాల్లో న్యాయస్థానాలున్నాయి. మనకు కూడా భారత శిక్షాస్మృతి (ఇండియన్ పీనల్ కోడ్) ఉంది. ఈ కోర్టుల్లో ఉన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, వారు వ్రాసుకున్న పుస్తకాల ప్రకారం ఆలోచించిన విధానంలోనే మనుష్యజాతి కూడా ఆలోచిస్తుంది. ఏమనంటే నేను నరహత్య చేయలేదు, వ్యభిచారం చేయలేదు, దొంగతనం చేయలేదు కనుక నేను నేరస్తుణ్ణి కాదు. నేను నీతిమంతుణ్ణి అనుకుంటుంది. మనిషి పుట్టిన తరువాత బాగా చదువుకోవడం, బాగా చదువుకున్న తరువాత ఒక ఉద్యోగము సంపాదించడం, తరువాత వివాహము చేసుకోవడం, పిల్లల్ని కనడం, ఆ పిల్లల్ని పెద్దచేసి వారికి వివాహాలు చేయడం, చివరికి మంచానపడి చనిపోవడం! ఒకవ్యక్తి యొక్క సగటు జీవితాన్ని మనము ఆలోచిస్తే ప్రతి మనిషి జీవితములో ఉన్నది ఇదే కదా. దీనిని జరిగించిన ప్రతి మనిషి ఏమనుకొంటున్నాడంటే, నేను నీతిమంతుణ్ణి, ఎందుకంటే నేను పాపము చేయలేదు. పాపమనగా వీడి దృష్టిలో వ్యభిచారం, దొంగతనం, నరహత్య, సాటి మనిషిని మోసగించడం. కేవలం ఇవి మాత్రమేనా పాపములు? ఈరోజు కోర్టులు కూడా అదే చెబుతున్నాయి. మనిషి పాపాత్ముడని లేక నేరస్తుడని ఎప్పుడు నిర్ధారిస్తారు? వారి దగ్గర ఉన్న జాబితాలో కొన్ని నేరాలున్నాయి. ఫలానా నేరాన్ని అతిక్రమిస్తే, ఫలానా ఐ.పి.సి. సెక్షన్ ప్రకారం నీవు నేరం చేసినట్టు, నీవు శిక్షకు అర్హుడవు అంటున్నారు. ఇదేనా పాపమునకు ఉన్న పూర్తి నిర్వచనం? అసలు నిర్వచనమేమిటో దేవుని దగ్గర విచారణ చేసి తెలుసుకుందాము. దేవుని దగ్గర కూడా ఒక న్యాయస్థానం ఉంది. దేవుని దగ్గర కూడా ఒక చట్టం, పుస్తకం మరియు ధర్మం ఉన్నాయి. ఆ ధర్మమేమి చెబుతుందో ఈరోజు మీరు చూడాలి. ఎందుకంటే ప్రపంచవ్యాప్తంగా ఉన్న మనుష్యులందరూ భ్రమపడుతున్నట్టే మీరు కూడా భ్రమపడుతూ ఉండవచ్చు. నేనెటువంటి నేరము చేయలేదు, నేనెటువంటి భయంకరమైన పాపము చేయలేదు కనుక ఈ కోర్టుల దృష్టికి నేను నీతిమంతుణ్ణే, దేవాది దేవుని దృష్టికి కూడా నేను నీతిమంతుణ్ణే అనుకుని ఒకవేళ మీరు భ్రమపడుతుంటే ఒక్కసారి చూడండి. ధనవంతుడైన ఒక మనిషికి దేవుడు విధించిన శిక్ష, ఆ శిక్ష విధింపబడుటకు అతడు చేసిన నేరాన్ని అక్కడ చెబుతున్నాడు. యేసుక్రీస్తువారి నోట పలుకబడిన ఆ వాస్తవాన్ని చూడండి!

**లూకా 16 : 24–** "తండ్రివైన అబ్రహామా, నాయందు కనికరపడి, తన వ్రేలికొనను నీళ్లలోముంచి నా నాలుకను చల్లార్చుటకు లాజరును పంపుము. నేను ఈ అగ్నిజ్వాలలలో యాతనపడుచున్నాను". ఎందుకంటే నేను శిక్షలో ఉన్నాను. నేను నేరస్తుడనైపోయాను అంటున్నాడు. అప్పుడు అబ్రహాము ఈ శిక్షలోనికి ఆ ధనవంతుడెందుకొచ్చాడో చెప్పుచున్నాడు చూడండి. **లూకా 16 : 25–** "అందుకు అబ్రహాము– నా కుమారుడా, నీవు నీ జీవితకాలమందు నీకిష్టమైనట్టు సుఖము అనుభవించితివి, ఆలాగుననే లాజరు కష్టము అనుభవించెనని జ్ఞాపకము చేసికొనుము. ఇప్పుడైతే వాడు ఇక్కడ నెమ్మది పొందుచున్నాడు, నీవు యాతనపడుచున్నావు". ధనవంతుడు ఎందుకు యాతనపడుతున్నాడో, కష్టపడుతున్నాడో, శిక్షను అనుభవిస్తున్నాడో అబ్రహాము చెబుతున్నాడు. కుమారుడా, నీవు నీ జీవితకాలమందు వ్యభిచారం చేసావు, నరహత్యలు చేసావు, దొంగతనాలు చేసావని ఏమీ చెప్పడం లేదు. అబ్రహాము మరేమి చెబుతున్నాడు? ఒకే ఒక్క నేరాన్ని మోపాడు. ప్రాథమికమైన నేరమది. దేవునిచట్టంలో మొట్టమొదట దేవుడు వ్రాసే నేరమది. ఈ ప్రపంచవ్యాప్తంగా ఏ కోర్టు, ఏ న్యాయమూర్తులు ఈ నేరాన్ని ప్రస్తావించరు. ఆ నేరమేమిటో చూడండి. నీ జీవితకాలమందు నీకిష్టమైనట్టుగా సుఖము అనుభవించితివి. అందుకే శిక్షలోనికి వచ్చిపడ్డావని వ్రాయబడింది. ఉదాహరణకు, కాకినాడలో ఒక జిల్లా జడ్జి ఉన్నాడు. రాష్ట్రానికి హైకోర్టులో హైదరాబాద్‌లో ఒక జడ్జి ఉన్నాడు. భారతదేశములో సుప్రీంకోర్టు ఢిల్లీలో ఉంది, అందులో న్యాయమూర్తుల బృందము ఉంది. ఏ జడ్జి అయినా

మన భారతదేశానికి సంబంధించినంత వరకు మన జీవితకాలంలో మనము సుఖమును అనుభవిస్తే మనకు శిక్షను విధిస్తారా? ఏ సెక్షన్ చెప్పింది చెప్పండి? ఐ.పి.సి. లో మొదటి సెక్షన్ నుండి ఎన్ని వందల సెక్షన్స్ అయితే ఉన్నాయో అన్ని సెక్షన్స్‌లో కూడా ఈ నేరము లేదు. అది ఏ నేరం? నీ జీవితకాలములో నీకిష్టమైనట్టుగా సుఖము అనుభవించుటయనే నేరము. లోకములో ఉన్న మనిషి దేవుని దగ్గర నేరస్థునిగా బోనులో నిలబడి, నేను బాగా చదువుకున్నానయ్యా, తర్వాత మంచి కలెక్టర్ జాబ్ తెచ్చుకున్నాను. నేను సివిల్స్ రాసాను, గ్రేడ్-1 జాబ్ తెచ్చుకున్నాను. నాకు నెలకు లక్ష రూపాయల జీతం. నేను నా భార్యా పిల్లలతో సుఖముగా జీవితాన్ని గడిపాను. ఇళ్ళు, పొలాలు, బంగారము, అన్నీ కొనుక్కుని చాలా చక్కగా ఆశీర్వదింపబడ్డాను. అది కూడా దైవము వలనే ఆశీర్వదింపబడ్డాను అని అనుకొన్నాను. బాగా సంపాదించాను, రిటైర్‌మెంట్ వచ్చిన తర్వాత ఆ అధికారము నుంచి దిగిపోయి క్రిందికొచ్చేసాను. తరువాత మిగిలిన ధనముతో కొంతకాలము అనుభవించాను. తరువాత ఇంకా మిగిలిన దానిని నా పిల్లలకు, భార్యకు వదిలేసి వచ్చేసాను. ఇప్పుడు బోనులో నిలబడి ఇది నేరమా తండ్రీ? అని అడిగితే నీవు చేసిన మొదటి నేరం, ఇప్పుడు నీవు చెప్పిందే అంటున్నాడు దేవుడు. నీవు చేసిన మిగిలిన నేరాలను తరువాత చెబుతాను. నరహత్య చేసావో, వ్యభిచరించావో, మోసగించావో, ఇవన్నీ తరువాత చెబుతాను. కానీ నీవు చేసిన మొదటి నేరమేమిటో తెలుసా? నీ జీవితకాలములో నీకిష్టమైనట్టుగా సుఖము అనుభవించుటయే. జాగ్రత్తగా ఆ మూడు పదాలను మీరు చూసుకోవాలి. ఎందుకంటే, ఈ నేరము లోనికి మీరు కూడా వస్తారు. ప్రపంచములో ఎవ్వరూ ఈ నేరానికి అతీతులు కారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 750 కోట్లమంది మనుష్యులూ ఈ నేరము క్రిందకి వచ్చేస్తారు. అనుభవించు రాజా... అని ఎవడో పాట వ్రాసాడు! వాడు వ్రాసినట్టుగా నీవు కూడా పోయావా? నీకిష్టమైనట్టు బ్రతుకును కొనసాగించుకుంటే కుదరదు బిడ్డా! మరెవరికిష్టమైనట్టు కొనసాగించడానికి ఈ బ్రతుకు? ఆయనకిష్టమైనట్టు కొనసాగించడానికే దేవుడు నీకు ఈ బ్రతుకునిచ్చాడు. పరలోకపు తండ్రి కోరిక నెరవేర్చడానికి నీవు వచ్చావు. ఈ సృష్టి నీదికాదు, ఈ బ్రతుకు నీదికాదు, ఈ కాలము నీదికాదు. అలాంటి చిన్న బ్రతుకును కలిగి వచ్చిన మనిషి, దేవునినే ధిక్కరిస్తున్నాడీ రోజు. దేవుని దృష్టిలో చాలా భయంకరమైన పాపమిది! శిక్ష విధించదగిన నేరమిది! ఈ రోజు శిక్షను విధిస్తున్న న్యాయమూర్తులు కూడా చేసే పాపమిది. బాగా ఆలోచించాలి! ఒక జడ్జిగా, నల్లకోటు ధరించుకొని కూర్చున్న న్యాయమూర్తిగా, తన నోటవెంబడి ఏ తీర్పు వస్తే దానిని అమలుచేసే అధికారమును కలిగిన న్యాయమూర్తి కూడా ఈ విషయంలో దోషే! దేవునిచట్ట ప్రకారం, నీ జీవితకాలములో నీకిష్టమైనట్టు సుఖము అనుభవించుటయే ఈ నేరం. దానికి దేవుడు విధించిన శిక్షేమిటో తెలుసా? మరణములేని ఆత్మ బ్రతికినంత కాలము ఏడ్చుట, అనుక్షణము బాధపడుట. ముగింపులేని ఆత్మ నిరంతరమూ వేదన అనుభవించాలి. ఈ శరీరాన్ని విడిచిపెట్టిన ఆత్మకిక మరణము లేదు. అది జీవించినంత కాలము అనగా యుగయుగములు, తరతరముల వరకు నీవు బాధపడాలి, యాతన పడాలి. ఇది ఆనాడు ధనవంతునికి దేవుడు విధించిన శిక్ష. దేవుడు యేసుక్రీస్తువారి ద్వారా ప్రపంచానికి తెలియజేసిన మహాజ్ఞానపు సంగతి ఇది. మరి ఈ నేరము నుండి మనలను గట్టెక్కించేదెవరు? భూమి మీద మరణం మరియు ఈ శరీరాన్ని విడిచిపెట్టడమనేది అందరికీ సంభవించేదే. దీని నుండి తప్పింపబడాలని నేను చెప్పడం లేదు. కానీ ఆత్మ వెళ్ళిపోయే లోకమొకటి ఉంది. అది ఆత్మల లోకము. ఆత్మ కూడా శిక్షింపబడే అవకాశము ఉంది. ఆత్మ వెళ్ళబోయే పరిస్థితులను బైబిల్ మాత్రమే చెబుతుంది. ఏమిటా పరిస్థితి? నీవు భూమి మీద చేసిన పాపానికి వచ్చే జీతం లేక ఫలితం ఏమిటో తెలుసా? మరణం! ఎవరికా మరణం? నీ ఆత్మకు ఆ మరణం. మరణమనగా, దేవుని పరిభాషలో మీరు చేసిన నేరానికి అనుభవించబోయే ప్రతిఫలం. మరి దీనినుండి మనలను తప్పించేదెవరు చెప్పండి? ఈ భయంకరమైన శిక్షలో నుంచి మనలను రక్షించేదెవరు చెప్పండి?

దేవుడు ప్రారంభం నుండి మనుష్యులందరిని చూస్తున్నప్పుడు, వీరందరూ మరణిస్తూనే ఉన్నారు తప్ప ఎవ్వరూ జీవించడానికి ప్రయత్నించలేదు. మనకు జన్మనిచ్చిన ప్రారంభ తల్లిదండ్రులే చనిపోయినప్పుడు, దేవునిమాటను అతిక్రమించినప్పుడు, అపవాది మాటను పాటించినప్పుడు, ఈ మనుష్యజాతి దేవునిమాటను ఎలా వింటుంది చెప్పండి? వింటుంది అనుకోవడం అవివేకం. అది కేవలం అపోహ మాత్రమే, ఎందుకంటే అపవాది చాలా కుయుక్తితో

మనుష్యులను తన మార్గములో నడిపించుకోగలదు. ఈరోజు అపవాది ప్రయోగిస్తున్న బాణాలను చూడండి. ప్రపంచవ్యాప్తంగా ఎన్ని కోణాలలో మనుష్యులను పాడుచేస్తుందో చూడండి. ఒక ఎలక్ట్రానిక్ మీడియా, పత్రికా మీడియా, సినీ మీడియా, విద్యారంగం, రాజకీయం, ప్రభుత్వరంగం... ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతీ కోణంలో అపవాది తనదైన శైలిని చూపిస్తూ మనుష్యులందరినీ తనవైపు మలచుకుంటోంది. కానీ దేవుని జ్ఞానము వైపు మళ్ళించేవారెవరున్నారు చెప్పండి? అందుకే ప్రారంభము నుండి మనుష్యులను చూస్తున్న దేవుడు బాధపడుతున్నాడు. చాలా కష్టపడుతున్నాడు. ఎందుకంటే ఒక మంచి కార్యక్రమము నిమిత్తం, ఒక ప్రణాళిక నిమిత్తం మనుష్యులను పుట్టించాడు. కానీ వారు పోతున్నదంతా మరణానికి. అందుకే ఆయన ఆవేదనను చూడండి.

**ఆదికాండము 6 : 5–** "నరుల చెడుతనము భూమి మీద గొప్పదనియు వారి హృదయముయొక్క తలంపులలోని ఊహ అంతయు ఎల్లప్పుడూ కేవలం చెడ్డదనియు యెహోవా చూచి తాను భూమి మీద నరులను చేసినందుకు యెహోవా సంతాపము నొంది హృదయములో నొచ్చుకొనెను". ఎవరినిమిత్తం ఆయన కష్టపడుతున్నాడు? ఎవరి నిమిత్తం ఆయన కన్నీటిబొట్లు రాలుస్తున్నాడో తెలుసా? మనుష్యుల కొరకు! మనుష్యుల్లో ఉన్న అపవిత్రత అనగానే వారి యొక్క హృదయములోని ఆలోచనలన్నీ చెడిపోయాయి అంటున్నాడు. అంటే వారు కేవలం పాపాన్ని ప్రేమిస్తున్నారు. మరణానికి చేరువైపోతున్నారు. మరణం అనే జీతాన్ని తెచ్చుకొని, ఈ శరీరాన్ని విడిచిపెట్టి ఆ నిత్య నరకములోనికి, ఆ రెండవ మరణము లోనికి దిగజారిపోతున్నారు. అలాంటి వారిని చూస్తున్న దేవుడు బాధపడుతున్నాడు. తన హృదయములో నొచ్చుకుంటున్నాడు. అంటే, మనుష్యులు మరణాన్ని కోరుకోకూడదని, మనుష్యులు మరణానికి చేరువైపోకూడదని, ఈ పాపాన్ని వారు ద్వేషించి తనదైన మార్గములో పరలోకానికి పవిత్రులుగా రావాలని ఆయన కోరుకుంటుంటే, ఈ అపవాది వేసిన వలలో మనిషి చాలా సులభంగా చిక్కుకుపోతున్నాడు. అసలు మనిషి యొక్క అజ్ఞానం ఎప్పుడు ప్రారంభమవుతుందో తెలుసా? ఎప్పటినుండి మనిషి చెడిపోవడం ప్రారంభిస్తున్నాడో చూడండి.

**ఆదికాండము 8 : 21–** "నరుల హృదయాలోచన వారి బాల్యము నుండి చెడ్డది". ఈరోజు మనుష్యులను చూడండి, బాల్యదశలో ఉన్న చిన్నపిల్లలను చూడండి. వారి దగ్గరకు వెళ్ళి మాట్లాడండి. వారి మాటలు, వారి పాటలు, వారి ఆలోచనలు, వారి క్రియలు ఎలా ఉన్నాయో మీకు తెలిసిపోతుంది. దేవుడు ముందుగానే చెప్పాడు. ఏమనో తెలుసా? నరుల హృదయాలోచన వారి బాల్యము నుండి చెడ్డది. చెడుగా మారిపోవడానికే మనిషి బాల్యము నుండి ప్రయత్నిస్తున్నాడు. దేవునికి కాకుండా పోవడానికే మనిషి చిన్ననాట నుండి అడుగులు వేస్తున్నాడు. ఈ పరిస్థితిని చూచి దేవుడు తల్లడిల్లిపోతున్నాడు! మనిషి మరణాన్ని కోరుకుంటున్నాడని, వాడికి అర్థం కాకుండానే, తెలియని పరిస్థితుల్లోనే మరణానికి చాలా వేగంగా దూసుకుపోతున్నాడని దేవుడు చూచి బాధపడుతున్నాడు. ఈరోజు ప్రపంచంలో ప్రతీ మనిషి అదే స్థితిలో ఉన్నాడు. **కీర్తనలు 58 : 3–** "తల్లి కడుపున పుట్టినది మొదలుకొని భక్తిహీనులు విపరీత బుద్ధి కలిగియుందురు. పుట్టినతోడనే అబద్ధములాడుచు తప్పిపోవుదురు". అది మామూలు బుద్ధి కాదు, విపరీత బుద్ధి! వినడానికి కూడా భయపడే బుద్ధి. ఒక్కసారి ఆ ఆలోచనలను తలచుకొని ఛీ...అనుకొనే బుద్ధి అన్నమాట. అది ఎవరు, ఎప్పుడు కలిగి ఉన్నారంటున్నాడు దేవుడు? భక్తిహీనులు తల్లి కడుపున పుట్టినది మొదలుకొని, తల్లిగర్భములో నుంచి రావడం మొదలు ఇలాగే ఉంటున్నారు. ఎప్పుడెప్పుడు నేను పాపాన్ని చేయాలి? ఎప్పుడెప్పుడు నేను దేవుని ఆజ్ఞను అతిక్రమించాలి? ఎప్పుడెప్పుడు నేను నా మరణాన్ని కొనితెచ్చుకోవాలి? ఎప్పుడెప్పుడు ఆ రెండవ మరణములోనికి నేను ఆత్మగా వెళ్ళిపోవాలి? అని ప్రతి మనిషీ తల్లిగర్భములో నుంచి బయటకి వచ్చింది మొదలు, విపరీత బుద్ధిని కలిగి ఆలోచిస్తున్నాడు. దేవుని మార్గములో నడువవలసిన వీరు అబద్ధములాడుచు తప్పిపోవుచున్నారు. నేను తండ్రికి సంబంధించినవాడను కాదని, నేను పరలోకపుతండ్రి యొక్క భాగాన్ని కాదని, ప్రతి కుమారుడు, ప్రతి కుమార్తె తల్లిగర్భములోనుంచి బయటకు రాగానే అబద్ధములాడుచు తప్పిపోతున్న ఈ మానవజాతిని చూచి పరలోకపు తండ్రి వేదన పడుతున్నాడు. ఎప్పుడు వీరిని మార్చాలి? ఎవరు వీరిని బ్రతికిస్తారు. ఎవరు వీరికి ఈ రహస్యాలన్నీ తెలియజేస్తారు? అనుకున్నాడు దేవుడు. **హోషేయ 13 : 12, 13 –** "ఎఫ్రాయిము దోషము నాయొద్ద ఉంచబడియున్నది. అతని పాపము భద్రము చేయబడియున్నది. ప్రసూతి వేదనలు కలిగినట్టుగా అతనికి వేదన పుట్టును, పిల్ల పుట్టు సమయమున

బయటకు రాని శిశువైనట్టుగా అతడు బుద్ధిలేనివాడై వృద్ధికి రాడు". చరిత్రలో ఎఫ్రాయిము అనే ఒకజాతిని మనకొక ఉదాహరణగా, మనకొక పోలికగా దేవుడు చూపిస్తున్నాడు. ఎఫ్రాయిము అనే ఈ గోత్రాన్ని గూర్చి దేవుడు మాట్లాడుతూ వారి యొక్క దోషము నాయొద్ద ఉంచబడియున్నది. వారి పాపము భద్రము చేయబడియున్నది అంటున్నాడు. మనదగ్గరున్న డబ్బును ఒక బ్యాంక్‌లో భద్రము చేసుకుంటాము. మన దగ్గరున్న భూమిని డాక్యుమెంట్స్ ద్వారా భద్రము చేసుకుంటాము. మనము పట్టించుకోనిది, మనము జరిగించిన తరువాత వెంటనే మర్చిపోయేదేమిటో తెలుసా? మనము చేసిన పాపము. మనిషి మరిచిపోయినా దేవుడు మరిచిపోడు. మనిషి చేస్తున్న ప్రతీ పాపము (మాటలు, ఆలోచనలు కూడా) ఆయనకు లెక్కే. ఒకడు, నాకు కొంచెము తిక్కుంది దానికి లెక్కుందంటున్నాడే. దేవునికి మాత్రం నీ తిక్కలన్నీ లెక్కే. ఎందుకంటే, నీవు పుట్టిన తోడనే గర్భములోనుండి బయటకు వచ్చినది మొదలుకొని నీవు ఎలాంటి విపరీతబుద్ధిని కలిగియున్నావో దేవునికి తెలుసు. అది మీకూ తెలుసు కానీ మీరు మరిచిపోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. గతంలో జరిగిన పాపమంతటినీ మీరు మరిచిపోవడానికి, ఒక రాజులా బ్రతకడానికి, దొరలా బ్రతకడానికి, నాకంటే నీతిమంతుడే లేడని వెన్ను విరుచుకొని బ్రతకడానికి మీరు అలవాటు పడిపోతున్నారు. కానీ మీ గత చరిత్రను తవ్వుకుంటూ వెళ్ళి, దేవుడు మాటలాడడం ప్రారంభిస్తే మీ బ్రతుకంతా కంపు కొట్టిన సమాధి కాదంటారా? అవును! పలుకకూడని మాటలు, ఆలోచించరాని ఆలోచనలు, చేయరాని కార్యములను ఎన్నెన్నో జరిగించారు. బాల్యము మొదలుకొని ఏమనిషీ దీనికి అతీతుడు కాదు. బైబిల్ చెప్పినట్టుగా ప్రతీ మనిషీ పాపము చేసినవాడే. ప్రతీ మనిషీ దేవుడు అనుగ్రహించిన మహిమను పొందలేకపోతున్నవాడే. ఇందులో ఏ బేధమూ లేదన్నాడు. ప్రతి మనిషి పాపము జోలికి వెళ్ళి, పాపాన్ని స్వీకరించి ఆ మరణాన్ని పొందుతున్నాడు.

అందుకే దేవుడు ఒక గోత్రాన్ని చూపించి ఏమంటున్నాడో తెలుసా? ప్రతి మనిషి యొక్క పాపము భద్రము చేయబడియున్నదని చెప్పడానికి ఎఫ్రాయిము గోత్రాన్ని తీసుకొని ఆ ఎఫ్రాయిము దోషం నాయొద్ద ఉంచబడియున్నది, అతని పాపము నాయొద్ద భద్రము చేయబడియున్నదంటున్నాడు. ప్రసూతి వేదనలు కలిగినట్టుగా అతనికి వేదన పుట్టును. పిల్లపుట్టు సమయమున బయటకురాని శిశువు అయినట్టుగా అతడు బుద్ధిలేనివాడై వృద్ధికి రాడు. అయినను పాతాళవశములో నుండి నేను వారిని విమోచింతును. వారి పాపము భద్రము చేయబడి ఉన్నా, వాడు చేయకూడని భయంకరమైన కార్యక్రమములు చేసినా, వానిని రక్షించడానికి నేను సిద్ధంగా ఉన్నానంటున్నాడు దేవుడు. ఎందుకంటే ఎంతైనా దేవుడు మన తండ్రి కదండీ, పరాయివాడు కాదు కదా. మీరు ఎన్ని చెడు కార్యక్రమాలు చేసినా, ఎంత దౌర్జన్యంగా మీరు ప్రవర్తించినా, మిమ్మును ప్రేమించేది మీ కుటుంబములో ఉన్నవారేగాని బయటున్నవారు కాదు. మీ తల్లి కంటె, మీ తండ్రి కంటె, మీ బంధువుల కంటె మీ పరలోకమందున్న తండ్రి మీపై చూపించే ప్రేమ చాలా ఎక్కువ. అందుకే మిమ్ములను మరలా పాతాళవశములో నుండి తప్పించడానికి ఆలోచిస్తునాడు. ప్రణాళిక సిద్ధం చేస్తున్నాడు. అలాగని మీ పాపమంతటినీ దేవుడు ఊరకనే తుడిచిపెట్టేవాడు కాదు. ఆయన దగ్గర కూడా ఒక ధర్మం ఉంది. ఆయన దగ్గర కూడా ఒక చట్టం ఉంది. ఆయనకు అసలు పక్షపాతం లేనే లేదు. ఎవరుపడితే వారిని పాపవిముక్తులుగా చేయడానికి ఆయనేమీ ఊరకనే ప్రతీ ఒక్కరి పాపాన్ని తీసివేయడంలేదు. దానికి ఒక పద్ధతీ, ప్రణాళిక ఉంది. మంచి అవకాశం మాత్రం కల్పిస్తున్నాడు. ఎఫ్రాయిము దోషం తీర్చుకోవడానికి, భద్రము చేయబడిన పాపమును పరిహరించడానికి ఒక అవకాశముంది. అదేమిటంటే, మిమ్మును నేను విమోచిస్తాను. మృత్యువు నుండి మిమ్మును రక్షిస్తాను అన్నాడు. మనకూ అలాంటి అవకాశమును ఇచ్చాడు. ఆ అవకాశం ఏమిటి? మీరు చేసిన పాపముయొక్క జీతము మరణం అవుతున్నప్పుడు, ఆ మరణము పాతాళములో మీ ఆత్మకు సంభవిస్తున్నప్పుడు, ఆ మరణము నుండి మిమ్మును బ్రతికించడానికి, రక్షించడానికి దేవుడు మీకు అవకాశమును కల్పిస్తున్నాడు. **హోషేయ 13 : 14–** "అయినను పాతాళవశములో నుండి నేను వారిని విమోచింతును. మృత్యువు నుండి వారిని రక్షింతును. ఓ మరణమా, నీ విజయమెక్కడ? ఓ మరణమా, నీ ముల్లెక్కడ? పశ్చాత్తాపము నాకు పుట్టదు". మరణాన్ని విరిచేవాడు లేక మరణాన్ని పూర్తిగా నాశనం చేసేవాడు, ఒకడు రావాలి! ఆ మరణం మీద విజయాన్ని పొందేవాడు ఒకడు రావాలి! ఆ మరణం మీద విజయాన్ని ఎలా సంపాదించాలో ఈ సమాజానికి

నేర్పించాలి! అప్పుడు ఆ మరణపు ఛాయలకు వెళ్ళకుండా ప్రతి మనిషీ బ్రతికింపబడతాడు. చాలా మందికి ఈ రహస్యం తెలియదు. చాలామందికి ఈ సూత్రాలు తెలియవు. మనుష్యులు ఎందుకో బ్రతుకుతున్నారు, ఎందుకో నవ్వుకుంటున్నారు, పిచ్చివారుకదండి! ఒక రైల్వేస్టేషన్‌లో ఏ కారణమూ లేకుండా నవ్వుతున్న వారిని చూస్తుంటే మీకేమనిస్తుంది? వాడో పిచ్చివాడు, అందుకే అలా నవ్వుకుంటున్నాడు అంటారు. వాడి నవ్వుకి సరైన కారణము ఉండదు. ఏ కారణమూ లేకుండా ఒకడు ఏడుస్తున్నాడనుకోండి. వాడిని చూసి కూడా ఏమనుకుంటారు? వాడు ఒక పిచ్చోడు, అందుకే ఏడుస్తున్నాడు అంటారు. ఏ కారణమూ లేకుండా ఒళ్ళుగోక్కోవడం, ఏ కారణమూ లేకుండా తలగోక్కోవడం ఇవన్నీ మీరు చూస్తున్నప్పుడు వీరందరూ పిచ్చివాళ్ళని అనుకుంటారు. ఈరోజు సమాజాన్ని చూడండి. ఒకడు వేగంగా బండి మీద వెళ్ళిపోతుంటాడు. ఎందుకు అంత స్పీడుగా వెళుతున్నావు? ఎక్కడికి? అని అడిగితే, పెళ్ళి చేసుకోవడానికి లేక వ్యాపారము చేసి ధనాన్ని సంపాదించడానికి లేక ఇంట్లో ఉంటే బోర్ కొడుతుంది కాబట్టి అలా బయటకు షికారుకి అనే సమాధానాలు వస్తాయి. పిచ్చివాళ్ళు కదా వీరంతా. అంతేలే! ఎందుకు నీవు ఈ కార్యక్రమాలు చేస్తున్నావు? ఎందుకు నీ బ్రతుకును ఇలా కొనసాగిస్తున్నావు అని అడిగితే, పుట్టాము కాబట్టి బ్రతకాలి కదా, బ్రతకడానికి ఏదో ఒక పని చేయాలి కదా, తద్వారా సంపాదించుకోవాలి కదా, సంపాదించినదానిని ఖర్చుచేయాలి కదా అంటాడు. ఎందుకురా హోటెల్‌కి వెళుతున్నావు అని ఒకడిని అడిగితే, ఏముందండి వీకెండ్ కదా ఇంటి దగ్గరుంటే బోర్ కొడుతుందని ఉన్న డబ్బులెలా ఖర్చుపెట్టాలో తెలియక ఇదిగో ఈ హోటెల్‌కి వెళుతున్నానండి అంటున్నాడు. ఏమిటి ఈ మనిషియొక్క తత్వం? ఏమిటి ఈరోజు మనిషి ప్రవరిస్తున్న తీరు, విధానం? ఎందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతీ ఒక్కరూ ఇదే పిచ్చి దశలో ఉన్నారు. మరణించిన తర్వాత ఏమవుతుంది బిడ్డా? అంటే ఎవరికీ తెలియదు. అందుకే మరణమంటే చాలా మందికి భయం. ఏదైనా ఒక రోగం బారినపడి, లేదంటే ఏదైనా ఒక యాక్సిడెంటుకు గురై ఆసుపత్రిలోనికి వెళ్ళగానే మరణపు ఛాయలు కనిపిస్తుంటాయి. ఆ ఆసుపత్రిలో వైద్యులు, నర్సులు, ఆ బెడ్‌ను చూడగానే నేను కొన్ని క్షణాలలో లేక కొన్ని రోజులలో మరణమయిపోతానేమో అనే భయం! ఎందుకు? మరణించిన తర్వాత ఏమి జరుగుతుందో తెలియదు గనుక. అందుకే ఈ మరణపు రహస్యాన్ని దేవుడు చెబుతున్నాడు. ఓ మరణమా, నీ విజయమెక్కడ? ఓ మరణమా నీ ముళ్ళెక్కడ? అని ప్రశ్నిస్తున్నాడు. ఈ మరణము మీద విజయాన్ని సంపాదించే మనుష్యులు పుట్టగలరా? ఈ మరణము నుండి తప్పింపగలిగిన మనుష్యులు పుట్టగలరా? భూమి మీద శరీరాన్ని విడిచిపెట్టిన తర్వాత ఆత్మకు కలుగబోయే ఆ మహావేదన నుండి, నరకము నుండి తప్పింపబడబోయే మనుష్యులు పుట్టగలరా? దేవుడికిదే కోరిక.

ఏమనిషి ఆ మరణాన్ని తప్పించుకొని దేవుని దగ్గరకొస్తాడు? ఏమనిషి పరలోకంలో నిత్యజీవాన్ని సంపాదించుకుంటాడు? ఏ మనిషి తన ఆత్మను రక్షించుకోగలుగుతాడు? ప్రతి మనిషీ పాడైపోతున్నవాడే. ప్రతి మనిషీ బాల్యదశ నుంచే దేవునిమార్గాన్ని అతిక్రమిస్తున్నాడు. మరి అలాంటప్పుడు దేవునిపిల్లలుగా పుట్టిన ఈ మనుష్యుల్లో మార్పు ఎప్పుడొస్తుంది? ఎప్పుడు ఈ మరణాన్ని జయించి తిరిగివస్తారు? ఆ పాతాళమనే లోకాన్ని తప్పించుకొని ఎవరొస్తారు? బుద్ధిమంతులుగా మరలా ఆ లోకానికి ఎవరు తిరిగి రాగలుగుతారని దేవుడు అడుగుతున్నప్పుడు ఎవ్వరూ రాలేకపోతున్నారు? ధనవంతుడా? పేదవాడా? విద్యావేత్తా? రాజకీయవేత్తా? ఈ భూమి మీద బ్రతకెందుకో తెలియక, ఆ బ్రతుకులో దేనిని సాధించాలో అర్థంకాక, మరణించిన తర్వాత ఏమి జరుగుతుందో తెలియక, ప్రతీ ఒక్కరూ అజ్ఞానదశలో తమ బ్రతుకును ముగిస్తున్నారు. ఇది ఎవ్వరూ కాదనలేని నిజం. కానీ బైబిల్ మాత్రమే దీనికి సమాధానము చెబుతుంది. అదేమిటో తెలుసా? ఈ మరణాన్ని జయించే వారు కావాలి. ఆ పాతాళాన్ని తప్పించుకొనేవారు కావాలి. ఆ రెండవ మరణం మీద విజయాన్ని పొందినవారు కావాలి. ఈ మనుష్యులందరూ అజ్ఞానపు దశలోనికి వెళ్ళిపోతున్నప్పుడు, ఇలాంటి భయంకరమైన పరిస్థితుల్లో ఉన్నప్పుడు దేవుడు పరలోకములో ఉన్న తన కుమారుని, భూమి మీద ఒక వ్యక్తిగా అందుకే పుట్టించాడు. ఆయన పేరే యేసుక్రీస్తు. యేసుక్రీస్తనగా ఈ సమాజానికి ఎంతవరకు తెలుసంటే, ఆయన ఎంతవరకు పరిచయమయ్యాడంటే ఏదో ఒక మత వ్యవస్థాపకుడు, కుదరని రోగాలుంటే వాటిని కుదిర్చేవాడు, స్వస్థపరిచేవాడు, ఒకవేళ కష్టాలలో ఉంటే

గట్టెక్కించే అందరి దేవుళ్ళతో పాటు ఒక దేవుడు అనుకున్నారు. ఇప్పటివరకు ఈ సమాజములో ఉన్న మనుష్యులందరూ యేసుక్రీస్తును ఇలాగే అనుకుని భ్రమపడుతున్నారు. కాదు కాదు. యేసుక్రీస్తు అలాంటివాడు కాదు, మరెవరు? ప్రారంభం నుండి పుట్టుకొచ్చిన మనుష్యులందరూ మరణానికి వెళ్ళిపోతున్నప్పుడు, పాపము చేసి దాని జీతమయిన మరణాన్ని అనుభవిస్తున్నప్పుడు, నిత్య నరకాగ్ని అనే ఆ పాతాళలోకములో వేదన పడుతున్నప్పుడు, తప్పించుకోలేక దేవుని మార్గములోనికి వెళ్ళలేక, పరలోకాన్ని అనుభవించలేక, మహా నరకాగ్నిలోకి దిగిపోతున్నప్పుడు దానిని తప్పించడానికి ఆ మరణము మీద విజయాన్ని సంపాదించడానికి, ఆ మరణపు ముళ్ళు విరిచేయడానికి భూమి మీద పుట్టినవాడే యేసుక్రీస్తు. ఈయన సాక్ష్యాత్తూ దేవుని కుమారుడు.

**1 కొరింథీ 15 : 54 – 57** "విజయమందు మరణము మ్రింగివేయబడెను అని వ్రాయబడిన వాక్యము నెరవేరును. ఓమరణమా, నీ విజయమెక్కడ? ఓ మరణమా, నీ ముల్లెక్కడ? మరణపు ముల్లు పాపము, పాపమునకున్న బలము ధర్మశాస్త్రమే. అయినను మన ప్రభువైన యేసుక్రీస్తు మూలముగా మనకు జయము అనుగ్రహించుచున్న దేవునికి స్తోత్రము కలుగును గాక". ఎప్పటినుంచో ఆధిపత్యం చెలాయిస్తున్న ఈ మరణం, మనుష్యులను తనలోకము లోనికి తీసుకొని వెళ్ళిపోతున్న ఈ మరణం, పాపానికి వచ్చే జీతమయిన ఈ మరణము ఏమయిందో చెబుతున్నాడు చూడండి. విజయమందు మరణము మ్రింగివేయబడెను అంటే మరణానికి చరమగీతం పాడినవాడే యేసుక్రీస్తు. ఇంతకీ ఏ మరణమది? భూమి మీద శరీరాన్ని విడిచిపెట్టే మరణం కాదది! శరీరాన్ని విడిచిపెట్టిన తరువాత ఆత్మ వెళ్ళిపోయే రెండవ మరణమది. నిత్యాగ్ని నరకమది. దానిని గూర్చి ప్రస్తావిస్తూ దేవుడు ఏమంటున్నాడో తెలుసా? ఆయన ఒక ధర్మాన్ని పెట్టి, ఒక ఆజ్ఞను ఇచ్చి, దానిని మీరు పాటించాలని, దానిని అతిక్రమించిననాడు మీరు పాపము చేసినవారవుతారని వ్రాయించాడు. ఆ పాపము వలన వచ్చు జీతము మరణమని ఆయన నిర్దేశించినప్పుడు ఆ శాశనాన్ని ఎవ్వరూ గుర్తించలేక, ప్రారంభము నుండి పుట్టుకొచ్చిన ప్రతి మనిషి ఆ మరణపు ఒడిలోనికే వెళ్ళిపోయాడు. నిత్యాగ్నిలోనికి జారిపోయాడు. అయితే ఈ మరణపు ముల్లును విరిచేసిందెవరో తెలుసా? భూమి మీదకు వచ్చిన దేవుని కుమారుడైన యేసుక్రీస్తు. అందుకే ఆయనను గూర్చి విజయమందు మరణము మ్రింగివేయబడెను అని వ్రాయబడెను. ఈ శరీరాన్ని విడిచి పెట్టిన తరువాత, భూమి మీద ఈ బ్రతుకును ముగించిన తరువాత, మరణపు ఒడిలోనికి అనగా నిత్యాగ్నిలోకి ఎవ్వరూ జారిపోకుండా పరలోకపు మార్గంలో మీరు వెళ్ళాలంటే, మీ తండ్రి ఉన్న లోకమును మీరు చేరాలంటే మీరు యేసుక్రీస్తు వారి ద్వారా బ్రతకాల్సిందే! తండ్రియైన దేవుడు మీకనుగ్రహించిన మార్గమే యేసుక్రీస్తే. ఒకనాడు ఎఫ్రాయిముకు దేవుడిచ్చిన భరోసా అదే. ఈ మరణము నుండి దేవుడు రక్షిస్తాడు. ఈ మరణపు కౌగిటిలోనికి నీవు వెళ్ళిపోకుండా దేవుడు నిన్ను బ్రతికిస్తాడు. ఎవరి ద్వారా బ్రతికిస్తానంటున్నాడు? నా కుమారుడైన యేసుక్రీస్తు ద్వారా నిన్ను బ్రతికిస్తాను అంటున్నాడు.

అందుకే ఆ యేసు భూమి మీదకు వచ్చిన తర్వాత ప్రజలకు బోధించిన మార్గమేమిటో తెలుసా? ఆ మరణపు ముల్లును ఎలా విరిచేయాలో యేసుక్రీస్తు చెప్పాడు. ఆ మరణాన్ని ఎలా జయించాలి? ఈ బ్రతుకును ముగించిన తర్వాత పరలోకపు మార్గములోనికి మనము ఎలా వెళ్ళాలి? మన తండ్రి ఉన్న లోకము లోనికి ఎలా వెళ్ళిపోవాలి? దీనిని నేర్పించడానికి వచ్చినవాడే యేసుక్రీస్తు. ఆస్తులు సంపాదించడానికి వచ్చినవాడు కాదు, ఒక మత ప్రభోదకుడు కాదు, ట్రస్టును స్థాపించినవాడు కానే కాదు! తనను వెంబడించిన శిష్యులను ధనవంతులుగా మార్చినవాడైతే కాదు. కేవలం పరలోకపు మార్గాన్ని చూపించినవాడు. ఈ మరణపు ముల్లును ఎలా విరవాలో చెప్పినవాడు. ఈ మరణాన్ని మ్రింగివేసి విజయాన్ని ఎలా సంపాదించుకోవాలో నేర్పించినవాడు. అందుకే కడపటి ఆదాముగా మారిపోయాడాయన. మొదటి మనుష్యుడైన ఆదాము పాపమును లోకానికి పరిచయం చేశాడు. పాపమెలా చేయాలో, ఆ పాపము వల్ల వచ్చే జీతమును ఎలా తెచ్చుకోవాలో ఆదాము నేర్పించాడు. అందుకే ప్రపంచ ప్రజలందరూ ఆ ఆదాము మార్గములోనే వెళ్ళిపోతూ పాపాన్ని ప్రేమిస్తున్నారు, మరణాన్ని కొనితెచ్చుకుంటున్నారు. అందుకే మరణించిన తరువాత (రెండవ మరణం) నిత్యాగ్నిలోకి జారిపోతున్నారు. నిత్య శిక్షలోనికి వెళ్ళిపోతున్నారు. అక్కడికి వెళ్ళిపోయిన తరువాత వారి అరుపులు, వారి కేకలు ఒక్కడి ఉదాహరణ ద్వారా యేసుక్రీస్తు మనకు చూపించాడు.

ఈ భయంకరమైన వేదనను నేను భరించలేకపోతున్నానని అతడు గోలపెడుతున్నాడు, కేకలు వేస్తున్నాడు. వెళ్ళిపోయినవారందరూ వాడిలాగే కేకలు వేస్తున్నారు. వాడిలాంటి పరిస్థితులలోనికే వెళ్ళిపోయారు. మనము అలాంటి పరిస్థితులలోనికి దిగజారిపోకూడదంటే, ఇదిగో మరణాన్ని ఎలా జయించాలో, ఎలా విజయాన్ని సాధించాలో మనకు నేర్పిస్తున్నాడు. అలా విజయుడైన మొట్టమొదటి వ్యక్తి యేసుక్రీస్తు. అందుకే ప్రపంచంలో ఏ ఒక్కరినైనా చూడండి. చరిత్రలోనికెక్కిన ఏ ఒక్కరినైనా ఆలోచించండి! ఎన్నో మంచి పనులు చేసినా, ఎన్నో త్యాగాలు చేసినా, ఎంతో మంది ప్రాణాలర్పించినవారు ఉన్నా, లోకము కోసమో లేక వారనుకున్నది సాధించడం కోసమో చేశారు. ప్రపంచంలో ఇప్పటి వరకు యేసుక్రీస్తు తప్ప, దేవుని కోసం ప్రాణాలర్పించినవారు ఎవ్వరూ లేరు! ఎవరండీ మరణం మీద విజయమును పొందింది? ఎవరండీ మరణపు ముల్లును విరిచేసింది? అందుకే జీసస్ క్రైస్ట్ ఎప్పటికీ ఒన్ అండ్ ఓన్లీ! యేసుక్రీస్తు తప్ప ప్రపంచంలో ఎవ్వరూ మరణముయొక్క అంతు చూడలేకపోయారు. అందుకే చనిపోయిన తర్వాత సమాధిలోనికి దిగిపోయారు తప్ప, తిరిగి లేచినవారు కనిపిస్తున్నారా? ఎవ్వరూ లేరండి. ప్రపంచంలో ఇప్పటివరకు మనిషిగా పుట్టినవాడు తిరిగి బ్రతికినట్టు ధాకలాలెక్కడైనా కనిపించాయా? లేనేలేదు. కానీ యేసుక్రీస్తు మాత్రం మరణించి, సమాధి చేయబడి, మూడురోజుల తరువాత తిరిగి లేచాడు. ఎలా నమ్మమంటారని మీరడిగితే, ఎప్పుడో 2000 సంవత్సరాల క్రితం యేసుక్రీస్తు తిరిగి లేచాడని చెబితే మేము నమ్మాలా అని మీరు అడిగితే, నేను చెప్పడం కాదండీ, మీరే చెబుతున్నారు. ప్రపంచమంతా ముక్త కంఠముతో చెబుతోంది. ఎలా అంటే, మీరు ప్రతిరోజు ప్రొద్దున లేవగానే టైమ్, డేట్ చూసుకుంటారు. ఈ రోజు తేదీ ఎంతంటే 1వ తేదీ జనవరి నెల క్రీస్తు శకం 2000 సంవత్సరం. ఎక్కడినుండొచ్చింది ఈ తేదీ ? ఎవరిని బట్టి లెక్కగట్టావు ఈ తేదీ? ఊరకనే లెక్కగట్టావా? నీ ఇష్టప్రకారం చేతుల వేళ్ళు, కాళ్ళ వేళ్ళు లెక్కపెట్టుకున్నావా? లేదు లేదు. ప్రపంచమంతా ఒక వేదిక మీదకు వచ్చి ఒక శకపురుషుని(యేసుక్రీస్తును) నిలువబెట్టారు. కాలానికి సంబంధించి, కాలాన్ని విడదీయడానికి, కాలాన్ని లెక్కించడానికి ఒక యుగపురుషుని, ఒక కాలపురుషుని నియమించాలనుకుంది. ఈ ప్రపంచంలో ఉన్న ప్రతి దేశములోని మేధావివర్గమంతా, వారికి ముందు పుట్టినవారందరిలో ఎవరిని తీసుకోవాలి? ఎంతోమంది ప్రపంచంలో పుట్టిన గొప్పవారు ఉన్నారు. ఎంతో మంది మత ప్రబోధకులు ఉన్నారు. దేశాల కొరకు ప్రాణాలర్పించినవారున్నారు, శాస్త్రాల కోసం తమ జీవితాలను ధారపోసినవారున్నారు. ఎవరిని తీసుకుందాం? గొప్పవారిగా ఎవరిని నిలువబెడదాం? అని చర్చించారు. నిలబడేవాడు ఒకే ఒక్కడై ఉండాలి. అందరూ వస్తే కుదరదు. ఆ ఒక్కడు ఎవ్వరికీ తీసిపోకూడదు. ఆ ఒక్కడిని నిలువబెట్టినందుకు భావితరాలలో ఎవ్వరూ మనలను నిందించకూడదు. అలాంటి గొప్ప కేరక్టర్‌ను మనము నిలబెట్టాలి అనుకున్నారు. అలా మనకు ముందు పుట్టిన మేధావివర్గములో ఉన్న ప్రజలందరూ యేసుక్రీస్తును ఎన్నుకున్నారు. ఒక శకపురుషునిగా కాలాన్ని లెక్కించడానికి ఇంకెవ్వరూ లేరనా? అతని ముందు ఇంకెవ్వరూ సాటిరారనా? అవును. అతని ముందు ఇంకెవ్వరూ సాటిరాకూడదు. యేసుక్రీస్తు ఈ ప్రపంచానికి ఒక్కడు! ఎందుకంటే మరణము మీద విజయాన్ని పొందినది ఆయనొక్కరే!

ఆయన స్వార్థం కోసం ఆయన ఇదంతా చేసారనుకొంటున్నారా? మరణపు ముల్లును విరిచింది కేవలం తనకోసమే అనుకుంటున్నారా? కానేకాదు. ప్రపంచంలో పుట్టకొస్తున్న ప్రతి ఒక్కడి కోసం! మనిషిగా పుట్టిన ప్రతీ ఒక్కరూ బాల్యదశ నుండే దేవునియొక్క ఆలోచనలోనికి రాకుండా తమ మార్గములోనికి వెళ్ళిపోయి, తమ ఇష్టాన్ని నెరవేర్చుకుంటూ నరకములోనికి జారిపోతున్న తరుణంలో, ఆయన భూమి మీదకొచ్చి తన ప్రాణమును మనుష్యులందరి కొరకుపెట్టి, ఒక మనిషి ఎలా బ్రతకాలో వారికి నిరూపించి చూపించి, ఈ మరణము మీద ఎలా విజయాన్ని సంపాదించాలో అందరికి  తెలియజేయాలనుకున్నాడు. సర్వమానవాళి కొరకు ఆ మహా కార్యక్రమాన్ని జరిగించాడు. కేవలం తన స్వార్థంకోసం తనకేదో ఒరుగుతుందని మాత్రం కాదు. ఎందుకంటే ఆయన అప్పటికే పరలోకములో ఉన్నవాడు. ఆయనకేమి తక్కువని? ఆయన దేవుని కుమారుడు. దేవునిలో నుంచి భాగముగా పుట్టినవాడు. ఒక గొప్ప శక్తి కలిగినవాడు. ఈ ప్రపంచాన్ని నిర్మించినవాడు. ఆయన లేకుండా ఏదీ కలుగలేదు. అలాంటి వాడు భూమి మీదకు రావలిసిన అవసరం ఏమిటి? ప్రపంచ మానవాళి కొరకు ఈ మరణము మీద

విజయాన్ని సంపాదించే మనుష్యులే లేకపోయారు. క్రీస్తు పూర్వము 4000 సంవత్సరాలుగా ఈ మరణముయొక్క అంతు చూసేవారే లేకపోయారు. ప్రతీ ఒక్కరూ పాపపు మార్గములోనికి వెళ్ళిపోయేవారే. అందరూ పాపాన్ని ప్రేమించేవారే. పాపమంటే అంతిష్టం మనిషికి. దేవుడంటే అస్సలు ఇష్టం లేదు. దేవుని మార్గమంటే అస్సలు వినిపించుకోడు. అది నాకు సంబంధించినది కాదనుకుంటాడు. అందుకే దేవుని కుమారుడుగా వచ్చిన యేసుక్రీస్తు, మనుష్యులను దేవునిమార్గములో నడిపించడానికే పుట్టాడు. ఆ యేసుక్రీస్తు జరిగించిన కార్యక్రమాన్ని బట్టి అతడు తప్ప ఇంకెవ్వరూ ప్రపంచములో మరణించి తిరిగి లేవలేరన్న వాస్తవాన్ని తెలుసుకున్న ఒకనాటి మేధావి వర్గం, కాలాన్ని లెక్కించడానికి యేసుక్రీస్తును కాలానికి మధ్యలో పెట్టి, క్రీస్తు పూర్వం అని క్రీస్తు శకం అని లెక్కపెట్టారు. ఇది నేను చెప్పడం కాదు, ప్రపంచమంతా చెబుతుంది. యేసుక్రీస్తు శకపురుషుడు! అందుకే ఈ రోజు క్రీస్తునుబట్టి కాలాన్ని లెక్కబెట్టారు. క్రీ.శ.2010 అన్నారంటే, యేసుక్రీస్తు వచ్చి ఇప్పటికి సుమారు రెండువేల పది సంవత్సరాలు అయిందని అర్థం. గతచరిత్రలోగాని, నేటికాలములోని మనుష్యులుగాని, ఈ భూమిమీద పుట్టిన ప్రతీ ఒక్కరూ ప్రతిక్షణం జ్ఞాపకముంచుకోవాల్సింది యేసుక్రీస్తునే. అందుకే కాలాన్ని లెక్కించడానికి యుగపురుషునిగా ఆయనను మాత్రమే నిలువబెట్టింది ఈ ప్రపంచ ప్రజావిజ్ఞానవేదిక. ఎవరిని మరిచిపోయినా పరవాలేదు కానీ, యేసుక్రీస్తును అందరూ గుర్తుంచుకోవాలి అనుకుంది ఆనాటి మేధావివర్గం. నిజమేకదండీ, ఎందుకంటే మరణము మీద విజయాన్ని సంపాదించగలిగే మనుష్యులెవరూ పుట్టలేదు. యేసుక్రీస్తు తప్ప ఈ మార్గాన్ని ప్రజలకు ఎవ్వరూ బోధించలేదు. మరణపుముల్లును విరిచేవారు ఎవ్వరూ కనిపించలేదు. అందుకే ఆ యేసు బోధించిన మార్గము బైబిల్‌లో మనకు స్పష్టంగా కనిపిస్తుంది. ప్రతి మనిషి మీద దేవుడు అభియోగించే ఆ మొదటి నేరములోనికి మీరు వెళ్ళిపోకుండా, మీ ఇష్టాన్ని మీరు నెరవేర్చుకోవడం వల్ల ఆ నిత్యాగ్ని నరకములోనికి మీరు జారిపోకుండా, ఆ ధనవంతుడైన నేరస్తునిగా మీరు మిగిలిపోకుండా, దేవుని ఇష్టాన్ని నెరవేర్చడం ఎలాగో తెలుసుకోవాలనుకుంటే ఇదిగో 66 పుస్తకాలు కలిగిన బైబిల్‌ను చదవండి, దానిని పరిశోధించండి. మరిన్ని ఆత్మసంబంధమైన దేవుని సంగతుల కొరకు మమ్మును తప్పక సంప్రదించండి. ఉచితముగా మహాజ్ఞానమునకు వారసులవ్వండి!


ప్రభువునందు నమ్మకస్థుడు,

**జె. మణి కుమార్**

సన్ ఆఫ్ గాడ్ – క్రైస్ట్ చర్చ్ – సామర్లకోట – 8978414178.


## ప్రశ్నలు

1. ఈ ప్రపంచానికి యేసుక్రీస్తు ఒక్కడే! విచరించండి.
2. మనిషి రెండవ మరణమును ఎలా తప్పించుకోగలడు?
3. ఈ సమాజానికి దేవుని వాక్యము యొక్క అవసరతను వివరించండి.
4. ఆదాము నుండి నేటివరకు మనుష్యులు మరణానికి ఎందుకు చేరువవుతున్నారు?
5. మనిషి తన ఇష్టమును ఎందుకు నెరవేర్చుకొనగూడదు? దాని పర్యవసానమేమిటి?
6. మనిషి చేసిన, చేస్తున్న అతి భయంకరమైన నేరాలలో మొదటిది ఏది? వివరించండి.
7. బాల్యదశలోనే దేవునికి దూరమవుతున్న మనుష్యులనుగూర్చి దేవుడు ఏమి వ్రాయించాడు?

## 6. ఆకలి తీర్చే ఆహారం - దప్పిక తీర్చే పానం

ప్రియ చదువరులారా!

ప్రస్తుతం ప్రపంచంలో నివసిస్తున్న కోట్లకొలదిగా ఉన్న మనుష్యుల యొక్క ఆలోచనలు, ఆశయాలు, బ్రతుకు విధానమును ఒకసారి ఆలోచిస్తే, ప్రతీ ఒక్కరూ ఈ భూమి మీద కనీసపు అవసరతల కొరకే బ్రతుకుచున్నారు. అవి ఏమిటని వారినడిగితే – ఒకటి తిండి, రెండవది బట్ట, మూడవది గూడు. ఈ మూడింటినీ కనీసపు అవసరతలు అంటున్నారు. ఈ మూడింటికీ లోటు లేకుండా ఉంటే చాలు, మనిషి యొక్క బ్రతుకు ఈ భూమి మీద దేవుడు ఇచ్చిన ఆయుష్కాలంలో చక్కగా ముందు కొనసాగుతుందని ప్రతీ ఒక్కరి అభిప్రాయం. దేవుని నమ్ముకునేటప్పుడు క్రైస్తవులలో కావచ్చు, క్రైస్తవేతరులలో కావచ్చు. ఈ నిత్యవసరాలు తీర్చుకోడానికే నమ్మాలి అనుకునేవారు ఈ రోజు ఎంతోమంది ఉన్నారు. అందుకే వారు ఆలయాలకు వెళుతున్నప్పుడు, దైవప్రార్ధనలు చేస్తున్నప్పుడు, మ్రొక్కుబడులు చేసుకుంటున్నప్పుడు వారి కోరికలలో ఈ మూడింటినే తరచుగా కోరుకోవడం మనము గమనించవచ్చు. ఇక ఈ పరిస్థితులన్నింటినీ ఒక ప్రక్కన పెడితే, పరలోకమందున్న దేవుడు వ్రాయించిన గ్రంథమే, బైబిల్. ఈ బైబిల్‌లో రెండు నిబంధనలు ఉన్నాయి. ఒకటి పాతదైతే, రెండవది క్రొత్తది. ఒకటి ఇశ్రాయేలీయులకైతే, రెండవది క్రైస్తవులకు. ఒకటి యేసుక్రీస్తుకు ముందు వ్రాయబడినది మరియు పాటించదగినది అయితే, మరొకటి యేసుక్రీస్తు వచ్చిన తరువాత వ్రాయబడినది మరియు పాటించవలసినది. దేవుడు మనకొరకు వ్రాయించిన ప్రతి మాటా, పైన చెప్పబడిన నిత్యావసరాలను తీర్చుకోవడానికే  అనుకుని ఈ రోజు చాలా మంది పొరపాటు పడ్డారు.

భూమి మీద అందరూ ఆశించినట్టుగా, అందరూ నమ్ముతున్నట్టుగా, నిత్యావసరాలు తీర్చుకోవడానికే దేవుని నమ్మాలనుకుని, ఈ బైబిల్‌ను చదువుతున్నవారు, బైబిల్‌ను బోధిస్తున్నవారు, బైబిల్‌ను పాటిస్తున్నవారు కూడా అలాగే తయారయ్యారు. నిత్యావసరాల కోసమే, అనగా తిండి, బట్ట, గూడు, ఈ మూడు మౌళిక సదుపాయాలు కల్పించుకోవడానికే బైబిల్‌ను నమ్ముతున్నట్లుగా ఈరోజు ప్రపంచంలో ఎన్నో వాస్తవాలు మనకు వివరిస్తున్నాయి. ఎన్నో బోధలు మనకు తెలియజేస్తున్నాయి. ఎన్నో రచనలు మనకు కళ్ళముందు సాక్ష్యాత్కరిస్తున్నాయి. అయితే దేవుడు వీటికోసమే ఇన్ని మాటలు తన ప్రవక్తల చేత వ్రాయించవలసిన అవసరముందా? ఖచ్చితంగా వీటికొరకు అయితే మాత్రం కాదు! ఇప్పటివరకు ఎంతోమంది బైబిలును బట్టి బోధలు చేసారు. ఇప్పటికీ చేస్తున్నారు. ప్రజలను ఆకర్షించే విధానంలో బోధిస్తున్నాము అనుకుంటున్నారు. ఆ బోధ ఎలా ఉంటుందంటే, మీ అవసరతలు తీరాలంటే దేవుని యొద్దకు రండి. మీరు నమ్ముకున్న దేవుడు ఒక రేషన్ షాపు డీలర్ లాంటి వాడన్నట్టుగా ఉంటుంది. నేను బైబిలును బట్టి మాట్లాడుతున్నాను. ప్రజలను మంచి క్రైస్తవ్యం వైపు నడిపించాలని ఆశిస్తూ ఈ మాటలను వ్రాస్తున్నాను. మిగిలిన మత విశ్వాసాలలో ఉన్నవారు ఏమి చేస్తున్నారన్నది నేను మాట్లాడను. దానిని గూర్చి నాకవసరం లేదు. ఎందుకంటే, వారి తరపున రాయబారిగా నేను రాలేదు. యేసుక్రీస్తు తరపున ఒక రాయబారిగా నేను మాటలాడుచున్నాను. దేవుడు వ్రాయించిన గ్రంథమైన ఈ బైబిల్ నిత్యావసరాలు తీర్చుకోవటానికే వ్రాయబడిందా? దేవుని వాక్యము మనుష్యుల దగ్గరకు అందుకే వచ్చిందా? అవుననుకుంటే అది చాలా పొరపాటు! దీని నిమిత్తం ఈ రోజు మీకు ఒక మంచి వివరణను ఇవ్వాలనుకుంటున్నాను. సుమారు 2000 సంవత్సరాల క్రితం, యేసుక్రీస్తువారు ఈ భూమి మీదకు వచ్చారు. ఆయన బ్రతుకు కాలములో, శోధకుడైనవాడు అనగా అపవాది/ఘటసర్పం/దెయ్యం/సాతాను (ఏ పేరుతో మీరు పిలిచినా వాడే ఈ లోకాధికారి) ఆయన దగ్గరకు వచ్చాడు. ఇప్పటి వరకు ఎందరో బైబిల్ బోధకులు చేసిన బోధలను బట్టి మనము ఏమి విన్నామంటే – బైబిల్ మన దగ్గరుంటే దెయ్యం మన దరిదాపులకు రాదు అని విన్నాము. కానీ, ఈ దెయ్యం ఎవరి దగ్గరకు వచ్చిందో తెలుసా? యేసుక్రీస్తు దగ్గరకు వచ్చింది. అవును దెయ్యమే! యేసుక్రీస్తు దగ్గరికే వచ్చి ఏమి చేసింది? సాష్టంగపడలేదు లేక గజ గజా వణకలేదు. ఆయన దగ్గరకు వచ్చి ధైర్యంగా ఒక ప్రశ్నను అడిగింది! ఎందుకు? ఈ లోకమునకు యేసు వచ్చినప్పటికే ఈ లోకము వాడి హస్తగతంలో ఉంది. ఇప్పటికీ ఉంచుకున్నాడు. ఈ భూమి లయమైపోయే క్షణము వరకు లోకము, ఈ లోకాధికారి చేతిలోనే ఉంటుందని మీరు గమనించాలి. యేసుక్రీస్తును  ఆ శోధకుడు ఒక ప్రశ్న వేస్తున్నాడు. "నీ కళ్ళ ముందు ఎన్నో రాళ్ళు కనిపిస్తున్నాయి.

నీవు దైవకుమారుడవు కదా! నీవు ఆకలిగొనియున్నావు గనుక ఈ రాళ్ళను రొట్టెలుగా మార్చుకుని, నీవు వాటిని భుజించుము. నీవు దేవుని కుమారుడవు గనుక నీకు అది అసాధ్యం కాదు. నీవు ఈ పనిని జరిగించాలని యేసుక్రీస్తుకు అపవాది ఒక సలహా ఇస్తున్నాడు. అప్పుడు వెంటనే యేసుక్రీస్తు చేసినదేమిటో మీ కళ్ళారా బైబిలులో చూడండి.

**మత్తయి 4 : 4** – "మనుష్యుడు రొట్టె వలన మాత్రము కాదు గాని, దేవుని నోట నుండి వచ్చు ప్రతి మాట వలన జీవించును" అని వ్రాయబడియున్న ఒక మాటను యేసుక్రీస్తు ఆ శోధకునికి తెలియజేస్తున్నారు. శోధకుడు యేసుక్రీస్తుతో ఏమంటున్నాడో చూడండి? నీవు ఆకలిగొనియున్నావు గనుక, నీకున్న శక్తి సామర్థ్యాలనుబట్టి, నీ కళ్ళముందు కనిపిస్తున్న ఈ రాళ్ళలన్నింటినీ రొట్టెలుగా మలచుకుని, వాటిని భుజించి నీ కడుపు నింపుకోమంటున్నాడు. దానికి సరైన సమాధానముగా, వాక్యమును నిత్యావసరాల కొరకు వినియోగించవచ్చో లేదో యేసుక్రీస్తు చెబుతున్నారు. ఆయన ఆకలిగొనియున్నా చింత లేదు. కానీ, మనిషి రొట్టె వలన మాత్రమే బ్రతుకుననుకుని తాను ఈ రాళ్ళన్నింటినీ రొట్టెలుగా చేసుకుంటే, దేవుని వాక్యమును అతిక్రమించినట్టే అన్నారు యేసుక్రీస్తు. మనుష్యుడు రొట్టె వలన మాత్రము కాదు, దేవుని నోటనుండి వచ్చు ప్రతీ మాట వలన జీవించును. ఇక్కడ మీరు జాగ్రత్తగా ఆలోచించవలసిన విషయాలను నేను మీకు మరీ మరీ చెబుతున్నాను. దేవునియెడల భక్తి విషయములో మనుష్యునికి, రొట్టెకు (అనగా తిండి లేక నిత్యావసరాలకు) సంబంధం లేదంటున్నారు, యేసుక్రీస్తు! మనిషి రొట్టె నిమిత్తమయితే దేవుని నమ్మకూడదని యేసుక్రీస్తు అంటున్నారు. అలాగని ఆయన ఎప్పుడూ రొట్టె తినలేదని కాదు. దేవుని మాటలను బాగా అర్థం చేసుకోవాలి. మణికుమార్ గారు వచ్చి దేవుని మాటలను తినమంటున్నారు. ఈయన రొట్టెను తినడా? ఇలాంటి బోధను చేస్తున్నారేమిటి? ఆయన ఎప్పుడూ రొట్టె తినలేదా? అని నాకు సెటైర్లు వేయకండి. నేనే కాదు, యేసుక్రీస్తు వారు కూడా రొట్టె తిన్నారు. ఆయన ద్రాక్షరసమును త్రాగారు, చేపలు తిన్నారు, ఆహారమును భుజించారు. ఆయన సందర్భాన్ని బట్టి ఇక్కడ మాట్లాడుతున్నారు. తన బ్రతుకు పరమార్థం, రొట్టెల కోసం బ్రతకడం, రొట్టెలను తినడం కాదు. మరేమిటి? యేసుక్రీస్తు భూమి మీదకి ఎందుకు వచ్చారు? ఆయన ఈ మనుష్యులకు ఏమి ప్రకటించాలి? ఆయన జీవితంలో ప్రాముఖ్యమైనది ఏది? దీనినే యేసు మాట్లాడుతూ – ఓ శోధకుడా, నీవు చెప్పినట్టుగా నేను ఈ రాళ్ళను రొట్టెలుగా చేసుకుని తినవలసిన అవసరత లేదు. దేవుడిచ్చిన శక్తిని, దేవుని వాక్యము కొరకు నేను వినియోగించాలి. అంతేగాని, నా అవసరతలు తీర్చుకోవడానికి కాదు. బాగా ఆలోచిస్తున్నారా? ఇది యేసుక్రీస్తు మనకు నేర్పిస్తున్న మంచి పాఠం. ఈ ప్రపంచానికి ఆయన తెలియజేస్తున్న గుణపాఠం. ఇప్పటి వరకూ ఈ మాటలలో ఉన్న పరమార్థం 99.99% మంది క్రైస్తవులకు అర్థం కాలేదు అంటే, మీరు నమ్మగలరా? అవునండీ. బైబిల్‌ను అందరూ నామమాత్రంగా చదువుకుంటూ వెళ్ళిపోయారు. 'యేసుక్రీస్తు గనుక అలా ఉన్నాడు. నేనైతే రాళ్ళన్నింటినీ రొట్టెలుగా మార్చుకుని అలా నా జీవితమంతా పస్తులు లేకుండా తింటూ కూర్చుందును, లేకపోతే అమ్ముకుందును. ఈ శక్తి సామర్థ్యాలే నాకుంటే ఈ భూమి మీద రాళ్ళే ఉండనివ్వను, నేను ధనవంతునిగా మారిపోదును' అని మనసులో అనుకుంటారు చాలా మంది. యేసుక్రీస్తు స్థానంలో నేనుంటే, అలా చేసియుందును, ఇలా చేసియుందును అనుకున్నవారు లేకపోలేదు. కానీ, యేసు మాటలలో ఉన్న ఆ మంచి పరమార్థాన్ని మాత్రం ఎవ్వరూ గమనించలేదు, గుర్తించలేదు. దానికి నిదర్శనం నేడున్న క్రైస్తవ జీవితాలు, వారి ప్రార్థనలు, వారి మాటలు, వారి బోధనలు. ఇక్కడ యేసుక్రీస్తు ఏమన్నాడు? "మనుష్యులు రొట్టె వలన మాత్రము కాదు, దేవుని నోట నుండి వచ్చు ప్రతిమాట వలన జీవించును". అని వ్రాయబడియున్నది. ఎక్కడ? ఎక్కడో పూర్వకాలమందు వ్రాయబడింది. దానిని ఈయన జ్ఞాపకం చేస్తున్నాడు. వాక్యములో వ్రాయబడిన ఆ మంచి విషయాన్ని జ్ఞాపకం చేస్తున్నాడు. చరిత్రలో, పాత నిబంధనలోని ప్రతి సందర్భము మనకు పాఠాన్ని నేర్పిస్తుంది. దానిని ఉన్నది ఉన్నట్టుగా మనము పాటించటానికి కాదు. చదివి పాఠాన్ని నేర్చుకోవడానికి! పాత నిబంధనంతా మనకు ఒక బాలశిక్షకునిగా కనిపిస్తుంది. అందులో వ్రాయబడిన ఒక మాటను యేసుక్రీస్తు ఆ సందర్భంలో జ్ఞాపకము చేస్తున్నారు. ఇప్పుడు మీకు ఒక చిన్న ఉదాహరణ ద్వారా దేవుని నోటనుండి వచ్చిన మాట వలన మనిషి బ్రతుకుతాడో, లేదో వివరిస్తాను. ఈ మధ్య 'ఎబోలా' అనేటటువంటి ఒక వ్యాధి వచ్చింది. ఇది ఎయిడ్స్ కంటే వంద రెట్లు ఎక్కువ ప్రమాదకరమైనది. ఎయిడ్స్ అయితే, హెచ్.ఐ.వి. వైరస్

రక్తములో కలిస్తే ఒక వ్యక్తికి ఎయిడ్స్ వస్తుంది. కానీ, ఎబోలా అలా కాదు. వ్యాధిగ్రస్తుల చర్మము మరొక ఆరోగ్యవంతమైన వ్యక్తి చర్మానికి తగిలితే, ఆ వ్యక్తికి ఎబోలా వచ్చేస్తుంది. నెల రోజుల్లో మనిషిని సమాధికి పంపించేస్తుంది. బలహీనముగా ఉన్నవారైతే వారం రోజుల్లోనే చనిపోతారు. ఇప్పుడు ఈ వ్యాధి ఎక్కువగా ఉన్న దేశాలలో లైబీరియా, నైజీరియా దేశాలున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఈ దేశాలలో ఎమర్జెన్సీని విధించారు. ఈ దేశాలలో ఎబోలా వ్యాధి కలిగినవారు విపరీతంగా ఉన్నారు. ఇప్పుడు మన దేశానికి వచ్చిన భయం ఏమిటంటే, మన దేశము నుంచి వేలకు వేలుగా ఆయా దేశాలలో వలస వెళ్ళి ఉన్నారు. ఉద్యోగరీత్యా కొన్నాళ్ళు పని చేసుకుని, డబ్బు సంపాదించి మరలా మన దేశము తిరిగి వచ్చే నిమిత్తం, కొంతమంది ఆయా దేశాలకు వెళ్ళి నివశిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు అన్ని దేశాలలోనూ, మన భారతదేశపు ప్రజలు కనిపిస్తుంటారు. ఇక ఈ ఎబోలా అనే వ్యాధి ఉన్న దేశాలలో కూడా మన భారతదేశానికి సంబంధించిన మనుష్యులు జీవిస్తున్నారు. కనుక భారతీయులు కూడ ఒకవేళ ఆ వ్యాధిని అంటించుకుని మన దేశానికి తిరిగివచ్చి మరలా ఇక్కడ నివశిస్తున్నవారికి ఆ వ్యాధిని అంటించే ప్రమాదముందని మన దేశము భయపడుచున్నది. ఒకప్పుడు మన దేశానికి ఎయిడ్స్ కూడా అలాగే వచ్చింది. ఇంతకీ ఈ ఎబోలా వ్యాధి ఎలా పుట్టిందంటే, గబ్బిలాల వల్ల, కోతుల వల్ల ఈ వ్యాధి మనుష్యులకు వచ్చిందని వైద్య శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మనిషి చేస్తున్న అకృత్యాలను చూచి దేవుడు ఊరుకోలేదు. మనిషి ఈ భూమి మీద బ్రతకటానికి తిండి చాలనుకున్నాడు, బట్ట చాలనుకున్నాడు, గూడు చాలనుకున్నాడు. లగ్జరీ ఐటమ్స్ చాలనుకున్నాడు. మనిషికి కావలసినవన్నీ సంపాదించుకొని నేను చాలా భద్రముగా ఉన్నాననుకుంటున్నాడు. కానీ, దేవుని దగ్గర నుంచి కొన్ని ఆయుధములు మనిషి దగ్గరకు బయలుదేరుతున్నాయి. అలాంటి వాటిలో ఒక ఆయుధమే "ఎబోలా వ్యాధి". మనిషి కోరుకున్నవన్నీ తనకు ఉన్నా, దేవుని పట్టించుకోనినాడు అతడు బ్రతకడానికి వీలు లేదన్నాడు దేవుడు. ప్రపంచ దేశాలలో ఉన్న మనుష్యులందరికి ఏమి కొదువని? అందరికీ అన్నీ ఉన్నాయి. మరి ఎందుకు ఈ దేశాలు భయపడుతున్నాయి? ఎందుకు ఈ వ్యాధులంటే అందరూ గజ గజలాడుతున్నారు? ఈ వ్యాధి మన దేశంలో లేకపోయినా, మన దేశం కూడా ఎందుకు భయపడుతుంది? ఎందుకంటే ఈ వ్యాధికి ఇప్పటివరకు మందులేదు. మందు కనుగొనడానికి వైద్యులు అహోరాత్రులు కష్టపడుతున్నారు. ఈ వ్యాధి ఎంత ప్రమాదకరమైనది అంటే, వైద్యుడు కూడా రోగి దగ్గరికి వెళ్ళలేని దుస్థితి. ఎందుకంటే, ఈ మధ్య ఒక వైద్యుడు రోగి దగ్గరకు వెళితే, ఆ వైద్యునికి కూడా ఈ రోగం వచ్చేసింది. చర్మానికి చర్మం తగులుతుంటే వచ్చేస్తుంది. రోగితో మాటలాడితే వచ్చేస్తుంది. రోగి దగ్గర నిలబడితే వచ్చేస్తుంది ఈ వ్యాధి. చాలా భయంకరమైనది. మనిషికి అన్నీ ఉన్నా ఈ రోజు ఎందుకు బ్రతకలేకపోతున్నాడు? ఇప్పుడు చదవండి ఈ మాట. యేసుక్రీస్తు వారు అప్పుడు చెప్పిన మాటలను మీరు జ్ఞాపకము చేసుకోండి. "మనుష్యుడు రొట్టె వలన మాత్రము కాదు గాని దేవునినోట నుండి వచ్చు ప్రతి మాట వలన జీవించును." మనిషికి దేవుని మాట కావాలి. మనుష్యులను దేవుడే బ్రతికించాలి. మనిషి రొట్టె అనుకుంటున్నాడు, ఇళ్ళనుకుంటున్నాడు, బట్టలు అనుకుంటున్నాడు. తిండి, పానము, వస్త్రము – ఇవే మనిషిని బ్రతికిస్తాయి అనుకుంటున్నాడు. వీటి కోసమే దేవుని కూడా నమ్మాలని అనుకున్నాడు కానీ, దేవుడు ఏమంటున్నాడు! ఇవి కాదు నిన్ను బ్రతికించేవి. నిన్ను బ్రతికించాలి అంటే, దేవుని మాట అవసరం అన్నాడు. ఈ రోజు ప్రపంచమంతా దేనికొరకు కష్టపడుతుంది. దేనికొరకు ఆలోచిస్తుంది? దేనికొరకు మాటలాడుతుంది? దేనికొరకు ప్రయత్నాలు చేస్తుంది. మీరు ఆలోచించండి. ఒక భారతదేశాన్నే ఉదాహరణగా తీసుకుంటే, ఒక పార్లమెంటు దేనికొరకు ఆలోచిస్తుంది? ప్రతి మనిషికి తిండి, బట్ట, గూడు! దేవునిమాట కోసం ఆలోచించే ప్రజలు ఎక్కడున్నారు చెప్పండి? ఇక్కడ అత్యంత ప్రమాదం ఏమిటంటే, ప్రజలెవ్వరూ ఆలోచించకపోయినా, కనీసం దేవుని వాక్యము తెలిసినవారైనా ఆలోచించాలి. దేవుని వాక్యము బోధకుల చేతిలో ఉన్నప్పుడు, 66 పుస్తకాలను వీరు నిరంతరమూ చదువుతున్నప్పుడు, ప్రతి ఆదివారం అందరూ గుడికి వెళుతున్నప్పుడు, కనీసం వీరైనా దేవుని మాట కొరకే ఆలోచించాలి. రొట్టె కొరకు కాక, తిండి కొరకు కాక, పానము కొరకు కాక, దేవుని మాట కొరకు ఆలోచించాలి. కనీసం వీరైనా ఆలోచించుట లేదన్నది ఈ రోజు ప్రశ్నార్థకం. దేవుడు పలికిన మరొక మాటను చూడండి.

**ద్వితీయోపదేశకాండము 8 : 3 –** "ఆహారమువలననే గాక యెహోవా సెలవిచ్చిన ప్రతిమాట వలన నరులు బ్రదుకుదురని నీకు తెలియజేయుటకు ఆయన నిన్ను అణచి, నీకు ఆకలి కలుగజేసి, నీవేగాని, నీ పితురులేగాని యెన్నడెరుగని మన్నాతో నిన్ను పోషించెను". పాతనిబంధన కాలములో ఏమి జరిగిందో చూడండి. ఆనాడు ఇశ్రాయేలీయులను దేవుడు పోషించాడు. ఐగుప్తు బానిసత్వము నుండి వారికి వాగ్దానము చేసిన దేశములోనికి వెళ్ళే ఆ ప్రయాణంలో 40 సంవత్సరాల కాలము పట్టింది. కాలినడకన వారు సముద్రాలు దాటుకుంటూ, అరణ్యాలలో ప్రయాణిస్తూ వెళ్ళిపోతున్న ఆ కాలములో దేవుడు వారిని పోషించాడు. ఎలా? రొట్టెతో కాదు. ఈ రోజు నన్ను బ్రతికించటానికి తిండి కావాలి, నేను బ్రతకడానికి గూడు కావాలి, నేను కట్టుకోవడానికి బట్ట కావాలి అనుకుంటున్న ఈ మనిషియొక్క అజ్ఞానాన్ని బైబిలు ప్రశ్నిస్తుంది. ఏమనో తెలుసా? సుమారు వేల సంవత్సరాలకు పూర్వం ఇశ్రాయేలీయల చరిత్రను ఒక్కసారి మనము చూడగలిగితే, ఇశ్రాయేలీయులు దేవుని వలన పోషింపబడ్డారు. ఇశ్రాయేలీయులు దేవుని వలన తిండి తిన్నారు. ఏ తిండి అది? భూమి మొలిపించిన తిండి కాదు, రొట్టె కాదు, ధాన్యం కాదు, వరి కాదు! నేలను దున్నుకుంటే పండిన పంట కాదు. వారు మన్నాను తిన్నారు. ఏమిటీ మన్నా? రొట్టెలాంటి క్షయమైనది కాదు, రోగమును కలిగించే తిండీ కాదు. ఇది భూసంబంధమైనది కాదు. పరలోకమందున్న దేవుడు ప్రపంచమందున్న ప్రతి మనిషికీ, అంటే భవిష్యత్తులో రాబోవుచున్న ప్రతి ఒక్కరికి పాఠమును నేర్పించాలనుకున్నాడు. ఏమనంటే? భూమిమీద ఉన్న దానితోనే తిండి, బట్ట లేక గూడు అనుకుంటే పొరపాటు. మీరు వీటి నిమిత్తం భూమి మీదకు రాలేదు. ఇవి కేవలం మీ బ్రతుకులో ఉపయోగపడే మామూలు అవసరతలు. ముఖ్యమైన అవసరతలు మాత్రం కాదు! ఇవి ఈ బ్రతుకులో ఉపయోగపడతాయి. కానీ ఎంతవరకు? మీరు రోజులో తిండిని ఎంతవరకూ తింటారు? ఒక పావుగంట భోజనం చేయాలంటే ఒక పావుగంట కూర్చుంటారు. ఇవన్నీ మీ బ్రతుకును కొనసాగించుటకు అవసరమయ్యేవే తప్ప, ఇవే మీ బ్రతుకు పరమార్థం కాదు. అందుకే దేవుడు ఎలాంటి పాఠాన్ని చెబుతున్నాడో చూడండి. ఇశ్రాయేలీయులకు దేవుడు తిండి పెట్టాడు. ఎలా పెట్టాడంటే, అది భూమి వలన వచ్చిన తిండి కాదు. ఆకాశము నుండి వారికి ఆహారమును కురిపించాడు. మనిషి బ్రతకాలి అంటే రొట్టె ఒక్కటే సరిపోదు. మనిషి తయారుచేసుకున్న పదార్థాలు కూడా సరిపోవు. కేవలం దేవునినోట నుండి వచ్చు ప్రతి మాట వలన మనిషి బ్రతుకుతాడు.

**యెషయా 55 : 2 –** "ఆహారము కాని దాని కొరకు మీరేల రూకలిచ్చెదరు?" అన్నాడు చూడండి. మనుష్యుల అజ్ఞానాన్ని దేవుడు ప్రశ్నిస్తున్నాడు. ఏమిటా అజ్ఞానం? ఆహారము కాని దాని కొరకు మనుష్యులు రూకలిస్తున్నారు అన్నాడు. ఆహారము కానిదాని కొరకు ఎక్కడైనా, ఎవరైనా డబ్బు ఖర్చుపెట్టారా? ఆలోచించండి. ఈ భూమిమీద ఇప్పుడు మనమున్న పరిస్థితులలో ఆహారము కాని దాని కొరకు ఎవరైనా తమ కష్టాన్ని వెచ్చిస్తున్నారా? లేదే. అందరూ ఆహారాన్ని తెచ్చుకొనుటకే తమ కష్టాన్ని వెచ్చిస్తున్నారు. కానీ, దేవుడు ఏమంటున్నాడు. మీరు ఆహారము కాని దాని కొరకు మీ కష్టాన్ని వెచ్చిస్తున్నారు అంటూ తరువాత ఏమన్నాడో చూడండి. "సంతుష్టి కలుగజేయని దానికొరకు మీ కష్టార్జితమును ఎందుకు వ్యయపరచెదరు?" సంతుష్టి కలుగజేయదా? సంతుష్టి కలుగజేయని దాని కొరకు మనిషి తనయొక్క కష్టార్జితాన్ని వెచ్చిస్తున్నాడా? అవును. ఈ భూమి మీద మనిషి ఒక ధాన్యం బస్తా కోసం, తులం బంగారం కోసం లేక మిగిలిన అవసరాలు తీర్చుకోవడం కోసమే తన జీవితకాలమంతా గడుపుతూ, దేవుని మాటలను పట్టించుకోకపోతే, దేవుడు ఏమంటున్నాడో తెలుసా! మీరు కష్టపడుతున్నదంతా సంతుష్టి కలుగజేయనిదాని కొరకే! అనగా, ఇది తాత్కాలికమైన సుఖము. ఇది అప్పటికప్పుడు మీ కడుపును నింపే ఆహారము. ఏ ఆహారము కోసమైతే ఇన్నాళ్లూ అందరూ యేసుక్రీస్తును నమ్మి, ప్రార్థన చేసారో, ఆ ఆహారాన్ని దేవుడు ఏమంటున్నాడు? ఇది నీకు మంచిది కాదు అన్నాడు. నీవు దానిని తిను. కానీ, దానికొరకు మాత్రమే అయితే నన్ను నమ్మకు. తిండి లేక నిత్యావసరాల కొరకు నీ జీవితాన్ని నాకు త్యాగం చేయకు. తిండి కాదు, పానము కాదు, వస్త్రాలు కాదు, గూడు కాదు. మరి ఏమిటి? నిత్యజీవము కొరకు నీవు నన్ను నమ్మాలి అంటున్నాడు దేవుడు. పరలోకము కొరకు మాత్రమే నీవు నన్ను నమ్మాలని తన వేదగ్రంథములో వ్రాయించాడు. మీ ప్రార్థనలలో ఎల్లప్పుడూ తిండి

కోసమే దేవుణ్ణి అడుగుతారా! అలా అడగని వారు లేరా? చెప్పండి. దేవుడు తినమన్నాడు. కానీ, ఎంతవరకు? నీ జీవితకాలములో, నీవు బ్రతకటానికి తిండి అవసరం కనుక, ఆ అవసరత నిమిత్తమే దానిని తిను. కానీ, మిగిలిన కాలమంతా నీవు దేవుని కొరకు ఆలోచించాలి. దేవుని ఇష్టాన్ని నెరవేర్చాలి. అందుకు దేవుడు పలికిన ఆ చక్కటి సందర్భాన్ని చూడండి. "సంతుష్టి కలుగజేయని దాని కొరకు మీ కష్టార్జితాన్ని ఎందుకు వ్యయపరచెదరు? నా మాట జాగ్రత్తగా ఆలకించి మంచి పదార్థము భుజించుడి" **(యెషయా 55 : 2)** మంచి పదార్థమును భుజించమంటున్నాడు దేవుడు. ఏమిటా పదార్థం? ఆయన మాటే! దేవుని మాట జాగ్రత్తగా ఆలకిస్తే నీవు మంచి ఆహారాన్ని భుజించినట్టు. ఆయన మాట జాగ్రత్తగా ఆలకించి మంచి పదార్థాన్ని, మంచి ఆహారాన్ని నీవు భుజించాలి. "మీ ప్రాణమును సారమైన దానియందు సుఖింపనియ్యుడి. చెవియొగ్గి నా యొద్దకు రండి. మీరు వినినయెడల మీరు బ్రతుకుదురు **(యెషయా 55 : 2)** చూసారా, మీరు తిన్న క్షయమైన ఆహారం, ఈ రోజు మీరు తింటే, రేపు ప్రొద్దుటికి ఖాళీ అయిపోయే ఆహారం, మరలా ప్రొద్దుట తింటే, మధ్యాహ్నానికి ఖాళీ అయిపోయే ఆహారం మిమ్మును రక్షించదు. మీకు కోరుకోవలసినది ఇది కాదు. ఇది సారవంతమైనది కాదు. ఇది మీకు లాభాన్ని చేకూర్చేది కాదు. అందుకే దేవుడు చెప్పిన మాటలను జాగ్రత్తగా మీరు పరిశీలించండి. మీకు ఆనందాన్నిచ్చే దానికొరకు, మీకు సంతుష్టినిచ్చే దానికొరకు మీరు ప్రయత్నించాలి. అదే అర్థాన్నిచ్చే మాటను మరో సందర్భంలో చెబుతున్నాడు.

**సామెతలు 4 : 20, 21–** "నా కుమారుడా, నా మాటలను ఆలకింపుము. నా వాక్యములకు నీ చెవి యొగ్గుము. నీ కన్నుల యెదుట నుండి వాటిని తొలగిపోనియ్యకుము. నీ హృదయమందు వాటిని భద్రము చేసికొనుము." బైబిలులో నీ కొరకు వ్రాయబడిన ఈ నా మాటలు, నీవు హృదయమందు భద్రము చేసుకోవాలి. "దొరికిన వారికి అవి జీవమును, వారి సర్వ శరీరమునకు ఆరోగ్యమును ఇచ్చును" (22వ వచనం) మనమేమనుకుని బ్రతుకుతున్నాము? ప్రకృతి సంబంధమైన ఆహారము మన సర్వశరీరమునకు ఆరోగ్యాన్నిస్తుందని బ్రతుకుతున్నాము. బయట ఔషధాలషాపులో అమ్మే మందులు, ఆసుపత్రిలో దొరికే వైద్యం మన సర్వశరీరమునకు ఆరోగ్యమిస్తుందని నమ్మి మనము బ్రతుకుతున్నాము. కానే కాదంటున్నాడు దేవుడు! ఇది ముమ్మాటికీ అవాస్తవం. మరేమిటి ఆయన చెప్పదలచుకున్నది? నా మాటలే మిమ్మును బ్రతికిస్తాయి అన్నాడు. నీతిమంతులు, ప్రవక్తల చేత ఎన్నో సంవత్సరాలుగా నేను వ్రాయించిన నా మాటలలో ఉన్న జీవమే మనిషిని బ్రతికిస్తుంది. అది మీ సర్వశరీరమునకు ఆరోగ్యమునిస్తుంది అన్నాడు. ఇంత మహాజ్ఞానాన్ని దేవుడు వ్రాయిస్తే, ఈరోజు బైబిలు పట్టుకున్న వారిలో కూడా చాలామంది ఎలా అపోహపడ్డారంటే, భూమి మీద చిన్న చిన్న అవసరతల కొరకు దేవుని నమ్ముకోవాలి అనుకున్నారు. అసలు దేవుడు ఏమంటున్నాడు? వాటికీ నాకూ అస్సలు పడదు అని అంటున్నాడు. మనుష్యులందరూ దానిని కోరుకుంటున్నారు. ఆహారము కాని దానికొరకు రూకలిస్తున్నారు. సంతుష్టి కలుగజేయని దానికొరకు తమయొక్క కష్టాన్ని వ్యయపరుచుచున్నారు. కానీ, దేవుని దగ్గర నిజమైన ఆహారముంది. ఆయన దగ్గర నిజమైన పానముంది. అదేమిటంటే, దేవుని మాటే అన్నాడు. ఆయన మాట జీవము కలిగిన మాట. ఆయన మాట దగ్గరకు కాకుండా, ఇదిగో లోకసంబంధమైనవాటి దగ్గరికే వెళుతూ, అవి కావాలని మరలా దేవుని అడుగుతున్నారంటే, మనుష్యులు ఎంత అవివేకులో చూడండి. అందుకే యేసుక్రీస్తు వారి జీవిత కాలములో సమరయ స్త్రీ దగ్గరకు ఆయన వచ్చినప్పుడు, జరిగిన ఒక సంభాషణను మనము చూస్తే, ఏది నిజమైన పానమో, ఏది నిజమైన ఆహారమో, దేనికొరకు మనము పరలోకమందున్న తండ్రిని వేడుకోవాలో చెబుతున్నారు.

**యోహాను 4 : 10** "అందుకు యేసు – నీవు దేవుని వరమును, నాకు దాహమునకిమ్మని నిన్ను అడుగుచున్నవాడెవడో అదియు ఎరిగియుంటే నీవు ఆయనను అడుగుదువు, ఆయన నీవు జీవజలమిచ్చునని ఆమెతో చెప్పెను". యేసుక్రీస్తువారు వచ్చి ఒక సమరయ స్త్రీతో మాట్లాడుతున్నారు. ఇంతకీ ఆ సమరయ స్త్రీ ఆ బావి దగ్గరకు ఎందుకు వచ్చింది? నీళ్ళు తోడుకుని వెళ్ళటానికి, శరీర సంబంధమైన దాహాన్ని తీర్చుకోవడానికి వచ్చింది. సమరయ స్త్రీతో ఇప్పటివరకూ నీకు దేవుని వరము తెలియదని యేసుక్రీస్తు అన్నారు. ఈ ప్రపంచానికి కూడా దేవుని వరము ఏమిటో తెలియదు. దేవుణ్ణి ఏమి అడుగుతున్నారు? ఆకాశపు వాకిండ్లు విప్పి పట్టజాలనంత విస్తారమైన

దీవెనలతో మమ్మును కుమ్మరించు అని దేవుని ప్రార్థిస్తున్నారు. ఏమిటా దీవెనలు? బియ్యం, పప్పులు, ఉప్పులు, కాయగూరలు, డబ్బు, వస్త్రాలు, బంగారం, బ్యాంకు బ్యాలెన్సు, కారు, భవంతులు,... ఇవేనా! ఆకాశపు వాకిండ్లు విప్పి పట్టజాలనంత విస్తారమైన దీవెనలు కుమ్మరించమని మీ దేవుని ప్రార్థించేది ఇవి అడగటానికేనా! అయితే ఇలా అడిగే వారందరికీ సమరయ స్త్రీవలె దేవుని వరము అంటే ఏమిటో అర్థం కాలేదు. యేసుక్రీస్తు వారు చెబుతున్నారు చూడండి. ఇది మణికుమార్‌గా నా మాటకాదు. యేసుక్రీస్తువారి మాట. “అందుకు యేసు ఆ సమరయ స్త్రీతో– నీవు దేవుని వరమును, నాకు దాహమునకిమ్మని నిన్ను అడుగుచున్నవాడెవడో అదియు ఎరిగియుంటే – నీవు ఆయనను అడుగుదువు. నీవు యేసుక్రీస్తుకు బావిలోని మంచినీళ్ళు ఇవ్వటం కాదు, నీవే ఆయనను అడుగుతావు. ఏమని అడగాలో చూడండి. “ఆయన నీకు జీవజలమిచ్చునని ఆమెతో చెప్పెను” యేసుక్రీస్తు దగ్గర ఉన్నవి జీవజలములు! ఆమె దగ్గరున్నవి అప్పటికప్పుడు దాహాన్ని తీర్చే యాకోబు బావిలో ఉన్న జలములు. ఇప్పుడు యేసుక్రీస్తు దగ్గర జీవజలముందన్న సంగతి సమరయ స్త్రీకి అర్థమైపోయింది. సమరయ స్త్రీ ఏమనుకుంటుందంటే, నేను ఈ యాకోబు బావి దగ్గరకు మాటిమాటికీ వచ్చి నీటిని తోడుకుని వెళ్ళకుండా, ఆ జీవజలమేదో నా దగ్గరే ఉంటే, నా ఇంటిలోనే నీళ్ళు విస్తారంగా నాకు దొరుకుతాయి కదా అనుకుంది. అదే భావాన్ని ఈ వాక్యభాగములో వ్యక్తపరుచుచున్నది.

**యోహాను 4 : 11–** “అప్పుడా స్త్రీ – అయ్యా, ఈ బావి లోతైనది, చేదుకొనుటకు నీకేమియు లేదే. ఆ జీవజలము ఏలాగు నీకు దొరుకును?” అని మొట్టమొదట సందేహాన్ని వ్యక్తం చేసింది. ఆయన దగ్గర కూడా ఆ జీవజలము లేదేమోనని, ఈ బావిలోనే ఆ జీవజలము కూడా ఉందేమోనని, ఆ జీవజలమును ఇతడు మాత్రమే కనుగొనగలడేమోనని, ఆ యేసుక్రీస్తుతో సమరయ స్త్రీ – ‘నీ దగ్గర చేదుకొనుటకు ఏదీలేదు. జీవజలము నీకు ఎలా దొరుకుతుంది? తాను, తన కుమారులు, పశువులు, ఈ బావినీళ్ళు త్రాగి, మాకిచ్చిన మన తండ్రియైన యాకోబు కంటే నీవు గొప్పవాడవా? పూర్వీకుడైన అబ్రహాముకు మనవడు, ఇస్సాకుకు కుమారుడైన యాకోబు కట్టించిన ఈ బావి వలన మేమంతా దాహాన్ని తీర్చుకుంటున్నాము. అయితే ఆ యాకోబు కంటే నీవు గొప్పవాడవా? జీవజలాన్ని ఇస్తానంటున్నావు. అయినా ఆ జీవజలమును పైకి తీయుటకు నీ దగ్గర ఏముందని ఆమె యేసును అడుగుతున్నప్పుడు “అందుకు యేసు– ఈ నీళ్ళు త్రాగు ప్రతివాడును మరల దప్పిగొనును” అన్నాడు.**(13వ వచనం)** యేసుక్రీస్తు మాటలలోని సారము అదే! ఆహారము కానిదాని కొరకు మీరు రూకలిస్తున్నారు అంటే, ఈ ఆహారము మీరు తింటే మరల మీరు ఆకలిగొంటారు. ఈ పానము మీరు త్రాగితే మరల మీరు దప్పిగొంటారు. ఈ వస్త్రాలు మీరు వేసుకుంటే మరల మీకు వస్త్రాలు కావాలి. ఈ గూడు ఒక 30 లేదా 40 యేళ్ల వరకు ఉంటుంది, తరువాత శిథిలమైపోతుంది. మరల గూడు కట్టుకోవాలి. అయితే మీకు శాశ్వతమైన వాటిని పరిచయం చేయటానికి ఈ భూమి మీదకు నేనొచ్చాను. దానిని గూర్చే బైబిల్ మాట్లాడుతుంది అన్నాడు యేసుక్రీస్తు. అందుకే ఏమన్నాడో చూడండి. “నేనిచ్చు నీళ్ళు త్రాగువాడు ఎప్పుడును దప్పిగొనడు” **(14వ వచనం)**

అమ్మా సమరయ స్త్రీ, నీవు త్రాగే ఆ నీళ్ళ వలన మరల దప్పిక కలుగుతుంది. ఈరోజు వచ్చావు, నీళ్ళు తీసుకుని వెళ్ళావు. మరల నీవు రేపు రావాలి, నీళ్ళు తీసుకొని వెళ్లాలి. కానీ, నేనిచ్చు నీళ్ళు త్రాగినవారికెప్పుడూ దాహము ఉండదు అన్నాడు. తరువాత యేసుక్రీస్తు, “నేను వానికిచ్చు నీళ్ళు ఈ బావిలోనివి కావు. నేనే వానికిస్తాను. నేనిచ్చు నీళ్ళు నిత్యజీవమునకై వానిలో ఊరెడి నీటిబుగ్గగా ఉండునని ఆమెతో చెప్పెను.” ఆ స్త్రీ ఆయనను చూచి చాలా ఆశ్చర్యపోయింది. నిజముగా ఆ జీవజలమే నా దగ్గరుంటే, నా ఇంటిలోనికి వాటిని తీసుకొని వెళితే, నేను ఎక్కడికీ బయటకు వెళ్ళవలసిన అవసరం లేదనుకుంది. అప్పుడప్పుడు మన దగ్గర ఉన్న స్త్రీలు కూడా ఏమనుకుంటారు చెప్పండి? బయటకు వెళ్ళి నీళ్ళు తెచ్చుకునే పరిస్థితి ఉన్నప్పుడు, ఇంటిలో ఎప్పుడూ మొత్తుకుంటూ ఉంటారు. వెంటనే కుళాయి కనెక్షన్ వేయించుకోవాలి. మనకు పంచాయితీ ద్వారా, మున్సిపాలిటీ ద్వారా లేక కార్పొరేషన్ ద్వారా, ఒక కుళాయి ట్యాప్ వచ్చేస్తే, ఇంటిలో నుంచి స్త్రీ బయటకు వెళ్ళే బాధ లేదు. కష్టపడవలసిన అవసరత లేదు. ఈ బావి ఎప్పుడుంటుందో, ఎప్పుడు ఎండిపోతుందో! వీధి కుళాయి ఎప్పుడొస్తుందో ఎప్పుడు ఆగిపోతుందో! నీటి కోసం లైనులో నించోవాలి. బిందెలతో మోసుకుని రావాలి. ఈ గోలంతా ఉండదనుకుంటారు. సమరయ స్త్రీతో

యేసుక్రీస్తు వారు ఏమన్నారో, ఆమెకు జీవజలములు ఎలా ఇచ్చారో చూద్దాం! "ఆ స్త్రీ ఆయనను చూచి – అయ్యా నేను దప్పిగొనకుండునట్లును, చేదుకొనుటకింతదూరము రాకుండునట్లును ఆ నీళ్ళు నాకు దయచేయుమని అడుగగా, "యేసు – నీవు వెళ్ళి నీ పెనిమిటిని పిలుచుకొని ఇక్కడికి రమ్మని ఆమెతో చెప్పెను. ఆ స్త్రీ – నాకు పెనిమిటి లేదనగా, యేసు ఆమెతో – నాకు పెనిమిటి లేదని నీవు చెప్పిన మాట సరియే. నీకు అయిదుగురు పెనిమిట్లుండిరి. ఇప్పుడు ఉన్నవాడు నీ పెనిమిటి కాదు, సత్యమే చెప్పితివనెను". **(యోహాను 4 : 15–18)**

అప్పుడా స్త్రీ బావిలోని జలములను గూర్చి మరిచిపోయింది. యేసుక్రీస్తు వెంటనే తన మాటల ద్వారా జీవజలమివ్వడం ప్రారంభించాడు. ఆ దేవుని వాక్యము ఎప్పుడైతే ఆమెకు అనుగ్రహింపబడుతున్నదో వెంటనే మామూలు దప్పిక తీర్చే నీటిని గూర్చి ఆమె మరిచిపోయింది. ఆ యేసు మాటలు వింటున్న ఆమె వెంటనే ఏమంటున్నది? "అయ్యా నీవు ప్రవక్తవు అని గ్రహించుచున్నాను. మా పితరులు ఈ పర్వతమందు ఆరాధించారు" అని చెప్పింది. చూసారా? ఆరాధనను గూర్చి, దేవుని గూర్చి మాట్లాడతున్నది. దేవుని వాక్యము తెలుసుకుంటున్నది. జీవజలము అనగా ఏమిటన్నమాట! దేవుని వాక్యమే. ఈరోజు అక్కడక్కడా మనకు జీవజలము అనే పేరు వినిపిస్తుంది. అప్పుడప్పుడు మనకు ఆయా ప్రాంతాలలో జీవజలము అనే పేరుతో చిన్న చిన్న సీసాలలో మనకు కనిపిస్తుంది. జీవజలమంటే సీసాలో సాంపిల్ కాదు! ఎక్కడో ఒకచోట మినరల్ వాటర్ ప్లాంట్‌లో సీసాలన్నీ నీటితో పట్టేసి, వాటన్నింటినీ పెట్టెలలో ప్యాక్ చేసి, ఇక్కడికి తీసుకుని వచ్చి, సీసా పది రూపాయల చొప్పున అమ్ముతూ, ఇది జీవజలమంటే.. ఇంతకంటే చెడ్డదైన కార్యక్రమం మరొకటి ఉంటుందా మీరే చెప్పండి. శాంపిల్ బాటిల్ జీవజలమనుకుని తీసుకుంటున్న వారందరూ బఫూన్లు! వాటిని తయారు చేస్తూ, బైబిల్‌లోని ఆ అమూల్యమైన మాటను వక్రీకరిస్తూ, దేవుని పేరిట వ్యాపారం చేస్తున్న వాడు కిల్లర్ వీరప్పన్ కంటే కిలాడి. బాగా ఆలోచిస్తున్నారా? యేసుక్రీస్తు సమరయ స్త్రీతో ఏమన్నాడు? ఆ జీవజలమును గూర్చి ఆయన ఏమని మాట్లాడాడు? నేను నీకు అనుగ్రహిస్తున్నది వాక్యము. అంతేగాని, నీవు త్రాగడానికి నీరు కాదు. ఈ మాటలు ఇప్పటికీ కూడా ఎంతోమందికి అర్థం కాక, ఈ బైబిలులో వ్రాయబడిన మాటలను అపార్థం చేసుకున్నవారై, అందరికీ అపార్థముగానే బోధిస్తూ వ్యాపారంచేస్తూ డబ్బు సంపాదిస్తున్నారు. నిజంగా జీవజలములు మా దగ్గర దొరుకును అని చెప్పినవాడు, ప్రజలకు ఏమివ్వాలి? ప్రజలకు ఏమి అందజేయాలి? వాక్యాన్ని మాత్రమే అందజేయాలి. అది కూడా ఉచితంగా! కానీ, ఈ రోజు ఎందరో జరిగిస్తున్న బడా వ్యాపారం చూడండి. జీవజలము అనే పేరు బైబిల్లో వ్రాయబడిందని, కేవలం ఆ మాటను తీసుకుని, అదే మాటను ఆ సీసా మీద ప్రింట్ చేసి, శాంపిల్ బాటిల్‌గా అమ్ముకుంటున్నారు. అమాయకులకు ఏమని చెబుతున్నారో తెలుసా? ఇదే అసలుసిసలైన జీవజలము అంటున్నారు. దానిని తీసుకుంటున్నవారందరూ బైబిల్ మీద పరిజ్ఞానం లేనివారు గనుక, బైబిలులో ఏమి వ్రాయబడిందో తెలియనివారు గనుక ఆ సీసా బుడ్డిని పట్టుకొని ఇంటికి వెళ్ళిపోయి దానినే త్రాగి, ఇదే జీవజలమనుకుంటున్నారు అవివేకులైన ప్రజలు. ఈ మాటలు చదువుచున్న మీరైనా దేవుని ఆవేదనను అర్థం చేసుకోవాలి. దేవుడంటున్న ఆ జీవజలము ఏమిటో, దేవుడంటున్న ఆ మంచి పదార్థమేమిటో, అసలైన ఆహారమేమిటో, దేవుడనుగ్రహిస్తున్న ఆహారానికి, పానమునకు, వస్త్రమునకు సంబంధించిన ఆ మహోన్నతమైన జ్ఞానమేమిటో ఈ రోజు మనము అర్థం చేసుకోవాలి. యేసుక్రీస్తు సమరయ స్త్రీకి ఇస్తున్న ఆ జీవజలమేమిటో తెలుసా? పరలోకమందున్న దేవునియొక్క జ్ఞానము! అమ్మా, నీవెందుకు బ్రతకాలి? నీవు ఈ భూమి మీదకు ఎవరికొరకు వచ్చావు? నీళ్ళు చేదుకొనుటకు ఇక్కడికి వచ్చి మరల ఇంటికెళ్ళిపోయి, మరల దాహమైతే ఇక్కడికి వచ్చి, మరల ఇంటికి వెళ్ళిపోయి, ఇలా... ఇది కాదమ్మా, నీ బ్రతుకు పరమార్థం. నీటిని తీసుకుని వెళ్ళు. నేను కాదనడం లేదు. కానీ, నీవు తెలుసుకోవలసిన అతి ప్రాముఖ్యమైన విషయమంటూ ఒకటి ఉంది. అదేమిటంటే, నిన్ను రక్షించటానికి మెస్సయ్య వచ్చాడు. ఆయన ఈ భూమి మీద క్షయమైన ఆహారాన్ని నీకివ్వడానికి రాలేదు. త్రాగితే మరల దప్పిగొనే నీళ్ళను నీకివ్వడానికి రాలేదు. మహోన్నతమైన జ్ఞానాన్ని నీకు చెప్పడానికి వచ్చాడు. పరలోకానికి దారిని చూపించడానికి వచ్చాడు. ఈ మాట చెప్పగానే, వాటిని సాత్వికమైన మనసుతో అంగీకరించిన సమరయ స్త్రీ తన కుండను విడిచిపెట్టి, మరల ఊరిలోనికి వెళ్ళిపోయింది. ఆమెకు ఇక ఈ భూసంబంధమైన నీటి

మీద ఆశ లేదు. తనతో ఈ మాటలు చెప్పిన యేసుక్రీస్తు వారిని గూర్చి ఆ ఊరిలోని వారందరికీ పరిచయం చేసి, వారందరినీ తీసుకుని వచ్చి యేసు పాదాల ముందు నిలబెట్టింది. ఇదిగో ఈయన మాటలు మీరు కూడా వినండి. అప్పుడు మీ తిండి, మీ పానము, మీ వస్త్రాలు అన్నీ మారిపోతాయి. ఇదిగో ఈయన మాటలు మీరు వినకపోతే మరణించిన తరువాత మీరు నరకములోనికి వెళ్ళిపోతారు. అగ్నిగుండములో పడిపోతారు. మీ ఆత్మలు నశించిపోతాయి. కనుక మీ బ్రతుకు పరమార్థం తెలుసుకోవాలంటే ఇదిగో ఈ మహోన్నతుని దగ్గరకొచ్చి మీరు వాక్యమును వినాలి, నేర్చుకోవాలి, అదే జీవజలమని ఆమె మరల తన ఊరి వారందరికీ పరిచయం చేసింది. ఈ రోజున్న బోధకులకు గానీ, బైబిలు పట్టుకున్న నామకార్థ క్రైస్తవులకు గానీ ఎవరికైనా ఇంత జ్ఞానము ఉందేమో మీరు ఆలోచించండి. దేవునికి ప్రార్థనలు మొదలుపడితే, నాకది కావాలి, నాకిది కావాలి, అందరికీ అన్నీ కావాలని అడిగే ఈ దౌర్భాగ్యపు సమాజం, నాకు పరలోకము కావాలని ఎప్పుడైనా అడిగిందా? వీరికి నిత్యజీవము, పరలోకము తప్ప అన్నీ కావాలి. భూసంబంధమైనవన్నీ కావాలి. ఏమిటండి, ఇదేనా భక్తి? ఇవేనా పరలోకమందున్న తండ్రిని అడుగవలసిన అవసరతలు? దేవుడేమో ఆదికాండము నుంచి ప్రకటన గ్రంథము వరకు ఎంతో చక్కని ప్రణాళిక వేసి, మొదటి కాలము నుంచీ మనిషికి ఆత్మసంబంధమైన సంగతులనే నేర్పిస్తున్నాడు. ఇశ్రాయేలీయులకు భూమి నుంచి మొలిచిన ఆహారాన్ని పెట్టగలడాయన. వారు నడుచుచున్న ఆ అరణ్య మార్గములో వారికి భూమి నుంచి ఆహారాన్ని అనుగ్రహించగలిగినా, భవిష్యత్తు తరాలకు పాఠమును నేర్పించాలనుకున్నాడు. ఈ భూమి ఇచ్చిన దానివలన మనిషి బ్రతకడమనేది అతి సామాన్యమైన విషయం. ఆ తర్వాతి కాలములో అది మనుష్యులు మరిచిపోవాలి. మనిషి భూసంబంధమైన దానిమీద తన గురిని ఉంచకూడదు. అసలు దాని కొరకు మనిషి ఆలోచించకూడదు. కానీ, ప్రకృతి సంబంధమైన బ్రతుకు తప్ప వేరే ఆలోచన ఏ మనిషిలోనూ, ఎవ్వరికీ లేదు. అందరికీ భూసంబంధమైన ఆలోచనలే! ప్రధానమంత్రి మొదలుకొని సామాన్య మానవుడైన పేదవాని వరకు, ప్రతీ ఒక్కరిదీ ప్రకృతి సంబంధమైన బ్రతుకే! 60 సంవత్సరాలలో నేను ఈ ప్రకృతిని గుంజుకుని, ఎలా తినాలి? ఎలా బ్రతకాలి? ఎలా సంతోషించాలి? మట్టికి ఎలా చేరుకోవాలి? అని ఆలోచిస్తున్నాడు తప్ప నా ఆత్మను ఎలా రక్షించుకోవాలి? మహాజ్ఞానంలో ఏమి వ్రాయబడింది? అని ఏ నరుడూ ఆలోచించకపోవడం ఎంతో శోచనీయమే. బైబిల్‌ను చేతపట్టినవాడైనా నేర్చుకుని, ఈ మహాజ్ఞానాన్ని ప్రకటించాలి.

మనిషి తినడానికి ఆరాటపడవలసిన ఆహారమును గూర్చి యేసుక్రీస్తు ప్రస్తావిస్తూ, **యోహాను 4 : 31–** "ఆ లోగా శిష్యులు – బోధకుడా, భోజనము చేయుమని ఆయనను వేడుకొనిరి". మధ్యాహ్న భోజన సమయం అయింది గనుక యేసుక్రీస్తును శిష్యులు భోజనం చేయమని అడుగుతున్నారు. ఏ భోజనం కొరకైతే ఈ రోజు ప్రజలందరూ ఆలోచిస్తున్నారో ఆ భోజనము చేయమని, శిష్యులు అడుగుతున్నప్పుడు, యేసు ఏమంటున్నాడో చూడండి. "అందుకాయన – భుజించుటకు, మీకు తెలియని ఆహారము నాకున్నదని వారితో చెప్పగా" – యేసుక్రీస్తు తన శిష్యులతో పరిహాసము చేయడం లేదు సుమా! అప్పుడు శిష్యులు ఏమనుకుంటున్నారో చూడండి. "ఆయన భుజించుటకు ఎవడైనా ఏమైనా తెచ్చునేమో అని ఒకరితో ఒకడు చెప్పుకొనిరి". అంటే శిష్యులకు కూడా ఈ ఆహారాన్ని గూర్చి తెలియదన్నమాట. జీవజలమును గూర్చి సమరయ స్త్రీకి అర్థం కాలేదు. భూమి మీద ఏ ఆహారము కొరకు మనిషి కష్టపడాలో ఆ ఆహారాన్ని గూర్చి శిష్యులకు అర్థం కాలేదు. అందుకే శిష్యులు ఈయన భుజించుటకు ఎవరైనా ఆహారాన్ని తీసుకుని వస్తారేమోనని అభిప్రాయపడుతున్నారు. అందుకే మీకు తెలియని ఆహారము నా దగ్గరుంది, మీరు వెళ్ళి మీ తిండిని మీరు తినమని యేసుక్రీస్తు అంటున్నారనుకుని శిష్యులు కూడా అపోహపడ్డారు. అప్పుడు వెంటనే యేసు, శిష్యుల యొక్క సందేహాన్ని నివృత్తి చేస్తూ – "వారిని చూచి, నన్ను పంపినవాని చిత్తము నెరవేర్చుట, ఆయన పనిని భూమి మీద తుదముట్టించుట నాకు ఆహారము" అన్నారు. చూసారా! ఈ ఆహారము నిమిత్తము, ఈ పానము నిమిత్తము, ఇలాంటి వస్త్రముల నిమిత్తము ఏ మనిషైనా ఏనాడైనా ఆలోచన కలిగియున్నాడా? లేనే లేదు. పోనీ బాప్తీస్మము తీసుకున్న తరువాత అయినా ఇలాంటి ఆలోచన కలిగియున్నాడా? బాప్తీస్మము తీసుకొనకముందు అయితే, లోకసంబంధమైన ఆహారము, లోకసంబంధమైన పానము, లోకసంబంధమైన వస్త్రాలు. అన్నీ లోకసంబంధమైనవే కావాలి. బాప్తీస్మము తీసుకున్న తరువాత, నేను క్రీస్తుతో కూడా లేచినవాడను, క్రీస్తును

ధరించుకున్నవాడను అని చెప్పుకుంటున్న క్రైస్తవుడు ఎవరి కొరకు ఆలోచించాలి? తమ ఆహారాన్ని ఎలా మార్చుకోవాలి? ఆహారము ఎలా ఉండాలో యేసుక్రీస్తు చెబుతున్నాడు చూడండి. 'నా తండ్రి పని, నేను భూమి మీద నెరవేర్చటయే నాకు ఆహారం'. అంటే, భూమి మీద దేవుడప్పగించిన పని నెరవేర్చితేనే, ఈ బ్రతుకు దేవునికి అంగీకారయోగ్యమైనది. శరీర సంబంధమైన ఆహారము చాలా ముఖ్యమైనదనుకుంటే, ఈరోజు నేను బాగా చికెన్ బిర్యాని తిన్నాను. ఇంకో ఐదేళ్ళు ఎక్కువ బ్రతుకుతానని మీరు చెప్పగలరా? చెప్పలేరు. రేపటికే మీ ప్రాణం పోవచ్చు. భూసంబంధమైన ఆహారము మీ ప్రాణాన్ని రక్షించదు. మీ బ్రతుకును ముందుకు కొనసాగించదు. నేను ప్రతి రోజు మంచి మినరల్ వాటర్ త్రాగుతాను, ఇంకో పదేళ్ళు నేను చక్కగా బ్రతుకుతానని చెప్పగలరా? లేదండి. ఈరోజు తాగినది, రేపటికి ఖాళీ అయిపోతుంది. వీటిని నమ్మకండి. అలాగని త్రాగొద్దని నేను చెప్పటం లేదు. చాలామంది ఒకవేళ అపార్ధం చేసుకుంటున్నారేమో! అప్పుడప్పుడు ఉదాహరణగా ఒక నిద్రపోతును చూసి– ఎప్పుడూ వీడికి నిద్రేనా? అని అన్నామనుకోండి. అతడు ఎప్పుడూ మేల్కొని ఉండడని కాదు. అలాగని మనము అసలు నిద్రపోమనీ కాదు. 'వాడు వట్టి తిండిపోతు" అని అన్నామనుకోండి. మనము ఎప్పుడూ తిండిని తినమని కాదు. మనమూ తింటాము. కానీ వాడు ఐదు కంచాలు తింటాడు, ప్రతి క్షణం తింటూనే ఉంటాడు కనుక తిండిపోతు అని అర్ధం! ఆలోచిస్తున్నారా? ఈ ప్రపంచమంతా తిండి కొరకు, పానము కొరకు, వస్త్రముల కొరకు బ్రతుకుతూ, చివరకు దేవుణ్ణి కూడా దాని కొరకే నమ్ముతుంది, అని చెబుతున్నాను అంటే దానికి అర్థం ఏమిటి? ఇవన్నీ మానేయమని కాదు. మీ జీవితకాలములో వాటిని మీరు జరిగించినా, మీ బ్రతుకు పరమార్ధం మీకు తెలియాలి. మీ తండ్రి కొరకు మీరు బ్రతకాలి. యేసుక్రీస్తు వలె మీ బ్రతుకు ఉండాలి. ఈ భూమి మీద ఉన్న నీరు కాదు, ఈ భూమి మీద ఉన్న తిండి కాదు, అసలైన తిండి, అసలైన పానమేమిటో యేసుక్రీస్తు చెబుతున్నారు. ఈ భూమి మీద ఆహారమును తిను తప్పులేదు. కానీ, దేవుని పనిని నెరవేర్చుట, ఆయన పనిని తుదముట్టించుట అని అన్నాడంటే, దేవుని పని నెరవేరిస్తే నీ కడుపు నిండినట్టు, నీ బ్రతుకు ముందుకు కొనసాగుతున్నట్టు! ఇప్పుడు చెప్పండి, భూమి మీద ఉన్న ఈ మానవ ప్రపంచమెలా ఉంది? నామకార్ధ క్రైస్తవ ప్రపంచమెలా ఉంది? మనిషిని ఆహార పదార్ధాలు బ్రతికిస్తాయా? పానము బ్రతికిస్తుందా? లేక మీరు అడుగుతున్న అన్ని అవసరతలు బ్రతికిస్తాయా? లేదండీ, దేవుని మాటే మనిషిని బ్రతికిస్తుంది!

**యిర్మియా 15 : 16 –** "నీ మాటలు నాకు దొరకగా నేను వాటిని భుజించితిని". దేవుని మాటలు కూడా భుజించగలమా? ఆలోచించండి. దేవునిని ఇప్పటివరకూ శరీర సంబంధముగా కోరికలు, ప్రార్ధనలు అన్నీ అడిగిన మనము, దేవుని మాటలను భుజించగలమా? యిర్మియా అదే మాట్లాడుతున్నాడు. "నాకు దేవుని మాటలు దొరకగా నేను వాటిని భుజించితిని. సైన్యములకు అధిపతియగు యెహోవా, దేవా, నీ పేరు నాకు పెట్టబడెను గనుక నీ మాటలు నాకు సంతోషమును నా హృదయమునకు ఆనందమును కలుగజేయుచున్నవి. **(యిర్మియా 15 : 16)** ఎంత చక్కని మాటలో చూడండి. దేవుని మాటలు మనకు ఆహారాన్ని పెడుతున్నాయి. దేవుని మాటలు మనలను బ్రతికిస్తున్నాయి. నిజమేనంటారా? లేక దేవుని మాటగా వ్రాయబడింది గనుక గ్రుడ్డిగా నమ్ముదామంటారా? దేవుని మాట మనిషిని బ్రతికిస్తుందా? ఇక్కడ యిర్మియా ఏమంటున్నాడో చూడండి. "నీ మాటలు నాకు దొరకగా నేను వాటిని భుజించితిని" అంటున్నాడు. భుజించిన వానికి ఏమి జరగాలి? కడుపు నిండాలి. ఇంతకీ యిర్మియా ఆకలితో ఉన్నప్పుడు దేవుని మాటలు భుజిస్తే ఆయన కడుపు నిండిందా? దేవుని మాటలే మనిషి భుజించాలి, దేవుని పని నెరవేర్చాలి, అప్పుడు మనిషికి ఆకలి తీరినట్టు అని చెబుతున్నారు. ఇది నిజంగా వాస్తవమే అంటారా? అని మీరు నన్ను అడిగితే నూటికి నూరు శాతం ఇది నిజం! ఎలా? అనేది మన ప్రశ్న. దేవుని మాటలు భుజిస్తే మనిషి ఆకలి ఎలా తీరుతుంది? దేవుని పని నెరవేరిస్తే మనిషి కడుపు ఎలా నిండుతుంది? ఇప్పుడు మీకు చెబుతాను. జాగ్రత్తగా గమనించండి. పరలోకమందు దేవుడున్నాడు. అది మొదటి లోకం, మొదటి విశ్వం. భూమి మీద మనిషి నివసిస్తున్న లోకం, ఇది రెండవ విశ్వంలో భూలోకము. దేవుడు పరలోకమందు ఉన్నవాడై ఈ సర్వప్రపంచాన్ని కాపాడుతున్నాడు. ఆ ప్రపంచంలో భూమి కూడా ఒక భాగం. అంటే, భూమి కూడా కాపాడబడాలి. భూమి మీద తన కార్యక్రమాలు నెరవేర్చాలి. దాని మీద ఉన్నవారికి ఈ భూమి బ్రతుకునివ్వాలంటే, పరలోకమందున్న తండ్రి

భూమికి ఆజ్ఞ ఇవ్వాలి. భూమిని ఆయన ఎప్పుడు రక్షిస్తాడు? భూమి మీద ఉన్నవారిని ఆయన ఎప్పుడు కాపాడతాడు? ఆయన పని జరిగినప్పుడు లేక ఆయన మాటలకు న్యాయం జరిగినప్పుడే కదా! భూమి మీద మనిషి బ్రతుకు దేనితో ముడిపడి ఉంది? తిండితో ముడిపడి ఉందనుకుందాం. నిజముగా మన బ్రతుకు కొనసాగాలి, మన కడుపు నిండాలంటే, ఈ భూమి మీద ఆహార పదార్థాలన్నీ మనకి పండాలనుకుందాం. ఎలా పండుతాయి? దేవుని మాట వలనే అవి పండాలి. దేవుని మాట వలనే భూమి సారాన్ని కలిగివుండాలి. మనకు గతంలో చాలా రోజులు పంటలు పండని సంవత్సరాలు కనిపించాయి. ఎందుకు? పరలోకమందున్న తండ్రి వలన భూమికి ఆజ్ఞ రాలేదు. ఈ భూమి మీద పంటలన్నీ పండాలని, సస్యశ్యామలంగా ఉండాలన్న ఆజ్ఞ, పరలోకములో నుండి జారీ చేయబడలేదు. అందువలన మనుష్యుల బ్రతుకు కొనసాగలేదు. చాలా మంది కరువు వలన చనిపోయారు. అంటే, మనిషి బ్రతకాలి అంటే, యిర్మియా భక్తుడు ఏమంటున్నాడు? దేవుని మాటలే మనిషిని బ్రతికిస్తాయి. అదే యేసుక్రీస్తు కూడా చెప్పాడు. మనిషి రొట్టె వలన మాత్రము కాదు గానీ దేవుని నోటనుండి వచ్చు ప్రతీ మాట వలన జీవించును. ఆ దేవుని నోటి మాట వలన ప్రకృతి సస్యశ్యామలంగా ఉంటే, దాని వలన మనిషి బ్రతుకుతాడు. భూమి మీదనున్న మనుష్యులు తమ జీవితాన్ని కొనసాగిస్తారు. లేకపోతే ఈ భూమి వారికి సహకరించదు.

**యిర్మియా 5 : 24 –** "వారు – రండి మన దేవుడైన యెహోవా యందు భయభక్తులు కలిగియుందము". ఆ దేవుని మాటలను మనము నెరవేరుద్దాం. ఆ దేవుని మాటలను మనము భుజిద్దాం. ఆ దేవుని మాటల ప్రకారము మనము నడుచుకుందాము. "ఆయనే తొలకరి వర్షమును, కడవరి వర్షమును దాని దాని కాలమున కురిపించువాడు గదా". **(24వ వచనం)** రైతు కాదా? కాదు. ప్రభుత్వం కాదా? కాదు. శాస్త్రవేత్తలు కాదా? కాదు. ధనవంతులు కాదా? కానే కాదు. తొలకరి వర్షమును, కడవరి వర్షమును దానిదాని కాలమున కురిపించువాడు ఎవడు? పరలోకమందున్న దేవుడు. ఇంతకీ ఆయన ఎప్పుడు కురిపిస్తాడు? ఎప్పుడు భూమిని కాపాడతాడు? 'రండి మనమందరము పరలోకమందున్న దేవుని మాటలను పాటిద్దాం. ఆ మాటలను మనము భుజిద్దాం. ఆ మాటల ప్రకారం మనము నడుచుకుందాం. ఆ మాటలను మనము విందాం. అప్పుడు దేవుడు తొలకరి వర్షమును, కడవరి వర్షమును దాని దాని కాలమందు కురిపించువాడు. నిర్ణయింపబడిన కోతకాలపు వారములను ఆయన మనకు రప్పించునని ఈ మనుష్యులు తమ మనసులో అనుకొనకపోతే మీ దోషములు ప్రకృతియొక్క క్రమమును తప్పించేస్తాయి. వాటి వాటి కాలమున రావలసిన వర్షాల క్రమమును మీ దేషాలే తప్పిస్తాయి అంటున్నాడు. ఏమిటా దోషాలు అంటే, దేవుని మాట పట్టించుకోకపోవడం, దేవుని ఆజ్ఞ ప్రకారం బ్రతకకపోవడం, దేవుడు వ్రాయించిన మాటలను గౌరవించక పోవడం. ఆయన దేనినైతే ఆలోచించమన్నాడో, దేని కొరకైతే బ్రతకమన్నాడో దానిని విడిచిపెట్టి, మిగిలిన వాటన్నింటి కొరకు ఆలోచిస్తూ, అవే మా బ్రతుకు పరమార్థం అనుకున్న మనుష్యులను దేవుడు చూస్తే, వారి యెడల దేవుడు చాలా కోపంతో ఉన్నాడు. ఆ కోపము వల్ల ఏమి జరుగుతుంది? ప్రకృతి యొక్క క్రమం తప్పుతుంది. అంటే, వాటి వాటి కాలాలలో వర్షాలు ఇక రావన్నమాట. ఇప్పుడు మనమధ్య జరుగుచున్న పరిస్థితి అదే. రైతు నారు వేసాడనుకోండి. వర్షాల కోసం ఎదురు చూసాడనుకోండి. అలాంటప్పుడు వర్షాలు ఖచ్చితంగా రావు. పైరు బాగా పండి, పంట చేతికి వస్తుందనుకునేసరికి వర్షాలు విపరీతంగా కురిసేస్తాయి. వరదలు పంటనంతా నాశనము చేసాయంటాడు. చేతికి రాబోయే పంటంతా, అదిగో నీళ్ళపాలై పోయింది అంటాడు. దీనికి గతంలో సంభవించిన ఎన్నెన్నో ఉదాహరణలున్నాయి. నీలం తుఫాన్ మీకు తెలిసిందే. దానికి ప్రభుత్వం కూడా రైతులకు నష్టపరిహారం ఇవ్వాలనుకుంది. ఎందుకంటే నీలం తుఫాన్వల్ల ఎంతోమంది రైతులు నష్టపోయారు. ఇదంతా ఎవరి వల్ల జరిగింది అనుకుంటున్నారా? తొలకరి వర్షము, కడవరి వర్షము, వాటి వాటి కాలమున అవి ఎందుకు కురవడం లేదో తెలుసా! మనిషి యొక్క దోషము వాటి క్రమమును తప్పించింది. ఇలాంటి జ్ఞానము ఎక్కడుంది? పాఠ్య పుస్తకాలలో లేదు. 1వ తరగతి పాఠ్యపుస్తకం నుండి 10వ తరగతి పాఠ్యపుస్తకం వరకు లేక అగ్రికల్చరల్ డిపార్ట్మెంట్, పంటలను గూర్చి, వర్షాలను గూర్చి అధ్యయనం చేసే శాస్త్రం లేక శాస్త్రవేత్తల బృందం, వీరెవ్వరూ ఈ మాటలను చెప్పలేరు. తొలకరి వర్షము, కడవరి వర్షము వాటి వాటి కాలములలో, అనగా వర్షాకాలంలో వర్షాలు, ఎండాకాలంలో ఎండలు, శీతాకాలంలో చలి

ఇవన్నీ వాటి వాటి కాలముల ప్రకారము రావాలి అంటే, దేవుడు రప్పించాలి. దేవుని మాటలు మీరు వినాలని మీకు ఎవ్వరూ చెప్పరు. ఎందుకంటే వారి దగ్గర దేవుని జ్ఞానము లేదు. కేవలం ప్రళయం వచ్చిన తర్వాత నష్టాన్ని అంచనావేస్తారు. నష్టపోయిన తర్వాత పరిహారం ఇవ్వాలి అనుకుంటారు తప్ప, ఇది ఎందుకు జరిగిందో, దీనికి కారణమేమిటో దేవుని వాక్యము తప్ప ఎవ్వరూ వివరించలేరు. అందుకే **యిర్మియా 5:25** లో చెబుతున్నాడు. "మీ దోషములు వాటి క్రమమును తప్పించెను. మీకు మేలు కలుగకుండుటకు మీ పాపములే కారణము". ఏమిటా పాపము? మనిషి దేవునిని విడిచిపెట్టి ఈ భూమి మీదనున్న ప్రకృతి సంబంధమైన ఆహారము వెంట పడటం, అదే నా బ్రతుకు అనుకోవడం, ఇదే మనిషి చేస్తున్న దోషం.

ఒక ధనవంతుడున్నాడు. యేసుక్రీస్తు వారు ఆ ధనవంతుని గూర్చి చెబుతున్నారు. ఊదారంగు బట్టలు, సన్నని నార వస్త్రములు, విస్తారమైన ఆస్తిని కలిగినవాడు. ధనవంతుడు తన మనసులో ఏమనుకుంటాడు? నా ధనమే నా దేవుడు అనుకుంటాడు. ఈ ధనము ఉన్నది గనుక నేను దేవుని నమ్ముకోనక్కరలేదు అనుకుంటాడు. దేవుని కొరకు బ్రతకనక్కరలేదు అనుకుంటాడు. తిండి తనకు దేవుడనుకుంటాడు. పానము తనకు దేవుడనుకుంటాడు. పనివారు తనకు దేవుడనుకుంటాడు. అధికారము తనకు దేవుడనుకుంటాడు. అసలుసిసలైన పరలోకమందున్న తండ్రిని పట్టించుకోడు. ఆ ధనవంతుని గూర్చి యేసు చెప్పిన మాటలు **లూకా 16 : 19–** లో ఈ విధముగా వ్రాయబడ్డాయి. "ధనవంతుడు ఒకడు ఉండెను. అతడు ఊదారంగు బట్టలు, సన్నని నార వస్త్రములు ధరించుకొని, ప్రతిదినము బహుగా సుఖపడుచుండువాడు". అదే కాలములో ఒక దరిద్రుడు కూడా ఉన్నాడు. అతడు కురుపులతో నిండినవాడై ధనవంతుని ఇంటి వాకిటపడియుండి, అతని బల్ల మీదనుండి పడు రొట్టె ముక్కలతో ఆకలి తీర్చుకొనగోరాడు". ఆకలి నిమిత్తం అంతవరకే ఆ దరిద్రుడు ఆలోచించాడు. మిగిలిన సమయమంతా దేవుని కొరకు ఆలోచించాడు. "అంతేగాక కుక్కలు వచ్చి వాని కురుపులు నాకెను. ఆ దరిద్రుడు చనిపోయి, దేవదూతల చేత అబ్రహాము రొమ్మున ఆనుకొనుటకు కొనిపోబడెను. ధనవంతుడు కూడా చనిపోయి పాతిపెట్టబడెను". తన బ్రతుకు కాలమంతా ధనము కొరకు, విస్తారమైన ఆస్తి సంపదల కొరకు, తిండి కొరకు, పానము కొరకు, ఇవే నాకు బ్రతుకు పరమార్థమని అనుకున్న ఈ ధనవంతుడు కూడా చనిపోయాడు, పాతిపెట్టబడ్డాడు. అలా పాతపెట్టబడిన తర్వాత ఏమి జరిగిందో చూడండి. అప్పుడతడు పాతాళములో బాధపడుచూ, కన్నులెత్తి దూరము నుండి అబ్రహామును, నీతిమంతులందరినీ చూస్తున్నాడు. అతడు వేదనకరమైన స్థలములోనికి ఎందుకు వెళ్ళిపోయాడు. భూమి మీద ఏ నేరం చేసినందుకు అతడు పాతాళలోనికి వెళ్ళి బాధపడుతున్నాడు? ధనవంతునిగా ఉండి సుఖపడటమే నేరమా? ఈ భూమి మీద తన బ్రతుకు కాలములో దేవుణ్ణి కాక, అన్నిటినీ కోరుకోవడమే అతడు చేసిన నేరమా? అవును. అదే అతడు చేసిన నేరం. అందుకే అబ్రహాము ఆ ధనవంతుడు చేసిన నేరాన్ని చెబుతున్నాడు చూడండి. **(25వ వచనం)** "అందుకు అబ్రహాము – కుమారుడా, నీవు నీ జీవితకాలమందు నీకు ఇష్టమొచ్చినట్టుగా సుఖమనుభవించావు. దేవుని కూడా నీవు ఎందుకు నమ్ముకున్నావో తెలుసా? తిండి కొరకు, పానము కొరకు, బంగారము కొరకు, ఆరోగ్యము కొరకు, ఉద్యోగము కొరకు, ప్రమోషన్ కొరకు, పెళ్ళి కొరకు వీటన్నింటి కొరకు దేవుని నమ్ముకున్నావు. భ్రష్టుడా, నాకు పరలోకము ఇవ్వు తండ్రీ అని ఏనాడూ దేవుని ప్రార్థించలేదు. అందుకే నీవు ఇప్పుడు పాతాళానికి వెళ్ళిపోయావు. నీ జీవితకాలములో ఒక్కసారైనా, తండ్రీ నాకు పరలోకమే కావాలి, అందుకు నేను నిన్ను నమ్ముతున్నాను అని ప్రార్థించావా? భూమి మీద ఉన్నవారందరూ దేవుని ఎందుకు నమ్ముతున్నారు? నాకు అది కావాలి, నాకిది కావాలని లోకసంబంధమైన వాటి కోసమే దేవుని నమ్ముతున్నారు. కానీ, నేనైతే నిన్ను నిత్యజీవం కోసం నమ్ముతున్నాను అని ఎప్పుడైనా అన్నావా? అందుకే నీవు ఇప్పుడు ఎక్కడున్నావో తెలుసా? పాతాళములో బాధపడుతున్నావు. ఎవడో ఒకడు జీవజలమని పేరు వేసి, శాంపిల్ సీసా నీకివ్వగానే నువ్వు ఏమనుకున్నావు? ఇదే అసలైన జీవజలమనుకుని భద్రంగా ఇంటికి తీసుకెళ్ళి, ఆ నీటిని అమాంతం మింగేసి, నేను పరలోకానికి వెళ్ళిపోతాను అనుకున్నావు, కాదు కాదు. ఎప్పుడైనా బైబిల్‌ను దేవుని ఆలోచనతో చదివావా? **యోహాను సువార్త 4** వ అధ్యాయంలో సమరయ స్త్రీతో జీవజలము అంటే యేసు ఏమని చెప్పాడో ఎవరికైనా తెలుసా? నీ జీవిత కాలమందు భూమి మీద నీవు దేనికొరకైతే

బ్రతకాలో, దానికొరకు నీవు పట్టించుకోలేదు. ధనవంతుడివయ్యావు. మంచి సన్నని నారవస్త్రములు ధరించుకున్నావు. నాబ్రతుకుకిక ఢోకా లేదనుకున్నావు. ప్రతిరోజూ తిండిని కలిగియున్నావు. సంపదతో తులతూగావు కానీ పరలోకమందున్న నీ తండ్రిని నీవు పట్టించుకోలేదు. నీ దేవుని కొరకు నీవు ఆలోచించలేదు. ఏ దేవుని మాటైతే మనిషిని బ్రతికిస్తుందో, ఏ దేవుని మాటైతే సర్వశరీరమునకు ఆరోగ్యమును కలుగజేస్తుందో, ఏ దేవుని మాటైతే నీకు జీవజలముగా నీలో ఊరెడి నీటిబుగ్గగా ఉంటుందో, ఆ దేవుని మాటను నీవు పట్టించుకోలేదు. అందువలన నీవు నిత్య నరకాగ్నిలోనికి వెళ్ళిపోవడానికి సిద్ధంగా ఉన్నావు. పాతాళలోకములో వేదనను అనుభవిస్తున్నావు అన్నాడు.

**యెహెజ్కేలు 2 : 8–** లో "నరపుత్రుడా, వారు తిరుగుబాటు చేసినట్లు నీవు చేయక నేను నీతో చెప్పు మాటను విని, నోరు తెరచి, నేనిచ్చు దానిని భుజించు అనెను". మనుష్యులు తిరుగుబాటు చేస్తున్నారు, ఎలా? దేవుని మాటలను ప్రకృతి సంబంధమైన వాటి కొరకు వినియోగించుకుంటున్నారు. దేవుని మాటలు భుజించేవారు ఎవరూ లేరు. ఆ మాట కొరకు ఆలోచించేవారు ఎవ్వరూ లేరు. ఆ మాట కొరకు బ్రతికేవారు ఎవ్వరూ లేరు. ఇది ఎప్పటి పరిస్థితి? పాతనిబంధన కాలము నుంచీ ఉన్న పరిస్థితి. ఇదిగో, ఇప్పటివరకూ కొనసాగుతున్నది. నరపుత్రుడా, నీవు ప్రజలందరూ ఉన్నట్టుగా ఉండకూడదు. "నరపుత్రుడా వారు తిరుగుబాటు చేసినట్టు నీవు చేయక, నేను నీతో చెప్పు మాటను విని, నోరు తెరచి, నేనిచ్చు దానిని భుజించుమనెను. నేను చూచుచుండగా గ్రంథములు పట్టుకున్న ఒక చేయి నా యొద్ద చాపబడెను". ఈ ప్రవక్త, నా యొద్దకు ఒక గ్రంథము వచ్చిందంటున్నాడు. గ్రంథము అనగానే దేవుని మాటలు, దేవుని యొక్క జ్ఞానము. ఆ గ్రంథము యెహెజ్కేలు దగ్గరకు రాగానే, ఏమి జరిగిందో చూడండి. "ఆయన దానిని నా ముందర విప్పగా అది లోపటను, వెలుపటను వ్రాయబడినదై యుండెను. మహా విలాపమును, మనోదుఃఖమును, రోదనమును అని అందులో వ్రాయబడియుండెను". దేవుని జ్ఞానము రాగానే దీనిని అడ్డుపెట్టుకుని నేనేదో ఒక రూపాయి సంపాదించుకోవాలి అని అనుకోకూడదు. దీనిని నేను ఆసరాగా చేసుకుని, నా బ్రతుకు కాలములో నేను కొంత సుఖాన్ని అనుభవించాలని అనుకోకూడదు. ఈ బ్రతుకెంత చెప్పండి? చాలా చిన్నది. మహా అయితే 60 లేక 70 యేళ్ళు. ఒకవేళ అధికముగా బలముంటే 80 యేళ్ళు. మరి నీ ఆయుష్కాలము తీరిపోయిన తరువాత ఈ తిండి నిన్ను పరలోకానికి చేరుస్తుందా? లేక ఈ అధికారము మిమ్మల్ని పరలోకమునకు చేరుస్తుందా? లేక మనము నమ్ముకున్న ప్రకృతి సంబంధమైన ఏ పదార్థమైనా మనకు నిత్యజీవాన్ని ఇస్తుందా? ఇవ్వదు. దేవుని వాక్యమునకు తప్ప, దేనికీ ఆ శక్తి లేదు. అందుకే యెహెజ్కేలుతో దేవుడిలా అంటున్నాడు. నరపుత్రుడా, ఈ ప్రజలు తిరుగుబాటు చేసినట్లుగా నీవు చేయవద్దు. నేనిచ్చిన వాక్యమును నీవు స్వీకరించు. నీ కడుపారా దానిని తిను అన్నాడంటే, నీవు దాని ప్రకారం బ్రతకాలని అర్థం. అందుకేనండీ యేసుక్రీస్తు కూడా భూమి మీదకు వచ్చిన తరువాత, శిష్యులు ఆహారాన్ని తీసుకుని వస్తామన్నా, వద్దు అంటున్నాడు. మీకు తెలియని ఆహారము నా దగ్గరుంది అంటున్నాడు. ఇప్పటివరకూ ఈ క్షయమైన ఆహారము కోసమే అందరూ ఆలోచిస్తున్నారు. శిష్యులారా, మీ మనసు మార్చుకోవాలి. క్షయమైన దానికోసం కాదు, అక్షయమైన ఆహారము కొరకు మనము బ్రతకాలి. కనుక దేవుని వాక్యాన్ని మనము నెరవేర్చాలి. దేవుని పనిని తుదముట్టించాలి. అప్పుడు అది నిజముగా మన కడుపును నింపుతుంది. అది శాశ్వతమైన ఆహారము. మనకు మంచిని చేసే ఆహారము. అందుకే రూకలిచ్చి మీరు కొనుక్కోవలసిన ఆహారమేమిటో తెలుసా? దేవుని జ్ఞానమే! అందుకే, నీ సంపాదనంతా ఇచ్చి జ్ఞానమును కొనుక్కో అని సామెతల గ్రంథములో వ్రాయించాడు. దేవుని జ్ఞానాన్ని అడ్డుపెట్టుకుని సంపాదించుకోమని దేవుడు ఎక్కడా అనలేదు.

**సామెతలు 4 : 7** "జ్ఞానమును సంపాదించుకొనుటయే జ్ఞానమునకు ముఖ్యాంశము. నీ సంపాదన అంతా ఇచ్చి బుద్ధి సంపాదించుకొనుము". జ్ఞానాన్ని సంపాదించమంటే, దేవుని మాటను సంపాదించు అని అర్థము. దేవుని యొక్క నాలెడ్జ్ అది. దేవుని జ్ఞానాన్ని సంపాదించమని ఎందుకు చెబుతున్నాడంటే, "దానిని గొప్ప చేసిన యెడల అది నిన్ను హెచ్చించును". అది నిన్ను పరలోకానికి తీసుకుని వెళుతుంది. పరలోకానికి మార్గమది. నిన్ను నిత్యజీవానికి తీసుకుని వెళ్ళడానికి అదే నీయొద్ద ఉండాలి. అవునండి, మీరు అమెరికా వెళ్ళాలన్నా, లండన్ వెళ్ళాలన్నా, ఆస్ట్రేలియా వెళ్ళాలన్నా, ఫ్లైట్ మీద మీరు వెళ్ళాలి. అంటే ఫ్లైట్‌లో మీకు ఆ ప్రయాణానికి సంబంధించిన టోకెన్ మీ

దగ్గరుండాలి. ఆ టోకెన్ ఎలా దొరుకుతుంది? మీరు ధనాన్ని చెల్లిస్తే దొరుకుతుంది. అక్కరలేదండి. ఏదైనా ధనమే కదా. టోకెన్ కొనుక్కోడానికి అయినా ధనమే కావాలి కదా అని డబ్బు పట్టుకుని మీరు ఫ్లైట్‌లోకి వెళ్ళిపోయారనుకోండి. వెంటనే మిమ్మల్ని అక్కడనుండి తోసేస్తారు. ఎందుకంటే, ఫ్లైట్‌లో కావాల్సింది బోర్డింగ్ పాస్ తప్ప డబ్బు కాదు. అవును ఈ టిక్కెట్టును డబ్బుతోనే కొనుక్కోవాలి కానీ, అదే డబ్బును ఫ్లైట్‌లోనికి పట్టుకుని వెళితే కుదరదు. అలాగే ట్రైన్‌లో మీరు ప్రయాణం చేస్తారు. ట్రైన్ టిక్కెట్ ఎందుకులే! టిక్కెట్ కూడా డబ్బుతోనే కొనుక్కోవాలి కదా. టిక్కెట్ కండక్టరు వచ్చిన తరువాత, అతడు చెక్ చేస్తే, ఆ టిక్కెట్టుకు సరిపడా డబ్బు ఇచ్చేద్దామనుకుని లోపలికి వెళ్ళారనుకోండి. అప్పుడు మీకు ఫైన్ వేస్తాడు. ఇక్కడైతే ఫైన్ అయినా వేస్తాడు. పరలోకానికి అయితే ఈ ధనము మిమ్మల్ని అసలు చేర్చనే చేర్చదు. కానీ ఈ ధనము చేత మీరు చేయగలిగింది ఒకటి వుంది. మీరు జ్ఞానమును కొనుక్కోవాలి, జ్ఞానమును మీరు సంపాదించుకోవాలి. భూమి మీద ఉన్న ఈ బ్రతుకులో మీకు అతి ముఖ్యమైనది ఏమిటో తెలుసా! దేవుని జ్ఞానము, దేవుని బుద్ధి, దేవుని మాట! అందుకే, మీ సంపాదన అంతా ఇచ్చి జ్ఞానమును, బుద్ధిని, తెలివిని, దేవునియొక్క మహోన్నతమై విద్యను మీరు కొనుక్కోవాలి, సంపాదించుకోవాలి అన్నాడు. అదే మిమ్మును పరలోకానికి చేరుస్తుంది. కానీ, ఈ రోజు మనిషి ఏమనుకుంటున్నాడు? ఈ బైబిల్‌ను, దేవుణ్ణి, ప్రార్ధనను అడ్డుపెట్టుకుని ఏవేవో భూమి మీద, అతి సామాన్యమైనవి, చులకనివి, ఈ రోజు తింటే రేపటికి అరిగిపోయేవి, అయిపోయేవి, ఈ రోజు అనుభవిస్తే రేపటికి కనిపించని వాటినే కోరుకుంటున్నాడు. దేవుని జ్ఞానమును మాత్రము కానేకాదు. దేవుని మీరు నమ్మవలసింది వాటి కొరకు కాదు. అందుకే ప్రారంభము నుండి చివరి వరకు బైబిలులో దేవుని ఘోషను అర్ధం చేసుకోండి. మీరు దేవుని కొరకు ఆలోచన చేయాలి. దేవుని మాటలు మీరు వినాలి. దేవుని మాటలనే మీరు భుజించాలి. దేవుని వాక్యము మిమ్మల్ని బ్రతికిస్తుంది తప్ప, రొట్టె కాదు. ఇదే నా మాటలయొక్క ముఖ్యోద్దేశము. సాత్వికముతో స్వీకరించండి! మీ బ్రతుకును దేవునికి అనుకూలముగా మార్చి, నిత్యరాజ్య వారసులవ్వండి!!

ప్రభువునందు నమ్మకస్థుడు,

**జె. మణి కుమార్**

సన్ ఆఫ్ గాడ్ - క్రైస్ట్ చర్చ్ - సామర్లకోట - 8978414178.

## ప్రశ్నలు

1. దేవుని జ్ఞానమును ఎలా సంపాదించుకోవాలి?
2. నిజమైన జీవజలమును గూర్చి తెలియజేయండి.
3. దేవుని మాట మనిషిని బ్రతికిస్తుందా? వివరించండి.
4. దేవునిమాటలు మనకు దొరికినప్పుడు మనము ఏమి చేయాలి?
5. యేసుక్రీస్తు తన ఆకలిని ఎలా తీర్చుకుంటున్నాడు? వివరించండి.
6. ఆహారము కానిదాని కొరకు మనిషి ఎలా ప్రయాసపడుతున్నాడో వివరించండి.
7. భూమిమీద ప్రతిమనిషికీ కనీసపు అవసరతలు ఏమిటి? వాటికొరకే దేవుని నమ్ముకోవచ్చా? వివరించండి.

## 7. ఆశీర్వాదానికి అర్హులెవరు?

ప్రియమైన సోదర సోదరీమణులారా!

సహజంగా భూమిమీద ఏ భక్తుడైనా దేవుని దగ్గరకు వస్తే, తాను ఒక కోరిక నిమిత్తమే వస్తాడు. గుడికి వెళ్ళినా, చర్చ్‌కు వెళ్లినా, గురుద్వార్‌కు వెళ్ళినా, ఇంకెక్కడికి వెళ్ళినా తమకున్న కోరికలను దేవునికి విన్నవించడానికే వెళతారు. ఎక్కడైనా ఒక భక్తుని గూర్చి ఆలోచించినప్పుడు, దేవునికి భక్తునికి ఉన్న సంబంధము ఏమిటా అని తరచి చూచినప్పుడు, భక్తుడు కోరికతో వస్తున్నాడు. దేవుని నుండి దీవెనలు పొందడానికి వేచి చూస్తున్నాడనేది జగమెరిగిన సత్యం. ఇందుకే చాలామంది దూరప్రయాణాలు చేస్తూ, దేవుని దగ్గరకు యాత్రల పేరిట వెళుతూ వారికున్న కోరికలన్నింటిని అక్కడున్న దేవునికి చెప్పి, ఎంతోకొంత దేవునికి మ్రొక్కుకుని తిరిగి రావడం మనము చూస్తున్నాము. అంటే భక్తుడు దేవుని జ్ఞాపకము చేసుకున్నప్పుడు ఒక కోరికతో ఉంటాడు. అతడు తీరని ఆవేదనతో ఉంటాడనేది నిజం. ఈ రోజు అదే అంశమును గూర్చి మీరు చదువబోవుచున్నారు. బహుశా మీ అందరికి అటువంటి కోరికలు ఉండి ఉండవచ్చు. మీ జీవితంలో మీరు దేవుని నుండి పొందడానికి ఎంతోకాలముగా ఎదురుచూస్తూ, సిద్ధముగా ఉన్నటువంటి కొన్ని కోరికలు కొన్ని మీకు ఉండవచ్చు. దేవుని యొక్క ఆశీర్వాదానికి మేము కూడా పాత్రులమవ్వాలని మీలో చాలామంది కోరుకుని ఉండవచ్చు. అవును! కనుక ఇది మీరు ఖచ్చితముగా నేర్చుకొనవలసిన విషయము, మీకు ముఖ్యముగా కావలసిన అంశము. భూమిపై నివశిస్తున్న మనుష్యులందరికీ ఆశీర్వాదమే కావాలి. ఎవరూ శాపాన్ని కోరుకోరు. ఒక వ్యక్తినుండి గాని, ఒక ప్రభుత్వము నుండి గాని, చివరకు దేవుని నుండి కూడా ఎవరూ శాపాన్ని కోరుకోరు. అందరూ మనకు ఆశీర్వాదమే ఇవ్వాలి. మనకందరూ తమ శుభాకాంక్షలు తెలియజేయాలి. మనకు తమ దీవెనలే ఇవ్వాలి. వారు మనయెడల మంచి చూపును కలిగియుండాలని మనము కోరకుంటాము. ప్రియులారా! ఆశీర్వాదము అందరికి అవసరమైనప్పుడు, దీవెనలు అందరూ కోరుకున్నప్పుడు, దేవుని నుండి ప్రతి ఒక్కరూ దానిని ఆశిస్తున్నప్పుడు, అందరూ ఎందుకు ఆశీర్వాదములు పొందలేకపోవుచున్నారు? అందరూ దీవెనలు ఎందుకు పొందలేకపోవుచున్నారు? అందరికి ఎందుకు దేవునియొక్క ఈవులు అందడం లేదనేది మనము ఆలోచించగలిగితే, అందరి దగ్గర ఈ విషయానికి సంబంధించిన జ్ఞానము లేదు. ఏదో దేవుని దగ్గరకు వెళ్ళడం, దేవునికి మ్రొక్కుకోవడం, దేవుని అదేపనిగా కోరికలు కోరుకోవడం, తిరిగి వచ్చేయడం... దీనివల్ల దేవుడు మనలను ఆశీర్వదిస్తాడు, దేవుడు మనలను దీవిస్తాడు అనుకోవడం పొరపాటు. అందరూ ఆశీర్వాదాలనే కోరుకుంటున్నప్పుడు, ఎవరికీ శాపము గాని అశుభం గాని వద్దు అనుకున్నప్పుడు, అందరికి దేవుడు దీవెనలే ఇవ్వాలిగా. అందరికీ దేవుడు ఆశీర్వాదాలే ఇవ్వాలిగా!

ఈ రోజు ఎందరో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అప్పులు తీరక కొంతమంది, ఎన్నో వేదనలు అనుభవిస్తూ ఈ జీవితాన్ని అర్థాంతరంగా ముగిస్తున్నారు. వారి జీవితాలలో కష్టాలను వారు భరించలేక, పేదరికంతో ఒక పూటే తింటున్నారు. కొంతమంది జీవితంలో సుఖమనేదే ఎరుగక ప్రతిరోజు కన్నీటితోనే గడుపుతున్నారు. దీని వెనుక పరమార్థం ఏమిటి? వీరు మాత్రం వారు నమ్మిన దేవుని నుండి ఆశీర్వాదాలు కోరుకోలేదా? వీరు మాత్రం దేవుని దీవెనలు కోరుకోలేదా? అంటే దీనినిబట్టి, కోరుకున్న ప్రతి ఒక్కరికి ఆశీర్వాదము వారి చెంతకు రాదని అర్థం చేసుకోవాలి! కేవలం మ్రొక్కుకున్నంత మాత్రాన పరలోకము నుండి దేవుడు దీవెనలను ధారావాహికముగా పంపించడు అనేది మనము మొట్టమొదట తెలుసుకోవలసిన సంగతి. అందరూ ఆశీర్వాదాన్ని ఆశించినా, అందరూ దీవెనలు కోరుకున్నా చాలా తక్కువమంది మాత్రమే ఈ భూమిమీద సుఖముగా బ్రతుకుతున్నారు. కొద్దిమంది మాత్రమే సంతోషంగా జీవిస్తున్నారు. కాని మిగిలిన వారిలో చాలా శాతం మంది మనుష్యులు ఆ దేవుని ఆశీర్వాదానికి పాత్రులు కాకుండానే, చనిపోయి మట్టిలో కలిసిపోతున్నారు. వారు కోరుకోవటంలో ఏమాత్రం తేడా లేదు. ప్రతి ఒక్కరు దేవుని అడుగుతున్నారు, ప్రతి ఒక్కరు దేవునికి ప్రార్థిస్తున్నారు, ప్రతి ఒక్కరు దేవునికి పూజలు చేస్తున్నారు. అయినా చాలామంది ఆశీర్వాదమును పొందలేకపోవుచున్నారు. చాలా మందికి దైవానుగ్రహము దొరకడం లేదు. దానికి కారణం ఏమిటో మీరు జాగ్రత్తగా తెలుసుకోవాలి. అసలు ఆశీర్వాదానికి అర్హులు ఎవరు? అసలు ఆశీర్వాదానికి

గల అర్హత ఏమిటి? ఎవరైనా దేవుని ఆశీర్వాదము పొందాలంటే వారికి ఒక ప్రత్యేకమైన అర్హత ఉండాలి! ఇది బైబిలు చెప్పిన ఒక మహాజ్ఞానపు సంగతి. ఇది తెలియక ఈ రోజు చాలామంది మనుష్యులు అయోమయపు స్థితిలో ఎంత ఖర్చుకైనా వెనుకాడడంలేదు. అప్పుడప్పుడు మీరు టి.వి. లో కొన్ని కొన్ని కార్యక్రమాలను ప్రకటనల రూపములో చూసి ఉండాలి. మీరు కష్టాలలో ఉన్నారా? మీరు వేదనలో ఉన్నారా? మీ బ్రతుకంతా ఇబ్బందులతో ఉందా? కనుక వెంటనే మీరు ఫలానా రంగు ఉంగరాన్ని ధరించండి. మీకు కష్టాలు దూరమైపోతాయి అంటాడు ఒకడు. మీ జాతకాన్ని వెంటనే ఫోన్‌లో చెప్పండి. మీ కష్టాలను పోగొట్టే మార్గమును చెబుతాను అంటాడు మరొకడు. మీరు చదువులో ఫెయిల్ అవుతున్నారా? మీకు ఉద్యోగం రావడం లేదా? మీకు పెళ్ళి సంబంధం కుదరడం లేదా? మీరు అనారోగ్యంతో బాధపడుతున్నారా?... ఇలా టి.వి. లో ప్రత్యక్షమవుతున్న ఎందరినో మనము చూస్తున్నాము. ఒక పురుషుడు, ఒక స్త్రీ టి.వి. స్క్రీన్ ముందు కూర్చుని మనముందు ఈ ప్రశ్నలన్నీ అడుగుతూ, వెంటనే ఫోన్ నెంబర్ చెబుతూ మీరు కష్టాలలో ఉన్నట్లు అయితే, మీకు ఇంకా దేవుని ఆశీర్వాదం దొరకకపోతే, దేవుని దగ్గరనుండి దీవెనలు ఇంకా అందకపోతే, ఒక ఫోన్ కొట్టండి, దీవెనలు పట్టండి! అనే మాటలను మనము వింటున్నాము. అంటే ఈ దేవుని ఆశీర్వాదాలకు, దేవుని దగ్గర నుండి వచ్చే దీవెనలకు మంచి గిరాకి ఉంది. అందుకే దీనిని చాలామంది క్యాష్ చేసుకుంటున్నారు. చాలా మంది దీనిని అడ్డుపెట్టుకుని, మనుష్యులయొక్క అజ్ఞానమును ఆసరాగా తీసుకుని అక్రమముగా డబ్బు చేసుకుంటున్నారు. ఇంతకీ వారికి వచ్చేది ఎంత అంటే, ఒక ఉంగరం అమ్మితే రూ. 2,000/లు, ఒక బొమ్మ అమ్మితే రూ. 4,000/–, ఒక యంత్రం అమ్మితే రూ. 5,000/– కదండి. అలాగని అందరు సులువుగా వలలో పడరు కదా! అలాంటప్పుడు ఇంత చిన్న మొత్తముతో వారికి ఎంత లాభం వస్తుందని మీరు అనుకుంటున్నారా? అయితే మీకు ఒక నిజం చెప్పాలి! ఇలాంటి కార్యక్రమాన్ని టి.వి.లో అర్థగంటసేపు ప్రసారం చేయడానికి, వారు 'మా' టి.వి.కి గాని, 'జెమిని' టి.వి.కి గాని చెల్లించే పైకము ఎంతో చెప్పమంటారా? వారు అక్షరాలా రూ. 1,50,000/– రూపాయలు నుండి రూ. 2 లక్షల పైమాటే ! ఒక అర్థగంట కార్యక్రమాన్ని ప్రైమ్ ఛానల్ మరియు ప్రజల దగ్గర పేరెన్నికగన్నటువంటి ఛానల్స్‌లో ప్రసారం చెయ్యడానికి వారు టి.వి. వారికి చెల్లించవలసిన పైకము సుమారు 2 లక్షల రూపాయలండి. అంటే దీనిని బట్టి వారు ఎంత పొందుతున్నారో మీరు అర్థం చేసుకోవాలి. వారు చెప్పే యంత్రము ధర 4,000 రూ॥, వారు చెప్పే ఒక రాయి (రంగు రాళ్ళు) ధర 2,000 రూ॥ కదా! వారికి చాలా తక్కువ లాభము వస్తుందేమో, వారేమీ ప్రజలను మోసపరచటం లేదని అనుకుంటున్నారా? ఇలా అనుకునే చాలామంది పిచ్చివాళ్ళు ఈ రోజు సమాజంలో ఉన్నారు. ఆశీర్వాదమును పొందడానికి అర్హత ఏమిటో జ్ఞానము దగ్గరకు వచ్చి తెలుసుకోలేక, చిన్న చిన్న కార్యక్రమాల దగ్గరకు వెళ్ళి ఉంగరం పెట్టుకుంటే వారికి ఆశీర్వాదము వస్తుందా? ఒక యంత్రము నా జేబులో పెట్టుకుంటే నాకు ఆశీర్వాదము వస్తుందా? నా పేరు మార్చుకుంటే నాకు ఆశీర్వాదము వస్తుందా? వాస్తు సరిగా లేదని గోడ పడగొట్టుకుంటే నాకు ఆశీర్వాదము వస్తుందా? నా ఇంటి నమూనా మార్చుకుంటే నాకు ఆశీర్వాదము వస్తుందా? అని అమాయకులంతా ఆలోచిస్తున్నారు. ఏమిటండి ఈ పిచ్చి ప్రయత్నాలు? దేవుని జ్ఞానము ఏమి చెప్పిందో మనిషికి అర్థం కాలేదు. మనిషి అసలైన జ్ఞానము దగ్గరకు రాలేదు సరికదా, ప్రతి అడ్డమైన వాని దగ్గరకు వెళ్ళాడు. అందుకే వారందరూ టి.వి. స్క్రీన్‌లో మనకు కనబడుతున్నారు. వారందరూ మోసము చెయ్యడం లేదంటారా? ఖచ్చితంగా మోసమే చేస్తున్నారు. నిజంగా డబ్బు సంపాదించే యంత్రమే వారి దగ్గర ఉంటే, ఆ యంత్రాన్ని వారి దగ్గరే ఉంచుకోవచ్చు కదా? లక్షల రూపాయలను వారే సంపాదించవచ్చు కదా? ఛానల్ వారికి ముందుగా పైకమును చెల్లించి, ప్రేక్షకులందరిని ఫోన్ చేయమని ఎందుకు అడుగుతున్నారు? ఇదేమైనా ప్రజాసేవా? కానే కాదు. దైవాశీర్వాదముల పేరిట ప్రజలను మోసగించే ఒక భయంకరమైన కార్యక్రమమిది. ప్రియమైన పాఠకులారా! ఈ మాటలు వింటున్న మీరైనా అటువంటి ప్రమాదంలో పడప్పుకూడదని, ఇదిగో ఆశీర్వాదానికి అర్హులెవరనే పాఠమును మీ ముందు ఉంచుతున్నాను. మీ దగ్గర ఉంగరాలు అమ్ముకోవడానికి కాదు. మీ దగ్గర యంత్రాలు అమ్ముకోవడానికి కాదు. బాగా ఆలోచించండి. కేవలం దేవుడు వ్రాయించిన పుస్తకములోని సంగతులను సందర్భసహితముగా మీకు నేర్పించి, మీ జీవితములో మీరు తప్పకుండా తెలుసుకోవలసిన సంగతులను మీకు

బోధించి, మీ మనసు రూపాంతరము పొందేటట్లుగా దేవుని యొక్క జ్ఞాన సంగతులను మీకు తెలియపరచి మిమ్మునందరిని విజ్ఞానవంతులుగా మార్చడానికి ఈ పుస్తకమును వ్రాస్తున్నాను. ఆశీర్వాదానికి అర్హులెవరు? నాకూ ఆశీర్వాదము పొందాలని ఉంది, మీకూ ఆశీర్వాదము పొందాలని ఉంది. మీ కుటుంబములో, మీ బంధువులలో, మీ ప్రాంతాలలో అందరికీ ఆశీర్వాదమును పొందాలని ఉంది. మన ముఖ్యమంత్రిగారికి ఆశీర్వాదము కావాలి, ప్రధానమంత్రి గారికి ఆశీర్వాదము కావాలి. ఎవరికి వద్దో చెప్పండి? ఎవరికైనా శాపము కావాలా? ఎవరికైనా కీడు కావాలా? లేదు లేదు. ప్రతి ఒక్కరికి దీవెన కావాలి, దైవాశీర్వాదం కావాలి. అయితే అందరూ ఈ పాఠమును చదవాలి! దేవుడు ఆశీర్వాదమును గూర్చి వ్రాయించాడా? ఇప్పటి వరకు మేము కూడా విన్నాము. చాలాసార్లు మాకు దైవాశీర్వాదాలను గూర్చి మా గుళ్ళో చెప్పారండి, మా చర్చిలో చెప్పారండి అనుకుంటున్నారా? చర్చ్‌కి ప్రతీ ఆదివారం ఆశీర్వాదం ఇవ్వడానికి దేవుడు వస్తుంటాడు అని మీరు విని ఉంటారు. అది కూడా తప్పు! ఈ తప్పుడు బోధకు, టి.వి.లో యంత్రానికి పెద్దగా తేడా లేదు. ఆ బోధకు, ఉంగరపు బోధకు పెద్దగా తేడా లేదు. ఈ రోజు మీరు చదువుచున్న, నేర్చుకొనవలసిన అసలుసిసలైన ఈ బోధ ప్రపంచానికి చాలా అవసరం. ఆశీర్వాదమును ఎవరు పొందాలి అనుకున్నారో వారందరికి అత్యవసరం. ఈ విషయము మనకు కూడా బాగా అర్థం కావాలి. దీని లోతెంతో మనకు తెలియాలి. మనము నిజముగా దేవుని దీవెనలకు అర్హులు కావాలి. మీరు ఆశీర్వాదానికి అర్హులు అయితే, మీరు అడుగకముందే ఆశీర్వాదాలన్నీ మీ యొద్దకు వచ్చేస్తాయి.

నిజముగా మీరు ఆశీర్వాదానికి అర్హులయితే మీరు ఎవరినీ అడుగవలసిన అవసరత లేదు. ఎవరి దగ్గరకూ వెళ్ళవలసిన అవసరంలేదు. ఇల్లు పడగొట్టనవసరం లేదు. మీ గోడ దిశను మార్చవలసిన అవసరం లేదు. మీ శరీరానికి ఏదో ధరించవలసిన అవసరం లేదు. ఏదో తిండి మానెయ్యనవసరం లేదు. మీరు నిజంగా ఆశీర్వాదానికి అర్హులు అయితే, మీనుండి ఆశీర్వాదాన్ని, దేవుని దీవెనను ఎవ్వరూ ఆపలేరు. దానిని ఆపే తరం ఎవ్వరికీ లేదు. ఎందుకంటే, అది ఎక్కడనుండి వస్తుందనుకుంటున్నారు? అది పైనుండి అనగా దేవుని యొద్దనుండి వస్తుంది. దానిని ఎవరైనా ఆపగలరా? అది శాపమైనా ఎవరూ ఆపలేరు, ఆశీర్వాదమైనా ఎవరూ ఆపలేరు. అంటే మనము తెలుసుకోవలసింది ఒక్కటే! ఆశీర్వాదానికి అర్హత సంపాదించుకోవడం ఎలా? అంతే తప్ప, ఆశీర్వాదమును అడగడము ఎలా అని కాదు. ఆశీర్వాదము మీరు అడిగినంత మాత్రాన వచ్చేది కాదు. అలా అనుకుంటే ప్రపంచంలో వందల, కోట్లమంది ఏకధాటిగా నిరంతరాయంగా మాకు ఆశీర్వాదములు కావాలని దేవుని అడుగుతున్నారు. దేవుడు ఎవరి ప్రార్థన విన్నా అందరూ ఆశీర్వాదమే అడుగుతున్నారు. మరి ఎంతమందికి ఇస్తాడు? అందుకే ఎవరికి అర్హత ఉందా? అని చూస్తున్నాడు. నిజంగా ఎవరు అర్హుల్లో పరీక్షిస్తున్నాడు. అలాంటి వారికే తన ఆశీర్వాదమును ఇవ్వాలని అనుకుంటున్నాడు. పరీక్షలలో మనము చక్కగా సమాధానములు వ్రాసినప్పుడు, జవాబులను మనము నూటికి నూరుశాతము నింపినప్పుడు, మార్కులు ఇవ్వమని మనము మాస్టారును అడుక్కోవలసిన అవసరం లేదు. మనకే ఫస్ట్ వస్తుంది. పత్రికా మీడియావారు మీ ఇంటికొచ్చి, మీ ఫోటో ఒకటి కావాలి, పేపర్‌లో వెయ్యాలి అని అడుగుతారు. అంతేకాని మీకు ఫస్ట్‌మార్కు రావాలి అని ఎవరినీ అడుక్కోవలసిన అవసరం లేదు. ఒకవేళ అడుక్కున్నంత మాత్రాన ఇవ్వరు కదా! మీకు ఆ అర్హత అనేది వచ్చేస్తే ఖచ్చితముగా మీరే నెం.1, మీ దగ్గరకు ఆ సీటు రావాల్సిందే! దేవుని విషయంలో కూడా అంతే! దేవుని దగ్గర నుండి మనము ఆశీర్వాదమును పొందాలనుకుంటే అది అడిగితే వచ్చేది కాదు! అందరూ దేవుని అడుగుతున్నారు. కాని అడిగే వారికి అర్హత ఉండాలి. ఆశీర్వాదము పొందడానికి తప్పనిసరిగా అర్హత ఉండాలి! ఇప్పుడు మనము బైబిల్ దగ్గరకు వెళదాము. ఇప్పటి వరకు లోకము యొక్క తీరు ఎలా ఉందో కొన్ని సందర్భాల ద్వారా పరిశీలించాము. ఇప్పుడు ఆయన మాటలలోనికి వెళ్లగలిగితే, ఆయన పలికిన మాటలను మనము చదవగలిగితే, ఆ అర్హత ఎలా సంపాదించాలో మనందరికి అర్థమవుతుంది. చరిత్రలో ఒక గొప్ప వ్యక్తి ఉన్నాడు. ఆశీర్వాదము అనే ఈ అంశాన్ని ఆలోచించేముందు, ఆ వ్యక్తిని గూర్చి మనము తెలుసుకోవాలి. ఎందుకంటే అతను ఆశీర్వాదానికి మూలపురుషుడు, దీవెనలకు ప్రారంభీకుడు. భూమిమీద ఆశీర్వాదము ఎలా ఉంటుందో దేవుడు అతని ద్వారా చూపించాడు. ఆశీర్వాదానికి ఎవరు అర్హులు అవుతున్నారో, ఎవరికి దైవదీవెనలు కావాలో వారందరూ

అతనినే చూడాలి. అబ్రహాము జీవిత చరిత్రను బైబిల్‌లో పరిశీలించాలి. ఈ అబ్రహాము ఎంత గొప్పవాడంటే, దేవుడు అతని దగ్గరకు వెళ్ళి నీకు ఆశీర్వాదము వచ్చింది, నీకు ఆశీర్వాదమును ఇవ్వాలి అనుకుంటున్నాను అన్నాడు. నీవు ఆశీర్వాదముగా ఉంటావు, నీ పేరే మార్చేద్దాం అనుకుంటున్నాను, ఎందుకంటే నీవు ఆశీర్వాదానికి అర్హుడవు అన్నాడు! నీ పేరు అబ్రహాము కాదు, ఆశీర్వాదముగా మార్చేద్దాం అనుకుంటున్నాను. ఎందుకంటే నిన్ను చూడగానే ఆశీర్వాదాలు, దీవెనలు ఇవ్వాలని ఉంది. ఎందుకంటే నీవు ఆశీర్వాదానికి అర్హుడవు అంటున్నాడు దేవుడు. ఇప్పుడు ఆయన మాటలను, ఆయన జ్ఞానాన్ని పరిశీలిద్దాం. ఇది పాత నిబంధన కాలములో, చరిత్రలో జరిగిన ఒక యదార్థమైన సంగతి. ఇది కథ కాదు! సుమారు క్రీ.పూ. 3,000 సంవత్సరాల క్రితం జరిగిన సందర్భం. యెహోవా అబ్రహాముతో మాటలాడుచున్నాడు.

**ఆదికాండము 12 : 1, 2** యెహోవా – "నీవు లేచి నీ దేశమునుండియు నీ బంధువుల యొదుట నుండియు, నీ తండ్రి యింటినుండియు బయలుదేరి నేను నీకు చూపించు దేశమునకు వెళ్ళుము. నిన్ను గొప్ప జనముగా చేసి నిన్ను ఆశీర్వదించి నీ నామమును గొప్ప చేయుదును, నీవు ఆశీర్వాదముగా నుందువు". ఈ మాట అబ్రహాముకు దేవుడు చెప్పక మునుపు, ఒక సంవత్సరము కాలము పాటు అబ్రహాము ఆశీర్వాదము కొరకు దేవునికి దీర్ఘ ప్రార్థనలు చేసాడని ఎక్కడా లేదు. ప్రతీ శనివారము విశ్రాంతి దినముగా కాని లేదా వారములో ఏదో ఒక రోజు లేదా వారమంతా లేక అతని జీవిత కాలములో చాలా దినములు దేవుని అదే పనిగా ఆశీర్వాదము అడిగినట్లుగా బైబిల్‌లో ఎక్కడైనా ఉందేమో చూడండి. ఉండదు. కాని దేవుడు సరాసరి అబ్రహాము దగ్గరకు వచ్చి ఏమంటున్నాడో చూసారా? అబ్రహాము అడగకుండానే అబ్రహాముకు ఇచ్చేస్తున్నాడు. ఎందుకంటే అబ్రహాము ఆశీర్వాదానికి అర్హుడు. భూలోకమంతటికిని చూస్తే అందరూ ఆశీర్వాదముల కోసమే ప్రార్థనలు చేస్తున్నారు. కాని అబ్రహాము ఆశీర్వాదము పొందుటకు కావలిసిన అర్హత సంపాదించాడు. అందుకే దేవుడు వారందరి దగ్గరకు వెళ్ళకుండా, అబ్రహామునే ఎన్నుకొని, అబ్రహాము దగ్గరకే వెళ్ళాడు. ఎందుకో తెలుసా? అబ్రహాము చాలా గొప్పవాడు. దేవుడు అబ్రహాముతో – నీవు లేచి, నేను చూపించిన దేశమునకు వెళ్ళాలి. నీ తండ్రి ఇంటిని, నీవు పుట్టిన ఊరును వదిలి పెట్టాలి. నేను నీకు మంచి ఆఫర్ ఇస్తున్నాను. అది ప్రపంచంలో అందరూ కోరుకునేది అయినా వారికి దక్కనిది, నీవు కోరకొనకపోయినా నీకు దక్కినది. ఎందుకంటే నీవు మాత్రమే అర్హత సంపాదించావు అని చెప్పాడు. ఏమిటా అర్హత, ఏమి ఇస్తున్నాడు దేవుడు? ఇక చదవండి! నిన్ను గొప్ప జనముగా చేసెదను, నిన్ను ఆశీర్వదించి, నీ నామమును గొప్ప చేసెదను. నీవు ఆశీర్వాదముగా ఉండెదవు. దేవుని దగ్గర ఉన్న ఆశీర్వాదపు నిధినంతటిని ఎవరికి ఇచ్చేస్తున్నాడో చూడండి. అబ్రహామును ఆశీర్వాదముగా ఉందువు అన్నాడు. నిన్ను ఆశీర్వదించువారిని ఆశీర్వదిస్తాను అంటే భూమి మీదనున్న ఎవరైనా నిన్ను ఎదుర్కొని, నీ స్నేహము చేసి, నీకు సహకరించి, నీ మాటలు విన్న పక్షంలో ఏమంటున్నాడో చూడండి. నిన్ను ఆశీర్వదించువారిని ఆశీర్వదిస్తాను, నిన్ను దూషించువారిని శపించెదను. అబ్రహాము దగ్గరున్న ప్రధానమైన ఈ అర్హతను బట్టి, దేవుని ఆశీర్వాదపు నిధిని ఆయన దగ్గర పెడుతున్నాడు. అబ్రహామును దేవుడు భూలోకమందున్న జనులందరికి ఒక ఆశీర్వాదముగా ఉంచాడు. అబ్రహాము కోరుకోకుండానే దైవాశీర్వాదము అబ్రహాము దగ్గరకు వచ్చేసింది. **ఆదికాండము 12 : 3** "నిన్ను దూషించువాని శపించెదను. భూమియొక్క సమస్త వంశములు నీయందు ఆశీర్వదించబడును" అని దేవుడు అబ్రహాముతో చెప్పెను. భూమియొక్క సమస్త వంశములు అబ్రహాముయందు ఆశీర్వదించబడును. వారు ఇండియాలో ఉన్నవారైనా, ఆస్ట్రేలియాలో ఉన్నవారైనా, అమెరికాలో ఉన్నవారైనా, పాకిస్తాన్‌లో ఉన్నవారైనా, అంటార్కిటికాలో ఉన్నవారైనా, ఎవరైనా భూమిమీద ఉన్న సమస్త వంశములు ఆయనను బట్టి ఆశీర్వదించబడునని అబ్రహాముతో చెప్పబడింది. అంటే అబ్రహాముకి దేవుడు ఎంత గొప్ప ఆధిక్యతను ఇచ్చాడో చూడండి. దేవుడు అతనికి మాత్రమే కాక అతనితోపాటుగా, భూమిమీద ఎవరినైనా ఆశీర్వదించాలి అంటే అతని ద్వారా మాత్రమే ఆశీర్వదిస్తాను అంటున్నాడు. ఎవరినైనా ఆశీర్వదించాలి అంటే అబ్రహాము యొక్క అనుమతి కావాలి. అబ్రహాము కోరుకోవాలి, అబ్రహాము వారి తరపున ప్రార్థన చెయ్యాలి. అప్పుడు వారికి ఆశీర్వాదాన్ని ఇస్తాను. ఎందుకంటే అబ్రహామే దేవుని దృష్టిలో ఒక ఆశీర్వాదము.

**ఆదికాండము 12 : 4** "యెహోవా అతనితో చెప్పిన ప్రకారము అబ్రహాము వెళ్ళెను". ఇంతకీ తరువాత ఏమి జరిగింది? దేవుడు వచ్చిన తరువాత, దేవుడు అబ్రహాముతో మాటలాడ మొదలుపెట్టిన తరువాత, తన ఆశీర్వాదాన్ని ఎలా ప్రారంభించాడు? అనగానే, నీవు లేచి నేను చూపించు దేశమునకు వెళ్ళుము. నేను నిన్ను ఆశీర్వదిస్తాను, నిన్ను గొప్ప జనముగా చేస్తాను అని చెప్పాడు. దేవుడు ఇవన్నీ అబ్రహాముకు చెప్పి ఒక పనిని అప్పగించాడు. ఆ పని ఏమిటంటే అబ్రహాము లేచి దేవుడు చూపించు దేశమునకు వెళ్ళాలి. ఆ దేశములో అబ్రహాము తన సంతానమును విస్తరింపచెయ్యాలి. వారి ద్వారా ప్రపంచానికి దేవుడు మార్గనిర్దేశకాలను ఇవ్వబోవుచున్నాడు. దేవుని జ్ఞానమును ప్రకటించబోవుచున్నాడు. ఆయన మాటలను వినిన వారిని దేవుని ప్రజలుగా ఏర్పరచబోవుచున్నాను. కనుక అబ్రహామును దేవుడు చూపించు దేశమునకు వెళ్ళమని చెప్పాడు. నిజంగా అబ్రహాము ఒక సామాన్య మానవునిగా అందరివలె ఆలోచిస్తే, ఈ లోకమందున్న ప్రజలలో ఒకలాంటి మనిషిగా ప్రవర్తిస్తే – దేవునితో ఏమని చెప్పాలి? నీవు ఆశీర్వాదమును ఇస్తానంటున్నావు, నన్ను గొప్ప జనముగా చేస్తాను అంటున్నావు. అసలు నా పేరునే ఆశీర్వాదము అంటున్నావు, భూమి మీద ఉన్న సమస్త వంశములు నా వలన ఆశీర్వదించబడతాయి అంటున్నావు. అలాంటిది నన్ను ఇక్కడే ఉంచి నాకు మేడలు, మిద్దెలు, బంగారము, ఆస్తులు ఇవ్వకుండా ఏమిటయ్యా... వీటన్నింటిని విడిచిపెట్టి వెళ్ళిపోమంటున్నావు అని అడగాలి! కానీ ఏమి జరిగిందో చూడండి! అబ్రహాము ఏమి చేసాడో చదవండి.

**ఆదికాండము 12 : 4** లో 'యెహోవా అతనికి చెప్పిన ప్రకారము అబ్రహాము వెళ్ళెను'. అబ్రహాము వెంటనే వెళ్ళిపోయాడు. అబ్రహాముకున్న ఆ విధేయతగల మనసే ఆశీర్వాదానికి ఆయనలో ఉన్న అర్హత. అబ్రహాము పొడవుగా ఉన్నాడని, అందముగా ఉన్నాడని, అబ్రహాముకు అప్పటికే ఆస్థి ఉందని, అందుకే అబ్రహామును ఆశీర్వదించాలని అనుకుంటున్నాను అనలేదు దేవుడు. అబ్రహాములో దేవునికి కావలసిన మంచి అర్హత ఏమిటో తెలుసా? దేవుడు చెప్పిన మాటను అబ్రహాము వింటాడు. దేవుడు ఏమి చెప్పినా వింటాడు. అబ్రహాము దేవుడు చూపించిన దేశానికి వెళ్ళిపోయాడు. దేవుడు తన్ను ఆశీర్వదిస్తానన్నాడు. భూమి మీద ఉన్నవారందరికి తాను ఆశీర్వాదముగా ఉంటాను అన్నాడు. అబ్రహాముకు దేవుడు ఒక దేశాన్ని చూపించాడు. కట్టు బట్టలతో, తన భార్యను తీసుకొని వెళ్ళిపోవాలి అనుకున్నాడు అబ్రహాము. ఆ ప్రకారమే దేవుడు చూపించిన దేశమునకు వెళ్ళిపోయాడు. అందుకు దేవుడు మెచ్చుకున్నాడు. అంటే ఇతనిలో నిజంగానే అర్హత ఉంది. దేవుని మాట వింటున్నాడు. దేవుడు ఏమి చెప్పినా అది చేస్తున్నాడు. అంటే భూమిమీద ఆశీర్వాదానికి అర్హుడు అబ్రహాము మాత్రమే. జాగ్రత్తగా మీరు దీనినంతటినీ మీ మనసులో ఉంచుకోవాలి. ఆశీర్వాదానికి అర్హత ఏమిటో మీరు తెలుసుకోబోతున్నారు. ఆశీర్వాదానికి అర్హత ఏమిటంటే దేవుని మాట వినడమే. తు.చ. తప్పకుండా, దేవుణ్ణి ఎదురు ప్రశ్నించకుండా, దేవుడు చూపించిన దేశానికి, తాను పుట్టిన ప్రదేశమును, దేశమును విడిచిపెట్టి వెళ్ళిపోయాడు. ఆ తరువాత అక్కడే తన సంపదనంతా విస్తరింపజేస్తున్నాడు. అబ్రహాము తన భార్యతో ఉన్నాడు కాని అబ్రహాముకు ఒక్కటే లోటు. అదే సంతానలేమి. అబ్రహాముకు పిల్లలు లేరు. మరి దేవుడు, **ఆదికాండము 12** అధ్యాయములో వ్రాసిన మాటలను బట్టి అబ్రహామును ఒక ఆశీర్వాదముగా ఉంటావు అన్నాడు. అలాంటిది అబ్రహాము యొక్క వయస్సు గతించిపోయింది కాని ఇంకా ఆయనకు పిల్లలు లేరు. అబ్రహాము యొక్క వయస్సు వృద్ధాప్యము లోనికి వెళ్ళిపోయింది. సుమారు నూరేండ్ల వయసు గలవాడుగా మారిపోయాడు. సుమారుగా అబ్రహాములో ఉన్న పటుత్వం సడలిపోయింది. అబ్రహాముకు పిల్లలు పుట్టే అవకాశము లేకుండా పోయింది. అబ్రహాము భార్యకు కూడా పిల్లలు పుట్టే అవకాశం లేకుండా పోయింది. ఇద్దరూ ముసలివారై పోయారు. ఒకప్రక్క చూస్తే దేవుడు అబ్రాహామును ఆశీర్వదించాను అన్నాడు, ఆశీర్వాదముగా ఉంటావు అన్నాడు. అబ్రహామే ఆశీర్వాదానికి అర్హుడు అన్నాడు. దేవుడు చూపించే దేశమునకు వెళ్ళమన్నాడు, విస్తరించమన్నాడు కాని వారు ముసలివారు అయిపోయినా ఇంకా వారికి పిల్లలు పుట్టలేదు. అయినా అబ్రహాము దేవుణ్ణి పల్లెత్తు మాట కూడా అనలేదు. ఎందుకంటే అబ్రహాము దేవుని నమ్మాడు. అబ్రహాము ఆశీర్వాదానికి అర్హత పొందాడు. అందుకే దేవుని ఏ మాత్రం అడగలేదు. మనమైతే నిజంగా ఆగుతామా? మనకు గనుక అవకాశము కల్పిస్తే, మోకాళ్ళ ప్రార్థనలు, లింక్ ప్రార్థనలు, సంపూర్ణ రాత్రి ప్రార్థనలు అదే పనిగా చేస్తూ కూర్చుంటాము.

ప్రక్కనున్న వారందరూ మన ప్రార్థనలు విని ఏమిటీ గోల? అనుకోవాలి తప్ప నిజంగా వాటి వలన ఉపయోగము ఉందంటారా? అబ్రహాము ఒక్క మాట కూడా దేవుని అడగలేదు. నాకెందుకు పిల్లల్ని ఇవ్వలేదని దేవుని ఎప్పుడూ అడగలేదు. అందుకే దేవుడు తగిన సమయమందు అబ్రహామును జ్ఞాపకము చేసుకున్నాడు. ఎప్పుడు అనుకున్నారు? అతని ముసలి ప్రాయంలో! అబ్రహాము, శారాలు వృద్ధులుగా ఉన్నప్పుడు దేవుడు వారిని జ్ఞాపకము చేసుకొని – నేను అబ్రహామును ఆశీర్వదిస్తానన్నాను. ఈ భూమి మీద సమస్త వంశములు ఆయన ద్వారా ఆశీర్వదింపబడతాయని చెప్పాను గనుక ఆయన ఆ ఆశీర్వాదమును జ్ఞాపకము చేసుకొని, అబ్రహామునకు తన వృద్ధాప్యంలో ఒక కుమారుని అనుగ్రహించాడు. అప్పుడు అబ్రహాము తాను నిజముగా ఆశీర్వాదానికి అర్హుడే అని పొంగిపోయాడు. ఎందుకంటే ప్రతి ఒక్కరూ 25 ఏళ్ళకు, 30 ఏళ్ళకు తమ వివాహము అవ్వగానే పిల్లల్ని కంటారు. కాని అబ్రహాము ఎప్పుడు కన్నాడో తెలుసా? తన వృద్ధాప్యంలో కన్నాడు. అంటే ప్రపంచంలో ఎవరిచేత కానిది దేవుడు అబ్రహాముచేత జరిగించాడు. ఎందుకంటే దేవుడు అబ్రహామును ఆశీర్వదించాడు. ఆయన అనుగ్రహించిన ఆశీర్వాదం అబ్రహాము మీద ఉన్నది. ఆయన కుటుంబం మీద ఉన్నది. అబ్రహాము ఆశీర్వాదానికి అర్హుడు, ఎందుకంటే దేవుడు చెప్పిన మాటను తు.చ. తప్పకుండా పాటించాడు. కనుక వృద్ధాప్యంలో దేవుడు ఒక కుమారుని అనుగ్రహించాడు అని చాలా సంబరపడిపోయాడు అబ్రహాము. ఆ కుమారునికి 'ఇస్సాకు' అని నామకరణం చేసారు. అబ్రహాముతోపాటు అతని భార్య, వారికి లేకలేక పుట్టినటువంటి కుమారుని పెంచుతున్నారు. సుమారు 12 యేళ్ళ ప్రాయంలో ఆ కుమారుడు ఉన్నప్పుడు, ఇంకా చిన్నవాడిగానే ఉన్నప్పుడు మరల దేవుడు వచ్చాడు. అబ్రహాము దగ్గరకు వచ్చి, అబ్రహాము దైవాశీర్వాదమును పొందుటకు అర్హత ఉన్నదో లేదో అని మరల ఎలా పరీక్షిస్తున్నాడో చూడండి. **ఆదికాండము 12**వ అధ్యాయంలో ఆశీర్వదిస్తున్నానే మాట అయితే చెప్పాడు కానీ, ఇంతకీ అబ్రహాములో ఆ అర్హత ఉన్నదో లేదో అని అబ్రహామును జీవితాంతం దేవుడు పరీక్షిస్తూనే ఉన్నాడు. దేవుడు చెప్పిన మాటలను అబ్రహాము పాటించాడు కానీ, ఈ పరీక్షల్లో చిట్టచివరి దశకు చేరుకున్నాడు. అది ఏమిటంటే, నీకు లేకలేక కలిగిన నీ కుమారుని నా కొరకు నీవు బలిగా ఇచ్చేయాలి! ఇది దేవుడు అబ్రహామును అడిగిన కోరిక. ఏమిటండి ఒక ఆశీర్వాదాన్ని ఇచ్చిన దేవుడు, ఆశీర్వాదముగా మార్చిన పరలోకపు తండ్రి, అబ్రహామును ఇలాంటి కోరికను కోరతాడా? ఈ అబ్రహాము యొక్క చరిత్రను ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు ఖచ్చితముగా తెలుసుకోవాలి! ఏమిటండి మనకున్న భక్తి? దేవుని దగ్గరకు వెళ్ళి ఏమి అడగాలా? అనుకుంటాము. దేవుని ఆశీర్వాదమును పొందే అర్హత మీకు ఉందా? అబ్రహాము ఆ అర్హత సంపాదించుకున్నాడు. దేవుడు ఇచ్చిన వాగ్దానము కొరకు సంవత్సరాల కాలము కనిపెట్టాడు. వృద్ధాప్యములో అతనికి కుమారుడు పుట్టాడు. ఇంత గొప్పవాడైన అబ్రహామును దేవుడు ఇంకా పరీక్షించాలనుకుంటున్నాడు.

**ఆదికాండము 22 : 15, 16** "యెహోవా దూత రెండవమారు పరలోకమునుండి అబ్రహామును పిలిచి ఇట్లనెను. నీవు నాకు ఒక్కడే అయ్యున్న నీ కుమారుని ఇయ్య వెనుతీయక యీ కార్యము చేసినందున" అంటున్నాడు. అబ్రహామునకు ఒక్కగానొక్క కుమారుడు తన వృద్ధాప్యంలో పుట్టాడు. అప్పటికి అతడు 12 సంవత్సరాల ప్రాయము కలిగినవాడు. ఇంకా యుక్త వయస్సు కూడా రాలేదు. అలాంటి పసిమొగ్గను నీవు, నీ కొరకు బలి ఇవ్వమంటావా? అని దేవుడిని అడగకుండా, వెనువెంటనే దేవుడు అడిగిందే తడవుచేయకుండా, అబ్రహాము తన కుమారుని బలి ఇవ్వడానికి బయలుదేరాడు. ఇస్సాకును బలిపీఠముపైన పడుకోబెట్టి, దేవునికి బలివ్వడానికి తన కత్తిని పైకెత్తినప్పుడు – ఆ క్షణము వరకు దేవుడు అబ్రహామును పరీక్షించాడు. అప్పుడు దేవుడు అక్షరాలా అబ్రహాముతో పలికిన మాట ఏమిటో తెలుసా? "నీకు ఒక్కగానొక్క కుమారుడుగా పుట్టిన ఇస్సాకును నీవు వెనుక తియ్యకుండా ఇచ్చావు కనుక నీవు ఈ కార్యము చేసినందున **ఆదికాండము 22 : 17** ప్రకారము, నేను నిన్ను ఆశీర్వదించి, ఆకాశ నక్షత్రములవలెను, సముద్రతీరమందలి యిసుకవలెను నీ సంతానమును నిశ్చయముగా విస్తరింపచేసెదను. నీ సంతతివారు తమ శత్రువుల గవినిని స్వాధీనపరుచుకొందురు" అన్నాడు. ఇప్పుడు ఒక మంచిమాటను దేవుడు అబ్రహాముకు తెలియజేసాడు. అదేమిటంటే, నీవు నీ కుమారుని ఇయ్య వెనుతీయలేదు. బలి ఇవ్వడానికి సిద్ధపడిపోయావు. కత్తి

పైకెత్తి నీవు నీ కుమారుని మెడమీద దానిని నరకడానికి సిద్ధంగా ఉంచావు. గనుక ఈ కార్యక్రమము చేసినందున నీకు ఒక మంచి అర్హత వచ్చేసింది. **ఆదికాండము 12**వ అధ్యాయంలో నీవు ఆశీర్వాదముగా ఉంటావు. నీవు చాలా గొప్పవాడిగా అయిపోతావు. భూమి మీద సమస్త వంశములు నీ వలన ఆశీర్వదింపబడతాయి. నీకు ఇస్తాను, ఇస్తాను అని ఈ మాటలన్ని చెప్పి అబ్రహామును తన స్వదేశములోనుండి పంపించాడు, కాని ఆ మాటలు చెప్పినప్పుడు ఏమీ ఇవ్వలేదు. నమ్ముతాడో లేదో అని చాలా సంవత్సరాల కాలము దేవుడు అబ్రహామును పరీక్షించాడు. నిజంగా అబ్రహాము నమ్మేసాడు. అబ్రహాము దేవుని నుండి ఏమీ కోరుకోలేదు. అసలు ఆశీర్వాదం అంటే మేడలు, మిద్దెలు, బంగారము... ఇవన్నీ కాదనకున్నాడాయన. దేవుని మాట వింటే చాలు, అదే ఆశీర్వాదానికి అర్హత అనుకున్నాడు. దేవుడు ఇచ్చేది ఏదో ఆయన ఇస్తాడు. దేవుడు తప్పకుండా అనుగ్రహిస్తాడు అనుకొని అప్పటివరకు ఎదురుచూసాడు. అబ్రహాముకు దేవుడు ఒక కుమారుని అనుగ్రహించాడు. ఆ కుమారుని మరల తిరిగి దేవుడు తనకు వెనక్కి ఇమ్మని అడిగినప్పుడు, అబ్రహాము తన కుమారుని దేవునికివ్వడానికి వెనుకడుగు వెయ్యలేదు. దీనిని బట్టి దేవుని గ్రంథములో వ్రాయించిన మాట ఏమిటో తెలుసా? **ఆదికాండము 22:17** అబ్రహాము ఈ కార్యము చేసినందున, "నేను నిన్ను ఆశీర్వదించి, ఆకాశ నక్షత్రమువలెను, సముద్రతీరమందలి ఇసుకవలెను నీ సంతానమును నిశ్చయముగా విస్తరింప చేసెదను. అంటే అబ్రహాము నిజంగా ఆశీర్వాదానికి ఆ క్షణములోనే అర్హత పొందాడు. దేవుడు ఈ అర్హత కలిగిన వారెవరైనా ఉన్నారా? అని భూమి మీద ఉన్న మనుష్యులందరిని చూస్తున్నాడు. దేవుడు అబ్రహామును గ్రుడ్డిగా నమ్మలేదు. చాలా పరీక్షలు పెట్టాడు. చాలా సేపు ఆయన వేచి చూసాడు. దాదాపుగా అబ్రహాము తన జీవితకాలము అంతా దేవుడు అబ్రహామును పరీక్షిస్తూ ఆయన్ను ఆశీర్వదించాలా? వద్దా? అని చిట్ట చివరిగా ఒక పరీక్ష పెడుతున్నాడు. నీవు నీ కుమారుని నాకు బలిగా ఇవ్వాలి అన్నాడు. అబ్రహాము బలి ఇవ్వడానికి సిద్ధపడ్డాడు కనుకనే, నిన్ను ఆశీర్వదిస్తున్నాను అన్నాడు దేవుడు. ఇప్పుడు జాగ్రత్తగా ఆలోచించాలి. దేవుని దగ్గర నుండి ఆశీర్వాదము పొందాలి అంటే మీరు అర్హులు కావాలి. ఈ అర్హత సంపాదించాలంటే మీరు దేవుని దగ్గర ఎంతో మంచిపేరు సంపాదించాలి. దేవుని మాటను మీరు వినాలి! అప్పుడే ఆశీర్వాదానికి మీరు అర్హులు. ప్రపంచంలో చాలామంది ధనసంపన్నులున్నారు, కోటీశ్వరులున్నారు. వారు చాలా గొప్ప గొప్ప బ్రతుకులు బ్రతుకుచున్నారు. వారందరూ ఆశీర్వదింపబడినవారు కారా? వారందరు దేవునిమాట వినకుండానే ఆశీర్వాదమును ఎలా పొందుతున్నారు? ఎలా లాభము పొందుతున్నారు? అనుకుంటే పొరబటినట్టే! ఎందుకనగా, అదంతా ఆశీర్వాదము కాదు. డబ్బు ఉంటే ఆశీర్వాదము అనుకుంటున్నారా? మీరు బాగా ఆలోచించాలి. భూమిమీద ధనసంపన్నులుగా బ్రతికితే అది దేవుని ఆశీర్వాదము అనుకుంటున్నారా? మన వెనుక కోట్ల రూపాయలు ఆస్తి ఉండడం, మనము ఎన్నో ఎకరాల భూమిని సంపాదించుకోవడం, ఇదంతా దేవుడు మనకు అనుగ్రహించిన ఆశీర్వాదమనుకుంటున్నారా? కాదు! ప్రపంచం ఈ విషయంలో తప్పు త్రోవ పట్టింది. బైబిల్‌ను ఎవ్వరూ అర్థం చేసుకోలేదు. క్రైస్తవ ప్రపంచం కూడా అర్థం చేసుకోలేదు. నీవు కష్టాలలో ఉన్నావా? దేవుడు నిన్ను ఆశీర్వదిస్తాడు. ప్రార్థన చేసుకో! బాధలలో ఉన్నావా? కానుక ఇవ్వు. దేవుడు నిన్ను ఆశీర్వదిస్తాడు అంటున్నారు. తప్పు కదూ! ఇంతకీ అబ్రహాము ఏ విధముగా ఆశీర్వదించబడ్డాడో చూడండి.

ఇంతకీ ఆశీర్వాదము అంటే ఏమిటి? మేడలు కాదు, మిద్దెలు కాదు, కోట్ల రూపాయల ఆస్తి కానే కాదు. గాలి జనార్థన్ రెడ్డి మీ అందరికి తెలుసు. గాలి జనార్థన్ రెడ్డి బ్రతుకు అంతా 'గాలి'మయం అయిపోయింది. ఇంటిపేరు 'గాలి'. ఇదెక్కడ 'గాలి'? ఓబులాపురంలో మైనింగ్ (భూమి త్రవ్వకాలు), ఆ త్రవ్వకాలలో విస్తారమైనటువంటి గనులు. ఈ గనులన్నిటిని అక్రమముగా అమ్ముకోవడం. ప్రభుత్వానికి పన్ను చెల్లించకుండా, అక్రమమైన పద్ధతిలో అనుమతులు లేకుండా త్రవ్వకాలు జరపడం వల్ల చాలా ధనాన్ని సంపాదించాడు. అదిలాబాద్ జిల్లా దాటితే కర్ణాటక ప్రాంతం, బళ్ళారి బోర్డర్. ఇతను చేసిన కార్యక్రమాలు ఏమిటంటే, భూమిలోని ఖనిజాల కొరకు గనులు త్రవ్వకున్నాడు. ప్రభుత్వానికి పైకమును చెల్లించకుండా అక్రమముగా ఆస్థులను సంపాదించుకున్నాడు. ఇతని దగ్గర ఉన్న ఆస్తుల విలువ చాలా ఎక్కువ. వాటిని చూచి ప్రభుత్వం కూడా ఆశ్చర్యపోయింది. ఏమిటి? ఇన్ని ఆస్తులున్నాయా? రాజకీయ అండ చూసుకొని ఇన్ని ఆస్తులు సంపాదించావా? అయితే నీవు పో! ఎక్కడికీ? జైలుకి. మరి, గాలి జనార్ధనరెడ్డికి ఆ

ధనమంతా దేవుడి ఇచ్చిన ఆశీర్వాదమే అనుకుందాం. అలా అయితే జైలుకి ఎందుకు వెళ్ళినట్టు? ఆస్తి సంపాదించడం దేవుని ఆశీర్వాదము కాదా? కానే కాదు. మనము విరస్తారమైన సంపదను మన వెనుక వేసుకోవడం ఆశీర్వాదము కాదా? అస్సలు కాదు. ధనమే దేవుని ఆశీర్వాదమనుకునే పిచ్చివారినందరిని చూచి టి.వి.లలో గారడీవాళ్ళు తయారయ్యారు. ఉంగరాలు, యంత్రాలు, బొమ్మలు అమ్ముకుంటున్నారు. పచ్చ రంగురాయి బాగులేదని ఎరుపు రంగురాయి, ఎరుపు బాగులేదని నీలం రంగురాయి,... ఇలా రాళ్ళు ధరించుకోవడం వలన మీ ఆస్తులు పెరుగుతాయా? అసలు ఆస్తులు పెంచుకోవడం దేవుని ఆశీర్వాదమా? భూమి మీద సుఖసంపదలతో తులతూగడం దేవుని దీవెనా? కానే కాదు! మీరింత ఖచ్చితముగా ఎలా చెపుతున్నారండి? అని మీరు నన్ను అడగవచ్చు. బైబిల్‌లో ఎక్కడైనా వ్రాయబడిందా? ఆస్తి కలిగి ఉండడం మంచిది కాదు, అది దేవుడిచ్చిన ఆశీర్వాదము కాదని బైబిల్‌లో ఎక్కడైనా వ్రాయబడిందా? అంటే... బైబిల్ అంతా అదే వ్రాయబడింది! ఆదికాండము నుండి ప్రకటన గ్రంథము వరకు 66 పుస్తకాలలో బైబిల్‌లో అనేకచోట్ల దీనిని గూర్చి దేవుడు తన మనసు విప్పాడు. విస్తారమైన ఆస్తిని సంపాదించుకోవడం దేవుని ఆశీర్వాదమా? ఎవరు చెప్పారు మీకు? ఇప్పటి వరకు బైబిల్‌ను చాలామంది దుర్బీజులు తప్పుగా బోధించారు. విస్తారమైన ఆస్తిని సంపాదించుకోవడం దేవుని ఆశీర్వాదము అనుకుంటున్నారా? ధనాన్ని వెనుక వేసుకోవడం ఆశీర్వాదము అనుకుంటున్నారా? నీ వ్యాపారంలో లాభాన్ని ఆర్జించడం, ఉద్యోగము సంపాదించడం, మేడలు కట్టుకోవడం, భూములు సంపాదించడం...ఇవన్నీ దేవుని ఆశీర్వాదము అనుకుంటారా? అమాయకులారా... యేసుక్రీస్తు ఎక్కడ పుట్టాడో తెలుసా? ఈ ప్రపంచాన్ని కలుగజేసినవాడు, దేవుని కుమారునిగా గొప్ప ఆధిక్యతను కలిగినవాడు, పుట్టినప్పుడు పరిస్థితులేమిటో మీకు తెలుసా? యేసుక్రీస్తు పుట్టినప్పుడు సత్రములో స్థలము లేనందున, ఆ రోజు కన్య మరియ యేసుక్రీస్తుని ఆరు బయట కన్నది. యేసుక్రీస్తు పుట్టిన కుటుంబము ఎలాంటిదో తెలుసా? ఒక కడుబీద కుటుంబము. ఒక వడ్రంగి వాని కుటుంబం. యేసుక్రీస్తు యొక్క జీవన కార్యక్రమాలు ఏమిటో తెలుసా? యేసుక్రీస్తు బ్రతికిన విధానము ఏమిటో తెలుసా? చాలా పేదరికము. మరి ఆయనకు ఆశీర్వాదము లేదా? ఆయన దేవుని ఆశీర్వాదానికి అర్హుడు కాదా? ఆశీర్వాదము విషయంలో అబ్రహాముకే తండ్రి ఆయన. అబ్రహాము వలన భూమి మీద ఉన్న సంతానములన్నీ ఆశీర్వదించబడితే, ఆ అబ్రహామునే ఆశీర్వదించినవాడు ఎవరో తెలుసా? యేసుక్రీస్తు!

**హెబ్రీయులకు 7 : 7** "తక్కువవాడు ఎక్కువవానిచేత ఆశీర్వదింపబడునను మాట కేవలం నిరాక్షేపమైయున్నది". ఇప్పటివరకు మనము చదువుకున్న, మాట్లాడుకున్న అబ్రహామును భూమిమీద ఒక వ్యక్తి ఆశీర్వదించాడు. ఆయన ఎవరో చూడండి. తక్కువ వాడు ఎక్కువ వాని చేత ఆశీర్వదింపబడునను మాట కేవలము నిరాక్షేపమైయున్నది. అంటే ఒక తక్కువవాడు ఎక్కువ వానిచేత ఆశీర్వదించబడతాడు. అలా అయితే అబ్రహాముని ఎవరు ఆశీర్వదించారని అనుకుంటున్నారు? యేసుక్రీస్తు ముందు అబ్రహాము తక్కువవాడై పోయాడక్కడ! **హెబ్రీయులకు 7 : 1, 2** "రాజులను సంహారము చేసి తిరిగి వచ్చుచున్న అబ్రహామును ఎవరు కలుసుకొని అతనిని ఆశీర్వదించెనో, ఎవరైతే భూమిమీద ఆశీర్వాదముగా ఉంటారో, ఆ అబ్రహామునే ఆశీర్వదించటానికి వచ్చిన గొప్ప షాలేము రాజే యేసుక్రీస్తు". రాజులను సంహారము చేసి, ఆ రోజు అబ్రహామును మెల్కీసెదెకు రూపములో ఎదుర్కొనవచ్చిన నిరంతర యాజకుడే యేసుక్రీస్తు. ఆయన అబ్రహామును ఆశీర్వదించాడు. అబ్రహాము చేత భూమి మీదనున్న సమస్త వంశములన్నీ ఆశీర్వదించబడ్డాయి. యేసుక్రీస్తు ఎంత గొప్పవాడో చూడండి. అలాంటి యేసుక్రీస్తు భూమి మీదకి వచ్చిన పరిస్థితిని, ఆ యేసుక్రీస్తు భూమిమీద తనకు ఇవ్వబడిన కాలములో బ్రతికిన పరిస్థితిని మీరు చూడగలిగితే ఆయన దగ్గర ఆస్తులు లేవు. ఆయన దగ్గర ఇల్లులు లేవు. నక్కలకు బొరియలున్నాయి, ఆకాశ పక్షులకు నివాస స్థలములున్నాయి కాని మనుష్య కుమారునికి తల వాల్చుకొనుటకు స్థలము కూడా ఎక్కడా లేదు. మరి అలాంటప్పుడు యేసుక్రీస్తు ఆశీర్వాదము లేనివాడని మీరు చెప్పగలరా? లేదు. చెప్పలేరు! అంటే ప్రపంచంలో ప్రతీ ఒక్కరూ తెలుసుకోవలసిన సంగతి ఏమిటో తెలుసా? ఆశీర్వాదము అంటే దేవుని దగ్గరనుండి వచ్చే సమాధానము, దేవుని యొక్క నెమ్మది. ఇది తప్ప, ఆస్తిపాస్తులనుకుంటే పొరపాటు. బంగారం అనుకుంటే పొరపాటు. విస్తారమైన సంపద అనుకుంటే పొరపాటు. ఇప్పుడు యేసుక్రీస్తు స్వయముగా పలికిన ఒక మంచి సందర్భాన్ని, మనము

జ్ఞాపకము చేసుకోవలసిన సందర్భాన్ని చూపిస్తాను. **లూకా 12 : 16** “యేసుక్రీస్తు వారితో ఈ ఉపమానము చెప్పెను – ఒక ధనవంతుని భూమి సమృద్ధిగా పండెను”. ధనవంతుని చూడగానే దేవుడు అతనిని బాగా ఆశీర్వదించాడు అనుకుంటారు. ఒక ఊరిలో ఒక పెద్దను చూడగానే, ఒక ఊరిలో ఒక రాజును చూడగానే అందరూ అలానే అనుకుంటారు. ఒక నాయకుడిని చూడగానే దేవుడు ఈయనను బాగా ఆశీర్వదించెను అనుకుంటారు. యేసుక్రీస్తు చెబుతున్న ఒక ఉపమానములో, ఒక ధనవంతుడు కూడా అలాగే అనుకున్నాడు. ఒక ధనవంతుని భూమి ఎక్కువగా పండెను. భూమిలో ఒక బస్తా విత్తనాలు వేస్తే, సుమారు 40 బస్తాలు పండింది అనుకుందాం. ఇక ఆ ధనవంతుడు ఆనందమును పట్టలేకపోతున్నాడు. అబ్రహాము కాదు, భూమిమీద నేనే ఆశీర్వాదమును అనుకుంటాడు ఆ ధనవంతుడు. ఎందుకంటే ఒక బస్తావేస్తే, 40 బస్తాలు తిరిగి వచ్చేసాయి. అప్పుడతడు – నా పంట సమకూర్చుకొనుటకు నాకు స్థలము చాలదు కనుక నేనేమి చేతును అని తనలో తాను ఆలోచించుకొని – నేనీలాగు చేతును. నా కొట్టువిప్పి, వాటికంటే గొప్పవాటిని కట్టించి, అందులో నా ధాన్యమంతటిని, నా ఆస్తిని సమకూర్చుకొని, నా ప్రాణముతో – ప్రాణమా, అనేక సంవత్సరములకు విస్తారమైన ఆస్తి నీకు సమకూర్చబడియున్నది అనుకుంటున్నాడు. చూసారా? ఒక సంవత్సరమునకు కాదు, అనేక సంవత్సరములకు కావలసిన ఆస్తిని సంపాదించాడు. తన బ్రతుకు కాలములో ఎంత తింటాడో అంత ఆస్తినీ సమకూర్చుకున్నాడు. యేసు కాలములో ఆయన చెబుతున్న ఉపమానమిది. అనేక సంవత్సరములకు, విస్తారమైన ఆస్తి ధనవంతునికి సమకూర్చబడియున్నది. నా ప్రాణమా సుఖించుము, సంతోషించుము. ఇదిగో ఈ ఆస్తినంతా అనుభవించుము అంటున్నాడు. అది దేవుని ఆశీర్వాదము అనుకున్నారా? వెంటనే ఈ సీన్ లోనికి దేవుడు ఎంటర్ అయ్యాడు. దేవుడు వచ్చి ఏమంటున్నాడో చూడండి. ఆ ధనవంతుని చూసిన దేవుడు, “వెఱ్ఱివాడా, నీకు ఆశీర్వాదము లేదు బిడ్డా. నీవు ఆశీర్వాదానికి అర్హుడవు కావు. పంట పండినంత మాత్రాన, బ్యాంక్ బ్యాలెన్స్ ఉన్నంత మాత్రాన, నీ చేతికి బంగారము ఉన్నంత మాత్రాన నీవు ఆశీర్వదించబడినవాడవని ఎవరు చెప్పారు? వెఱ్ఱివాడవు నీవు! పిచ్చివాడవు నీవు! మూర్ఖుడవు నీవు! ఎందుకంటే నీ లోపల ఒక దీపము ఉంది. అది ప్రతి క్షణం లబ్ డబ్, లబ్ డబ్ అని కొట్టుకుంటుంది. అది ఎవరి చేతిలో ఉన్నదో తెలుసా? దేవుడనైన నా చేతిలో ఉన్నది. నీవు ఆశీర్వాదానికి అర్హుడవైతే దానిని నేను చల్లగా కాపాడతాను. నీవు నిజముగా ఒక అబ్రహాములా ఆశీర్వాదానికి అర్హత సంపాదిస్తే, నేను నీ ప్రాణాన్ని కాపాడతాను. లేదా ఈ భూమి మీద నీవు సంపాదించుకున్నవన్నీ చూసుకుని, ఇదే దేవుని ఆశీర్వాదము అనుకొంటున్నావా? ఐతే వెఱ్ఱివాడా, ఈ రాత్రికి నీ ప్రాణమును అడుగుచున్నారు. ఏము చేయమంటావు? నీ ప్రాణమును తీసేయమంటావా? నీవు సిద్ధపరచావు చూసావా? నేను ఇచ్చిన ఆశీర్వాదమని నీవు అనుకుంటున్నావు చూసావా? అవి ఎవరివగును? అవి ఎవరు తింటారు? ఇదే ధనవంతులకు దేవుడు అడుగుతున్న ప్రశ్న! ప్రియమైనవారలారా! జాగ్రత్తగా ఆలోచించండి, ఈ రోజు మీడియా అంతా మనలను మోసగించింది. ఈ మీడియా ఏమి చెబుతుంది? పంట పండడం లేదా? ఉంగరము పెట్టుకోండి. ఉంగరము పెట్టుకుంటే పంట పండుతుందా? ఎరువు కొట్టాలి, మందు కొట్టాలి, పురుగుల మందు కొట్టాలి, చక్కగా సేద్యపరచాలి. ఈ మీడియా తప్పు చేస్తోంది. జనులను ఇంకా మోసం చేస్తూనే ఉంది. ఈ ప్రపంచమంతా తప్పుడు మార్గములో వెళ్ళిపోతోంది. దేవుడు చెప్పిన మాటను చూడండి. బైబిల్‌లో ఇసుమంతయినా మోసము లేదు. మరి ఇప్పటివరకు బోధకుల మాటలలో మేము విన్నది ఏమిటి? చర్చ్‌కు వెళితే, మోకాళ్ళ ప్రార్థన చేస్తే, దేవుడు ఆశీర్వదిస్తాడని విన్న ఆ బోధలన్నీ శుద్ధ తప్పు. ఇప్పటివరకు మీరంతా తప్పుడు బోధలు విన్నారు. అందుకే మీకు ఇదంతా నేను వ్రాయవలసివచ్చింది. మీరు తప్పుడు మాటలు విన్నారు. మీరు కోరుకుంటే వచ్చేది కాదు ఆశీర్వాదము. మీరు సంపాదించుకోవలసినది ఆశీర్వాదానికి అర్హత! అప్పుడు మీరు అడగకుండానే దేవుడు దానిని మీకు ఇచ్చేస్తాడు. మీరు భూమి మీద సంతోషముగా బ్రతుకుతారు. ఈ లోకములో ఎవరి దగ్గర నెమ్మది ఉంది? ధనవంతుని దగ్గర నెమ్మది ఉందా? ధనవంతుని దగ్గర సమాధానము ఉందా? ధనవంతులు సుఖముగా బ్రతుకగలుగుతున్నారా? సుఖముగా బ్రతుకుతున్నారని మీరు అనుకుంటున్నారేమో. వారికి కంటి మీద కునుకు లేదు. వారి ఆస్తిని ఎలా కాపాడుకోవాలో వారు నిరంతరము ఆలోచించుకుంటూ, కంటి మీద క్షణము తీరికలేక బ్రతుకుతున్న కాలమిది. ధనవంతులకు ధనము దేవుడిచ్చిన

ఆశీర్వాదము కాదు. సంపద దేవుడిచ్చిన ఆశీర్వాదము కాదు. మరి దేవుడిచ్చే ఆశీర్వాదమంటే ఏమిటో మనకు తెలియాలి. అబ్రహాముకు అనుగ్రహించబడినది, యేసుక్రీస్తువలన అబ్రహాముకి ఇవ్వబడినది, ఆ తరువాత భూమిమీద చాలామంది నీతిమంతులకు, దేవుని నమ్మినవారికి, దేవునిమాటలు పాటించినవారికి ఇవ్వబడినది, ఇప్పటికీ ఇవ్వబడుతున్న ఆ నిజమైన దేవుని ఆశీర్వాదము ఏమిటో మీకు తెలియాలి!

**రోమీయులకు 15 : 29** "నేను మీ యొద్దకు వచ్చునప్పుడు, క్రీస్తు యొక్క ఆశీర్వాద సంపూర్ణముతో వత్తునని యెరుగుదును". అపోస్తులుడైన పౌలు రోమీయులకు లేఖ వ్రాస్తూ ఏమంటున్నాడో చూడండి. నేను మీ యొద్దకు వచ్చినప్పుడు, మీ దగ్గరకు ఆశీర్వాదమును తీసుకువద్దాము అనుకుంటున్నాను. ఇంతకీ ఏమిటి ఆ ఆశీర్వాదము? మీ అయ్యగారు మీ ఇంటికి వస్తే ఆశీర్వాదాలు అనుకున్నారు. ఏమిటీ ఆశీర్వాదాలు? మీకు ఎప్పుడైనా తెలుసా? అసలు దేవుడిచ్చు ఆశీర్వాదము ఏమిటో? ఎలా ఉంటుందో? ఇక్కడ దేవుడు వ్రాయించాడు చూడండి. పౌలు రోమీయుల యొద్దకు వచ్చునప్పుడు, క్రీస్తు యొక్క ఆశీర్వాద సంపూర్ణముతో వత్తునని యెరుగుదునని అంటున్నాడు. ఇది మామూలు ఆశీర్వాదము కాదు. ఇది క్రీస్తు యొక్క ఆశీర్వాదము! భూమిమీద సమస్త వంశములు ఎవరిచేత ఆశీర్వదింపబడునని దేవుడు వ్రాయించాడో, ఆ అబ్రహామును ఆశీర్వదించిన క్రీస్తు, ఆ క్రీస్తు దగ్గర ఒక బ్రహ్మాండమైన ఆశీర్వాదము ఉంది. ఈ ఆశీర్వాదము ప్రపంచంలో ఎవరి దగ్గరా లేదు. అందరూ ధనమే ఆశీర్వాదమనుకున్నారు. ఇల్లు ఉంటే ఆశీర్వాదమనుకున్నారు. ఆరోగ్యం ఉంటే ఆశీర్వాదమనుకున్నారు. కాదు కాదు. పౌలుగారు చెబుతున్నారు చూడండి. "నేను మీయొద్దకు వచ్చినప్పుడు ఒక మంచి ఆశీర్వాదమును, క్రీస్తుకు సంబంధించిన ఆశీర్వాదమును మీ దగ్గరకు తీసుకుని వస్తాను". ఏమిటా ఆశీర్వాదం? ఫుట్‌నోట్‌లో క్రింద వ్రాయించారు చూడండి. "క్రీస్తు సువార్తాశీర్వాదం". చిన్నదిగా ఉందా ఆ మాట? చులకనగా ఉందా ఆ మాట? ఏమిటండి, సువార్తాశీర్వాదమున్నదా యేసుక్రీస్తు దగ్గర? ఇప్పటివరకు యేసుక్రీస్తు దగ్గర ఏవేవో ఉన్నాయనుకున్నారు. యేసుక్రీస్తు దగ్గర ఉన్నది ఇదా? అవును. అదే మీకు బ్రతుకునిస్తుంది. అర్థాంతరముగా మీ దేహాన్ని మీరు విడిచి పెడితే, సువార్త ఆశీర్వాదము అనేది మీకు లేకపోతే, మీ ఆత్మ ఎలాంటి భయంకరమైన పరిస్థితులలోనికి వెళ్ళిపోతుందో తెలుసా? నిత్య నరకాగ్నికి బలై పోతుంది. వేదన అనుభవిస్తుంది. ఇప్పటికే ఎంతోమంది ఈ గొప్ప ఆశీర్వాదము లేకుండా, ఈ భూమిని విడిచి వెళ్ళిపోయారు.

ఈ భూమి మీద బ్రతుకంటారా... మీరు లక్షరూపాయలు సంపాదించినా అదే అన్నం ముద్ద తింటారు, వంద రూపాయలు సంపాదించినా అదే అన్నం ముద్ద తింటారు. అది దేవుడు తీసిన గీత. దానికంటే ఎక్కువగా మీరు తినడానికి లేదు. నా ఆస్తి బాగా పెరిగిపోయింది, ఇకనుంచి నేను రెండు కంచాలు తింటాను ఎవరైనా అంటారా? నా ఆస్తి అమాంతం పెరిగిపోయింది, నేను ఇక నుంచి రెండు చొక్కాలు వేసుకుంటానని ఎవరైనా అంటారా? నా ఆస్తి బాగా పెరిగిపోయింది, ఇప్పుడు నేను మేడ మీద మేడ, మేడ మీద మేడ, మేడ మీద మేడ అలా...పైపైకి కట్టేస్తాను అంటారా? అప్పుడది పేకమేడలా కూలిపోతుంది. తప్పుగా ఆలోచిస్తున్నావు నీవు. తప్పుగా ఆలోచిస్తున్నదీ మానవజాతి! మీరు ఈ భూమి మీద బ్రతుకు విషయములో ఆలోచిస్తే, అన్నవస్త్రాలు కలగినవారుగా ఉండటంలో తప్పులేదు. దేవుడు వాటిని అనుగ్రహిస్తున్నాడు. మీరు దేవుని కోరుకోవలసింది కేవలం అవి మాత్రమే తప్ప, ఆస్తులు కాదు. ఆస్తిని దేవునియొక్క ఆశీర్వాదమని అనుకోకూడదు. మీకు దేవుని వాక్యము అర్థమయిందా? దేవుని వాక్యమును అంగీకరించగలుగుతున్నారా? అయితే మీకు ఆ ఆశీర్వాదము ఉన్నట్టే! ఎవరినోచూసి వారికున్నంత ఆస్తి నా దగ్గరలేదండి. కనుక ఆశీర్వాదము నా దగ్గర లేదేమోనని అనుకొని భ్రమపడకండి. మీరు నిజముగా అన్నవస్త్రములు గలవారై దేవుని వాక్యాన్ని అంగీకరించి, ఆ దేవుని వాక్యాన్ని నమ్మగలిగితే, మీకు సువార్తాశీర్వాదము అనేది ఏమిటో తెలిస్తే, ఆ దేవుని ఆశీర్వాదాన్ని పొందగలిగితే, నిజంగా మీరు ధన్యులు. భూమిమీద ఆస్తులే సంపాదించుకొని, ఏదేదో కోరుకుంటున్నాను అనుకున్నారా? అయితే అది దేవుని ఆశీర్వాదము కాదు! దానివలన మీరు సరాసరి వెళ్ళేది నిత్య నరకాగ్నికి తప్ప, దేవుడున్న లోకానికి కాదు. అందుకే పౌలు ఆ సంఘానికి లేఖ వ్రాస్తూ ఏమన్నాడో తెలుసా? నేను మీ యొద్దకు వచ్చినప్పుడు క్రీస్తు యొక్క ఆశీర్వాదమును మీ యొద్దకు తీసుకుని వస్తాను. అదే

సువార్తాశీర్వాదము. దీనిని మీకు అందించగలిగితే, దీనిని మీరు స్వీకరించగలిగితే మీ ఆత్మ రక్షించబడుతుంది. అదే దేవుడిచ్చు ఆశీర్వాదము. ఆ అర్హత పొందడానికి మీరు నిరంతరము భయభక్తులు చూపించాలి. దేవుని బలిష్ఠమైన చేతిక్రింద దీనమనస్కులై బ్రతకాలి. అప్పుడు ఆ అర్హత కలిగిన మీకు ఆయన ఆశీర్వాదాన్ని ఇచ్చి మిమ్మును ఆయనున్న లోకానికి ఆహ్వానిస్తాడు. అదే బైబిల్ గ్రంథంలో వ్రాయబడిన దేవుని ఆశీర్వాదము.

**గలతీయులకు 3 : 8** "దేవుడు విశ్వాస మూలముగా అన్యజనులను నీతిమంతులుగా తీర్చునని లేఖనము ముందుగా చూచి – నీయందు అన్యజనులందరును ఆశీర్వదింపబడుదురు అని అబ్రహామునకు సువార్తను ముందుగా ప్రకటించెను". అబ్రహాముకు దేవుడు ఆశీర్వాదము ఇచ్చేసాడు. అబ్రహామును ఆశీర్వాదముగా మార్చేసాడు అని మీరు నేర్చుకున్నారుగా. అబ్రహాముకు ఇవ్వబడిన ఆశీర్వాదము చూడండి. అతని ద్వారా సమస్త జనులు ఆశీర్వదింపబడునని దేవుడు అన్నాడంటే, ఆయన ప్రణాళికలో ఉన్న ఆ మాట వెనుక అంతరార్థం చూడండి. అబ్రహాముకు దేవుడు ముందే ఆ సువార్తను ఇచ్చాడు, ముందే ప్రకటించాడు. ఆ సువార్త ఆశీర్వాదాన్ని అబ్రహాముకు అనుగ్రహించాడు. ఈ రోజు మీకు కూడ అనుగ్రహించాలనుకుంటున్నాడు. ఆయన దగ్గర మీరు కోరుకోవలసినది, అతి ప్రాముఖ్యమైనటువంటి ఆశీర్వాదము, దీవెన, కోరిక – సువార్తాశీర్వాదమే!

నన్ను సువార్త ఆశీర్వాదముతో దీవించు తండ్రి, ఎందుకంటే నా బ్రతుకు ముగించిన తరువాత మీరున్న లోకమే నేను చేరాలి, మీ కుమారునిగా రావాలి, ఆ స్వర్గాన్ని నేను చేరుకోవాలి అని మీరు అనుకోకలుగుతున్నారా? ఈ భూమి మీద బంగారమా? ఈ భూమి మీద చిన్న చిన్న వస్తువులా? తిండి పదార్థాలా? అవి కాదు తండ్రీ, ఈ లోకాన్ని విడిచి వెళ్ళిన తరువాత, నీవున్న మహాలోకాన్ని నేను పొందాలి. నీ కుమారునిగా నేను బ్రతకాలి. ఆ సువార్వాశీర్వాదము నేను పొందాలని మీరు ఎప్పుడైనా దేవునికి ప్రార్థించగలిగారా? అదే దేవుడు తన గ్రంథములో వ్రాయించాడు. ఆ ఆశీర్వాదానికి మీరు అర్హులేనా? మీకు మీరుగా ప్రయత్నించండి. నిజముగా దైవాశీర్వాదానికి అర్హుడినేనా? దేవుని ఆశీర్వాదము నా దగ్గర ఉందా? ఆయన అనుగ్రహించిన ఆశీర్వాదమే కనుక లేకపోతే భూమి మీద కూడా ఎవ్వరూ సరిగా బ్రతకలేరు. ఆయన చిత్తము ఉండాలి. ఆయన అంగీకారము తెలపాలి. ఆయన సెలవుండాలి. భూమిమీద సుఖంగా, సంతోషంగా ఆయన వాక్యములో ఆనందిచాలన్నా కూడా ఆయన అంగీకారమును తెలపాలి. సాధారణంగా మనచుట్టూ ఉన్నటువంటి ఈ లోకంలో ఎవరిదైనా ఒక పుట్టినరోజు కార్యక్రమము వచ్చిందంటే కేకులు కట్ చేస్తూ, చాక్లెట్లు పంచిపెడుతూ అందరిచేత ఆశీర్వాదాలు పొందడానికి పెద్దల దగ్గరకు వెళుతూ ఒకొక్క జన్మదినాన్ని వారు చాలా ఆనందోత్సాహాలతో జరుపుకోవడం మనము చూస్తున్నాము. ముఖ్యంగా చిన్నపిల్లలలో ఈ జన్మదిన వేడుకలు మనము చూస్తాము. ఈ రోజు మన రాష్ట్రములో కావచ్చు, దేశంలో కావచ్చు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న చాలా దేశాలలో కావచ్చు. గొప్ప గొప్పవారిగా పిలవబడుతున్న వారు సైతం వారి యొక్క జన్మదినాన్ని చాలా ఆడంబరముగా ఆకాశాన్ని అంటుతున్నట్లుగా జరుపుకోవడం మనం చూస్తూనే ఉన్నాం. కానీ యేసుక్రీస్తును నమ్మినవారికి వాక్యములో వ్రాయబడినటువంటి దేవుని మాట, ఎలా బ్రతకాలో నిర్దేశించింది. ఒక మార్గాన్ని చూపించింది. దానినిబట్టి, మీరేమి చేసిననూ మాటచేతకాని, మీ క్రియచేతకాని, మీ సంతోషాన్ని వ్యక్తపరిచినా, మీ దుఖాన్ని వెళ్ళబుచ్చినా, ఈ భూమి మీద మీరు ప్రతీ సందర్భములో ఆ కార్యక్రమమును, ఆ సంతోషమును, ఆ దుఖమును ప్రభువైన యేసుక్రీస్తు నిమిత్తమే చేయండి అన్నాడు మరియు ప్రభువైన యేసుక్రీస్తు పేరట చేయండి అన్నాడు. కనుక ఇకమీదట మీరుగాని, మీ పిల్లలుగాని పుట్టినరోజులు జరుపుకుంటే, ఒక్కసారి ఆలోచించండి. మీకు మనుష్యుల ఆశీర్వాదము కంటె దేవుని ఆశీర్వాదమే మిన్న. ఆ దైవాశీర్వాదము మీరు పొందాలంటే, మీ కార్యక్రమాలను క్రీస్తు నిమిత్తము చేయండి. ఆ కార్యక్రమాల ద్వారా యేసుక్రీస్తు ఘనతను లోకానికి తెలియజేయండి. అప్పుడు మీ పరలోకపు తండ్రి మిమ్మునుబట్టి తప్పక సంతోషిస్తాడు. ఆయన ఆశీర్వాదమును గూర్చి వ్రాయించిన మరొక ముఖ్యమైన సంగతిని చూడండి.

**కీర్తనలు 115 : 12** "పిన్నలేమి పెద్దలేమి యెహోవా యందు భయభక్తులు గలవారిని యెహోవా ఆశీర్వదించును". ఆయన ఆశీర్వాదము ఎవరికిస్తున్నారో చూడండి. ఆయన పిన్నలనేమి, పెద్దలనేమి యెహోవా

యందు భయభక్తులు గలవారు... అన్నాడు అందుకే! అబ్రహాముతోపాటు భూమి మీద నీతిమంతులందరూ యెహోవాయందు భయభక్తులు చూపించినవారే. ఇప్పుడున్న నామకార్ధ క్రైస్తవ భక్తులదీ ఒక భక్తేనా? ఎల్లప్పుడూ దేవుణ్ణి అదే పనిగా అడుగుటయేనా నీ భక్తి? ఎల్లప్పుడూ ఆశీర్వాదము కావాలి అని కోరుకోవడమేనా నీ ప్రార్ధన? కాదు, అలా ఉండకూడదు. మొట్టమొదట దేవునియందు భయభక్తులు నేర్చుకోవాలి. మొట్టమొదట వాక్యానికి లోబడాలి. అప్పుడు నీవు చిన్నపిల్లాడివైనా, నీవు వృద్ధుడవైనా నిన్ను ఆశీర్వదించడానికి దేవుడు సిద్ధముగా ఉన్నాడని వ్రాయబడిన మాటను చూడండి. పిన్నలనేమి, పెద్దలనేమి ఆయన ప్రతి ఒక్కరిని ఆశీర్వదిస్తున్నాడు. ఆ ఆశీర్వాదముతోనే మీరు ఆ మహాలోకాన్ని చేరుకోవాలి. ఆ దేవుని ఆశీర్వాదము, క్రీస్తుయొక్క సువార్తాశీర్వాదము లేనివారందరు శాపగ్రస్థులు. ఆ శాపగ్రస్థులందరూ పాతాళానికి పోవాలి. నిత్యనాశనము వారికొరకే ఎదురు చూస్తుంది. వారికి దేవుడున్న ఆ మహాలోకాన్ని పొందే అవకాశమే లేదు. మంచి, చెడు – ఈ రెండూ మీ ముందు ఉంచాను... మంచి నిర్ణయాన్ని మాత్రమే తీసుకోండి!

ప్రభువునందు నమ్మకస్థుడు,

**జె. మణి కుమార్**

సన్ ఆఫ్ గాడ్ – క్రైస్ట్ చర్చ్ – సామర్లకోట – 8978414178.

## ప్రశ్నలు

1. దేవుని ఆశీర్వాదమును పొందాలంటే ఏమి చేయాలి?
2. సువార్తాశీర్వాదము అనగానేమి? దానిని ఎలా పొందాలి?
3. అబ్రహాము ఆశీర్వాదమును ఎలా సంపాదించుకున్నాడో వివరించండి.
4. ధనవంతులు దేవునివలన ఆశీర్వదింపబడినవారా? కాదా? వివరించండి.
5. ఈ భూమిపై నేటికాలములో దైవాశీర్వాదము కలిగినవారెవరు? లేనివారెవరు? వివరించండి.
6. రంగు రాళ్ళ ఉంగరాలు, యంత్రాలు, వాస్తు, మొదలగునవి ఆశీర్వాదకారకాలా? వివరించండి.
7. దేవుని కుమారుడైన యేసుక్రీస్తు తన పేద బ్రతుకు ద్వారా మనకు ఏమి పాఠాన్ని చెబుతున్నాడు?

## 8. హితబోధను సహింపగలరా?

ప్రియమైన దేవుని జనులారా!

హితబోధ, హితోపదేశము అనగానే బైబిల్ పరిభాషలో ఆరోగ్యకరమైన బోధ అని అర్థము! హితము అనగా ఆరోగ్యకరమైనస్థితికి పర్యాయ పదము. హితుడు అంటే పరిస్థితులను చక్కదిద్దేవాడు, మనకు మంచిని చేసేవాడు, మనకు ఎల్లప్పుడు మేలైన సంగతులను భోదించేవాడు అని అర్థము. ఈ ఆరోగ్యకరమైన బోధను మనుష్యులు సహింపగలరా? అనేది ఇప్పుడు మనము నేర్చుకొనబోవుచున్న ఒక మంచి అంశము. సాధారణంగా ఈ భూమి మీద మనిషి ఎక్కువగా ప్రాధాన్యతను ఇచ్చేది దేనికంటే, ఆరోగ్యానికే! ఆరోగ్యము కొరకు ఎంత ధనమును వెచ్చించి అయినా మనిషి దానిని కాపాడుకోవాలనుకుంటాడు. ఎంత కష్టపడి అయినా ఆరోగ్యముగా ఉండాలనుకుంటాడు. రోగమంటే మనిషికి ఇష్టముండదు. రోగము నుండి ఎప్పుడు విముక్తి లభిస్తుందా అని మనిషి ఎల్లప్పుడు ఆలోచిస్తూ ఉంటాడు. ఆరోగ్యవంతులైన మనుష్యులతో మిగిలిన వారు కూడా సహవాసము కలిగి ఉండటానికి ప్రయత్నిస్తారు. ఈ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మంచి తిండిని తింటారు. ఆరోగ్యాన్ని రక్షించుకోవడానికి మంచి వ్యాయామం చేస్తుంటారు. మంచి మందులు తీసుకుంటారు. ఇవన్నీ మీకు ఎందుకు చెబుతున్నానంటే దేవుని వాక్యములో కూడా ఆరోగ్యముగా ఉండడమనేది చాలా ముఖ్యమైన విషయం. మనిషిగా మనము ఈ భూమి మీదకు వచ్చిన తరువాత మనము ఆరోగ్యవంతులుగా ఉండాలని దేవుడు కూడా కోరుకున్నాడు. అందుకే అసలు రోగమే లేనటువంటి ఒక మంచి ప్రకృతిని మొదటి మానవులైన ఆదాము, హవ్వలకు దేవుడు ఇచ్చాడు. అందులో రోగక్రిమి లేనే లేదు. అదే ఏదేను తోట. దేవుడు ఈ ప్రకృతిని తయారుచేసి, దానిని మంచిది అన్నాడు. భూమి మంచిది, చెట్టు మంచిది, జలచరములు మంచివి, మృగములు మంచివి, ఆకాశ నక్షత్రములు మంచివి, సూర్యుడు మంచివాడు, చంద్రుడు మంచివాడు. ఇలా, మంచిది మంచిది అని దేవుడు చెప్పాడు, అలాగే తయారు చేసాడు. కానీ ఈరోజు ఎండలోనికి వెళితే మన చర్మము నల్లబడిపోతుంది, మనకు చర్మవ్యాధులు వస్తున్నాయి. ఈ ఎండ మంచిది కాదు అనుకొని గొడుగులతో వెళుతున్నాము. వర్షంలో తడిస్తే జలుబు చేస్తుందని భయపడుతున్నాము. భూమి నుండి మొలిచిన పంటను తింటే మనకు ఎక్కడ రోగం కలుగుతుందో అని భయపడుతున్నాము. ప్రకృతిలో చాలామట్టుకు చెడ్డదిగా మారిపోయింది. ఈ ప్రకృతి మానవ జీవనానికి సహకరించడం లేదని అర్థమవుతుంది. ఎందుకంటే ఈ భూమి శపించబడింది. ఈ ప్రకృతి అంతా దేవుని కోపానికి లోనయింది. దేవుని శాపాన్ని పొందినది. అందువల్ల మనిషి ప్రకృతి ద్వారా అనుభవిస్తున్న చాలా వాటి ద్వారా ఈ రోజు నష్టాన్ని కొనితెచ్చుకుంటున్నాడు అని చెప్పవచ్చు. కాని ఒకప్పుడు దేవుడు సృష్టిని కలిగించిన ఆ విధానాన్ని చూస్తే, మంచిదిగా ఉండాలనే సృష్టించాడు అన్నట్టు మనకు కనిపిస్తుంది. అంటే తాను కలిగించిన మంచిదైన ప్రకృతిని మనిషి అనుభవించి, దానిని స్వీకరించి ఆరోగ్యవంతుడుగా బ్రతకాలనేది దేవుని కోరిక. కాని ఆదాము హవ్వలు దానిని ఎంతోకాలం నిలబెట్టుకోలేదు. శాపము పొందిన ప్రకృతిలోనికి వారు గెంటివేయబడ్డారు. శపించబడిన భూమి మీదకు, శపించబడిన ప్రకృతిలోనికి వారిద్దరూ వచ్చేశారు. ఆ తరువాత వారి గర్భము ద్వారా మనము కూడా వచ్చాము. అందుకే వారు ఆనాడు ప్రారంభించిన ఆ పాపానికి, వారు పొందిన ఆ శాపానికి లోనైన వారముగానే మనము ఈరోజు కనిపిస్తున్నాము. అయినప్పటికీ మనము ఈ భూమిపై ఆరోగ్యముగా ఉండాలనే ప్రయత్నిస్తుంటాము. దేవుడు కూడా తన గ్రంథములో వ్రాయించిన కొన్ని మాటలను మనము పరిశీలిస్తే మనిషి ఆరోగ్యవంతుడుగా ఉండాలని, మనిషి వయస్సు పైబడే కొద్దీ ఎదిగే వాడుగా ఉండాలని ఆయన కోరుకుంటున్నాడు.

**లూకా 2 : 52** వ వచనమును మనము చూడగలిగితే, ఆయన కుమారుడైన యేసుక్రీస్తు భూమి మీద శరీరధారిగా ఉన్న దినములలో, ఆయన బాల్య దశలో చిన్న ప్రాయంలో ఉన్నప్పుడు ఆయనను గూర్చి వ్రాయబడిన మాటలలో – "జ్ఞానమునందును, వయస్సునందును, దేవుని దయయందును, మనుష్యుల దయయందును, వీటి అన్నింటిలో యేసు వర్ధిల్లుచుండెను" అని వ్రాయబడినది. యేసుక్రీస్తు జ్ఞానము కలిగినవాడుగా ఎదుగుచున్నాడు, వయస్సులో కూడా ఆయన వర్ధిల్లుచున్నాడు. వయస్సులో అంటే మంచి ఆరోగ్యము కలిగినవాడుగా యేసుక్రీస్తు

భూమి మీద బ్రతుకుచున్నాడు. మంచి ఆరోగ్యము కలిగిన వాడు అనగా రోగము లేనివాడని అర్థం చేసుకోవాలి. ఒక పవిత్రుడుగా, పరిశుద్ధుడుగా దేవుడిచ్చిన ఈ ప్రకృతిలో, ఆయనిచ్చిన శరీరాన్ని కాపాడుకుంటూ, పాపము చేయనివాడుగా యేసుక్రీస్తు బ్రతుకుచున్న ఆ పరిస్థితులను మనము ఆలోచిస్తే, ఆయన వయస్సులో కూడా వర్ధిల్లుచున్నాడు అని వ్రాయబడినది. అంటే దేవుని సంకల్పము మేరకు భూమి మీదకు వచ్చిన ప్రతి మనిషి జ్ఞానములో వర్ధిల్లాలి, వయస్సులో వర్ధిల్లాలి, దేవుని దయలో వర్ధిల్లాలి, మనుష్యుల దయలో కూడా వర్ధిల్లాలి. ఇకపోతే, మనము ఈ లోకము వైపు తిరిగి లోకాన్ని ప్రశ్నిస్తే, అంటే మన చుట్టూ ఉన్న ఈ సమాజాన్ని ప్రశ్నిస్తే, ఆరోగ్యానికి వీరు ఇచ్చే ప్రాధాన్యత ఇంత అంత కాదు. కొంతమంది అయితే మీరు సంపాదించినది అంతా ఖర్చు పెట్టి అయినా, ఆరోగ్యమును కలిగిన వారుగా ఉండాలని అప్పుడప్పుడు చెబుతుంటారు. అందుకే ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు. డబ్బు కాదు, సంపద కాదు, పొలాలు కావు, బంగారము కాదు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే మాటను మనము విన్నాము. అంటే, లోకము దృష్టిలో కూడా ఆరోగ్యము చాలా విలువైనది. బ్రతికినన్నాళ్ళూ రోగములేకుండా బ్రతకాలని, చక్కని ఆరోగ్యంతో మనము ఉండాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు.

ఈ రోజు మనము ఉన్న సమాజంలో ఎన్నో రోగాలు మనుష్యులను పీడిస్తున్నాయి. ఎన్నో వ్యాధులు, ఎన్నో ఆకలి చావులు మనుష్యులను మరణానికి చేరువ చేస్తున్నాయి. అందుకే మనము నివశిస్తున్న ఈ సమాజము దీనిని గూర్చి ఆలోచించి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న మనుష్యులందరి ఆరోగ్యాన్ని పట్టించుకుంటూ, ఒక సంస్థను తయారు చేసుకోవాలనుకున్నారు. ప్రపంచంలో ఉన్న మనుష్యులందరి ఆరోగ్యాన్ని గూర్చి పరిశోధన చేసే, ఆలోచించి మంచి నిర్ణయాలు తీసుకునే ఒక సంస్థను నియమించుకోవాలి అనుకున్నారు. దీనిని బట్టి ఆరోగ్యానికి వీరెంత పెద్ద పీట వేశారో మీకు అర్థమవుతుంది. ఆ సంస్థ పేరే, ప్రపంచ ఆరోగ్య సంస్థ "World Health Organization". క్రీస్తు శకం 1948 వ సంవత్సరం ఏప్రిల్ 7 వ తేదీన దీనిని ప్రారంభించారు. దీని యొక్క ప్రధాన కార్యాలయం స్విట్జర్లాండ్ దేశములో జెనీవా పట్టణంలో ఉంది. అంటే ప్రపంచవ్యాప్తంగా ఉన్న సుమారు 200 దేశాలలో నివశిస్తున్న మనుష్యులకు ఎలాంటి రోగాలు సంక్రమిస్తున్నాయి? ఎంతమంది ఆకలి చావులకు గురి అవుతున్నారు? ఎంతమంది రోగులుగా, ఆరోగ్యము లేనివారుగా బ్రతుకుచున్నారు? ఇన్ని సర్వేలు చేసి, ఆయా దేశాలకు ఔషధాలు పంపిణీ చేయడం, ఆయా దేశాలకు కొన్ని సూచనలు ఇవ్వడం, ఆయా దేశాల ఆరోగ్యానికి సంబంధించి లేక ఆహారానికి సంబంధించి, వారిని ఈ విషయములో ఆదుకోవడానికి కొన్ని బ్యాంకులకు ఈ ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనలిస్తుంది. మీరు ఫలానా దేశానికి అప్పు ఇవ్వండి అని చెబుతుంది. ఎందుకంటే ఆ దేశములో చాలా ఆకలి చావులు ఉన్నాయి. ఆ దేశానికి మీరు వైద్యం/ఔషధాలు ఇవ్వకపోతే వారు బ్రతకరు. ఆ దేశమంతా నాశనమవుతుందని సూచనలు చేస్తుంటారు. లోకము దృష్టిలో ఈ సంస్థ చాలా గొప్పది. ప్రస్తుతం చైనా దేశమునకు చెందినటువంటి ఒక స్త్రీ (మార్గరెట్ చాన్) దీనికి అధ్యక్షురాలిగా ఉంది. వీళ్ళముందు ఉన్నటువంటి సవాల్ మరియు వారు దేని గురించి నిరంతరము ఆలోచిస్తున్నారంటే, మనుష్యులకు ఎలాంటి వైద్యమును అందించాలి? ప్రపంచదేశాలకు వైద్యం విషయంలో ఎలాంటి మార్గదర్శకాలు ఇవ్వాలి? అనే విషయముపై నిరంతరము శ్రమిస్తున్నారు. ప్రజలందరూ ఆరోగ్యవంతులుగా బ్రతకడమే వీరి ధ్యేయం. ఎన్నో రోగాలు ప్రపంచాన్ని పీడిస్తున్నాయని మీ అందరికి తెలుసు. భారతదేశములో ముఖ్యంగా మన తెలుగు ప్రజల మధ్య, అలాగే మిగిలిన దేశాలలో కూడా ఎబోలా, ఎయిడ్స్, కేన్సర్ అనేటువంటి భయంకరమైన రోగములతో మనుష్యజాతి ఉక్కిరిబిక్కిరి అవుతోంది. అలాగే ఆకలిచావులతో, ఆహారము లేక ఒక పూటే తింటూ బ్రతుకుతున్న ప్రజలు ఎంతోమంది ఉన్నారు. ఈ ప్రపంచంలో పేద దేశాలు (ఆకలితో అలమటించే దేశాలు) ఆఫ్రికా ఖండములో ఎక్కువగా కనిపిస్తూ ఉంటాయి. వీటన్నింటి మీద ఈ ప్రపంచ ఆరోగ్యసంస్థ దృష్టి సారించి ఏమి చేయాలో, ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలో, ప్రజలకు ఎలా మేలు చేయగలమో అని ఆలోచిస్తుంది. ఇక భారతదేశము విషయానికి వస్తే, కాంగ్రెస్ ప్రభుత్వము ఆహారభద్రత విషయంలో పార్లమెంటులో ఒక చట్టం కూడా చేసారు. దేశానికి ఆహారమనేది చాలా ముఖ్యమైనది. మన దేశములో నివసిస్తున్న ఇన్ని కోట్లమంది ప్రజలకు సరిపడే ఆహారమును మనమే పండించుకోవాలి. ఒకవేళ పండకపోతే దిగుమతి చేసుకోవాలి. ఆహారభద్రతను మనము

కాపాడుకోవాలి. మన బడ్జెట్‌లో దాని కొరకు నిధులు కేటాయించాలని ఆలోచించారు. మీరు ఈ విషయాలను అర్థం చేసుకోవాలి. శరీర సంబంధమైన ఆరోగ్యమును గూర్చి మనుష్యులకు ఇంత పట్టింపు ఉందా? అంటే, నిజంగా దానిని గూర్చి మనము చదివితే, ఆలోచన చేస్తే రోజుల తరబడి మనకు విషయాలు లభిస్తుంటాయి. అధికారులు, ప్రభుత్వాలు, రాజ్యాధినేతలందరూ ఆహారము మరియు ఆరోగ్యము విషయములో ఈ రోజు ఇంతగా ఆలోచిస్తున్నారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్.సి.ఐ) గోడౌన్స్‌లో ఆహార ధాన్యాలను నిలువ చేస్తున్నారు. ఎందుకంటే ఎప్పుడైనా మనుష్యులకు కరవు రావచ్చు. అటువంటి పరిస్థితులో మనుష్యుల ఆకలిని తీర్చాలని ఈ రోజు ప్రభుత్వము కూడా ఎఫ్.సి.ఐ. గోడౌన్‌లను అక్కడక్కడ కట్టించడం మనము చూస్తున్నాము. శరీరసంబంధమైన ఆరోగ్యమును గూర్చి అందరూ చాలా ఎక్కువ పట్టింపును కలిగియున్నారు. దీనిని గూర్చి అయితే, మన చుట్టూ ఉన్న ఈ సమాజానికి ఏమీ చెప్పవలసిన అవసరత లేదు. ప్రతి ఒక్కరూ ఈ విషయంలో భద్రముగానే, ఆలోచనాత్మకంగానే ఉన్నారు. ఒకవేళ వారు భద్రత తీసుకొనకపోతే, సరైన ఆలోచనలో వారు లేకపోతే, మంచి నిర్ణయాలు కలిగి లేకపోతే అందరూ రోగాల బారిన పడిపోతున్నారు. అప్పుడప్పుడు అనేకమంది కరువుకాటకాల వల్ల ఒకేసారి మరణించడం కూడా మనము చూస్తున్నాము. ఈ సందర్భములో దేవుడు చెప్పిన మాట ఏమిటంటే, భూమి మీద పుట్టిన నా కుమారులు ఆరోగ్యవంతులుగా బ్రతకాలి. సరైన ఆహారమును తీసుకోవాలి, సరైన వ్యాయామము చేయాలి, సరైన ఆరోగ్యమును కలిగినవారైయుండాలి. ఇలా ఎందుకన్నాడనుకున్నారు? ఈ శరీరముతో దేవునికి ఈ భూమి మీద ఉపయోగముంది. ఈ శరీరాన్ని బట్టే మీరూ, నేనూ మరో లోకాన్ని సంపాదించుకోవాలి. ఈ శరీరముతో ఆయనకు చాలా పని ఉంది. అలాగని ఈ శరీరాన్ని ప్రేమించమని గాని, శరీరము యొక్క వ్యామోహంలో పడమని గాని బైబిల్ ఎప్పుడూ చెప్పలేదు. మనిషి తన శరీరాన్ని మాత్రం కాపాడుకోవాలి. ఎందుకంటే, ఆత్మగా మనము పరలోకానికి వెళ్ళాలంటే, భూమి మీద మనకు ఇవ్వబడిన ఒక గొప్ప సాధనమే ఈ శరీరము.

**రోమీయులకు 12 : 2** "మీరు ఈ లోక మర్యాదను అనుసరింపక, ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమునైయున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలుసుకొనునట్లు మీ మనసు మారి నూతనమగుటవలన రూపాంతరము పొందుడి" అంటున్నాడు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మనుష్యులందరు మంచి దేహాన్ని, ఆరోగ్యవంతమైన జీవితాన్ని కోరుకున్నారు. కాని ఈ ఆరోగ్యమెందుకో ఎప్పుడైనా ఆలోచించారా? ఉదయాన్నే 5 గంటలకు అలారం పెట్టుకుంటారు. చిన్నపిల్లలు, స్త్రీలు, పురుషులు, వృద్ధులు... అందరూ లేచి వీధులలో, రోడ్లపై, ఒక రైలు బండి మాదిరిగా పరిగెడుతున్నారు. 6 లేదా 7 గంటలకు తిరిగి ఇంటికి వస్తున్నారు. దేనికిదంతా? డాక్టరు గారు షుగరు ఎక్కువ అయిపోయింది, బి.పి.ఎక్కువైపోయింది కనుక నీవు ప్రొద్దున్నే లేవాలి, నడవాలి, వ్యాయామం చేయాలని చెప్పారు. చూడండి! ఆరోగ్యం విషయంలో చాలామంది ఈ రోజు ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కాని ఎందుకు? ఎందుకు ఈ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి? మంచి దేహము మీకు ఎందుకు ఉండాలి? దీనికి సమాధానము కావాలంటే, మీ యొక్క మనస్సు రూపాంతరం పొందాలి. **రోమీయులకు 12 : 1** వచనములో అసలు ఎందుకు మీ మనస్సు రూపాంతరాన్ని పొందాలంటున్నాడో, ఎందుకు క్రొత్త తరహాలో ఆలోచించమంటున్నాడో మీకు అర్థమవుతుంది. కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమును బట్టి మిమ్మును బతిమాలుకొనుచున్నాను. అంటే శరీరముతో దేవునికి ఉపయోగముందా? ఖచ్చితముగా ఉంది. ఈ శరీరముతోనే అసలుసిసలైన ఉపయోగం ఉంది. అసలు దేవునికి ఏదైనా ఇవ్వాలని అనుకుంటే, మొట్టమొదట ఆయనకు మన దగ్గర కనిపించేది ఈ శరీరము మాత్రమే. మీరు అర్పించే వస్తువులో లేక పదార్థాలో కావు! లోకము చాలా మోసపోయింది. దేవునికి ఏమి ఇవ్వాలి. నీవు తినేవాటినా? నీవు ఖర్చు పెట్టుకొనేవాటినా? నీవు అలంకరించుకునేవాటినా? ఇవేమీ కాదు ఇవ్వాల్సింది. దేవునికి ఏది ఇవ్వాలో దేవుడే వ్రాయించాడు చూడండి. నా ప్రియ సహోదరులారా, దేవునికి మీరు ఇచ్చేది పరిశుద్ధమైనదిగా ఉండాలి. నీవు తినే తిండి పదార్థము దేవునికి పరిశుద్ధమైనదా? ఎలా చెప్పగలవు? నీవు తినే తిండి నీకు అవసరమైనదే కాని దేవునికి కాదు. దేవుడు నీలాంటి వాడు కాదు. నీలాంటి దేహమును కలిగినవాడు కాదు. నీవలె 60 లేక 70

సంవత్సరాల తరువాత భూమి మీద చనిపోయేవాడు కాదు. మన తాతకు దేవుడు తండ్రే, మనకూ దేవుడు తండ్రే, మన మనవడికి కూడా ఆయనే తండ్రి అవుతాడు. ఎప్పటికీ ఆయనే తండ్రి, ఆయనే ఆత్మ, ఆయనే దేవుడు, నిత్యమూ ఉండేవాడు. మనము భూమి మీద చిన్న చిన్న అరటి పండ్లు, చిన్న చిన్న పటిక బెల్లము, అన్నము, కూర ఇవన్నీ తినేవాళ్ళము. మనము తినేవే దేవునికి పెడదామా? వాటిని దేవుడు ఇష్టపడతాడా? అందుకే దేవునికి ఏది కావాలో మనము పరీక్షించాలి, ఏది కావాలో మనము ఆలోచించాలి. ఆయన ఏమని వ్రాయించాడో చూడండి. కాబట్టి సహోదరులారా మొదట పరిశుద్ధమైనది, రెండవది దేవునికి అనుకూలమైనదిగా ఉండాలి. మీకు అనుకూలమైన ఆహారపదార్థములు, మీకు అనుకూలమైన ధనము, మీకు అనుకూలమైన బంగారము, దేవునికి అనుకూలమో కాదో ఎప్పుడైనా తెలుసుకున్నారా? నేను ఇచ్చేది దేవుడు కోరుకుంటున్నాడా? నేను ఇచ్చేది దేవుడు స్వీకరిస్తున్నాడా? అని ఎప్పుడైనా మీరు ఆలోచించారా? ఆలోచించాలి!

ఉదాహరణకు, మన ఇంటికి ఒక అతిథి వస్తాడు. అతిథి వచ్చినప్పుడు మనము మనకు అనుకూలముగా ఉన్నవన్నీ అతనికి పెట్టకూడదు. అతనికి ఏది కావాలో అడిగి తెలుసుకుని అప్పుడు అతనికి పెట్టాలి. మీరు ఏమి తింటారు? మీకు ఏది ఇష్టం? మీరు ఏ పదార్థములు అంటే మక్కువతో తింటారు? అని మీరు ముందు అడగాలి. అప్పుడు ఆ అతిథి మీకు ఫలానాది తింటానండి, ఫలానాది తిననండి అని చెబుతాడు. అప్పుడు అతడు తినే పదార్థాలను మీరు తీసుకొనివచ్చి మీరు అతనికి పెట్టాలి. ఆ అతిథి ఏవి తినను అన్నాడో, అవి తీసుకునివచ్చి పెట్టారనుకోండి. అప్పుడతడు ఏమీ తినడు. పెట్టినవన్నీ అలాగే మిగిలిపోతాయి, ఏమి తినకుండానే వెళ్ళిపోతాడు. ఎందుకంటే అవి అతనికి ఇష్టం లేదు. అతనికి అనుకూలమైనవే పెట్టాలి. ఇది ఎంత నిజమో, దేవునికి కూడా అనుకూలమైనదే మనము ఇవ్వాలి. అప్పుడే ఆయన దానిని స్వీకరిస్తాడు. ఫలానాది మనకు అనుకూలము అనుకుంటే అవి దేవునికి ఎలా ఇచ్చేస్తాము? మన ఇంటిలో జామకాయలు కాసాయని జామకాయలన్నీ దేవునికి ఇచ్చేస్తే అది దేవునికి అనుకూలమా? మీ ఇంటిలో కాసినవి కనుక, మీకు అనుకూలము కనుక ఇచ్చేస్తారు. కానీ దేవుడు వాటిని తింటాడా? తినడు. దేవుడు మీలాంటి ఆకలి కలిగినవాడు కాదు. అందుకే ఆయన ఏమన్నాడో చూడండి. నా ప్రియ సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవయాగముగా మీ శరీరములను ఇవ్వమన్నాడు. అలా అని శవాలుగా మారిన శరీరములు కాదు. నేను చనిపోయిన తరువాత నా దేహముతో ఇక నేను ఏమి చేసుకుంటాను? నా ఇంటివారు ఏమి చేసుకుంటారు? కనుక దీనిని దేవునికి సమర్పిస్తాను అనకూడదు. ఈ రోజు చాలా మంది అలాగే అనుకుంటున్నారు. అందుకేనేమో, చర్చ్ ఆవరణలో సమాధులు కడుతున్నారు. బ్రతికున్నంతకాలం వారి కోసమే వారు బ్రతుకుతున్నారు. చనిపోయిన తరువాత వారి ఇంటిలోవాళ్ళకు గాని, వారికి గాని శవము అవసరం లేదు గనుక ఈ దేహాన్ని దేవుని దగ్గరకు తీసుకునివెళ్ళి పడేస్తున్నారు. అక్కడ ఆ స్థలంలో వారిని సమాధి చేసేస్తారు. చనిపోయిన తరువాత వారి శవము దేవునికి దగ్గరగా ఉండాలని వారనుకుంటారు. చివరికి నా దేహాన్ని దేవునికి అర్పించేసాను అనుకుంటారు. అందుకే దేవుడు తన గ్రంథములో చాలా తెలివిగా వ్రాయించాడు చూడండి. శరీరాలు ఇమ్మన్నాడు కదా అని మీరు ఏమి ఇచ్చేస్తారో ఆయనకు తెలుసు. చనిపోయిన తరువాత మీ శవాలను ఇచ్చేస్తారు. మీకు చనిపోయిన చేప అయితేనే ఇష్టముండదు. బ్రతికున్న చేపలే కావాలనుకుంటారు. బజారుకి వెళ్ళి చేపలకున్న మొప్పలను తీసి చూస్తారు. తీయగానే తెల్లగా ఉందనుకోండి, ఇది ఎప్పుడు పట్టావు, ఎప్పుడు చనిపోయింది? ఇది నాకొద్దు అంటారు. మరి ఎలా ఉండాలనుకుంటారు. మొప్పలు ఎర్రగా ఉండాలి. ఆ చేప బ్రతికినదై ఉండాలి. అప్పుడు మీరు దానిని ఇష్టంతో కొనుక్కుంటారు. అయితే దేవుడు కూడా ఏమంటున్నాడంటే, నాకు మీరు అర్పించవలసినది – నాకు అనుకూలమైనదిగా, పరిశుద్ధమైనదిగా, సజీవయాగముగా ఉండాలి అంటున్నాడు. ఈ మూడు కండీషన్స్‌తో దేవునికి మీ శరీరములతో పని ఉంది. మనుష్యుల జీవితములు ఆయనకు కావాలి. భూమి మీద దేవుడిచ్చిన ఈ దేహము మీ కొరకు కాదు. అది దేవుని కొరకే ఇవ్వబడినది. దేవుని అవసరతలకు తగ్గట్టుగా ఇవ్వబడినది. అందుకే రెండు కళ్ళు ఆయనే పెట్టుకున్నాడు. ఒక ముక్కును ఆయనే డిజైన్ చేసుకున్నాడు. ఒక నోరును ఆయనే పెట్టుకున్నాడు. ఈ శరీరపు ఆకృతి ఆయనకు అవసరమైనట్టుగా మలచుకున్నాడు. అంతేగాని,

మీకు అవసరమైనట్టుగా కాదు. అందుకే మీరు కావాలని అడుగకపోయినా, మీకు ఫలాన రూపము కావాలని మీరు కోరుకొనకపోయినా, ఆయన అనుకున్నదానిని మీకు ఇస్తున్నాడు. తల్లిగర్భములో రెండు కళ్ళు, ఒక ముక్కు, ఒక నాలుక, ఒక నోరు, దానిలో 32 పళ్ళు... ఇవన్నీ ఎందుకు ఇచ్చాడో తెలుసా? ఇవన్నీ ఆయనకు అనుకూలమైనవి. ఇవన్నీ ఇలాగే ఉండాలని ముందుగా ఎవరు అడిగారు చెప్పండి? ఒక మనిషికి ఖచ్చితంగా ఇన్ని ఎముకలే ఉండాలి. ఇన్ని లీటర్ల రక్తం ఉండాలని, ఇవన్నీ ఎవరు చెప్పారు? ఇది కేవలము దేవునికి అనుకూలమైనది. దేవుడు ఎలా ఇస్తే అలా తీసుకోవాల్సిందే. దేవుడు మూగవానిని అనుగ్రహిస్తే ఆ మూగవానిని స్వీకరించాలి. తప్పదు. ఎందుకంటే ఆ కుమారునికి నోరు ఇవ్వడం దేవునికి ఇష్టం లేదు. అది ఆయనకు అనుకూలమైన శరీరము. అందుకే పరిశుద్ధమును, దేవునికి అనుకూలమును, సజీవయాగముగా ఉన్న మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమును బట్టి మిమ్మును బ్రతిమాలుకొనుచున్నాను. ఇలాంటి సేవ మీకు యుక్తమైనది. ఇలాంటి మనస్సుతో మీరు రూపాంతరమును పొందాలి అన్నాడు. ఇప్పుడు చెప్పండి! ప్రపంచవ్యాప్తంగా అందరూ ఆరోగ్యమును కావాలనుకుంటున్నారు. చక్కగా ఉండాలనుకుంటున్నారు. రోగాల బారిన పడకూడదు అనుకుంటున్నారు. ఇవన్నీ ఎందుకు? ఈ శరీరాన్ని దేవునికి ఇవ్వడానికేనా? కాదు. అపవాది మనుష్యులను ఎలా మోసం చేస్తుందో చూడండి. ప్రజలందరికి నీవు ఆరోగ్యంగా ఉండు కాని, దేవునికి మాత్రం ఆ దేహము ఇవ్వడానికి వీలు లేదు అని చెప్పింది. అందుకే 'ప్రపంచ ఆరోగ్య సంస్థ' వెలిసిన ఎన్నో సంవత్సరాలుగా ఆహారభద్రత మరియు ఆరోగ్యమును గూర్చి పరిశోధనలు జరిగిస్తున్న ఏ ఒక్కరూ, ఇప్పటికీ ఈ దేహము దేవుని కొరకే అని ఎవరికీ చెప్పలేకపోయారు. ఉదయం లేచిన తరువాత వాకింగ్ చేయమన్నారు కానీ నీవు చేసిన ఆ వాకింగ్ ద్వారా వచ్చిన ఆరోగ్యమును దేవుని కొరకు ఉపయోగించాలి అని ఎవరైనా చెప్పారా? బాగా ఆలోచించండి. అంటే ప్రతి విషయములోనూ దేవునికి అన్యాయం జరుగుతుంది. ఈ ప్రజలు దేవునిని మోసం చేస్తున్నారు. ప్రజలందరు దేవుడిచ్చిన ప్రకృతిని అనుభవిస్తూ, ఈ ప్రకృతిలో మంచి ఆరోగ్యమును కలిగినవారుగా ఉండాలనుకుంటూ, చివరకు ఆ దేహమును దేవునికి కాకుండా చేస్తున్నారు. శరీరానికి ఆరోగ్యము అవసరమైనప్పుడు, శరీరముతో బ్రతుకుతున్నప్పుడు ఈ బ్రతుకులో మనము రోగము లేనివారముగా ఉండాలి అనుకున్నప్పుడు, మంచి ఆహారమును స్వీకరించాలనుకున్నప్పుడు, ఆత్మగా ఉన్న మనము ఆత్మకు ఎలాంటి ఆహారమును స్వీకరించాలి, ఎలా ఉండాలి? అన్నదే ఈ పాఠము యొక్క ముఖ్యోద్దేశ్యము. శరీరానికి ప్రకృతిలో ఉన్న పదార్థము కావాలి. శరీరము ఆరోగ్యంగా ఉండాలంటే, శరీరము రోగము నుండి విముక్తి పొందాలంటే ప్రకృతి ఇచ్చినటువంటి వైద్యము కావాలి! మరి ఆత్మకు, అనగా మనలోనున్న శక్తి ఆరోగ్యవంతమైనదిగా ఉండాలంటే, అది మరో లోకానికి వెళ్ళాలంటే భూమి మీద ఆత్మకు పెట్టవలసిన ఆహారమేమిటి? ఆత్మ స్వీకరించవలసిన పానము ఏమిటి? ఆత్మ ధరించుకోవలసిన వస్త్రము ఏమిటి? ఆత్మకు ఎదుగుదల ఏమిటి చెప్పండి? శరీరాన్ని గూర్చి ఇన్ని పట్టించుకున్న మీరు లోనున్న ఆత్మకోసం ఎప్పుడైనా ఆలోచించారా? శరీరముకు ఆహారము, పానము, వస్త్రములు, వైద్యం... ఇలా అన్నీ సమకూర్చుతాము. మన శరీరము ఎదగాలని కోరుకుంటాము. మంచిదే కానీ, ఆత్మకు కూడా తిండి ఉంటుంది, ఆత్మకు కూడా పానము ఉంటుంది, ఆత్మకు కూడా వస్త్రము ఉంటుంది. ఆత్మకు రోగమొస్తే ఔషధము ఉంటుంది. ఆత్మకు కూడా ఎదుగుదల ఉంటుంది. ఇదే ఈ రోజు మనము దేవుని వాక్యములో పరిశోధించబోవుచున్న సంగతి. ఆత్మకు ఇవన్నీ తప్పనిసరిగా ఉంటాయి. ఆత్మ మన దేహముతో పాటు నివశిస్తోంది. ఈ ఆత్మకు కూడా రోగము వస్తుంది. ఈ ఆత్మ రోగము ముదిరితే ఆత్మ మృతమైపోతుంది.

**ఎఫెసీయులకు 2 : 1** "మీ అపరాధముల చేతను పాపముల చేతను మీరు చచ్చినవారైయుండగా" అని ఎవరికి వ్రాసాడు? బ్రతికి ఉన్న ఎఫెసీయులకు వ్రాసాడు. చనిపోయిన శవాలకు వ్రాయలేదు కదా. ఎఫెసు సంఘానికి పౌలు ఏమని లేఖ వ్రాసాడంటే, మీరు ఆత్మ విషయమై చనిపోయినవారు అన్నాడు. ఆత్మ సంబంధముగా ఎఫెసీయులు చనిపోయారంటూ, మీ అపరాధముల చేతను, పాపముల చేతను మీరు చచ్చినవారై యుండగా, యేసుక్రీస్తు తన మాటచేత నమ్మినవారిని చనిపోయినా బ్రతికించాడు అని వ్రాయబడింది. ఎఫెసీ సంఘములో ఉన్నవారిని క్రీస్తుతో కూడా బ్రతికించాడు. ఆత్మకు ఆహారము అవసరం, ఆత్మకు ఎదుగుదల అవసరం, ఆత్మకు వైద్యము అవసరం,

ఆత్మకు పానము అవసరం, ఆత్మకు దేహము అవసరం, ఆత్మకు వస్త్రము అవసరం. దేహానికి ఇవన్నీ ఎలాగో ఆత్మకు కూడా అన్నీ అలాగే కావాలి. దేహానికి అన్నింటిని మీరు ఎలా సమకూర్చుతున్నారో ఆత్మకు కూడా అన్నీ ఇవ్వగలగాలి. మీరు మరణిస్తే ఖచ్చితముగా ఇదంతా కళ్ళకు కట్టినట్టుగా అర్ధమయిపోతుంది. కానీ ఇప్పుడు అర్ధం కాదు. ఆత్మను మీరు చూడలేకపోతున్నారు. లోపల ఉన్న, మిమ్మల్ని నడిపిస్తున్న ఆ శక్తిని మీరు చూడలేకపోతున్నారు. గనుక ఇప్పుడు మీరు అర్ధం చేసుకోవడం చాలా కష్టమే. కానీ, ఒక్కసారి ఈ దేహాన్ని విడిచి పెట్టారనుకోండి, అప్పుడు మీకు ఇవన్నీ తెలిసిపోతాయి. ఎవరూ చెప్పవలసిన అవసరత లేదు. పరీక్ష ఫెయిల్ అయినవాడికి అన్నీ తెలిసిపోతాయి. నేను ఫలానా తప్పు వ్రాసానని వాడికి తెలిసిపోతుంది. మీరు ఇక్కడే, అనగా ఈ భూమి మీదనే దీనిని అర్ధం చేసుకుంటే, దీనిని గూర్చిన అవగాహన కలిగి ఉంటే, నిజముగా మరో లోకానికి దేవుని పిల్లలుగా వెళతారు. ఆత్మకు ఉండే ఆహారము ఏమిటో ఒక్కసారి బైబిల్‌ని అడుగుదాం. అసలు ఆత్మ ఆహారము తీసుకుంటుందా? ఈ ఆత్మకు కావలసిన ఆహారము బజారులో ఎక్కడైనా దొరుకుతుందా?

**యెహెజ్కేలు 2 : 8** "నరపుత్రుడా, వారు తిరుగుబాటు చేసినట్లు నీవు చేయవద్దు" అన్నాడు. ఎవరు తిరుగుబాటు చేసారు? ప్రజలందరు తిరుగుబాటు చేసారు. వారు తిరుగుబాటు చేసినట్లు నీవు చేయొద్దు అన్నాడు. ఆ తిరుగుబాటు ఏమిటంటే, దేవుడిచ్చిన దేహాన్ని మా కొరకే వాడుకుంటాము అని మిగిలిన వారందరూ అంటున్నారు. ఈ ప్రవక్తను మాత్రము అలా ఉండవద్దన్నాడు దేవుడు. నీవు తిరుగుబాటు చేయవద్దు అన్నాడు. దేవుడు నీకు ఇచ్చిన దేహమును ఎలా వినియోగించాలంటే, ఆత్మకు నీవు ఆహారమును పెట్టాలి. "నేను నీతో చెప్పిన మాటను విని నోరు తెరచి నేను ఇచ్చు దానిని భుజించు" అన్నాడు. లోకములో మిగిలినవారందరూ చేసినట్టుగా నీవు చేయవద్దు. అయితే నీవు ఏమి చేయాలి? ఎలా బ్రతకాలి? ఆత్మ జీవము కలిగి ఉండాలంటే, లోనున్న శక్తి ఆరోగ్యవంతమైనదిగా ఉండాలంటే నీవు ఏమి చేయాలి? నేను నీతో చెప్పు మాటలను నోరు తెరచి నీవు వాటినన్నింటిని భుజించాలి అన్నాడు. చూశారా? అంటే ఆత్మ ఆహారాన్ని స్వీకరిస్తుంది. ఆ ఆహారమే దేవుడు చెప్పేమాట! ఈ మాట ఆత్మను బ్రతికిస్తుంది. మీ శరీరానికి కావలసిన తిండి బజారులో అన్ని చోట్లా దొరుకుతుంది. అందులో మంచిపదార్ధములను మీరు తెచ్చుకోవాలి. వాటిని భుజించాలి, ఆరోగ్యవంతులుగా ఉండాలి. దేవుడు కూడా అదే కోరుకున్నాడు. కానీ, మీ ఆత్మను గూర్చి పట్టించుకోరా? ఆత్మకు కూడా మంచి ఆహారము కావాలి. మరల అది తప్పుడు ఆహారము అయిపోకూడదు. శరీరానికి మీరు ఏదిపడితే అది తింటారా? క్రుళ్ళిపోయిన ఆహారమును తింటారా? తినరు. ఎందుకంటే దేహమునకున్న ఆరోగ్యము చెడిపోతుందని భయం. పాడైపోయిన పదార్ధాలను మీరు స్వీకరించలేరు. మీ దేహాన్ని ఆరోగ్యంగా కాపాడుకోవాలంటే మంచి ఆహారాన్ని మీరు స్వీకరించాలి. అలాగే లోనున్న ఆత్మ కూడా ఆరోగ్యవంతముగా ఉండాలంటే మంచి మాటలను మీరు స్వీకరించాలి. అవి పరలోకమందున్న దేవుని మాటలుగా ఉండాలి. మనము వినే అన్ని దేవుని మాటలు నిజంగా దేవుని మాటలు కావు. చాలా వరకు పేరుకు మాత్రమే దేవుని మాటలు. కానీ అవి మీ ఆత్మకు మంచిని చేసేవిగా ఉండవు. బజారులో దొరికే ప్రతి వస్తువు మనకు ఆరోగ్యాన్ని ఇవ్వదు. అన్నీ మంచివి అని చెప్పి మనకు అమ్ముతారు. ఇది చెత్తది, మీరు దీనిని తింటే విరేచనాలు పట్టుకుంటాయి అని ఎవడైనా చెబుతాడా? చెప్పడు. వాడికి డబ్బు కావాలి, వాడిది వ్యాపారం. మీరు వెళ్ళి, మీకు మీరుగా పరీక్షించుకుని తీసుకోవాలి. అది మీ బాధ్యత! అది మంచిదో కాదో మీరే నిర్ణయించుకోవాలి. ఆరోగ్యమును కాపాడుకోవలసిన బాధ్యత మీదే! దేవుడు కూడా, మీ ఆత్మ చక్కని ఆరోగ్యవంతమైనదిగా ఉండాలంటే నా మాటలను మంచివిగా భుజించాలన్నాడు. **యెహెజ్కేలు 3 : 1–** "మరియు ఆయన నాతో ఈలాగు సెలవిచ్చెను. నరపుత్రుడా, నీకు కనబడిన దానిని భక్షించుము". అంటే దానిని తినుము అని అర్ధం. ఈ గ్రంథమును భక్షించి ఇశ్రాయేలీయుల యొద్దకు పోయి వారికి ప్రకటన చేయుము. ఈ గ్రంథము అనగానే దేవుని మాట అని అర్ధం. ఆత్మగా నీవు దీనిని స్వీకరించాలి, నీవు దీనిని తినాలి. అంటే ఈ పళ్ళతో కాదు, ఈ నాలుకతో కాదు. ఆత్మగా నీవు దేవుని మాటలను లోపలికి ఎక్కించుకోవాలని అర్ధం. నీవు ఈ మాటలు అనగా ఈ గ్రంథమును తిన్న తరువాత ఇశ్రాయేలీయుల యొద్దకు పోయి నీవు వాటిని ప్రకటన చేయాలి. యెహెజ్కేలు నోరు తెరువగా దేవుడు ఆ గ్రంథమును ఆయనకు

తినిపించాడు. ఆయన నోరు తెరవడమంటే యెహెజ్కేలు ఆత్మ నోరు తెరిచింది. ఆత్మ నోరు తెరవగానే దేవుడు తినమని ఏమి పెట్టాడు? దేవుని మాటలను పెట్టాడు చూడండి. ఆయన మాటలు అర్థం చేసుకుంటే ఎంత బాగుందో! ఇవన్నీ వింటున్న మీకు క్రొత్తగా ఉంటాయి. ఎందుకంటే ఎక్కడా వీటని అమ్మరు! దేవుని మాటలు కేజీల లెక్కన ఎక్కడ దొరుకుతాయి? దొరకవు. స్వచ్ఛమైన, ఇప్పుడే తయారుచేసిన దేవుని మాటలు ఇవిగో... అని ఎక్కడుందండీ? ప్రపంచానికే ఇది వింత! ప్రపంచానికి ఇది వెఱ్ఱి. ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యక్షురాలు మార్గరేట్ చాన్ కూడా ఈ మాటలు వింటే తెల్లబోతుంది. ప్రపంచంలోని ప్రజలందరి ఆరోగ్యాన్ని కాపాడాల్సిన ఈ దేవుని మాటలు ఆవిడకే తెలియవు. ఈ భూమిపై ఎంత బలిష్టంగా ఉండేవాడయినా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. మంచి మెళికలు తిరుగుతూ డాన్సులు వేసే మైఖేల్ జాక్సన్ కూడా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వీరందరూ ఎంత ఆరోగ్యము కలిగినవారైనా, ఎంత ధనము కలిగినవారైనా, ప్రతి ఒక్కరూ నేల కూలిపోవడం తప్పదు. మనము కూడా అంతే! మరి ఆత్మను గూర్చి ఆలోచించేదెప్పుడు? ఆత్మకు ఆహారమివ్వాలన్న విషయమును పట్టించుకొనేదెప్పుడు?

**యిర్మీయా 15 : 16** "నీ మాటలు నాకు దొరకగా నేను వాటిని భుజించితిని" అని యిర్మీయా అన్నాడు. శరీరసంబంధమైన ఆహారపదార్థములను గూర్చి బైబిల్ ఎన్నడూ మాటలాడలేదు. ఫలాలను తినమని, కూరగాయలను తినమని, ఫలాన రైస్ తినమని, ఫలాన రొట్టె తినమని... వీటిని గూర్చి దేవుడు ఏనాడూ మాటలాడలేదు. దేవుడు ఆత్మ సంబంధమైన ఆహారమును గూర్చి చెబుతున్నాడు. యిర్మీయా ఒక భక్తునిగా, ఒక ప్రవక్తగా, ఒక నీతిమంతునిగా ఏమంటున్నాడో తెలుసా? నీ మాటలు దొరకగా నేను వాటిని భుజించితిని అన్నాడు. ఆత్మ ఆరోగ్యంగా ఉండాలంటే మీరు ఎల్లప్పుడూ దేవుని మాటలు వింటూ ఉండాలి. ఆ దేవుని మాటల ప్రకారము మీరు ప్రవర్తిస్తూ ఉండాలి. మీరు వింటున్న ఆ దేవుని బోధ మంచిదై ఉండాలి. అది హితోపదేశమై ఉండాలి. ఎన్నో పనులు మీరు కలిగి ఉన్నా, ఇంత వరకు మీరు ఈ మాటలు చదవడానికి కారణం, మీ ఆత్మను బ్రతికించుకోవాలనే ఉద్దేశ్యం, ఆత్మను ఆరోగ్యముగా ఉంచుకోవాలనే ఉద్దేశ్యం మీకుంది. అందుకే యిర్మీయా – నీ మాటలు నాకు దొరకగా నేను వాటిని భుజించితిని అంటున్నాడు. ఇంతకీ ఆ మాటలు ఎక్కడ ఉన్నాయని మరల దేవుని గ్రంథమును అడిగితే, **యోహాను 4 : 34** ప్రకారము "యేసు వారిని చూచి నన్ను పంపినవాని చిత్తము నెరవేర్చుటయు, ఆయన పని తుదముట్టించుటయు నాకు ఆహారమైయున్నది" అన్నాడాయన. చూసారా! యేసుక్రీస్తుకు ఆహారము రొట్టెకాదు, చేపకాదు. అవి కేవలం శరీర సంబంధమైనవి. అయితే బైబిల్ ఆత్మ సంబంధముగా మాట్లాడుతుంది, ఆత్మ చాలా ముఖ్యమైనదని ఉద్ఘాటిస్తుంది. గనుక యేసుక్రీస్తు ఆత్మ సంబంధమైన మాటలు చెబుతూ, దేవుని చిత్తము నెరవేర్చుట, ఆయన పనిని ముగించుటయే నాకు ఆహారము అన్నాడు. అదే ఆత్మ సంబంధమైన ఆహారము. ఆయన ఆత్మకు ఆకలి తీరాలంటే ఇప్పుడు యేసుక్రీస్తు దేవుని పనిని ఒక్కొక్కటిగా ముగించాలి. అప్పుడు ఆయన ఆత్మ ఆరోగ్యవంతముగా ఉంటుంది.

**యోహాను 6 : 28** లో "మేము దేవుని క్రియలు జరిగించుటకు ఏమి చేయవలెనని ఆయనను అడుగగా యేసు, ఆయన పంపినవానియందు మీరు విశ్వాసముంచుటయే దేవుని క్రియయని వారితో చెప్పెను". మీరు మొట్టమొదట దేవుని నమ్మాలి. ఆ దేవుడు పంపిన వానిని మీరు విశ్వసించాలి. విశ్వాసము అంటే కేవలము నోటితో ఒప్పుకొనేది కాదు. విశ్వాసము క్రియలతో కూడినది. గనుక ఆయన పంపిన యేసుక్రీస్తునందు మీరు విశ్వాసముంచుటయే దేవుని క్రియ అని వారితో చెప్పెను. మీరు యేసుక్రీస్తును నమ్మాలి. ఆ యేసును నమ్మిన తరువాత ఆ యేసువలె మీరు మారాలి. ఆ యేసుక్రీస్తు వలె మీరు బ్రతకాలి. ఆయన తండ్రి పనిని ముగించి, ఇదిగో నా ఆకలి తీరింది అన్నాడు. అలాగే మీరు కూడా దేవుని పనిని చేసినవారై, యేసుక్రీస్తును నమ్మినవారై మీ ఆత్మకు ఉన్న ఆకలిని తీర్చుకోవాలి. **యోహాను 6 : 32** వ వచనంలో చూడగలిగితే, "కాబట్టి యేసు పరలోకము నుండి వచ్చు ఆహారము మోషే మీకియ్యలేదు". ఒకప్పుడు ఇశ్రాయేలీయులు మన్నా అనే ఆహారమును తిన్నారు. కాని అది పరలోకము నుండి వచ్చిన ఆహారము కాదు. అది ఆకాశము నుండి మాత్రమే కురిసింది. పరలోకము నుండి వచ్చే ఆహారమును మోషే ఇశ్రాయేలీయులకు ఇవ్వలేదు. నా తండ్రియే పరలోకము నుండి వచ్చు నిజమైన ఆహారమును మీకు అనుగ్రహించుచున్నాడు. పరలోకము నుండి దిగివచ్చి, లోకమునకు జీవమునిచ్చునది దేవుడు అనుగ్రహించు

ఆహారమైయున్నదని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను అని వారితో చెప్పెను. కావున వారు ప్రభువా, ఈ ఆహారమును ఎల్లప్పుడు మాకు అనుగ్రహించుము అనిరి. భూమి మీద మొలిచేది శరీరసంబంధమైన ఆహారము. కానీ, ఆత్మసంబంధమైన ఆహారము మీకు కావాలంటే పరలోకము నుండి మాత్రమే రావాలన్నాడు. మా ఆత్మ బ్రతకాలంటే, మా ఆత్మ ఎల్లప్పుడు ఆరోగ్యంగా ఉండాలంటే మాకు ఆ ఆహారమే కావాలంటున్నారు శిష్యులు. అప్పుడు యేసు ఏమన్నాడో చూడండి. **యోహాను 6 : 35** అందుకు యేసు వారితో ఇట్లనెను. "జీవాహారమును నేనే, నా యొద్దకు వచ్చువాడు ఏ మాత్రమును ఆకలిగొనడు. నాయందు విశ్వాసముంచువాడు ఎప్పుడును దప్పిగొనడు". ఎందుకంటే ఎల్లప్పుడు నన్ను వెంబడించేవాడు, నాతో దేవుని పని చేసేవాడు, దేవుని మాటలను వింటాడు. వాడు ఎప్పుడును దప్పిగొనడు. వాని ఆత్మ ఎల్లప్పుడు సంతుష్టిగా ఉంటుంది. ఆరోగ్యవంతముగా ఉంటుంది. అందుకే హితబోధను మీరు కోరుకోవాలి. ఇది ప్రపంచంలో అన్ని చోట్ల దొరికేది కాదు. ఆ రోజు యేసు కాలములోనే ధర్మస్తోపదేశకుల దగ్గర ఇది లేదు. సద్దూకయ్యుల దగ్గర ఇది లేదు. అందుకే వారు యేసును అడుగుచున్నారు. మహాప్రభువా, మాకు ఆ ఆహారము కావాలి. మాకు ఎల్లప్పుడు ఆ పరలోక సంబంధమైన ఆహారము కావాలి. శరీరసంబంధమైన ఆహారము ఎక్కడ పడితే అక్కడ దొరుకుతుంది. ఆత్మ సంబంధమైన ఆహారము మాకు కావాలని వారు అడుగుతున్నప్పుడు యేసుక్రీస్తు ఇచ్చే సమాధానమును చూడండి. అది పరలోకములో నుండి దేవుడు మీకు అనుగ్రహించాలి. మీ పూర్వీకులైన ఇశ్రాయేలీయులు భుజించిన మన్నా కంటే ఇది చాలా శ్రేష్ఠమైనది. ఆ ఆహారమును నేనే అంటున్నాడు యేసుక్రీస్తు. నా యందు మీరు విశ్వాసముంచితే, నా మాటలు మీరు పాటిస్తే, వాటి ప్రకారము మీరు ప్రవర్తిస్తే మీరు ఎప్పుడును ఆకలిగొనరు, మీరు ఎప్పుడును దప్పిగొనరు అంటున్నాడు.

**యోహాను 6 : 36** వ వచనంలో "మీరు నన్ను చూచియుండియు విశ్వసింపకయున్నారని మీతో చెప్పితిని". ఎందుకంటే యేసును చూచిన చాలామంది ఆ రోజు ఆయనను విశ్వసించలేదు. ఈ రోజు కూడా యేసుక్రీస్తును నమ్ముతున్నాము అని చెప్పుకుంటున్న చాలామంది నామకార్థ క్రైస్తవులు ఇంకా ఆయనను నిజముగా నమ్మలేదు. ఎందుకంటే, ఈ నామకార్థ క్రైస్తవులు ఇప్పటికీ యేసుక్రీస్తు క్రియలను కలిగిలేరు. విశ్వాసమంటే కేవలం నోటితో ఒప్పుకోవడం కాదు. విశ్వాసమంటే దేవుణ్ణి కేవలం మన మనసులో ఉంచుకోవడం కాదు. యేసుక్రీస్తు నా మనస్సులో ఉన్నాడు అంటారు చాలామంది. ఉదాహరణకు, నీ భర్త మనస్సులో నీవు ఉన్నావు కానీ నీకొరకు ఆయన ఏమీ చేయడం లేదు. ఎక్కడో ఉన్నాడు, ఎవరికొరకో పని చేస్తున్నాడు. నేను నా భర్త మనస్సులో ఉన్నాను కదా అని ఊరుకుంటావా? లేక ప్రతి రోజు నీ భర్త నీ ఇంటికి రావాలనుకుంటావా? నా భర్త ఎక్కడో దుబాయ్‌లో ఉంటాడు. నా మనస్సులో నా భర్త, నా భర్త మనస్సులో నేను ఉన్నాము కనుక దుబాయ్‌లోనో, కాశ్మీర్‌లోనో ఎక్కడో ఒకచోట ఉండనివ్వండి అనగలరా? జీవితకాలమంతా అక్కడే ఉండనివ్వండి అని అంటారా? మీ భర్త మీ ఇంటిలో ఉండాలి. మీ కళ్ళముందు కనిపించాలి. మీ కోసం, మీ కుటుంబము కోసం పని చేయాలి. మిమ్మును పోషించాలి. మీ కుటుంబ బాధ్యతలు తీసుకోవాలి. అప్పుడే అతడొక మంచి భర్త అవుతాడు కదా. యేసుక్రీస్తును నీవు నమ్మినప్పుడు ఆయన నీ మనస్సులో ఉంటే సరిపోతుందా? ఆ యేసుక్రీస్తును నీవు ఈ లోకానికి చూపించాలి. ఈ లోకములోని అనేకమందికి జీవపు వెలుగుగా, నీలో ఉన్న ఆ యేసును ప్రకటించి అందరికీ ఆయనను తెలియజేయాలి. పుస్తకాన్ని ఇచ్చిన వెంటనే దానిని తినిన యెహెజ్కేలుతో దేవుడు ఏమన్నాడు? నీవు వెళ్ళి ఇశ్రాయేలీయుల దగ్గర దానిని ప్రకటించమన్నాడు. దేవుని మాటలను తిని ఊరుకోకూడదు. తిన్న దానిని నీవు ప్రకటించాలి. అనేకమందికి ఆ వెలుగును చూపాలి. నశించిపోతున్న ఆత్మలు, చనిపోవడానికి సిద్ధంగాఉన్న ఆత్మలు, ఇప్పటికే మృతమైపోయినట్టి ఆత్మల దగ్గరకు వెళ్ళి ఆత్మసంబంధమైన ఆహారాన్ని నీవే ఇవ్వాలి. అదేనండీ యేసు చెప్పాడు. మీరు నన్ను చూశారు, నన్ను వెంబడిస్తున్నారు. నా సూచకక్రియలన్నింటిని మీరు చూస్తున్నారు. నేను చేసే అద్భుతకార్యములన్నింటిని మీరు చూస్తున్నారు, సంతోషిస్తున్నారు, చప్పట్లు కొడుతున్నారు. కానీ, ఇంకా మీలో చాలామంది నన్ను విశ్వసింపలేదు. ఎందుకంటే మీకు నేను ఇంకా సరిగ్గా అర్థం కాలేదు అంటున్నాడు. నన్ను ఆహారముగా మీరు స్వీకరించాలి. నా మాటలను మీరు పాటించగలగాలి. వాటిలోని పరమార్థాన్ని మీరు స్వీకరించాలి. అప్పుడే మీరు హితబోధను

స్వీకరించినట్టు! హితవాక్యమంటే అంత గొప్పది. శరీర సంబంధముగా లోకంలో ఆరోగ్యకరమైన పదార్థాలను మనము తీసుకోవాలంటే ఎంతో కష్టపడతాము అన్ని చోట్లకు వెళ్ళి బేరీజు వేస్తాము. ఫలానాది ఆరోగ్యకరమైనదా? ఇది నాకు మంచిని చేస్తుందా? అని ఆరా తీస్తాము. అలాంటప్పుడు ఆత్మ సంబంధమైన ఆహారముగా ఏదిపడితే దానిని తీసుకుంటారా? ఏది పడితే దానిని మీరు స్వీకరించగలరా? లేదు లేదు. మంచిదానినే మీరు కోరుకోవాలి. మంచి బోధను మీరు ఎన్నుకోవాలి. మీ ఆత్మ ఆరోగ్యంగా ఉండాలంటే 'క్రైస్ట్ చర్చ్ – సామర్లకోట' మాత్రమే మీకు ఈ విధమైన ఆహారాన్ని ఇవ్వగలదు. ఎందుకంటే మిగిలిన చోట్లకు ఎక్కడకు వెళ్ళినా మీ ఆత్మ కుళ్ళిపోతుంది, ఆ తరువాత చనిపోతుంది. ఎందుకంటే వారు పైపైన మాత్రమే నూనె వ్రాస్తారు. అందరూ ఇంత గొప్ప మాటలను మీకు చెప్పలేరు. ఆత్మను బ్రతికించలేరు. ఆత్మకు సరిపడ ఆహారాన్ని మీకు ఇవ్వలేరు. ఈ రోజు ఇలాంటి స్వార్ధపరులు ఎంతమంది లేరు చెప్పండి. ఇక్కడ నా గొప్పతనము కోసమో, చదువుచున్న మీ అందరినీ మోసగించి నాలుగు డబ్బులు సంపాదించడానికో నేను మీకు ఈ మాటలు చెప్పడం లేదు. కేవలము నాలో ఉన్న క్రీస్తును లోకానికి స్వచ్ఛముగా అందించాలనే కోరిక మరియు అందరూ ఆత్మ విషయములో ఆరోగ్యాన్ని కలిగి ఉండాలనే ఆశతోనే, ఈ మాటలను ఇంత ధైర్యముతో వ్రాస్తున్నాను.

ఆనాడు సమాజమందిరములో ధర్మశాస్త్రమును చేతపట్టిన ఎంతమంది బోధకులు లేరు చెప్పండి? కానీ అక్కడున్నవారందరూ యేసునే అడుగుచున్నారు. మాకు ఆ నిజమైన ఆహారము కావాలి. మేము ఆత్మ విషయమై బ్రతకాలి. సమరయ స్త్రీ అలాగే అడిగింది! **యోహాను 4 : 13** యేసు – "ఈ నీళ్ళు త్రాగు ప్రతివాడును మరల దప్పిగొనును". యాకోబు బావిలోని నీళ్ళు త్రాగువాడు మరల దప్పిగొంటాడు. ఎందుకంటే ఆ నీళ్ళు శరీరానికి అవసరము. కానీ నేనిచ్చు నీళ్లు ఈ బావిలోని నీళ్ళ వంటివి కావు. నేనిచ్చు నీళ్లు త్రాగువాడెప్పుడును దప్పిగొనడు అన్నాడు అంటే అదే దేవునిమాట. ఆ దేవునిమాటగా వచ్చిన వాడే యేసుక్రీస్తు. ఆ మాటను స్వీకరిస్తే, ఆ మాట ప్రకారము బ్రతకాలనుకుంటే మీరు ఆత్మ సంబంధమైన దప్పికను తీర్చుకుంటారు. అప్పుడే, ప్రతి ప్రశ్నకు మీ దగ్గర సమాధానము ఉంటుంది. ప్రస్తుతం ఈ లోకములో ఉన్న మనుష్యుల దగ్గర ఏ ప్రశ్నకూ సమాధానము లేదు. ఎందుకంటే వారందరూ ఆత్మసంబంధమైన దప్పికతో ఉన్నారు, ఆకలితో ఉన్నారు. కాని ఆ ఆకలి వారికి అలవాటు అయిపోయి, ఆకలితో ఉన్నారన్న సంగతే వారికి అర్థం కావడం లేదు. మీరు పుట్టిన దగ్గర నుండి ఇప్పటి వరకు ఆకలితో ఉన్నారనుకోండి. ఇంకెప్పటికి ఆకలి అనేది మీకు తెలియదు. ఆకలితో కడుపంతా మొద్దు బారిపోతుంది. ఇక మీకు ఆకలి అనిపించదు. ఇప్పుడు వారినందరిని ఇలాంటి దేవుని మాటలచేత రేపాలి. ఇదిగో నీకు ఆత్మసంబంధమైన ఆకలి ఉంది కానీ నీకు తెలియడం లేదు. నీకు ఆత్మసంబంధమైన దప్పిక ఉంది కానీ నీకు తెలియడం లేదని చెప్పాలి. ఆ ఆకలిని వారికి తీర్చాలంటే మంచి దేవుని మాట కావాలి. నిజంగా వీరందరు దేహాన్ని విడిచిపెట్టగానే వీరెంత పొరపాటు చేసారో వీరికి అర్థమైపోతుంది. దేవునికి ఎంత అన్యాయం చేసారో వీరికి కళ్ళకు కట్టినట్టుగా కనిపిస్తుంది. ఎందుకంటే ఇది దేవుని మాట, ప్రపంచాలను కలిగించిన మాట. ఆ మాటలలో దేవుడు ఎన్నడూ అక్రమమైన దానిని చెప్పడు. ఈ రోజు లోకము నిజమనుకుంటున్న దానిలో ఎన్నో అక్రమాలు ఉన్నాయి. లోకము నమ్ముతున్న పుస్తకాలలో ఎన్నో అసంబద్ధాలు, ఎన్నో అవాస్తవాలు ఉన్నాయి. దేవుని మాటలలో ఇప్పటి వరకు ఒక్క అబద్ధమును కూడా ఎవ్వరూ చూపించలేకపోయారు. ఎందుకంటే అది ఆత్మకు ఆహారాన్ని ఇచ్చేది, ఆత్మకు ఆరోగ్యాన్ని కలిగించేది, మరణిస్తే మరో బ్రతుకునిచ్చేది. ఆయనిచ్చు నీళ్ళు త్రాగువాడు ఎన్నడును దప్పిగొనడు. ఆయన వానికిచ్చు నీళ్ళు నిత్యజీవమునకై వానిలో ఊరెడి నీటి బుగ్గగా ఉండును. ఒక్కసారి యేసుక్రీస్తు మీలోనికి ప్రవేశించాడంటే, మీరు యేసుక్రీస్తు రూపాన్ని ధరించుకుంటే మీరు ఏ సబ్జెక్ట్ తీసినా, దానికి మీరు వివరణను ఇవ్వగలరు. ఎందుకంటే మీలో నుండి జీవపు నీళ్ళు ఊరెడి నీటిబుగ్గగా బయటకు ఉబుకుతూ వచ్చేస్తాయి. ఎందుకంటే దేవుడు మీకు ఆ వరమును ఇస్తాడు. మొదట మీరు ఆయనను ప్రేమించాలి. మీ ఆత్మకు ఆకలి తీర్చమని అడగాలి. మీ ఆత్మకు దప్పిక తీర్చమనాలి. అప్పుడు దేవుడు మీకు ఎలాంటి వరాన్ని అనుగ్రహిస్తాడంటే, యేసుక్రీస్తు అనే వరాన్ని ఇస్తాడు. ఆయనే గనుక మీతో ఉంటే, ఆయన మాటలు ఎల్లప్పుడు మీలో నుండి లోకములోనికి వెళ్ళాలి, ప్రకటింపబడాలి.

మీతో ఆయనకు సంబంధము ఉన్నంతకాలము, మీ తండ్రి మిమ్మును కుమారునిగా చూచినంత కాలము మీ ద్వారా లోకానికి వాక్యాన్ని ప్రకటింపచేస్తూనే ఉంటాడు. ఇదే ఆయన మాటలలోని పరమార్ధము. ఆయన వాక్యము మీలో ఊరెడి నీటి బుగ్గగా ఉంటుంది. ఆయనిచ్చు నీళ్ళు అంత గొప్పగా ఉంటాయి. కానీ వాటిని ఎవరు స్వీకరించారు? వాటిని ఎవరు కోరుకుంటున్నారు? ఎవరు కావాలనుకున్నారు? అందరూ త్రోసివేసేవారే కదా! ఆత్మకు ఎందుకు? శరీరానికి ఏమైనా ఉంటే చెప్పండి అంటారు. ఎన్ని మాటలు విన్నా తిరిగి మరలా ఏమంటారు? శరీరానికి ఏమైనా ఉపయోగముంటే చెప్పండి. శరీరానికి ఏమైనా సూత్రాలు ఉంటే చెప్పండి. ఆరోగ్యానికి 60 సూత్రాలను ప్రొద్దున్నే 6 గంటలకు టి.వి.లో చూసేస్తున్నారు. ఆరోగ్యానికి 60 సూత్రాలనూ నేర్చుకుని శరీరసంబంధమైన ఆరోగ్యాన్ని కలిగి ఉండండి, నేను కాదనడం లేదు. కాని అది కొద్దికాలము మాత్రమే. మీకు ముఖ్యముగా ఉండాల్సింది ఆత్మ సంబంధమైన ఆహారము. ఎందుకంటే ఆత్మ నశించిపోకూడదు. ఇక శరీరమంటారా, ఇది భూమి మీద కేవలం కొన్నాళ్ళు మాత్రమే బ్రతికేది. ఆత్మ నిత్యమూ ఉండేది. అది ఒక శక్తి స్వరూపము. ఆత్మ దేవునిలో నుండి వచ్చినది. అది నిత్యనాశనానికి వెళ్ళిపోకూడదు. మూడవ లోకమైన పాతాళానికి వెళ్ళిపోకూడదు. ఆత్మ పైనున్న ఊర్ధ్వలోకానికే వెళ్ళాలి. ఇక ఈ ఆత్మకు వస్త్రాలను గూర్చి దేవుడు చెబుతున్నాడు చూడండి.

**ఎఫెసీయులకు 6 : 13** "అందుచేతను మీరు ఆపద్దినమందు వారిని ఎదిరించుటకును, సమస్తము నెరవేర్చినవారై నిలువబడుటకును, శక్తిమంతులగునట్లు దేవుడిచ్చు సర్వాంగకవచమును ధరించుకొనుడి". ఈ సర్వాంగకవచము, అనగా ప్రతి అంగాన్ని కప్పే కవచము ఏమిటి? అదే దేవుని వాక్యము. దేవుని వాక్యమే అన్నింటికి సమాధానం. ఆకలి తీర్చడానికైనా, దప్పిక తీర్చడానికైనా, వస్త్రముగా మిమ్మును కప్పడానికైనా దేవుని వాక్యమే అని అంటున్నాడు. ఆపద్దినమందు మీరు వారిని ఎదిరించాలంటే శక్తివంతులుగా నిలబడాలంటే వాక్యాన్ని మీరు సర్వాంగకవచముగా ధరించుకోవాలి. పైనుండి క్రింద వరకు మీరు ధరించుకోవలసిన వస్త్రమది. ఈ సర్వాంగకవచమును మీరు ధరించుకోండి. అప్పుడు దుష్టుడు మిమ్మును ఏమీ చేయలేడు. మీ దగ్గర దేవుని వాక్యము ఉన్నప్పుడు, వాడు తన కుయుక్తి గల తన మాటల చేత మిమ్మును దేవునికి దూరం చేయలేడు. అదే వాక్యము మీ దగ్గర లేకపోతే, దానిని వస్త్రముగా మీరు ధరించుకొనకపోతే, అపవాదియైనవాడు ఒక చిన్న చెడు మాట ద్వారా మిమ్ములను పాతాళానికి వాడితో పాటు ఈడ్చుకొని పోతాడు. నరకానికి తీసుకొని వెళ్ళిపోతాడు. వాడు చాలా ప్రమాదకారి. మోసకరమైన మాటలచేత మిమ్మును దేవునికి దూరం చేసేస్తాడు. అలా దూరం కాకుండా ఉండాలంటే మీరు దేవుని వాక్యమనే సర్వాంగకవచము చేత ధరింపచేయబడాలి. **ప్రకటన 19 : 13** "రక్తములో ముంచబడిన వస్త్రము ఆయన ధరించుకొని యుండెను". ఆ వస్త్రము రక్తములో ముంచబడిన వస్త్రము, దానినే ఆయన ధరించుకుని యుండెను. రక్తములో ముంచబడిన వస్త్రము అంటే అది శరీరానికి కాదు. తన శరీరానికి ఎప్పుడైనా యేసుక్రీస్తు రక్తములో ముంచబడిన వస్త్రాలు వేసుకున్నాడా? అలా వేసుకోడు. రక్తములో ముంచబడిన వస్త్రము అనగా అది ఆత్మకు సంబంధించినది. అంటే ఆత్మ ఎల్లప్పుడు సహోదరుని కొరకు ఆలోచిస్తూ, సహోదరునికి వాక్యమును చెప్పడానికి ప్రయత్నిస్తూ ఎల్లప్పుడూ రక్తమును అర్పిస్తూ, ఎర్రనిదిగా కనిపించాలి. అంటే ఎల్లప్పుడూ శ్రమలలో ఉండేది అని అర్థం. దేవుని కొరకు శ్రమలు అనుభవించేదిగా కనిపించేదని అర్థం. రక్తములో ముంచబడిన వస్త్రమంటే అదే! అదే ఆత్మసంబంధమైన వస్త్రము. మీకెప్పుడైన తెలుసా? ఆత్మకు ఆహారముందని, ఆత్మకు పానముందని, ఆత్మకు వస్త్రముందని? తెలుసుకోవాలండి. ఇది మిమ్మును గూర్చినదే. మీలో ఉన్న ఆత్మ, మీరైయున్నారు. ఆ ఆత్మకు సంబంధించిన ప్రతి విషయము, ప్రతి సందర్భము మీకు తెలియాలి. అప్పుడే మీ ఆత్మ రక్షింపబడుతుంది. దేవుడు ఈ మాటలను మరొక సందర్భంలో వ్రాయించాడు. **ప్రకటన 16 : 16** "ఇదిగో నేను దొంగవలె వచ్చుచున్నాను. తాను దిగంబరముగా సంచరించుచున్నందున జనులు తన దిసమొలను చూతురేమో అని మెళకువగా ఉండి తన వస్త్రమును కాపాడుకొనువాడు ధన్యుడు". మిగిలిన వారందరూ వస్త్రము లేకుండానే తిరుగుతున్నారు. ఈ రోజు ఆత్మకు వస్త్రాలు లేకుండా లోకమందు అనేకమంది బ్రతుకుచున్నారు. అలాంటప్పుడు దేవుడు ఏమన్నాడో తెలుసా ? మీ దిసమొలను కప్పుకోవాలి అన్నాడు. అదే ఆత్మ సంబంధమైన వస్త్రము. ప్రతి విషయములో దేవుడు మీకు జాగ్రత్తలు చెబుతున్నాడు. దేవుని వాక్యము

కలిగిన వారుగా, సమాజములో చెడును ద్వేషించేవారుగా మీతో పాటు ఉన్న సహోదరులను కొంతమందిని అయినా అగ్నిలోనుండి లాగి రక్షించేవారుగా అటువంటి మనస్సు మీకు ఉంటేనే మీరు మీ ఆత్మకు వస్త్రములు కలిగినవారు. అలా లేనివారిని చూచిన దేవుడు, వారు దిగంబరులుగా పోతున్నారు అన్నాడు. దేవుని వాక్యమనే ఆ వస్త్రాన్ని మీ ఆత్మకు ధరింపచేసుకుని ఎల్లప్పుడు వస్త్రము కలిగిన వారుగా మీరు ఉండాలి. రాజులుగా ఉండాలి, పరిశుద్ధులుగా ఉండాలి, యాజకులుగా ఉండాలి, దేవుని సొత్తు అయిన ప్రజలుగా ఉండాలి. ఆత్మగా మీరు ఇన్ని విషయాలలో జాగ్రత్తలను తీసుకోవాలి.

**1 పేతురు 2 : 2** "సమస్తమైన దుష్టత్వమును, సమస్తమైన కపటమును, వేషధారణను, అసూయను, సమస్త దూషణ మాటలను మాని, క్రొత్తగా జన్మించిన శిశువులను పోలినవారై నిర్మలమైన వాక్యమను పాలయను రక్షణ విషయంలో ఎదుగు నిమిత్తము, ఆ పాలను అపేక్షించుడి". ఆహారము, పానము, వస్త్రము ఇవన్నీ కలిగిన మీరు, మీ ఎదుగుదలను కూడా చూసుకోవాలి. ఒకవేళ తల్లిదండ్రులకు పుట్టిన పిల్లలు ఎదగకుండా, మరుగుజ్జుగా, ఐదేళ్ళు వచ్చినా, పదేళ్ళు వచ్చినా ఇంకా అంతే ఉంటే వారెంతో వేదన పడతారు. ఆసుపత్రికి తీసుకువెళతారు. తిండి తింటున్నాడు కాని ఎదగడం లేదు. మానసిక ఎదుగుదల లేదు, శరీర సంబంధమైన ఎదుగుదల లేదని మీరు మీ బిడ్డల విషయమై చాలా బాధపడతారు. చాలా వేదనకు గురి అవుతారు. నా కొడుకు ఎదగడం లేదు, నా కూతురు ఎదగడం లేదని విచారిస్తారు. ఇక్కడ దేవుడు ఏమి అంటున్నాడో తెలుసా? మీరు ఆత్మ సంబంధముగా కూడా ఎదగాలి అన్నాడు. మీరు దేవుని మాటలను వినాలి. ప్రకటింపబడుతున్న జీవము కలిగిన దేవుని ఆహారాన్ని మీరు స్వీకరించాలి. అప్పుడు మీరు ఎదుగుతారు. నాకు అంతా తెలుసని మీరు ఇంట్లో కూర్చుంటే మీకు ఏమీ రాదు. అలా అయితే ఆత్మ చాలా బలహీనదశకు వెళ్ళిపోతుంది. ఆత్మ ఆరోగ్యవంతముగా ఉండాలంటే మీరు దేవుని మాటను చదవాలి, వినాలి, నేర్చుకోవాలి. ఆ తరువాత ఆయనను ప్రకటించాలి. పేతురు అదే వ్రాస్తున్నాడు. మీరు ఈ లోకసంబంధమైన వీటన్నింటిని మాని, క్రొత్తగా జన్మించిన బిడ్డలను పోలినవారై నిర్మలమైన వాక్యమను పాలను తీసుకోవాలి. ఒక్కోసారి పాలు కల్తీగా ఉంటాయి. కనుక అన్ని పాలను తీసుకోవద్దు అన్నాడు. ఆలోచించండి. పిల్లల ఆరోగ్యం పాడైతే, డాక్టరు దగ్గరకు వెళతాం. మీ బిడ్డకు ఏ పాలను పట్టిస్తున్నారని అడుగుతాడు. అప్పుడు డాక్టర్ స్వచ్ఛమైన ఆవు పాలు, గేదె పాలు ఇవ్వండి. పిండి పాలు పట్టిస్తే లేనిపోని రోగాలు వచ్చేస్తాయి. శిశువుకు మంచి పదార్థమును పెట్టమంటాడు. ప్రిస్క్రిప్షన్ వ్రాస్తాడు. లేదంటే రోగాలు వచ్చేస్తాయి. పేతురు కూడా ఇక్కడ ఆత్మకు మంచి ప్రిస్క్రిప్షన్ వ్రాస్తున్నాడు. మీ ఆత్మకు ఏమి తీసుకోవాలి? మీరు ఏది పడితే అది తీసుకోకండి. అన్నిచోట్ల పాలు, పాలు అని బోర్డ్ పెడతారు. అన్ని చోట్ల వాక్యము ప్రకటింపబడును, వాక్యము బోధింపబడును అని చెబుతారు. ఎందుకంటే మీరు వారి దగ్గరకు రావాలి కదా! కాని మీరు లోపలికి వెళ్ళి టెస్ట్ చేయాలి, పరీక్షించాలి. ఇవి నిర్మలమైన పాలేనా, కల్తీ చేసేసారా? నీళ్లు కలిపేసారా, విషం కలిపేసారా? అనేది చూసుకోవాలి. ఫలానాచోటికి వెళితే నేను బ్రతుకుతానా లేకపోతే చనిపోతానా? శరీరపరమైన ఆహార పదార్థాలను గూర్చి మీకు ప్రత్యేకమైన పట్టింపు ఉంది. మరి ఆత్మ విషయంలో, దేవుని మాటల విషయంలో ప్రత్యేకమైన పట్టింపు లేకపోతే ఎలా? చాలామందికి లేదు. అందుకే నేను మీకు మరల నొక్కివక్కాణించి చెబుతున్నాను. మీరు క్రొత్తగా జన్మించిన శిశువులను పోలినవారై, నిర్మలమైన వాక్యమను పాలవలన రక్షణ విషయములో ఎదుగు నిమిత్తము ఆ పాలను మీరు కోరుకోవాలన్నాడు. మీకు ముందు చెప్పినట్టుగా మా దగ్గర తప్ప మరి ఎక్కడా ఆ విధమైన పాలు లేవు. అటువంటి రక్షణ సంబంధమైన ఎదుగుదలనిచ్చేటువంటి వాక్యము ఇక ఎక్కడా లేదండీ! నిజముగా పరీక్షిస్తే మీరే తెలుసుకుంటారు. ఒక్కసారి పరిశోధన చేస్తే మీకే అర్థమవుతుంది. దేవుని వాక్యము నిజముగా ఇక్కడే అనుగ్రహింపబడుతుంది. **హెబ్రీయులకు 5 : 11** "ఇందును గూర్చి మేము చెప్పవలసినవి అనేక సంగతులున్నవి గాని, మీరు వినుటకు మందులైనందున వాటిని విశదపరచుట కష్టము". హెబ్రీయులు కూడా ఇలాగే తయారయ్యారు. వాక్యమును విన్నారు. కానీ వీరు కునుకుతున్నారు. ఇక వాక్యము వీరికి ఎక్కడం లేదు. అప్పుడు పౌలు ఏమంటున్నాడు? మీకు నేను గొప్ప సంగతులను వివరించి చెప్పినా ప్రయోజనము లేదు. ఎందుకంటే మీరు వినడానికి మందులై పోయారు. వాక్యము మీ లోపలికి

వెళ్ళడం లేదు. ఏదో చెత్త తిన్నారు, అజీర్తి చేసింది. కడుపు మందమైపోయింది. ఇప్పుడు లోపలికి ఏమి ఇచ్చిన ఎక్కడం లేదు. తరువాత **5 :12 వ** వచనములో కాలమును బట్టి చూస్తే మీరు బోధకులుగా ఉండాలి కానీ మరుగుజ్జులు అయిపోయారు. సంఘమునకు ఎంతకాలము నుండి వస్తున్నావు? 5 సంవత్సరాలుగా వస్తున్నావా? అయితే నీవు బోధకునివి అయిపోవాలి. దేవుని వాక్యములో మాస్టరు అయిపోవాలి. కానీ, ఇంకా ఆదికాండము నుండి ప్రకటన గ్రంధము వరకు పుస్తకాల వరుస క్రమము తెలియదంటే అర్ధమేమిటన్నమాట. క్రైస్తవ్యంలో వీరు ఎదగలేదు. ఎన్ని పుస్తకాలు ఉన్నాయో, ఎవరు వ్రాసారో, దేవుని మనసు అందులో ఎలా ఇమిడియుందో, దేవుడు ఏమి కోరుకుంటున్నాడో ఇవేమీ వారికి తెలియదు. సంఘానికి వెళ్ళడం, భజన చేయడం, ఏదైనా ఒక రిక్వెస్ట్ ఉంటే ప్రార్ధనలో దేవుణ్ణి కోరుకోవడం, తిరిగి ఇంటికి వెళ్లిపోవడం. ఇదేనా క్రైస్తవ్యం? ఆత్మకు ఎదుగుదల లేదు, ఆత్మ బ్రతికింపబడటం లేదు. అందుకే, కాలమును బట్టి చూస్తే హెబ్రీయులారా, మీరు బోధకులుగా ఉండవలసినవారై యుండగా, దేవోక్తులలో మొదటి మూలపాఠములను ఒకడు మీకు మరల బోధింపవలసివచ్చెను. అంటే మీరు ఏ స్థితిలో ఉన్నారన్నమాట? ఇంకా పాలు త్రాగే స్థితిలోనే ఉన్నారు. చిన్న పిల్లలుగా ఉన్నారు. మీకు ఎదుగుదల లేదు. శారీరకంగా ఒకవేళ ఎదుగుదల లేకపోతే నీ కొడుకును చూచి నీవు బాధ పడతావే! ఎదుగుదల లేకపోతే నీ కుమార్తెను చూచి బాధపడతావే! మరి సంఘాన్ని చూచి దేవుడు ఎంత బాధపడాలి? దేవునికున్న ఆ బాధ ఈ రోజు బోధకునికి ఉందా? లేదు. సంఘములో ఎవ్వరికీ ఈ వాక్యము రాకూడదు, ఎవ్వరూ బోధకులు కాకూడదు, నేను ఒక్కడినే బోధకునిగా ఉండాలి అనుకుంటాడు. పుట్టిన దగ్గర నుండి చనిపోయేంత వరకు, ఆ తరువాత వంశపారంపర్యంగా నా కుమారులు, నా మనుమలు ఈ బాధ్యతను తీసుకోవాలి తప్ప, ఇక ఎవ్వరూ బోధకులు కాకూడదనే ఆలోచన చాలా మందికి ఉంటుంది. కాలమును బట్టి చూస్తే మీరు బోధకులుగా ఉండవలసిన వారైయుండగా, దేవోక్తులలో మొదటి మూలపాఠములను ఒకడు మీకు మరల బోధింపవలసి వచ్చెను. మీరు పాలు త్రాగవలసిన వారే కానీ, బలమైన ఆహారమును తినగలిగినవారుకారు అన్నాడు. అంటే, క్రైస్తవ సంఘము ఎదుగుదలను కలిగియుండాలని కోరుకుంటున్నాడు. దేవుని నమ్మిన ప్రతి ఒక్కరూ ఆత్మ విషయంలో ఖచ్చితంగా ఎదుగుదల కలిగినవారై ఉండాలి. అంటే క్రైస్తవుడు నిర్మలమైన వాక్యాన్ని తీసుకోవాలి. హితోపదేశాన్ని పొందాలి. హిత వాక్యమునే వాడు వినాలి. పౌలు, తిమోతికి జాగ్రత్త చెబుతున్నాడు.

**2 తిమోతి 1 : 13** "క్రీస్తు యేసునందుంచవలసిన విశ్వాస ప్రేమలు కలిగినవాడవై, నీవు నా వలన వినిన హితవాక్య ప్రమాణమును గైకొనుము". తిమోతి అపొస్తులుడైన పౌలు వలన ఏమి విన్నాడు? హితవాక్యమును విన్నాడు. వాక్యము వేరు, హిత వాక్యము వేరు. వాక్యమును అందరూ పట్టుకునున్నారు. ఈ రోజు మాదీ వాక్యమే, మాదీ వాక్యమే అని మూడు వేల రకాల డినామినేషన్లుగా వాక్యమును చీల్చేశారు. అందుకే దేవుడు, అందరూ ఈ పేరే పెట్టుకున్నారు గనుక ఇప్పుడు మీరు హితవాక్యమును వినండి అన్నాడు. ఇంతకీ ఏమిటీ హితవాక్యము? ఫుట్‌నోట్‌లో చెప్పాడు చూడండి. ఆ హితవాక్యమంటే, ఆరోగ్యముగల వాక్యము, అనగా మీ ఆత్మకు ఆరోగ్యమునిచ్చే వాక్యము. అందరూ ఈ పేరుతోనే చలామణి అవుతున్నారు గనుక, ఇప్పుడు పౌలు ఏమంటున్నాడంటే ఓ తిమోతీ, నీవు నా వలన హితోపదేశమును పొందావు. తిమోతి ఆరోగ్యము కలిగిన వాక్యమును స్వీకరించాడు కనుక మంచి సేవకుడు అయ్యాడు. తిమోతి దేవునికి కావలిసిన వాడు అయ్యాడు. దేవునికి పనిచేసే ఒక మంచి జత పనివాడయ్యాడు. మీరు కూడా అలాగే ఉండాలి. ఈ లోకములో వాక్యమును వినే ప్రతి ఒక్కరికి హితవాక్యమునే ఇవ్వాలి. ఆత్మ విషయమై ఎవ్వరూ కృంగిపోకూడదు. ఆత్మ విషయమై ఎవ్వరూ రోగులు కాకూడదు. ఎవ్వరూ నశించిపోవడానికి వీలులేదు. ప్రతి ఒక్కరూ శరీరసంబంధముగా ఆరోగ్యము కలిగినవారై, ఆత్మ సంబంధముగా మరి ముఖ్యముగా ఆరోగ్యవంతులుగా వర్ధిల్లాలి అని దేవుడు కోరుకుంటున్నాడు. **1 తిమోతి 4 : 8** "శరీర సంబంధమైన సాధకము కొంచెముమట్టుకే ప్రయోజనకరమవును గాని దైవభక్తి అంటే ఆత్మ సంబంధమైన సాధకము, ఇప్పటి జీవము విషయములోను రాబోవు జీవము విషయములోను వాగ్దానముతో కూడినదైనందున అది అన్ని విషయములలో ప్రయోజనకరమవును". చూసారా? శరీర సంబంధమైన ఎదుగుదల, శరీరసంబంధమైన ఆహారము, శరీరసంబంధమైన

ఆరోగ్యము ఇవన్నీ ఒకప్రక్క! ఆత్మ సంబంధమైన ఆహారము, ఆత్మసంబంధమైన సాధకము, ఆత్మసంబంధమైన ఎదుగుదల ఇవన్నీ మరోప్రక్క! ఈ ప్రపంచం శరీర సంబంధముగానే ఎల్లప్పుడూ పట్టించుకుంటుంది. ఇంకా అందులో కొట్టుమిట్టాడుతుంది. అయినప్పటికీ, ప్రజలు రోగగ్రస్థులుగానే మిగిలిపోతున్నారు. కనీసం శరీరము విషయములో అయినా అందరూ ఆరోగ్యవంతులుగా లేరు. దేవుడు చెప్పే చిట్టచివరి హెచ్చరిక ఏమిటంటే, శరీరసంబంధమైన సాధకము మంచిదే. శరీరపరంగా మీరు మంచి ఆహారమును తీసుకోవాలి, మంచి వ్యాయామము చేయాలి, మంచి మందులు తీసుకోవాలి. అయినా, అది కొంచెము మట్టుకే ప్రయోజనకరము. ఆరోగ్యవంతులు చనిపోవడం లేదా? ఆయుష్షు తీరిన ప్రతిఒక్కరూ చనిపోతారు. కానీ బ్రతికి ఉన్నంతకాలము దేవుని సేవలో శరీరమును చక్కగా ఉపయోగించుకోవడానికి చెప్పబడినదే ఆ మాట. శరీరసంబంధమైన సాధకము కొంచెము మట్టుకే ప్రయోజనకరమగును. కానీ ఆత్మసంబంధమైన సాధకము పూర్తిగా ప్రయోజనకరము. ఇప్పుడు చెప్పండి? శరీరానికి కావలసింది 6 ప్యాక్ అయితే ఆత్మకు కావలసింది 66 ప్యాక్! అదేనండీ 66 పుస్తకాలు కలిగిన 'బైబిల్'. ఎందుకంటే ఈ జీవము విషయములోనే కాదు, రాబోవు జీవము విషయములో కూడా మీకు ప్రయోజనకరమైనదిగా వాగ్దానముతో కూడినదై ఉండాలంటే, నిత్యజీవమును కలిగి ఎల్లప్పుడూ వెలుగుతూ ఉండాలంటే, మీ ఆత్మ ఆరోగ్యకరముగా ఉండాలి. దైవభక్తిని కలిగి ఉండాలి. దైవభక్తి ఇప్పటి జీవము విషయములోను, రాబోవు జీవము విషయములోను, వాగ్దానముతో కూడినదైనందున అది అన్ని విషయములలో ప్రయోజనకరమగును. ధనవంతుడు, లాజరులను గూర్చి మీకు తెలుసు. ధనవంతుడు ఊదారంగు బట్టలు, మంచి తిండి, మంచి ఆరోగ్యమును కలిగియున్నాడు. ఎందుకంటే అతడు శరీరసంబంధముగా ఆలోచిస్తున్నాడు. మరొకవైపు లాజరుకు శరీరసంబంధమైన ఆరోగ్యము లేకపోవచ్చు. లాజరు శరీరము తనకు సహకరించకపోవచ్చు. కానీ, లాజరు ఆత్మను గూర్చి పట్టించుకున్నాడు. ఆత్మారోగ్యమును గూర్చి చూసుకున్నాడు. అందుకే ఇద్దరూ చనిపోయిన తరువాత, ఆత్మను గూర్చి పట్టించుకోని ధనవంతుడు నరకములో యాతనపడుతున్నాడు. భూమి మీద శరీరమునకు అతనికి 6 ప్యాక్ ఉండవచ్చు. కాని ఆత్మగా వెళ్ళిపోయిన తరువాత కాలిపోతున్నాడు. ఒక్కసారి ఆ లాజరును పంపించి దాహమును తీర్చమని అబ్రహామును ప్రాధేయపడుతున్నాడు. కానీ లాజరు హాయిగా సేదదీరుతున్నాడు. ఎందుకంటే లాజరు ఆత్మ రక్షింపబడినది. ఆయన ఆత్మ చనిపోలేదు. లాజరు ఆత్మ ఎదుగుదలను కలిగి ఉంది. అది ఆరోగ్యవంతముగా ఉంది. కనుక మంచి నిర్ణయం తీసుకోండి. శరీర సంబంధమైన సాధకమును చేయండి, తప్పు లేదు. కాని ఆత్మను గూర్చి మీరు ప్రాముఖ్యంగా పట్టించుకోవాలి. మీరు ఆత్మ విషయమై ఆరోగ్యవంతులుగా ఉండాలి. దేవునికి ఈ శరీరము ద్వారా చక్కని సేవ జరగాలి. అనేకమందిని మనము బ్రతికించాలి. దేవుని మాటలనే ఆహారముగా, పానముగా, వస్త్రముగా మనము కలిగి ఉండాలి. మన ఎదుగుదల కొరకు మనము హితోపదేశమును వినాలి. కానీ, జనులు దీనిని సహింపరు.

**2 తిమోతి 4 : 2** "వాక్యమును ప్రకటించుము". వాక్యమును శరీర అవసరతలకు కాదు, రోగాలకు కాదు, కోర్టులో కేసుల కొరకు కాదు, వ్యాపారాలకు కాదు, మరి దేనికి? ఆత్మను కాపాడుకోవడానికే వాక్యమును ప్రకటించాలి. (మీ ఆత్మలను రక్షించుటకు శక్తి కలిగిన వాక్యమును సాత్వికముతో అంగీకరించండి అన్నాడు **యాకోబు 1 : 21** వ వచనములో) అందుకే ఆత్మలను బాగుచేయడం కోసమే వాక్యమును ప్రకటించమన్నాడు. "సమయమందును, అసమయమందును ప్రయాసపడుము. సంపూర్ణమైన దీర్ఘశాంతముతో ఉపదేశించుము, ఖండించుము, గద్దించుము, బుద్ధి చెప్పుము". ఇదంతా హితబోధలోనికి వస్తుంది. ఏమిటండీ మీరు ఇంత కఠినముగా బోధ చేస్తున్నారు, ఏమిటండీ మీరు మాకు బుద్ధి చెబుతున్నారు, మీరు ఒక్కొరే హితవాక్యమును చెప్పగలము అంటున్నారని నన్ను ప్రశ్నిస్తారా? అవును. ఇవన్నీ ఎందుకు చెబుతున్నానంటే, ఇది హితవాక్యము గనుక ఇది ఇలాగే ఉంటుంది. ఇవన్నీ హితవాక్యానికి ఉన్న లక్షణములు. ఖండించుము, గద్దించుము, బుద్ధిచెప్పుము, ప్రయాసపడుము. సమయమందు, అసమయమందు వాక్యమును ప్రకటించుము. ఎందుకనగా జనులు హితబోధ అనగా ఆరోగ్యకరమైన బోధ, ఆత్మకు ఆరోగ్యాన్ని ఇచ్చే బోధను సహింపలేరు. శరీర సంబంధముగా ఆహారము కావాలంటే మంచి ఆహారమును కోరుకుంటున్నారు! ఆత్మసంబంధమైన ఆహారము అంటే, ఏ ఆహారము అయినా పరవాలేదు అంటున్నారు. అందులోను

హితబోధ అంటే అసలు వద్దు అంటున్నారంటే, ఎంత తప్పు చేస్తున్నారో చూడండి. క్రైస్తవుడా, క్రైస్తవవేతరుడా చాలా తప్పు చేస్తున్నావు. జనులు హితబోధను సహించరు అని దేవుడు ఎందుకు అన్నాడు? ఆ మాట ఇలాంటి వారి కోసమే చెప్పబడినదని ఇప్పుడు అర్ధమవుతుంది. ఈ ప్రజలు హితబోధను సహించలేకపోతున్నారు అంటే కారణం ఏమిటంటే దేవుడు ఏనాడో వ్రాయించాడు. హితబోధను మనుష్యులు సహించరు. శరీరసంబంధముగా అయితే ఆరోగ్యకరమైన బియ్యం, పప్పులు, కూరగాయలు వగైరా అన్నింటినీ కోరుకుంటారు. మరి ఆత్మ విషయానికి వచ్చేసరికి ఎంత చులకన? వీళ్ళకు ఎంత చిన్న చూపు? మా తాత నమ్మిన దేవుణ్ణే నేను నమ్ముతాను, మా తండ్రి నమ్మిన దేవుణ్ణే నేను నమ్ముతాను అంటున్నావే! మరి ఆదాము నమ్మిన దేవుని దగ్గరకు ఎప్పుడైనా వెళ్ళావా? ఆదాము కూడా నీకు తాతే గదా! నీవు ఏ దేవుని ఎలా నమ్మాలో ఆ ఆదాము చెబుతాడు. మీరు విజ్ఞత కలిగి ఆలోచించాలి. 2000 సంవత్సరాల క్రితమే వీటన్నింటినీ దేవుడు పరిశుద్ధాత్మ ప్రేరణతో వ్రాయించాడు. ఇదిగో దేవుని మనసు అక్షర రూపము దాల్చింది. ప్రతి ఒక్కరూ శరీరసంబంధమైన, అనారోగ్యకరమైన బోధలనే కోరుకుంటున్నారు తప్ప, ఒక్కరు కూడా ఆరోగ్యకరమైన బోధలు కోరుకోరని దేవుడు ముందుగానే వ్రాయించాడు. అదే ఇప్పుడునూ జరుగుచున్నది.

ఎందుకనగా, జనులు హిత బోధను సహించక దురద చెవులు కలిగినవారై తమ స్వకీయ దురాశలకు అనుకూలమైన బోధకులను తమ కొరకు పోగుచేసుకొని, సత్యమునకు చెవిని ఇయ్యక కల్పనాకథల వైపు తిరుగు కాలము వచ్చుచున్నది. ఇదిగో దేవుడు వ్రాయించిన ఈ మాట నెరవేర్పులోనికి వచ్చేసింది. ఇప్పుడు ప్రజలందరూ అలాగే ఉన్నారు. కథలు చెప్పేవారే జనులకు కావాలి. సినీ డైలాగులు, సినీ పాటలు పాడే బోధకులే ప్రజలకు నచ్చుతారు. సోదరా, నీకు ఏ రోగము ఉన్నా పరవాలేదు, ఎయిడ్స్ ఉన్నాకూడా పరవాలేదు, నూనె రాస్తే పోతుంది అంటూ భయంకరమైన బోధలు చేస్తున్నారు. ఒకవైపు ప్రపంచ ఆరోగ్య సంస్థకు ఎయిడ్స్, క్యాన్సర్, ఎబోలా, స్వైన్‌ఫ్లూ వంటి రోగాలు పెద్ద తలపోటుగా మారితే, మరోప్రక్క వీరు వచ్చి నూనె రాస్తే ఇవన్నీ పోతాయి అంటున్నారంటే, ఇది ఖచ్చితంగా కల్పనాకథే కదా! ఇలాంటివి ఎన్నో కథలు సమాజంలో హల్‌చల్ చేస్తున్నాయి. ప్రజలు వీటినే కోరుకోవడం లేదా? అనారోగ్యకరమైన బోధను కోరుకోవడం లేదా? అవును, వాటినే కోరుకుంటున్నారు. అలాగే మరణిస్తున్నారు. మీరు ఆరోగ్యకరమైన బోధయొద్దకు రండి. ఇదే మీ ఆత్మను రక్షించేది. పరలోకానికి సజీవముగా మిమ్ములను తీసుకొని వెళ్ళేది. ఆ లాజరుతో పాటు మిమ్ములను కూడా కూర్చుండబెట్టేది! ఇక నిర్ణయం మీదే!!

ప్రభువునందు నమ్మకస్థుడు,<br>
జె. మణి కుమార్<br>
సన్ ఆఫ్ గాడ్ - క్రైస్ట్ చర్చ్ - సామర్లకోట - 8978414178.

## ప్రశ్నలు

1. దేవునికి మన శరీరముతో ఏమి పని ఉంది?
2. యేసుక్రీస్తునందు నిజముగా విశ్వాసముంచడమంటే ఏమిటి?
3. హితవాక్యము అనగా ఏమిటి? దానిని పొందవలసిన అవసరత ఏమిటి?
4. మృతులైన ఆత్మలనగా ఎవరు? వారు బ్రతికే అవకాశమును వివరించుము.
5. యెహెజ్కేలు మరియు యిర్మీయా ప్రవక్తలు దేవుని వాక్యమును ఎలా భుజించారు?
6. ఆత్మ ఎదగాలంటే కావలసిన ఆహారము, పానము, వస్త్రములను గూర్చి వివరించండి.
7. శరీర సంబంధమైన సాధకము, ఆత్మ సంబంధమైన సాధకములను గూర్చి చర్చించండి.

# 9. దేవుని రథసారధి

కారణజన్ములైన మనుష్యులారా!

దేవునికి ఈ భూమి మీద ఒక సంఘము, దేవునికి ఈ భూమి మీద ఒక పని, దేవునికి ఈ భూమి మీద ఒక సంకల్పము, దేవునికి ఈ భూమి మీద ఒక ఆశ...వీటన్నిటిని బట్టి ఈ రోజు ఈ ప్రకృతి నడుచుచున్నది. వీటన్నింటిని బట్టి ఈరోజు ఎన్నో గొప్ప గొప్ప కార్యక్రమాలు, ఎన్నో గొప్ప గొప్ప వింతలు ప్రకృతిలో జరుగుతున్నాయి. వీటన్నింటికి మూలకారణం ఒక్కటే. అదే దేవుడనుకున్న ఒక మంచి ప్రణాళిక. ఆయన సిద్ధం చేసిన ఒక మంచి ప్లాన్ లేదా సంకల్పం. దానిని నెరవేర్చుకొనుటకు ఆయన మంచి ప్రణాళికను రచించాడు. దానిలో భాగంగా ఈ రోజు మనము ఈ భూమిమీద ఆయన ఇచ్చిన పాత్రలో ఒదిగిపోయి బ్రతుకుచున్నాము. దేవుని యొక్క పనిని భూమిమీద జరిగించడానికి దేవదూతలున్నాయి. వాటికి నిర్ణయింపబడిన పనిని అవి నెరవేర్చుచున్నవి. దేవుని యొక్క పనిని భూమిమీద జరిగించడానికి దేవుని కుమారులూ ఉన్నారు. వారికి నిర్ణయింపబడిన పనిని వారూ జరిగిస్తున్నారు. దేవుని సేవకులైన దేవదూతలు అగ్నిగా, వాయువుగా, భూమిగా, పదార్ధముగా, నీరుగా, ఆకాశముగా వివిధ రూపాలలో దేవుని పనులను జరిగిస్తున్నాయి. దేవుని కుమారులైనవారు దేవుని పిల్లలుగా, దైవ సంకల్పమును నెరవేర్చుచూ, దేవుని రాజ్యమును ప్రకటించుచూ, పరలోకపు తండ్రి చిత్తమును జరిగించుచూ వారికి నిర్ణయింపబడిన పనిని వారు కూడా నిర్వర్తిస్తున్నారు.

ఇక్కడ మనము చాలా జాగ్రత్తగా ఆలోచించాలి. దేవుని పని జరుగుచున్నప్పుడు ఆ పనిని పాడు చేయడానికి దుష్టుడు శతవిధాలా ప్రయత్నం చేస్తాడు. దేవదూతలు చక్కగా పనిని నిర్వర్తిస్తున్నాయి. దేవదూతలలో కొన్ని దేవునిపై తిరుగుబాటు జెండా ఎగురవేసినప్పుడు, దేవుడు వాటిని విడిచిపెట్టకుండా కటిక చీకటిగల బిలములలోనికి వాటిని పంపించి శిక్షను విధించాడు. దేవుని కుమారులలో కూడా దేవునిపనిని ఆటంకపరిచే కొంతమంది మనుష్యులు తయారవుతారు. వీరు అపవాది చేత ప్రేరేపింపబడినవారై దేవుని పనిని పాడుచేస్తారు. దేవుడు వీరిని కూడా విడిచిపెట్టడు. వారినీ దేవుడు కటిక చీకటి గల బిలములలోనికి పంపిస్తాడు. దేవదూతలకు అయితే వెనువెంటనే జరిగింది. మనుష్యులకైతే వారి కాలము తీరిన తరువాత జరుగుతుంది. అదే ఇద్దరికీ మధ్య ఉన్న వ్యత్యాసము. దేవదూతలకు సమయం ఇవ్వబడలేదు. దేవదూతలకు మారుమనస్సు పొందే అవకాశము ఇవ్వబడలేదు. దేవదూతలకు పాపక్షమాపణ అవకాశము లేదు. ఎందుకంటే అవి కేవలము సేవకులైన ఆత్మలు. మనుష్యులైతే దేవుని కుమారులైన ఆత్మలు. దేవుడు వారికి కొంత అవకాశమును ఇచ్చాడు. వారి యెడల ఆయన దీర్ఘశాంతమును చూపిస్తున్నాడు. వారు మార్పునొందే అవకాశమును కల్పించాడు. ప్రతి మనిషికీ దేవుడు కొంతకాలమును నిర్ణయించాడు. ఈ కాలములో వారు దేవుని పనిని నెరవేరిస్తే పరలోకానికి వెళ్ళాలి. వారు దేవుని పనిని అడ్డగించినవారైతే పాతాళానికి జారిపోవాలి.

భూమిమీద దేవుని పనిని ఒక రథం, రథశారధి, రథాన్ని తీసుకుని వెళ్లే గుర్రాలు, ఈ రథము ప్రయాణించవలసిన మార్గం, రథము చేరవలసిన గమ్యం... వీటితో మనము పోల్చుకున్నప్పుడు, ఈ విషయము చాలా చక్కగా మనకు అర్థమవుతుంది. ఉపమానరీతిగా, చక్కని రథశారధులు దేవునికి కావాలి. దేవుని పనిని తమ భుజాలపై వేసుకుని, ఈ దేవునిరథాన్ని తీసుకుని వెళ్ళిపోయేవారు, సరైన మార్గములో రథాన్ని తీసుకునిపోయేవారు, చక్కగా గమ్యాన్ని చేరుకునేవారు దేవునికి కావాలి. యేసుక్రీస్తు భూమిమీద దేవునికి ఒక మంచి రథశారధి. ఆయన వచ్చి, దేవుని పనిని ప్రారంభించిన తరువాత, పరలోకరాజ్య సంబంధమైన సంగతులు ఏవైతే చెప్పడానికి వచ్చాడో వాటన్నిటిని ప్రకటించడం మొదలు పెట్టేటప్పుడు, ఆ సమయంలో ఆయన కొంతమంది గుర్రాలను తన రథంలో చేర్చుకొని, ఒక మంచి మార్గములో వారిని పయనింపచేస్తున్నాడు. గుర్రములన్నీ రథసారధి చెబుతున్నట్లుగా వింటూ, ఆ మంచి మార్గంలో రథాన్ని తీసుకుని వెళ్ళిపోతున్నాయి. మీరు బాగా ఆలోచించగలిగితే, ఒక రథము తన గమ్యాన్ని చేరుకోవాలంటే, ఆ రథము మంచి మార్గంలో ప్రయాణం చేయాలి. ఎటుపడితే అటు వెళ్లకూడదు. అందుకే రథశారధి, తన రథములో చేర్చుకున్న ప్రతి గుర్రానికి కొన్ని కండిషన్స్ పెడతాడు. కొన్ని పద్ధతులు, కొన్ని సిద్ధాంతాలు, కొన్ని కట్టడలను ఆ గుర్రాలన్నీ పాటించాలి. గుర్రాన్ని రథములో చేర్చుకున్నప్పుడు బయట లోకములో ఉన్నది ఉన్నట్టుగా తీసుకుని వచ్చి, రథములో పెట్టకూడదు. ఆ గుర్రాలకు ముందుగా కొంత సిద్ధపాటు అవసరం, ఆ గుర్రాలను ముందుగా తయారు చేయాలి.

రథసారధి ఆ గుఱ్ఱాలను, తన రథాన్ని లాగటానికి అనుకూలమైనవిగా తయారు చేస్తాడు. ఎందుకంటే మార్గము, ప్రయాణము, గమ్యము రథశారధికి చాలా ముఖ్యం. గుఱ్ఱాలను ఎలా తయారు చేస్తాడు? దాని రెండుకళ్ళకు గంతలు కడతాడు. దాని చూపంతా ముందున్న మార్గము మీద ఉండాలి తప్ప, బండిని లాగటం మీద ఉండాలి తప్ప ప్రక్కకు తిరిగి చూడకూడదు. కనుక చేర్చుకున్న ప్రతీ గుఱ్ఱము యొక్క కళ్ళకు గంతలు కడతాడు. గుఱ్ఱములతోపాటు, రథముతోపాటు, తానుకూడా గమ్యము చేరాలంటే గుఱ్ఱము యొక్క కళ్ళకు గంతలు తప్పనిసరి. ఆ తరువాత దాని ముక్కు నుంచి కళ్ళెం వేస్తాడు. అక్కడనుంచి త్రాళ్ళు పట్టుకుంటాడు. తన చేతిలో ఆ కళ్ళెము ఉంచుకుంటాడు. అంటే ఒకవేళ గంతలు కట్టినా గుఱ్ఱము మనసు చెడిపోయి, బద్ధకస్తురాలు అయిపోయి, పెట్టిన తిండితో నిద్రాశక్తురాలు అయిపోయి, ఈ మార్గములో ప్రయాణించడానికి మొండికేస్తుందేమో అని, అప్పుడప్పుడు దానిని కంట్రోల్ చేయడానికి, మార్గములో ఉంచడానికి, కళ్ళెము యొక్క త్రాళ్ళు తన చేతిలోనే ఉంచుకుంటాడు. అంటే, గుఱ్ఱం మొండికేసిన సమయంలో ఆ త్రాళ్ళు లాగుతూ ఉంటాడు. ఇలా దానికి కళ్లెం వేస్తాడు, గంతలు కడతాడు. ఈ రెండూ చేసినా ఒక్కోసారి గుఱ్ఱము రథసారధి యొక్క మాట వినదు. అప్పుడు మరో చేతిలో కొరడా పట్టుకుంటాడు. చూసారా! రథశారధి ఇన్ని విధాలుగా తన గుఱ్ఱాలను అదుపు చేయవలసిన అవసరాలు ఉన్నాయి. బండి ముందుకు కదలాలన్నా, అతను అనుకున్న మార్గములో సజావుగా వెళ్ళాలన్నా, ఇటు అటు చూడకుండా, మార్గము తప్పిపోకుండా గమ్యము చేరాలన్నా... ఇవన్నీ తప్పనిసరి.

గుఱ్ఱము యొక్క కళ్ళు ఇటు అటు చూడకుండా గంతలు ఎందుకు కట్టాడంటే, ఏకాగ్రత కోసమే అని తెలుసుకోవాలి. దేవుని పనిలో ఉన్న మనుషి యొక్క మనసు చెడిపోకుండా ఉండడానికి, మార్గము మీద దృష్టిని, ఏకాగ్రతను కలిగి ఉంచడానికే కళ్లెం పట్టుకున్నాడు. ఇంకా ఒకవేళ అది మొండికేస్తే కొరడా పట్టుకున్నాడు. గుఱ్ఱము యొక్క వీపు మీద అప్పుడప్పుడూ కొడుతూ ఉంటాడు. వీపు మీద అప్పుడప్పుడు దెబ్బలు పడుతూ ఉంటాయి. వీపు మీద తట్లు వచ్చేస్తుంటాయి. అప్పుడు గుఱ్ఱం నొప్పితో, నేను బండిని లాగుతున్నా నా యజమాని, రథశారధి నా వీపు మీద దెబ్బలు కొడుతున్నాడు. రథసారధి ఎందుకు కొడుతున్నాడు దెబ్బలు? చేతిలో కొరడా ఉంది కదా అనా? కొట్టకపోతే బాగోదనా? అనవాయితీకైనా ఒకసారి దెబ్బ కొట్టాలనా? ఎందుకు కొడుతున్నాడు గుఱ్ఱాన్ని? గుఱ్ఱం ఏదో తప్పు చేస్తుందన్నమాట. సరైన మార్గములో వెళ్ళడం లేదన్నమాట. అప్పుడు కొరడాతో వీపు మీద ఒక దెబ్బ కొడతాడు. అప్పుడు గుఱ్ఱానికి వెంటనే మత్తు వదిలిపోతుంది. నేను ఏమి చేస్తున్నాను? నేను ఎలా ఉన్నాను? అంటే నేను సరిగ్గా వెళ్ళాలన్నమాట. నా మార్గాన్ని నేను చక్కబరుచుకోవాలని గుఱ్ఱము వెంటనే సరి చేయబడాలి. ఒక్కటే గుఱ్ఱం అనుకుంటున్నారా? యేసుక్రీస్తు ఆనాడు ఏర్పరచుకున్న గుఱ్ఱాల సంఖ్య 12. ఒక గుఱ్ఱం కాదు, 12 గుఱ్ఱాలున్నాయి. ఈ 12 గుఱ్ఱాలు అప్పుడప్పుడు తప్పిపోతున్నాయి? ఈ 12 గుఱ్ఱాలు అప్పుడప్పుడూ మాట వినుటలేదు? 12 గుఱ్ఱాల్లో కొన్ని గుఱ్ఱాలు చెడిపోతున్నాయి? చెడిపోయిన ప్రతీసారి యేసుక్రీస్తు తన కొరడా ఝులిపిస్తున్నాడు. బాగా పరిగెత్తినప్పుడు, మంచిమార్గంలో వెళుతున్నప్పుడు, వాటిని ప్రోత్సహిస్తున్నాడు.

సీమోను బర్ యోనా, నీవు దేవుని కుమారుడవు, నీవు ధన్యుడవు. నేను ఆ దేవునికి కుమారునిగా, క్రీస్తు యేసుగా భూమి మీదకు వచ్చానని నీవు ఒప్పుకొని సరైన మార్గంలో ప్రయాణం చేస్తున్నావు. నీవు ధన్యుడవు అన్నాడు. అంటే, పేతురును యేసుక్రీస్తు ప్రోత్సహించాడు. గుఱ్ఱము బాగా వెళుతోంది. అలాంటప్పుడు కొరడా ఎందుకు పట్టుకుంటాడు చెప్పండి. కొరడాను, దాని స్థానంలో పెట్టేస్తాడు. హాయిగా కూర్చుంటాడు. గంతలు పట్టుకుంటాడు. గుఱ్ఱాలను ప్రోత్సహిస్తుంటాడు, మార్గములో వెళ్ళిపోతుంటాడు, గమ్యానికి చేరువవుతాడు. గుఱ్ఱం ఒక కిలో మీటరు ప్రయాణించాను, ఇక విశ్రాంతి తీసుకుంటాను అంటే ఊరుకుంటాడా? లేదు లేదు. ఇంకా పరుగెత్తాలి. 2 కి.మీ. కాదు, 20 కి.మీ. కాదు, గమ్యం చేరేంతవరకూ పరిగెత్తాల్సిందే. బండి వెళుతోంది కదా అని రథసారధి నిద్రపోకూడదు. గుఱ్ఱాలు పరిగెత్తుచున్నంత సేపు ఆ గుఱ్ఱాల మీద దృష్టి పెట్టాలి. రథసారధితో పోల్చినప్పుడు గుఱ్ఱము యొక్క పని చాలా చిన్నగానే కనిపిస్తుంది. గుఱ్ఱానికి ఉన్నది ఒక్కటే పని. రథశారధి చెప్పినట్టుగా వింటూ వెళ్ళిపోతే సరిపోతుంది. కానీ రథరారధికి చాలా పని ఉంది. అన్ని గుఱ్ఱాలను కంట్రోల్ చేసుకోవాలి, బండిని

కాపాడుకోవాలి, తనను కాపాడుకోవాలి. ఈ 12 గుర్రాలలో ఏది చెడిపోయినా వెనువెంటనే ఒక మంచి నిర్ణయం తీసుకోవాలి. దానిని కట్టడి చేయాలి. చూసారా? దేవునిపని ముందుకు వెళ్ళాలంటే ఎంత భారీ ప్రణాళిక అవసరమో!

గుర్రాలు అప్పుడప్పుడు రథసారధి యొక్క మాటను వినవు. రథసారధి యొక్క మాట గుర్రం వినాలా? గుర్రం యొక్క మాట రథసారధి వినాలా? చెప్పండి. గుర్రము యొక్క మాట రథశారధి వినకూడదు. ఈ 12 గుర్రాలలో ఒక గుర్రము, యేసుతో, నువ్వు ఫలాన మార్గములో నన్ను తీసుకొని వెళ్ళు అంటే, సరే గుర్రమా... నీ ఇష్టప్రకారమే, నీవు ఎటుపడితే అటుపోదాం! అంటాడా? అనకూడదు. అలా అన్న పక్షంలో రథము యొక్క పరిస్థితి ఏమిటి? గమ్యము ఎలా చేరగలము? పని ఎలా నెరవేరుతుంది? అందుకే గుర్రములు బాగా గమనించాలి. దేవుని పనిని చేస్తున్నవారు చక్కగా అర్థం చేసుకోవాలి. దేవుని రథసారధి బండిని నడుపుతున్నప్పుడు, రథసారధి మాటను గుర్రాలు వినాలి తప్ప, గుర్రాల మాట రథసారధి ఎప్పటికీ వినదు. దేవుని రథసారధి దేవుని మాటను తప్ప, ఎవడి మాటా వినదు.

గుర్రము బండిని బాగా లాగుతుంది కదా అని బాగా పని చేసే గుర్రము యొక్క మాట కూడా వినకూడదు. బాగా లాగడం లేదు కదా అని పని చేయని గుర్రము యొక్క మాటనూ వినకూడదు. ఎవరైతే సారధికి పనిని అప్పగించాడో, గమ్యాన్ని చేరాలని ఏ దేవుడైతే సారధికి శాశించాడో, ఆ దేవుని మాటనే వినాలి. దేవుడు తన గ్రంథములో ఏమీ దాచుకోలేదండి. తన మనసులో ఏమీ దాచుకోకుండా అ పరమ తండ్రి అన్ని చెప్పేసాడు. నీవు రథశారధివై దేవుని రథాన్ని నడుపుతున్నప్పుడు, కొన్ని గుర్రాలు నీ మాట వినకుండా, ఆ గుర్రాల మాటే నీవు వినాలని ప్రయత్నిస్తాయి. ఎదురు తిరుగుతాయి, మొండికేస్తాయి. ఇప్పుడు చూడండి, దేవుడు ముందుగా ఏమని వ్రాయించాడో!

**2 తిమోతి 4 : 1–** “దేవుని ఎదుటను, సజీవులకును మృతులకును తీర్పు తీర్చు క్రీస్తుయేసు ఎదుటను, ఆయన ప్రత్యక్షతతోడు ఆయన రాజ్యముతోడు, నేను ఆనబెట్టి చెప్పునదేమనగా, వాక్యమును ప్రకటించుము. సమయమందును అసమయమందును ప్రయాసపడుము. సంపూర్ణమైన దీర్ఘశాంతముతో ఉపదేశించుచు, ఖండించుము గద్దించుము బుద్ధిచెప్పుము. ఎందుకనగా జనులు హితబోధను సహింపక, దురద చెవులు గలవారై తమ స్వకీయ దురాశలకు అనుకూలమైన బోధకులను తమకొరకు పోగుచేసుకుని, సత్యమునకు చెవినియ్యక కల్పనాకథలవైపునకు తిరుగుకాలము వచ్చును”. – అపొస్తలుడైన పౌలు, దైవముల సాక్షిగా మాట్లాడుచున్నది ఏమిటంటే, ఇది పౌలు సొంత ప్రయత్నం కాదు, పౌలు సొంత మాట కాదు. దేవుని సాక్షిగా తిమోతితో చెబుతున్నాడు చూడండి. వాక్యమును ప్రకటించమన్నాడు. అంటే ఓ తిమోతీ, రథసారధిగా నీవు దేవుని పనిని జరిగించు. రథమును సరైన మార్గములో నడిపించు. సమయమందును అసమయమందును కష్టపడు. రథసారధికి చూసారా ఎన్ని పనులు ఉన్నాయో? తిమోతికి పౌలు రథసారధ్యంలో ట్రైనింగ్ ఇస్తున్నాడు. వాక్యమును గుర్రాలకు ప్రకటించాలి. రథము మీద వెళుతున్న నీవు, చుట్టూ ఉన్న ఈ సమాజానికి తెలియజెప్పాలి. చాల గుర్రాలు ఇంకా బయటే ఉన్నాయి. నీ రథములో లేవు, బయటే ఉన్నాయి. గడ్డిమేస్తున్నాయి. ఇస్టానుసారముగా తిరుగుతున్నాయి. ఎగురుతున్నాయి, మదమెక్కి ఉన్నాయి. అందుకే నీవు వాక్యమును ప్రకటించుము. సంపూర్ణమైన దీర్ఘశాంతముతో ఉపదేశించుము, ఖండించుము, గద్దించుము, బుద్ధి చెప్పుము. సరిదిద్దడానికి, ఖండించడానికి, బుద్ధి చెప్పడానికి, రథసారధికి దీర్ఘశాంతము కావాలా? కావాలి! ఈ క్రమములో బి.పి. రాకూడదు, ఆవేశపడకూడదు. ఖండించేటప్పుడు, గద్దించేటప్పుడు, బుద్ధి చెప్పేటప్పుడు ఆవేశము రాకూడదు. ఏముండాలి మరి? దీర్ఘశాంతము ఉండాలి. ఒక్కోసారి ఈ గుర్రము సరిగ్గా పరిగెత్తలేదని దాన్ని కొరడాతో తట్టులొచ్చేటట్టుగా కొట్టాలి. రక్తము కారేలా కొట్టాలి. ఎందుకంటే గుర్రం బండిలోనుంచి విడిచిపెట్టబడి బయటకు వెళ్ళిందా? దానికిక దిక్కులేదు. గుర్రము బండిలోనుంచి వెళ్ళిపోకూడదు. గుర్రము ఈ మంచి గుంపు లోనుంచి బయటికి వెళ్ళిపోకూడదు. ఒకవేళ వెళ్ళిందా నాశనమే. అలా వెళ్ళిన గుర్రము మళ్ళీ రాదు. ఎందుకంటే బయట ఎలా ఉందో చూడండి. క్రూరమృగాలు మిమ్మల్ని బాగుచేస్తాయా? మిమ్మల్ని ఆదరిస్తాయా? మిమ్మల్ని దేవుని రాజ్యానికి నడిపిస్తాయా? లేదు లేదు. మిమ్మల్ని దోచుకుంటాయి. రథమును విడిచి బయటికి వెళితే మీకు ఈ సంగతి

తెలుస్తుంది. వారు మిమ్మల్ని దోచుకుంటారన్న సంగతి మీకు ముందు తెలుసు కనుకే, ఈ బండి లోనికి వచ్చారు. లేకపోతే మీరేమయినా అమాయకులా? మీరు చాలా తెలివైనవారు!

అందుకు పౌలు ఏమంటున్నాడో చూడండి. **2తిమోతి 4 : 2వ వచనం**లో సంపూర్ణమైన దీర్ఘశాంతము దేనికంటే ఉపదేశించడానికి, ఖండించడానికి, గద్దించడానికి, బుద్ధిచెప్పడానికి ఉండాలి. రథసారధికి స్టెబిలిటీ కావాలి. తనను తాను ఓర్చుకోవాలి. ఎందుకు ఇదంతా చెప్పాల్సివచ్చింది? ఓ రథసారధీ, నీ రథములోని గుఱ్ఱాలు ఎలాంటి స్థితిలో ఉంటాయో తెలుసా? ఎందుకనగా జనులు(గుఱ్ఱాలు) హితబోధను సహింపరు అన్నాడు. బండిలో ఉన్న అన్ని గుఱ్ఱాలు హితబోధను సహించినప్పుడు, ఒక గుఱ్ఱానివైన నీవెందుకు సహించటంలేదు. అంటే నీలో ఏదో లోపముందన్నమాట. బండిలో 12 గుఱ్ఱాలుంటే 11 గుఱ్ఱాలు ఒకవైపు వెళుతూ 12వ గుఱ్ఱం ఒక్కటే మరొకవైపు వెళుతుంటే, ఇస్కరుయోతు యూదా వలె, ఆ పరిస్థితి రథమంతటికీ చాలా ప్రమాదం! యేసు యొద్ద ఉన్న మిగిలిన 11 గుఱ్ఱాలకూ డబ్బుమీద ఆశలేదు. డబ్బు సంచిని తమ దగ్గర ఉంచుకోవాలనుకోలేదు. మిగిలిన 11 గుఱ్ఱాలకు యేసును చంపాలనే ఆశలేదు. మరి 12వ గుఱ్ఱానికి ఈ ఆలోచన ఎందుకొచ్చిందండి? అందుకే ఏమంటున్నాడో చూడండి. మొదటి శతాబ్దపు బోధ ఇది, ప్రారంభ క్రైస్తవ సంఘబోధ ఇది. పౌలు తిమోతితో రథసారధి ఎలా ఉండాలో చెబుతున్నాడు. ఈ ప్రపంచంలో దేవుని రథశారథులు ఇలా ఉన్నారా? ఇలా ఆలోచిస్తున్నారా? జనులు హితబోధను సహింపక, దురద చెవులు గలవారై, తమ స్వకీయ దురాశలకు, అనుకూలమైన రథశారధులను తయారు చేసుకుంటున్నారు. నామాట వినే రథశారధి నన్ను నడిపించాలి తప్ప, రథశారధి మాట వినే గుఱ్ఱానిగా నేనుండకూడదు అనుకుంటుందీ గుఱ్ఱం. ఈ భూమి మీద చాలా గుఱ్ఱాలు అలాగే ఉన్నాయి. మా మాట రథశారధి వినాలి తప్ప, రథశారధి మాట మేము వినకూడదనుకుంటున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఎన్నో సంఘాలు, సంఘాలలో ఉన్న రథశారధులు ఎలా మారిపోయారో చూడండి? వినేవారు ఏది కోరుకుంటే రథశారధి అదే చెపుతాడు. విశ్వాసులు ఏమి తీర్మానిస్తే రథశారధి అదే చేస్తాడు. రథశారధి వాక్యమును చెప్పి సంఘాన్ని సరిదిద్దే పరిస్థితి ఎక్కడా లేదు. ఎందుకంటే ఈ గుఱ్ఱాలు ఎలాంటి గుఱ్ఱాలనుకుంటున్నారు? కొన్ని డబ్బున్న గుఱ్ఱాలు తమ డబ్బుతో కొడతాయి. రథశారధి ముఖంమీద కొంత డబ్బు కొడితే, రథసారధి ఇక మా జోలికి రాడు. మేము చెప్పిందే చెబుతాడు, చేస్తాడు. మరికొన్ని గుఱ్ఱాలు బాగా మదమెక్కి ఉన్నాయి. ఎక్సర్‌సైజ్ బాడీలు వాటివి, బాగా తిన్నాయి. వాటి భారీ ఆకారాన్ని చూపించాయి. నా కంటికి గంతలు కట్టి, నా మీద కొరడా ఝులిపించడానికి, నాకు కళ్ళెం వేయడానికి అసలు నీవు ఎవడవు? రథశారధి మాట నేను వినను, రథసారధికంటే నాకు బలమెక్కువ, నేనే ఈ రథమును నడిపిస్తున్నాను. నేనున్నాను కనుక నీ బండి నడుస్తుంది. కనుక నేను చెప్పినట్టు నీవు విను, అంతేగాని నీవు చెప్పినట్టు నేను వినను అనుకున్నాయి. ఇదే మదమెక్కిన గుఱ్ఱం. అందచందాలు కలిగిన గుఱ్ఱం మరొకటి. ఈ గుఱ్ఱం తెల్లని జూలుతో వస్తుంది. చాలా బ్యూటిఫుల్ హార్స్ ఇది. జుట్టు అలా ఎగరేసుకుంటూ వస్తుంది. ఇలాంటి గుఱ్ఱాలు కొన్ని ఉంటాయి. రథములో ఎన్ని రకరకాల గుఱ్ఱాలో చూడండి.

దేవుడు వ్రాయించిన మాటలను పరిశీలించండి. ఎందుకనగా ఈ జనులు హితబోధను సహించక, దురద చెవులు గలవారై తమ స్వకీయదురాశలకు అనుకూలమైన బోధకులను తయారుచేసుకుంటారు. ఏమిటి నీకున్న దురాశ? నీకు మంచి ఆశ ఉండొచ్చు, కానీ దురాశ ఉండకూడదు. ఆశ ఉండాలి! ఏమిటా ఆశ? నిత్యజీవానికి నేను ఆహ్వానింపబడాలి అనే ఆశ. ఇంతకీ స్వకీయ దురాశ ఏమిటి? స్వకీయ అంటే నీ స్వంత ఆశ అది. అది ఆశ కాదు. దేవుని గ్రంథములో, దేవుని పరిభాషలో అది దురాశ. నీ కొరకు నీవు కోరుకుంటున్నావు, ధనమును కోరుకుంటున్నావు, అధికారమును కోరుకుంటున్నావు. ఈ భూమిపై దూరదృష్టి ఉందా నీకు? దూరదృష్టితో ఆలోచిస్తున్నావా? నేను భవిష్యత్తులో ఇలా ఉండాలి, అలా ఉండాలి అని ఆనుకుంటున్నావా? భవిష్యత్తులో ఏం చేయాలి? నా భవిష్యత్తు ఏమిటి అని, దూరదృష్టి కలిగి ఉన్నావా? అందుకే రథసారధిని ఎదిరించావా? ఇప్పటినుంచీ ఎంతో కొంత వెనుక వేసుకోవాలి అనుకుంటున్నావా? ఏమిటయ్యా నీ దూరదృష్టి? రేపేమి సంభవించునో మీకు తెలియదన్న దేవుని మాట నీకు అర్థమయ్యిందా! **మత్తయి 6** అధ్యాయంలో యేసు మాటలు గుర్తున్నాయా? రథసారధి ఎప్పుడూ ఇదే

చెబుతారు అనుకుంటున్నావా? ఎప్పుడూ ఇదే కొరడా దెబ్బ. కొట్టేదేదో కొంచెం క్రొత్తగా కొట్టండి అంటావా? దేవుని కొరడా అది. దేవుని దెబ్బ అది? ఏమిటో తెలుసా? అదే – "రేపేమి సంభవించునో నీకు తెలియదు". కానీ నీకేమో రేపటిని గూర్చి చాలా ప్లానింగ్. నీది భూమిమీద పరిమితి కలిగిన ఫ్యూచర్ ప్లానింగ్. రేపటి దినాన నేనెలా జీవించబోతున్నాను? నా కుటుంబము ఎలా ఉండబోతుంది? నేను ఎలా మారిపోబోతున్నాను? నా వైభవం ఏమిటి? ఇలా ఆలోచించుకుంటున్నావా నీవు? నీ ఆలోచనా విధానం ఇదా? చెడు గుర్రాలకు కొన్ని దురాశలున్నాయి. అవి మంచివి కావు. నీకుండవలసిన ఆశ పరలోకమయితే అది మంచిది. దానికంటే గొప్ప ఆశ ఇంకేముంది చెప్పండి? నీ ఆశ కేవలము పరలోకమై ఉండాలి. నీ ఆశ కేవలము నిత్యజీవమై ఉండాలి. దానికంటే గొప్పదైన ఆశ ఈ భూమి మీద ఏదైనా ఉందా? ఒకవేళ ఏదైనా ఉంటే అది కేవలము దురాశ అవుతుంది. ఒక బిల్డింగు కట్టుకోవాలనుకుంటున్నావా! ఒక పెద్ద భవంతిని నిర్మించుకోవాలనుకుంటున్నావా? నీ చుట్టూ పది మంది జనం ఉండి, నీకు జేజేలు పలకాలి అనుకుంటున్నావా! ఇవన్నీ దురాశలు. ఈ లోకాన్ని చూసి, నీవు మోసపోయావు. లోకములో ఉన్నవాడేదో అలా చేసాడని వాడితో పాటు నీవు కూడా వాడి మాదిరిగా వాతలు పెట్టుకుంటావా? చారలు రావడానికి వాడేవేవో చేసాడు. వాడిలా నీవు కూడా ఉండాలని నీవు కూడా వాతలు పెట్టుకుంటావా? వాడు పెద్ద భవంతి కట్టుకున్నాడండి, వాడి దగ్గర ఆ జనమేమిటండి, వాడి దగ్గర ఆ చందా ఏమిటండి, వాడి హోదా ఏమిటండి, వాడికున్న సంపద ఏమిటండి, వాడి కారు వెళుతుంటే – ముందు నాలుగు కారులు వెనుక నాలుగు కారులు, వాడుకున్న బలగం ఏమిటండి, వాడికున్న పేరేమిటండి, వాడి పేరు వింటే అందరూ హడలిపోతున్నారేమిటండి అనుకుని, వాడిని చూసి నువ్వు కూడా వాతలు పెట్టుకోవాలనుకుంటున్నావు. వాడికెలాగూ పరలోకము రాదు. నీవు కూడ వాడిలాగే పరలోకమును పోగొట్టుకుంటావా? దానిని దేవుడు స్వకీయ దురాశ అన్నాడు. మీకు ఒకవేళ తండ్రి అయిన దేవుడు అవన్నీ అనుగ్రహించాలి అని అనుకుంటే, ఆ దేవుడు మీకు తప్పకుండా ఆధిక్యతను అనుగ్రహిస్తాడు. కానీ ఆయన అప్పగించిన పనిలో నువ్వు ఎంతవరకూ నమ్మకమును చూపిస్తున్నావు అనేది ఆయన కోరుకుంటున్నాడు. నీ రథశారధి మాటను నీవు వింటున్నావా? నీ మాట, నిన్ను నడిపేవాడు వినాలి అనుకుంటున్నావా? నిన్ను నడిపేవాడు మంచి రథసారధి అయితే నీ మాట ఎన్నటికి అతడు వినడు. వాడు చెడ్డవాడు, ఎందుకూ పనికిరానివాడు అనుకోండి. అప్పుడు నీ మాటే వింటాడు. నిన్నే అడుగుతాడు. ఏమి చేయమంటావు? ఎలా చేద్దామంటావు? నీ ఆలోచన చెప్పు, నీ ఇష్టప్రకారమే వెళ్ళిపోదాము అంటాడు. వాడు మాత్రం నిద్రపోతాడు. రథశారధి నిద్రపోతే రథములోని గుర్రాలు ఏమి చేస్తాయి? మా గురువుగారు నిద్రపోయారు గనుక మనకు ఇష్టమొచ్చిన దారిన వెళ్ళిపోదాము అనుకుంటాయి. ఏ గుర్రానికి ఏ దారి ఇష్టమో, ఆ దారిన వెళ్ళిపోతాయి. కొంతసేపు నువ్వు రథాన్ని నడుపు, మరికొంతసేపు నేను రథాన్ని నడుపుతాను అని పంచుకుని, 12 గుర్రాలు 12 ఇష్టమైన మార్గాలలో వెళ్ళిపోతాయి. అప్పుడు రథశారధి ఎక్కడికి వెళతాడు చెప్పండి? ఏ గమ్యానికి వెళతాడు చెప్పండి. అందుకే దేవుడు ఎంత మంచి జాగ్రత్తను చెబుతున్నాడో చూడండి.

జనులు హితబోధను సహింపక, దురద చెవులు గలవారై తమ స్వకీయ దురాశలకు అనుకూలమైన బోధకులను తమకొరకు పోగుచేసుకుని సత్యమునకు చెవినియ్యక కల్పనాకథలవైపునకు తిరుగు కాలము వచ్చును. అంటే వీరు ఎక్కడికి వెళ్ళిపోతున్నారన్నమాట? ఈ గుర్రాలకు ఏమి ఇష్టమన్నమాట? ఈ నడిపింపబడుచున్న రథములో తమపైనున్నవారు అనుకూలమైన రథశారధులుగా ఉండటమే వారికి ఇష్టం. అది మంచిది కాదు. అది గుర్రానికి మంచిదికాదు. రథానికి మంచిదికాదు. మిగిలిన గుర్రాలకూ మంచిదికాదు. నీవు చెడిపోవడం వలన నీ గుంపులో ఉన్న ఎన్ని గుర్రాలను నీవు పాడుచేస్తున్నావో తెలుసా? నీవు మొండికేయడం వలన నీతోపాటు ఎన్ని గుర్రాలు ఆగిపోతున్నాయో తెలుసా? నీవల్ల ఆటంకము కలుగుతుంది. నిజమా, కాదా? చెప్పండి. ఉదాహరణకు ఒక ఎద్దుల బండి ఉంటుంది. అక్కడ రెండే ఎద్దులు ఉంటాయి. ఒక ఎద్దు నడుస్తుంది, మరొక ఎద్దు నడవనంటుంది. నడిచే ఎద్దు ఎంత నడుద్దాము అనుకున్నా, నడవని ఎద్దు బండిని నడవనిస్తుందా? నడవనివ్వదు. నడవాలి అని ఒకవేళ భీష్మించుకుని కూర్చుంటే, నడవని ఎద్దును కూడా నడిచే ఎద్దు ఈడ్చుకుని వెళ్ళాలి. అది ఎంత కష్టమో చెప్పండి. నడవని ఎద్దును, బండిని, బండిలో సరుకును, కాడిని, వీటన్నింటినీ ఆ నడిచే ఒకే ఒక ఎద్దు మోసుకొని

వెళ్ళగలదా? ఇక్కడ గుఱ్ఱాల పరిస్థితి అంతే! రథశారథి ఎంత కష్టపడుతున్నాడో చూడండి. మిగిలిన గుఱ్ఱాలన్నీ సిద్ధంగా ఉన్నాయి. రథశారథి ఎక్కడికి వెళ్ళమంటే అక్కడికి రథాన్ని తీసుకొని వెళ్ళడానికి, దేవుని వాక్యమనే మార్గములో, వెలుగులో ప్రయాణించడానికి అన్ని గుఱ్ఱాలు సిద్ధముగా ఉన్నాయి. ఒకే ఒక గుఱ్ఱం మాత్రం ఐ డోంట్ కేర్ అంటుంది. నేను వెళ్ళను, నేను పైకి లేచిపోతాను, నేను పెద్దగా సకిలిస్తాను అంటుంది. ఈ గుఱ్ఱం వల్ల, మిగిలిన 11 గుఱ్ఱాలకు, రథశారథికి, రథానికి ఎంత ప్రమాదమో చూడండి.

అలాగని మీరు నన్ను ప్రశ్నించవచ్చు. ఏమిటండి? మీరు రథశారథి అయితే మేము మాత్రమే గుఱ్ఱాలమా? అంత చీప్ చేసి మాట్లాడేస్తున్నారేమిటి మమ్మల్ని? మీకు ఆ ప్రశ్న రావచ్చు. ఎందుకంటే పనిచేయని గుఱ్ఱం ఊరుకుంటుందా? ఊరుకోదు. గుఱ్ఱానికి కొరడా దెబ్బ తగులుతున్నప్పుడు అస్సలు ఊరుకోదు. ఇదిగో ఇప్పుడు నన్నే కొట్టాడు, చూడు నా మీద దెబ్బ పడింది, నాకే తట్టు వచ్చింది చూడు. మిగిలిన 11 గుఱ్ఱాలను కొట్టాడా? లేదు. ఎప్పుడూ నన్నే కొడుతున్నాడు? ఎందుకని? వాళ్ళనెందుకు కొట్టడం లేదు. ఎందుకంటే ఆ గుఱ్ఱాలు సరిగ్గా నడుస్తున్నాయి. నీవు బాగా పరిగెటేటప్పుడు నిన్ను కొట్టానా? కొట్టలేదు. నీవు ఒకప్పుడు ఏమన్నావో నీకు గుర్తుందా? నా రథసారధి చాలా మంచివాడు. చాలా చక్కగా వాక్యం చెపుతారు, చల్లగా చెపుతారు, నా రథసారధి చెప్పే వాక్యమంటే నాకు ఎంత ఇష్టమో! చెవి కోసేసుకుంటాను నా రథసారధి వాక్యమంటే అన్నావు. మరి ఇప్పుడో? నా రథసారధి నన్ను తిడుతున్నారు. చల్లగా వాక్యము చెప్పడం లేదు, నన్నే తిడుతున్నారు అంటున్నావు. ఆహా! ఇది వాక్యము కాదా? నీ మనసు మారిపోయింది. నీవు వెళ్ళడానికి మొండికేస్తున్నావు కనుకే, నీ మీద దెబ్బ పడుతుంది. మిగిలిన వారిమీద దెబ్బ పడటం లేదు కనుక, ఇప్పుడు నీవు ఇలా ఆలోచిస్తున్నావు. నీ మీద దెబ్బలు పడుతున్నకొద్ది నీవు మొండికేస్తూ అస్సలు ముందుకు అడుగువేయటం లేదు సరికదా, మిగిలిన వారిని ఆటంకపరుస్తున్నావు. మిగిలిన వారిని అడ్డగిస్తున్నావు. దేవుని పక్షాన ఆలోచిస్తే రథసారధి కూడా ఒక గుఱ్ఱమే. అలాంటి పరిస్థితులలో ఇప్పుడున్న రథసారధులందరి మీద గొప్ప రథశారథి క్రీస్తు. నేనేమీ మీమీద రథశారథిగా మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించడంలేదు. మీ దగ్గర నేను రథశారథిని, మీరు నాకు గుఱ్ఱాలు. దేవుని దగ్గరకు మనము వచ్చేస్తే, దేవుని దగ్గర ఆలోచిస్తే, పరలోకము విషయములో యేసుక్రీస్తు ఒక రథశారథి, ఆయన దగ్గర నేనొక గుఱ్ఱాన్ని. నాలాంటి గుఱ్ఱాలు ఆయనకు చాలా ఉంటాయి. ప్రపంచవ్యాప్తముగా ఆయనకు చాలా దేశాలలో, చాలా ప్రాంతాలలో మొత్తం మీద భూమిపై ఆయన పనిని నెరవేర్చుటకు ఆయనకు ఏడు సంఘాలు ఉన్నాయి. సంపూర్ణ సంఖ్యలో ఆయన సంఘాలను నియమించుకున్నాడు. అలాంటప్పుడు ఆయనొక రథశారథి. ఆయనకు సంపూర్ణ సంఖ్యలో గుఱ్ఱాలున్నాయి. అందులో నేనొక గుఱ్ఱాన్ని. నేను మొండికేస్తే ఆయన నా విషయంలో నన్ను కూడా కొరడా దెబ్బలు కొడతాడు. ఆయన నా కళ్ళకు కూడా గంతలు కడతాడు. ఆయన నాకు కూడా కళ్ళెము వేస్తాడు. నేను కూడా ఒక గుఱ్ఱంలా క్రీస్తు కొరకు పనిచేయాలి.

అందుకే బైబిల్‌లో ఏమన్నాడో తెలుసా? ఒక సందర్భంలో మనలను నిష్ప్రయోజకులైన దాసులనుకోమన్నాడు. **లూకా సువార్త 17 : 7 – 10** లో నిష్ప్రయోజకులైన దాసులు అంటే ఎవరో చెప్పండి, సర్వెంట్స్! అలాగని, **1 పేతురు 2 : 9** లో ఏమన్నాడు? మీరు యాజకులు, మీరు రాజులు, మీరు పరిశుద్ధులు అన్నాడు. అక్కడ స్వతంత్రులు, రాజులు అన్నాడు. ఇక్కడ దాసులు అన్నాడు. దీనికి అర్థం ఏమిటి? భూమి మీద మీరు, మీకంటే వాక్యం ఎక్కువ తెలిసినవారియెడల మీరు దాసులు, మీరు గుఱ్ఱాలు. వారు మీకు దైవములు కనుక వారుచెప్పిన మాటలను (వాక్యమునకు ఏకీభవించినప్పుడు మరియు సత్యసంబంధమైనవి అయినప్పుడు మాత్రమే) మీరు స్వీకరించాలి. లేని పక్షంలో, దేవుడే మిమ్మల్ని స్వీకరించడు. మీరు రాజులెప్పుడౌతారు? మీరు పరిశుద్ధులెప్పుడౌతారు? మీరు రథశారథులు ఎప్పుడౌతారు? మీ క్రిందనున్న వారికి మీరు రథశారథులుగా ఎప్పుడు మారతారు? గుఱ్ఱము దశలో ఉన్నప్పుడే మీలో అంత గొప్ప క్వాలిటీ రావాలి. గుఱ్ఱము గానే మీరు ఫెయిల్ అయిపోతే, ఇక రథశారథి ఏమవుతారు? గుఱ్ఱముగానే మీరు అసమర్ధులయ్యారు, తొట్రిల్లిపోయారు. చాలా దెబ్బలు తినేసారు, అవి మానడానికే బోలెడు సమయం పడుతుంది. ఇక మీరు రథశారథి కాగలరా? మీరు మార్పు నొందితే, మీకు రథశారథి అయ్యే అవకాశముంది.

ఎలా ఉందంటే, లోకములో మీకంటే తక్కువ వాక్యము తెలిసినవారుంటారు. వారి దగ్గర మీరే వారికి దైవములు. వారికి మీరే రథశారధులు, వారికి మీరే పరిశుద్ధులు. కనుక మనమందరము పరిశుద్ధులైన దాసులము. దేవుని దగ్గర మనమందరము దాసులమే. దేవుని దగ్గరకు వస్తే నేను కూడా ఆయనకు ఒక గుర్రాన్నే. నాకు రథశారధి క్రీస్తు. మనము దేవుని పనిని ఒక సంఘములో చేస్తున్నప్పుడు, మీరు గుర్రాలుగా ఉంటే, నేను రథశారధిగా దీనిని నడిపించాలి. దేవుని పనిని ముందుకు తీసుకుని వెళ్ళాలి. అందుకే రథము ముందుకు వెళ్ళడానికి దీర్ఘశాంతముతో నేను ఖండిస్తున్నాను. దీర్ఘశాంతముతో నేను గద్దిస్తున్నాను. దీర్ఘశాంతముతో నేను బుద్ధి చెపుతున్నాను. ఎన్ని చెప్పినా, గుర్రము ఇక మాట వినడం లేదనుకోండి. దానికి కూడా ఒక సమయం వస్తుంది. ఆ సమయములో బండి సనేమి నడవదు. మిగిలిన గుర్రాలకు కూడా ఇదొక సమస్య. మిగిలిన గుర్రాలకు ఒకవేళ నిజం తెలియకపోతే అవి ఏమనుకుంటాయో తెలుసా? ఎప్పుడూ మా రథశారధి, ఆ పని చేయని గుర్రాన్నే కొట్టేస్తున్నాడేమిటి? ఇదేమి బాగోలేదు. నా తోటి గుర్రం ఎప్పుడూ రక్తము కార్చుకుంటూనే ఉంటుంది అని ఈ మిగిలిన గుర్రాలు డిస్టర్బ్ అవ్వకూడదు, వాటి మైండ్ పాడవ్వకూడదు. ఎందుకంటే మిగిలిన గుర్రాలు రథశారధి ఆలోచించినట్లుగా ఆలోచించవు. అప్పుడు ఏమి చేయాలంటే, ఆ మొండికేసిన గుర్రాన్ని వెంటనే కాడిలోనుంచి తీసేయాలి. ఇలాంటి పరిస్థితులలో బండిని ముందుకు నడిపించాలి, గమ్యము చేరాలంటే ఇంతకంటే మంచి పని ఉంటుందా? ఇంతకంటే సుళువైన ఉపాయము లేనే లేదు. ఇదే మంచి ఉపాయము.

**మత్తయి 7 : 6** "పరిశుద్ధమైనది కుక్కలకు పెట్టవద్దంటున్నాడు". ఇంతకీ ఇవి ఏ కుక్కలు? మనం ఇంట్లో పెంచుకుంటున్న జూలు కుక్కలు కాదు. వీధిలో తిరుగుతున్న ఊరకుక్కలూ కాదు. కుక్కలతో పోల్చాడు, పందులతో పోల్చాడు. ఎవరిననుకుంటున్నారు? తన పిల్లల్నే. దేవునివైపు మీ మనసు మారకపోతే ఆయన ఎవరితోనైనా పోల్చేస్తాడు. తన పనిని ముందుకు నడిపించకపోతే ప్రకృతిలో ఉన్న ఏ జంతువుతోనైనా, ఏ పురుగుతోనైనా పోల్చేస్తాడాయన. దేనితోనైనా బుద్ధి చెప్పిస్తాడు. రథసారధితో బుద్ధి చెప్పించుకోవటం ఒకవేళ నీకు నామోషి అయితే పందితో నీకు బుద్ధి చెప్పిస్తాడు. ఆ రోజు బిలాముకు గాడిదతో బుద్ధి చెప్పించాడు. ఎందుకంటే, బిలాము దేవుని మాటలు వినే అవకాశము కోల్పోయాడు, వద్దనుకున్నాడు. కనుక ఇక ఎవరితో బుద్ధి చెప్పిస్తాడు? గాడిదతోనే బుద్ధి చెప్పించాలి. కొన్ని గాడిదలు బయట ఉన్నాయి. కొన్ని కుక్కలు బయట ఉన్నాయి. కొన్ని పందులు బయట ఉన్నాయి. వాటితోనే బుద్ధి చెప్పిస్తాడు. అప్పుడు మీకు ఇంకా చాలా అవమానం కలుగుతుంది. దేవుడు ఏమని వ్రాయించాడో చూడండి. పరిశుద్ధమైనవి కుక్కలకు పెట్టకుడి. నేను చెబుతున్న ఈ వాక్యం ఎక్కడిదో తెలుసా? దైవగ్రంథములోనిది మాత్రమే. గుర్రాలను సరైన మార్గములో నడిపించడానికి ఒక రథసారధి ఎంత ఆలోచిస్తాడో తెలుసా? ఏదో కొరడా దెబ్బపడిందని, సరైన మార్గంలో వెళ్ళడం మానేసిన గుర్రం ఎలా ఆలోచిస్తుందో తెలుసా? నన్నే కొట్టేస్తున్నాడు, నాకే దెబ్బ తగులుతుంది. ఇంకెవ్వరినీ కొట్టడం లేదు. కనుక నేను అలుగుతాను, భీష్మించి కూర్చుంటాను అనుకుంటుంది. అలా చేస్తే ఏమి జరుగుతుందో తెలుసా? పరిశుద్ధమైనవి కుక్కలకు పెట్టకుడి, పందుల యెదుట ముత్యములు వెయ్యకుడి అన్న మాట ప్రకారము, ఇక మీకు దేవుని వాక్యము చెప్పడం అనవసరం అన్నమాట. దేవుని దగ్గర నుండి అనుగ్రహింపబడిన ఆ పరిశుద్ధమైన దానిని, మీ ముందు పెట్టకూడదన్నమాట. మీరు వాటిని త్రొక్కేస్తారని అర్థమైపోయింది. మీకు వాటి విలువ తెలియడంలేదు కనుక ఇదేమి బోధ, ఇదేమి వాక్యము? అనుకున్నారు. పంది కూడా అలాగే అనుకుంటుంది. ఇవేమి ముత్యములు? వీటిని నేను త్రొక్కేస్తాను అనుకుంటుంది. పరిశుద్ధమైనది దాని దృష్టికి నీచముగా కనిపిస్తుంది. నాకు ఆ పెంట మీద ఉన్నదే కావాలని పోతుంది. పరిశుద్ధమైనదిగా, కుక్కలకు కనిపిస్తుందా? కనిపించదు. ఇది దేవుని వాక్యము! నాకైనా వాక్యమే, మీకైనా వాక్యమే, ప్రపంచంలో ఎవ్వరికైనా వాక్యమే. ఇది మేలు చేసే మాటే తప్ప కీడు చేసే మాట కాదు. ఇలా ఆలోచించి కొన్ని గుర్రాలు నా బండిలోనుంచి వెళ్ళిపోయాయి. వాటిని వదిలేసాను. ప్రారంభంలో నేను ఏర్పరచుకున్న గుర్రాలు, నా చేత పిలువబడిన గుర్రాలు, ఈ బండిని నడిపించే గుర్రాలు మదమెక్కి పోయాయి. నా మాటను రథసారధి వినాలి తప్ప, రథసారధి మాటను నేను వినను అన్నాయి. అలా మొండికేసిన కొన్ని గుర్రాలను విప్పేసాను. ఆ గుర్రాలు నిరభ్యంతరంగా వెళ్ళిపోవచ్చు అని చెప్పాను. వాటి దారిన

అవి వెళ్ళిపోయాయి. ఇప్పుడు వాటి పరిస్థితి ఎలా ఉందో చూసారా? రోడ్డు మీద ఎలా మేస్తున్నాయో చూసారా? వాటికిష్టమొచ్చినట్టు తిరుగుతున్నాయి. కనిపించిన ప్రతీ ఒక్కరిని మోసగిస్తున్నాయి. ఆస్తులు సంపాదించుకుంటున్నాయి. ఇప్పుడు ఆ గుర్రానికి కావలసింది అదేనా? ఒకప్పుడు రథసారథి దగ్గర ఉండి వెళ్ళిపోయిన ఆ గుర్రాలకు కావలసింది అదేనా? ఒక చర్చ్ బిల్డింగా నీకు కావల్సింది? ఒక చిన్న భూమి ముక్కా నీకు కావలిసింది? చిన్న పళ్ళెటూరులో చిన్న స్థలం ముక్క కావాలా నీకు? దేనిని కోల్పోయి, దేనిని సంపాదించావు నీవు? దేవుని రథశారధి దగ్గర ఆ బండిలో ఒక గుర్రం పొజిషన్ కోల్పోయిన నీవు, దేనిని కాపాడుకున్నావు? దేనిని దక్కించుకున్నావో తెలుసా? చిన్న స్థలం సంపాదించుకున్నావు అంతే. అది 3 సెంట్లు లేదా 6 సెంట్లు, పోని మహా అయితే 10 సెంట్లు భూమి ఉంటుంది. దానినా నీవు కోరుకున్నది? దీని కోసమా ఆ రోజు నీ మాట వినాలని రథసారధికి చెప్పింది. అందుకే నీమాట వినను అన్నాడు ఆ మంచి రథసారధి. రథసారధి నువ్వు చెప్పినట్టు వినకూడదు. డబ్బు కూర్చుకొనడు, ఎవరి దగ్గరా ఏదీ ఆశించడు. దానిని ఆశించి నీ చేతికి అప్పగించడు. దోపుడు సొమ్ముగా నిన్ను పెంచడు. నిన్ను ధనవంతునిగా మార్చడానికి ఇష్టపడడు. ఎందుకంటే మంచి రథసారధి దేవునికి ప్రతినిధి. గుర్రం రథసారధి మాట వినకపోతే, రథాన్ని లాగకపోతే, తన మార్గాన వెళ్ళిపోతుంది. రథసారధి దాని మీద ఆ దేవుని కాడిని విప్పేస్తాడు. వెళ్ళిపోయిన ఈ పనిచేయని గుర్రాలు ప్రజల మెప్పుకోసం మళ్ళీ క్రొత్త రథములో చేరతాయి. నలుగురూ ఏమనుకుంటారో అని ఈ రథములో పనిచేయ చేతకాని దద్దమ్మ గుర్రాలు వేరే రథములో చేరతాయి. కానీ ఈ బండి వెళుతున్న వేగంతో, ఆ బండి ఎప్పటికీ వెళ్ళలేదు. ఎందుకంటే ఇది సూపర్ ఫాస్ట్. ఈ బండి వేగంతో ఆ బండి రాగలదా? రాలేదు. ఎందుకంటే మంచి రథసారథి తన గుర్రాలను ఎప్పుడూ క్రమశిక్షణలో పెడతాడు. అవి ఎల్లప్పుడూ మంచి కండిషన్‌లో ఉంటాయి. నీ బద్దకం, నీ పొగరుబోతుతనం, నీ అధికారదాహం... ఇవన్నీ నీవు వెళ్ళిన క్రొత్త రథములో చెల్లుతాయేమో, దేవుని రథసారధి దగ్గర అవన్నీ చెల్లవు.

దేవుని రథసారధి దగ్గర ఉన్నప్పుడు నేను అది చేసాను, నేను ఇది చేసాను, నేను బండిని ఇంత గొప్పగా లాగాను. అయినా చూసావా నాకెన్ని దెబ్బలో అని చూపించుకుంటుంది అందరికీ. పిచ్చి గుర్రమా, నీవు సరి అవ్వాలనే నేను నిన్ను కొట్టాను. ఈ మంచి గుర్రాలలో, ఈ మంచి గుంపులో చేర్చాలనే నా ప్రయత్నం. నిన్ను వదిలేసేవాణ్ణే అయితే ప్రపంచంలో ఎంతోమంది ఉన్నారు. వారందిరిలా నిన్ను కూడా వదిలేసేవాణ్ణి. చెడ్డ రథసారధిని అయితే, నేను నిద్రపోయి మీ ఇష్టం, మీరే బండిని నడిపించుకోండి, నాకు అనవసరం అనాలి కదండి. పోని ఈ చెడి పోయిన గుర్రము దగ్గర నేనేమయినా పైకము తీసుకుంటున్నానా? అన్ని గుర్రాల దగ్గర నేనేమయినా ధనాన్ని ఆశిస్తున్నానా? లేదు. మనమంతా మంచి మార్గములో, సజావుగా మంచి ప్రయాణం చేయాలి. ఈ జీవితకాలంలో గమ్యాన్ని చేరుకోవాలి. మంచి రథసారధి దగ్గర నుండి వెళ్ళిపోయిన గుర్రాలకు ఇప్పుడు దిక్కులేదు. చెడిపోయిన నీ కోసం, నీకంటే ముందే చెడిపోయి వెళ్ళిన గుర్రాలు ఎదురుచూస్తున్నాయి. ఈ దేవునిరథములో నుంచి ఏ గుర్రము వెళ్ళిపోయినా, వెంటనే వాళ్ళ గుంపులో చేర్చుకుంటాయి. చెడిపోయిన గుర్రాల రాక కోసం ఆశక్తితో ఎదురుచూస్తాయి. ఎందుకంటే, నిజమైన రథసారధిపై వారికి చాలా కోపము ఉంది. దేవునిరథములో నుండి ఏ గుర్రము బయటికి వెళ్ళినా, ఆ గుర్రమును వారు ఒక మంచి అతిథిగా స్వీకరిస్తారు. ఇలాంటి చెడిపోయిన గుర్రాలకోసం ఎల్లప్పుడూ వారు ఎదురు చూస్తూనే ఉంటారు. ఏ గుర్రమయితే చెడిపోయిందో, ఏ గుర్రమయితే గర్వపడిందో, ఆ గుర్రానికే వారు కనెక్ట్ అవుతారు. దేవునిరథములో అనగా దేవునిపనిలో ఉన్న గుర్రాలకు వారు కనెక్ట్ అవ్వరు. ఎందుకంటే పనిలో ఉన్న గుర్రాలకు వారి మాటలు, వారి చేష్టలు, వారి పిలుపులు, వారి రంకెలు, ఇవన్నీ వినడానికి సమయము లేదు. పనిచేయని గుర్రాలు రథములో ఏమి చేస్తాయి? ఎప్పుడూ ఇటూ అటూ చూస్తూ ఉంటాయి. కళ్ళకు గంతలు తీసేసుకుంటాయి, కళ్ళెమును తీసేసుకుంటాయి. ఇక దాని కంట్రోల్ రథసారధి చేతిలో (దేవుని చేతిలో) ఉండదు. దాని ఇష్టమును అది నెరవేర్చుకుంటుంది. దానిని కాడిలో నుంచి తీసివేయడమే ఆలస్యం. విడిచిపెట్టగానే రథసారధి యొద్దనుండి వెళ్ళిపోతాయి. పని చేయని తిరుగుబాటు చేసే గుర్రాల గుంపులో చేరిపోతాయి. ఆ గుంపులోనికి ఈ గుర్రము వెళ్ళగానే వారు ఊరుకుంటారా? చీల్చి చెండాడేస్తారు. ఎందుకంటే ఇలాంటి పనికిమాలిన గుర్రము కోసమే

వారు ఎప్పటినుంచో ఎదురు చూస్తున్నారు. వారు తమ స్వకీయ దురాశల కోసం ఎదురుచూస్తున్నారు. నీవు వెళ్ళగానే నీ ద్వారా కొంత డబ్బును, పలుకుబడిని సంపాదించుకుందామని చూస్తారు తప్ప నీ మీద ప్రేమచేతనో, నిన్ను రక్షించాలనో మాత్రం కాదు. అలా అనుకుంటే ప్రపంచంలో ఎంతోమంది ఉన్నారు. వారందరినీ రక్షించమనండి, వారి చేత కాదు. ఈ దేవునిరథములోనుండి వచ్చిన గుర్రమయితే బాగా దెబ్బలు తినీ, తినీ ఉంది కనుక ఇది నా దగ్గరైతే బాగా పనికొస్తుంది. దేవునిరథములోనుండి బయటకు వచ్చిన గుర్రము కనుక, ఈ ఎక్స్‌పీరియన్స్ గుర్రాన్ని నేను తెచ్చుకుంటే, నా దురాశలను తీర్చుకోవడానికి (దేవునిమీద కోపముతో, నా మీద ప్రేమతో) ఇది నాకొరకు బాగా పనిచేస్తుంది అని వారు అనుకుంటారు. ఎందుకంటే ఇందులో ఉన్న వారికి కొంత ఎక్స్‌పీరియన్స్ వచ్చింది కదా? దేవునిరథము నుండి వెళ్ళిపోయిన గుర్రము ఈ అనుభవాన్ని వారి దగ్గర ఉపయోగిస్తుంది. చరిత్రలో ఇలా చాలా గుర్రాలు దేవునిరథాన్ని వదిలి వెళ్ళిపోయాయి. అలా వెళ్ళిన గుర్రాలకు ఇప్పుడు అడ్రస్ లేదు. ఆ గుర్రాలు దేవుని జ్ఞానమును తెలుసుకోవడానికి అవకాశము కూడా లేదు. నా దగ్గర నుండి డబ్బు సంచి పట్టుకుని ఒక గుర్రము వెళ్ళిపోయింది. దేవునిపని జరిగించమని సంఘమంతా వారి అర్పణలను పోగు చేసి ఇస్తే, డబ్బు సంచి పట్టుకుని ఒక ధనాశ కలిగిన గుర్రము దేవుని దగ్గరనుండి పారిపోయింది. దానికి రథములోనుండి కట్లు విప్పేసాను. ఇక నీవు రావలిసిన అవసరత లేదు. నీవు ఈ బండిలో, ఈ కాడిలో ఉంటే మిగిలిన గుర్రాలకు ప్రమాదం, బండికి ప్రమాదం, రథశారధికి ప్రమాదం. అందుకే దాని కట్లు విప్పగానే అది పారిపోయింది. ఇప్పుడువా గుర్రం ఎక్కడుంది? ఆచూకీ లేదు. ఏమిటండి? ఏమి సాధించాలనుకుంది ఆ గుర్రం? ఈ దేవునిరథములో ఉంటే, దాని ఆధిక్యత ఏమిటో తెలుసా? రాజు, యాజకుడు, ప్రభువుపనిలో పాలిభాగస్థుడు! ఇది దేవుడిచ్చిన గొప్ప ఆధిక్యత. కానీ, ఆ చెడ్డగుర్రము దీనినంతటినీ పోగొట్టుకుని, ఈ రోజు ఎందుకూ పనికిరాకుండా, చివరికి నిత్యత్వాన్ని కూడా కోల్పోయింది. ఎంతో శరవేగముతో దూసుకుపోతున్న ఈ దేవునిరథములో ఆ మంచి స్థానాన్ని పోగొట్టుకుంది. మంచి దేవుని రథసారధి ఇలాంటి గుర్రాలను కనిపెట్టి, రథములోనుండి తగిన సమయములో విప్పేస్తాడు. ఎందుకంటే దీర్ఘశాంతముతో ఖండిస్తాడు, గద్దిస్తాడు, బుద్ధి చెబుతాడు. ఇక, ఇన్ని చెప్పినా మారలేదు అంటే వారిది పాపపంకిల హృదయము, రాయిలాంటి మనసు. వారిని కొడితే వారి చర్మము ఊడిపోతుంది, ఎముకలు బయటకు వస్తాయి తప్ప, ఆ గుర్రము మారదు. అలాంటప్పుడు ఇక కొట్టడమెందుకు? వారిని ఇక దండించవలసిన అవసరం లేదు. వారిని ఈ రథములోనుండి తీసేయాలి. దేవునివాక్యమును విని, పనిచేసే మనసు కలిగిన మంచి గుర్రాలు ఎన్నో బయట ఎదురు చూస్తున్నాయి. వారికి దేవుని వాక్యమును చెప్పడమే ఆలస్యము. దేవుడే అవకాశమును కల్పిస్తే వచ్చి ఆ దేవునిరథమును లాగడానికి ఎన్నో గుర్రాలు బయటే ఉండిపోయాయి. ఇప్పుడు ఆ గుర్రాలకు అవకాశం ఇవ్వాలి.

దేవుని పనిని ముందుకు నడిపించే ఒక మంచి రథశారధి, ఇంతగా ఆలోచించాలి. లేదంటే చాలా కష్టము. బండి ముందుకు వెళ్ళదు, గమ్యాన్ని చేరదు. ఈ రథశారధి మాటను విని, దేవునిపనిని చక్కగా పూర్తిచేసి, ప్రయాణమును పూర్తిచేసిన ప్రతి గుర్రము, మంచి బహుమతిని పొందడానికి ఎదురు చూడాలి. ఒక చెడిపోయిన గుర్రమును రథసారధి తీసేసాడని, కొన్ని గుర్రాలు దేవుని నుండి విడిపోతున్నాయి. చూసారా? దేవుని మీదగాని, దేవుని రథశారధి మీద గాని వీరికి అభిమానం లేదు. ఈ చెడిపోయిన గుర్రము మీద అభిమానం వచ్చేసిందా? ఆ పనికిరాని గుర్రము నిన్ను గమ్యానికి ఎలా తీసుకెళుతుంది? నిన్ను ఎక్కడికి తీసుకెళుతుంది? దేవుని రథసారధిగా, నేనే ఆ చెడ్డ గుర్రాన్ని తీసేసానంటే, నేనే దాని కట్లు విప్పేసానంటే, ఆ గుర్రము ఎలాంటిదో నువ్వు అర్థం చేసుకోవాలి. ఆ గుర్రము మాట నేను వినలేదని, ఆ గుర్రం చాలా పొగరుబోతుగా మారింది. గుర్రము యొక్క మాట నేనెందుకు వింటాను? నేనేమైనా బిలాము లాంటివాడినా? **సంఖ్యాకాండము 22** అధ్యాయంలో బిలాము అనే చెడ్డ రథసారధి, బాలాకు అనే ఒక పనికిమాలిన రాజు మాటను విన్నాడు. ఇశ్రాయేలీయులను ఆశీర్వదించాలని, దీవించాలని బిలాముకు దేవుడు చెప్పాడు. కానీ బిలాము దేవునిమాటను పెడచెవిని పెట్టి, ఇశ్రాయేలీయులను శపించడానికి వెళ్ళిపోయాడు. బిలాము ఒక రథశారధిగా ఉండి, ఆ మంచి అర్హతను కోల్పోయాడు. పేతురు పత్రికలో ఆ సందర్భానికి తగిన మాటను చూడండి.

**2 పేతురు 2 : 15** "తిన్నని మార్గమును విడిచి బెయోరు కుమారుడైన బిలాము పోయిన మార్గమును బట్టి త్రోవ తప్పిపోయిరి". దేవునిరథము వెళ్ళవలసిన మార్గము, క్రీస్తు యొక్క సంఘము వెళ్ళవలసిన మార్గమే తిన్నని మార్గము. దేవుడు ఈ గుర్రాలను గూర్చి, ముందుగానే వ్రాయించాడు. ఇవి మార్గమును విడిచి వెళ్ళిపోడానికి ప్రయత్నిస్తున్నాయి. ఒకప్పుడు బెయోరు కుమారుడైన బిలాము అలాగే చేసాడు. కానీ, మంచి రథశారధి బిలాములా ఆలోచించడు కనుక ఈ చెడ్డ గుర్రానికి నచ్చడం లేదు. దేవుని రథశారధి నీకిష్టమైనటుగా ప్రవర్తించడం లేదు కనుకనే మొండికేస్తున్నావు, దెబ్బలు తింటున్నావు. ఆ రోజు బిలాము ఏమి చేసాడో చూడండి. **2 పేతురు 2 : 16** వ వచనములో బిలాము దుర్నీతి వలన కలుగు బహుమానమును ప్రేమించెను. అయితే తాను చేసిన అతిక్రమము నిమిత్తము అతడు గద్దింపబడెను. ఆ చెడ్డ రథశారధి నీచమైన బహుమతిని ఆశించాడు, మార్గము తప్పి వెళ్ళిపోయాడు. అతను చేసిన అతిక్రమము నిమిత్తము అతడు గద్దింపబడెను. ఎట్లనగా నోరులేని గార్ధభము మానవస్వరముతో మాటలాడి ఆ ప్రవక్త యొక్క వెఱ్ఱితనము అడ్డగించెను. ఎవడయితే మార్గము తప్పి వెళ్ళిపోతాడో, దేవుని జ్ఞానానుసారముగా నడచుకొనడో, ఆ రథశారధికి లేక ఆ గుర్రానికి, దేవుడు గాడిదతో బుద్ధి చెప్పిస్తాడు. గాడిదతో బుద్ధి చెప్పించడమంటే ఏమిటంటే, నీకంటే అన్ని విషయములలో చాలా తక్కువ వారు ఉన్నవారిచే నీకు బుద్ధి చెప్పిస్తాడు. అయ్యో! చిన్న పొరపాటు చేసినందువలన ఆ పరలోక మహాభాగ్యాన్ని కోల్పోయావా? ఆ దేవునిరథములో స్థానాన్ని కోల్పోయావా? ఆ మంచి రథసారధి దగ్గర నీ విలువను కోల్పోయావా? అయితే ఒక గాడిద వచ్చి నిన్ను ప్రశ్నిస్తుంది. ఆ రోజు బిలామును అలాగే ప్రశ్నించింది. బాలాకు రాజు ఇచ్చే ఒక చిన్న బహుమానానికి ఆశపడి, ఇశ్రాయేలీయులను శపించడానికి పూనుకున్నావా? ఎంత దౌర్భాగ్యుడవు నీవు? అని ఒక గాడిద బిలామును అడిగింది. అక్కడ ఆ గాడిదే కనుక లేకపోతే, ఒక దేవదూత ఖడ్గముతో బిలామును చంపేయడానికి సిద్దపడిపోయింది. అంటే దేవుని మాటను విడిచి, దేవుని రథములోనుండి పోయినవారు చాలా భయంకరమైన పరిస్థితుల్లో ఉన్నారని అర్థం చేసుకోవాలి. అందుకే దేవుడు తన వాక్యముగా, తన మాటగా, చిట్టచివరి పలుకులుగా నీకు చెబుతున్నాడు. ఇంకనూ నీవు మారనంటావా? నీ మీద ఉన్న ఆ కాడిని తీసేస్తాడు, నీ కట్లు విప్పేస్తాడు. నీవు నీ ఇష్టానుసారముగా వెళ్ళిపోవచ్చు. ఈ రథములో ఉన్నంతసేపు రథశారధి మాటను నీవు ఖచ్చితంగా వినాలి. ఇది దేవుని శాసనం.

**2 తిమోతి 2 : 4** "సైనికుడు ఎవడును యుద్ధమునకు పోవునప్పుడు, తన్ను దండులో చేర్చుకొనిన వానిని సంతోషపెట్టవలెనని యీ జీవన వ్యాపారములలో చిక్కుకొనడు" అని వ్రాయబడి ఉంది. చూసారా? ఏ సైనికుడయినా యుద్ధమునకు పోయినప్పుడు తన ధ్యాసంతా యుద్ధము మీదే ఉండాలి. మనమంతా దేవుని తరపున యుద్ధంలో పోరాడడానికి వెళుతున్నాము. మన సైన్యము, మన రథము, మన గుర్రాలన్నీ, దేవుని ఆశను నెరవేర్చడానికి, శత్రుసైన్యమంతటిని చీల్చి చెండాడడానికి ఒక మంచి ప్రయాణమును చేయాలి. సైనికుడు యుద్ధమునకు పోయినప్పుడు, తనను సైన్యములో చేర్చుకొనిన వానిని సంతోషపెట్టవలెనని, తన పైనున్న రథశారధిని సంతోషపెట్టాలని ఆలోచిస్తాడు. ఎలా సంతోషపెట్టాలి? చిన్న చిన్న ఫలహారాలు తీసుకొచ్చి ఇస్తే రథశారధి సంతోషపడతాడా? నిజమైన రథశారధికి నిజమైన సంతోషం ఎప్పుడు? నీవు రథమును రథసారధి చెప్పిన మంచి మార్గములో తీసుకుని వెళుతున్నపుడు నిజమైన రథశారధికి నిజమైన సంతోషం. అందుకే ప్రతి సైనికుడు, తన్ను దండులో చేర్చుకొనిన వానిని సంతోషపెట్టాలి. కానీ నీవు ఈ జీవన సంబంధమైన వ్యాపారములలో చిక్కుకుంటున్నావా? కుటుంబములో నీ భార్య చెప్పిందని మారిపోయావా? కుటుంబములో నీ భర్త చెబితే మారిపోయావా? కుటుంబములో నీ పిల్లలు చెప్పారని మారిపోయావా? లేదా నీ స్నేహితులు చెప్పారని మారిపోయావా? నీ వర్గములో కొంతమంది చెప్పారని మారిపోయావా? వీరందరి మాటలను ఆలకిస్తున్నావా? తస్మాత్ జాగ్రత్త. దేవునికంటే ఎవ్వరినీ ఎక్కువగా ప్రేమించకూడదు. దేవుని రథాన్ని తీసుకొని వెళ్ళే నిన్ను అడ్డగించే మాట ఎవరు చెప్పినా, నీవు వెంటనే వారిని షటప్ అని చెప్పాలి. దేవుని దగ్గర నీ భార్య గొప్పదా? నీవు పుట్టిన తరువాత సుమారు 25 సంవత్సరాల తరువాత నీ భార్య నీ జీవితం లోనికి వచ్చింది. నీ పుట్టుకతో వీరందరూ రాలేదు, నీ చావు వరకు వీరందరూ నీతో ఉండరు. నీకు వీరు ముఖ్యం కాదు. నీ పరలోకపు తండ్రే నీకు ముఖ్యం. నీవు పరలోకానికి వెళ్ళాలి.

ప్రియులారా! ఆలోచించండి. సరిగ్గా నడవని గుర్రానికి ఇదే చిట్టచివరి దెబ్బ. మరలా చెబుతున్నాను. ఇవే చివరి మాటలు. ఇప్పుడున్నవారిలో ఏ గుర్రము సరిగా వెళ్ళడం లేదో సదరు గుర్రానికి తెలుసు, నడుపుతున్న రథశారథికి తెలుసు. మిగిలిన గుర్రాలకు ఈ పనికిమాలిన గుర్రమును గూర్చి తెలియకపోవచ్చు. ఎందుకంటే అవి కళ్ళకు గంతలతో ఉన్నాయి. గంతలు ఉంటే కళ్ళు ప్రక్కకు కనిపించవు. ప్రక్కన ఉన్న గుర్రాలు ఎలాంటి వేషాలు వేస్తున్నాయో, ప్రక్కన ఏమి జరుగుచున్నదో తెలియదు. వారు కేవలం గమ్యం మీద మాత్రమే తమ దృష్టిని పెట్టాలి తప్ప, ఈ గుర్రం ఏమి చేస్తుందో, దాని ప్రక్కనున్న గుర్రం ఏమి చేస్తుందో వారికి అవసరం లేదు. నీవు చూడవలసింది ఇవి కాదు, నీ మార్గంలో నీవు తిన్నగా వెళ్ళిపోవాలి. ఒకవేళ ప్రక్కకు తప్పావా, బిలాములా మారినట్టే. ఇవన్నీ రథశారథి చూసుకుంటాడు. ఏ గుర్రము సరిగ్గా పనిచేయడం లేదో ఏ గుర్రము పనిచేస్తుందో, ఏ గుర్రము ఆగిపోతుందో, ఏ గుర్రము వలన బండికి బ్రేక్ పడుతుందో? ఇవన్ని రథశారధి చూస్తున్నాడు. అలాంటప్పుడు ఒక్కసారి బండిని ఆపుతాడు. చెడ్డ గుర్రాన్ని రథములోనుండి తొలగిస్తాడు. పనికిమాలిన గుర్రాన్ని తొలగించినప్పుడు మిగిలిన గుర్రాలు, ఔరా... ఇప్పటివరకు మాతో కలిసి రథమును లాగిన ఈ గుర్రము వెళ్ళిపోతుందా? ఇక మీదట మేమే ఈ రథమును నడపాలన్న మాట. ఏదైనా గుర్రము దేవునిపనిలో ఉత్సాహంగా ఉంటే దానిని ఆ తొలగించిన స్థానములో కట్టాలి. చెడిపోయిన గుర్రాలు, వెళ్ళిపోతున్న గుర్రాలు, ఒకవేళ అనుకోచ్చు. నేను లేకపోతే కుదురుతుందా? నిజమే, నీవున్నప్పుడు రథము వేగముగా వెళ్ళింది. అలాగని నువ్వు లేకపోతే బండి ఆగిపోదుగా. రథసారధికి అధిపతి అయిన క్రీస్తు, ఒకవేళ రథసారధికి కేవలం ఒక్క గుర్రాన్నే ఇచ్చాడు అనుకుందాం. అప్పుడు కూడా రథాన్ని నడిపించాలి. ఒక్క గుర్రముతో అయినా పరలోకము వెళ్ళిపోవచ్చు. రథము మొత్తానికి ఆగిపోవడం కంటే కాస్త నెమ్మదిగా వెళ్ళడం మంచిదే. ఎందుకంటే కొన్ని బక్కచిక్కిన గుర్రాలు ఉంటాయి. అన్ని గుర్రాలు ఒకేలా ఉండవు. మరికొన్ని బాగా ధృడంగా ఉన్న గుర్రాలు ఉంటాయి. వాటికి కాస్త బలం ఎక్కువగా ఉంటుంది. బక్కచిక్కిన గుర్రానికి రోజూ మేత బాగా పెట్టి, ట్రైనింగ్ ఇవ్వాలి. నీవు సరిగా పని చేయకపోతే నీ స్థానం మరొకరికి ఇచ్చేస్తాను అని చెబితే అదికూడా చక్కగా నేర్చుకుంటుంది. క్రొత్తగా వచ్చిన గుర్రాలకు శిక్షణ ఇవ్వడం రథసారధికి క్రొత్తకాదు. ఎందుకంటే దేవుని రథసారధి ఈ రథమును అనగా దేవుని పనిని ప్రారంభించాడు. దేవునికి చిట్టచివరి గమ్యాన్ని చేరి చూపించాలి. ఈ సంఘాన్ని, ఈ రథాన్ని దరిచేర్చి చూపించాలి. అందువల్ల, చెడిపోయిన గుర్రాలకు పడిన ఈ చిట్టచివరి దెబ్బ వారి మార్పును కోరుకుంటుందో, లేక వారిని దేవునిరథము వదిలేస్తుందో వారే నిర్ణయించుకోవాలి. నిర్ణయం రథసారధి చేతుల్లో ఉండదు. మంచి దెబ్బ కొడతాడు. కనుక నొప్పిగా ఉన్నా, దెబ్బను మంచిదిగా స్వీకరించండి. తలిదండ్రుల దగ్గర దెబ్బలు తిన్న కుమారుడు మంచిగా స్వీకరిస్తే, అప్పటినుండి మంచిగా మారిపోతాడు. లేదనుకోండి, ఇంటిలోనుంచి పారిపోతాడు. మా అమ్మ నన్ను కొట్టేస్తుంది, మా నాన్న నన్ను కొట్టేస్తున్నాడు. కాబట్టి నేను ఇంటిలోనుంచి వెళ్ళిపోతాను. లేదంటే నేను ఫలాన ఊరు వెళ్ళిపోతాను. బస్సెక్కేస్తాను, ట్రైన్ ఎక్కేస్తాను అనుకుంటాడు. ఇక వాడి ఆచూకి దొరకదు. ఏమి కావాలో మీరే నిర్ణయించుకోవాలి. దేవుని రథము ఎల్లప్పుడూ మంచి ప్రయాణంలో ఉంటుంది. చివరిగా ఒక్కసారి దేవుడు ప్రకటన గ్రంథములో ఏమంటున్నాడో చూద్దాం.

**ప్రకటన 2 : 2** "నీ క్రియలు, నీ కష్టమును, నీ సహనమును నేను ఎరుగుదును". దేవునిరథము వలన పని జరుగుతుంది. ఎక్కడ చూసినా దేవుని పని. సంఘము యొక్క క్రియలు దేవునికి తెలుసు. తండ్రి మనలను గూర్చి సాక్ష్యమివ్వాలి. ఆయన కుమారుడైన క్రీస్తు మనకోసం అలాగే చెప్పాలి. నీకున్న శక్తి కొంచెమే, నీ రథము చాలా చిన్నది, నీ దగ్గర ఉన్న గుర్రాలు కూడా చాలా బక్కగా ఉన్నాయి. కానీ దేవుని కొరకు ఎంతో ఎక్కువైన పనిని చేయాలని ఆశపడుతున్నాయి. దేవుడు ఆకాశమంత ఎత్తులో మనలను గూర్చి ఈ మాటలు వ్రాయించాడు. ఎంతమంది రథాన్ని అర్థాంతరముగా విడిచి వెళ్ళిపోయినా, పరలోకపు తండ్రి మనలను, మన పనిని మెచ్చుకున్న ఆ మధుర క్షణాలు చాలా గొప్పవి. ఇది రథసారధి గొప్పతనం కాదు, రథసారధి దగ్గర ఉన్న గుర్రాల గొప్పతనమూ కాదు. ఇది కేవలం దేవుని గొప్పతనం. అలాగని రథశారధి ఎప్పటికీ గర్వపడకూడదు. నామాట నువ్వు వినాలి, నేను క్రీస్తుమాట వినను అనకూడదు. క్రీస్తుకు రథసారధి కూడా ఒక గుర్రమే. ఎల్లప్పుడూ క్రీస్తుకు అందరూ దాసులమే. క్రీస్తుకు

ఇష్టానుసారమైన దాసుడనుగా నేనుండాలని ప్రతి రథసారధి అనుకోవాలి, అలాగే ఉండాలి. నా క్రీస్తు ఏమి చెప్పినా నేను శిరస్సువంచి దానిని అంగీకరించాలి. నా కుటుంబములో ఎవరు ఏమిచెప్పినా, దేవునిని పల్లెత్తు మాటకూడా అనకూడదు. నాకు అందరూ దేవుని తరువాతే! కుటుంబములో ఉన్న భార్యగాని, బంధువులు గాని, పెద్దలుగాని, స్నేహితులుగాని, ఎవరైనా నాకు లెక్కలేదు. అందరూ నా పరలోకపు తండ్రి తరువాతే. అందరూ క్రీస్తు మాట వినాలి. నీవు ఎవరి మాట వింటున్నావు? ఎవరి దగ్గర సలహా తీసుకుంటున్నావు. క్రీస్తు దగ్గరకు రండి, ఆయన మాటలు కలిగిన నా దగ్గరకు రండి. నేనిస్తాను మీకు మంచి సలహా. మీ భర్త నడుగుటకంటే నా దగ్గరకు వచ్చి అడగండి. మీ భార్య నడుగుట కంటే నన్ను అడగండి. అయ్యా! మేము ఏమి చేయాలి? ఎలా ఉండాలి? దేవునియందు మంచి క్రమశిక్షణతో మేము ఎలా ఉండాలి? ఎలా దిద్దుబాటు చేసుకోవాలి? అని నన్ను అడగండి. అంతేగాని, నీలో నీవు ఎక్కడికో వెళ్ళిపోయి సకిలించడం కాదు. ఆ సకలింపు నా దగ్గరకు వచ్చి సకిలించాలి. అప్పుడు నిన్ను దెబ్బకొట్టాలో, లేకపోతే నిన్ను ఇంకా క్రమశిక్షణతో తర్ఫీదునివ్వాలో ఇచ్చి, మంచి గుర్రముగా, మార్గములో గమ్యానికి తీసుకొనిపోయే గుర్రముగా నిన్ను తయారుచేస్తాను. చిన్న చిన్న కుంటిసాకులతో చాలా గుర్రాలు దారి తప్పుతున్నాయి. భోజనకార్యక్రమంలో చికెన్ సరిగ్గా ఉడకలేదని, బియ్యం సరిగా ఉడకలేదని, తిండిబోతులైన కొన్ని గుర్రాలు పారిపోతున్నాయి. పాట పాడటానికి అవకాశం ఇవ్వలేదని ఒక గుర్రము, వాక్యోపదేశము ఇవ్వలేదని ఒక గుర్రము పాడైపోయింది. ఇలాంటి వారికి వాక్యముతో దెబ్బ కొట్టాలి. నన్ను ద్వేషించడానికి ప్రయత్నించకండి. ఎందుకంటే దేవుడు చెప్పమన్నాడు కాబట్టి నేను మీకు చెపుతున్నాను. ఈ రోజు మీ మీద ద్వేషంతో ఈ మాటలన్నీ చెప్పడం లేదు. ఎవరైనా నాకు సమానమే. మీరు నా రక్త సంబంధీకులైనా, మీరు నా స్నేహితులైనా, మీరు నాకు దగ్గరవారైనా, దూరపువారైనా, ఎవరైనా నాకు సమానమే. ఎందుకంటే మనమందరము ఒక్కడైన ఆ తండ్రికి పుట్టిన పిల్లలం, ఆ దేవునికి కుమారులం! మనము ఈ దేవునిరథములో ఉన్నప్పుడు రథానికి అన్యాయం చేయకూడదు. రథశారధి మాట వినాలి, దేవునివాక్యమును నెరవేర్చాలి!

ప్రభువునందు నమ్మకస్థుడు,<br>**జె. మణి కుమార్**<br>సన్ ఆఫ్ గాడ్ – క్రైస్ట్ చర్చ్ – సామర్లకోట – 8978414178.

## ప్రశ్నలు

1. క్రీస్తు సంఘమును రథముతో పోల్చి వివరించండి.
2. యుద్ధమునకు పోవు సైనికుడు ఎలాంటి సంసిద్ధతతో ఉండాలి?
3. బిలాము చెడ్డ బహుమానమును ఆశించుటవలన ఏమి జరిగింది?
4. గుర్రము ఖచ్చితముగా రథసారథి మాటను వినాలి! ఈ విషయమును వివరించండి.
5. వాక్యమును ఉపదేశించుటకు దీర్ఘశాంతము ఉండాలన్న విషయమును చర్చించండి.
6. 'నిష్ప్రయోజనమైన దాసులు – రాజులైన యాజకులు' ఏ సందర్భములో ఎవరు ఎవరో వివరించండి.
7. పరిశుద్ధమైనది కుక్కలకు ఎందుకు పెట్టకూడదు? పందులయెదుట ముత్యములు ఎందుకు జల్లకూడదు.

# 10. దేవుని కులం ఏమిటి?

ప్రభువునందు ప్రియమైన సోదర సోదరీమణులరా!

పరలోకమందున్న తండ్రి అనుగ్రహించిన కృప వలననే దేవునియొక్క జ్ఞానము ఇలా ఈ పుస్తక రూపములో ప్రకటింపబడుచున్నది. భూమి మీద అనేక మైదానాలు(గ్రౌండ్స్) ఈ రోజు మనకు కనిపిస్తున్నాయి. ఒక మైదానం లేదా ఒక ఖాళీ స్థలము కనిపించగానే అందులో క్రీడలు ఆడాలనుకుంటారు. మరొకడు వ్యాపారం చేయాలనుకుంటాడు. మరొకడు భాగభాగాలుగా విభజించి ఇళ్ళ స్థలాలు కట్టుకోవాలి, దాని ద్వారా బిజినెస్ చేయాలనుకుంటాడు. కాని కొంతమంది ప్రజలను పోగుచేసి వారికి దేవుని వాక్యాన్ని వినిపించాలి అని మాత్రం ఎవ్వరూ అనుకోరు. ఎందుకంటే ఈ లోకం దృష్టికి అది ఒక అవివేకమైన ఆలోచన. నీ యొద్ద ఒక మైదానం ఉన్నప్పుడు, నీ దగ్గర కొంచెము ధనము ఉన్నప్పుడు నీవు దానితో చక్కగా వ్యాపారం చేసి లాభము సంపాదించాలి అంటుందీ లోకం. అంతేగాని పరలోకములో దేవునియొద్ద ధనాన్ని సమకూర్చుకోవాలని ఎవ్వరూ చెప్పరు.

ప్రియులారా, ఈ లోకములో ఉన్న మనుష్యుల ఆలోచనలకు దేవుని ఆలోచనలకు చాలా వ్యత్యాసముంటుంది. దేవుని ఆలోచనలు వేరు, లోకమందున్న లోకుల ఆలోచనలు వేరు. దేవుని వాక్యము అర్థమయిన వారికి ఈ విషయం స్పష్టంగా తెలుస్తుంది. మిగిలిన వారికి ఇది తెలియదు. ఒక వేళ చెప్పినా, ఇదేదో ఒక మతానికి సంబంధించినదని వారు చాలా తేలికగా దీనిని కొట్టిపడేస్తారు. దేవుడు అనుగ్రహించిన ఈ ప్రకృతిలో ప్రతి అణువు దేవుని వాక్యము వలన నిర్మాణము అయినది. అది ఒక చెట్టు కావచ్చు, మీ చుట్టూ ఉన్న గాలి కావచ్చు, మీరు నివశిస్తున్న ఈ భూమి కావచ్చు, ప్రకృతిలో మరేదైనా అది దేవుని వాక్యము వలననే నిర్మించబడినదని బైబిలు చెప్పింది. మరి ప్రకృతిలో అనేక వస్తువులు, అనేక పదార్థాలు దేవుని మాట వలననే నిర్మాణము అయినప్పుడు ఆ దేవుని మాట అనేకమందికి ప్రకటించడానికి ఎందుకు ఉపయోగపడటం లేదు? వ్యాపారం చేసుకోమని ఈ విశ్వమంతటినీ దేవుడు మనకు అనుగ్రహించలేదు. ఆటలు ఆడుకోమని, పాటలు పాడుకోమని, ప్రదర్శనలు చేయమని, గెంతమని దేవుడు మనకు ఈ ప్రకృతిని ఇవ్వలేదు. దేవునికి ఒక ప్రత్యేకమైన సంకల్పము ఉంది. ఆయనది ఒక చక్కని ఆలోచన. అదేమిటంటే, ఆయనిచ్చిన ఈ ప్రకృతి ద్వారా మనుష్యులు వారి ఆయుష్షు ప్రకారం బ్రతికి, ఈ ప్రకృతిని అందలి సమస్త పదార్థములను వినియోగించి దేవుని వాక్యమును ప్రకటించాలి, అనేక ఆత్మలను రక్షించాలి. ఇదే ఆయన ఉద్దేశ్యం. కాని ఈ ప్రపంచం ఆ ఉద్దేశ్యంలోగాని, ఆ ఆలోచనలలోగాని లేనే లేదు. అటువంటి పరిస్థితులలో దేవుని మనసు తెలిసిన వారు లోకానికి వేరై ఇలాంటి చక్కని పుస్తకముల ద్వారా దేవుని వాక్యమును ప్రకటించి, తద్వారా మానవ సమాజాన్ని మేల్కొలపడం చాలా మంచి విషయం.

ప్రియులారా, ఈ పాఠములో ఒక చక్కని అంశాన్ని మనము ఆలోచిద్దాం. నిర్ధారింపబడినటువంటి అంశము ఏమిటంటే "దేవుని కులం ఏమిటి?" దేవునికి ఒకవేళ కులం ఉంటే ఆ కులం ఏమిటి? లేక దేవునికి నచ్చిన కులం ఏమిటి? పరలోకానికి ఆహ్వానించే ఆయన పిల్లలందరికి ఉండవలసిన కులం ఏమిటి? ఇదే మనము ఆలోచించబోతున్నటువంటి అంశము. దేవుని కులం ఏమిటి? ఈ అంశాన్ని ఎందుకు నిర్ణయించవలసి వచ్చిందంటే ఈ రోజు మనము ఉన్నటువంటి పరిస్థితులలో కులానికి ఉన్న ప్రాముఖ్యత ఇంతా అంతా కాదు. ఎవరిని పరిచయం చేసుకున్నా ముందు మన కులమే అడుగుతారు. ఏ స్కూలుకు వెళ్ళినా, ఏ ఉద్యోగానికి వెళ్ళినా, ఏ ప్రభుత్వ దాఖలాలలోనికి మన పేరు వెళ్ళినా, మనలను కులమే అడుగుతారు. చదువుకోవాలంటే కులం, రాజకీయాలలోనికి వెళ్ళాలంటే కులం, ఆట ఆడాలంటే కులం, ఏదైనా ఒక ప్రాంతములో నివశించాలన్నా కులం! కులమనేది ఈ రోజు చాలా ప్రాముఖ్యమైనటువంటి అంశముగా మారిపోయింది. ప్రతి మనిషి పుట్టుకతోనే ఒక కులముతో పుడుతున్నాడని, అతని జీవితాంతం ఆ కులం అతనికి ఉంటుందని ఈ లోకము చెప్పింది. భూమిపైన జీవితకాలములో ఒక శాశ్వతమైనటువంటి కులం మీకు, మీ కుటుంబాలకు, మీ వంశంలో పుట్టిన ప్రతి ఒక్కరికి తరతరాలుగా ఉండాలని చాలా మంది భావిస్తున్నారు. అసలు బైబిలు దగ్గరకు ఈ లోకం ఎప్పుడైనా వచ్చిందా? మనుష్యులందరూ కులాలను గూర్చి ఆలోచించుకుంటున్నారు. వర్గపు పోరులో ఈ రోజు లోకస్థులు బ్రతుకుతున్నారు. మనుష్యులందరికీ కొన్ని

విధి విధానాలు ఉన్నాయి. కానీ, ఇవన్నీ దేవునికి అనుకూలమైనవేనా? దైవగ్రంథమైన బైబిలు వీటన్నింటిని ఆమోదించిందా? నిజంగా ఎప్పుడూ, ఏ మనిషీ దేవుని వాక్యము దగ్గరకు రాలేదు. ఒకవేళ వచ్చి ఉంటే, అసలు దేవుడు ఈ కులమును గూర్చి ఏమని మాట్లాడాడో అర్థమయ్యేది. మనిషిని పుట్టించినవాడు, మనిషి కొరకు అన్నీ ఇచ్చినవాడు, మనిషి యొక్క జీవితంలో ఏది అవసరమవుతుందో దాని గురించి మాట్లాడినవాడు కేవలం దేవుడే! ఆయన వాక్యము కేవలం మతగ్రంథం అనుకుంటే చాలా పొరపాటు. ఇది కేవలం ఆదివారం చర్చ్‌లో 2 గంటలకు సంబంధించిన పుస్తకము మరియు ఇది కేవలం బోధకులు మాత్రమే చదవవలసిన పుస్తకమనుకుంటే చాలా పొరపాటు. దీనిని కేవలం అలంకారప్రాయంగా మా దగ్గర ఉంచుకోవాలి తప్ప, దీనిలో మనిషికి సంబంధించిన దేవుని జ్ఞానము లేదనుకుంటే మీకంటే దౌర్భాగ్యులు ఇంకెవ్వరూ ఉండరు. బైబిలు చాలా గొప్పది. మానవాళికి వచ్చిన ప్రతి ప్రశ్నకు ఈ బైబిల్‌లో సమాధానం ఉంది. ఈ లోకంలో మనిషి బ్రతకవలసిన విధానాన్ని, తీరును బైబిలు నిర్దేశిస్తుంది. మనిషి ఎందుకు ఎలా బ్రతకాలో బైబిల్ నిర్ణయిస్తుంది. మీరు ఎలాంటి మార్గములో నడవాలి? ఎలా ఆలోచించాలి? ఎలా పరిపాలించుకోవాలి? ఇలా ప్రతి విషయాన్ని గూర్చి బైబిల్ మాట్లాడుతుంది. కాని బైబిల్ ఈ సమాజానికి చాలా దూరమైపోయింది. ఎలా దూరమైందంటే, దీనిని ఒక క్రైస్తవ మతపుస్తకం అనుకుని ప్రక్కన పెట్టేసారు. ఇది కేవలం యేసుక్రీస్తుని నమ్మినవారు మాత్రమే చదువవలసిన పుస్తకముగా పొరపాటు పడ్డారు. క్రైస్తవులు తప్ప మిగిలిన వారు దీనిని చదవకూడదని బైబిలులో ఎక్కడా వ్రాయబడలేదు. తల్లి గర్భములోనుండి బయటకొచ్చిన ప్రతి మనిషికి ఈ పుస్తకాన్ని చదివే హక్కు ఉంది. బైబిల్‌ను చదివే బాధ్యత ఉంది. కాని మనమే ఒక పరిధిని గీసుకున్నాము. ఈ లోకము మనలను అలా ఆలోచింపచేసింది. ఈ పుస్తకం నాది కాదు, ఈ బైబిలు నాకు సంబంధించినది కాదు, ఇది ఎవరు నమ్మారో వారికి మాత్రమే సంబంధించినదని అపోహపడుతున్నారు. అలా కానే కాదు. ఎప్పటినుంచో, ఎన్నో వేలసంవత్సరాలుగా వేళ్ళూనుకుపోయినటువంటి ఈ కుల వ్యవస్థను గూర్చి బైబిల్‌లో చాలా చక్కగా వ్రాయబడింది. అసలు ఈ కుల వ్యవస్థ ఎక్కడ ప్రారంభమైంది? ఈ రోజు మనము పిలువబడుతున్న ఈ కులాలకు ప్రారంభం ఎక్కడిది? దీనికి మూలం ఎక్కడుంది? అసలు భూమి మీద మనము ఒక కులం పేరుతో పిలువబడటం మన కులాన్ని మనము గొప్పగా చేసుకోవడం, మన కులాన్ని మనం కాపాడుకోవటం, మన కులం పేరిట ఒక సంఘాన్ని ఏర్పాటు చేయడం, మన కులానికి సంబంధించిన వారందరి బాగోగులు మనం చూసుకోవడం... ఇదంతా పరలోకమందున్న తండ్రి ఆలోచన మేరకు కలిగినదేనా? బైబిల్‌ను బట్టి పరిశీలిద్దాం.

పరలోకమందున్న తండ్రి ఈ మనుష్యులను ఎలా చూడాలనుకున్నాడు? కులాల వారీగా చూడాలనుకున్నాడా? వర్గాల వారీగా చూడాలనుకున్నాడా? అలాగైతే దేవుడు తన గ్రంథములో ఖచ్చితంగా వ్రాయించి ఉండాలి. వ్రాయించిన ప్రకారము మనము వెళ్ళిపోవాలి. నిజానికి నేడున్న ప్రభుత్వాలకు కూడా ఈ విషయాలు తెలియదు. చాలామంది విజ్ఞులు అనుకున్న వారికి కూడా ఈ విషయాలు తెలియదు. ఈ రోజు ఈ మీడియాకు గాని, శాస్త్రం తెలిసినవారికి గాని, జ్ఞానము కలిగినవారికి గాని ఈ సంగతులు తెలియవు. ఏదో ఒక కెమెరా ముందు స్టూడియోలో కూర్చుని మైక్ వారి చేతికిస్తే నాలుగు మాటలు మాట్లాడేసాడు కదా, అతనే గొప్ప వక్త అనుకుంటే, అది తప్పు. సమాజానికి మేలుచేసే విషయాలను దేవుని జ్ఞానానుసారముగా మాట్లాడాలి. నిజాన్ని ఆలోచించాలి, పరిశీలించాలి, దానిని నిరూపించాలి. ప్రతి దానిని గూర్చి న్యాయంగా మాట్లాడాలి, పక్షపాతం ఉండకూడదు. అలాంటి వారు ఈ రోజు ప్రపంచంలో ఎవ్వరూ కనిపించరు. ఎవరిని మాట్లాడమన్నా వారి స్వార్థముతోనే మాట్లాడతారు. అప్పుడప్పుడు మీకు బి.బి.సి., సి.ఎన్.ఎన్., టి.వి.9, టి.వి.5, ఎన్.టి.వి., ఎ.బి.ఎన్. ఛానల్స్‌లో ఇలాంటివారు కనిపిస్తూ ఉంటారు. ఏదైనా ఒక అంశమును గూర్చి నలుగురిని కూర్చోబెట్టి మాట్లాడమంటే ప్రతి ఒక్కరూ వారి వారి కోణంలో మాట్లాడుకుంటారే తప్ప, పొరుగువారిని ప్రేమించాలనే పద్ధతిలో మాత్రం మాట్లాడరు. అంటే అందరికీ స్వార్థమే. అందరికీ పక్షపాతమే. అందరిదీ, నేను చెప్పిందే నెగ్గాలి అనే తత్వమే. ఇప్పుడు అలాంటివారి దగ్గరకు వెళ్ళి ఈ కులవ్యవస్థను గూర్చి అడిగితే వాళ్ళు ఏమి చెబుతారు చెప్పండి? అందుకే సత్యము, దేవుని జ్ఞానము, మనుష్యులకు చాలా దూరం అయిపోయాయి. దేవుని ఉద్దేశ్యాలను, దేవుని మాటలను ఈ సమాజం మరిచిపోయింది. వాటిని

బొత్తిగా ప్రక్కన పెట్టేసింది. లోకపరంగా విజ్ఞులుగా, శాస్త్రవేత్తలుగా, అన్నీ తెలిసినవారుగా ఎవరైతే పిలువబడుతున్నారో వారు చెప్పిన మాటలనే ఈ రోజు జనులు నమ్ముతున్నారు. అందువల్ల దేవుని సంగతులు ఎవ్వరికీ వినిపించడం లేదు. అందుకే దేవుడు వ్రాయించిన మాటలలో కులమునకు సంబంధించిన కొన్ని వివరాలను మనము బయటకు తీద్దాము. నిజానికి కులం అనేది ఒక వర్గం లేదా వర్ణం. కొన్ని వందల సంవత్సరాల క్రితం రంగులను(వర్ణాలు) బట్టి కూడా మనుష్యులను నిర్ధారించేవారు. తెలుపురంగులో ఉంటే ఒక వర్గం, ఛామనఛాయలో ఉంటే ఒక వర్గం, నల్లని రంగులో ఉంటే ఒక వర్గముగా పిలిచేవారు. అసలు కులాలు అనేవి ఎక్కడ ప్రారంభమయ్యాయి? ఇప్పుడు ఎక్కువగా ఎక్కడ ఉన్నాయని ఈ ప్రపంచ చరిత్రను తిరగవేస్తే, ఎక్కువగా ఈ కులాలన్నీ కనిపించేది మన భారతదేశములోనే. అంటే మనము నివశిస్తున్న ఈ దేశంలో, మనము నివశిస్తున్న ఈ రాష్ట్రాలలోనే కులవ్యవస్థ అనేది బాగా వేళ్ళూనుకు పోయింది. ఈ మధ్య అప్పుడప్పుడు టి.వి.9 వారు ఎడ్వర్టైజ్‌మెంట్ ఇస్తూ కులవ్యవస్థను మనము నిర్మూలిద్దాం, కులమనేది ఒక వెనుకబాటుతనం అని చెబుతున్నారు. కులము అనేది మంచిదికాదు, ఇది ఒక వెనుకబాటుతనం. ఇదంతా ఒకప్పుడు జ్ఞానము తెలియనివారు నిర్ణయించుకున్న విధానం. ఇప్పుడు మనమంతా నవనాగరికత కలిగిన వారము, అన్నీ తెలిసినవారము. ప్రతి విషయంలో ముందుకు అడుగులు వేస్తున్నాము కాబట్టి మనకు ఇంకా ఈ కులాలు ఏమిటి అని సంఘసంస్కర్తలు అంటున్నారు. నిజమే, కాని దీనిని గూర్చి దేవుడు ఏమని వ్రాయించాడో చెప్పాలి. బాధ్యత కలిగిన మీడియా, సర్వలోకానికి అధికారి అయిన దేవుణ్ణి తెరమీదకి తీసుకుని రావాలి. అప్పుడే మనిషి వింటాడు, అప్పుడే మనిషి మారతాడు. ఒక మనిషి మాటను మరొక మనిషి పట్టించుకోడు. ఎందుకంటే, ఇతడు కూడా మనిషే కదా, నావలె పుట్టినవాడే కదా, ఇతను చెబితే నేను ఎందుకు నమ్మాలి? అనుకుంటాడు. నిజమే, అందులో కూడా న్యాయముంది. కాని దేవుడు చెబితే ఎవడైనా ఖచ్చితముగా నమ్మి తీరాలి. ఎందుకంటే ఆ దేవుడు కలిగించిన ప్రకృతినే మనము అనుభవిస్తున్నాము. ఆ దేవుని నిమిత్తమే మనము బ్రతుకుచున్నాము. నమ్మినా, నమ్మకపోయినా ఇది నిజం. ఆ దేవుణ్ణి తెరమీదకి తీసుకునివచ్చి ఆయన ఈ కులవ్యవస్థను గూర్చి ఏమి మాట్లాడుతున్నాడో చెప్పాలి. అసలు ఇంతకీ దేవుడు ఈ కులాలను, వర్గాలను తన జ్ఞాపకంలో ఉంచుకున్నాడా? వీటిని గూర్చి దేవుడు తన గ్రంథములో వ్రాసుకున్నాడా? ఆయన ఆలోచనలో ఈ కులవ్యవస్థను గూర్చి ఆయనకు ఎలాంటి అభిప్రాయమున్నదో పరిశీలించాలి.

ఈ కులాలను గూర్చి మనము పుట్టిన దగ్గర నుంచి బహుశా ప్రతిరోజు మనము జ్ఞాపకము చేసుకుంటున్నాము. ఇప్పటికే ఈ లోకస్థులు కులాల పేరిట ఎన్నో రాజకీయాలు, ఎన్నో మరణహోమాలు సృష్టించారు. అవి ఇప్పటకీ ఏదో ఒక మూల రగులుతూనే ఉన్నాయి. ముఖ్యంగా మన భారతదేశంలోని మనుష్యులు ఎన్నో వేల వర్గాలుగా కులాలుగా విభజన చెందారు. ప్రారంభకాలములో దేవుడు ఆదాము, హవ్వలిద్దరిని సృష్టించాడు. మొదట ఒక మనిషిని, ఆ తరువాత అతని ప్రక్కటెముకలలో ఒక ఎముకను తీసి స్త్రీగా నిర్మించి, వీరిద్దరిని ఒక కుటుంబముగా దేవుడు చేసాడు. వీరిద్దరి ద్వారా ఈ భూమి మీద అనేక మంది మనుష్యులు రావాలి. వారే ఈ భూమిని నిండించాలి. ఇదే జరిగిన గత చరిత్ర. కులాన్ని గుర్చి బైబిలిచ్చే వివరణను మనం ఆలోచించాలంటే, ముందటి కాలానికి వెళ్ళాలి. ప్రారంభానికి వెళ్ళి, మూలాన్ని మనము వెదకాలి. ఒక చెట్టును గూర్చి తెలుసుకోవాలంటే ముందు దాని విత్తనము, వేరు, తల్లికాండముల దగ్గరకు వెళ్ళాలి. ఒక ఇంటిని గూర్చి తెలియాలన్నా, ఒక భవనమును గూర్చి ఆలోచించాలన్నా ముందు దానియొక్క పునాది దగ్గరకు వెళ్ళాలి. అప్పుడే దాని గురించి మనకు బాగా అర్థమవుతుంది. సంగతులను పైపైన చూస్తే ఏదీ అర్థం కాదు.

కులవ్యవస్థను గూర్చి దేవుడు మాట్లాడితే, ఆయన ఈ మనుష్యులను ఎలా పుట్టించాడో, మొదటి మనుష్యులు ఎలాంటివారో ఆయనే చెబుతాడు. **ఆదికాండము 1 : 28** వ వచనములో దేవుడు వారిని ఎలా ఆశీర్వదించాడంటే, "మీరు ఫలించి అభివృద్ధి పొంది విస్తరించి భూమిని నిండిచండి అన్నాడు". మనుష్యులు ఫలించాలి, అభివృద్ధి పొందాలి, విస్తరించాలి. ఆ తరువాత ఈ భూమిని ఏలాలి. ఈ భూమి మీద నరులే ఏలికలు కావాలి. ఈ భూమి మీద మనిషి మాటను ప్రతీ సృష్టీ వినాలి. అది చిన్న జీవి అయినా సరే, అది మీకంటే ఆకారములో పెద్దదైనా సరే, అది

మీకంటే విషపూరితమైనది అయినా సరే, అది మీకంటే గొప్ప వేగవంతమైనది అయినా సరే, వాటి బలాల ముందు మీ బలము పనికిరాకపోయినా, మీరు మాత్రం ఏలికలు కావాలి అంటున్నాడు దేవుడు. దేవుని జ్ఞానమును ఎవరు చెప్పారు? 'డిస్కవరి' అని ఒక టి.వి. ఛానల్ ఉంటుంది. ఆ ఛానల్ భూమిమీద ఉన్న జంతువులను గూర్చి, పురుగులను గూర్చి, పక్షులను గూర్చి, కెమెరాలు పట్టుకుని, అడవులలోనికి వెళ్ళిపోయి, వాటని చిత్రీకరిస్తూ మనకు చూపిస్తారు. ఈ జంతువులు, పక్షులు, జీవులన్నీ ఇంత గొప్పగా ఉన్నాయి. వాటి మీద మనిషి ఏలికగా ఉండగలిగాడంటే దీనికి కారణం దేవుడే! అని, వారు ఎప్పుడైనా చెప్పారా? ఛానల్స్‌వారు వీటన్నింటినీ మనకు టి.వి.లో చూపిస్తుంటే, పులి భలే ఉంది – భలే పరుగెడుతుంది అనుకుంటారు. గుర్రం అందముగా ఉంది – భలే పరుగెడుతుంది అనుకుంటారు. పాము ఎంత విషపూరితంగా ఉందో – చాలా భయంకరంగా ఉంది అనుకుంటారు. ఇలా మాట్లాడకుంటారే తప్ప, వీటన్నిటి మీద దేవుడు మనకు ఎందుకు పెత్తనాన్ని ఇచ్చాడంటే, దేవుడు ముందుగా వ్రాయించిన ఆయన శాసనమునుబట్టి **(ఆదికాండము 1 : 28)** మనుష్యులు ఫలించి, విస్తరించి, ఈ భూమిని నిండించాలి. వారు దానిని ఏలాలి అన్నాడు గనుక ఇదంతా ఇలా జరుగుతుందని ఏనాడైనా అనుకున్నారా? ఇదిగో ఆ మాట వేల సంవత్సరాల క్రితం దేవుడు అన్నాడు. ఇప్పటికీ అది నెరవేరుతున్నది చూడండి. ఈ ప్రకృతిని మనిషి ఏలుతున్నాడు. భూమి మనిషి వశమైపోయింది. కానీ, మనిషి వీటన్నిటిని సృష్టించలేదే, నరుడు దీనంతటికి సృష్టికర్త కాదే! మనిషి కేవలం ఈ భూమిని వినియోగించుకుంటున్నాడు. ఇంతకీ మనిషి ఎంతటివాడంటే, లోపల ఉన్న గుండెకు వరుసగా మూడుసార్లు స్ట్రోక్ వస్తే క్రింద పడిపోతాడు. లోపల ఉన్న అవయవాలు పనిచేయటం ఆగిపోతే కుప్పకూలి పోతాడు. అలాంటి మనిషి, ఈ రోజు సముద్ర గర్భములోనికి వెళ్ళగలుగుతున్నాడు. అందులో ఉన్న క్రూడాయిల్ అంతా బయటకు తీస్తున్నాడు, గ్యాస్ అంతా బయటకు తీస్తున్నాడు. ఎందుకంటే దేవుడు మనిషికి వీటన్నింటిని ధారాదత్తం చేస్తాడు. ఇవన్నీ మనిషి సృష్టించుకున్నవి కావు. దేవుడే మనిషికి ఇచ్చాడు. కానీ మనిషి ఈ సంగతిని ఆలోచించలేదు. వినియోగించుకోవటం మనిషికి బాగా తెలుసు! దేనినైనా వాడుకోవడం ఈ నరునికి బాగా తెలుసు. దేవుడిచ్చిన ప్రకృతిని అనుభవించడం ఎలాగో తెలుసుకుని, ఒక్క క్షణం కూడా నా తండ్రి ఎలా ఉంటాడో, నా తండ్రి నా కొరకు వ్రాయించిన మాటలలో ఏమి ఉందో, దేవుడు నా గురించి ఏమనుకుంటున్నాడో అని ఈ మనిషి ఎప్పుడూ ఆలోచించడు. ఏమిటండి? మనుష్యులకు ఇంత స్వార్థమా? మనుష్యులందరూ స్వార్థపరులేనా? అవును. ఖచ్చితంగా స్వార్థపరులే! ఎందుకంటే దేవుని గుర్తించనివాడు, దేవుడు పట్టించుకోనినాడు, ఆయన ఇష్టాన్ని నెరవేర్చనినాడు, ఆయన మనసులో ఏముందో తెలుసుకోనినాడు – మనిషి స్వార్థపరుడు కాదంటారా? ముమ్మాటికీ అవును!

దేవుడు ఆదాము హవ్వలను ఆశీర్వదించాడు. వాళ్ళిద్దరూ మొట్టమొదటి దంపతులు. మనమందరమూ వారినుంచే పుట్టుకొచ్చాము. ప్రతి మానవజాతి వారి నుండి ఉద్భవమైనదే! దీనిని గూర్చి మరల మరొక చక్కని మాటను దీనికి కొనసాగింపుగా చూద్దాం. **అపొస్తలుల కార్యములు 17 : 26–** "మరియు యావత్తు భూమిమీద కాపురముండుటకు ఆయన ఒకని నుండి ప్రతిజాతి మనుష్యులను సృష్టించి, వారు ఒకవేళ దేవునిని తడవులాడి కనుగొందురేమోయని తన్ను వెదకునిమిత్తము నిర్ణయకాలమును, వారి నివాశ స్థలముయొక్క పొలిమేరలను ఏర్పరచెను". పరలోకముందున్న తండ్రి, యావత్తు భూమిమీద మనుష్యులు కాపురముండుటకు, ఆరిన నేల ఎక్కడ కనిపిస్తుందో ఆ నేల మీద మనిషి బ్రతకాలని ఈ భూమిని అందుకే తయారు చేసాడు. ఈ భూమి ఆయన పిల్లలతో నిండాలి. నిండిన ప్రతి ఒక్కరూ ఆ దేవుని గూర్చి తెలుసుకోవాలి అనుకున్నాడు. దేవుని కొరకు బ్రతికి, తిరిగి పరలోకానికి రావాలి అనుకున్నాడు. ఇదే ఆయన సంకల్పం. ఇదంతా ఆయన ఇచ్చిన ప్రణాళిక. అందుకే యావత్తు భూమి మీద కాపురముండుటకు కుటుంబాలు, కుటుంబాలుగా మనుష్యులు ఏర్పడాలి. కులాలుగా మాత్రం కాదు. యావత్తు భూమి మీద కాపురముండుటకు ఆయన అందరి కులాల మనుష్యులను సృష్టించానన్నాడా? ఒక్కడినే సృష్టించానన్నాడా? ఒక్కడినేనండి. ఆ ఒక్కడైన ఆదామునుండేనండి! ఆ ఆదాముకు కులం లేదు. ఆదాముకు వర్ణం, వర్గం లేదు. దేవుడు ఒకని నుండి ప్రతిజాతి మనుష్యులను సృష్టించాడు అన్నాడు. ఇక్కడ మీరు జాగ్రత్తగా ఆలోచించాలి. అందరిలో ప్రవహించేది ఒకే రక్తం, అందరిదీ ఒక్కటే మానవజాతి. కాని ఒకడు ఒకలా మాట్లాడుతున్నాడు. ఒకడి ఆచార

పద్ధతులు ఒకలా ఉన్నాయి. ఒకడి ఆలోచనలు ఒకలా ఉన్నాయి. మరి కులాలు లేకపోతే ఇవన్నీ ఎందుకొచ్చాయి? అని మీరు అడిగితే దేవుడేమన్నాడో చూడండి. 'ఒకని నుండి ప్రతిజాతి మనుష్యులను సృష్టించి' అంటే ఆదాము నుండి పుట్టిన మనుష్యులు, భూమిమీద జాతుల వారీగా విడిపోయారు. ఒకని నుంచే, ఒకని తల్లి గర్భము నుంచే, వీరందరూ ప్రారంభమయ్యారు. ఆ మొదటి ఇద్దరు దంపతులు ఆదాము, హవ్వలు. వీరిద్దరినుంచే అనేకమంది మనుష్యులు పుట్టారు. అందులో కయీను, అందులో హేబేలు, అందులో షేతు, ఆ తరువాత వచ్చినటువంటి అనేకమంది మనుష్యులు. వీరందరిని గూర్చి దేవుడు ఏమంటున్నాడంటే, 'మనుష్యజాతులు' అన్నాడు. వీరందరూ భూమిమీద అనేక ప్రాంతాలకు వలస వెళ్ళిపోయినటువంటి మనుష్యులు. ఎందుకంటే, ఆయన ఉద్దేశ్యం భూమిని నింపించాలి. ఒక్కచోటే ఉండిపోకూడదు. కొందరు ఆస్ట్రేలియాలో ఉండాలి, కొందరు అలస్కాలో ఉండాలి, కొందరు శ్రీలంకలో ఉండాలి. ఈ భూమంతా మనిషి కొరకే తయారుచేయబడింది. ఈ భూమిని నింపించాలి కనుక, ఈ భూమిని నింపించే క్రమంలో మనుష్యులు ఆయా ప్రాంతాలకు వెళ్ళిపోతున్నారు. బాబెలు గోపురము విషయంలో ఆయన అదే చేసాడు. ఒక్క పలుకు, ఒక్క భాష ఉండటానికి వీలులేదు. మీరు భూమిని నింపించండని దేవుడు పంపితే, ఆకాశాన్నంటే శిఖరాన్ని కడతాము, ఇక్కడే మేము ఉండిపోతాము అనుకున్నాడు మనిషి. అందుకే దేవుడు వారిని వెళ్ళగొట్టాలి, బెదరగొట్టాలి అనుకున్నాడు. నిమ్రోదు కాలములో ఆ బాబెలు గోపురము దగ్గర ఉన్న మనుష్యులను వెళ్ళిపోమన్నాడు, భూమిని నింపించండి అన్నాడు దేవుడు. అలా నింపించినటువంటి క్రమంలో చాలామంది మనుష్యులు ఆయా ప్రాంతాలకు వెళ్ళిపోయారు. అలా వెళ్ళిపోయినపుడు మనుష్యులయొక్క స్థితిగతులు మారిపోయాయి. ఒకచోట ఎండ ఎక్కువగా ఉండే ప్రాంతం, మరొకచోట మంచు గడ్డలు ఎక్కువగా ఉండే ప్రాంతం. ఒక చోట చలి ఎక్కువగా ఉండే ప్రాంతం, మరొక చోట వరదలు ఎక్కువగా ఉండే ప్రాంతం. ఒక చోట పంట ఎక్కువగా పండే ప్రాతం, మరొకచోట ఎడారి ప్రాంతం. భూమిమీద అనేక ప్రాంతాలు ఉన్నాయి. భౌగోళిక స్వరూపాన్ని మనము చూడగలిగితే భూమిమీద అన్ని ప్రదేశాలూ ఒకేలా ఉండవు. ఇలా, ఆయా ప్రదేశాలను బట్టి మనిషి ఎక్కడికి చెదిరిపోయాడో, ప్రారంభ మానవులందరూ ఎక్కడికి వెళ్ళిపోయారో, ఆ ప్రదేశాలను బట్టి మనుష్యజాతులు ఏర్పడ్డాయి. అందుకే ఆఫ్రికా జాతివాళ్ళంతా ఒకలా, అమెరికా జాతివాళ్ళంతా ఒకలా, చైనా జాతివాళ్ళంతా ఒకలా ఉంటారు. వారి వారి ప్రాంతాలనుబట్టి వారు అలా మారిపోయారు. జపాన్‌వాడు కావచ్చు, ఇండోనేషియావాడు కావచ్చు. దగ్గర దగ్గర ప్రాంతాలవాళ్ళను గనుక మీరు పరిశీలించగలిగితే వారందరూ ఇంచుమించుగా ఒకే ఆకారమును కలిగియుంటారు. ఇక భారతదేశము దగ్గరకు వస్తే ఇదిగో మనలాంటి ఆకారాలు అన్నీ ఈ దేశములోనే కనిపిస్తాయి. మరల ఆస్ట్రేలియా వైపు వెళ్ళిపోతే వారి ఆకారాలు మారిపోతాయి. మనుష్యులు జాతులుగా ఏర్పడ్డారు. కానీ, అందరూ ఒకని (ఆదాము) నుండే వచ్చారు. ఈ ప్రపంచం దేవుని దగ్గరకు రావాలి. అసలు మనిషి పుట్టుక ఎలా జరిగిందో, మనిషి నుంచి మనిషి ఎలా రాగలుగుతున్నాడో దేవుడే చెబుతాడు. అసలు వీరందరిని జాతులుగా పిలవాలా? కులాల పేరిట వర్గాలుగా పిలవాలా? మనిషి తనలోతాను కులాల పేరిట కొట్టుకోవాలంటారా? అసలు పరలోకం వెళ్ళే దృష్టే లేకుండా, ఈ బైబిల్ దగ్గరకు రాకుండా, ఈ లోకంలో దేవునికి దూరంగా బ్రతకాలా? మనిషి ఒకసారి ఆలోచించుకోవాలి! దేవుడు మనిషిని కులాల వారీగా విడిపోమన్నాడా? కులాల పేరిట మీరందరు సంఘాలను స్థాపించుకోమన్నాడా? లేనే లేదండి. ఆయనకు మనిషిపై ఉన్న ఉద్ధేశ్యాలే వేరు.

నిజంగా మీకు దేవుని జ్ఞానము అర్థమయితే ఆదాము మన పూర్వికుడు కదా. మన పూర్వికుడు అంటే, నేను అతని గర్భములోనుంచే వచ్చాను. మీరు కూడా అతని గర్భములోనుంచే వచ్చారు. ప్రారంభకాలములో లేని ఈ కులాలు, మధ్యలోనే పుట్టాయి. మధ్యలో ఎలా పుట్టాయి? మనము ఈ భూమిమీద బ్రతుకుతున్నప్పుడు మనకు కొన్ని అవసరాలు ఉంటాయి. బట్టలు ఉతుక్కోవటం ఒక అవసరం. మన తల క్షవరం చేసుకోవడం ఒక అవసరం. వ్యాపారం చేయడం ఒక అవసరం. దేవుని దగ్గరకు నడిపించే వాడు ఉండాలి, అదొక అవసరం. ఏదైనా భూమిమీద ఆయా అవసరతలను బట్టి, మనుష్యులు తమ అవసరాలను తీర్చుకోవడానికి, మరియు వారి ఉపాధి కొరకు వీరు ఏమి చేసారంటే, ఒక వృత్తిని ఎంచుకున్నారు. ఉదాహరణకు ఒక వడ్రంగి ఉన్నాడు. వడ్రంగి వృత్తిని ఎంచుకొనిన

వాడు వడ్రంగి పనినే చేస్తాడు. అంటే తలుపులు, కిటికీలు తయారుచేస్తాడు. చెక్క పని అంతా నాది అనకున్నాడు. ఒక మిషన్ తెచ్చుకున్నాడు, ఒక ఉలి తెచ్చుకున్నాడు. ఈ పనిని చేయడం ప్రారంభించాడు. అందులో నిష్ణాతుడయ్యాడు. మరొకడు శిల్పాలు చెక్కాలి అనుకున్నాడు. ఇక అతని కుటుంబంలో అతని కొడుకు, తరువాత వచ్చినటువంటి వంశానికీ, అదే వృత్తిని నేర్పించాడు. ఆ కుటుంబానికి ఆ వృత్తి అలవాటుగా మారిపోయింది. అలాగే ఒక ఆయన ఊరిలో ఉన్న వారందరికి క్షవరం చేయాలి అనుకున్నాడు. దానిని వృత్తిగా మార్చుకున్నాడు. నేను ఈ వృత్తిని చేయాలి, నా కుమారునికి దీనిని నేర్పించాలి అనుకున్నాడు. అలాగే ఒక ఉపాధ్యాయుడు పిల్లలకు పాఠాలు నేర్పించాలి అనుకున్నాడు. అతని కుమారునికి కూడా, పాఠాలు నేర్పించే వృత్తిని అలవాటు చేసాడు. ఇలా మీరు ఆలోచించుకుంటూ వెళితే ఎవరైతే ఏ వృత్తిని కలిగి ఉన్నారో, ఆ వృత్తిని బట్టి ముందటి రోజులలో నివశించిన ప్రజలు, వారికి కులాల పేర్లను నిర్ణయించారు. నీవు బట్టలు ఉతుకుతున్నావా? అయితే నీవు రజకునివి అన్నారు. నీవు క్షవరం చేస్తున్నావా? అయితే నీవు నాయీబ్రాహ్మణునివి... ఇలా, వారి వారి వృత్తులనుబట్టి కులము అనేది వచ్చింది. చరిత్రను మనము పరిశీలిస్తే వృత్తిని బట్టి కులము వచ్చింది. ఇప్పుడున్న కాలములో అయితే తండ్రి ఏ వృత్తిని చేస్తున్నాడో, వారి కుమారులు కూడా అదే వృత్తిని కలిగియున్నారా? లేనే లేదు. చాలామంది తమ వృత్తులు మార్చేసారు. కూలిపని చేసేటటువంటి వ్యక్తి తన కుమారునితో కూడా కూలిపనే చేయించుకోవాలనే నియమము లేదిప్పుడు. నీవు బాగా చదువుకోవాలి, ఎందుకంటే నేను కూలిపని చేసీ చేసీ, ఇందులో సాధక బాధకాలు అన్నీ నాకు తెలిసాయి. ఇందులో లాభం కంటే నష్టమే ఎక్కువగా ఉంది. ఈ పని చాలా కఠినంగా ఉంటుంది. ఇప్పుడు నేను నిన్ను బాగా చదివిస్తాను. నిన్ను కలెక్టర్‌గా లేదా డాక్టర్‌గా లేదా ఇంజనీర్‌గా నేను చూడాలి. అంతేగానీ, కూలిపనిలోకి మాత్రం వద్దని ఒక తండ్రి తన కుమారునితో అంటాడు. ఆ తండ్రి తాను చేసే పనిలో కష్టం, నష్టం చవిచూసినవాడు గనుక! ఒకవేళ తాను చేసే వృత్తిలో ఆదాయము బాగుంటే, ఆ పనే తన కుమారునికి మంచిది అనుకుంటే, ఆ తండ్రి తన కుమారుని అదే వృత్తిలో ఉంచుతాడు. వృత్తులను బట్టి, ఒక కుటుంబములోని వంశాల వారీగా తండ్రి నుంచి కొడుక్కి, కొడుకు నుంచి మనవడికి ఆయా వృత్తులు వెళ్ళాయి. మరి అలాంటప్పుడు ఈ కులాలు ఎందుకొచ్చాయి చెప్పండి? ఒకప్పుడు ఒక వంశానికి ఒకే వృత్తి ఉండేది గనుక, నీవు కులాల పేరిట పిలిచినా అది కొంతవరకు సబబే, కాని దానిని దేవుడు ఆమోదించలేదు. దానిని గూర్చి దేవుడు ఎక్కడా వ్రాయించలేదు. దేవుడు పలికిన మాటలను మీరు ఆలోచిస్తే ఆయన ఒకని నుండి ప్రతిజాతి మనుష్యులను సృష్టించాడు తప్ప, దానికి మించినది ఈ భూమి మీద ఉండడానికి వీలు లేదు. కాని మనుష్యులలో అపవాది ప్రవేశము జరిగింది. దుష్టుడు వీరిలో ప్రవేశించాడు. వీరందరికి ఏమని చెప్పాడు? మీరు జాతులు జాతులుగా ఒకే మానవుని నుంచి వచ్చారన్న జ్ఞానమును మనిషికి అందకుండా చేసాడు. ఎవ్వరికీ తెలియకుండా చేసాడు. ఆ అపవాది ప్రణాళిక ప్రకారము మనిషి ఎలా మారిపోవాలంటే, కులాల పేరిట విడగొట్టబడాలి, దేవుని గూర్చి పట్టించుకోకుండా వీరంతా వారిలో వారు కొట్టుకు చావాలి. దేవుని గ్రంథములో ఏ సందర్భంలోనూ కుల ప్రస్తావన లేదు. మనిషి వృత్తిని బట్టి కులాలు ఉండాలని, ఈ కులాల పేరిట సంఘాలు ఉండాలని ఎక్కడైనా దేవుడు తన గ్రంథములో వ్రాయించాడా? లేనే లేదు. కాని దుష్టుడు భూమిమీద జ్ఞానములేని కాలములో కొంతమందిలో ప్రవేశించి, ఇదిగో ఆ వృత్తిని చేసే వారందరూ ఒక కులం, ఈ వృత్తిని చేసే వారందరూ మరొక కులమంటూ నెమ్మది నెమ్మదిగా ప్రారంభించి, మరిముఖ్యంగా ఈ భారతదేశంలో దీనిని వేళ్ళూనుకునేలా చేసాడు. దీనిని ఆపడం ఎవరి తరం కాకపోయింది. గవర్నమెంటు కూడా తలదించింది. అందుకే, మీకు ఒక కులముందా? అయితే మీకు ఏమి కావాలో చెప్పండి. మీకు ఒక వర్గముందా? మీకు ఏమి కావాలో చెప్పండి, తీరుస్తాము అంటున్నారు. గవర్నమెంటువారు, అధికారులైన వారైనా మనుష్య సమాజానికి బుద్ధి చెబుతున్నారా? మీరు కులాల పేరిట విడగొట్టబడకూడదు. మీరు భారతదేశంలో ప్రజలు, మీరందరూ భారతీయులు, మీదంతా భారతజాతి అని చెబుతున్నారా? చెప్పనే చెప్పరు. ఎందుకంటే వీరికి కులాల పేరిట ఎన్నికలలో ఓటు కావాలి.

దేవుడు ఎంత గొప్పవాడో చూడండి. ఆయన దృష్టిలో ప్రతీ ఒక్కరూ సమానం, ఆయన దగ్గర తారతమ్యాలు ఉండకూడదు, బేధభావాలు ఉండకూడదు. ఎవరిపైనా పక్షపాతం ఉండకూడదు. నువ్వు ఏమైనా సహకరించాలి

అనుకుంటున్నావా? పేదవానికి సహకరించు. వాడు ఏ కులానికి చెందినవాడైనా సరే, ఏ వర్గములో ఉన్నవాడైనా సరే, వాడిని పైకి తీసుకురావాలి కదా! ధనికుని దగ్గర కొంత తీసుకుని పేదవానికి ఇవ్వు. అదే నీవు చేయవలసిన పని, అదే నీ కర్తవ్యం. ప్రభుత్వము యొక్క పని ఏమిటంటే, మనుష్యులలో అసమానతలు లేకుండా చెయ్యాలి. ప్రతి ఒక్కరిని సమానత్వంలోనికి తీసుకుని రావాలి. ఒకే సరళరేఖ మీదకు అందరినీ తీసుకుని రావాలి. ఏది? స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్ళు పూర్తవుతున్నా ఇప్పటికీ సమానత్వం లేదు. సమానత్వం ఉంటే రాజకీయనాయకులకు 'పని' జరగదు. మనుష్యులలో సమానత్వం ఉంటే చెడ్డ వారికి ఓట్లు రావు. మరల ఐదేళ్ళు గడిచాయాంటే, ఓట్లు దండుకోవాలంటే, రాజకీయాలు ఉండాలి. కులరాజకీయాలు ఉండాలి, మతరాజకీయాలు ఉండాలి, వర్గ రాజకీయాలు ఉండాలి. కొందరిని కొందరు చంపుకోవాలి. అప్పుడు వీడు గద్దెనెక్కుతాడు. చూసారా, వీరి ఆలోచన ఎలా ఉందో? అంతేగాని మనుష్యులందరూ ఒకే జాతి అని, వీరందరిని సమానత్వము లోనికి తీసుకుని రావాలని, ప్రతి ఒక్కరు నా సహోదరులే అని, పొరుగువాణ్ణి ప్రేమించాలి అనే ఈ భావము ఎవరి దగ్గర ఉందండి? ఎవరు ఉద్ధరిస్తారండి ఈ దేశాన్ని? ఎవరు కాపాడతారండి ఈ లోకాన్ని? ఎవరివల్లా కాదు.

మనిషి దేవుని మాటల దగ్గరకు రావాలి. దేవుని జ్ఞానము చెంతకు రావాలి. అప్పుడే మనిషికి అర్థమవుతుంది. మనుష్యులందరిని దేవుడు తన నోరార మానవజాతి అని పలుకుతున్నాడు. ఆదాము నుంచి వచ్చిన ప్రతి మనిషి మనుష్యజాతికి చెందినవాడు. ఆయన **యెహెజ్కేలు 36 : 12** లో చెబుతున్నాడు చూడండి. మానవజాతి అనగా, నా జనులైన వీరందరూ మానవజాతికి చెందినవారు. వారిలో దేవుడు కులాల పేరిట, వీరిదొక వర్గం వారిదొక వర్గం అని పిలవాలనుకోవడం లేదు. ఎందుకంటే అందరూ నా కుమారుడైన ఆదాము నుండి వచ్చారు. అందరికి రెండు కాళ్ళు, అందరికి రెండు చేతులు, అందరికి ఒకే రకమైన అవయవాలు. అందరికీ ఒకే రీతిలో ఆయన రూపకల్పన చేసాడు. కాని ఈ మనుష్యుడు మాత్రం వర్గాల పేరిట ఎలా విభజన చెందుతున్నాడో చూడండి. మనిషి దేవుని జ్ఞానము దగ్గరకు, ఆయన ఆలోచనలలోనికి ఇంకెప్పుడు వస్తాడు? మరొక మాట **జెఫన్యా 1 : 3** లో "మనుష్యులనేమి, పశువులనేమి నేను ఊడ్చి వేసెదను. ఆకాశపక్షులనేమి, దుర్జనులనేమి వారుచేసిన అపరాధములనేమి నేను ఊడ్చివేసెదను. భూమిమీద ఎవరును లేకుండా మనుష్యజాతి లేకుండా నిర్మూళన చేసెదను. ఇదే యెహోవా వాక్కు". భూమి మీద మనుష్యునికి ఉన్న జాతి, అదే మనుష్యజాతి లేక మానవజాతి. ఈ రోజు లోకములో ఉన్న అధికారములో మాకు జ్ఞానము తెలుసు అనుకుంటున్నారు. కానీ వారిలో ఎవరూ దేవుడు మాట్లాడినట్టుగా మాట్లాడటం లేదు. ప్రతి ఒక్కడు మానవజాతికి చెందినవాడు అని ఎక్కడా లేనే లేదండి. భారత దేశంలో కులాల పేరిట కొట్టుకు చస్తుంటే, మరికొంత మంది ఉగ్రవాదులుగా మారిపోతున్నారు. ఆఫ్ఘనిస్తాన్‌లో, పాకిస్తాన్‌లో, గల్ఫ్ దేశాలలో కూడా వర్గపోరు మనకు కనిపిస్తుంది. సున్నీలు ఒక ప్రక్క, షియాలు మరొకప్రక్క! వీరందరూ ఇస్లాంకు చెందిన వారే. కాని ఇందులో వర్గాలు ఉండాలి. ఒకరికొకరు కొట్టుకుని చావాలి అని మనిషి ఆలోచిస్తున్నాడు. ఈ రోజుల్లో, ఏ దేశపువారు, ఎంతమంది మనుష్యులు, మనుష్యులందరిదీ ఒకే 'మానవజాతి' అని ఆలోచిస్తున్నారు చెప్పండి. అలా ఆలోచిస్తే మనిషి, మనిషిని ఎందుకు చంపుతాడు చెప్పండి? ఈ కనీసపు జ్ఞానము వారిలో లేకే కదా. ఫలానా వాడు నాకు సంబంధించిన వాడు కాదు అనుకుంటున్నాడు. అందుకే అందరిని లేపేయాలి అనుకుంటున్నాడు. నీవలె తల్లి గర్భాన పుట్టినవాడు కాదా నీ యెదుట ఉన్న మనిషి? భారతదేశానికి 2008 నవంబర్ 26న ఉగ్రవాదులు ఒక గుంపుగా వచ్చారు. అనేకమంది అభాగ్యులను చంపేసారు. కంటికి కనిపించిన ప్రతి ఒక్కరిని కాల్చేసారు. వాడు శత్రువా? మిత్రుడా? వాడు మంచివాడా, కాదా? ఇదేది వారికి పట్టింపు లేదు. వారికి పిచ్చిపట్టింది. భారతదేశములో నివశిస్తున్నవారంతా మనుష్యజాతి, మానవజాతి అనే విషయమే వారికి అర్థం కాలేదు. దేవుడు పలుకుచున్న మాటలలో నీవు నీ పొరుగు వానిని ప్రేమించాలనే జ్ఞానం, పరమార్థం ఉంది. ఆ జ్ఞానము ఈ రోజు ఐక్యరాజ్య సమితిలో కూడా లేదు. అసలు ఈ జ్ఞానమును వారే ప్రపంచ దేశాలన్నింటికి చెప్పాలి. కానీ వారికి కూడా ఈ కనీసపు జ్ఞానము లేదు.

బైబిల్ అంటే మత గ్రంథమనే అభిప్రాయముతో దేవునికి అనేకమంది దూరమైపోయారు. ప్రజలు వారి మట్టి మెదడులో పుట్టిన ఆలోచనలతో అనేక పుస్తకములను వ్రాసుకున్నారు. అవే వారికి మార్గదర్శకం అనుకుంటున్నారు.

ఎవడో శాస్త్రవేత్త స్టీఫెన్ విలియం హాకింగ్స్ అనేవాడు వ్రాసిన పుస్తకము గనుక వీరి దగ్గరకు తెస్తే, అబ్బో ఇది చాలా పవిత్ర గ్రంథము అనుకుంటాడు. కాని దేవుడు వ్రాయించిన పుస్తకం సంగతేమిటి? ఆకాశము గతించినా, భూమి గతించినా ఆయన మాటలలో పొల్లుగాని, సున్నగాని తప్పిపోదండి. అలాంటి మాటలను వ్రాయించాడాయన. ఆదికాండము నుంచి ప్రకటన గ్రంథము వరకు ఎన్ని మాటలనుకున్నారు? ఆయన తన మాటలు చెప్పి ఎన్ని వేల సంవత్సరాలు గడిచాయనుకున్నారు? ఇప్పటికీ అవి చెక్కు చెదరలేదు. ఏ దేశం, ఏ సమితి ఈ దేవుని మాటల దగ్గరకు వచ్చింది చెప్పండి? ప్రపంచంలో ప్రతి మనిషి ఉగ్రవాదిగా మారిపోతున్నాడు. కిరాతకునిగా మారిపోతున్నాడు. మనిషిని మనిషి చంపుకునే పరిస్థితికి వచ్చేసాడు. ఎందుకంటే అందరూ ఒకే జాతి అనే భావం మనిషిలో లేదు. నా కులం నాది, వాడి కులం వాడిది – కాబట్టి వాణ్ణి నేను చంపాలి, వాణ్ణి నేను దెబ్బ కొట్టాలి. వాడు బ్రతకకుండా చేయాలి. వానికి నేను హాని తలపెట్టాలి అనుకుంటున్నాడు. ఏమిటయ్యా నీకు ఈ భావన? ఎందుకయ్యా నీకు ఈ ఆలోచన? దేవుని జ్ఞానము నీకు లేకే కదా, దేవుని ఆలోచన నీకు లేకే కదా! ఏసుక్రీస్తు ఈ లోకములోనికి వచ్చినపుడు, యూదులుగా ఉన్నవారు ఒక వర్గముగా ఉండేవారు. ఆ యూదులలోనే యేసుక్రీస్తు కూడా పుట్టాడు. ఆ యూదులకున్న జాతి అహంకారం ఎంత అంటే, యూదులు యూదులతోనే మాట్లాడతారు, వారితోనే సాంగత్యం చేస్తారు. మిగిలిన ప్రజల దగ్గరకు వారు వెళ్ళేవారు కాదు. అలాంటి పరిస్థితులలో యేసుక్రీస్తు సమరయ స్త్రీ దగ్గరకు వెళ్ళాడు. యేసుక్రీస్తుకు కుల బేధం లేదు, వర్గ బేధం లేదు. ఎందుకంటే ఆయన దేవుని కుమారుడు కదా. ఆయన యూదులలో పుట్టి, మనుష్యులందరికీ సమానత్వాన్ని నింపడానికి, సామ్యవాదమంటే ఏమిటో ప్రజలకు తెలియజేయటానికి ఆయన ఈ భూమి మీదకు వచ్చాడు. ఏసుక్రీస్తు వచ్చేసరికి యూదులు జాతి అహంకారంతో పెట్రేగిపోతున్నారు. మేము చెప్పిందే నిజం, మా దగ్గరే ధర్మశాస్త్రం ఉంది, మాకు దేవుడున్నాడు అంటున్నారు. మిగిలిన వారందరూ వారికి అంటరానివారుగా వారు చూస్తున్నారు. ఇలాంటి తరుణంలో యేసుక్రీస్తు సమరయ స్త్రీ దగ్గరకు వచ్చి వాక్యాన్ని నేర్పిస్తున్నాడు. అప్పుడు సమరయ స్త్రీ యేమంటుందో తెలుసా?

**యోహాను 4 : 9–** "ఆ సమరయ స్త్రీ యూదుడవు అయిన నీవు సమరయ స్త్రీనైన నన్ను దాహమునకిమ్మని ఏలాగు అడుగుచున్నావని ఆయనతో చెప్పెను. ఏలయనగా యూదులు సమరయులతో సాంగత్యము చేయరు." ఆ స్త్రీ, మేము అంటరానివారము కదా. మేము మీతో సాంగత్యము చేయకూడదు కదా. కనీసం మంచి నీళ్ళు కూడా మమ్మల్ని మీరు అడగకూడదు. ఎందుకంటే మీరు యూదులు అంటున్నది. చూసారా, అప్పట్లో యూదులు సమరయులతో సాంగత్యము చేయలేదు. ఎందుకంటే యూదులది ఒక కులం, సమరయులది ఒక కులం. అందరూ ఒకే భూమి మీద బ్రతుకుతున్నా, అందరూ దేవునికి పిల్లలుగా బ్రతికవలసినవారై ఉన్నా, వీరిలో వీరే ఎలాంటి గోడలు కట్టుకున్నారో చూడండి. మీ దగ్గర ధర్మశాస్త్రముంది. యూదుల దగ్గర సమరయులమైన మేము అంటరానివారిగా ఉండిపోవాలి అంటుంది. కాని యేసు ఆ గోడను పడగొట్టి, ఆ సమరయ స్త్రీకి దేవుని వాక్యాన్ని నేర్పించాడు. అప్పుడు ఆ సమరయస్త్రీ ఆనందమును పట్టలేక తన ప్రాంతమునకు వెళ్ళి, అనేకులకు ఈ విషయాలను చెప్పింది. యూదుడైన యేసు ఆ యాకోబు కట్టించిన బావి దగ్గర ఉన్నాడు. ఇతడు అందరిలాంటి యూదుడు కాదు. ఇతనికి జాతి అహంకారం లేదు. ఇతడు నిజంగా దేవుని కుమారుడే. ఇతడు దేవుని కుమారుడై, మనుష్యజాతిలో పుట్టినవాడు. ఇతడే నాకు జ్ఞానాన్ని నేర్పించాడు. నేను ఒక వేశ్యనైనా, ఐదుగురు పెనిమిటిలు నీకు ఉన్నారమ్మా అంటూ, 'అమ్మా' అని నన్ను సంబోధించి, నాకు దేవుని వాక్యాన్ని నేర్పించాడు. ఇదిగో మీరందరూ వచ్చి ఆయన వాక్యాన్ని వినండి అంటూ తన పట్టణములో ఉన్న ప్రజలందరిని యేసు దగ్గరకు తోడుకొని వెళ్ళిపోయింది. యేసు మాటలను వారికి కూడా వినిపించింది. యేసు ఈ భూమి మీదకు వచ్చి మహా జ్ఞానాన్ని నేర్పించాడు. అంతేగాని వర్గాలు, కులాలు, ప్రాంతాల వారిగా మనుష్యులను విడగొట్టలేదాయన. అనేక దేవుని సంగతలను తెలియజేసాడు. శాస్త్రం అభివృద్ధి చెందిన ఈ కాలములో కూడా మనిషి ఎందుకు ఇలా ఆలోచిస్తున్నాడు? మనిషి దగ్గర తాను వ్రాసుకున్న శాస్త్రాలున్నాయి తప్ప దేవుని మాట లేదు. ఆయన వ్రాయించిన గ్రంథములో అద్భుతమైన సంగతులను మనిషి కొరకు పొందుపరిచాడు.

ధర్మశాస్త్రకాలములో యూదులు యూదులుగానే మిగిలిపోయారు. ఇక ఎవరితోను సాంగత్యం చేయకుండా,

దేవుని జ్ఞానాన్ని ఎవరికీ పరిచయం చేయకుండా, ఆత్మసంబంధమైన జ్ఞానమును బంధించినవారుగా, జ్ఞానమనే తాళపుచెవిని ఎత్తుకునిపోయేవారుగా మారిపోయారు. అలాంటివారు ఉన్న సందర్భంలో, యేసుక్రీస్తు భూమిమీద వాక్యాన్ని ప్రకటించి, అనేకుల కొరకు తన జీవితాన్ని అర్పణ చేసి, చివరకు సిలువలో తన ప్రాణము పెట్టాడు. తిరిగి సజీవునిగా లేచిన యేసుక్రీస్తు తన చివరి మాటలలో పలుకుతున్నదేమిటో తెలుసా? చూడండి.

**మత్తయి 28 : 18, 19** "అయితే యేసు వారి వద్దకు వచ్చి పరలోకమందును, భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది. ఇప్పటివరకు అపవాది మీ మీద అధికారమును చేసాడు. యూదులను యూదులుగా, సమరయులను సమరయులుగా, పరిసయ్యులను పరిసయ్యులుగా, సద్దూకయ్యులను సద్దూకయ్యులుగా, ఇలా వర్గాలవారిగా, కులాల వారిగా మిమ్ములనందరిని విడగొట్టాడు. మీ మధ్య విభేదాలు సృష్టించాడు. గొడవలు సృష్టించాడు. అయితే ఇప్పుడు నేను సిలువ మీద మరణించి తిరిగి లేచినవాడను. దేవుని వలన సర్వాధికారాన్ని పొందినవాడను. అందుకే పరలోకమందును, భూలోకమందును నాకు సర్వాధికారం ఇయ్యబడియున్నది. కాబట్టి మీరు నా శిష్యులుగా వెళ్ళి సమస్త జనులను, అనగా సమరయులని తేడాలేదు, గ్రీసు దేశస్థులని తేడాలేదు, యూదులని తేడాలేదు, సమస్త జనులయొద్దకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించమన్నాడు. ఎందుకంటే దేవుని ప్రజలు ఈ భూమిమీద నలుదిక్కులకు వెళ్ళిపోయారు. అమెరికా నుండి ఆసియా వరకు మీరు దేవుని వాక్యాన్ని చెప్పాలి. సమస్త జనులయొద్దకు మీరు వెళ్ళి, సర్వసృష్టికి మీరు సువార్తను ప్రకటించాలి. ఎందుకంటే సువార్త ప్రకటనకు కులాల యొక్క లేక వర్గాల యొక్క అడ్డుగోడలను మీరు నిర్మించకూడదు. **దేవునికి కులము లేదు**. సమస్త జనులను శిష్యులుగా చేయండి. అందులో అమెరికా జాతివారుండాలి, చైనా జాతివారుండాలి, ఆస్ట్రేలియా జాతివారుండాలి, కమ్మవారుండాలి, కాపువారుండాలి, మాలవారుండాలి, మాదిగవారుండాలి, రజకులుండాలి, అందరూ ఉండాలి. ఎందుకంటే ఈ **దేవుడు అందరివాడు**. ఈయన అందరిని సృష్టించినవాడు, అందరికి జన్మనిచ్చినవాడు, అందరిని కోరుకున్నవాడు. అందుకే యేసుక్రీస్తు, మీరు ఒక ప్రాంతపువారిగా ఒక జాతివారిని వారిని మాత్రమే రక్షించాలని చెప్పలేదు. సర్వజనులకు మీరు సువార్తను ప్రకటించాలి. జనులందరికి తండ్రి అంటే ఎవరో, యేసుక్రీస్తంటే ఎవరో, పరిశుద్ధాత్ముడంటే ఎవరో మీరు తెలియజేయాలి. నమ్మినవారందరికీ మా నామములోనే మీరు బాప్తీస్మము ఇవ్వాలి.

ఇదండి పరలోకమందున్న తండ్రి ఆలోచన. కాని ఎవరికి అర్థమయింది? ఈ మాటలు విన్న శిష్యుడైన పేతురుకు కూడా దేవుని జ్ఞానము అర్థం కాలేదు. ఎందుకంటే పేతురు కూడా ఒక యూదుడు. యూదులలో ఆ జాతి అహంకారము అనేది కొంత ఉండిపోతుంది. దీనివల్ల పేతురుకు కూడా ప్రారంభశతాబ్దంలో పరిపూర్ణముగా జ్ఞానము అందని స్థితిలో, కేవలం యూదులకు మాత్రమే వాక్యాన్ని చెప్పుకుంటూ కాలము గడుపుచున్నాడు. అప్పుడు దేవుడు యూదేతరుడైన కొర్నేలి అనే వ్యక్తికి వాక్యాన్ని చెప్పాలనుకున్నాడు. ఆయన కుటుంబాన్ని దేవుడు రక్షించాలి అనుకున్నాడు. ఎందుకంటే దేవునికి సమస్త జనులు కావాలి. ప్రతిజాతి మనుష్యులు ఆయనకు పుట్టినవారే. అందరూ పరలోకానికి రావాలి. పరలోకరాజ్యము నానావిధములైన చేపలను పట్టిన వలను పోలియున్నది. అందుకే దేవుడు కొర్నేలి కుటుంబాన్ని రక్షించాలి అనుకున్నప్పుడు కొర్నేలి యూదుడు కానప్పుడు, మరి కొర్నేలిని ఎలా రక్షించాలి? కొర్నేలికి దేవుని వాక్యం ఎవరు చెప్పాలి? పేతురే చెప్పాలి. కాని పేతురు ఎలా నిర్ణయించుకున్నాడంటే తాను కేవలం యూదులకు మాత్రమే వాక్యము చెప్పాలనుకున్నాడు. యూదులకు మాత్రమే యేసుక్రీస్తును ప్రకటించాలి అనుకున్నాడు. అలాంటి పరిస్థితులలో పేతురుకు దేవుడు ఒక దర్శనాన్ని ఇచ్చాడు. ఏ మనిషినీ నిషేధించరాదని ఆ దర్శనము ద్వారా దేవుడు పేతురుకు నిరూపించాడు. పేతురు మనసులో అప్పటివరకు యూదులు కానివారు అంటరానివారని, తన కులానికి చెందినవారు కానివారితో తాను సాంగత్యము చేయకూడదని అనుకున్నాడు. కానీ అలా అనుకోవడానికి వీలులేదు. ఎందుకంటే వారిని, పేతురును పుట్టించింది ఒక్క దేవుడే. దేవునికి కూడా కులాన్ని అంటగడతాడా పేతురు? పేతురు విశ్వసించే దేవునికి కూడా ఒక వర్గము ఉంటుందా? నిన్ను పుట్టించిన వాడు, నీ తండ్రిని పుట్టించిన వాడు, నీ తాతముత్తాతలను పుట్టించిన వాడు దేవుడే. ఈ భూమిమీద మనిషి అనేవాడు మానవజాతిలో ఎక్కడ కనిపించినా, వాడు కేవలం దేవుని వలన పుట్టినవాడని నీవు మరచిపోకూడదు. ఈ జ్ఞానము ఎవరికి ఉంటే వారు ఇతరులను ప్రేమిస్తారు. ఈ భూమిపై

ప్రతి ఒక్కరూ నా తండ్రివలనే పుట్టినవారు, నా సహోదరులు! అతను వేరే కుటుంబములో ఉండవచ్చు. వేరే ప్రాంతములో నివశించవచ్చు. సామాజిక స్థితిగతులనుబట్టి, తాతముత్తాతల ఆస్తిపాస్తులనుబట్టి, వాడు అత్యధికస్థితిలో ఉండవచ్చు, నేను బీద స్థితిలో ఉండవచ్చు. కాని వాడు కూడా నా తండ్రికి కుమారుడు. మిమ్ములను కన్న తండ్రి అనగా, పరలోకమందున్న మీ తండ్రి మీకు జీవాన్ని ఇచ్చినవాడే, అదిగో అతనికి కూడా అన్నీ ఇచ్చాడు. అతనిని రక్షించివలసిన బాధ్యత నీకు ఉంది. అతనికి వాక్యమును చెప్పవలసిన బాధ్యత నీకు ఉంది. ఈ జ్ఞానము ఎప్పుడైతే పేతురుకు దర్శనము ద్వారా దేవుడు అనుగ్రహించాడో అప్పుడు పేతురు ఎలా మాట్లాడుతున్నాడో చూడండి.

**అపొస్తలులు కార్యములు 10 : 25** "పేతురు లోపలికి రాగా, కొర్నేలి అతనిని ఎదుర్కొని అతని పాదముల మీద పడి నమస్కారము చేసెను. అందుకు పేతురు నీవు లేచి నిలువుము. నేను కూడా నరుడనే" అంటున్నాడు. పేతురు కొర్నేలితో, నేనూ మనుష్యజాతికి చెందినవాడినే. ఇప్పటి వరకు యూదుడను అనే గొప్పతనం నాలో ఉండేది. ఇప్పటివరకు నాకు కులము యొక్క కొమ్ములు ఉండేవి. నేను యూదుడను, యూదుల వంశములో పుట్టినవాడను, ఇక నేను ఎప్పటికీ యూదేతరుల గడప తొక్కకూడదు, మిగలిన వారి దగ్గరకు వెళ్ళకూడదు అనుకునేవాడిని. కాని దేవుడు పేతురుకు కళ్ళు తెరిపించాడు. దేవునికి కులం లేదు, వర్గం లేదు. దేవుడు మనుష్యజాతిని పుట్టించిన మహోన్నతుడు. అందుకే పేతురు ఏమంటున్నాడో తెలుసా? లేచి నిలువవయ్యా! ఎందుకంటే నేను కూడా నీవలె నరుడను. అని అతనిని లేవనెత్తి అతనితో మాటలాడుచు లోపలికి వచ్చి అనేకులు కూడా వచ్చుట ఆయన చూచెను. **అపొ. కార్య. 10 : 28** లో "ఆయన అన్యజాతివానితో సహవాసము చేయుటయైనను, అట్టి వానిని ముట్టుకొనుట అయినను యూదునికి ధర్మము కాదని నీకు తెలియును. ఒకప్పుడు ధర్మశాస్త్రకాలములో యూదులకు ఒక ధర్మముంది. అది ఏమిటంటే అన్యజాతివారిని కనీసం ముట్టుకోకూడదు. అంటే అంటరానితనం అనేది యూదులలో అప్పటినుంచే ప్రారంభమైంది. దేనినైనా బైబిల్‌ని అడగాలి. 200, 300 యేళ్ళ చరిత్ర ఈ లోకానికి తెలుసు. కాని వందల వేల సంవత్సరాల చరిత్ర, అసలు ఏది ఎక్కడ పుట్టింది అనేది మీకు అర్థం కావాలంటే ప్రజలకు జ్ఞానమును నేర్పించాలంటే మీరు దేవుని దగ్గరకు రావాలి. బైబిల్ ముందు మీరు సాష్టాంగపడాలి. అప్పుడు మీకు చరిత్ర అర్థమవుతుంది.

కులబేధం, వర్గబేధం యూదుల దగ్గర ప్రారంభమయింది. అంటరానితనం, వేరే మనిషి అని చూసేతత్వం యూదులకు ఎక్కువగా ఉంది. అందుకే పేతురు కొర్నేలితో ఏమంటున్నాడో తెలుసా? మా యూదధర్మం ప్రకారం, ఒకప్పుడు మేము ఎలా ఉండేవాళ్ళమో తెలుసా? అన్యజాతి వారితో సహవాసము చేయుటయైనను, అట్టివానిని ముట్టుకొనుటయైనను యూదునికి ధర్మముకాదని మీకు తెలియును. అయితే మా ధర్మము ఎవరికి లెక్క? మేము నిర్ణయించుకున్న విధి–విధానాలు ఎవరికి లెక్క? దేవుని ధర్మశాస్త్రము ఏమి చెబుతుందంటే, దేవుని శాసనము ఏమని ఘోషిస్తుందంటే, ఏ మనిషి అయినను వాడు నిషేదించదగినవాడు కాదు. ఫలానా మనిషిని, వాని కులాన్నిబట్టో, వర్గాన్నిబట్టో అతడు అపవిత్రుడని నేను చెప్పకూడదని దేవుడు నాకు చూపించియున్నాడు. దేవుడు తన దర్శనములో చూపిస్తే గాని, పేతురు మారలేదు. అంటే దేవుడు చెప్పేంతవరకు, పేతురుకు ఇంకా పరిపూర్ణముగా జ్ఞానము అందలేదు. తనకు కొద్దిగా తెలిసిన వాక్యాన్ని ప్రకటిస్తున్నాడు. ఇంకా పేతురు తెలుసుకోవలసింది చాలా ఉంది. ఆ సమయానికి తగ్గట్టుగా **అపొస్తలుల కార్యములు 10**వ అధ్యాయంలో దేవుడు పేతురుకు జ్ఞానాన్ని అనుగ్రహించాడు. ఏ మనిషినీ అపవిత్రుడని చెప్పకూడదు. ఎందుకంటే మనుష్యుడు దేవుని వలన పుట్టినవాడు, నీకు సహోదరుడు. అతనికీ తండ్రి ఆదామే, నీ తండ్రీ ఆదామే. ఆ ఆదాముకు తండ్రి దేవుడే. అందరూ ఒక తండ్రి నుండి పుట్టినవారే. అందరూ ఒక్క కుటుంబములోని వారే. అందరూ ఒక్క కుటుంబములో నుండి వచ్చిన వారే. దుష్టుడైన వాడు మీలో ఈ వర్గాలను సృష్టించాడు. ఆదికాలము నుంచీ వాడు నరహంతకుడు. ఏది చేయకూడదో అదే చేస్తాడు. వాడి పేరే అపవాది, వాడి పేరే సాతాను. వాడేదో మన దగ్గరకు వచ్చి, మనలను ఏదో చేసేస్తాడు అనుకోకండి. ఈ సమాజములోనికి వెళ్ళి మనుష్యులను రాక్షసులుగా మారుస్తూ ఉంటాడు. ఏ మనసైతే మనిషిలో కలిగించకూడదో, ఏ తత్త్వమైతే మనిషికి రాకూడదో, మనిషి ఎలా ఆలోచించకూడదో అలా ఆలోచింపచేసే పనినే వాడు కలిగియున్నాడు. అందుకే బహు పరాక్ అంటున్నాడు దేవుడు. మనుష్యజాతిలో జ్ఞానము ఉంది కనుక మీరు జాగ్రత్తగా ఆలోచించాలి అంటున్నాడు

దేవుడు. ఒకనాడు పేతురుకి అదే చెప్పాడు. పేతురూ, నీవు ఏ మనిషినీ నిషేధించకూడదు. ఏ మనిషినీ అపవిత్రుడని చెప్పకూడదు. తరువాత ఏమంటున్నాడో చూడండి. **అపొ. కార్య. 10 : 33** "వెంటనే నిన్ను పిలిపించితిని. నీవు వచ్చినది మంచిది. ప్రభువు నీకు ఆజ్ఞాపించినవన్నియు వినుటకై మేమందరము దేవునియెదుట ఇక్కడ కూడియున్నామని చెప్పెను". దానికి పేతురు నోను తెరిచి, **34**వ వచనంలో "దేవుడు పక్షపాతికాడని నిజముగా గ్రహించియున్నాను" అన్నాడు. అంటే అప్పటి వరకు పేతురుకు ఈ జ్ఞానము తెలియదు. అప్పటివరకు పేతురు కేవలం యూదులకు మాత్రమే దేవుడు ఈ రక్షణను అనుగ్రహించాడు అనుకున్నాడు. దేవుడు పక్షపాతిగా ఉన్నాడనుకున్నాడు. విషయం అర్థమయిన తరువాత పేతురు నోరు తెరిచి ఇలా అంటున్నాడు. "దేవుడు పక్షపాతికాడని నేను నిజముగా గ్రహించియున్నాను. ప్రతి జనములోను ఆయనకు భయపడి నీతిగా నడుచుకొనువారిని ఆయన అంగీకరించును. యేసుక్రీస్తు అందరికి ప్రభువు" అని పలుకుచున్నాడు. ప్రతి జనములోను అనగా అది ఆసియా జనం కావచ్చు, ఆఫ్రికా జనం కావచ్చు. మనుష్యజాతిలోని ప్రతి జనములోని మనుష్యులను దేవుడు అంగీకరించును. ఎందుకంటే యేసుక్రీస్తు అందరికి ప్రభువు. ఆయన అందరి కొరకు తన ప్రాణమును పెట్టాడు. ఎవరు ఆయనను నమ్ముతారో, ఎవరు ఆయనను ఆశ్రయిస్తారో, వారందరికి ఆయన పరలోకాన్ని ఇచ్చేవాడు. ఆయన ఒక కులాన్ని ఇచ్చేవాడు కాదు, ఉన్న కులాన్ని మార్చేవాడు అంతకంటే కాదు. ఆయనకంటూ ఏ కులమూ లేదు. ఎందుకంటే ఆయన దేవుని కుమారుడు. నిజంగా మన తండ్రియైన దేవునికి పక్షపాతము లేదు. ఆయన అందరినీ ఒకేలా చూసాడు. ఇప్పటికీ ఒకే విధంగా చూస్తున్నాడు. తన కుమారుడైన యేసుక్రీస్తును సర్వమానవాళికి ప్రభువుగా నియమించాడు. ఇప్పుడు ఈ యేసుక్రీస్తు, సంఘానికి ఒక శిరస్సుగా, తన సంఘములోనికి ఎవరెవరిని ఆహ్వానిస్తున్నాడో చూడండి.

**గలతీయులకు 3 : 26** "యేసుక్రీస్తు నందు మీరందరూ విశ్వాసము వలన దేవునికి కుమారులైయున్నారు". సంఘములోనికి ఎవరైతే వస్తున్నారో, ఎవరైతే దేవుని విశ్వసిస్తున్నారో, ఎవరైతే బైబిల్‌ని నమ్ముచున్నారో, ఎవరైతే నిత్యజీవాన్ని కోరుకుంటున్నారో వారందరిని గూర్చి ఇక్కడ చెబుతున్నాడు. వారందరూ విశ్వాసము వలన దేవుని కుమారులై ఉన్నారు. మనుష్యజాతిలోనుంచి ప్రతి ఒక్కరూ, దేవునిజాతిలో దేవుని కుమారులుగా మారిపోవాలి. మనుష్యులంతా అపవాదికి పిల్లలై పోయారు. అపవాదిని వారికి తండ్రిగా భావించారు. ఆ అపవాది చెప్పిన కులము, వర్గములో కొట్టుమిట్టాడుతున్నారు. కనుక వాక్యమును అంగీకరించిన మీరు ఇప్పుడు బయటకు రావాలి. యేసుక్రీస్తుని నమ్మి, వాక్యమును అంగీకరించిన మీరందరూ ఏ ప్రాంతము నుంచి వచ్చినా, మీరు బీదలైనా, ధనికులైనా యేసుక్రీస్తునందు మీరందరూ విశ్వాసము వలన దేవునికి కుమారులుగా ఉన్నారు. అలా క్రీస్తును నమ్మి సంఘములోనికి వచ్చిన అందరికీ యేసుక్రీస్తు ఇచ్చిన ఒకే ఒక పేరేమిటో తెలుసా? సన్ ఆఫ్ గాడ్ అనగా దేవుని కుమారుడు. క్రీస్తులో బాప్తీస్మము పొందిన మీరందరూ క్రీస్తును కలిగియున్నారు. ఇందులోనికి వచ్చిన తరువాత ఒకవేళ మీరు అనుకోవచ్చు. నేను యూదుడిని కనుక యూదునిలా ఉండిపోతాను. క్రీస్తును నమ్మిన యూదుడిని, పరలోకానికి వెళ్ళే యూదుడిని అంటే – అక్కడ చెల్లదు. ఎందుకంటే ఇందులో యూదుడని, గ్రీసు దేశస్థుడని, దాసుడని, స్వతంత్రుడని, పురుషుడని, స్త్రీ అని బేధము లేదు. దేవుడు ఎంత సమానత్వాన్ని చూపిస్తున్నాడో చూడండి. ఆయన రాజ్యానికి పోలికైన సంఘములో ఆయన ఎలా ఉండమంటున్నాడో చూడండి. క్రీస్తులోనికి వచ్చిన ప్రతిఒక్కరూ దేవునికి కుమారులు. వీరికొక మంచి పేరు ఇవ్వబడింది. క్రైస్తవుడైన ప్రతిఒక్కడు దేవుని కుమారునిగా ఉండాలే తప్ప యూదునిగా, గ్రీసు దేశస్థునిగా, దాసునిగా, స్వతంత్రునిగా, స్త్రీగా, పురుషునిగా ఉండకూడదు. క్రీస్తులోనికి వచ్చిన ప్రతిఒక్కరూ దేవునికి కుమారులు. ఇక్కడ స్త్రీలు కూడా దేవునికి కుమారులేనా? స్త్రీలు దేవునికి కుమారులు ఎలా అవుతారు. కుమార్తెలు అవుతారు కదా! కాదయ్యా! కాదమ్మా!! ఎందుకంటే ఈ భూమిపై నివశించడానికి స్త్రీ శరీరం కొందరికివ్వబడింది. పురుషుని శరీరం మరికొందరికివ్వబడింది. అంతేతప్ప, అందరి శరీరాలలోపల ఉన్నది దేవుని కుమారుడైన ఆత్మ అని ఎన్నడూ మీరు మరిచిపోకూడదు. స్త్రీలైన వారు ఈ విషయాన్ని బాగా జ్ఞాపకం ఉంచుకోవాలి. ఎందుకంటే నేను స్త్రీని కదా, దేవుడు నన్ను ఎప్పుడూ ఒక మెట్టు క్రిందే ఉంచాడు కదా అని మీరు అనుకోకండి. ఎందుకంటే సమానత్వానికి ఆయన ఒక

పెద్ద చిరునామా! ఈ భూమి మీద అయితే స్త్రీలకు 33% రిజర్వేషన్. దేవుని దగ్గర అయితే 100% రిజర్వేషన్. దేవుని దగ్గర అంతా సమానత్వమే. పురుషుడు, స్త్రీ అని ఆయన సంఘములో బేధము ఉండకూడదు. మీరందరూ దేవునికి కుమారులు అనేది ఎంత చక్కని మాటో చూడండి. **గలతీయులకు 3 : 28** "ఇందులో యూదుడని గ్రీసుదేశస్థుడని లేదు, దాసుడని స్వతంత్రుడని లేదు, పురుషుడని, స్త్రీ అని లేదు. యేసుక్రీస్తునందు మీరందరను ఏకముగా ఉన్నారు". మీరందరూ యేసుక్రీస్తునందు ఒక్కటైపోయారు. ఇప్పుడు మీరు సంఘము లోపలికి వచ్చిన తరువాత, నేను ఫలానా కులం, నేను ఫలానా వర్గం, నేను ఫలానా జాతి అని చెప్పడానికి వీలు లేదు. ఒకవేళ ఒకప్పటి ధర్మశాస్త్రకాలములో నీవుంటే, పేతురులా నీవు భ్రమపడినా సబబే. కాని ఇప్పుడు నీవు పరిపూర్ణమైన జ్ఞానములోనికి వచ్చావు. దేవుడు అనుగ్రహించిన వాక్యము నీచేతిలో ఉంది. దేవుని దగ్గరకు వచ్చిన తరువాత కులం లేదు, వర్గం లేదు. ఇక్కడ ఉన్నది ఒకే ఒక వర్గం, అదే దేవుని కుమారుల వర్గం. ప్రతి ఒక్కరు దేవుని కుమారునిగా ఉండాలి. అలా ఉంటేనే అది క్రీస్తు సంఘమవుతుంది. అలా ఉంటేనే వారు క్రీస్తు ద్వారా పరలోకానికి వెళతారు. లేదా, వారికి ఇంకా జ్ఞానము అర్థం కాలేదు. వారింకా మిడిమిడి జ్ఞానములో ఉండిపోయారు. పేతురు వెంటనే సరిచేసుకున్నాడు. నేను కొర్నేలి ఇంటికి వెళ్ళాలి, కొర్నేలికి వాక్యము చెప్పాలి అనుకున్నాడు. ఎందుకంటే దేవుడు పేతురు కళ్ళు తెరిపించాడు. దేవుడు నిజంగా పక్షపాతం లేనివాడని, యేసుక్రీస్తు అందరికి ప్రభువని పేతురు గ్రహించాడు. ఇలాంటి జ్ఞానము ఎవరి దగ్గర ఉంది? ఎవరు మాట్లాడగలుగుతున్నారిలా? దేవుని సంఘములోనికి వచ్చేసరికి ప్రతి ఒక్కరు ఏకముగా ఉండాలి.

**గలతీయులకు 3 : 28** చివరి భాగములో – "యేసుక్రీస్తునందు మీరందరును ఏకముగా ఉన్నారు" అన్నాడు. ఇప్పుడు మీరు ఒక్కటై పోయారు. మరల **29** వ వచనంలో "మీరు క్రీస్తు సంబంధులైతే, ఇప్పుడు క్రీస్తు సంఘములో ఉన్నవారై యేసుక్రీస్తుని శిరస్సుగా కలిగిన సంఘములో ఉన్నవారైతే, మీరందరూ ఏకముగా ఉన్నట్లయితే, మీ అందరిదీ దేవుని కుమారుల వర్గమైతే, ఆ పక్షమున మీరందరూ అబ్రహాము యొక్క సంతానమై యుండి, వాగ్దానము ప్రకారము వారసులై పోతారు. అంటే ఈ దేవుని సంఘమును మరల ఎక్కడ కలుపుతున్నాడు? అబ్రహాముకు కుమారులని అక్కడ ముడిపెడుతున్నాడు. విశ్వసించినవారంతా అబ్రహాము సంతానమైపోయారు. అంటే ఒకవేళ భూమి మీద ఎవడైనా శారీరకపరంగా మిమ్ములను కులాన్ని గూర్చి అడిగితే, దేవుడు ఏమనమన్నాడో తెలుసా? నీ వర్గం ఏమిటని అడిగితే, నీది అబ్రహాము వర్గము, నీది అబ్రహాము కులం! అవును. దేవుని కుమారులందరిదీ విశ్వాసులకు తండ్రియైన అబ్రహాము కులమే. ఇది ముమ్మాటికీ నిజం. ఎందుకంటే దేవుడిచ్చిన లైసెన్సులో (బైబిల్‌లో) ఆ మాటను దేవుడు వ్రాయించాడు. ఇది దేవుడిచ్చిన రాజ్యాంగం. ఇందులో ఆ మాట ప్రకారం నాది అబ్రహాము సంతానము. ఈ లోకము కులాలనిచ్చి మనుష్యులను దేవునికి కాకుండా చేసింది. కానీ, దేవుడు తన కుమారుని ఇచ్చి అబ్రహాము సంతానములో మనలను ఉంచాడు. దేవుడు నాకిచ్చిన జ్ఞానము ప్రకారము, నేను అబ్రహాము కుమారుడను. అలాగైతేనే నేను పరలోకము వెళతాను. ఈ భూమి మీద నాకు ప్రభుత్వాలు వారి రాయితీలను కలిగించకపోవచ్చు. ఏదైనా ఒక అధికారమును నాకు ఇవ్వలేకపోవచ్చు. అనగా ఈ భూమిమీద నాకు కొంత నష్టమును కలిగించవచ్చు. అంతే తప్ప, ఈ లోకాధికారము నాకు పరలోకాన్ని ఇవ్వలేదుగా. నిత్యజీవాన్ని ఇవ్వలేదుగా. కాని ఆ ఇచ్చేవాడు ఏమి చెబుతున్నాడో తెలుసా? నీవు అబ్రహాము కుమారుడవు కావాలి. నీవు అబ్రహాము సంతానముగా మారాలి. ఆ సంతానములో నీవు ఉంటేనే నీవు పరలోకానికి వెళతావు. నీ గమ్యస్థానము పరలోకము.

భూమిమీద మనుష్యులందరిని ఒక కుటుంబముగా చూడాలనుకున్న పరలోకమందున్న తండ్రి ఆశలమీద అపవాది ఎలా నీళ్ళు జల్లుతున్నాడో చూడండి. కులాలపేరిట అందరినీ కొట్టుకుని చావమన్నాడు. భారతదేశంలో కులాలు, పాకిస్తాన్‌లో షియాలు సున్నీలు, అమెరికాలో తెల్లవారు నల్లవారు, కొరియాలో సౌత్ వారు, నార్త్ వారు... ప్రపంచవ్యాప్తంగా ప్రజలను ఎక్కడా సుఖంగా, శాంతిగా ఉండనివ్వడు. వర్గ వైషమ్యాలు వాడి దగ్గరే మొదలవుతాయి. కులపోరు వాడి దగ్గరే ప్రారంభమవుతుంది. కాని దేవుడు అనుకున్న విధానమేమిటో తెలుసా? మనుష్యులందరూ ఒక్కటిగా ఉండాలి, వీరందరూ క్రీస్తునందు ఏకమవ్వాలి. మీరందరూ అబ్రహాముకు సంతానముగా మారిపోవాలి. మీరందరూ పరలోకానికి రావాలి.

**ఎఫెసీయులకు 3 : 14** "ఈ హేతువు చేత పరలోకమందును, భూమి మీదను ఉన్న ప్రతి కుటుంబము ఏ తండ్రిని బట్టి కుటుంబమని పిలువబడుచున్నదో ఆ తండ్రియెదుట నేను మోకాళ్ళూని" అంటున్నాడు పౌలు. ఏ తండ్రిని బట్టి మీ కుటుంబం, ఒక కుటుంబమని పిలువబడుతుందంటే, మీ తండ్రి అయిన దేవుని వలన. ఆ దేవునికే వర్గం లేనప్పుడు, ఆ దేవునికే కులం లేనప్పుడు, ఆ దేవునికే జాతి లేనప్పుడు భూమిమీద ఒక కుటుంబముగా ఉన్న నీవు, ఆ తండ్రిని బట్టే కుటుంబముగా ఉన్నావని గ్రహించక, నీకూ ఒక కులముందని, నీకూ ఒక వర్గముందని, వర్గాన్ని కులాన్ని చూసుకుని చాలా మురిసిపోతున్నావు. కానీ చచ్చిన తరువాత ఇవేవీ నీతోపాటు రావు. పైగా నిన్ను పాతాళానికి పంపిస్తాయి. దేవుని గూర్చి ఒకసారి ఆలోచించు. ఆ తండ్రిని బట్టి నీవు ఒక కుటుంబము అయ్యావు. దేవుని బట్టి ఈ భూమిమీద యేసుక్రీస్తును అంగీకరించి ఆయన రాజ్యములోనికి నీవు వెళ్ళాలి. ఇందులో ఏ బేధమూ లేదు. మీరంతా దేవునికి కొడుకులుగా మారిపోవాలి. మీరందరూ ఏ కులానికి చెందినవారు అని ఎవరైనా అడిగితే, దేవుని కుమారులైన వారు చెప్పాల్సిన కులమేమిటో తెలుసా? దేవుడి కొడు**కులం**. ఆ కొడు'కులం'లో కులం ఉంది. అంటే భూమిమీద మనమందరము దేవునికి కొడుకులం. నన్ను అడిగితే ఇలాగే చెబుతాను. ఇంకా చెప్పమంటారా? మేమందరము దేవుని తరుపున యాజ**కులం**. ఆ కులానికి చెందిన వారందరూ పరిశుద్ధులు, యాజకులు, దేవుని సొత్తైన ప్రజలు. ఇంకా చెప్పమంటారా? కాలాన్ని బట్టి చూస్తే మీరందరూ బోధకులుగా మారిపోతారు అన్నాడు. మేమందరం బోధ**కులం**. ఇంకా, నిష్ప్రయోజ**కులం**. దేవుని దృష్టికి, నిష్ప్రయోజకులైన దాసులుగా ఉండమన్నాడు. ఎల్లప్పుడూ దేవుని ఎదుట దీనత్వాన్ని కలిగి ఉండమన్నాడు. దేవుని సేవలో సేవకులుగా మారిపోమన్నాడు. మేము దేవుని సేవ**కులం**. ఈ ప్రపంచమంతటికి సేవచేసే సేవకులం, దేవుని వాక్యాన్ని ప్రకటించే సేవకులం. దేవుని ఇష్టాన్ని నెరవేర్చేవారము. ఒకవేళ ఎవరైనా దేవుని మీద తప్పుగా నోరు పారేసుకుంటే సైనికునిగా మారిపోతాం. అందుకే మేము దేవుని సైని**కులం**. దేవుని తరపున యుద్ధం చేసే కులం మాది. **2 తిమోతి 2 : 2** "నీవు అనేక సాక్షులయెదుట నా వలన వినిన సంగతులను ఇతరులకు బోధించుటకు సామర్థ్యముగల నమ్మకమైన మనుష్యులకు అప్పగింపుము. క్రీస్తుయేసు యొక్క మంచి సైనికునివలె నాతో కూడ శ్రమను అనుభవించుము" అని పౌలు, తిమోతితో చెబుతున్నాడు. భూమిమీద ఇక కులమే ఉండకూడదు. ఒకవేళ ఉంటే మేమందరము దేవుని సైని**కులం**. దేవునికొరకు ఒక వీర సైనికునిగా మారిపోవాలి. క్రీస్తు యేసు యొక్క మంచి సైనికునిగా మారిపోవాలి. అనేకమందిని దేవుని వైపు నడిపించడానికి వీరోచితమైన యుద్ధాలు చేసి పోరాడాలి. ఇంకా, దేవుని కుమారులైన మేమందరము యాత్రి**కులం**. **హెబ్రీయులకు 11: 13** లో నీతిమంతులను గూర్చి చెబుతున్నాడు. వారు పరిశుద్ధులు, యాత్రికులు. పరదేశులుగా ఈ భూమిమీద తన జీవనాన్ని గడిపారు. ఇవన్నీ మనసులో పెట్టుకోకుండా నేను ఫలానా కులం, ఫలానా వర్గం అనుకుంటారేమిటి? అంటే దేవుని జ్ఞానం మీకు అర్థం కాలేదా? సేవకునిగా మారాలి, సైనికునిగా మారాలి, యాత్రికునిగా ఆలోచించాలి. పరిశుద్ధువు కావాలి, బోధకుడవు కావాలి, యాజకుడవు కావాలి, దేవుని కొడుకువు కావాలి. ఏ మనష్యునికీ ఈ ఆలోచన లేనే లేదు. క్రైస్తవుడైన తరువాత కూడా నాకు ఫలానా కులమే కావాలి అనుకుంటున్నాడీ దౌర్భాగ్యుడు. ఆ కులము నిన్ను దేవుడున్న పరలోకానికి తీసుకొని వెళ్ళదయ్యా! సరాసరి నరకానికి తీసుకొనివెళ్ళిపోతుంది. ఎందుకంటే అపవాదియైనవాడు దీనిని సృష్టించాడు తప్ప దేవుడు కాదు. వీటన్నిటిని నరహంతకుడే సృష్టించాడు. నీవు పరలోకానికి వెళ్ళాలంటే నీవు దేవుని కొడుకువి కావాలి. నీవు దేవుని ఇష్టాన్ని నెరవేర్చాలి. నీవు నీ చుట్టూ ఉన్నవారిని ప్రేమించాలి. మానవజాతిని ప్రేమించి మనుష్యజాతికోసం అవసరమైతే నీ ప్రాణమును పెట్టాలి. నీవు నమ్మిన యేసుక్రీస్తును లోకానికి తెలియజేయాలి. ఆ యేసును నీవు ధరించుకోవాలి. పురుషుడు క్రీస్తును ధరించుకోవాలి, స్త్రీ క్రీస్తును ధరించుకోవాలి, నపుంసకుడూ క్రీస్తును ధరించుకోవాలి. అవును, అటూ ఇటూ కానివారు కూడా దేవుని ఇష్టాన్ని నెరవేరిస్తే వారు కూడా దేవునికి కొడుకులే అవుతారు. అవునండి, దేవుడు వారిని కూడా జ్ఞాపకం చేసుకుంటున్నాడు. షండులైవారికి కూడా దేవుడు సమానత్వాన్ని ఆపాదించాడు. అలాగే, చిన్నపిల్లలైన వారిని, వృద్ధులైన వారిని ఆయన జ్ఞాపకం చేసుకుంటున్నాడు. అందరూ క్రీస్తును నమ్మినవారు కావాలి. క్రీస్తు కొరకు బ్రతికేవారు కావాలి. క్రీస్తు వాక్యాన్ని ప్రకటించేవారు కావాలి. తండ్రి ఇష్టాన్ని నెరవేరుస్తున్నవారుగా

వీరందరూ ఒకే కుటుంబముగా, దేవుని కొడుకులుగా పరలోకానికి రావాలని ఆయన కోరుకుంటున్నాడు.

ఇంత మహాజ్ఞానం భూమిమీద ఎవరైనా చెబుతున్నారా? కులాల పేరిట మనందరినీ విడగొట్టేవారు చాలా మందే ఉన్నారు. దేవుని జ్ఞానాన్ని నేర్పిస్తున్నప్పుడు కూడా కులాల పేరిట నేర్పించేవారు ఉన్నారు. ఆ విధానం నుంచి వారు బయటకు రావాలి. దేవుడు అనుగ్రహించిన ఈ జ్ఞానాన్ని వారు పూర్తిగా అర్థం చేసుకోవాలి. ఇప్పటికైనా అందరూ కళ్ళు తెరవాలి. మన జీవిత కాలమంతా, దేవుడు వ్రాయించిన ఈ మాటలను మనము తప్పక జ్ఞాపకములో ఉంచుకోవాలి. మన బ్రతుకు కాలములో ఎప్పటికీ వీటిని మరువకూడదు. అవసరమయితే మన ప్రభుత్వానికి దేవుని జ్ఞానాన్ని నేర్పించాలి, దేవుని బుద్ధిని చెప్పాలి. అవసరమైతే అధికారులకు సైతం దేవుని జ్ఞానాన్ని నేర్పించాలి. అంత మహా జ్ఞానివి కావలసిన నీవు, దేవుని సంగతులు అర్థం కాక, కులాల పేరిట కొట్టుకుంటావా? వర్గాల పేరిట దిగజారి పోతావా? నిన్ను దేవుడు ఎలా చూడాలనుకున్నాడో తెలుసా? ఈ మాట చూడండి.

పేతురు 2 : 9 “అయితే మీరు చీకటిలోనుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి మిమ్మును పిలిచిన వాని గుణాతిశయములను ప్రచురించు నిమిత్తము ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజక సమూహము, పరిశుద్ధ జనమును, దేవుని సొత్తయిన ప్రజలునైయున్నారు”. మీరు ఎలాంటి వారో తెలుసా? ఒక ఏర్పరచబడిన వంశము. అదే అబ్రహాము వంశము, అదే అబ్రహాము జాతి. మీరు అక్కడ అబ్రహామునకు కుమారులవ్వాలి. మీరు యేసుక్రీస్తుని నమ్మినవారైతే, ఆ యేసుక్రీస్తుని ప్రకటించినవారైతే మీరు ఆయన గుణాతిశయములను ప్రచురము చేయు నిమిత్తము, ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజక సమూహము, పరిశుద్ధ జనమును, దేవుని సొత్తయిన ప్రజలునైయున్నారు. దేవుని భావము ఎప్పుడూ ఇదేనండి. ఏ అపొస్తులుడు వ్రాసినా, ఏ భక్తుడు వ్రాసినా, ఏ శిష్యుడు వ్రాసినా, దేవుని మనసును ఏకభావముతో ఎంత చక్కగా వ్రాస్తున్నారో చూడండి. అందరూ ఒక్కటే, అందరూ దేవుని కుమారులే. అందరూ అబ్రహాము సంతానమే, అందరూ పరలోకానికి వెళ్ళవలసినవారే. దేవుని జ్ఞానము అందరికీ అర్థం కావాలి. దేవుని వాక్యాన్ని మనమే నెరవేర్చాలి. ఎవరో ఏదో అనుకుంటున్నారు, పోనివ్వండి. ఎవడో ఏదో పాటిస్తున్నాడు, పోనివ్వండి. కాని మనమయినా దేవుని వాక్యము కోసం నిలబడాలి. మనమయినా దేవుని కొరకు రంకె వేసి చెప్పాలి. దేవుని వాక్యాన్ని ఈ లోకానికి అర్థమయ్యేలా చాటాలి. అదే మన తరములో మన తండ్రికి మనము చేసే న్యాయం. అదే మన తండ్రియెడల మనము నిర్వర్తించే బాధ్యత. మంచి నిర్ణయం తీసుకోండి!

ప్రభువునందు నమ్మకస్థుడు,

**జె. మణి కుమార్**

సన్ ఆఫ్ గాడ్ - క్రైస్ట్ చర్చ్ - సామర్లకోట - 8978414178.

## ప్రశ్నలు

1. దేవుడు పక్షపాతి కాడని పేతురు ఎలా చెప్పగలిగాడు?
2. మనము అబ్రహాము సంతానముగా ఎలా మారగలము?
3. ఆదాము కులమేమిటి? నేటి మనిషికి ఉండవలసిన కులమేమిటి?
4. మనుష్యులలో కులము ఎలా పుట్టిందో సవివరముగా తెలియజేయండి.
5. దేవుడు మనుష్యులను 'మానవజాతి'గా పిలుచుటలో అంతరార్థము ఏమిటి?
6. యేసుక్రీస్తు యూదుడైయుండి, సమరయ స్త్రీకి ఎందుకు వాక్యమును ప్రకటించెను?
7. యేసుక్రీస్తు శిరస్సుగా కలిగిన సంఘము కులానికి ఎలా అతీతమవుతుందో వివరించండి.

# 11. నిజమైన ఉపవాసం

ప్రియమైన దేవుని జనులారా,

ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా అనేక మంది క్రైస్తవులు తెలిసీ తెలియక, 'ఉపవాస కూడికలు' అనే పేరుతో ఎన్నో కార్యక్రమాలు జరుపుకుంటున్నారు. ఈ సందర్భములో మనము ఉపవాసానికి దేవుడు ఇచ్చేటువంటి ఒక మంచి అర్థాన్ని, వివరణను బైబిల్‌ను బట్టి ఆలోచన చేద్దాము. ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది చేస్తున్నటువంటి ఈ ఉపవాసాలు వాక్య సంబంధమైనవేనా? నిజమైన ఉపవాసాలేనా? ఒకవేళ అయితే మనము ఆ ఉపవాసమును ఎప్పుడు చేయాలి, ఎందుకు చేయాలి? అనే విషయాన్ని లేఖనాలలో నుండి ఆలోచన చేద్దాం. ఏ ఉపవాసము చేస్తే పరలోకమందున్న తండ్రి సంతోషిస్తాడు? అసలు ఉపవాసమును మనము చేయాలని ఆయన కోరుకుంటున్నాడో, లేదో ఆలోచన చేయాలి. అసలు మొట్టమొదట మనకు ఉపవాసము అంటే ఏమిటో తెలియాలి. ఉపవాసమనేది కేవలం ఆహారము, ఆకలి... దీనికి మాత్రమే సంబంధించినది కాదు. మొట్టమొదట ఈ విషయాన్ని మీరు బాగా అర్థం చేసుకోవాలి. ఉపవాసమంటే కేవలం భోజన సంబంధమైనది కాదు. భోజన సంబంధమైన దానితో పాటుగా, ఇంకా చాలా ఉన్నాయి. ఉపవాసమనేది ఒక సర్వసామాన్యమైన పదము. అది అన్నింటికి వర్తిస్తుంది. మీరు అనుభవించవలసిన వాటిని, లేక మీ ఆకలిని తీర్చుకొనవలసిన వాటిని, మీ అవసరతలు తీర్చుకొనవలసినవాటిని కొన్ని సందర్భాలలో మీకు మీరుగా నిషేధించుకున్నప్పుడు, మనస్ఫూర్తిగా మీరు వాటిని వద్దనుకునప్పుడు, స్వచ్ఛందముగా మీరు వాటిని పరిత్యజించినప్పుడు అది 'ఉపవాసము' అవుతుంది.

ఉదాహరణకు, ఆహార పదార్థాల విషయానికొచ్చేసరికి మనకు తరచుగా ఆకలివేస్తుంది. ఉదయం తింటే మధ్యాహ్నానానికి, మధ్యాహ్నం తింటే రాత్రికి, రాత్రికి తింటే మరలా ఉదయానికి,... ఇది ఒక చక్రము లాంటిది. దీనిని నిరంతర చర్య (కంటిన్యూస్ ప్రోసెస్) అంటారు. ఒకసారి మాత్రమే కడుపు నింపుకుంటే తీరేది కాదు మనిషి ఆకలి. నిత్యమూ మనకు కలిగేది, మన శరీరంలో పుట్టేది. ఆహారాన్ని మనము మానుకున్నప్పుడు, ఆకలి వేసినా మన శరీరాన్ని మనము అదుపు చేసుకున్నప్పుడు అది ఉపవాసము అవుతుంది. మన శరీరములో మన కడుపు ఆహారాన్ని కోరుకుంటున్నప్పుడు, ఆకలి వేస్తున్నప్పుడు మనము ఆహారమును ఇవ్వగలుగుతున్నాము. అలాగే శరీరములో చర్మము బట్టలు కోరుకుంటుంది. చలినుండి కాపాడబడటానికి, ఎండ వేడిమినుండి తట్టుకోవడానికి, ఆయా కాలాలకు సంబంధించి కొన్ని రకాల వస్త్రాలను ఈ శరీరము కోరుకుంటుంది. ముఖ్యంగా, చలికాలము వచ్చేసరికి ఉన్ని దుస్తులే కావాలి. అప్పుడు మామూలు వస్త్రాలను, సిల్క్ వస్త్రాలను మనము ధరిస్తే మన శరీరం సుఖవంతముగా ఉండలేదు. కనుక మంచి ఉన్ని వస్త్రాలనే ధరించాలని, జర్కిన్ లాంటివి వాడమని, మన శరీరము కోరుకుంటుంది. దానికి తగినట్టుగా మనము వాటిని ధరిస్తాము. అలాగే, ఎండాకాలము వచ్చేసరికి, బాగా ఉష్ణోగ్రత పెరిగే సరికి ఈ ఉన్ని దుస్తులు పనికిరావు. అవి వేసుకుంటే లోపల ఉడికి పోతాము. గనుక అలాంటప్పుడు పలుచని వస్త్రాలను ధరించాలి. వర్షములో వెళ్లేటప్పుడు రెయిన్‌కోట్ వేసుకోవాలి. ఇదే శరీరానికి సంబంధించిన రక్షణ. ఇలా శరీరంలో ప్రతీ అవయవానికి, ప్రతీ భాగానికి ఒక్కొక్క అవసరత మనకు కనిపిస్తుంది. వీటిని ఇవ్వకుండా శరీరాన్ని మనము పస్తు ఉంచినప్పుడు అది ఉపవాసము అవుతుంది. అంటే వేసుకునే బట్టల విషయంలో కూడా మీరు ఉపవాసము ఉండవచ్చు అని మీరు అర్థం చేసుకోవాలి. ఒక్కొక్క సారి ధనము లేకో, మన పేదరికాన్ని బట్టో చిరిగిపోయిన వస్త్రాలను మనము వేసుకోవలసి వస్తుంది. మనము క్రొత్త వస్త్రాలను కొనడానికి ఉపయోగించవలసిన సొమ్మును మరియొక పనికి వినియోగించడం వలన, క్రొత్త వస్త్రాలు కొనుక్కోలేక పాత వస్త్రాలను వేసుకుంటూ, ఈ 'షో' మనము లోకానికి చూపించకుండా ఒక పేదవాడిగా, సామాన్యుడిగా బ్రతికేటువంటి కాలము కూడా మనకు ఎదురవుతుంది. అలాంటప్పుడు వస్త్రముల విషయంలో మీరు ఉపవాసము ఉన్నారని అర్థం. అలాగే మీ పాదము చెప్పులను కోరుకుంటుంది. ఈ చెప్పులు అరిగి పోయినప్పుడు, రంధ్రాలు పడినప్పుడు, లేక తెగిపోయినప్పుడు క్రొత్త చెప్పులను కొనుక్కోవాలి. క్రొత్త చెప్పులను కొనుక్కునేటప్పుడు ఆ పైకము మొత్తాన్ని, మీరు ఏదైనా మరొక పనిలో వాడి, మీ పాదములకు ఉపవాసం చెబితే, దానిని కూడా ఉపవాసమనే అంటారు.

కేవలం భోజనము చెయ్యకపోవడం మాత్రమే ఉపవాసము కాదు. ముఖ్యంగా నామకార్థ క్రైస్తవులకు ఈ విషయము అర్థం కాలేదు. నిజముగా కొన్ని కొన్ని క్రైస్తవేతర విశ్వాసాలను మనము చూసినప్పుడు, వారు కలిగి ఉండే నిష్ఠ చాలా గొప్పదిగా ఉంటుంది. వారు ఉపవాసము చేస్తే చాలా గొప్పగా చేస్తారు. ఒకే రంగు దుస్తులు వేసుకుంటారు. దీక్షలో ఉన్నప్పుడు రంగు రంగుల బట్టలను వేసుకోరు. అంటే, బట్టల విషయంలో వారు ఉపవాసం చేస్తున్నారు. తెల్లవారుఝామున లేచి, చల్లని నీటితో స్నానము చేయాలని కోరుకుంటూ తమ శరీరాన్ని కష్టపెడుతున్నారు. అంటే స్నానము విషయంలో వారు ఉపవాసము చేస్తున్నారు. కాలికి చెప్పులు వేసుకోరు. బండిమీద వెళ్ళినా, నడిచి వెళ్ళినా, ఎండలో వెళ్ళినా, ముళ్ళలో నడిచినా కాలికి మాత్రం చెప్పులు వేసుకోరు. ఎందుకంటే వారు ఒక నిష్ఠను కలిగియున్నారు. నడిచే విషయంలో, పాదాలకు చెప్పుల విషయంలో వారు ఉపవాసము చేస్తున్నారు. ఉపవాసము ఏ పద్ధతిలో చేయాలో క్రైస్తవేతరులైన వారికి అర్థమయింది. కాని క్రైస్తవులకే ఇంకా అర్థం కాలేదు. క్రైస్తవులు ఏమనుకుంటున్నారంటే, కేవలం భోజనం మాని, ఒక బోర్డు పెట్టి, నాలుగు రోజులు చర్చిలో కూర్చుంటే, అది ఉపవాసము అనుకుంటారు. అసలు ఉపవాసానికి ప్రాథమిక అర్థము తెలుసుకొనుటలోనే వీరు పక్కాగా బోల్తా కొట్టారు. తప్పటడుగులు వేస్తున్నారు. ఉపవాసమంటే కేవలం భోజనము విషయంలో చేసేది మాత్రమే కాదు. శరీర సంబంధముగా మీరు ఏ అవసరతను వద్దనుకున్నా, మీరు దానిని నిషేదించుకున్నా అది ఉపవాసమే అవుతుంది. మొత్తానికి మీ శరీరము అవస్థపడాలి, కష్టపడాలి. ఉపవాసము చేస్తే మీ శరీరము బక్కచిక్కి పోవాలి. ఇది నేను చెప్పే మాటకాదు. దేవుడు చెప్పిన మాటగా ఒక్కసారి ఆయన గ్రంథములో చూద్దాం.

**కీర్తనలు 109 : 24** "ఉపవాసము చేత నా మోకాళ్ళు బలహీనమాయెను. నా శరీరం పుష్టి తగ్గి చిక్కిపోయెను". భక్తుడు చేసే ఉపవాసాన్ని గూర్చి ఆయన వ్రాయుచున్నాడు. ఆహారము విషయంలో, వస్త్రముల విషయంలో పాదముల విషయంలో, ఇలా అన్నింటిలో అతడు తగ్గించుకుంటున్నాడు. దేవునికి ఉపవాసము చేస్తున్నాడు. అప్పుడు ఆయన శరీరము ఎలా అయిపోయిందో చూడండి. ఉపవాసము చేత నా మోకాళ్ళు బలహీనమాయెను. అంటే జాయింట్లు వదలడానికి సిద్ధంగా ఉన్నాయన్న మాట. మోకాళ్ళనొప్పి ఎందుకంటే లోపల శక్తి లేదు. తాను చేస్తున్న ఉపవాసము వలన కలిగిన ఆ దెబ్బ, లేక ఆ రోగం, ఆ బలహీనత, శరీరము లోపల మాత్రమే ఉంటుంది. పైకి కనిపించేది కాదు. ఉపవాసము వల్ల ఇలా జరిగితే అదే అసలైన ఉపవాసము. మోకాళ్ళయొక్క బలము క్షీణించుకుపోయి, బలహీనమై పోయింది. శరీరము యొక్క పుష్టి తగ్గి, చిక్కిపోయెను అంటున్నాడు. అప్పటి వరకూ అతనికి ఉన్న ఆ సుందరమైన రూపము మారిపోతుందని అర్థం. సరిగ్గా ఉపవాసము చేస్తే ముఖరూపము మారిపోతుంది. ఉవాసానికి ఉన్నటువంటి ప్రాథమికమైన అర్థము ఇదే!

ఇక, ఈ ఉపవాసం ఎందుకు చేయాలి? ఇది ఎందుకు ప్రవేశ పెట్టబడింది. అందరూ ఉపవాసము చేయాలని దేవుడు కోరుకుంటున్నాడా? అసలు ఏ సందర్భములో ఉపవాసము చేయాలి? ప్రారంభంలో దేవుడు ఆదాము కొరకు ఈ ప్రకృతినంతా ఇచ్చినప్పుడు, ఆదాము హవ్వలతో అన్నింటిని నిరభ్యంతరముగా తినమన్నాడు. మూడు పూట్లా భోజనము చేయమన్నాడు. ఉపవాసము చేయవలసిన అవసరం ఆదాము హవ్వలకు లేదు. ఇద్దరిలో ఎవ్వరికీ దేవుడు ఉపవాసం చేయమని చెప్పలేదు. ప్రారంభకాలము నుంచీ మీరు ఆలోచిస్తే, ఎవ్వరికీ దేవుడు ఉపవాసము చేయమని చెప్పలేదు. ఎందుకంటే మనిషి బక్కచిక్కిపోవడం వల్ల, మనిషి రూపము మారిపోవడం వల్ల పరలోకమందున్న దేవునికి ఏమి ఒరుగుతుంది చెప్పండి? ఆయనకు కలిగే లాభమేమీ లేదు. కనుక మనిషి చేసే ఉపవాసము వలన దేవునికి సంతోషం లేదు. దీనివలన ఆయన కార్యక్రమములు జరుగవు. మరి ఆయా కాలాలలో, ఆయా సందర్భాలలో భక్తులైనవారిలో కొంతమంది ఉపవాసము చేసినట్టుగా మనకు కొన్ని దాఖలాలు ఉన్నాయి. అసలు క్రైస్తవులలోనికి ఈ ఉపవాసము ఎందుకొచ్చింది? అని మనము ఆలోచించగలిగితే, ఈ ఉపవాసము మొదట ఇశ్రాయేలీయులలో పుట్టింది. ఇశ్రాయేలీయులు చాలా సందర్భాలలో దేవునికి అవిధేయులుగా బ్రతికారు. అవిధేయతకు మారు పేరుగా ఇశ్రాయేలీయులు మారిపోయారు. వారు భక్తిగా ఉన్నటువంటి సందర్భాలకంటే భక్తిహీనులైనటువంటి సందర్భాలే ఎక్కువ. అలాంటి సందర్భాలలో వారు దేవుణ్ణి తిరిగి బ్రతిమిలాడుకోవాలి. ఎలా బ్రతిమిలాడాలి? దేవుని దగ్గరకు

కొన్ని బలులను తీసుకుని వెళ్ళాలి. కొన్ని అర్పణలను తీసుకుని వెళ్లాలి. తండ్రీ, నేను నిజంగా మారిపోయాను. ఇదిగో నాకు బదులుగా ఒక దూడను గాని, ఒక పక్షిని గాని నేను బలిగా ఇస్తున్నాను. ఆ రక్త అర్పణను చూసి నీవు నాయందు జాలిపడాలి, కనికరపడాలి. మరలా నీవు నాతో ఆ మునుపటి మంచి సంబంధాన్ని కొనసాగించాలి. నేను చేసిన పాపము వలన, ఒకప్పుడు నీ సన్నిధిలో నీతో నేను ఉండేదువంటి ఆ సంబంధము తెగిపోయింది. ఎందుకంటే ఆదాము దగ్గర నుండి ఇశ్రాయేలీయుల వరకు, ఇశ్రాయేలీయుల దగ్గర నుండి క్రైస్తవుల వరకు దేవునిది ఒకే ఒక నినాదం. అదేమిటంటే, మీరు నీతిమంతులైనప్పుడు మీరు దేవునితో కలిసి ఉంటారు. మీరు ఆజ్ఞను అతిక్రమించినప్పుడు ఆయన మీకు దూరమైపోతాడు. ఈ దేవుని నిర్ణయం ఏ కాలములోనూ మారలేదు. నిబంధనలు మారినా ఆయన సబ్జక్ట్ మారదు. ఆయన మూలాంశం మారదు. అదేమిటంటే ఆయన కుమారులెవ్వరూ పాపము జోలికి వెళ్ళకూడదు. దేవుని ఆజ్ఞలను అతిక్రమించకూడదు. దేవుణ్ణి దుఖపెట్టకూడదు. అందుకే ఆయన మరొకచోట వ్రాయిస్తూ, ఆత్మను ఆర్పకుడి అన్నాడు. ఒక్కసారి పరిశుద్ధాత్మ దేవుణ్ణి ఆర్పితే అది చాలా భయంకరమైన పాపము. కనుక దేవునితో మనము కలిగియున్న ఆ మంచి సంబంధాన్ని కొనసాగించడానికి మన శరీరాన్ని కష్టపెట్టాలి. దేవుని పనిలో మనము ఎల్లప్పుడూ ఉండాలి. ఆ పని ద్వారా మనము దేవునిని ఎల్లప్పుడూ ఆనందపరచాలి. దేవుని కార్యక్రమాలను జరిగించి, ఆయన సంతోషపడే విధంగా మనము ఉండాలి. ఇశ్రాయేలీయులు చాలా సందర్భాలలో త్రొట్టిల్లిపోయారు. అంటే, దేవుడు వారికి దూరంగా ఉన్నాడు. అలాంటప్పుడు దేవుణ్ణి మరలా తమవైపు త్రిప్పుకోవడమెలా? దేవుణ్ణి తిరిగి సంతోషపెట్టడమెలా? అలాంటి సందర్భాలలోనే, ఇశ్రాయేలీయులు దేవునికి ఉపవాసము చేసారు. వెనువెంటనే దేవుణ్ణి సంతోషపెట్టే ఒక మంచి కార్యక్రమముగా ఉపవాసము ప్రవేశపెట్టబడింది. మనుష్యులు ఉపవాసము చేస్తున్నప్పుడు తన పిల్లలు మారిపోయారని వారిని తిరిగి దేవుడు నమ్ముతాడు. ఎందుకంటే, దేవుని కొరకు వారి శరీరాన్ని వారు కష్టపెట్టుకుంటున్నారు. ఒక దూడను బలి అర్పించడమో, ఒక పక్షిని బలి అర్పించడమో లేక నా సన్నిధికి కొన్ని రూకలు, కొన్ని రొట్టెలు తెచ్చి ఇవ్వడము మాత్రమే కాదు. నిజంగా వారి శరీరాన్ని వారు అదుపులో పెట్టుకున్నారు. ఏ శరీరముతో అయితే వారు పాపము చేశారో, ఏ శరీరానికైతే అడ్డుకట్టలు వేయలేక, కళ్లెము వేయలేక ఆ శరీరంతో వారు పాపమును చేశారో ఆ శరీరాన్ని తిరిగి వారు అదుపు చేశారు. అంటే పాపమును మానివేశారు. ఆ తరువాత ఆ శరీరానికి ఆహారమివ్వకుండా, ఆ శరీరానికి తగిన వసతులు ఇవ్వకుండా, దానిని కష్టపెడుతున్నారు. నలుగగొడుతున్నారు. అంటే ఇప్పుడు వీరు భక్తి గలిగి ఉన్నారు అని, దేవుడు దానిని బట్టి నమ్మాలి. అప్పుడు దేవుడు మరలా వారి వైపు తిరగాలి. ఇప్పుడు ఇశ్రాయేలీయులలో ఒక మంచి సందర్భాన్ని చూద్దాం.

ఇశ్రాయేలీయులు యుద్ధానికి వెళుతున్నారు. ఈ యుద్ధం శత్రు దేశాలతో కాదు, లేక పరాయి వారితో కాదు. ఇశ్రాయేలీయులలో ఉన్న ఒకానొక గోత్రముతో అనగా, ఇశ్రాయేలీయులకు వారి సొంత వారితోనే కొన్ని పర్యాయములు యుద్ధాలు జరిగాయి. ఇక్కడ జరిగినటువంటి యుద్ధం బెన్యామీనీయుల వలన జరిగింది. బెన్యామీనీయులు ఇశ్రాయేలీయులతో యుద్ధం చేశారు. దీనికి సంబంధించి ఒక చరిత్ర ఉంది. వీరిద్దరి మధ్య గొడవ ఎందుకు వచ్చిందంటే, ఒక వ్యక్తి తన భార్య మరియు పరివారముతో పాటు గిబియా అను ఒక ప్రదేశానికి వెళ్లి అక్కడ ఒక ముసలివాని ఇంట రాత్రివేళ బస చేయుచున్నప్పుడు, బెన్యామీనీయులలో కొందరు పోకిరివారు చేసినటువంటి అల్లరిని బట్టి ఆ స్త్రీ చనిపోతుంది. అప్పుడు ఆ స్త్రీ శవమును ముక్కలు ముక్కలుగా పన్నెండు భాగములుగా చేసి, ఇశ్రాయేలీయుల వంశస్థులందరికి అంటే గోత్రీయులందరికీ ఆమె భర్త పంపిస్తాడు. అప్పుడు ఇశ్రాయేలీయులందరూ బెన్యామీనీయులలో ఉన్న అల్లరిని, చెడుతనమును తెలుసుకుంటారు. అప్పుడే, ఇశ్రాయేలీయులందరూ బెన్యామీనీయులతో యుద్ధం చేయాలి అనుకొని, వారిపై యుద్ధం ప్రకటిస్తారు. ఈ సందర్భములో మొదటి రెండు పర్యాయములు బెన్యామీనీయుల చేతిలో ఇశ్రాయేలీయులు ఓడిపోతారు. అసలు బెన్యామీనీయుల గోత్రం ఎంత? అది ఒకే ఒక్క చిన్న గోత్రం. ఇశ్రాయేలీయులతో అనగా మిగిలిన పదకొండు గోత్రాలతో పోలిస్తే ఈ బెన్యామీనీయులు చాలా తక్కువవారు. వారిని ఇశ్రాయేలీయులు ఒక్కదెబ్బతో ఓటమి పాలుచేయాలి. కాని ఇశ్రాయేలీయులు ఇంకా దేవునితో సరియైన సంబంధమును కలిగిలేరు. ఇశ్రాయేలీయులలో కూడా చాలా తప్పులు,

చాలా పొరపాట్లు ఉన్నాయి. దానిని బట్టి ఇశ్రాయేలీయులను దేవుడు అడ్డగించాడు. బెన్యామీనీయులు రెండు పర్యాయములు ఇశ్రాయేలీయుల మీద గెలిచారు. బెన్యామీనీయులు తప్పుచేసినా, ఆ గోత్రములో ఆ స్త్రీ మరణానికి కారకులు వారిలోనే ఉన్నా, బెన్యామీనీయులు ఆ యుద్ధంలో గెలిచారు. విజయం వారిదే అయింది. ఇక మూడవ సారి ఇశ్రాయేలీయులు తమ తప్పును తెలుసుకున్నారు. ముందు మేము దేవునిని సంతోషపెట్టాలి. ఆ తరువాతే చిన్నవాడైనా, పెద్దవాడైనా వాడి మీద మేము యుద్ధములోనికి వెళ్లాలి అనుకున్నారు. అంటే, ఇంతకుమునుపు తమ సొంత బలము చేత బెన్యామీనీయుల మీదకు యుద్ధానికి వెళ్లిపోయారు. తమకున్న బాహుబలము చేతనే ఇశ్రాయేలీయులు బెన్యామీనీయుల మీద గెలవొచ్చేమో అనుకున్నారు. కానీ మొట్టమొదట తమ దేవుణ్ణి సంతోషపెట్టాలి, దేవుణ్ణి సమాధానపరచాలన్న విషయం వారికర్థం కాలేదు. అందువల్ల ఆ చిన్నవారైన బెన్యామీనీయుల చేతిలో ఇశ్రాయేలీయులు ఓడిపోయరు. ఇప్పుడు చదవండి.

**న్యాయాధిపతులు 20 : 26–** "వీరందరూ కత్తిదూయువారు. అప్పుడు ఇశ్రాయేలీయులందరును జనులందరునూ పోయి బేతేలులో ప్రవేశించి ఏడ్చుచు సాయంకాలము వరకూ అక్కడ యెహోవా సన్నిధిని కూర్చుండుచూ ఉపవాసముండి దహన బలులను, సమాధాన బలులను యెహోవా సన్నిధిని అర్పించిరి". ఇప్పుడు ఇశ్రాయేలీయులకు జ్ఞానము తెలిసింది. మేము యుద్ధం చేయడానికి ఎవరి మీదకు వెళ్ళినా, ముందు మా తరపున దేవుడుండాలి. అందుకేనండి, ఇశ్రాయేలీయులకు దేవుడు ఒక మంచి పాఠమును నేర్పించాడు. ఇది మనకు కూడా పాఠమే, సర్వ ప్రపంచానికీ పాఠమే. వీటినన్నిటినీ చరిత్రలో దేవుడు ఎందుకు వ్రాయించాడు? వీటినన్నిటినీ దృష్టాంతాలుగా ఎందుకు ఉంచాడు? ఏదో కాలక్షేపానికి ఒక కథ చదువుకొని తరువాత మరచిపోతారని కాదు. చరిత్రలో మనకంటె ముందు జీవించిన ఇశ్రాయేలీయులు, ప్రతీ సందర్భంలో మనకు గుణపాఠాలు నేర్పుతూ ఉంటారు. మీరు ఎంత గొప్పవారైనా, ఎంత పెద్దవారైన మీ వెనుక దేవుడుండాలి అనేది ఇక్కడ సారాంశము. మీరు అన్ని కాలములలో ఎల్లప్పుడూ దేవుణ్ణి సంతోషపెడుతూ ఉండాలి. దేవునితో సంబంధము లేకపోతే మీరు ఎన్ని కార్యక్రమాలు చేసినా దేవుడు మీకు విరోధి అయిపోతాడు. మీ శత్రువులు దేవునికి నచ్చని వారైనా, ఆ నచ్చని వారిచేతనే మిమ్మును ఓడించేస్తాడు. ఎందుకంటే మీకు, దేవునికి లేని సంబంధాన్ని బట్టి మీరు ఓడిపోక తప్పదు. ఇప్పుడు చెప్పండి. దేవునితో మన సంబంధము ఎంత గొప్పగా ఉండాలో, ఎంత దగ్గరగా ఉండాలో, అనునిత్యము దేవునితో మంచి సంబంధాన్ని ఎలా కలిగి ఉండాలో మీరు ఆలోచించండి. మనకు అవతలివాడు దేవునికి నచ్చని వాడు కదా! వాడు దేవునికి విరోధి కదా! వాడు దేవుని కార్యక్రమాలను పాడుచేసేవాడు కదా! కనుక వాడి మీద నేను విజయము సాధించేయవచ్చు. అని మీరనుకొని, పొరపాటు పడడానికి అవకాశమే లేదు. ముందు మీరు దేవునితో ఉన్నారా? అనేది దేవునికి చాలా ముఖ్యం. అది పైపైన భక్తికాదు. ఇశ్రాయేలీయులు తమ భక్తిని పైపైననే చూపించారు. మమ్మును బెన్యామీనీయులతో యుద్ధం చేయమంటావా? అని దేవునిని అడిగారు. దేవుడు బెన్యామీనీయులతో యుద్ధం చేయండి అని చెప్పాడు. కాని ఓడిపోయి వచ్చేసారు. మరలా రెండవసారి వెళ్ళి బెన్యామీనీయులతో యుద్ధం చేయమంటావా తండ్రీ అని అడిగినప్పుడు మళ్ళీ వెళ్ళమన్నాడు, యుద్ధం చేయండి అని చెప్పాడు. మరలా వెళ్ళి యుద్ధంలో ఓడిపోయి వచ్చేసారు. ఇశ్రాయేలీయులలో చాలామంది కత్తిచేత నశింపబడుచున్నారు. బెన్యామీనీయులు తక్కువ మంది, ఇశ్రాయేలీయులు లక్షలమంది. తక్కువ మందిగా ఉన్న బెన్యామీనీయులు లక్షల సంఖ్యలో ఉన్న ఇశ్రాయేలీయులను చంపేస్తున్నారు. అప్పుడు ఇశ్రాయేలీయులు దేవునియొద్దకు వచ్చి ఏడ్చేస్తున్నారు. యెహోవా సన్నిధిలో వారు ప్రవేశించి, కూర్చుండి, ఉపవాసముండి, దహన బలులును, సమాధాన బలులను యెహోవా సన్నిధిని అర్పించిరి అని వ్రాయబడినది. అంటే ఇశ్రాయేలీయులు ఎందుకు ఉమవాసము చేస్తున్నారో మీరు ఆలోచించండి. బెన్యామీనీయులపై ఓడిపోయిన తరువాత, దేవునితో సరైన సమాధానాన్ని కలిగి లేమేమో అని వీరికి సందేహము వచ్చింది. అప్పుడు ఇశ్రాయేలీయులు యెహోవా సన్నిధిలో కూర్చుని ఏడుస్తూ దినమంతా వారి కాలాన్ని దేవునియొద్దనే గడుపుతూ, దేవునికి మా ప్రవర్తన ఎలా ఉండాలి? మా శరీరాన్ని మేము ఇప్పుడు దుఖపరచుకోవాలి, మా శరీరాన్ని బక్కచిక్కేలా చేసుకోవాలి, మేము ఉపవాసముండి ముందు మా తండ్రిని మా పక్షముగా మార్చుకోవాలి

అనుకున్నారు. ఆ తరువాతనే బెన్యామీనీయుల మీదకి యుద్ధానికి వెళ్ళాలని గ్రహించి, అప్పుడు వారు బెన్యామీనీయులపై యుద్ధానికి వెళతారు. దేవుడు ఇచ్చినటువంటి చక్కని ప్రణాళికతో మాటు వేసి బెన్యామీనీయులందరిని ఇశ్రాయేలీయులు ఓడించేస్తారు. యుద్ధానికి వచ్చిన వారిలో ప్రతి ఒక్కరినీ సంహరిస్తారు.

ప్రియులారా, ఉపవాసము ఎందుకు చేయాలంటే, దేవునితో తెగిపోయిన సంబంధాన్ని మెరుగుపరుచుకోవాలి. దాని కొరకే మీరు ఉపవాసము చేయాలి. దేవునితో మీ సంబంధాన్ని తిరిగి సరిచేసుకోవడానికి చేయాలి. మన తండ్రితో మనము సంబంధమును కోల్పోయినప్పుడు, ఆ తండ్రికి దగ్గరవడానికి ఉపవాసము చేయాలనేది మనము బాగా అర్థం చేసుకోవాలి. దేవుని పని నిమిత్తము, దేవునియొక్క కార్యక్రమాలను జరిగించే నిమిత్తము మీరు అడుగు ముందుకు వేయబోవుచున్నప్పుడు మీరు నిజంగా దేవునితో ఉన్నారో లేదో పరీక్షించుకోవాలి. లేని పక్షంలో వెంటనే ఉపవాసముండి మీరు ఏడ్చుచూ మీ అర్పణను ఇచ్చి దేవునితో మీరు మంచి సంబంధమును కలిగియుండాలి. అప్పుడే మీరు ముందుకు అడుగువేయాలి. లేకపోతే అది ఫలించదు, అది నిష్ఫలమవుతుంది. దేవుడు మీరు చేసే పనిని అంగీకరించడు. ఇదండీ ఉపవాసములో ఉన్నటువంటి చరిత్ర. దావీదు విషయానికొస్తే దావీదు కూడా చాలా పర్యాయములు ఆయన వ్రాసిన కీర్తనల గ్రంథములో అతడు ఉపవాసమున్నటువంటి సందర్భాలు మనకు కనిపిస్తుంటాయి. ఎందుకంటే ఆయన కూడా దేవునితో సంబంధాన్ని కోల్పోయాడు. బత్షెబ విషయంలో పాపము చేసిన దావీదు, ఊరియాను చంపించినటువంటి దావీదు, దేవునికి దూరమైపోయాడు. దేవుడు దావీదును చాలా ఎక్కువగా ప్రేమించేవాడు. కానీ దావీదు పాపము జరిగించిన క్షణాన దేవుడు దావీదును ద్వేషించాడు. నాతాను అను ప్రవక్తను పంపించి దావీదుకు బుద్ధికలిగే మాటలను చెప్పించాడు. దావీదు చాలా గొప్పవాడని మనము అనుకుంటాము. కానీ అది ఒక కోణం. దేవుడు దావీదు ముఖాన్ని చూసి బాధపడిన సందర్భాలున్నాయి. వాక్యములో అలాగే వ్రాయించుకున్నాడాయన. నేను వ్యాకుల పడ్డాను, నేను నొచ్చుకున్నాను అన్నాడు దేవుడు. ఎందుకంటే నా కుమారుడైన దావీదు ఇలాంటి వాడని నేనెప్పుడూ అనుకోలేదన్నాడు. దేవుడు ఆ సందర్భములో దావీదు చేయి వదిలేశాడు. అప్పుడు దావీదు ఏమి చేశాడో చూడండి.

**2 సమూయేలు 12 : 16–** "యెహోవా ఊరియా భార్య దావీదునకు కనిన బిడ్డను మొత్తినందున అది బహు జబ్బుపడెను. దావీదు ఉపవాసముండి లోపలికి పోయి రాత్రంతయు నేలపడియుండి బిడ్డకొరకు దేవుని బ్రతిమిలాడగా..." పైన జరిగిన సందర్భమే దావీదు చేసినటువంటి పాపము. దానికి దేవుడిచ్చినటువంటి సమాధానము కూడా ఈ సందర్భములో మనము చూస్తాం. దావీదుకు ఊరియా భార్య అయినటువంటి బత్షెబను బట్టి ఒక బిడ్డ కలిగింది. ఆ బిడ్డను దేవుడు మొత్తాడు. తరువాత దావీదు, తన బిడ్డను బ్రతికించమని దేవుని బ్రతిమిలాడుచున్నాడు. ఎందుకొచ్చింది ఈ సందర్భం? దావీదు ఉపవాసము చేయవలసిన అవసరత ఎందుకొచ్చింది? ఉపవాసము అంటే ఏమిటో మీరు బాగా అర్థం చేసుకోవాలి.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న నామకార్థ క్రైస్తవులందరూ ఉపవాసానికి ఒక కాలము వస్తుందని, సంవత్సరంలో ఒక కాలమును ఉపవాసానికి నిర్ణయించేసుకున్నారు. వీరు ఉపవాసానికి ఒక కాలమును, ఒక సమయమును ఏర్పాటు చేసుకున్నారు. క్రైస్తవుల పరిస్థితి ఎలా ఉందో చూడండి. సంవత్సరంలో దాదాపుగా ప్రతి నామకార్థ క్రైస్తవ సంఘానికి, ఉపవాస కూడికలు సెప్టెంబర్ / అక్టోబర్ మాసములో వస్తాయి. అసలు ఉపవాసం ఎందుకు చేయాలో అర్థమౌతుందా వీరికి? ఆ రోజు ఇశ్రాయేలీయులకు దేవునితో ఉన్న సంబంధము తెగిపోవడాన్ని బట్టి వారు రెండు పర్యాయములు బెన్యామీనీయులతో యుద్ధములో గెలవలేకపోయిన దానిని బట్టి, వారు ఉపవాసమున్నారు. నాకు మీరు ఉపవాసము ఎందుకు చేస్తున్నారు? అని ఈనాటి నామకార్థ క్రైస్తవులను దేవుడు నిజంగా అడిగాడనుకోండి. ఏమి సమాధానం చెబుతారు వీరంతా? ఏమి సమాధానం చెప్పగలరు ఈ నామకార్థులు? ఉపవాసమెందుకుంటున్నావు అని అడిగితే, దేవునికోసం ఉపవాసము ఉండొద్దా? అందుకే ఉంటున్నాము అంటారు. మాకు ఒకానొక కాలము వస్తుంది, ఆ కాలములో మేము ఉపవాసము ఉండాలి. తరువాత డిసెంబర్ 25 వచ్చిందంటే అది యేసుక్రీస్తు పుట్టినకాలము, ఆ తరువాత మరలా ఏప్రిల్ మాసము వచ్చిందంటే లెంట్‌డేస్, ఆ తరువాత సమాధుల పండుగ ఇలా

ఒక్కొక్కదానికి ఒక్కొక్క కాలాన్ని ఏర్పరచుకున్నారు. ఉపవాసానికి ఒక కాలం, క్రిస్టమస్‌కి ఒక కాలం, ఈస్టర్‌కి ఒక కాలం, సమాధుల పండుగకి ఒక కాలం. ఉపవాసం ఎందుకు ఉండాలో ఈ క్రైస్తవులకు ఖచ్చితముగా తెలియదు.

దావీదు పాపము చేయనంత వరకూ దావీదుకు ఉపవాసము చేసే అవసరత లేదు. దావీదు దేవునితో ఎంతో చక్కగా ఉండేవాడు. చాలా మంచి రాజ్యపరిపాలనలో ఉండి చక్కని కీర్తనలు వ్రాస్తున్నాడు. పరిశుద్ధాత్మ ప్రేరణతో ఎన్నో సంగతులు ఆ రాజ్యానికి నేర్పిస్తున్నాడు. దావీదు ఒక మంచి రాజు. దేవుని ఆత్మ కలిగిన మంచి చక్రవర్తి. అలాంటి రాజు ఉండడం ఆ ఇశ్రాయేలీయుల దేశానికే ఎంతో గర్వకారణం. రాజ్యములోని ఇశ్రాయేలీయులందరూ చాలా ఆనందపడ్డారు. ఇంత గొప్పరాజు ఇశ్రాయేలీయులకు ఉండడం చాలా క్షేమకరము. ఇలాంటి రాజు ఇక మరలా పుట్టడు. రాజు ప్రవక్తల దగ్గరకొచ్చే అవసరం ఇక లేదు. రాజే దేవునితో సంబంధమును కలిగియున్నాడంటే అది ఎంత గొప్ప పరిపాలన! అది ఎంత మంచి పరిపాలన. రాజు అక్రమాలు చేసే అవకాశం ఇక ఉండదు. అలాంటి సందర్భములోనే దావీదు తప్పటడుగు వేశాడు. అక్రమముగా బత్షెబను వివాహము చేసికొని, ఆమె భర్తయైన ఊరియాను చంపించి, తద్వారా దేవునికి దూరమైపోయాడు. దీనిని గమనించిన దేవుడు వెంటనే వారిద్దరికీ పుట్టిన ఆ బిడ్డను జబ్బు పడేలా చేశాడు. ఆ బిడ్డ మరణించడానికి సిద్ధంగా ఉన్నప్పుడు దావీదు ఏమి చేశాడో చూడండి. దావీదు ఉపవాసముండి, లోపలికి పోయి, రాత్రంతయు నేలపడి యుండి, తన బిడ్డకొరకు దేవుని బ్రతిమిలాడగా, ఇంటిలో ఎన్నికయైనవారు లేచి అతనిని లేవనెత్తుటకు వచ్చిరి గాని అతడు సమ్మతింపక వారితో కూడా భోజనము చేయక ఉండెను. దావీదు రాజు కాబట్టి, అతని చుట్టూ ఉన్న సైనికులు, బంధువర్గం, దావీదును తిరిగి మామూలు మనిషిగా మార్చడానికి ప్రయత్నించారు. కాని దావీదు ఒప్పుకోవడం లేదు. నా దేవుని మరలా నేను సంతోషపెట్టేంత వరకూ, నేను పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టను అంటున్నాడు. అప్పుడు దావీదుకు అర్థమైంది. అతడు ఎంత భయంకరమైన పాపము చేశాడో, అతడు ఎందుకు ఉపవాసం ఉండాలో, అతడు మరల దేవుణ్ణి తిరిగి తనవానిగా మార్చుకోవడానికి ఎలాంటి ప్రయత్నం చేయాలో దావీదుకు అప్పుడు అర్థమయ్యింది. కాలము వస్తేనో, ఆనవాయితీగా చేసేదో కాదు ఉపవాసము. ఫలానా సంవత్సరం, ఫలానా నెల, ఫలానా గడియ, ఫలానా ముహూర్తం వచ్చినప్పుడు ఉపవాసం చేయాలి అనడానికి ఇదేమీ ఆచారమో, ఆనవాయితీయో కాదు. మీరు పాపము చేసినప్పుడు, మీ దేవునితో మీ సంబంధము తెగిపోయినప్పుడు మీరు ఉపవాసముండాలి. బైబిల్ ఎవరికి అర్థమయిందండీ? అందరూ పైపైన చదివేవారే కదా! రెండు, మూడు వాక్యాలు పట్టుకొని నాకంతా తెలుసు అనుకునేవారే కదా అందరూ. ఎవ్వరికీ బైబిల్ తెలియలేదు. దేవుని మనసు ఎవ్వరికీ అర్థం కాలేదు. ఇలాంటి సందర్భములో దావీదున్నప్పుడు ఏమి జరిగిందో చూడండి. ఏడవ దినమున బిడ్డ చనిపోయింది. దావీదు దేవునికి చేసిన ఉపవాసము ఫలించిందా? ఫలించలేదు. అంటే నీవు ఉపవాసమున్నంత మాత్రాన నీ ఉపవాసము దేవునిచేత అంగీకరింపబడుతుంది అనుకోవడం కూడా పొరపాటు. నీవు ఎంత నిష్టగా ఉపవాసము చేసినా, దేవునితో నీ సంబంధాన్ని మెరుగుపరుచుకోవాలి అని నీవు ఎంత ప్రయత్నించినా, ఆ ప్రయత్నంలో నీవు దేవుణ్ణి అడిగిన కోరిక నీకు నెరవేరకపోవచ్చు కానీ నీవు నీ ప్రయత్నమును మానకూడదు. దేవునితో సంబంధాన్ని కొనసాగించడానికి మరలా తిరిగి దేవుని నీ పక్షాన మార్చుకోవడానికి నీవు ప్రయత్నం చేస్తూనే ఉండాలి. నీవు అడిగిన కోరిక తీరక పోవచ్చు. కానీ, నీ దేవుణ్ణి నీవు వదులుకోకూడదు. దావీదు ఉపవాసము ఉన్నా బిడ్డను దేవుడు బ్రతికించలేదంటే, దావీదు చేసిన ఉపవాసము ఇంకా దేవుని సంతోషపరచలేదు. అలాగని దావీదు చేసిన ఉపవాసము మామూలు ఉపవాసము కాదు. అదేమీ డూప్లికేట్ ఉపవాసము కాదు, అది ఒరిజినల్ ఉపవాసం. ఆ చుట్టూ ఉన్న పనివారు వచ్చి, రాజా ఒక్క ముద్ద తినండి, మంచి నీళ్ళు త్రాగి బలము పొందమని చెబుతున్నారు. లేదంటే, దావీదు అవయవాలు మొత్తంగా అతని ఆరోగ్యమంతా క్షీణించిపోతుంది. అయినా దావీదు ఒప్పుకోవడం లేదు. ఇంకా అలా ఏడుస్తూనే ఉన్నాడు. తన దేవుని బ్రతిమిలాడుకుంటూనే ఉన్నాడు. ఈ లోపు ఒక ప్రక్క తన బిడ్డ చనిపోయిందనే వార్త వచ్చింది. తన బిడ్డ ప్రాణముతో ఉండగా, దావీదు సేవకులు అతనితో మాట్లాడినప్పుడు అతడు వారి మాటలు వినకయుండెను. బిడ్డ చనిపోయిన తరువాత, ఇప్పుడు ఆ వార్తను దావీదుతో చెప్పినయెడల తనకు తాను హాని చేసుకొనునేమో అనుకొని బిడ్డ

చనిపోయెనను సంగతిని అతని సేవకులు దావీదునకు చెప్పలేదు. అక్కడ జరిగిన కార్యక్రమమంతటినీ దేవుడు ఎంత క్షుణ్ణంగా వ్రాయించాడో చూడండి. దావీదు సేవకులు బిడ్డ చనిపోయిన విషయం ఎందుకు చెప్పడం లేదంటే, దావీదు చేసే తన ఉపవాసం వల్ల బిడ్డ బ్రతుకుతుంది అనుకున్నారు. బిడ్డ చనిపోయిందని తెలిసే సరికి దావీదు ఏమవుతాడు? తనకు తాను హాని చేసుకుంటాడు, అంటే ఆత్మహత్య చేసుకుంటాడేమో అనుకుంటున్నారు. దావీదు సేవకులకు కూడా, అతడు ఉపవాసమెందుకు చేస్తున్నాడో తెలియదు. దేవునితో తన సంబంధాన్ని తిరిగి మెరుగుపరచుకోవడానికి దావీదు ఉపవాసము చేస్తున్నాడు. దేవుడు తిరిగి తన పక్షంగా వస్తేనే దావీదు నిద్రపోతాడు. నీ తప్పును క్షమించాను, నా కుమారునిగా తిరిగి స్వీకరిస్తున్నానని దేవుడు చెప్పేంతవరకూ దావీదు మనసులో విచారము పోదు. అతని మనసుకు శాంతి లేదు. అందుకే ఉపవాసం చేస్తున్నాడు. తనను తాను దుఖపరచుకుంటున్నాడు. దావీదు యొక్క ప్రధానమైన ఆలోచన తన బిడ్డను రక్షించుకోవడం కాదు. దేవునిని సమాధానపరచుకోవాలి. అతని సేవకులకు ఈ విషయం తెలియక, బిడ్డ చనిపోతే ఇతడు ఆత్మహత్య చేసుకుంటాడేమో అని భయపడి, వారు ఈ సంగతిని దావీదుకు చెప్పలేదు. అయితే దావీదు తన సేవకులు గుసగుసలాడుట చూసి బిడ్డ చనిపోయెనను సంగతిని గ్రహించి, బిడ్డ చనిపోయెనా? అని తన సేవకులను అడిగెను. దావీదుకు తన బిడ్డ చనిపోయెనని అర్థమయింది. ఎందుకంటే దావీదు అప్పటికే చాలా జ్ఞానము కలిగినవాడు. మనిషిని చూసి అతని మనసును చెప్పగలిగినవాడు. ముఖమునుబట్టి మనసులో ఉన్నదానిని చెప్పగలిగిన సమర్థత గలవాడు, పరిశుద్ధాత్మ ప్రేరణ కలిగినవాడు గనుక వెంటనే బిడ్డ చనిపోయిందా? అని జరిగిన దానినే అడుగుతున్నాడు. తన సేవకులు చనిపోయినదని చెప్పారు. అప్పుడు దావీదు నేల నుండి లేచి స్నానము చేసి, తైలము పూసుకొని, వస్త్రములు ధరించుకున్నాడు. యెహోవా మందిరములో ప్రవేశించి మ్రొక్కి, తిరిగి తన యింటికి వచ్చి భోజనము తెమ్మనగా వారు వడ్డించిరి. అప్పటితో తన ఉపవాసాన్ని దావీదు ముగించాడు. ఎందకంటే, తన బిడ్డ చనిపోయింది. ఇక ఉపవాసముండి తన బిడ్డను బ్రతికించలేదు. అలాగని తనకు తాను హాని చేసికొనకూడదు. తాను చేసిన ఈ ఉపవాసం ప్రధానంగా బిడ్డ కోసము కాదు. తన దేవుని సంతోషపరచడానికి ఉపవాసము చేసాడు. ఒకవేళ బిడ్డ బ్రతికితే బ్రతకవచ్చు. దావీదు దేవునికి చేసిన ఉపవాసమును చూచి, ఆయన కనికరించి ఒకవేళ బిడ్డను బ్రతికించవచ్చు. అయితే, బిడ్డ చనిపోతే మాత్రం ఇక దావీదు ఉపవాసము ఉండనక్కరలేదు. తిరిగి తన దేవుని సంతోషపెట్టే మార్గమేటో దావీదు వెదకాలి. ఇప్పటి వరకూ దావీదు తన ఉపవాసము ద్వారా దేవుని సంతోషపెడదామనుకున్నాడు. ఉపవాసము ద్వారా తన మార్గము లోనికి తిరిగి దేవుని తెచ్చుకుందామనుకున్నాడు. తన పక్షముగా దేవుని మార్చుకుందామనుకున్నాడు. కానీ దేవుడు తన మొరను వినలేదు. దావీదు చేసిన పాపమును బట్టి దేవుడు తన బిడ్డను చంపేసాడు. అయితే దేవుని సంతోషపెట్టడానికి దావీదు మరొక ఉపాయమును ఆలోచించాలి. దేవుని కొరకు దావీదు మరొక కార్యక్రమం చేయాలి. ఇక దావీదు తన ఉపవాసమును ఉపసంహరించుకోవాలి. తను వెళ్ళి భోజనము చేయాలి, తైలము అంటుకోవాలి, స్నానము చేయాలి. దావీదు మరల మామూలు మనిషిగా ఒక బలవంతునిగా, దేవుడు ఇంకా ఏమి చేస్తే సంతోషిస్తాడో ఆ కార్యక్రమాలను చేయాలి. దావీదు ఎలా పాఠాన్ని నేర్పిస్తున్నాడో చూడండి.

**ఎజ్రా 8 : 21** "అప్పుడు దేవుని సన్నిధిని మమ్మును మేము దుఖపరచుకొని మాకును, మా చిన్నవారికిని, మా ఆస్తికిని శుభప్రయాణము కలుగునట్లుగా ఆయనను వేడుకొనుటకు అహవా నది దగ్గర ఉపవాసముండుడని ప్రకటించితిని" అని అంటున్నాడు. ఈ ప్రవక్త, మీరు దేవుని పనిని చేయడానికి వెళ్ళబోయే ముందు మీరు దేవునితో సంబంధము కలిగి ఉన్నవారో కాదో చూసుకోండి, మీ దేవుని మీరు సంతోషపెట్టండి అని చెబుతున్నాడు. దేవుని పనికి ఉపక్రమించే ముందు మనము ఉపవాసము ఉండాలి. ఎందుకంటే మీ ఉపవాసము దేవునికి నచ్చాలి. దేవుడు మీ పక్షముగా ఉండాలి. అప్పుడే మీరు దేవుని పనిని చేయాలి. ఏదో మ్రొక్కుబడిగా దేవుని పనిని చేసేస్తాను అని అంటే కుదరదు. డబ్బుంటే దేవుని పనిని చేయడం, అధికారము ఉంటే దేవుని పని చేయడం, అన్నీ అనుకూలిస్తే దేవుని పని చేయడం వేరు. ఉపవాసముండి దేవుని మీ పక్షమున మార్చుకొని దేవుని పనిని పూర్తి చేయడం వేరు. దేవుడు మీ పక్షమున లేకపోతే మీరు ఓడిపోతారు. దేవుని పక్షాన లేకుండా మీరు ఆయన కార్యక్రమాలు చేస్తే

ఓడిపోతారు. మీ పాపమును చూసిన దేవుడు మీ పక్షంగా ఎలా ఉంటాడండీ? మనను మన ఇష్టాన్ని నెరవేర్చుకొనుటకు చేసేటటువంటి కార్యక్రమాలను చూచి, మన దైనందిన జీవన కార్యక్రమాలను చూచి, మన మాటలు, మన ఆలోచనలు, మన తలంపులు, దేవునికి విరోధముగా మనము చేస్తున్న ప్రతి కార్యక్రమమునూ చూచి దేవుడు మన అర్పణను ఎలా అంగీకరిస్తాడు? మన బ్రతుకంతా దేవునికి తెలుసు. మనము పట్టించుకోకపోవచ్చు, మన చుట్టూ ఉన్నవారికి ఇవన్నీ తెలియకపోవచ్చు. దేవునికి తెలియదా? ఆయన మన బ్రతుకు మొత్తాన్ని స్కేన్ చేస్తాడు. దిస్ ఈజ్ ద రిపోర్ట్ – ఇది ఫలానా వ్యక్తికి సంబంధించిన నివేదిక అని మనిషిని గూర్చి దేవుడు ఒక రిపోర్ట్ ఇచ్చేస్తాడు. దేవుడు మనుష్యులందరినీ తన వాక్యము ద్వారా విశ్లేషించి, ఒక నివేదికను ఇస్తాడు. అందుకే దేవుని వాక్యము ఎక్కడి వరకూ వెళ్ళిపోతుందో తెలుసా?

**హెబ్రీ 4 : 12** "దేవుని వాక్యము సజీవమై, బలము గలదై, రెండంచుల వాడిగల ఎటువంటి ఖడ్గముకంటెను వాడిగా ఉండి ప్రాణాత్మలను, కీళ్ళను, మూలుగను విభజించునంతమట్టుకు దూరుచు, హృదయము యొక్క తలంపులను, ఆలోచనలను శోధించుచున్నది". దేవుని వాక్యము మనిషి హృదయము యొక్క తలంపులను, ఆలోచనలను, శోధించుచున్నది. ఉదాహరణకు మీకొక ఆలోచన పుట్టింది. ఆ ఆలోచన దేవుని కొరకైనదా, కాదా? దైవ సంబంధమైనదా, కాదా? దేవుని ఇష్టాన్ని నెరవేర్చేదా, కాదా? దేవుని ఆశను తీర్చేదా, మీ స్వకీయ దురాశకు సంబంధించినదా? దీనినే దేవుడు మొట్ట మొదట విశ్లేషిస్తున్నాడు. దేవుని మాటలు ప్రాణాత్మలను, కీళ్లను, మూలుగను విభజించునంతమట్టుకు దూరుచు హృదయముయొక్క తలంపులను, ఆలోచనలను శోధించుచున్నది. ఫలానా వ్యక్తి యొక్క అర్పణ, ఫలానా వ్యక్తి చేసిన కార్యము – నేను స్వీకరించదగినదా, లేదా? అని దేవుడు తెలుసుకుంటున్నాడు. లేదు అనుకున్నాడంటే ఆ కార్యము వలన మీ కొచ్చే ఫలితం శూన్యం. అప్పుడు మీరు నష్టపోతారు. ఇశ్రాయేలీయులు ఆ రోజు అలాగే నష్టపోయారు. దేవుడు వారి వైపు లేకుండా, వారికున్న బలాన్ని బట్టి వారు బెన్యామీనీయుల మీదకు వెళ్లిపోయారు. దేవుని ముందుగా సంతోషపెట్టకుండా, లక్షల మంది కాల్బలముగా వారికున్న బాహుబలాన్ని చూసుకొని, మనకంటే బెన్యామీనీయులు అల్పమైన గోత్రమనుకుని, వారిని ఓడించవచ్చు అని ఇశ్రాయేలీయులు పొరపాటు పడ్డారు. కానీ వారి వలన కాలేదు. అప్పుడు వారు మరలా ఉపవాసముండి దేవుని అర్థించారు. తండ్రీ, నీవు మా పక్షముగా లేకపోతే మేము ఎంతటివారమైనా సరే, ఆ శత్రువుల మీద యుద్ధము చేయగలమా? నీవు మాకు నీ శక్తిని అనుగ్రహించాలి. నీవు మా పక్షాన ఉండాలి అని దేవుని అడిగారు. అప్పుడు దేవుడు వారి ఉపవాసాన్ని చూసి, వారి కష్టాన్ని చూసి, వారి ఏడ్పును చూసి, దినమంతా వారు యెహోవా సన్నిధిలో గడపడాన్ని చూసి శత్రువులను వారి చేతికప్పగించాడు. ఇక్కడ ఒక విషయాన్ని జాగ్రత్తగా గమనిస్తే, ఎలాగూ బెన్యామీనీయులు హతము చేయబడతారు. కానీ బెన్యామీనీయుల ద్వారా ఇశ్రాయేలీయులకు పాఠము నేర్పించాలి. దేవునికి ఆ ఇశ్రాయేలీయుల ఉపవాసము నచ్చిన తరువాత, ఆ బెన్యామీనీయులతో ఇప్పుడు మీరు యుద్ధానికి వెళ్ళండి. నేను మీకు అసలైన రహస్యాన్ని చెబుతాను అన్నాడు. ఈ మూడవసారి మీరు వెళితే బెన్యామీనీయులు మీ ముందు ఎంత? ఇప్పుడు నేను మీ పక్షముగా ఉంటే, మీరు బెన్యామీనీయులను క్షణాలలో ఓడించగలరు. మీరు యుద్ధాన్ని ఎలా చేస్తున్నారో వారికి తెలియకుండానే మీరు అంతా ముగించి వచ్చిన తరువాత, ఇశ్రాయేలీయులు మమ్మల్ని ఇలా ఓడించారా! వారి ప్రణాళిక ఇలా ఉందా! అని అప్పుడు వారు ఆలోచించుకుంటారు. అంటే మనము దేవునితో సంబంధాన్ని మెరుగుపరచుకోవడం చాలా ముఖ్యం. అందుకే ఎజ్రా ఏమంటున్నాడో చూడండి.

**ఎజ్రా 8 : 21** అప్పుడు దేవుని సన్నిధిలో మమ్మును మేము దుఖపరచుకొని అంటున్నాడు. మిమ్మును మీరు దుఖపరచుకోవాలా? మీ శరీరాన్ని నలుగగొట్టుకోవాలా? మీ శరీరాన్ని కష్టపెట్టుకోవాలా? మూడు పూట్లా తిని దేవునితో సంబంధము లేకుండా, ఏదో నేను దేవుని పని చేస్తానంటే దేవుడు ఊరుకోడు. దేవుడు దానిని స్వీకరించడు. ఇది దేవుని మనసు! మిమ్మును కన్న దేవుడు చాలా గొప్పవాడు, మీ దేవుడు చాలా స్థిరమైనవాడు, మీ దేవునికి చాలా లెక్కలున్నాయి, మీ దేవునికి చాలా సూత్రాలున్నాయి, మీ దేవునికి చాలా తలంపులున్నాయి. వాటిని మీరు అంగీకరించకుండా, వాటి ప్రకారము నడుచుకొనకపోతే ఇది రెండంచులుగల వాడిగల ఎటువంటి ఖడ్గముకంటెను

పదునైనది. ఏ మాత్రం మనము ఒక వేళ నిద్రమత్తులో ఉండిపోతే మనలను తెగకోసివేస్తుంది. దేవుని దగ్గర చాలా అలర్ట్‌గా ఉండాలి. మెలకువగా ఉండాలి. జ్ఞానము కలిగిన వారుగా ఉండాలి. దేవునితో ఎల్లప్పుడు మన సంబంధాన్ని చాలా గొప్పదిగా కొనసాగించుకోవాలి. లేకపోతే మనము దేవుని పనిని చేయలేము. అలాంటప్పుడు మనము పరలోకమును సాధించలేము. మమ్మును మేము దుఖపరచుకొని మాకును, మా చిన్నవారికిని, మా ఆసక్తిని శుభ ప్రయాణము కలుగునట్లు ఆయనను వేడుకొనుటకు అహావా నది దగ్గర ఉపవాసముండుడని ప్రకటించితిని. ఎప్పుడైనా దేవుని పనిని చేయడానికి ముందుగా మిమ్మును మీరు నష్టపరచుకోవాలి. మిమ్మును మీరు దుఖపరచుకోవాలి. మిమ్మును మీరు దేవునితో సంబంధము కలిగి ఉన్నవారో కాదో చూసుకోవాలి. ముందుగా మిమ్మును మీరు పరీక్షించుకోవాలి. అప్పుడే మీరు అడుగు ముందుకు వేయండి. మరొక మంచి సందర్భమును చూద్దాం.

**నెహెమ్యా 1 : 1** "హకల్యా కుమారుడైన నెహెమ్యా యొక్క చర్యలు. ఇరువదియవ సంవత్సరములో కిస్లేపు మాసమున నేను షూషను కోటలో ఉండగా, నా సహోదరులలో హనానీయను ఒకడును యూదులలో కొందరును వచ్చిరి. చెపపట్టబడిన శేషములో తప్పించుకొనిన యూదులను గూర్చియు, యెరూషలేమును గూర్చియు నేను వారిని అడుగగా, వారు చెరపట్టబడిన వారిలో శేషించినవారు ఆ దేశములో బహుగా శ్రమను, నిందను పొందుచున్నారు. మరియు యెరూషలేము యొక్క ప్రాకారము పడద్రోయబడెను. దాని గుమ్మములు అగ్నిచేత కాల్చబడినవని నాతో చెప్పిరి. ఈ మాటలు విన్నప్పుడు నేను కూర్చుండి ఏడ్చి, కొన్ని దినములు దుఖముతో ఉపవాసముండి, ఆకాశమందలి దేవునియెదుట విజ్ఞాపన చేసితినని" నెహెమ్యా చెబుతున్నాడు. యూదులు పట్టబడ్డారు, దేవుని మందసము పట్టబడింది, దేవాలయపు ప్రాకారములు కూల్చబడ్డాయి. ఇవన్నీ వింటున్నప్పుడు దేవునికి ప్రతిగా, దేవునికి విరోధముగా ఆయా శత్రుదేశాల రాజులందరూ లేచిపోతున్నారన్న విషయం నెహెమ్యా చెవిని పడినపుడు ఆయన ఏమి చేస్తున్నాడో చూడండి. ఈ మాటలు వినినప్పుడు నెహెమ్యా కూర్చుండి యేడ్చి, కొన్ని దినములు దుఖముతో ఉపవాసం ఉండి, ఆకాశమందలి దేవుని యెదుట విజ్ఞాపన చేసాడు. అంటే, మీ ప్రార్థన దేవుడు అంగీకరించాలంటే, పరలోకమందున్న తండ్రి మీ ప్రవర్తనను చూడాలి. మీతో ఆయన సరియైన సంబంధాన్ని కలిగియుండాలి. అప్పుడే తండ్రియైన దేవుడు, తన కుమారుని ప్రార్థనను, తన దాసుని ప్రార్థనను వింటాడు. లేకపోతే వినడు. ఊరకనే ఎలాపడితే అలా మనము ప్రార్థన చేస్తే దేవుడు వినినే వినడు. దేవుని కుమారులుగా మీరు మారకపోతే, దేవుని ఆత్మను మీరు కలిగినవారు కాకపోతే, మీరు ఎంత కానుక దేవునికిచ్చినా అది దేవునికి లెక్కలేదు. దేవుడు దానిని స్వీకరించడు. అది మనము వ్రాసుకున్న లెక్కల వరకే ఉంటుంది. కానీ మీరు నిజంగా దేవునితో సంబంధము కలిగినవారై ఉండి దేవునికిస్తే, అది తప్పనిసరిగా దేవుని లెక్కలలోనికి వెళుతుంది. పరలోకములో మీకు ధనము సమకూర్చబడుతుంది. చాలా సార్లు చాలామంది దేవునికి అర్పణలు తీసుకొని వస్తుంటారు. ఆ అర్పణ నిజముగా పరలోకమందున్న దేవుని సన్నిధికి చేరాలంటే మీరు దేవునితో సంబంధము కలిగివారై ఉండాలి. అప్పుడే మీరు దేవునికి ఇవ్వండి, లేకపోతే ఇవ్వకండి. ఒకవేళ మీరు దేవునికి కుమారులు కాకుండా దేవునికి ఇచ్చినా, ఆ అర్పణ వృథా అవుతుంది. అది ఇక్కడ ఖర్చులో ఉపయోగపడుతుంది తప్ప, పరలోకములో జమ కాదు. మీ దేవునితో మీ సంబంధము మంచిదిగా లేనప్పుడు మీరు వెంటనే సరిచేసుకోవాలి. మీరు దేవునితో మంచి సంబంధాన్ని కలిగినవారై ఉండాలి. లేకపోతే మీ అర్పణను దేవుడు స్వీకరించడు. మీ పనినీ దేవుడు స్వీకరించడు. అందుకే ఆయా కాలాలలో చరిత్రలో దేవునితో ఈ సంబంధాన్ని మెరుగుపరచుకోవడానికి భక్తులైన వారు ఉపవాసాలు చేసారు. ఇశ్రాయేలీయులైనా, దావీదయినా, ప్రవక్తలయినా, పట్టణాలలో ప్రజలైనా వీరందరూ ఉపవాసమును అందుకే చేసారు. నీనెవె అనే పట్టణమునకు దేవుడు శిక్షను ఖరారుచేసి, ఒకవేళ ఆ పట్టణములోని జనులు మార్పునొందితే వారిని రక్షించాలని నిర్ణయించాడు. యోనా అనే ప్రవక్తను దేవుని వాక్యప్రకటన నిమిత్తము ఆ పట్టణములోనికి దేవుడు పంపిస్తాడు. **యోనా 3 : 3–** "కాబట్టి యోనా లేచి యెహోవా సెలవిచ్చిన ఆజ్ఞప్రకారము నీనెవె పట్టణమునకు పోయెను. నీనెవె పట్టణము దేవుని దృష్టికి గొప్పదై మూడు దినములంత ప్రయాణమంత పరిమాణముగల పట్టణము. యోనా ఆ పట్టణములో ఒక దిన ప్రయాణమంతదూరము సంచరించుచు ఇక నలువది దినములకు

నీనెవె పట్టణము నాశనమగునని ప్రకటన చేయగా, నీనెవె పట్టణపువారు దేవునియందు విశ్వాసముంచి, ఉపవాస దినము చాటించి, ఘనులేమి అల్పులేమి అందరును గోనె పట్ట కట్టుకొనిరి." చూసారా, యోనా నీనెవె పట్టణములో దేవుని వాక్యమును ప్రకటించినప్పుడు వెంటనే ఆ పట్టణస్థులు దేవునివైపు తిరిగారు. ఈ రోజు ఎన్నో ప్రదేశాలలో దేవుని మాటలను ప్రకటిస్తున్నా మనిషికి చీమ కుట్టినట్టు కూడా లేదు. ఎందుకంటే, మనిషికి దేవుడంటే చిన్న చూపు. ఆనాడు నీనెవె పట్టణస్థులు దేవునికి వెంటనే భయపడ్డారు. ఆ పట్టణపు రాజు కూడా ప్రవక్త మాటలకు శిరస్సు వంచాడు. ఆ పట్టణపు మనుష్యులుగాని, పశువులుగాని, యెద్దులుగాని, గొఱ్ఱెలుగాని మేత మేయకూడదు, నీళ్ళు త్రాగకూడదని రాజు ప్రకటన చేయించాడు. అంతేకాక, మరిముఖ్యముగా పట్టణస్థులందరు తమ దుర్మార్గములను విడిచి తాము చేయుచున్న బలాత్కారములను మానివేయవలెనని ప్రకటన చేయించాడు. వారు దేవునికి ఆనాడు చేసిన నిజమైన ఉపవాసము ఏమి చేసిందో తెలుసా? వారి ప్రాణమును కాపాడింది. ఆ దేశమును నాశనము చేస్తానన్న దేవుడు, తన మాటను రద్దు చేసాడు. కీడును ఉపసంహరించుకుని, ఆ పట్టణమును కాపాడాడు. ఇదంతా కేవలం ఆ నీనెవె జనులు దేవునికి చేసిన నిజమైన ఉపవాసము వలనే జరిగింది. అంటే మీరు చేసే ఉపవాసం దేవుని కోపాన్ని చల్లార్చేదిగా ఉండాలి. అంతేగాని, వాక్యవిరుద్ధమైన ఉపవాసము చేస్తే అది దేవునికి కోపాన్ని తెప్పించి, మిమ్మును నాశనం చేస్తుంది.

ఇక యేసుక్రీస్తు కాలానికి వెళ్ళి చూద్దాం. చరిత్రలో ఇశ్రాయేలీయుల కాలములో చూసాము, ప్రవక్తల కాలములో చూశాము. ఇప్పుడు యేసుక్రీస్తువారు ఏమి చేశారో, ఆయన కాలములో ఏమి జరిగిందో ఒక్కసారి పరిశీలిద్దాము. **మత్తయి 4 : 1** "అప్పుడు యేసు అపవాది చేత శోధింపబడుటకు ఆత్మ వలన అరణ్యమునకు కొనిపోబడెను". యేసుక్రీస్తు దేవుని రాజ్యాన్ని గూర్చి ప్రకటించడానికి సంసిద్ధతతో వచ్చాడు. పరిపూర్ణమైన ప్రణాళికతో వచ్చాడు. ఆయన 30 యేండ్ల వయస్సు గలవాడైనప్పుడు బాప్తీస్మమిచ్చు యోహాను దగ్గరకు వెళ్లి, బాప్తీస్మమును పొందాడు. బాప్తీస్మమును నేను నీ చేత పొందవలసినవాడనై యుండగా, నీవు నా చేత బాప్తీస్మమును ఎందుకు పొందుచున్నావు? అని బాప్తీస్మమిచ్చు యోహాను అడుగుచున్నప్పుడు, నీతి యావత్తు ఇది ఈలాగు జరుగుట మనకు తగియున్నదని యేసు అన్నాడు. ఎందుకంటే, వాక్యమును ప్రకటించే యేసు, పాటించేవాడుగా కూడా ఉండాలి. ప్రతీ విషయములో ఆయన ధర్మశాస్త్రాన్ని నెరవేర్చాలి. ప్రతీ విషయంలో తను దేవుని సంతోషపెట్టాలి. బాప్తీస్మమును పొంది ఆయన నీళ్ళలో నుండి ఒడ్డునకు వచ్చినప్పుడు ఏమి జరిగిందో చూడండి.

**మత్తయి 3 : 16–** "యేసు బాప్తీస్మము పొందిన వెంటనే నీళ్ళలో నుండి ఒడ్డునకు వచ్చెను. ఇదిగో ఆకాశము తెరవబడెను. దేవుని ఆత్మ పావురము వలె దిగి తనమీదికి వచ్చుట చూచెను. మరియు ఇదిగో, ఈయనే నా ప్రియ కుమారుడు ఈయనయందు నేనానందించుచున్నాను అను ఒక శబ్ధము ఆకాశమునుండి వచ్చెను". యేసుక్రీస్తు నిస్సందేహంగా దేవునితో మంచి సంబంధాన్ని కలిగి ఉన్నాడు. ఎందుకంటే, ఆయన బాప్తీస్మము పొందిన తర్వాత ఎప్పుడూ రాని శబ్ధం, ఆకాశము నుండి ఎందుకొస్తుంది? ఎవరిని గూర్చి చెప్పని ఆ మాటను దేవుడు ఆ సందర్భంలో ఎందుకు పలికాడు? యేసు దేవుని కుమారుడు. దేవునితో ఆయనకున్న సంబంధము ఎప్పుడూ తెగిపోలేదు. వారిద్దరి మధ్య ఉన్న తండ్రీ, కుమారుల బంధము చాలా గొప్పది. యేసుక్రీస్తు తప్ప ఎవ్వరూ తండ్రియైన దేవునితో అంతకంటే గొప్పబంధాన్ని కలిగిలేరు.

**మత్తయి 4 : 2** "నలువది దినములు, నలువది రాత్రులు ఉపవాసముండిన పిమ్మట ఆయన ఆకలిగొనగా" అని వ్రాయబడినది. ఆయన ఎందుకు ఉపవాసమున్నాడు? తండ్రి చేత మంచి సంబంధాన్ని కలిగియున్న యేసు ఎందుకు ఉపవాసమున్నాడు? ఎందుకంటే, యేసుక్రీస్తు ఒక మహా గొప్పదైన విప్లవంలో అడుగు పెట్టబోవుచున్నాడు. ఒక మహా కార్యక్రమాన్ని ముగించబోవుచున్నాడు. ఈ భూమి మీద ఉన్న వాటినన్నింటిని జయించబోవుచున్నాడు. నేత్రాశ, శరీరాశ, జీవపుడంబము, ఈ మూడింటిని యేసుక్రీస్తు జయించబోవుచున్నాడు. లోకములో ఉన్న ప్రతి దానిని జయించడానికి ముందుగా ఆయన దేనిని జయించాలో తెలుసా? ఆయన తన శరీరాన్ని జయించాలి. అందుకే ఆయన నలువది దినములు, నలువది రాత్రులు ఉపవాసముండి, తన శరీరాన్ని పూర్తిగా తన అదుపులోనికి

తెచ్చుకున్నాడు. తన శరీరము తన మాట వినాలి. మీ శరీరము మీ మాట వింటుందా? చాలా సన్నివేశాలలో వినదు. వినకే కదండీ మీరు దేవునికి దూరమైపోతారు. మనిషికీ, దేవునికి మధ్య అడ్డు ఏమిటో తెలుసా? మనము ధరించుకున్న ఈ శరీరమే. ఈ శరీరమే మనలను పాతాళానికి లాక్కుని వెళ్లిపోతోంది. ఈ శరీరమే మనలను పరలోకం వెళ్ళనివ్వడంలేదు. ఈ రహస్యం చాలా మందికి తెలియదు. దేవుని ప్రార్ధించేటప్పుడు అందరూ శరీర కోరికలే అడుగుతున్నారు. ఇలా అడిగే వారంతా ఎంత అమాయకులు? ఎంత పిచ్చివారు? శరీరం నీ పాలిట ఒక శత్రువు అని బైబిల్ చెప్పుచున్నప్పుడు, ఈ విషయాన్ని దేవుని వాక్యము మనకు నేర్పిస్తున్నప్పుడు, ఈ శరీరానికి కావలసిన వాటిని అడుగుచున్నావా? ఆత్మగా నీవు నీ శరీరానికి కళ్లెము వేయాలి. దానిని జాగ్రత్తగా అదుపు చేసుకోవాలి. నీవు అనగా, శరీరము లోపల ఉన్న ఆత్మవు నీవు. ఈ ఆత్మ అదుపులోనికి నీ శరీరాన్ని తెచ్చుకోవాలి. 40 దినములు మీరు ఉపవాసము ఉండండి, ఎలా మీ శరీరాన్ని మీ అదుపులోనికి తెచ్చుకుంటారో చూద్దాం. మీ శరీరము ఊరుకోదు, మీ శరీరము మిమ్మల్ని భయపెట్టేస్తుంది. బాబోయ్ 40 పగళ్ళా, 40 రాత్రుళ్ళా? నిజంగా నేను అలా ఉపవాసము ఉంటే చనిపోతానేమో! నాకు ఆహారం పెట్టండి, నాకు ఇంజక్షన్ గుచ్చండి, నాకు వైద్యం చేయండి. ఈ శరీరాన్ని సుఖపెట్టి, ఈ శరీరాన్ని ఆనందపెట్టి, ఈ శరీరానికి రంగులుపూసి, ఈ శరీరానికి మంచి దుస్తులు వేసి,... ఇలా శరీరాన్ని గూర్చి ఎన్నో ఆలోచించే మనిషి, తన ఆత్మను గూర్చి ఎప్పుడైనా ఇంతగా ఆలోచించాడా? ఆత్మను గూర్చి ఇంత ఆలోచన ఉందా నేటి క్రైస్తవ సంఘానికి? లేదు. అందుకే ఉపవాసము చేయాలి. మీ శరీరాన్ని మీరు లోపరచుకోవడానికి, మీ శరీరాన్ని మీ అదుపులో ఉంచుకోవడానికి మీరు ఉపవాసము చేయాలి.

ఉపవాసము చేయడంలో ఇంత పరమార్థం ఉంది. ఉపవాసం చేయాలి అంటే ఇన్ని దైవ కారణాలుండాలి. మీ శరీరము అదుపు తప్పుతుందా? మీ శరీరముతో దేవుని పనిని చేద్దామంటే చేయనివ్వడం లేదా? వెనకడుగు వేస్తుందా? మీ శరీరము మిమ్మల్ని దేవుని పని నుంచి వెనక్కి మరల్చేస్తుందా? మిమ్మల్ని తప్పుడు మార్గములోనికి తీసుకొని వెళ్ళిపోతుందా? అయితే మీరు తప్పకుండా ఆలోచించాలి. దేవుని పనిలో మీ చెమట కారనప్పుడు, దేవుని పనిలో మీ రక్తం చెమటగా మారనప్పుడు, దేవుని పని కొరకు మీరు నిద్రలేమిలో ఉండనప్పుడు,...మీ బ్రతుకు పరమార్థాన్ని మీరు నెరవేర్చని వారే అవుతారు. దేవుని పనిని మీరు చేయలేకపోతే, మీరు శరీరపు భ్రష్టులు, శరీరానికి లోబడినవారు, శరీరాన్ని కోరుకున్నవారు, శరీర ప్రియులే అవుతారు. అందుకే, మీరు దేవునికి నిజమైన ఉపవాసము చేసి, అప్పుడు దేవుని పనిలో ఉండండి. దేవుని పనికొరకు చాలా మంది ఉపవాసము ఉంటారు. ఎలా? భోజనమును మాని ఉపవాసముండిన వారు కొందరు, తమ అర్పణలు ఇచ్చి ఉపవాసముండిన వారు కొందరు. పదివేల రూపాయలు మన యొద్ద ఉంటే ఒక రూపాయి దేవునికి ఇవ్వడం ఉపవాసము కాదు. రూపాయి ఉన్నప్పుడు పదివేలు ఇవ్వడమే నిజమైన ఉపవాసము. అంతే కదండీ! లక్షల ఆస్తి మన దగ్గర ఉన్నప్పుడు ఒక వెయ్యి రూపాయలు దేవునికివ్వడాన్ని అసలు ఉపవాసమంటారా? ఇది మనకే అర్థమైపోతున్నప్పుడు, ఆ సర్వోన్నతుడైన దేవునిఆత్మ వీటన్నిటిని గ్రహించదా? గుర్తించదా? ఇప్పుడు చెప్పండి. ఏది మీరు చేసిన ఉపవాసము? ఎక్కడ మీరు చేసిన ఈ నిజమైన ఉపవాసము? ఒక్కసారి మీరు చేసిన ఉపవాసాలను వెనక్కి తిరిగి చూసుకోండి. మీ జీవితాన్ని, మీ అర్పణలను పరికించి చూసుకోండి. మీరు దేవుని కోసం పడిన కష్టమేది? ఇలాంటి వారికి దేవుడు పరలోకము ఇవ్వాలా చెప్పండి? మీరు దేవునితో మంచి సంబంధాన్ని కలిగి ఉన్నవారయితే దేవుని పనిలో ఎలా ఉంటారో తెలుసా? దేవుని పనిలో ఎంత కష్టపడతారో తెలుసా? మనుష్యులకు కనబడేలా మీరు ఉపవాసముండకండి. దేవునికి కనబడేలా మీరు ఉపవాసముండండి. అలాంటి ఉపవాసమును దేవుడు లెక్కించుకుంటాడు. తన గ్రంథములో వ్రాసుకుంటాడు. ఏ వ్యక్తి కష్టపడ్డాడో, చెమటోడ్చాడో, అర్పణ ఇచ్చాడో, ఉపవాసమున్నాడో వీటన్నింటిని దేవుడు గమనిస్తున్నాడు. యేసుక్రీస్తు తన శరీరాన్ని, ఈ లోకాన్ని జయించడానికి ఆయన ఉపవాసము చేసినటువంటి తీరు చూడండి. 40 పగళ్ళు, 40 రాత్రిళ్ళు ఆయన ఉపవాసము ఉన్నాడు. ఏది మీ ఉపవాసము? ఏ విషయంలో దేవుని మీరు సంతోషపెడుతున్నారు? ఏదో దేవునికి ఒక అర్పణ, ఏదో దేవునికి ఒక కార్యక్రమము చేసినంత మాత్రాన దేవుడు సంతోషపడడు. ఎందుకంటే ఉపవాసము

లేని భక్తిని దేవుడు స్వీకరించదు. నిజమైన ఉపవాసము చేయుటలో యేసుక్రీస్తు కొన్ని మెళకువలు చెబుతున్నాడు చూడండి.

**మత్తయి 6 : 16** "మీరు ఉపవాసము చేయునప్పుడు, వేషధారులవలె దుఖముఖులై యుండకుడి" అంటున్నాడు. చాలామంది ఉపవాసము చేస్తున్నప్పుడు మేము ఉపవాసము చేస్తున్నాము. మా ఉపవాసమును మీరు చూస్తున్నారా, లేదా? గమనిస్తున్నారా, లేదా? అంటూ తమ ఉపవాసాన్ని చాలా గొప్పగా ప్రచారము చేసుకుంటారు. వేషధారణ జీవితమును కలిగి పైకి కనిపించడానికి మాత్రమే ఉపవాసము చేసి, మేము కూడా ఉపవాసమున్నాము అని లోకానికి చూపించుకుంటే, దానిని దేవుడు అస్సలు అంగీకరించదు. ఇలాంటి ఉపవాసము మనకూ అవసరం లేదు, దేవునికీ అవసరము లేదు! మీరు ఉపవాసము చేయునపుడు వేషధారులవలె దుఖముఖులై యుండకుడి. అసలు మీరు ఉపవాసము చేస్తున్నట్టుగా ఎవ్వరికీ తెలియకూడదు. మనుష్యులకు కనబడవలెనని మీరు మీ ముఖములను వికారముగా చేసుకోకూడదు. మీరు ఏదైనా దేవునికి అర్పణను ఇస్తే, ఆ అర్పణ ఇచ్చినట్టుగా ప్రతిబింబించడానికి మన జీవితాలు వికారముగా మారిపోకూడదు. దేవునికి ఎంత కష్టముతో అర్పణ ఇచ్చినా, మనము చాలా సంతోషముగా ఉండాలి. హృదయములోనికి దేవునికేదో ఇచ్చామనే ఆ భావము వచ్చినప్పుడు, వేషధారుల ముఖము వికారంగా మారిపోతుంది. మనుష్యులకు కనబరచుకోవలెనని ఉపవాసము చేస్తే, మనుష్యులు మీకు పట్టం కడతారా? మనుష్యులు మీ ఉపవాసానికి తగిన ప్రతిఫలమును ఇస్తారా? మనుష్యులు మిమ్ములను చూసి పొగిడే ఆ కార్యక్రమమంతా దేనికి ఉపయోగపడుతుంది? వారు తమ ఫలమును నరకమునందు పొందియున్నారని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానని యేసుక్రీస్తువారన్నారు. భూమి మీద ఎవరికి కనబడవలెనని మీరు చేస్తున్నారో వారి వలన మీరు ఫలము పొందియున్నారు. ఇక మీకు దేవుని దగ్గర నుండి ఫలము రాదు. మీరు మీ ఉపవాసమును ఎవరికి చేశారు? భూమి మీద ఉన్న మనుష్యులకు చేసారే తప్ప, దేవునికి కాదు. భూమి మీద ఎవరు కనిపిస్తే వారికి, నేను ఈ రోజు దేవునికి ఉపవాసం చేస్తున్నాను, నన్నేమి అడగకండి. ఈ రోజు నేను ఉపవాసం ఉన్నాను, నాకు ఏ పని చెప్పకండి. నేను ఈ రోజు ఉపవాసం ఉన్నాను, ఒకవేళ నాకేమైనా ఇవ్వాలనుకుంటే ప్రక్కన పెట్టండి. నేను భక్తిపరుణ్ణి, నన్నేమి అనకండి. నేను నీతిమంతుణ్ణి, నన్ను గౌరవించండి అంటున్నారా? ఆయన ఉపవాసం ఉన్నాడట. ఆమె ఉపవాసం ఉందట. ఆమె గొప్ప భక్తురాలట. ఇలా అందరిచే అనిపించుకుంటున్నారా? అంటే మీ ఉపవాసానికి మనుష్యుల వలన వచ్చే ఘనత అంతా ఇక్కడే వచ్చేసింది. గనుక అలాంటి వారు తమ ఫలమును ఇక్కడే పొందియున్నారు. ఇది దేవుని వలన కలిగే పరలోకము నుంచి వచ్చే ఫలము కాదు. మీరు ఉపవాసము చేయుచున్నట్టు మనుష్యులకు కనబడవలెనని కాక, రహస్యమందున్న మీ తండ్రికి మాత్రమే కనబడవలెనని చేయాలి. మీరు ఉపవాసము చేయునపుడు మీ తల అంటుకొనుము, మీ ముఖమును కడుగుకొనుము. అప్పుడు రహస్యమందు చూచు మీ తండ్రి మీకు ప్రతిఫలమిచ్చును. ఇదంతా మీ భోజనము విషయంలో చేసే ఉపవాసము. మీ కడుపునకు భోజనాన్ని మీరు అడ్డగించుకుంటే, అనగా మీరు పస్తులుంటే మీ ముఖము కడుగుకొని, తల అంటుకోవాలి. మిమ్మును చూచిన వారికి మీరు ఉపవాసమున్నారని తెలియకూడదు. ఒకవేళ ధనము విషయంలో మీరు ఉపవాసముంటే, వస్త్రము విషయంలో మీరు ఉపవాసముంటే, మీరు పేదవారన్న విషయం ఎవరికి తెలియనివ్వకూడదు. నేను దేవుని కోసం ఇంత ఖర్చు చేసానండీ అందుకే నేను పేదవాడినైపోయానండీ, నేను కష్టాలపాలైపోయానండీ అని ఎవ్వరికీ చెప్పుకోకూడదు. ఎందుకంటే దానికి తగిన ప్రతిఫలము మీకు పరలోకములో నుంచి కలగాలి. మీరు దేవుని యొద్ద స్థిరత్వమును కలిగి ఉండాలి. మీరు మీ పేదరికంలో దేవునికి ఎంత ఇచ్చినా, నేను దేవునికి ఇవ్వవలసిన దానికన్నా తక్కువే ఇచ్చానండీ అని చెప్పుకోవాలి. నీకు ఫలము పరలోకపు తండ్రి నుంచి కలగాలి తప్ప మనుష్యుల నుండి కలుగకూడదు. నీవు ఎందులో ఉపవాసము ఉన్నా సరే, ఆహారము విషయములో ఉపవాసము ఉన్నా / వస్త్రము విషయములో ఉపవాసము ఉన్నా / ఏదైనా వస్తువు విషయములో ఉపవాసము ఉన్నా / నీ శరీరానికి సంబంధించి ఏ విషయంలో ఉపవాసము ఉన్నా, నీవు ఆ విషయమును మనుష్యులకు తెలియనివ్వకూడదు. దేవునికి నేను ఇవ్వవలసిన దానికన్నా తక్కువే ఇచ్చానని చెప్పి, అక్కడనుండి వెళ్ళిపోయాలి. ఆ దేవుడు నీకు మంచి ప్రతిఫలమిచ్చునట్టుగా నీవు ఉపవాసము చేయాలి. ప్రపంచవ్యాప్తంగా

ఎందరో క్రైస్తవులు చేస్తున్న ఉపవాసాలలో ఏ ఒక్కటయినా, ఇదిగో దేవుడు చెప్పిన ఈ ఉపవాసానికి తగ్గట్టు ఉందా? లేదు. వారిష్టప్రకారం వారి ఉపవాసాలు వారివి. వారి ఆలోచనలు వారివి, వారి క్రియలు వారివి. దేవుడు వ్రాయించిన వాక్యము మనకు స్పష్టంగా చెబుతోంది. మనిషి ఎప్పుడు ఉపవాసము చేయాలి? మీ తండ్రితో మీ సంబంధాన్ని కోల్పోయినప్పుడు మీ తండ్రికి మీరు ఉపవాసమును చేయాలి. యేసుక్రీస్తును వెంబడించిన శిష్యులు ఎప్పుడూ ఇలాంటి భూటకపు ఉపవాసములు చేయలేదు. అప్పుడు ఇదే విషయమై యేసుక్రీస్తును ఒక ప్రశ్న వేస్తున్నారు. దానిని ఒక్కసారి మనము చూద్దాం.

**లూకా 5 : 33** “వారాయనను చూచి, యోహాను శిష్యులు తరచూ ఉపవాస ప్రార్థనలు చేయుదురు. అలాగే పరిసయ్యుల శిష్యులు చేయుదురు. కాని నీ శిష్యులు తిని త్రాగుచున్నారే అని అడిగిరి”. ఉపవాసము రాను రాను ఎలా మారిపోయిందో చూసారా! ఒక యాజకుడు చేసిన ఉపవాసము, ఒక దావీదు చేసిన ఉపవాసము, ఇశ్రాయేలు జనాంగము చేసిన ఉపవాసము, రాను రాను ఎలా మారిపోయిందంటే ఉపవాస ప్రార్థనలు, ఉపవాస కూడికలుగా మారిపోయింది. ఇప్పుడు దీనిని చేయవలసిన అవసరం ఉందా? యేసుక్రీస్తు శిష్యులకు ఆ అవసరం లేదు. ఎందుకంటే దేవునితో సంబంధము లేనప్పుడు, దానిని మెరుగుపరచుకోడానికి ఉపవాసమును చేయాలి. దేవుని కార్యక్రమానికి ఉపక్రమించేటప్పుడు, తన శరీరాన్ని పూర్తిగా తన ఆధీనములో ఉంచుకోవడానికి ఉపవాసమును చేయాలి. మరి వీరందరూ ఏమి చేస్తున్నారు. ఆనవాయితీగా ఉపవాసము చేస్తున్నారు. యోహాను శిష్యులు తరచుగా ఉపవాసము చేయుదురు, అలాగే పరిసయ్యుల శిష్యులును చేయుదురు. ఇలాంటి వారందరిదీ ఒక జాబితా. వీరికి ఒక కాలము వస్తుంది, ఆ కాలములో ఉపవాస ప్రార్థనలు పెట్టుకుంటారు. మనుష్యులందరికీ చెప్పుకుంటారు. మేము ఉపవాసం ఉన్నాము, మేము నీతిమంతులమని అనిపించుకొని వెళ్ళిపోతారు. దేవుడు నిజమైన ప్రతిఫలమిచ్చే ఉపవాసమును చేసేవారు కారు వీరు. మరి నీ శిష్యులు తిని త్రాగుచున్నారే అని తిరిగి యేసును అడుగుచున్నారు. యేసుక్రీస్తు తన శిష్యులతో ఉపవాస ప్రార్థనలు ఎప్పుడూ పెట్టించలేదు. యేసుక్రీస్తు తన శిష్యులతో కలిసి ఎన్నడూ ఉపవాసమును చేయలేదు. ఆయన బాప్తీస్మము తీసుకున్న తరువాత, తన శరీరాన్ని జయించడానికి, అపవాదిని ఓడించడానికి 40 రాత్రింబగళ్ళు ఉపవాసమున్నాడు. కాని, తరువాత ఎప్పుడూ యేసుక్రీస్తుగాని, తన శిష్యులు గాని ఉపవాసమును చేయలేదు. ఆహారము విషయంలో వారు ఎప్పుడూ ఉపవాసమును చేయలేదు. వారితో యేసుక్రీస్తు ఏమి చెప్పుచున్నాడో చూడండి.

**లూకా 5 : 34** “పెండ్లి కుమారుడు తమతో ఉన్నంతకాలము ఆ యింటివారితో మీరు ఉపవాసమును చేయించగలరా?” అని యేసుక్రీస్తు వారిని అడుగుచున్నాడు. దావీదు దేవునితో సఖ్యత కలిగియున్నప్పుడు, దేవునితో సమాధానమును కలిగియున్నప్పుడు ఆయన ఎప్పుడైనా ఉపవాసము చేసాడా? లేదు. దావీదు ఎప్పుడైతే బెత్షెబతో పాపము చేశాడో, ఎప్పుడయితే ఆ బిడ్డ మరణచ్ఛాయలలోనికి వెళ్ళిపోయిందో, అప్పుడు దావీదు ఉపవాసమున్నాడు. అప్పుడు దావీదు ఒంటరియైపోయాడు. ఆయనకు ఏమియు సహించటం లేదు. యేసుక్రీస్తు కూడా అదే చెబుతున్నాడు. పెండ్లికుమారుడు తమతో ఉన్నంతకాలం పెండ్లి ఇంటివారి చేత మీరు ఉపవాసమును చేయించగలరా? భోజనమును వారిచేత మాన్పించగలరా? పెండ్లికుమారుడు వారి యొద్దనుండి కొనిపోబడు దినములు వచ్చును. పెండ్లి కుమారుడు కొన్నిరోజులకు వారియొద్దనుండి వెళ్లిపోతాడు. అనగా, యేసుక్రీస్తు వారి యొద్దనుండి, వారి జీవితాలలోనుంచి కొన్ని దినములకు వెళ్లిపోతాడు. వారు వెళ్ళిపోయేలా చేసుకుంటారు. వారు తిండి, ధనాశ, నిద్రాశక్తులైయుండి దేవుని వాక్యానికి దూరమైపోతారు. అప్పుడు వారు ఏమి చేయాలో తెలుసా? ఉపవాసముండాలి. మరలా యేసుని దగ్గరకు చేర్చుకోవాలి. వారు మరలా దేవునితో సంబంధమును కలిగి ఉండాలి. అప్పటి వరకూ వారు ఉపవాసముండాలి. అప్పటి వరకూ వారు దేవుణ్ణి వేడుకోవాలి. దేవుని యెడల వీరు ఏడుస్తూ ఉండాలి. లేకపోతే మరలా యేసు వీరి దగ్గరకు రాడు, మరలా దేవుడు వీరితో సంబంధాన్ని కలిగి ఉండడు. పరిపూర్ణుడైన యేసు వాక్యములో ఏమంటున్నాడో చూడండి. పెండ్లికుమారుడు తమతో ఉన్నంత కాలము పెండ్లి ఇంటివారిచేత మీరు ఉపవాసమును చేయించలేరు. పెండ్లి కుమారుడు కొనిపోబడుదినములు వచ్చును. ఆ దినములలో వారు ఉపవాసమును చేయాలని చెప్పెను. ఇది

మీకు అర్థం కావాలంటే మీకు ఒక ఉపమానమును చెప్పాలి. లేకపోతే, అంత సుళువుగా ఆయన మాటల్లో ఉన్న లోతు మీకు అర్థం కాదు. **లూకా 5 : 36** "ఎవడును పాత బట్టకు క్రొత్త గుడ్డ మాసిక వేయడు. వేసినయెడల క్రొత్తది దానిని చింపివేయును. అదియుగాక క్రొత్త దానిలోనుండి తీసిన ముక్క పాతదానితో కలియదు. ఎవడును పాత తిత్తులలో క్రొత్త ద్రాక్షారసమును పోయడు. పోసినయెడల క్రొత్త ద్రాక్షారసము తిత్తులను పిగుల్చును, రసము కారిపోవును తిత్తులును పాడగును. అయితే క్రొత్త ద్రాక్షారసము క్రొత్త తిత్తులలో పోయవలెను. పాత ద్రాక్షారసము త్రాగి, వెంటనే క్రొత్తదానిని కోరువాడెవడును లేడు. పాతదే మంచిదనునని చెప్పెను". ఒక పాత వస్త్రము చాలా యేళ్ళు గతించిపోయింది. తరువాత దానికి ఒక చిన్న రంధ్రము పడింది అనుకోండి. ఇప్పుడు దానికి ఎలాంటి మాసిక వేయాలి? ఆ పాతగుడ్డ లాంటి ముక్కను తీసుకువచ్చి దానికి అతకాలి. అంతేకాని క్రొత్త వస్త్రపు ముక్క పాత బట్టకు అతుకుగా వేసారనుకోండి. పాత వస్త్రమునంతటిని ఆ చిన్న ముక్క చింపివేస్తుంది. ఎందుకంటే ఈ క్రొత్త ముక్క బలము కలిగినది. బలహీనమైన ఆ బట్టకు బలహీనమైన మాసికనే వేయాలి. అప్పుడే ఆ వస్త్రము కొంతకాలం పాటు ఉంటుంది. ఆ బలహీనమైన దానికి బలమైన దానిని తెచ్చి అతుకు వేయకూడదు. సైకిల్ ట్యూబ్‌కి పంక్చర్ పడితే, కారు ట్యూబ్‌కి వేసేటువంటి ముక్కను అతుకుగా వేయకూడదు. కారు యొక్క ట్యూబ్ చాలా మందముగా ఉంటుంది. సైకిల్ యొక్క పద్ధతి వేరు, కారు యొక్క పద్ధతి వేరు. యేసుక్రీస్తు ఎంత చక్కటి పోలికను చెప్పారో చూడండి. లోకములో ఎవడునూ పాతదానికి క్రొత్త గుడ్డ మాసిక వేయడు, వేసిన యెడల ఆ పాత వస్త్రాన్ని ఈ క్రొత్త గుడ్డ చింపివేస్తుంది. అదియుగాక క్రొత్త దానిలో నుండి తీసిన ముక్క, పాత దానితో కలవదు.

ఇప్పుడు మీరు క్రొత్త నిబంధనలో ఉన్నారు. క్రీస్తు వచ్చిన తరువాతి కాలములో ఉన్నారు. పరిపూర్ణమైన జ్ఞానము ఇప్పుడు మీ చేతుల్లో ఉంది. దీనిని పరిశీలించమన్నాడు. ఇందులో పూర్తిగా ఆయన మనసుంది. ఆనాటి కాలములో ఉన్న దానియేలుకు దేవుని మనసు తెలియదు. ఇశ్రాయేలీయులకు పూర్తిగా ఆయన మనసు తెలియదు. దావీదుకు పూర్తిగా ఆయన మనసు తెలియదు. అందుకే వారు ఉపవాసమును ఉన్నారు. దేవుణ్ణి మరలా సంతోషపెట్టుకున్నారు. దేవుని కార్యక్రమాలు నెరవేర్చారు. ఆకలితో పస్తులున్నారు. దేవుని కార్యక్రమాలలోనికి మరలా వచ్చారు. అయితే మీరిప్పుడు చేయవలసిన పద్ధతి వేరు. మీరిప్పుడు వేరే ఉపవాసమును ఉండాలి. ఎందుకంటే ఇది క్రొత్త గుడ్డ. ఇంకా ఏమి చెప్పుచున్నాడో చూడండి.

ఎవడును పాత తిత్తులలో క్రొత్త ద్రాక్షారసము పోయడు. పోసినయెడల క్రొత్త ద్రాక్షారసము తిత్తులను పిగుల్చును, రసము కారిపోవును, తిత్తులును పాడగును. ఎంతోకాలముగా వాడుతూ ఉన్న ఆ పాత ద్రాక్షారసపు తిత్తులలో క్రొత్త ద్రాక్షారసాన్ని పోయకూడదు. ఎందుకంటే ఇది క్రొత్త ద్రాక్షారసము. ఈ ద్రాక్షారసాన్ని పాత తిత్తులలో వేస్తే ఆ పాత తిత్తులన్నీ రంధ్రాలు పడిపోతాయి. అవి ఇక ఉపయోగపడవు. పాత తిత్తులలో పాత ద్రాక్షారసాన్నే పోయాలి. క్రొత్త ద్రాక్షారసమును క్రొత్త తిత్తులలోనే పోయవలెను. పాత ద్రాక్షారసం త్రాగిన వెంటనే ఎవడును క్రొత్త దానిని కోరుకోడు. పాతదే మంచిదనుకొనును. మీరందరూ ఏమనుకుంటున్నారు? యోహాను శిష్యులు చేసేటటువంటి ఉపవాసమును, పరిసయ్యుల శిష్యులు చేసే ఉపవాసమును చూచి అదే మంచిదనుకుంటున్నారు. పాత దానిని త్రాగి, త్రాగి, మీరు దాని మత్తులో ఉన్నారు. మీరు క్రొత్త దానిని కోరుకుంటున్నారా? కోరుకోవడం లేదు. ఒకప్పుడు ఎందరో మీకు చెప్పినటువంటి బోధలన్నీ ఇంకా మీలో ఉండిపోయినవి. వాటి మూలాలు మీలో ఇంకా ఉండిపోయినవి. మీరు వాటినే కోరుకుంటున్నారు. వారు మీకు చల్లని నూనె రాసినట్టుగా బోధలు చేశారు. మీకు వారి బోధలు నచ్చక, మీరు వారిపై కోపగిస్తే వారు మీకు అనుకూలముగా మారిపోయేవారు. ఈ క్రొత్త బోధ అలా ఉండదు. మిమ్మల్ని ఎప్పటికప్పుడు సిద్ధం చేస్తుంది. ఎప్పటికప్పుడు మిమ్మల్ని స్థిరత్వంలో పెడుతుంది. లేకపోతే ఇది క్రొత్త బోధ ఎలా అవుతుంది? క్రొత్త నిబంధనకు మిమ్మును సరిచేసే బోధ ఇది. అంతేకాని మీకు తగ్గట్టుగా మారిపోయే బోధ కాదు. నిజమైన ఉపవాసము ఎలా ఉంటుంది? మీరు పెండ్లి కుమారుని కలిగియున్నవారుగా ఉండాలి. పెండ్లి కుమారుడు మీతో పాటు ఉండాలి. ఆ రోజు శిష్యులతోపాటు పెండ్లి కుమారడు ఎలా ఉన్నాడో, ఈ రోజు మనము కూడా అలాగే ఆ పెండ్లి కుమారుని కలిగియుండాలి. ఎందుకంటే పరిపూర్ణమైన వాక్యము ఆదికాండము నుంచి

ప్రకటన గ్రంథము వరకు 66 పుస్తకాలలో దేవుడు మనకు చెప్పాలనుకున్న ప్రతి దానిని వ్రాసి ఇచ్చేసాడు. ఆయన చెప్పుకోవడానికి దేనినీ మిగుల్చుకోలేదు. ఆయన ఇంకా మనకు తన దర్శనములో ఏదో చూపించడానికి ఆయన దేనినీ దాచి పెట్టుకోలేదు. ప్రతీ దానిని తన గ్రంథములో పొందుపరచాడు. అంటే ఇప్పుడు మన చేతుల్లో ఉన్నదే పరిపూర్ణమైన వాక్యము, అనగా యేసుక్రీస్తు మనతో ఉన్నాడు. ఆదికాండము మొదటి అధ్యాయము మొదటి వచనము నుండి ప్రకటన గ్రంథము చివరి అధ్యాయము చివరి వచనము వరకూ పరిపూర్ణముగా ఆయన వ్రాయించి ఇచ్చాడు. ఒకనాడు శిష్యులతో యేసుక్రీస్తు ఎలా ఉన్నాడో ఇప్పుడు మన దగ్గర దేవునివాక్యము అలా ఉంది. ఇది పెండ్లికుమారుడు మనతో ఉన్న కాలము. ఇప్పుడు ఈ కాలములో వాక్యముతో సరిచేయబడి వెనువెంటనే దేవుని కార్యక్రమాలలోనికి వెళ్ళి దేవుని సంతోషపెట్టాలి తప్ప ఉపవాస ప్రార్థనలతో దేవుడిచ్చిన విలువైన కాలాన్ని వృధాచేయకూడదు. ఒకవేళ నీవు వ్యక్తిగతంగా ఉపవాసము చేయాలనుకుంటే నీవు మాత్రమే చేసుకోవచ్చు. కానీ ఎలా చేయాలో తెలుసా? ఆ ఉపవాసము ఎవ్వరికీ తెలియకూడదు. ఆ ఉపవాసముతో నీ తండ్రి మాత్రమే సంతోషపడాలి. నీవు చేసిన పాపాన్ని ఆయన మరచిపోవాలి. యేసుక్రీస్తు ద్వారా దానిని నీ దేవుడు క్షమించాలి. మరలా తన కుమారునిగా నిన్ను నూతనపరచాలి. క్రొత్త ద్రాక్షారసమును క్రొత్త తిత్తులలో పోసేటట్లుగా నీ బ్రతుకు విధానమంతా క్రొత్తదిగా మారిపోవాలి. ఇదే నిజమైన ఉపవాసము. ఈ పాఠమును చదివిన తరువాత మీరు మీ దేవునికి ఖచ్చితముగా అసలైన, నిజమైన ఉపవాసమునే చేస్తారని మనసారా కోరుకుంటూ....


ప్రభువునందు నమ్మకస్థుడు,

**జె. మణి కుమార్**

సన్ ఆఫ్ గాడ్ - క్రైస్ట్ చర్చ్ - సామర్లకోట - 8978414178.


## ప్రశ్నలు

1. నీనెవె పట్టణస్థులు ఎలా రక్షింపబడ్డారు?
2. నిజమైన ఉపవాసమును ఎలా చెయ్యాలి?
3. యేసుక్రీస్తు శిష్యులు ఎందుకు ఉపవాసము చెయ్యలేదు?
4. ఉపవాసమును ఎన్ని విషయాలలో చేయవచ్చో వివరించుము.
5. ఇశ్రాయేలీయులు బెన్యామీనీయుల చేతిలో ఎందుకు ఓడిపోయారు?
6. దావీదు తన బిడ్డ కోసం చేసిన ఉపవాసమును గూర్చి వివరించుము.
7. ఉపవాసము ఎప్పుడు చెయ్యాలో అనే కాలము బైబిల్‌లో ఎక్కడైనా ఉందా?

## 12. గొంగళి పురుగు ఎగురుతుందా? శవము బ్రతుకుతుందా?

ప్రభువునందు ప్రియమైన దేవుని జనులారా!

తల్లి గర్భములోనుండి బయటకు వచ్చిన ప్రతి ఒక్కరు ప్రాముఖ్యముగా వినవలసినది, ఆచరించవలసినది, తెలుసుకోవలసినది ఏమిటంటే, మనిషి శవము బ్రతుకుతుందా? అనే విషయము. దీనికి ముందు ఈ అంశములో గొంగళి పురుగు ఎగురుతుందా? అనే మరొక వాక్యాన్ని చేర్చడం జరిగింది. ఈ ప్రకృతిలో ఏదైనా ఎగరాలంటే దానికి రెక్కలు ఉండాలి. అది మనము తయారుచేసుకున్న విమానము అయినా, ప్రకృతిలో ఒక పక్షి అయినా, ఒక తెరచాప మాదిరిగా రెక్కల ఆకారము దానికి ఉంటే తప్ప, అది గాలిలో ఎగరదు. అలాంటిది, ఒక గొంగళి పురుగు ఎలా ఎగురుతుంది? ఇది ఈ అంశములో మీకు కనిపించే ప్రశ్న. సాధారణముగా, లోకానికి తెలిసినంత వరకు గొంగళి పురుగు ప్రాకుతుంది, మనిషి శవము మట్టిలో కప్పెట్టబడుతుంది లేక కట్టెలపై కాల్చబడుతుంది. కానీ, అంశములో ఉన్న ఈ రెండూ, ఆశ్చర్యాన్ని గొలిపేటటువంటి ప్రశ్నలు. ఇట్టి వాటికి లోకజ్ఞానములో మనకు సమాధానములు దొరకవు. ఒక పురుగు ఎగరాలన్నా, మనిషి శవము తిరిగి బ్రతకాలన్నా అది ఒక వింతే, అది ఒక ఆశ్చర్యమే! అలాంటి సందర్భాన్ని తీసుకుని ఈ పాఠము మీ ముందుకు వచ్చింది.

ప్రియులారా, ఈ అంశములో మిమ్మును ఆలోచింపచేసే ఒక మంచి ప్రశ్న ఉంది గనుక జాగ్రత్తగా ఈ పాఠాన్ని చదవండి. ప్రారంభము నుండి చివరి వరకు ప్రతి సందర్భాన్ని విమర్శనాత్మకంగా ఆలోచించండి. ఏ ఒకరి పక్షానో కాకుండా, ఈ విషయమును హేతుబద్ధముగా ఆలోచిద్దాము. ఎందుకంటే ఇది ఒక రాజకీయ నాయకునికో, ఒక అధికారికో, ఒక సంస్థకో సంబంధించినది కాదు. ఇది ఖచ్చితముగా మనకు సంబంధించినది. మీకు, నాకు, మన కుటుంబములో ఉన్నవారికి, మన బంధువులందరికి సంబంధించినది. ఒక మనిషి శవముగా మారిపోతే ఆ శవము బ్రతుకుతుందా? అలాగని ఇక్కడ మీకు ఒక అవాస్తవాన్ని చెప్పి నమ్మించడంలేదు. ఒక శాస్త్రవేత్త దీనిని చదువుతున్నా, ఒక విద్యావేత్త దీనిని చదువుతున్నా, ఒక హేతువాది దీనిని చదువుతున్నా, ఒక వైద్యుడు దీనిని చదువుతున్నా, ఎవ్వరూ తప్పుపట్టలేనంతగా నేను ఈ పాఠ్యాంశాన్ని చెప్పబోవుచున్నాను. కాబట్టి మనలను మోసము చేసే పాఠము కాదు, బలవంతపు మత మార్పిడి చేసే వ్రాత కాదు. ఇది ఒక చక్కటి పాఠ్యాంశము. ఇది మనందరి బ్రతుకులకు ఉపయోగపడుతుంది. అందుకే చాలా జాగ్రత్తగా పాఠములో ఉన్నటువంటి పరమార్థాన్ని గ్రహించాలి.

ఒక పురుగు బ్రతకడం, ఒక పురుగు రూపాంతరము చెందడం, ఒక పురుగు ఎగరడం అనే దానిని పోలికగా తీసుకుని, ఒక మనిషిని గూర్చి ఈ రోజు మనము మాట్లాడటం ఎంతవరకు నిజం? ఎంత వరకు సబబు? అని నన్ను అడిగితే – ప్రకృతిలో మనకు చాలా వస్తువులు, చాలా పురుగులు, చాలా పక్షులు, చాలా జంతువులు కనిపిస్తున్నాయి. కనిపించిన వెంటనే మనిషికి కలిగే కోరిక ఏమిటంటే, అవన్నీ నాకు ఎలా ఉపయోగపడతాయి? అనుకుంటాడు. ప్రతి మనిషికి సహజసిద్ధంగా కలిగే కోరికే అది. ఉదాహరణకు, ఒక గుర్రాన్ని చూసినప్పుడు దానిమీద నేను స్వారీ చేయాలి, ఇది నన్ను వేగముగా మరొక ప్రదేశానికి తీసుకొని వెళ్ళాలి, దీనికి నేను కళ్ళెము వెయ్యాలి. దీనిని నాకు అనుకూలముగా వాడుకోవాలి అనుకుంటాడు. ఈ ప్రకృతిని చూచిన మనిషి అంతవరకే ఆలోచించాడు. ఒక కోడిని చూడగానే, ఇది బాగా ఎదిగిన తరువాత దాని గ్రుడ్లు నేను తీసుకోవాలి. అది బాగా కండలు పెంచిన తరువాత దానిని నేను కోసుకుని తినాలి అనుకున్నాడు. ప్రతిదాని వలన నాకు ఉపయోగము ఏమిటి? అనుకుంటున్నాడు. ఈ ప్రకృతిలో ఉన్న ఏ వస్తువునైనా, ఏ పక్షినైనా, ఏ జంతువునైనా, ఏ ఖనిజాన్నైనా చూడండి. మొత్తంగా ఈ భూభాగాన్ని చూడండి. మనిషి దేనిని చూచినా ఫలానాది నాకు ఎలా ఉపయోగపడుతుంది? అనే ఆలోచించాడు. అనగా అరవై, డబ్బై యేళ్ళ బ్రతుకుకాలంలో తాను ఎలా అనుభవించాలని, తింటే మరల బహిర్భూమిలో విడువబడే ఆహార పదార్థముగా, తింటే అరిగిపోయే ఒక వస్తువుగా మనిషి ఆలోచించాడే కాని, అసలైన విషయమును యావత్తు మానవజాతి విడిచిపెట్టింది. అరవై ఆరు పుస్తకాలు కలిగిన ఈ బైబిల్‌లో దేవుడు వ్రాయించిన మంచి మాటలు, ఆయన మహాజ్ఞానము, ఏమి చెప్పిందో తెలుసా? ప్రకృతిలో ఉన్న ఏ వస్తువునూ, మొట్టమొదట దానిని అనుభవించాలనే దృష్టితో చూడకూడదు. ఎలా తినాలి? ఎలా ఉపయోగించుకోవాలి? నా జీవితకాలానికి, ఈ శరీరపు బ్రతుకుకు

ప్రకృతి ఎలా ఉపయోగపడుతుంది? అని ఆలోచించకూడదు. మొట్టమొదట, మనిషి ఈ ప్రకృతిని చూచి దాని నుండి పాఠమును నేర్చుకోవాలి. ఆ తరువాత దానిని తినవచ్చు. దేవుడు కాదనలేదు. అన్నీ దేవుడు మన కోసమే ఇచ్చాడు. కోడిని తినమన్నాడు, మేకను తినమన్నాడు. ప్రకృతిలోనిది ఏదైనా మనదే. ఇక్కడ దేవుడు అడుగుతున్న ఒక జ్ఞానయుక్తమైన ప్రశ్న ఏమిటంటే, ప్రకృతిలో మీరు దేనిని చూచినా, ఫలానాది నాకు ఏమి పాఠము చెబుతుంది? నాకు ఏమి చెప్పాలనుకుంటుంది? అని ఆలోచించాలి. ప్రతి వస్తువు మనిషికి ఏదైనా ఒక సద్విషయమును చెప్పాలనుకుంటుంది. మనలను దైవ సంబంధమైన మార్గములో నడిపించాలని ప్రయత్నిస్తుంది. అది వరి గింజ కావచ్చు, అది బంగారపు లోహము కావచ్చు, అది నాలుగు కాళ్ళ జంతువు కావచ్చు, ప్రాకే పురుగు కావచ్చు. సముద్రములో నివశించేది కావచ్చు. ఏదైనా సరే మీకు ఆహారముగా మారబోయేముందు మొట్టమొదట మీకు ఒక పాఠాన్ని నేర్పించాలనుకుంటుంది.

అందుకే ఈ రోజు మనిషి శవము బ్రతుకుతుందో లేదో, మనిషి యొక్క జీవితము శవముగా మారడంతో ముగింపబడుతుందో లేక ఆ తరువాత ఇంకా ఏమైన ఉన్నదా అనే దానిని నిరూపించడానికి, ప్రకటించడానికి, తద్వారా దైవ జ్ఞానమును మీచేత ఒప్పించడానికి, ఒక పురుగును ఉదాహరణగా తీసుకున్నాను. నేను ఎన్నుకున్న ఈ పురుగు ఎవ్వరికీ అక్కరలేనిది, ఎవ్వరికీ ఉపయోగపడనిది, ఎవరూ దగ్గరకు కూడా రానివ్వనిది. అదే గొంగళి పురుగు! ప్రకృతిలో చాలా పురుగులు మనకు ఉపయోగపడతాయి. చాలా వాటిని మనము ప్రేమిస్తాము. గొంగళి పురుగు అనేది మనము ద్వేషించే జీవులలో ఒకటి. దానిని మనము దగ్గరకు రానివ్వము. దానిని మన ఒంటిమీద ప్రాకనివ్వము. ఎందుకంటే దాని చర్మమంతా ముల్లు. అది కనిపించగానే చీపురుతో దూరంగా తోలివేయటానికి ప్రయత్నం చేస్తాము. అవసరమైతే దానిని చంపేస్తాము కూడా. మనిషి బ్రతుకు శవముతో ముగింపబడుతుందా? లేక ఆ తరువాత ఇంకా ఏమైనా ఉందా? అనే మహాజ్ఞానపు సంగతిని వివరించడానికి మీరు ఒక గొంగళిపురుగును ఉదాహరణగా తీసుకున్నారా? అని మీరు నన్ను అడిగితే, అవును. ఎందుకంటే, దేవుడు గొంగళి పురుగునే పరిశీలించమన్నాడు. దేవుడు నాకెప్పుడు చెప్పాడు అనుకుంటున్నారా? ఎలా చెప్పాడని ఆలోచిస్తున్నారా? ఈయనకు దేవుడు రాత్రివేళ దర్శనములో కనిపించి చెప్పాడా? అని మీరు పొరపాటు పడవచ్చు, భ్రమ పడవచ్చు. దర్శనంలో నాకు చెప్పాడని మీతో ఒక అబద్ధాన్ని చెప్పలేను. దేవుడు ఈనాటి కాలములో ఉన్న వ్యక్తులకు దర్శనములలో చెబుతాడు అనడానికి ఆధారమేమిటి? అలాంటి వాటికి నిరూపణ ఏమిటి? ఆధారం లేనివి, నిరూపణ లేనివి, రుజువులు లేనివి – నేను అస్సలు మాట్లాడను. దేవుడు తాను వ్రాయించిన గ్రంథము ద్వారా ఒక పురుగును ఉదాహరణగా తీసుకొని, మనిషి బ్రతుకును చెప్పమన్నాడు. దేవుని గ్రంథములో ఉంటేనే మీరు నమ్మాలి. లేదంటే దానికి ఆధారము లేదని మీరు కొట్టిపారేయాలి. దేవుడు ఇచ్చినటువంటి అరవై ఆరు పుస్తకాలు, అనగా బైబిల్ అనే మహాజ్ఞాన గ్రంథము మన భాషలో మన చెంత ఉండగా, ఎవరి మాటలనూ మనము వినవలసిన అవసరత లేదు. వాక్యమనేది ఒక డాక్యుమెంటరీ ఎవిడెన్స్. నిజ నిర్ధారణకు సాక్ష్యాలు చాలా అవసరం. న్యాయస్థానానికి మనము వెళ్ళినప్పుడు, నిజాలను ధృవీకరించడానికి సాక్ష్యమును (ఐ విట్‌నెస్ / డాక్యుమెంటరీ ఎవిడెన్స్ / హిస్టారికల్ ఎవిడెన్స్) ప్రవేశపెట్టాలి. అంతేతప్ప, నాకు రాత్రి దర్శనములో కనిపించింది అంటే న్యాయమూర్తి వింటారా? నాకు దర్శనమొచ్చింది, దేవుడు కలలో కనిపించి మీతో ఇలా చెప్పమన్నాడు, అలా చెప్పమన్నాడు అంటే ఊరుకుంటారా? అలాంటివారికి, మీరు వారి ముఖము మీదే చెప్పండి. నాకు సాక్ష్యాలు కావాలని అడగండి.

కనుక ప్రియులారా, జాగ్రత్తగా ఆలోచిస్తూ ముందుకు వెళదాం. మనిషికి పాఠమును నేర్పించాలంటే, ఒక పురుగును ఉదాహరణ తీసుకోవాలని దేవుడు అనుకున్నాడు. కొన్ని సందర్భాలు మీకు చూపిస్తే ఆ తండ్రి మనసు ఎలా ఉందో మీకు అర్థమవుతుంది. ఈ రోజు మనము దేనిని ఆలోచిస్తున్నాము? భార్య మనసు తెలుసుకోవడం కాదు, భర్త మనసు తెలుసుకోవడం కాదు, స్నేహితుల మనసు తెలుసుకోవడం కాదు, గురువు మనసు తెలుసుకోవడం కాదు, మన ముఖ్యమంత్రి గారి మనసు తెలుసుకోవడం కాదు, ప్రధానమంత్రి గారి మనసు తెలుసుకోవడం కాదు. దేవుని మనసును మనిషి ముందుగా తెలుసుకోవాలి. అందరికి సృష్టికర్తయైన ఆ తండ్రి మనసు తెలుసుకోవడం చాలా గొప్ప విషయం. ఇదిగో ఆయన ఇలా వ్రాయించాడు. ఆయన ఉద్దేశ్యమును మనము ఆలోచన చేద్దాం.

ఒక్కసారి బైబిల్ తెరచి, **హబక్కూకు 1 : 14** "ఏలికలేని చేపలతోను, ప్రాకు పురుగులతోను నీవు నరులను సమానులనుగా చేసితివి". ప్రకృతిలోని పురుగులు, ప్రకృతిలోని చేపలు, ప్రకృతిలోని పక్షులు ఇవన్నీ ఎందుకు ఉన్నాయో తెలుసా? నాలుక రుచులు కోరుకున్నదని కాదు. మనకు పాఠాలు నేర్పించడానికి. ప్రకృతిలో ఇన్ని విధాలుగా జీవులను, పక్షులను, జంతువులను ఆయన తయారుచేసాడు. ఇప్పుడు ఏమంటున్నాడంటే, ఒక్కసారి మీరు వాటితో సమానముగా మారిపోవాలి అంటున్నాడు. అప్పుడు మీకు బుర్ర వెలుగుతుంది. అప్పుడు మీరు పాఠమును నేర్చుకుంటారు. దేవుడు మనుష్యులను ఎవరితో సమానులనుగా చేస్తున్నాడో చూడండి.

గొంగళి పురుగు మన దగ్గరకు రాగానే తుడిచేయాలి, చంపేయాలి అనుకుంటున్నారు. ఇప్పుడు మీకు పాఠమును నేర్పించడానికి ఆ గొంగళి పురుగే వచ్చింది. మీ జీవితకాలంలో ఎన్నో గొంగళి పురుగులను చూసారు కాని మీకు ఈ పాఠము తెలియలేదు. దానిని ఊడ్చడానికి చీపురుకట్ట ఎక్కడ ఉందో చూసుకున్నారు. చంపడానికి జోడు ఎక్కడ ఉందో చూసుకున్నారు. దానిని ఏవిధముగా అయినా మన కళ్ళముందు నుంచి తీసేయాలి అనుకున్నారు. కానీ దేవుడు ఏమంటున్నాడంటే, మీరు ఒక మెట్టు దిగి, ఒక పురుగుతో మిమ్ములను సమానముగా చేసుకోవాలి అంటున్నాడు. ఎందుకంటే మనిషి మరణించిన తరువాత ఏమి జరుగుతుందో ఆ పురుగే, ఆ చేపే, ఆ పక్షే మనిషికి పాఠమును నేర్పించాలి. చేపలు మన దృష్టిలో గొప్పవికావు. తింటే అరిగిపోయేటంత చిన్నవి. ఏలికలేని చేపలతోను, పురుగులతోను మనిషిని దేవుడు సమానముగా చేస్తున్నాడు. ఎందుకు వాటితో పోలుస్తున్నాడు? ఎందుకు వాటితో సమానముగా చేస్తున్నాడు? మనకు మంచి పాఠము నేర్పించడానికే. మరొక సంగతిని చూడండి. ఆయనను గూర్చిన వాస్తవాలు మనకు అర్థమవుతాయి.

**యెహెజ్కేలు 34 : 31** "నా గొఱ్ఱెలను, నేను మేపుచున్న గొఱ్ఱెలునగు మీరు మనుష్యులు. నేను మీ దేవుడను, ఇదే ప్రభువగు యెహోవా వాక్కు". ఇక్కడ మరల మనిషిని దేవుడు ఎవరితో పోలుస్తున్నాడు? మనుష్యులను గొఱ్ఱెలు అంటున్నాడు. ఈ లోకము గొఱ్ఱెలును చూడగానే ఉన్నెను కత్తిరించుకోవాలని, దానిని మాంసముగా మార్చుకోవాలని అనుకుంది. కాని దేవుడు ఏమంటున్నాడు? గొఱ్ఱెలను చూడగానే దాని స్వభావము, దాని బ్రతుకు, దాని జీవన విధానమును మీరు ఆలోచిస్తే, మనిషికీ దేవునికీ మధ్య ఉండవలసిన సంబంధమును మీరు జ్ఞాపకము చేసుకోవాలి. అంటే ప్రకృతిలో ఉన్న ఏవస్తువునైనా, ఏ జీవినైనా మొట్టమొదట మనము ఆరగించడం కాదు. ఆలోచించాలి! అది ఎంత వరకు నా బ్రతుకు పరమార్థాన్ని తెలుపుతుందో అని దేవుని వాక్యమును బట్టి అని మనము అర్థం చేసుకోవాలి. అందుకే ఈ రోజు ఒక గొంగళిపురుగును గూర్చి ఆలోచిస్తున్నాము. గొంగళిపురుగు మరణించిన తరువాత బ్రతుకుతుందా? బ్రతికి ఎగరగలుగుతుందా? అలాగే మనిషి శవము తిరిగి బ్రతుకుతుందా? మరణించిన మనిషికి మరలా బ్రతుకుందా? అలాగని చనిపోయిన వారందరు బ్రతికి మరల ఇదే భూమిమీద పుడతారని నేను చెప్పడం లేదు. మరణించిన మనిషి ఏమవుతాడో ఈ పాఠమును చక్కగా గ్రహించి, ముగింపులోనికి వచ్చిన తరువాత మీకు అర్థమవుతుంది. ఒక మనిషి మరణిస్తే మరల ఈ భూమి మీద పుడతాడా? ఒక జంతువు రూపములోనో, ఒక పక్షి రూపములోనో, ఒక పురుగు రూపములోనో, లేక మరల మనిషి రూపములోనో పుడతాడా? ఇక ఏదైనా రూపములో బ్రతుకుతాడా? ఇది అర్థం చేసుకోవాలంటే ఇదిగో దేవుడు గొంగళి పురుగును గూర్చిన కొన్ని మంచి సంగతులను ఆలోచించమంటున్నాడు. గొంగళి పురుగు ఎగురుతుందా? అసలు గొంగళి పురుగు ఎగిరితే అందులో ఒక రహస్యం ఉంది. అదే మిమ్మును గూర్చిన రహస్యం. మీరు చనిపోతే ఎలా మారిపోతారో, మీ బ్రతుకు ఎలా రూపాంతరము చెందుతుందో, దీనంతటిని గూర్చిన రహస్యాన్ని దేవుడు అందులో దాచి ఉంచాడు, నిక్షిప్తపరిచాడు. ఈ గొంగళి పురుగును గూర్చి ఆయన వ్రాయించినటువంటి ఒక చక్కని సంగతిని ఇప్పుడు ఆలోచన చేద్దాం.

**నహూము 3 : 16, 17** "నీ వర్తకులు లెక్కకు ఆకాశ నక్షత్రములకంటె ఎక్కువగానున్నను గొంగళి పురుగు వచ్చి అంతయు నాకివేసి యెగిరిపోయెను. నీవు ఏర్పరచిన శూరులు మిడుతలంత విస్తారముగానున్నారు. నీ సైనికులు చలి కాలమందు కంచెలలో దిగిన గొంగళి పురుగులవలెనున్నారు. ఎండకాయగా అవి యెగిరిపోవును. అవి ఎక్కడ వాలినది ఎవరికిని తెలియదు". చూసారా, గొంగళి పురుగు ఎగురుతుందా? ఇప్పటి వరకు మనము

పురుగు ఎగరడాన్ని చూడలేదు. కేవలం ప్రాకటమే చూసాము. కాని దేవుని గ్రంథములో ఆయన వ్రాయించిన మాటలలో 'బయాలజీ' ఉంది. బైబిల్ అంటే ఏమనుకున్నారు? అందులోనూ ఒక పురుగును గూర్చి దేవుడు మాట్లాడుతున్నాడేమిటి అనుకుంటున్నారా? మన ఆలోచనా విధానమంతా లోకరీతిన ఉండటం వల్ల, దేవుని సంగతులు మనకు ఒక పట్టాన అర్థం కావు. దేవుడు ఒక గొంగళి పురుగును ఉపమానముగా తీసుకుని, నీ వర్తకులు లెక్కకు ఆకాశ నక్షత్రములకంటే ఎక్కువగా ఉన్నను గొంగళి పురుగు వచ్చి, అంతయు నాకివేసి యెగిరిపోయెనని పలుకుచున్నాడు. గొంగళి పురుగు ప్రాకిపోయెను కాదు, యెగిరిపోయెను. తరువాతి వచనములో, నీవు ఏర్పరచిన శూరులు మిడుతలంత విస్తారముగా ఉన్నను, నీ సైనికులు చలి కాలమందు కంచెలలో దిగిన గొంగళి పురుగులవలెనున్నారు. ఎండ కాయగా అవి యెగిరిపోవును, అవి ఎక్కడ వాలినది ఎవరికిని తెలియదు. చలి కాలమందు గొంగళి పురుగులు దండులు దండులుగా దిగిపోయాయి. ఎండకాసినప్పుడు, అనగా కాలము మారిన తరువాత అవి ఏమయ్యాయి? ప్రాకుకుంటూ వెళ్ళలేదు. అవి చనిపోయి నేల రాలిపోలేదు. అవి ఎగిరిపోయెను అంటున్నాడు.

ఇప్పుడు ఈ రహస్యాన్ని మనము ఛేదించాలి. మనిషి శవముగా మారినప్పుడు, మారిన శవము ఒకవేళ బ్రతుకుందా? ఒకవేళ బ్రతికితే ఎలా బ్రతుకుతుందనేది అప్పుడే మనకు అర్థమవుతుంది. ప్రపంచంలో ఈ ప్రశ్నలకు సమాధానాలు ఎక్కడా ఉండవు. మనిషి మరణించి శవముగా మారిపోతే ఈ ప్రపంచం దగ్గర ఉన్న జవాబు ఏమిటి చెప్పండి. ఒక మనిషి శవముగా మారిపోతే వారు చెప్పే మాటలు ఏమిటో చెప్పండి? ఈ విషయములో వారి దగ్గర ఉన్న జ్ఞానమేమిటి చెప్పండి? ఏ ప్రాంతమునకు వెళ్ళినా మనకు సమాధానములు దొరకవు. అమెరికా చాలా అభివృద్ధి చెందిన దేశం అనుకుంటాము కదా. వారి దగ్గరకు వెళ్ళి మనిషి ఒక శవముగా మారిపోతే, అనగా దేహమును ఆత్మ విడిచి వెళ్ళిపోతే, ఆ తరువాత ఏమి జరుగుతుంది అని అడగండి. వారు ఏమి చెబుతారు? ఒక ఐస్ బాక్స్ తెచ్చుకోండి. ఆ తరువాత బంధువులందరిని పిలవండి. దూరప్రాంతాలలో ఉన్నవారు వచ్చే వరకు శవమును భద్రముగా ఉంచండి. అందరూ శవమును కడసారి చూసేవరకు భద్రపరచండి. ఆ తరువాత మీ ఇష్టమొచ్చినట్టు చేసుకోండి. ఆ శవమును కాల్చుకుంటారో, పాతిపెట్టుకుంటారో మీ ఇష్టం. అభివృద్ధి చెందిన దేశము కూడా ఇదే సమాధానమా! పోనీ ఇండియాలో ఉన్న వారిని అడగండి. చాలామంది విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, మేధావులందరిని అడగండి. మనిషి మరణించిన తరువాత ఏమి జరుగుతుంది? మనిషి బ్రతికి ఉన్నప్పుడు కావలసినవాటిని అన్నింటినీ చెబుతున్నారు, బావుంది. అది చాలా సులభం, మరియు అది చాలా చిన్న విషయం. టి.వి.లలో, వార్తాపత్రికలలో ఈ బ్రతుకు ఉన్నంతవరకు శరీరానికి సంబంధించిన మాటలనే చెబుతున్నారు. ఎలాంటి వస్తువులు వాడాలి? ఎలాంటి దుస్తులు వేసుకోవాలి? ఎలాంటి తిండి తినాలి? ఎలాంటి చదువు చదవాలి? ఎలాంటి ఉద్యోగం చేయాలి? ఇదేకదండి. మరి మనిషి చనిపోయిన తరువాత ప్రతి ఒక్కరూ ఎందుకు నిశ్శబ్ధతలోనికి వెళ్ళిపోతున్నారు?

ఉదాహరణకు, ఇటీవల 'అబ్దుల్ కలామ్' గారు చనిపోయారు. ఈయన మన దేశము గర్వించదగినటువంటి వ్యక్తి. ఈయన బ్రతికి ఉన్నప్పుడు ఈయనకు భారతదేశ రాష్ట్రపతి పదవి ఇచ్చారు. ఈయనను గూర్చి ఎన్నో పొగిడారు. ఇప్పుడు ఈయన చనిపోయారు. ఈయన చనిపోయిన తరువాత 'అబ్దుల్ కలామ్' గారు ఎక్కడికి వెళ్ళారు? మరణించిన తరువాత ఈయన ఇప్పుడు ఫలాన చోట ఉన్నారు అని ఎవ్వరూ చెప్పలేకపోతున్నారు. ఈ 'మిసైల్‌మేన్' ఎక్కడున్నారో నాసా శాస్త్రవేత్తలు అంతరిక్షము లోనికి ఉపగ్రహాలను పంపించి, ఆయన ఆత్మను కనిపెట్టి మనకు చూపించవచ్చు కదా! 'అబ్దుల్ కలామ్' గారు చనిపోయిన తరువాత ఫలానా ప్రదేశములో ఉన్నారని అందరికీ టి.విలలో, మీడియాలో చెప్పవచ్చు కదా! కేవలం ఇక్కడ మిగిలిపోయిన 'అబ్దుల్ కలామ్' గారి శవాన్ని మాత్రమే చూపిస్తున్నారు. జాతీయ జెండాను ఆయన శవానికి చుట్టి, ప్రధానమంత్రి మొదలుకొని మంత్రులు, పెద్ద పెద్ద ప్రముఖులందరూ ఆ శవము దగ్గరకు వెళ్ళి నిశ్శబ్దాన్ని పాటించారు. ఆ తరువాత ఆ శవాన్ని ఖననం చేశారు. ఇంతకీ ఈయన ఏమైపోయాడు? అప్పటివరకు మన మధ్యనే ఉన్న 'అబ్దుల్ కలామ్' గారు, 84 సంవత్సరాలు జీవించిన ఆ వ్యక్తి, అకస్మాత్తుగా ఏమైపోయారు? చివరకు ఈ లోకములో ఆయనకు మిగిలినవి పత్రికలో వ్రాతలేనా? అందరినోట పొగడ్తలేనా? ఇంతకీ ఆయన ఎక్కడ ఉన్నారు? ఆయన ఆత్మకు ఏమైంది? ప్రపంచవ్యాప్తంగా ఎవరైనా చెప్పారా?

భారతదేశంలో ఉన్నవారు ఒకవేళ చెప్పలేకపోతే, అభివృద్ధి చెందిన దేశాలు ఎన్నో ఉన్నాయి. అక్కడికి వెళ్ళి అడగండి. రష్యా, జపాన్, చైనా, కొరియా, ఏ దేశములోనివారూ ఈ నా ప్రశ్నకు సమాధానమును చెప్పలేరు. మనిషి బ్రతికియున్నంత కాలము మట్టుకే అందరూ మాట్లాడతారు. ఏది ఏమైనా, మనిషి దేవుడిచ్చిన ఆయుష్షు ప్రకారం భూమి మీద బ్రతకవలసిందే. అభివృద్ధి చెందినవాడైనా, ఆది మానవుడైనా దేవుడిచ్చిన కాలము మేరకు ఇక్కడ బ్రతకాలి. ఒక రకంగా చెప్పాలంటే, ఆది మానవుడే భూమిపై ఎక్కువ కాలము బ్రతికాడు. ఎంతకాలం బ్రతికాడో తెలుసా? తొమ్మిది వందల ముప్ఫై సంవత్సరాలు బ్రతికాడు. ఆ తరంలో పుట్టిన చాలామంది వ్యక్తులు తొమ్మిది వందల సంవత్సరాలు పైబడి బ్రతికారు. మరి ఇప్పుడో? యాభై సంవత్సరాలు వచ్చేసరికి నోటిలోని పళ్ళు అన్నీ ఊడిపోతున్నాయి. డెంటిస్ట్ దగ్గరకు వెళ్ళి మొత్తం సెట్ వేయించుకుంటున్నారు. డబ్భై సంవత్సరాలు వచ్చేసరికి వీలునామాలు వ్రాసేస్తున్నారు. అందరినీ కడసారి చూసేస్తున్నారు. తీర్థయాత్రలు చేసేస్తున్నారు. వారి పేరున ఏమీ ఉంచుకోడం లేదు. ఎందుకంటే వారి ఎప్పుడు ఆత్మ వెళ్ళిపోతుందో వారికి తెలియదు. మనిషి లోపల ఉండే రక్తయంత్రం (గుండె) 'లబ్‌డబ్ లబ్‌డబ్' అని కొట్టుకోవడం ఆగిపోయిందంటే అంతే సంగతులు!

మనిషి బ్రతికి ఉన్నంతవరకు అన్నింటినీ మాట్లాడే ఈ ప్రపంచం, అదే మనిషి చనిపోయిన తరువాత ఎందుకు మాట్లాడటం లేదు? అంటే, ఈ సమాజము దగ్గర, లోకము దగ్గర, అనగా ఈ మనుష్యుల దగ్గర దీనికి సంబంధించిన వివరాలు లేవు. అక్కడే బైబిల్ ప్రారంభమయింది. ఇప్పుడు మరణించిన తరువాత మనిషికి ఏమి జరుగుతుందో నేను చెబుతాను. ప్రపంచంలో ఎన్నో గ్రంథాలయాలలో విస్తారమైన పుస్తకాలు ఎన్నెన్నో ఉన్నా దీనిని గూర్చి ఎందులోనూ ఉండదు. ప్రపంచంలో ఉన్న శాస్త్రాలలో భూమిని గూర్చి, చెట్టును గూర్చి, ఆకును గూర్చి, పెట్రోలును గూర్చి, ఖనిజాలను గూర్చి, అన్నింటిని గూర్చి ఉంటుంది. కాని మనిషి మరణిస్తే ఏమి జరుగుతుందో, ఆత్మ ఎక్కడికి వెళుతుందో, ఆ ఆత్మకు జరిగే పరిస్థితులు ఏమిటో అనేది ఎక్కడా ఉండదు. అందుకే దేవుడు ప్రకృతిలో ఒక మంచి ఉదాహరణ ద్వారా చెప్పాడు. ఇంతకుమునుపు మీరు చదివిన మాట అదే! ఏమిటో తెలుసా? గొంగళి పురుగు వచ్చి అంతా నాకి వేసి ఎగిరిపోయెను. గొంగళి పురుగులు మిడుతలంత విస్తారముగా ఉన్నాయి. చలికాలమందు దిగిపోయాయి. ఎండకాయగా అవన్ని ఎగిరిపోయెను. పురుగులు ఎగిరిపోయాయి అంటే ఏదో మ్యాజిక్ జరిగింది. ఎండకాయగా ఈ పురుగులన్నీ ఎందుకు ప్రాకుతూ వెళ్ళడం లేదని ఆలోచిస్తే, గొంగళి పురుగు ప్రాకుకుంటూ దాని తిండినంతా తినివేసిన తరువాత ఒక స్థిరమైన ప్రదేశానికి వెళ్ళి, ఒక వ్రేలాడేటటువంటి గూడు కట్టుకుని అందులోనికి వెళ్ళిపోతుంది. ఇక అక్కడ నుండి కదలదు. దాని లోపల ఉన్న శరీరమంతా మారిపోతుంది. దానికి పైన ఉన్న తొడుగు అంతా వ్యర్థమైనట్టుగా కనిపిస్తుంది. అదే గొంగళి పురుగు యొక్క రూపాంతరం. అలా రూపాంతరాన్ని పొందుతూ, దాని చర్మాన్ని విడిచిపెట్టి వచ్చేస్తుంది. అప్పటివరకు దానికి ఉన్న పైరూపమును విడిచిపెట్టి మరొక రూపములో బయటపడుతుంది. ఇప్పుడు దానిలోనుంచి అసలుసిసలైన గొంగళి పురుగు యొక్క రెండవ శరీరము బయటకు వస్తుంది. గొంగళి పురుగుల దండు చలికాలములో దిగి, వేసవికాలములో ఎగిరిపోయెను. ఎలా ఎగిరిపోయిందో ఆలోచించండి. గొంగళి పురుగు తన ప్రాకే ఆకారములోనుండి మార్పు చెందుతోంది. తాను కట్టుకున్న గూడులోనుంచి బయటకి మరల గొంగళి పురుగులాగే రావడంలేదు. సీతాకోకచిలుకలా వచ్చింది. ప్రాకే పురుగు రెక్కలతో ఎగిరే సీతాకోక చిలుకగా మారి, ఎగిరిపోతుంది. గొంగళి పురుగు ఆకారంలో ఉన్నప్పుడు మనలను విడిచి వెళ్ళమంటే వెళ్ళలేదు. మనము దానిని బలవంతముగా తోలివేయవలసివచ్చింది, చంపేయవలసి వచ్చింది. కాని ఇప్పుడు అదే గొంగళి పురుగు రూపాంతరము చెందిన తరువాత దానిని పట్టుకుందామంటే అది మనకు దొరకదు. చూసారా! గొంగళి పురుగు రూపాంతరము చెంది మరొక గొంగళిపురుగుగా మారడంలేదు. పూర్తిగా దాని జీవితమే మారిపోయింది. దానికి ఇప్పుడు ఎగిరిపోయే అవకాశము వచ్చింది. దానినే సీతాకోకచిలుక అన్నారు.

ఇప్పుడు చదవండి. **నహూము 3:16, 17** "గొంగళి పురుగు వచ్చి అంతయు నాకివేసి", ఎందుకంటే అది రూపాంతరము చెందడానికి ముందు, దాని కడుపు నిండా అది పూర్తిగా తినేయాలి. అది పూర్తిగా తన కడుపును నింపుకోవాలి. అది ఆకలితో ఉండకూడదు. దానికి కనిపించిన ఆకులను అది తినేస్తుంది. గొంగళి పురుగు వచ్చి

అంతయు నాకివేసిన తరువాత ఒక గూడు లోనికి రూపాంతరము చెందడానికి వెళ్ళిపోయింది. దాని కాళ్లు, చేతులు, చర్మము, పైనున్న రూపమంతా విడిచిపెట్టడానికి, మరొక క్రొత్త రూపాన్ని సంతరించుకోవడానికి ఒక గూడులోనికి వెళ్ళిపోయింది. ఆ తరువాత బయటకు సీతాకోకచిలుకలా వచ్చింది. దేవుడు గొంగళి పురుగు వచ్చి అంతయు నాకివేసి ఎగిరిపోయెను అన్నాడు. ఇప్పుడు చెప్పండి. గొంగళి పురుగు ఎగురుతుందా? ఎగురుతుంది. ఎలా ఎగురుతుంది. దేవుడు వ్రాయించిన మాట ప్రకారం, ప్రకృతిలో జరుగుచున్న దాని ప్రకారం, గొంగళిపురుగు రూపాంతరం చెందుచున్నది. అది రూపాంతరము చెంది ఒకే బ్రతుకులో రెండు రూపాలను కలిగి ఉంటుంది. ఒక రూపము గొంగళి పురుగుగా ప్రాకే జీవితమయితే, మరొక రూపము హాయిగా గాలిలో ఎగిరే జీవితం!

ఇంతకీ దేవుడు దీనిని ఎందుకు వ్రాయించాడు? దైవ గ్రంథమంటే మత సంబంధమైన మాటలుండాలిగా! ప్రొద్దున్నే లేవాలి, ఫలానా పదార్థాన్ని తినాలి, ఫలాన వస్తువును ముట్టుకోకూడదు, ఫలాన కాలములో దేవునికి పండుగలు చేయాలి, ఫలాన రోజున దేవుని దర్శించుకోవాలి, దేవునికి ఇంత చందా ఇవ్వాలి అని... ఇలాంటివి దేవుని గ్రంథమునందు ఉండాలిగా అనుకుంటున్నారా? బైబిల్‌లో ఇప్పుడు మనకు కనిపిస్తున్నదేమిటో చూసారా? పురుగులు ఎగిరిపోవడం, మరొక బ్రతుకు, రూపాంతరాలు,... అవునండి. బైబిల్ అంటే మహాజ్ఞానం. బైబిల్ అంటే మతం కాదు. బైబిల్ అంటే మిమ్మును ఎక్కడికో ఒక ఆచారము లోనికి తీసుకొని వెళ్ళిపోయేది కాదు. మిమ్మును బలవంతముగా తన మార్గములో ముంచేసేది కాదు. మీ బ్రతుకు ముగింపబడిన తరువాత ఏమి జరుగుతుందో మీకు తెలియజేసేది. అది కూడా ఒక ఆధారముతో, ఒక నిరూపణతో తెలియజేస్తుంది. మీ దగ్గర మీ చుట్టూ ఉన్న ప్రదేశాలలో గొంగళిపురుగులు ఎగురుతున్నాయి. గొంగళి పురుగులు, సీతాకోకచిలుకగా మారుతున్నాయి. ఇప్పుడు వాటికీ మనకూ సంబంధం ఏమిటి? గొంగళి పురుగుకూ మనిషి శవానికి మధ్య పోలిక ఏమిటి? ఈ సంబంధాన్ని తెలియచెప్పడానికి దేవుడు ఒక సందర్భాన్ని వివరిస్తున్నాడు. యూదుల కాలములో సద్దూకయ్యులు అనేటువంటి ఒక తెగ ఉండేది. యేసుక్రీస్తువారు భూమిమీదకు వచ్చినప్పుడు ఈ సద్దూకయ్యులు, మనిషి మరణిస్తే ఇక అక్కడితో వారి జీవితము ఆగిపోతుందని విశ్వసించేవారు. అయితే యేసుక్రీస్తు భూమిమీదకి వచ్చిన తరువాత మనిషి బ్రతుకు శవముతో ఆగిపోయేదికాదు. మరణముతో ముగింపబడేదికాదు. ఆ తరువాత కూడా మనిషి బ్రతుకు కొనసాగింపబడుతుంది అని చెప్పారు. ఆనాడు ఈ యేసుకు ఆ సద్దూకయ్యులు ఎదురుపడ్డారు. ఒక ఉదాహరణ ద్వారా యేసుక్రీస్తును ఈ విషయములో చిక్కుల్లో పెట్టాలని, యేసుక్రీస్తు నోటిద్వారానే మనిషి మరల బ్రతకడని, పునరుత్థానము లేదని, మనిషికి మరణిస్తే మరో బ్రతుకులేదని ఒప్పించడానికి చూశారు. అప్పుడేమి జరిగిందో ఈ సందర్భములో చూడండి.

**లూకా 20 : 27** పునరుత్థానము లేదని చెప్పెడి సద్దూకయ్యులు కొందరు యేసుక్రీస్తు యొద్దకు వచ్చి ఆయనను ఇట్లడిగిరి. వారి వాదన ప్రకారము, మనిషికి పునరుత్థానము లేదు. గొంగళిపురుగు చచ్చి వేరొక రూపములోనికి వస్తే వచ్చింది కానీ, దానికీ మనిషికీ ఎలాంటి సంబంధమూ లేదు. మనిషి మరణిస్తే అక్కడితో మనిషి జీవితము ఆగిపోతుందని చెప్పేవారే సద్దూకయ్యులు. వీరు యేసుక్రీస్తుతో, బోధకుడా! నీవు మరణిస్తే మరల బ్రతుకు ఉందని చెప్పడానికి వచ్చిన దేవుని కుమారుడనని ప్రకటించుకుంటున్నావు కనుక మేము నిన్ను ఒక ప్రశ్న అడుగుతాము అంటున్నారు. బోధకుడా, భార్య బ్రతికియుండగా ఒకడు సంతానము లేక చనిపోయినయెడల, అతని సహోదరుడతని భార్యను పెండ్లిచేసికొని తన సహోదరునికి సంతానము కలుగజేయవలెనని మోషే మనకు వ్రాసియిచ్చెను. ధర్మశాస్త్రములో వ్రాయబడియున్న ప్రకారము, సంతానము లేకుండా భర్త చనిపోతే సహోదరుడు వివాహము చేసుకోవచ్చు అనే సంగతిని ఉదాహరణగా తీసుకుని, యేడుగురు సహోదరులు ఉండిరి, మొదటివాడు ఒక స్త్రీని పెండ్లిచేసుకొని సంతానము లేక చనిపోయెను. రెండవవాడు అలాగే చనిపోయెను, మూడవ వాడు అలాగే చనిపోయెను, ఆ ప్రకారమే ఏడుగురును చనిపోయిరి. అటు తరువాత ఆ స్త్రీయును చనిపోయెను. ఆమెకు సంతానము లేక పోవుటవల్ల యేడుగురు సహోదరులు ఆమెను వివాహము చేసుకుని, వారందరూ మరణించారు– అనుకోమంటున్నారు యేసుక్రీస్తుని. అలాగైతే పునరుత్థానము ఉందని చెప్పినప్పుడు, ఒకవేళ మరణము తరువాత మనిషికి మరొక లోకములో మరొక

బ్రతుకు ఉంటే, ఆమె ఆ యేడుగురిలో ఎవనికి భార్యగా ఉండును? యేడుగురికీ ఆమె భార్యగా ఉంటుంది కదా అనిరి. యేసుక్రీస్తును చిక్కుల్లో పెట్టాలని సద్దూకయ్యులు ఈ ప్రశ్నను ఆయనకు సంధించారు. మరణించిన తరువాత ఆ స్త్రీ, ఏడుగురికిని భార్యగా ఉంటుందా? అని వ్యంగ్యముగా ఈ ప్రశ్న అడిగారు. అప్పుడు యేసుక్రీస్తు ఇచ్చే సమాధానము ఏమిటో చూడండి. ఈ ప్రశ్నకు ఈయన తప్ప ఇక ఎవ్వరూ సరైన సమాధానమును ఇవ్వలేరు. అందుకు యేసు, ఈ లోకపు జనులు పెండ్లి చేసుకొందురు, పెండ్లికియ్యబడుదురు. కాని పరమును, మృతుల పునరుత్థానమును పొందుటకు యోగ్యులని యెంచబడినవారు పెండ్లి చేసుకొనరు, పెండ్లికియ్యబడరు. ఇది మొట్టమొదటి కండీషన్. గొంగళి పురుగు గూటిలోనికి వెళ్ళి, మళ్ళీ గొంగళి పురుగుగానే బయటకు రాదు. ఈ స్త్రీ చనిపోయిన తరువాత మరల స్త్రీగానే ఉండదు. ఆ ఏడుగురు పురుషులూ చనిపోయిన తరువాత మరల పురుషులుగానే ఉండరు. మరి వారు ఎలా ఉంటారు? వారు ఒకవేళ పునరుత్థానము పొందడానికి యోగ్యులు అని ఎంచబడితే, వారు తిరిగి లేచిన తరువాత దేవతలవలె ఉందురు. అంటే వారికి స్త్రీ ఆకారము గాని, పురుష ఆకారము గాని, అసలు ఈ శరీరాకారమే ఉండదు. అసలు ఈ శరీరమే మరల వస్తే, పునరుత్థానము ఇంకెందుకు చెప్పండి?

'ఇంత బ్రతుకూ బ్రతికి ఇంటి వెనక చచ్చినట్లు' అనే సామెత ప్రకారము అవుతుంది. డబ్బై యేళ్ళు ఈ భూమిమీద బ్రతికి మరణించిన తరువాత కూడా మళ్ళీ ఇదే బ్రతుకును మనము సంతరించుకుంటే ఉపయోగము ఉందా? పదవ తరగతి అంతా ఒక విద్యార్థి కష్టపడి చదివి, పరీక్షలు వ్రాసి వందకు వంద మార్కులు తెచ్చుకుంటే, ఉపాధ్యాయుడు వచ్చి మరల పదవ తరగతిలో అక్కడే ఆ విద్యార్థిని కూర్చోమన్నాడనుకోండి, ఎలా ఉంటుంది? ఒక విద్యార్థి సంవత్సరమంతా కష్టపడి చదివింది ఎందుకనుకుంటున్నారు? ఇంటర్మీడియట్ తరగతికి వెళ్ళడానికే కదా. పదవ తరగతి పరీక్షలు వ్రాసిన తరువాత పదికి పది పాయింట్స్ తెచ్చుకున్న తరువాత మరల ఒకటవ తరగతిలో కూర్చోపెట్టి మరల మొదటి పాఠమే చెబుతున్నారు అనుకోండి. ఆ విద్యార్థి పదికి పది ఎందుకు సాధించాడో అర్థంకాదు. ఎం.బి.బి.ఎస్. చదివిన తరువాత స్టెతస్కోప్ వేసుకుని వెళ్ళి హాస్పిటల్‌లో వైద్యం చేయాలి. అంతేకాని మరల మొదటి సంవత్సరం చదవడానికి మెడికల్ కళాశాలకు వెళతారా? వెళ్ళరు. మనిషి మరణించిన తరువాత మరల ఈ భూమి మీద ఈ బ్రతుకును మొదలుపెట్టడు. యేసుక్రీస్తుకు ఆనాటి సద్దుకయ్యుల ప్రశ్న అదే! పునరుత్థానములో ఎవరు ఎవరికి భార్యగా, ఎవరు ఎవరికి భర్తగా ఉంటారు? అప్పుడు మహాజ్ఞానియైన యేసుక్రీస్తు ఏమి చెబుతున్నారో చూడండి. పునరుత్థానమందు ఎవ్వరూ పెండ్లిచేసుకొనరు, పెండ్లికియ్యబడరు. ఎందుకంటే వారు పునరుత్థానములో పాలివారైయుండి దేవదూతలతో సమానులును, దేవుని కుమారులునై యుందురు. గనుక వారు ఇక చావనేరరు. అంటే ఒకవేళ మీరు పునరుత్థానము గనుక పొందితే, మరణించిన తరువాత మరొక బ్రతుకులోనికి వెళితే, ఆ బ్రతుకులో ఇక మీకు మరల మరణముండదు. ఆ బ్రతుకు మిమ్మును నిత్యము బ్రతికించేదిగా ఉంటుంది.

అందుకే మీ కళ్ళ యెదుట దేవుడు ఒక మంచి ఉదాహరణను పెట్టాడు. గొంగళి పురుగు సీతాకోకచిలుకగా మార్పు చెందుతోంది. దాని జీవితములో, దాని మొదటి దశ వేరు. గుడ్డుగా, ఆ తరువాత లార్వాగా, ఆ తరువాత గొంగళి పురుగుగా దాని బ్రతుకంతా వేరు. అప్పుడు గనుక అది తన జీవితాన్ని కాపాడుకొని, తన కడుపునిండా తిని, ఒక గూడును కట్టుకొని ఉంటే, అప్పుడు దానికి దేవుడు ఇవ్వబోయే జీవితము ఏమిటో తెలుసా? హాయిగా ఎగిరే జీవితం. అలాగే మనిషి కూడా దీనిని చూసి పాఠము నేర్చుకోగలిగితే, మనిషి మరణించిన తరువాత ఆ మనిషికి దేవుడు ఇవ్వబోయే జీవితము ఏమిటో తెలుసా? నిత్యజీవము. అందులో మరణము లేదు. ప్రపంచంలో దీనిని ఎవరు చెప్పారు? ఎవరు చనిపోయినా బాధపడ్డారు, కన్నీరు కార్చారు, వ్రాతలు వ్రాసారు, వారి పేరిట విగ్రహాలు నెలకొల్పారు, ఆ తరువాత కొంత కాలానికి మరచిపోయారు. కాని ఎవరిని గూర్చియైనా, ఫలాన వ్యక్తి ఫలానచోట ఉన్నాడు. ఫలాన వ్యక్తి పునరుత్థానము పొందాడని ఆధారాలతో సత్యమును చెప్పగలిగారా? ఎవ్వరూ చెప్పలేదు, చెప్పలేరు. ఇది మహాజ్ఞానపు సంగతి. అందుకే యేసుక్రీస్తు దీనిని గూర్చి పలికాడు. మరణించిన తరువాత మనుష్యులు ఎలా ఉంటారంటే, వారు దేవదూతలను పోలినవారై ఉంటారు. వారు ఇక చావనేరరు. ఇప్పుడు మరల పరలోకమందున్న తండ్రి ప్రవక్తయైన యెహెజ్కేలు ద్వారా పలికిన మాటలను మనము ఆలోచిద్దాం. అసలు శవము ఎలా బ్రతుకుతుంది?

శవము మరల ఎలా రూపాన్ని తెచ్చుకొంటుందండి. ఒక శవానికి తిరిగి బ్రతికే సామర్థ్యము ఉందా? రోడ్డు మీద ఒకాయన చనిపోతున్నాడు. ఆసుపత్రిలో ఒకాయన చనిపోతున్నాడు. ఇలా ప్రపంచములో ఎందరో శవాలుగా మారుతుంటే, కోట్ల కొలదిగా మన ముందు ఈ శవాలు పడి ఉంటే, ఇవన్నీ బ్రతుకుతాయా? ఈ శవాలకు తిరిగి బ్రతికే అవకాశము ఉందా? అందుకే మనిషికి ఈ రహస్యాన్ని ఛేదించడానికి, ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడానికి ప్రవక్తయైన యెహెజ్కేలును దేవుడు ఎన్నుకున్నాడు. ఆ యెహెజ్కేలుకు ఒక దర్శనమును చూపిస్తున్నాడు. దానిని అంతా మన కొరకు వ్రాయించాడు. అది ఈ రోజు మనలను చదవమన్నాడు. దాని ద్వారా పాఠమును నేర్చుకోమన్నాడు.

**యెహెజ్కేలు 37 : 1–** "యెహోవా హస్తము నా మీదికి వచ్చెను. నేను ఆత్మవశుడనై యుండగా యెహోవా నన్ను తోడుకొని పోయి యెముకలతో నిండిన ఒక లోయలో నన్ను దింపెను". యెహెజ్కేలు ప్రవక్త ఆత్మవశుడై, పరిశుద్ధాత్మ ప్రేరణతో ఉన్నప్పుడు పరలోకమందున్న తండ్రి ఈ సమాజానికి ఒక ముఖ్యమైన విషయాన్ని తన ద్వారా చెప్పించడానికి ఆయనను ఎక్కడకు తీసుకుని వెళ్ళాడో తెలుసా? ఎముకలతో నిండియున్న ఒక లోయలో దించేసాడు. ఆ లోయలో ఎండిన ఎముకలున్నాయి. ఎవరి ఎముకలు? జంతువుల ఎముకలు కాదు, జీవుల మృత కళేబరాలు కాదు. మనుష్యుల ఎముకలు, మానవ కళేబరాలు ఉన్న ఒక లోయలోనికి ఈ ప్రవక్తను దేవుడు తీసుకొని వెళ్ళాడు. ఈ ప్రపంచములో ఏ పుస్తకంలోనూ లేని ఒక గొప్ప సంగతిని దేవుడు చెప్పబోవుచున్నాడు. అందుకే ప్రవక్తను ఎండిపోయిన ఎముకలు ఉన్న ఒక లోయ లోనికి దించాడు.

**యెహెజ్కేలు 37 : 2, 3** యెముకలు అనేకములు ఆ లోయలో కనబడెను. అవి కేవలము ఎండిపోయినవి. ఆయన – నరపుత్రుడా, యెండిపోయిన ఈ యెముకలు బ్రతుకగలవా? అని దేవుడు ఆ ప్రవక్తను అడుగుచున్నాడు. ఈ రోజు మన పాఠములో ఉన్న ప్రశ్న అదే! గొంగళిపురుగు ఎగురుతుందా? శవము బ్రతుకుతుందా? ఇప్పటివరకు మీరు చదివిన దానిని బట్టి, గొంగళి పురుగు ఎగురుతుందని ఒప్పుకున్నారు. సీతాకోక చిలుకగా మారిపోయి ఎగురుతుంది. దానిని దేవుడు వ్రాయించాడు, మీరు చదివారు. ఈ రోజు మనము ప్రకృతిలో కూడా దానిని చూస్తున్నాము. ఇక శవము దగ్గరకు వస్తే, దేవుడే ఈ ప్రశ్న అడుగుతున్నాడు. ఇలాంటి ప్రశ్నలు మనకు రావుగాక రావు. మనకు ఎలాంటి సందేహాలు వస్తాయో తెలుసా? దేవుడు ఉన్నాడా? ఉంటే కనిపించమను? ఇలాంటి ప్రశ్నలే వస్తాయి. ఎందుకంటే మనము ఏదో ఒక విధముగా దేవుని నుంచి తప్పించుకోవాలని చూస్తాము. ఒక పోలీస్ వారి నుండి దొంగలు తప్పించుకున్నట్టుగా తప్పించుకుంటున్నాము. ట్రాఫిక్ పోలీస్ ఈ వీధిలో వాహనాలకు కేసులు వ్రాస్తున్నారనుకోండి. ప్రక్క వీధి ఏదైనా ఉందేమో అని చూస్తారు. ఎందుకు? ఉండవలసిన కాగితాలలో ఏదో ఒకటి తక్కువ వస్తుంది. లైసెన్స్‌గాని, ఇన్సూరెన్స్ గాని, ఏదో ఒకటి! దేవుని నుంచి కూడా మనిషి ఇలాగే తప్పించుకుంటున్నాడు. దేవుడనే ఆ శక్తి దగ్గరకు మనిషిరాడు. ఏదో పైకి మాత్రం భక్తిని చూపిస్తాడు. ప్రకృతిలో ఒక చిన్న వస్తువు అంటే మనిషికి ప్రేమ. చిన్న అధికారమంటే మనిషి ప్రేమ. కాని దేవుడంటే ఎందుకోనండి ఈ మనిషికి ఎప్పుడూ ద్వేషమే. కాని పైకి మాత్రం ఏదో భక్తి కలిగిన వాడుగా ఒక గంట లేదా రెండుగంటలు, ఒక రోజు లేదా రెండు రోజులు, మహా అయితే సంవత్సరములో ఒక పది రోజులు దేవునికి కేటాయించి, దేవుని దగ్గరకు వెళ్ళి వచ్చేస్తాడు. అదేనా ప్రేమంటే? అదేనా భక్తంటే? వారములో ఒకరోజు మీరు చూపించేదేనా భక్తి? సంవత్సరానికి పదిరోజులు మీరు చూపించేదేనా భక్తి? మీ బ్రతుకుకాలములో కొన్ని రోజులు మీరు దేవుని దర్శించుకోవడానికి మీరు వెళితే, మీరు చూపించేదేనా భక్తి? కానే కాదు. అది భక్తి కాదు. అది ఆరాధన కాదు. భార్యతో భర్త అలాగే ఉంటున్నాడా? భర్తలందరు భార్యలను సంవత్సరానికి ఒక్కసారే దర్శించుకుంటున్నారా? వారానికి ఒక రోజు మాత్రమే కాపురం చేస్తున్నారా? పిల్లలతో తలిదండ్రులు అలాగే ఉంటున్నారా? లేదండి. మరి వీరందరి కంటే దేవుడు గొప్పగా ఉండాలి కదా. దేవుడు వీరందరి కంటే ఉన్నతముగా ఉండాలి కదా. ప్రతి నిత్యము మీ ఆలోచనలలో దేవుడు ఉండాలి. దేవుడు మిమ్మును గూర్చి ఏమనుకుంటున్నాడో, ఏమి చెప్పాలనుకుంటున్నాడో, మీరు ఎలా బ్రతకాలనుంటున్నాడో, మీరు నిరంతరము ఆయనను అడగాలి. ఆయన మనసులో ఉన్న భావమును తెలుసుకోవాలి. మీరు ఎలాగూ అడగరు గనుక దేవుడే అడుగుతున్నాడు. ఆ ప్రవక్తను పంపించి దేవుడే అడుగుతున్నాడు. యెహెజ్కేలూ, నీవు ఎండిన ఎముకలను చూస్తున్నావు

కదా, ఈ ఎండిపోయిన ఎముకలు మరల బ్రతుకుతాయా? అని ప్రవక్తను అడుగగా అప్పుడు ఆయన ఏమంటున్నాడో చూడండి. 'ప్రభువా యెహోవా, అది నీకే తెలియుననని అని నేనంటిని'. ఆ రహస్యము దేవునికే తెలియాలి. ఎండిన ఎముకలు బ్రతుకగలవో లేదో ఈ ప్రపంచములో ఎవరు చెప్పారు? తల్లిదండ్రులు చెప్పలేదు. ఉపాధ్యాయులు చెప్పలేదు. వారు కేవలం చిన్న చిన్న విషయాలను మాత్రమే చెప్పారు. స్నేహితులు, బంధువులు, సహోదరులందరూ లోకసంబంధమైనవే చెప్పారు. కాని మనిషి ఒకవేళ శవముగా మారిపోతే, శరీరములోనున్న ఎముక ఎండిపోతే, అది బ్రతుకుతుందో లేదో ఎవరికి తెలుసు? అది ఎవ్వరూ చెప్పలేదు. అప్పటికి జీవగ్రంథమైన బైబిల్‌లో కూడా వ్రాయబడలేదు. అందుకే ప్రవక్త ఏమంటున్నాడో చూడండి. ప్రభువైన యెహోవా, దేవా, తండ్రీ, అది నీకే తెలియును అని ఆయనతో చెప్పాడు. అప్పుడు దేవుడు సమాధానమును ఇస్తున్నాడు చూడండి.

**యెహెజ్కేలు: 37 : 4, 5** "అందుకాయన ప్రవచనము ఎత్తి, ఎండిపోయిన ఎముకలతో ఇట్లనుము. ప్రభువైన యెహోవా సెలవిచ్చినదేమనగా – మీరు బ్రతుకునట్లు నేను మీ లోనికి జీవాత్మను రప్పించుచున్నాను". ఎండిన ఎముకలతో ప్రవక్త మాట్లాడాలి. అవి జీవచ్ఛవాలుగా పడిపోయి ఉన్నాయి. అవి ఒకప్పుడు బ్రతికినవే, ఒకప్పుడు మనిషి రూపములో ఉన్నవే, మనిషిగా బ్రతికినవే, లోకములో ఉన్నవే, లెక్కలలో ఉన్నవే కాని ఇప్పుడు శవాలుగా మారి ఎముకలుగా ఎండిపోయాయి. వాటితో నేను మాట్లాడి ఏమని చెప్పాలంటే, ఎండిన ఎముకలారా, దేవుని మాటలను ఆలకించండి. మీకు ప్రభువైన యెహోవా సెలవిచ్చినదేమనగా – మీరు బ్రతుకునట్లుగా దేవుడు మీలోనికి జీవాత్మను రప్పించుచున్నాడు. అదండీ రహస్యం. ఎండిన ఎముక బ్రతుకుతుంది. అనగా శవము బ్రతుకుతుంది. ఎప్పుడో తెలుసా? పరలోకమందున్న తండ్రి జీవాత్మను ఆ శవములోనికి రప్పిస్తే అది బ్రతకాలి. ఆయన జీవాత్మను ఎందులోనికి పంపిస్తే అది బ్రతుకును సంతరించుకోవాలి. ఎందుకంటే మన ఆది మానవుని దగ్గరకు ఒక్కసారి వెళ్ళండి. మనలను కన్న తాత ముత్తాతలను, చరిత్రలో మూలపురుషులను వెనక్కి దాటుకుంటూ మునుపటి కాలము లోనికి వెళితే, చివరకు మిగిలేది ఎవరు చెప్పండి? ఒక్క మనిషే! అతనిలోనుండే మొదటి స్త్రీ వచ్చింది. వారిద్దరిలోనుండి భూమిమీదకు పిల్లలు వచ్చారు. వారినుండే ఈ సమాజమంతా వచ్చింది. మనమూ వచ్చాము. ఆ మొదటి మనిషిని తయారుచేసేందుకు దేవుడు మట్టితో ఒక ఆకారాన్ని తయారుచేసి అందులో జీవాత్మను ఊదగా నరుడు జీవించేవాడుగా, నడిచేవాడుగా, ప్రాణము కలిగినవాడుగా మారిపోయాడు. అంటే మట్టి బొమ్మలోనికి దేవుడు జీవాత్మను ఊదితే ఆ మట్టి బొమ్మ బ్రతికేవాడుగా మారిపోతాడు. ఇప్పుడు లోయలోని ఎండిన ఎముకలలోనికి దేవుడు జీవాత్మను పంపిస్తే ఎముక బ్రతకదా చెప్పండి! గొంగళి పురుగు శవముగా మారిపోతే దేవుడు అందులోనికి ప్రాణాన్ని పంపిస్తున్నాడు. అప్పుడు అది సీతాకోకచిలుకగా బయటకు వస్తుంది. అంతకు ముందు అది గొంగళి పురుగుగా ఉన్న జీవితమును కలిగి, ఆ తరువాత ఒక చిన్న గూడు కట్టుకొని అందులోనికి వెళ్ళిపోయింది. అప్పటివరకు దాని ఆకారము వేరు. ఆ పాత ఆకారమును దేవుడు మారుస్తున్నాడు. దానిని రూపాంతరము చేస్తున్నాడు. అందుకే ఈ ప్రవక్తతో ఏమంటున్నాడో తెలుసా? నీవు వెళ్ళి ఆ ఎముకలతో ఇట్లనుము. మీలోనికి దేవుడు జీవాత్మను పంపిస్తాడు. అప్పుడు మీరు బ్రతుకుతారు అని చెప్పాలి. ఆ ఎముకలకు నరములనిచ్చి, మాంసమును పొదిగి, చర్మమును మీద కప్పెదను. మీలో జీవాత్మనుంచగా మీరు బ్రతుకుదురు, అప్పుడు నేను యెహోవానై యున్నానని మీరు తెలుసుకొందురు అంటున్నాడు దేవుడు.

పరలోకమందున్న తండ్రి అంటే ఎవరో తెలుసా? ఎండిపోయిన ఎముకలకు మరల జీవమును ఇచ్చేవాడు. శవాన్ని మరల తిరిగి లేపేవాడు. దేవుడంటే ఆయనే! చూసారా? దేవుడు అనే పదానికి నిర్వచనం మారిపోయింది. ఇప్పటివరకు మనకు తెలిసిన నిర్వచనమేమిటి? దేవుడు అనగానే, కష్టాలలో ఆయనను నమ్ముకోవాలి. ఆనందము వచ్చినపుడు ఏదో కొంచెము చిల్లర పైసలు ఇచ్చేయాలి. ఎప్పుడైనా దారిలో కనిపిస్తే ఒక వందనమో, నమస్కారమో చెప్పాలి. ఇవే కదా ఇప్పటి వరకు మనకు తెలిసిన నిర్వచనాలు. కాని ఇప్పుడు దేవునికి అసలుసిసలైన నిర్వచనము చూడండి. ఆయన చనిపోయిన శవాన్ని బ్రతికిస్తాడు. తన జీవాత్మను పంపి, శవమును సమాధి నుండి లేపి బ్రతికిస్తాడు. తిరిగి జీవాత్మగా రప్పిస్తాడు. ఆయన ఇప్పుడు మీకు ఎంత ఆదరణ కలిగే మాటలు చెప్పాడో చూడండి.

నిజంగా మీకు ఈ మాటలు అర్థమైతే, ఒక చక్కని ఆలోచన మీ మదిలో ఉండాలి. అదేమిటంటే, చనిపోతే నా బ్రతుకు ముగింపబడదని, ఇక నేను భయపడవలసిన అవసరత లేదని మీరు చాలా సంతోషించాలి. మరణముతో మీ బ్రతుకు ముగింపు కాదు. ఇక మీరు ఎందుకు భయపడాలి? మీకు ఇక మీకు మరణ భయమే లేదు. గొంగళి పురుగుకు మరణ భయం లేదు. ఒక పచ్చని ఆకు యొద్దకు వెళ్ళి దానినంతా ఎందుకు తినేస్తుందనుకుంటున్నారు? చనిపోతాననే భయంతో కాదు. దాని భవిష్యత్తు నిమిత్తం ఆ గొంగళికు ఒక ఆలోచన ఉంది. దాని భవిష్యత్తు మీద దానికొక నమ్మకం ఉంది. దాని కడుపు నిండా తిని, ఒక ప్రదేశమును చూసుకొని, ఒక గూడు కట్టుకుని, ఆ తరువాత రూపాంతరము చెందాలనే ఆలోచనతో, జీవితం మీద ఆశతో అది బ్రతుకుతుంది. ఒక చిన్న గొంగళి పురుగుకు ఉన్న ఈ కొద్దిపాటి జ్ఞానము ఈ రోజు మనిషికి లేదంటే మీరు నమ్మగలరా? అందుకేనేమో, మనిషికి ఒకవేళ ఈ బ్రతుకులో ఏదైనా చిన్న కష్టం ఎదురైతే ఆత్మహత్య చేసుకోవాలి అనుకుంటాడు. రైతు ఒకవేళ తన అప్పు తీర్చలేకపోతే వెళ్ళి ఆత్మహత్య చేసుకుంటున్నాడు. పదవ తరగతి ఫెయిల్ అయితే ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటున్నాడు. ఒక కుటుంబము కష్టాలలో ఉంటే కుటుంబమంతా విషము త్రాగి ఆత్మహత్య చేసుకుంటుంది. ఉద్యోగము సాధించలేకపోతే ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటున్నాడు. సినిమాలో అవకాశములు దొరకక కొందరు ఆత్మహత్య చేసుకొన్నారు. తమ ప్రేమను పెద్దలు అంగీకరించలేదని ప్రేమికులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఏమిటండీ ఇది? మరణించిన తరువాత బ్రతుకును గూర్చి ఏ మనిషికీ అర్థం కాలేదు. తమ జీవితాన్ని అర్థాంతరముగా ముగించుకుంటున్నారు. ఇప్పుడు మనము కలిగియున్న ఈ బ్రతుకు చాలా చిన్నది. మీరు నిజంగా దేవుని కొరకు బ్రతికి ఆయన ఇష్టాన్ని నెరవేర్చితే, మీరు ఆయన వారైతే, శవమైపోయిన మీలోనికి ఆయన జీవాత్మను పంపిస్తాడు.

**యెషయా 26 : 19** "మృతులైన నీవారు బ్రతుకుదురు. నావారి శవములు సజీవములగును". అంటే, ఈ భూమిపై బ్రతికి మరణించిన వారిలో అందరికీ తిరిగి నిత్యజీవమును పొందే అవకాశము లేదు. ఈ అవకాశము ఎవరిని మాత్రమే వరిస్తుందో దేవుడు చెప్పాడు. మరణించిన వారు తిరిగి పరలోకములో జీవమును పొందాలంటే, వారు దేవుని వారుగా బ్రతకాలి. అదే ఇక్కడ ఉన్న టాప్ సీక్రెట్. మామూలుగా ఎవరిష్టము ప్రకారం వారు బ్రతికినా, ఈ భూమిపై ఎలా బ్రతికినా, మరణించిన తరువాత తిరిగి దేవుడు నిత్యజీవముతో బ్రతికిస్తాడు అనుకుంటే, అందరూ బ్రతికేస్తారు. అసలు ఈ పుస్తకము అవసరత లేదు. దేవుడు తన మాటలు వ్రాయించవలసిన ఆవశ్యకత లేదు. దేవుని జ్ఞానమును తెలుసుకున్నా, తెలుసుకోలేకపోయినా చనిపోతాము, తిరిగి బ్రతుకుతాము. కానీ అలా జరగదు. తరగతిలో ఉన్న విద్యార్థులందరూ ఉత్తీర్ణులవ్వరు. తరగతిలో ఉన్న విద్యార్థులందరికి ఉద్యోగాలు రావు. విద్యార్థి బాగా చదివితేనే ఉద్యోగం వస్తుందనేది ఒక సూత్రం. కానీ విద్యార్థులందరూ చదవరు. మరణిస్తే మరొక బ్రతుకు ఉందన్నది నిజం, ఇప్పుడు అది మీకు తెలిసింది. కానీ, అందరూ మరొక బ్రతుకును పొందరు. అందరూ మరొక బ్రతుకు సంపాదించే అర్హత కలిగినవారుగా మరణించరు. వీరప్పన్‌లా కొందరు మరణిస్తారు. బిన్‌లాడెన్‌లా కొందరు మరణిస్తారు. ఆత్మహత్యలు చేసుకుని మరికొందరు మరణిస్తారు. జీవితంలో ఎదురైన చిన్న ప్రశ్న, జీవితంలో ఎదురైన చిన్న కష్టం, వాటిని భూతద్దంలో చూస్తే చాలా పెద్ద పెద్ద సమస్యలుగా కనిపిస్తాయి. కానీ, మరణించిన తరువాత పరిస్థితి ఏమిటి? ఆత్మహత్య చేసుకోవడం దేవుని దృష్టిలో చాలా పెద్ద తప్పు. ఆత్మహత్య చేసుకోకూడదు. దేవుని వాక్యము మీద అవగాహన, గ్రహింపు ఉంటే, ఏ ఒక్కరూ ఆత్మహత్యల వరకూ వెళ్ళరు. ఎదురైన సమస్య ఎంత పెద్దదైనా నిలబడి సాధించాలి. ఈ రోజు మన చుట్టూ ఉన్న సమాజం దుష్టులతో నిండిపోయిన సమాజం. ఎవరు మంచివారు చెప్పండి? ప్రతి ఒక్కరూ క్రూరమృగము లాంటివారే. ఎవ్వరూ మంచివారు కారు. ఈ సమాజం జనములున్న అరణ్యముగా మారిపోయింది. ఈ జనములు అరణ్యములో ఉన్న జంతువులతో సమానం. క్రూరమైన సింహము లాంటివాడు ఒకడు, ఏనుగు లాంటివాడు ఒకడు, గుర్రం లాంటివాడు ఒకడు, పిల్లిలాంటివాడు మరొకడు. జంతువులలో ఉన్న స్వభావాలన్నీ ఈ రోజు మనిషికి వచ్చేసాయి. దేవుని కుమారులుగా ఎవ్వరూ లేరు. అలాగని, నేనే కష్టాలు అనుభవిస్తున్నాను, నేనే అన్ని పరిస్థితులలో మనుష్యులచేత వేదనలు అనుభవిస్తున్నాను అనుకోవడానికి లేదండి. అందరికీ కష్టాలున్నాయి. సమాజములో అందరూ చెడ్డవారే అయినప్పుడు, మీరు మరణించవలసిన అవసరత

ఏముంది చెప్పండి? మన బ్రతుకును మనకు మనమే అర్ధాంతరంగా ముగించుకోవలసిన అవసరత లేదు. మనకు ఈ బ్రతుకు యొక్క అసలు సిసలైన సూత్రం తెలియాలి. మీరు మరణించిన తరువాత దేవుని వారుగా తిరిగి లేవాలి. అందుకే దేవుని కొరకు మీరు బ్రతకాలి. మీరు మరణించిన పిదప దేవుడున్న నిజమైన లోకాన్ని చేరాలి. నా తండ్రి చెంతకు వెళ్ళాలి. ఈ భూమి మీద మన బ్రతుకు చాలా సామాన్యమైనది, స్వల్పమైనది. దేవుడు, మృతులైన నా వారు బ్రతుకుదురు అంటున్నాడు. అందుకే నా వారి శవములన్నియు సజీవములగును అన్నాడు. ఇది నేర్పించడానికి, చూపించడానికి యేసుక్రీస్తు మరణించినపుడు దేవుడు ఏమి చేసాడో తెలుసా? సమాధిలో ఉన్న వారినందరిని ఒక్కసారిగా తిరిగి లేపాడు. ఆయన వారు ఎవరైతే ఉన్నారో వారందరికి ఒక్కసారి తిరిగి లేచే అవకాశము కల్పించాడు.

**మత్తయి 27 : 50** "యేసు మరల బిగ్గరగా కేక వేసి ప్రాణము విడిచెను. అప్పుడు దేవాలయపు తెర పైనుండి క్రింది వరకు రెండుగా చినిగెను. భూమి వణికెను. బండలు బద్దలాయెను. సమాధులు తెరవబడెను, నిద్రించిన అనేకమంది పరిశుద్ధుల శరీరములు లేచెను" అని వ్రాయబడింది. దేవుడు ఒక సూచనను చూపిస్తున్నాడు. భవిష్యత్తులో జరుగబోయే దానిని చూపిస్తున్నాడు. యేసుక్రీస్తు మరణించినప్పుడు ఏమి జరిగిందో తెలుసా? సమాధులు తెరవబడెను. భూమిమీద ఉన్న మనుష్యుల శవములు ఖచ్చితంగా సమాధి నుండి లేస్తాయి. ఆయన వారుగా బ్రతికి మరణిస్తే, ఖచ్చితంగా మీకు మరో బ్రతుకు ఉందని చూపించడానికి దేవుడు ఏమంటున్నాడో చూడండి. సమాధులు తెరువబడెను. నిద్రించిన అనేకుల పరిశుద్ధులు లేచెను. అంటే పరిశుద్ధులే లేస్తారా? అవును దేవుని కొరకు బ్రతికి, చనిపోయిన వారే లేస్తారు. అవును, ఏ గొంగళి పురుగు అయితే బ్రతుకు మీద ఆశపడి, తన బ్రతుకును కాపాడుకొని, తన శరీరాన్ని కాపాడుకుని, జాగ్రత్తగా గూడు కట్టుకుంటుందో, ఆ గొంగళి పురుగుకు మాత్రమే సీతాకోకచిలుకగా మారే అవకాశముంది. మన కాళ్ళ క్రింద పడి పచ్చడైపోయిన గొంగళి పురుగుకు సీతాకోకచిలుకగా మారే అవకాశం లేదు. ఏదైతే తన బ్రతుకును జాగ్రత్తగా కాపాడుకుంటుందో ఆ గొంగళిపురుగుకు మాత్రమే రెండవ బ్రతుకు ఉంది. అందుకే సమాధులు తెరువబడ్డాయి, నిద్రించిన పరిశుద్ధుల శరీరములు లేచెను. వారు సమాధులలో నుండి బయటికి వచ్చి, యేసుక్రీస్తు లేచిన తరువాత పరిశుద్ధ పట్టణములో ప్రవేశించి అనేకులకు  కనిపించారు. వారు ఎందుకు కనిపించారు? మీరు కూడా మావలె మీ జీవితాలను దేవుని కొరకు త్యాగం చేస్తే, అనగా దేవుని ఇష్టాన్ని మీ బ్రతుకు కాలములో నెరవేరిస్తే, ఆయన వ్రాయించిన గ్రంథములోని మాటలను పాటిస్తే, వారి వలె అందరూ లేస్తారు. పట్టణములోనికి వచ్చి అనేకులకు వారు కనిపిస్తున్నారు. పరిశుద్ధుల శవములు దేవుని వలన తిరిగి లేచాయి. బాగా ఆలోచించండి. శవము బ్రతుకుతుందా? మరణించిన తరువాత మరో జీవితం ఉంటుందా? నేను మరణిస్తే, దేవుని ఇష్టాన్ని నెరవేర్చి ఈ తనువును చాలిస్తే నేను తిరిగి లేవగలనా? ఖచ్చితంగా బ్రతుకగలను. ఒకవేళ ఇది నిజము కాదనుకునే వారికి నాదొక చిన్న ప్రశ్న. దేవుడు గొంగళి పురుగుకు ఒక బ్రతుకు, సీతాకోకచిలుకకు మరొక బ్రతుకును వేరు వేరు పురుగులుగా వాటికి బ్రతుకునివ్వచ్చు కదా! సీతాకోకచిలుక జాతిని ప్రత్యేకంగా దేవుడు చేయవచ్చుకదా. లేదు లేదు. ఈ రెండింటికి సంబంధాన్ని పెట్టి, దానిని మనిషికి చూపించాలి. గొంగళి పురుగు నుండే సీతాకోక చిలుక రావాలి. దాని జాతి వేరు దీని జాతివేరు అనడానికి వీలు లేదు. ఎందుకంటే ఇది మనిషికి ఒక పాఠము. పాకే పురుగుగా జీవించిన తరువాత అది ఎగిరిపోయే పురుగు అవ్వాలి. మనిషి దీని నుండి దేవుని జ్ఞానమును నేర్చుకోవాలి. ప్రకృతిలో జీవించే ప్రతి మనిషి దేవుని కొరకు బ్రతకాలి. దేవుని కొరకు ఆలోచన చేయాలి. ప్రియమైనవారలారా, ఆనాడు పరిశుద్ధుల శవాలన్నీ లేచాయి. తమ బ్రతుకును వారు కాపాడుకున్నారు. భూమి మీద వారు మరణించారు. తరువాత తిరిగి లేచారు. ఇక తీర్పు దినమును గూర్చి ఆయన మాట్లాడుతూ...

**ప్రకటన 20 : 12** "మరియు గొప్పవారేమి, కొద్దివారేమి మృతులైన వారందరు ఆ సింహాసనము ఎదుట నిలువబడియుండుట చూచితిని". అదే చివరి తీర్పు దినం, అదే చివరి క్షణం. ఈ భూమి ముగింపబడేటప్పుడు, మనుష్యజాతి ముగింపబడేటప్పుడు ఏమి జరుగుతుందో దేవుడు ఇక్కడ వ్రాయిస్తూ గొప్పవారేమి, కొద్దివారేమి మృతులైనవారందరూ అనగా చనిపోయిన వారందరూ, ఆ సింహాసనము ఎదుట నిలువబడియుండుటను యోహానుగారు దర్శనములో చూచారు. అప్పుడు గ్రంథములు విప్పబడెను. మరియు జీవ గ్రంథమను వేరొక గ్రంథము విప్పబడెను.

ఆ గ్రంథములయందు వ్రాయబడియున్న వాటినిబట్టి తమ క్రియలచొప్పున మృతులు తీర్పుపొందిరి. సముద్రము తనలోనున్న మృతులను అప్పగించెను. అంటే సముద్రములో కొన్ని శవాలు ఉండిపోయాయి. పసిఫిక్, అట్లాంటిక్, అరేబియా మహాసముద్రాలు,...ఇలా సముద్రాలు మృతులైన మనుష్యుల శవాలను దేవునికి అప్పగించెను. ఆ తరువాత మరణమును, పాతాళమును, వాటి వశమున ఉన్న మృతులను అప్పగించెను. అప్పుడు ప్రతీవాడు తమ తమ క్రియలనుబట్టి తీర్పు పొందెను. మృతిపొందినవాడు ఎలా మృతినొందినా, ఈ ప్రకృతిలో ఉన్న శవము దేవుని సింహాసనము ముందు ప్రత్యక్షము కావలిసిందే! వారి వారి క్రియలను బట్టి , వారు జీవ పునరుత్థానమును పొందాలో, తీర్పు పునరుత్థానమును పొందాలో అక్కడ నిర్ణయింపబడుతుంది. భూమిపైన మీ బ్రతుకు కాలములో మీ క్రియలే దానిని నిర్ణయిస్తాయి. మీరు దేవుని లోకాన్ని చేరుకోవాలా? లేదా పాతాళానికి, నిత్యనరకాగ్నికి జారిపోవాలా? అనేది దేవుడే నిర్ణయిస్తాడు. ప్రతి శవమును ఈ ప్రకృతి ఖచ్చితంగా దేవునికి అప్పగిస్తుందనడానికి ఇదిగోనండి దేవుడు వ్రాయించిన ఈ మాటలే నిదర్శనం! సముద్రము తన మృతులను అప్పగించేస్తుంది, పాతాళలోకము మృతులను అప్పగించేస్తుంది, మరణము తన మృతులను అప్పగించేస్తుంది. అవును, మీ శవము లేక మీ ఎండిన ఎముక ఎక్కడికీ వెళ్ళదు. ఈ శరీరము కనిపించకుండా ఎక్కడికీ పోదు. ఆయా కాలములలో మృతిపొందిన శరీరాలను ఈ ప్రకృతి భద్రముగా కాపాడుతుంది.

**యోహాను 5 : 27–** "మరియు ఆయన మనుష్య కుమారుడు గనుక తీర్పుతీర్చుటకు (తండ్రి) అధికారము అనుగ్రహించెను. దీనికి ఆశ్చర్యపడకుడి. ఒక కాలము వచ్చుచున్నది. ఆ కాలమున సమాధులలో ఉన్నవారందరు ఆయన శబ్ధమును విని, మేలు చేసినవారు జీవ పునరుత్థానమునకును, కీడు చేసిన వారు తీర్పు పునరుత్థానమునకును బయటకు వచ్చెదరు". ఒక సమాధిని చూడగానే మీకు తట్టవలసిన ఆలోచన ఏమిటో తెలుసా? ఇందులోనుండి ఖచ్చితంగా శవము ఎప్పటికైనా బయటకు వస్తుంది. అదే ఈ భూమికి చివరి దినం, విశ్వవినాశనపు దినము. ఆ ముగింపు రోజు, ఆ ముగింపు క్షణము వచ్చే సరికి దేవుడు ఏమంటున్నాడో చూడండి. దేవుడు మనుష్య కుమారునికి అధికారమును ఇచ్చాడు. ఆశ్చర్యపడకండి. ఒక కాలము వచ్చుచున్నది. అది ఇంకా రాలేదు. ఆ కాలమున ఏమి జరుగుతుందో తెలుసా? సమాధులలో ఉన్నవారందరూ ఆయన శబ్దమును విని, వారు దేవుని కొరకు మేలు చేసినవారు అయితే జీవ పునరుత్థానమునకు, దేవుని కొరకు కాక తమకిష్టమొచ్చినట్టు బ్రతికి, కీడు చేసినవారు అయితే తీర్పు పునరుత్థానమునకును, సమాధుల నుండి బయటికి వచ్చెదరు. దీనిని మనము ఎప్పటికైనా ఎదుర్కోవాలి. అది ఖచ్చితం! తిరిగి లేవడం అయితే మాత్రం తప్పదు. మేలు చేసినవారు జీవపునరుత్థానమునకు వెళుతున్నారు. కీడు చేసినవారు తీర్పు పునరుత్థానమునకును బయటికి వస్తారు. దేవుని కొరకు బ్రతికినవారు నిత్యమూ దేవునితో ఉండడానికి వెళుతున్నారు. కీడు చేసినవారు, దేవుడు లేడన్నవారు, దేవునికి ఎదురు తిరిగినవారు, మరణిస్తే మరొక బ్రతుకు లేదన్నవారు, ప్రకృతిని అనుభవించడం తప్ప దానిని ఆలోచించడం చేతకానివారు ఎక్కడికి వెళ్ళిపోతున్నారో తెలుసా? వీరే కీడు చేసినవారు. వీరు తీర్పు పునరుత్థానమునకు అంటే శిక్షలోనికి వెళ్ళిపోతున్నారు. ప్రకృతిలోని ప్రతి పదార్థం, ప్రకృతిలో ఉన్న ప్రతి శక్తి మీ శరీరాన్ని భద్రపరుస్తుంది. ఎప్పుడైతే తీర్పుదినము వచ్చిందో, ఎప్పుడైతే యేసుక్రీస్తు రెండవరాకడలో తీర్పు ప్రారంభిస్తాడో, అప్పుడు ఇవన్నీ శవాలను తిరిగి అప్పగిస్తున్నాయి.

కోర్టులో జడ్జిగారి ముందు నిలబెట్టడానికి రిమాండ్‌లో ఉన్న ఖైదీలందరిని పోలీస్‌వారు బేడీలు వేసి తీసుకొని వస్తారు. అంటే అప్పటివరకు ఆ ఖైదీలను పోలీస్‌వారు జైలు గదులలో భద్రపరిచారు. తీర్పు దినము ఒకానొక రోజున వస్తుంది. అప్పుడు జడ్జిగారు ఖైదీలను తీసుకుని రమ్మని పోలీస్‌వారిని ఆదేశిస్తారు. ఫలాన తేదీన, ఫలానా సమయానికి ఆ ఖైదీ తన ముందు ఉండాలని జడ్జి గారు చెబుతారు. జైలులోనికి వెళ్ళాడు కదా అని అతనికి శిక్ష ఖరారైనట్టుకాదు. అది రిమాండ్ మాత్రమే. రిమాండ్‌లో ఉన్నవాడు న్యాయవంతుడైతే జడ్జిగారు అతనిని విడుదల చేస్తారు. అతడు అనీతిమంతుడైతే, అతడు శిక్షకు అర్హుడయితే, అతనికి కఠినమైన శిక్షను అమలుచేస్తారు లేదా అతనిని ఉరితీస్తారు. రిమాండ్‌లో ఉన్న ఖైదీలందరిని జడ్జిగారి ముందు ఎలా ప్రవేశపెడుతున్నారో, ఆ తీర్పు దినమునాడు కూడా ఈ ప్రకృతి అంతా సముద్రమయితే సముద్రం, పర్వతమయితే పర్వతం, రోడ్డయితే రోడ్డు,

సమాధి పెట్టె అయితే సమాధి పెట్టె, భూమి అయితే భూమి, ఇలా ఏదైనా మిమ్మును తీసుకొని వచ్చి అక్కడ దేవుని న్యాయస్థానము ముందు నిలబెట్టాలి. అప్పుడు మీరు చేసింది మేలా? మీరు చేసింది కీడా? అనేది మీకు నిరూపించడానికి మీ తాలూకు గ్రంథములు విప్పబడతాయి. మీరు చేసింది అంతా చాలా భద్రముగా వ్రాయబడింది. దేవుడు ప్రతిదానిని వ్రాయించాడు. మీరు తల్లిగర్భములోనుండి బయటకు వచ్చిన రోజు నుండి, మీరు మరణించిన దినము వరకు మీరు చేసిన ప్రతి కార్యక్రమము లిఖింపబడినది. అది అక్కడ విప్పబడుతుంది. మిమ్మును పరలోకమునకు అనగా జీవ పునరుత్థానమునకు పంపించాలా? కీడు చేసినవారైతే నిత్యమూ వేదన అనుభవించే పరిస్థితులలోనికి అనగా తీర్పు పునరుత్థానమునకు పంపించాలా? అని అప్పుడు దేవుడు నిర్ణయించబోతున్నాడు. భూమి మీద జడ్జి గారి ముందు అయితే ఒకవేళ సాక్ష్యాలు తారుమారు కావచ్చు, ఒకవేళ పొరపాటున నీతిమంతులకు శిక్ష పడవచ్చు, అనీతిమంతులు శిక్ష నుండి తప్పించుకోనూ వచ్చు. ఇక్కడ బోలెడు సాక్ష్యాలు, బోలెడు వాయిదాలు. అంతా తార్‌మార్ తక్కెడమార్! దేవుని దగ్గర అలా జరగదు. మరణించగానే సదరు వ్యక్తి దేనిని అనుభవించడానికి సిద్ధపడాలో వెనువెంటనే తెలిసిపోతుంది. ఇక దేవుని తీర్పు అలంకారప్రాయమే!

ఈ భవిష్యత్తునంతా దేవుడు తన గ్రంథమైన బైబిల్‌లో వ్రాయించాడు. ప్రకృతిలో పురుగుల ద్వారా మనకు చూపిస్తున్నాడు. ఇంకా మనము నమ్మకపోతే మనలను ఎవరు మారుస్తారు చెప్పండి? అర్థాంతరంగా మన బ్రతుకును ముగించుకుంటే మనలను ఎవరు రక్షిస్తారు చెప్పండి? నేను వ్రాసిన ఈ పాఠము ఈ రోజు మీకు ప్రకటింపబడింది. ఇది ఈ సమాజానికి చాలా అవసరమండి. కాదంటారా? ఒకవేళ ఎవరికైనా నా మీద కోపము ఉండవచ్చు. ఒకవేళ ఎవరైనా నా మాటలచేత నొప్పించబడవచ్చు. కానీ నేను వ్రాసింది మాత్రం వాస్తవం. మనిషి బ్రతుకుకు ఉపయోగపడేదే నేను వ్రాసాను. అర్థాంతరంగా బ్రతుకును ముగించుకోవద్దు అంటున్నాను. ఈ నా మాటలలో నేరముందా? చాలా మంది అర్థాంతరంగా చనిపోతున్నారు. వారిని చనిపోవద్దు అంటున్నాను. మీకు మరో బ్రతుకు ఉంది. దేవుని కోసం ఆలోచించండి. ఉన్న ఈ కొద్ది కాలాన్ని దేవుని కొరకు త్యాగం చేయండి. మంచి నడవడికను కలిగి ఉండండి. బైబిల్‌లో వ్రాయబడిన దానిని పాటించండి. ప్రకటించండి. చేతనైతే ఇదిగో ఇలాంటి వాక్యాన్ని చెప్పి మీ తోటివారిని రక్షించండి. ఇలా చేస్తేనే మీరు ఆ జీవపునరుత్థానమునకు వెళతారు. అర్థాంతరంగా ఎందుకు మీ కాలమును ముగించుకుంటారు? ఆ మాటను కూడా దేవుని నోట విందాం. **ప్రసంగి: 7: 17** "అధికముగా దుర్మార్గపు పనులు చేయకుము. బుద్ధిహీనముగా తిరుగవద్దు, నీ కాలమునకు ముందుగా నీ వేల చనిపోదువు". దేవుడు మనందరికీ కొంత కాలము ఇచ్చాడు. ఆ కాలము తీరిన తరువాత, మనము ఇంకా ఈ భూమిపై ఉందామనుకున్నా మనము ఒక్క క్షణము కూడా ఉండలేము. మనిషి ఆయుష్కాలము దేవునికే తెలుసు. మరెవ్వరికీ తెలియదు. ప్రపంచములో ఎంత విద్య నేర్చినవారైనా సరే, మీరు ఎప్పుడు చనిపోతారు? అనే ప్రశ్నకు సమాధానము ఎవ్వరూ చెప్పలేరు. మీరు ఎప్పటికీ తెలుసుకోలేరు. అందుకే దేవుడు చెబుతున్నాడు. నీకు ఒక కాలమును నిర్ణయించాను. ఆ కాలానికి ముందుగానే వెళ్ళిపోతావా? ఏమి సాధించావని వెళ్ళిపోతున్నావు? ఏమి పూర్తి చేసాను అని వెళ్ళిపోతున్నావు? యేసుక్రీస్తులా దేవుని పనిని పూర్తి చేసావా? యేసుక్రీస్తు – "చేయుటకు నీవు నాకిచ్చిన పని అంతటిని నేను పూర్తి చేసాను" అని దేవునితో అంటున్నాడు. దేవుడు నిర్ణయించిన పనిని పూర్తిగా ముగించినవారు భూమిమీద ఉండి ఇక ప్రయోజనం లేదు. యేసుక్రీస్తు దేవుడు అప్పగించిన పనిని పూర్తిచేసేసాడు. ఈ యేసుక్రీస్తులా మనము దేవునికి సమాధానం చెప్పగలమా? అసలు మనకు ఈ భూమి మీద తండ్రి పని ఉందనే విషయమే తెలియదు. భూమిమీద దేవునికొరకు బ్రతకాలనే తెలియదు. ఆ పరలోకపు తండ్రిని గూర్చి ఆలోచించాలనే ధ్యాసే లేదు. అంత దౌర్భాగ్యపు పరిస్థితులలో ఉన్న మనిషి, ఈ రోజు అర్థాంతరంగా చనిపోవాలనుకుంటున్నాడా? తన కాలమునకు ముందుగా చనిపోవాలనుకుంటున్నాడా? అది చాలా తప్పు. అది పెద్ద నేరం. దేవుని రాజ్యాంగం ప్రకారం అది ఒక అక్రమము. ఆత్మహత్యలు చేసుకున్న వారిని దేవుడు విడిచి పెట్టడు. ఎందుకంటే ఆ తీర్పుదినము నాడు వారి శవము కూడా బ్రతికి బయటకు వస్తుంది. అప్పుడు వారిని దేవుడు వెంటనే అడిగే ప్రశ్న ఏమిటో తెలుసా? నీ కాలమునకు ముందుగా నీవేల చనిపోయావు. ముప్పై యేళ్ళకే చనిపోయావా? ఉరివేసుకున్నావా? రైలు క్రిందపడి చనిపోయావా?

విషం త్రాగేసావా? బలవంతముగా చనిపోయావా? నీకు దేవుడిచ్చిన ఆయుష్కాలములో నీవు దేవుని కొరకు ఆలోచించాలి. దేవుని కొరకు పని చేసి ముగించాలి. అది 60 సంవత్సరాలు కావచ్చు, 70 సంవత్సరాలు కావచ్చు. దేవుని పనిని పూర్తి చేసుకోవాలి. మనిషి తన బ్రతుకు కాలమంతా జీవపునరుత్థానమునకు వెళ్ళే ఆలోచననే కలిగియుండాలి. గొంగళి పురుగును చూడాలి. ప్రకృతిలో ప్రతి జీవినీ చూడాలి. వాటి నుండి పాఠాలను నేర్చుకుంటూ జీవించాలి. ప్రతి నిత్యం మార్పును కలిగి ఉండాలి. యేసుక్రీస్తును రక్షకునిగా అంగీకరించి, ఆయన చెప్పిన మాటలను మీరు పాటించిననాడు మీరు పరలోకానికి అర్హులు. దేవుడు ఇచ్చిన అధికారము ప్రకారం యేసుక్రీస్తు తిరిగి రాబోవుచున్నాడు. గనుక మీరు ఆయన వారుగా బ్రతకడానికి ఆలోచన కలిగి ఉండాలి. చరిత్రలో ఎంతోమంది నీతిమంతులు ఈలాగు బ్రతికారు. గనుక వారందరు జీవపునరుత్థానానికి ఎదురు చూస్తున్నారు. ఒక అబ్రహాము, ఒక మోషే, ఒక దావీదు, ఒక దరిద్రుడైన లాజరు,... వీరందరు దేవుని కొరకు ఆలోచించారు. వారు రాజ్యాధికారాలు కలిగినవారే, ఆస్తులు ఉన్నవారే, సంపదంతా వారిదే అయినా, వారు వాటిని వద్దు అనుకున్నారు. వారికి మేలు పునరుత్థానము కావాలి. వారికి నిత్యము ఆనందించే ఆ దేవుని లోకము కావాలి. ఆ రెండవ జీవితము కావాలి. సీతాకోకచిలుకలా ఎగిరే జీవితము కావాలి. మరణించిన తరువాత బ్రతుకు ఉందనే వాస్తవం వారికి అర్థమయింది. అందుకే వారికి బ్రతుకులలో ప్రధానమైనది ఏమిటంటే, వారు దేవుని కొరకు బ్రతకాలి, ఆ తరువాతే ఏదైనా! వారి కుటుంబమైనా, భార్యైనా, పిల్లలైనా అందరూ దేవుని తరువాతే. ఎందుకంటే చనిపోయిన తరువాత మనలను భార్య పట్టించుకోదు, కుటుంబము పట్టించుకోదు, ఇంకెవ్వరూ పట్టించుకోరు. దేవుని దగ్గరకు మనము వెళ్ళాలి. ఆయనకు మన లెక్క అప్పచెప్పాలి. మేలు పునరుత్థానమును మనము పొందాలి. మన కాలానికి ముందుగా మనము చనిపోకూడదు. మనము అర్థాంతరంగా వెళ్లిపోకూడదు. దేవుడిచ్చిన ఆయుష్షు అంతటిలో, చివరి క్షణము వరకు ఆయన పనిలోనే మనము ఉండాలి. ఆయన పనిలోనే చివర శ్వాసను విడవాలి. మంచి నిర్ణయం తీసుకోండి. మీరు ఖచ్చితముగా తిరిగి బ్రతుకుతారు. అందుకు దేవుడు సమర్థుడు!

ప్రభువునందు నమ్మకస్థుడు,

**జె. మణి కుమార్**

సన్ ఆఫ్ గాడ్ - క్రైస్ట్ చర్చ్ - సామర్లకోట - 8978414178.

## ప్రశ్నలు

1. ప్రకృతిలో దేనినైనా చూడగానే మనిషి ఎలా ఆలోచించాలి?
2. మరణించిన మనిషి ఎదుర్కొనబోయే తీర్పును సవివరముగా తెలియజేయండి.
3. గొంగళి పురుగు యొక్క రూపాంతరము మనిషికి ఏమని పాఠమును నేర్పుతుంది?
4. యేసుక్రీస్తు మరణించినపుడు పరిశుద్ధుల శవములు తిరిగి బ్రతికిన సందర్భాన్ని వివరించండి.
5. ఎండిన ఎముకలున్న లోయలోనికి దేవుడు యెహెజ్కేలు ప్రవక్తను ఎందుకు దించెను? వివరించండి.
6. గొంగళి పురుగు ఎగురుతుందా? అనే విషయాన్ని బైబిల్‌లో దేవుడు ఎక్కడ వ్రాయించాడు. వివరించండి.
7. మనిషి అతి భయంకరమైన కష్టాలలో ఉన్నప్పుడు కూడా ఆత్మహత్యకు ప్రయత్నించకూడదు. ఎందుకో వివరించండి.